Saheeh Bukhari (Vol-2)
(Telugu)

# సహీహ్ బుఖారీ

(రెండవ సంపుటం)

మూలం
హజ్రత్ అల్లామా వహీదుజ్జమా (రహ్మ)

అనువాదం
షేఖ్ హమీదుల్లా షరీఫ్, బి.ఏ.

# విషయసూచిక

## జుమా ప్రకరణం


u జుమా నమాజు చెయ్యటం ఫర్జ్ 1
u జుమా రోజున స్నానం చేసే దాని ఔన్నత్యం 2
u జుమా రోజున నమాజుకు పోయేటప్పుడు అత్తరు రాసుకోవటం 3
u జుమా నమాజుకు పోయేదాని ఘనత 3
u జుమా నమాజుకోసం తలవెంట్రుకలకు నూనె రాసుకోవటం 4
u జుమా రోజున ఉన్నంతలోనే మంచి వస్త్రాలు, చక్కని వస్త్రాలు ధరించటం 5
u జుమా రోజున మిస్వాక్ చెయ్యటం 6
u ఎవరైనా ఇతరుల మిస్వాక్‌ను ఉపయోగిస్తే.... 6
u జుమా రోజున ఉదయం నమాజులో ఖుర్ఆన్‌లోని ఏ సూరాను పఠించాలి 7
u గ్రామం మరియు పట్టణం రెండు చోట్లా జుమా నమాజు చెయ్యటం 7
u ఎవరైతే జుమా నమాజు కోసం మసీదుకు వెళ్ళరో వారిపై గుసుల్ వాజిబ్ కాదు 8
u ఒకవేళ వర్షం కురుస్తూ ఉంటే అప్పుడు జుమా నమాజులో పాల్గొనటం వాజిబ్ కాదు 9
u జుమా నమాజు కోసం మసీదు నుంచి ఎంత దూరంలో ఉన్నా ప్రజలు రావాలి 10
u ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు జుమా వచ్చినట్లయితే అప్పుడు ఏమి చెయ్యాలి? 11
u జుమా నమాజు కోసం కాలినడకన పోవటం 11
u జుమా రోజున ఇద్దరు మనుషులు కలిసి కూర్చున్న చోట మధ్యనుంచి చొరబడి పోకండి 12
u జుమారోజున ఒక ముస్లిమ్ సోదరుడు కూర్చున్న స్థలం నుంచి లేపి కూర్చోరాదు 12
u జుమా రోజున అజాన్ 13
u జుమా రోజున ఒకే ముఅజ్జిన్ అజాన్ ఇవ్వటం 13
u ఇమామ్ మెంబర్‌మీద కూర్చొని అజాన్‌ను విని దానికి సమాధానం పలకాలి 13
u జుమా కొరకు అజాన్ పూర్తి అయ్యేవరకు ఇమామ్ మెంబర్ మీదనే కూర్చొని ఉండాలి 14
u జుమాకు సంబంధించిన అజాన్‌ను ఖుత్బాకు ముందు ఇవ్వాలి 14
u ఖుత్బాను మెంబర్ మీద నుంచి చదవటం 15
u ఖుత్బా నిలబడి ఇవ్వటం 16
u ఇమామ్ ఖుత్బా పఠించేటప్పుడు ప్రజలు తమ ముఖాన్ని ఇమామ్ వైపునకు త్రిప్పాలి 16
u ఖుత్బాలో అల్లాహ్ 'హమ్‌ద్ వ సనా' తరువాత 'అమ్మాబాద్' అనటం 17
u జుమా రోజున రెండు ఖుత్బాల మధ్య కాస్సేపు కూర్చోవటం 19
u జుమా రోజు ఖుత్బాను శ్రద్ధగా చెవియొగ్గి వినటం. 19
u ఇమామ్ ఖుత్బా ఇచ్చే స్థితిలో ఉన్నప్పుడు ఒక మనిషి ఎవరైనా మసీదులోకి ప్రవేశిస్తే ... 20

u ఖుత్బా అవుతున్నప్పుడు మసీదులోకి ప్రవేశిస్తే రెండు రకాతుల నమాజ్ చేయాలి 20
u ఖుత్బాలో రెండు చేతులు ఎత్తి దుఆ చెయ్యటం 20
u జుమారోజున ఖుత్బా ప్రసంగంలో వర్షం కోసం దుఆ చెయ్యటం 21
u జుమా రోజున ఖుత్బా ప్రసంగం జరిగే సమయంలో మౌనంగా వుండటం... 22
u జుమా రోజున ఒక ఘడియలో దుఆ చేస్తే అది దైవ స్వీకారానికి నోచుకుంటుంది 22
u ఒకవేళ జుమా నమాజులో నుంచి కొందరు ఇమామ్‌ను వదిలి వెళ్లిపోయినా..... 22
u జుమాకు ముందు మరియు జుమాకు తరువాత సున్నత్ నమాజు చెయ్యటం 23
u దివ్యఖుర్ఆన్‌లోని అల్ జుముఅహ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చిన విషయం 23
u జుమా నమాజు తరువాత పండుకోవటం 24


## భయానికి సంబంధించిన నమాజుల అధ్యాయాలు


u 'భయం' నమాజు గురించి నిసా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 25
u నమాజె ఖౌఫ్‌ను నడుస్తూ, స్వారీ చేస్తూ చెయ్యటం 26
u నమాజె ఖౌఫ్‌లో నమాజీలు పరస్పరం ఒకరినొకరు రక్షించుకుంటారు 26
u కోటలపై దాడి జరుగుతూ ఉన్నప్పుడు విజయం లభించే అవకాశం ఉన్నప్పుడు... 26
u ఎవరైనా శత్రువును వెంటాడుతూ ఉన్నట్లయితే.... 27
u శత్రువుపై మెరుపు దాడి చేసేముందు ఫజర్ నమాజును పెందలకాడనే చేసుకోవాలి. 28


## పండుగల ప్రకరణం


u రెండు పండుగలను గురించి.... 29
u పండుగనాడు బల్లెములతో, డాలులతో ఆడుకోవడం గురించి 29
u పండుగ సమయాలలో ముస్లిములు ఏమి చేయాలి? 30
u ఈదుల్ ఫిత్ర్ రోజున నమాజు కోసం బయలుదేరే ముందు ఏదైనా తినటం 31
u బక్రీదు రోజున తినటం 31
u ఈద్గాహ్‌కు మెంబర్ లేకుండా పోవటం గురించి 32
u పండుగ నమాజు కోసం కాలినడకన పోవటం, వాహనం మీద పోవటం ..... 33
u పండుగ రోజున నమాజు చేసిన తరువాత ఖుత్బాను పఠించటం 34
u పండుగనాడు మరియు కాబా గృహంలోనూ ఆయుధాలు ధరించటం అయిష్టమైనది 35
u పండుగ నమాజును చెయ్యటానికి పెందలకాడనే పోవటం 36

u తష్రీఖ్ దినాలలో చేసే కర్మల ఔన్నత్యం 37
u మినా దినాలలో తక్బీర్ పలకటం 38
u పండుగ రోజున బరిసెను అడ్డంగా పాతి నమాజు చెయ్యటం 38
u బరిసెను లేక ఈటెను తీసుకుని పండుగ నాడు ఇమామ్‌కు ముందు నడవటం 39
u స్త్రీలు, బహిష్టు అయిన మహిళలు ఈద్గాహ్‌కు పోయే విషయం గురించి 39
u పిల్లలు ఈద్‌గాహ్‌కు పోవటం గురించి 39
u పండుగనాడు ఖుత్బా ప్రసంగం చేసేటప్పుడు .... 40
u ఈద్గాహ్‌లో గుర్తు (చిహ్నం) పెట్టటం 40
u పండుగ రోజు ఇమామ్ స్త్రీలనుద్దేశించి హితబోధ చేయటం 41
u ఒకవేళ ఏ స్త్రీవద్దనైనా ఓణిగాని లేదా దుప్పటిగాని లేని పక్షంలో 43
u బహిష్టు అయిన స్త్రీలు నమాజు చేసే స్థలం నుంచి వేరుగా, దూరంగా ఉండాలి 44
u ఈదుల్ అజ్‌హా రోజున ఈద్గాహ్‌లోనే నహ్ర్ మరియు జిబహ్ చెయ్యటం గురించి 44
u పండుగ రోజున ఖుత్బా ప్రసంగం జరిగేటప్పుడు ... 44
u ఈద్గాహ్‌కు ఒక మార్గం నుంచి పోయి మరొక మార్గం ద్వారా రావాలి 46
u ఈద్గాహ్ మైదానంలో ఈద్ నమాజుకు ముందు,ఈద్ నమాజు తరువాతగాని .... 47

## విత్ర్ అధ్యాయాలు

u విత్ర్ నమాజు చేసే సమయం ..... 49
u దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వితర్ నమాజు కోసం..... 50
u వితర్ నమాజును రాత్రి నమాజు చివర్లో చెయ్యాలి 50
u పశువుపై స్వారీ చేస్తూ విత్ర్ నమాజు చెయ్యటం 50
u ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా విత్ర్ నమాజు చెయ్యటం 51
u (విత్ర్ నమాజులో, ప్రతి నమాజులో) రుకూకుముందు, తరువాత ఖునూత్ పఠించటం 51

## ఇస్తిస్ఖా అధ్యాయాలు

u వర్షాన్ని కురిపించమని వేడుకోవటం 53
u దైవప్రవక్త(స) ఖురైష్ అవిశ్వాసులను శపించటం .... 53
u అనావృష్టి సమయంలో వర్షం కోసం దుఆ చెయ్యడం 54
u ఇస్తిస్ఖాలో దుప్పటిని తిరగవెయ్యటం 55
u అల్లాహ్ నిషేధించిన వస్తువులను ప్రజలు గనక లక్ష్యపెట్టకపోతే ... 56

u జామా మస్జిద్‌లో వర్షం కోసం దుఆ చేయటం 56

u జుమా ఖుత్బా పఠించేటప్పుడు... 57

u మెంబర్‌పై నిలబడి నీటికోసం దుఆ చెయ్యటం 59

u నీటికోసం దుఆ చేసే విషయంలో .... 59

u అతివృష్టి వల్ల మార్గాలు మూసుకుపోతే ..... 60

u దైవప్రవక్త ముహమ్మద్(స) జుమా రోజున మసీదులోనే నీటికోసం దుఆ చేసినప్పుడు ... 60

u ప్రజలు ఇమామ్‌ను వర్షం కోసం ప్రార్థించమని అడిగితే... 61

u ముష్రిక్కులు వర్షం కోసం ప్రార్థించమని అడిగితే... 61

u వర్షం అతిగా కురిసినప్పుడు ఇలా దుఆ చెయ్యటం 62

u ఇస్తిస్ఖాలో నిలబడి ఖుత్బా పఠనం చేసేటప్పుడు దుఆ చేయటం... 63

u ఇస్తిస్ఖా నమాజులో బిగ్గరగా ఖుర్ఆన్ పఠించటం 63

u దైవప్రవక్త ముహమ్మద్(స) ఇస్తిస్ఖా నమాజులో తన వీపును ప్రజల వైపునకు తిప్పటం 64

u రెండు రకాతులు ఇస్తిస్ఖా నమాజ్ చెయ్యటం 64

u ఈద్గాహ్ మైదానంలో ఇస్తిస్ఖా నమాజు చెయ్యటం 64

u ఇస్తిస్ఖా నమాజులో ఖిబ్లా వైపునకు ముఖం తిప్పటం 65

u ఇస్తిస్ఖా నమాజులో ఇమామ్‌తో పాటు ప్రజలు కూడా చేతులు ఎత్తటం 65

u ఇస్తిస్ఖా నమాజులో దుఆ కోసం ఇమామ్ చేతులు ఎత్తటం 65

u వర్షం కురిసేటప్పుడు ఏమని పలకాలి? 66

u గడ్డంపైనుంచి నీటి చుక్కలు రాలిపడేవరకు వర్షంలో నిలబడి ఉండటం 66

u పెనుగాలులు వీచినప్పుడు ఏమి చేయాలి? 67

u దైవప్రవక్త ముహమ్మద్(స) గారి ప్రకటన..... 67

u భూకంపాలు, ప్రళయ దినపు సూచనలను గురించి 68

u ఉపాధి అంటే కృతజ్ఞతలు తెలుపటం 68

u వర్షం ఎప్పుడు కురుస్తుందో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియదు... 69


## కుసూఫ్ (గ్రహణాల ) అధ్యాయాలు


u సూర్య గ్రహణానికి సంబంధించిన నమాజును గురించి 70

u సూర్యుడికి గ్రహణం పట్టినప్పుడు దానధర్మాలు చెయ్యటం 71

u సూర్యుడికి గ్రహణం పట్టినప్పుడు నమాజు కోసం రండి అని బిగ్గరగా ప్రకటించటం... 72
u సూర్య గ్రహణానికి సంబంధించిన నమాజులో ఇమామ్ ఖుత్బా పఠించటం... 72
u కుసూఫ్, ఖుసూఫ్ ఈ రెండు పదాలు గ్రహణం అనే అర్థంలో వాడవచ్చు... 73
u ప్రవక్త (స) ఉల్లేఖనం: అల్లాహ్ తన దాసులకు గ్రహణాన్ని చూపించి వారిని భయపెడతాడు 74
u సూర్యగ్రహణ సమయంలో సమాధి శిక్షనుంచి విముక్తి కోసం అల్లాహ్‌ను ప్రార్థించటం 74
u గ్రహణానికి సంబంధించిన నమాజ్‌లో సజ్దా కూడా సుదీర్ఘమైనదిగా ఉండాలి 75
u గహణానికి సంబంధించిన నమాజును జమాఅత్‌తో చెయ్యటం 75
u గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులలో పురుషులతోపాటు స్త్రీలు కూడా పాల్గొనటం 77
u సూర్య గ్రహణం పట్టినప్పుడు బానిసలను విడుదల చెయ్యటం 78
u గ్రహణానికి సంబంధించిన నమాజును మసీదులో చెయ్యటం 78
u సూర్యగ్రహణం ఒకరి మరణం వల్లగాని, ఒకరి జీవితం వల్లగానీ పట్టదు.... 79
u సూర్యుడికి గ్రహణం పట్టిన సమయంలో అల్లాహ్‌ను స్మరించటం 80
u సూర్యగ్రహణం పట్టినప్పుడు దుఆ చెయ్యటం... 80
u గ్రహణానికి సంబంధించిన ఖుత్బాలో ఇమామ్ అమ్మాబాద్ అని అనటం... 81
u చంద్ర గ్రహణం పట్టినప్పుడు కూడా నమాజు చెయ్యటం 81
u గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులో మొదటి రకాతును పొడుగైనదిగా చెయ్యాలి 81
u గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులో ఖుర్‌ఆన్ వాక్యాలను బిగ్గరగా పఠించటం 82


## సజ్‌దయె తిలావత్, దానికి సంబంధించిన సున్నతులు


u సజ్‌దే తిలావత్ ఇది సున్నత్ అవ్వటం గురించి 83
u అలిఫ్ లామ్ మీమ్ తన్‌జీల్ అస్ సజ్‌దాలో సజ్‌దా చెయ్యటం 83
u 'సాద్' సూరాను పఠించేటప్పుడు సజ్‌దా చెయ్యటం 84
u నజ్మ్ సూరాలో సజ్దా చెయ్యటం గురించి 84
u ముష్రిక్కులతో కలిసి ముస్లిములు సజ్‌దా చెయ్యటం 84
u సజ్దాకు సంబంధించిన ఖుర్‌ఆన్ వాక్యాన్ని పఠించి కూడా సజ్దా చెయ్యకపోవడం 85
u ఇజస్సమాఉన్ షఖ్ఖత్ సూరా పఠించే సమయంలోసజ్దా చెయ్యటం 85
u ఖుర్‌ఆన్ వాక్యాలను పఠించేవాడు సజ్దా చేసినప్పుడే వినేవాడు కూడా సజ్దా చెయ్యాలి 85
u ఇమామ్ సజ్దా ఉన్న వాక్యాన్ని పఠించినప్పుడు, ప్రజలు అధికసంఖ్యలో ఉన్నప్పుడు... 86

u నమాజ్ చేసే సమయంలో సజ్దా ఉన్న ఖురాన్ వాక్యాన్ని పఠించటం 88
u ప్రజలు అధికసంఖ్యలో ఉన్నప్పుడు సజ్దయె తిలావత్ కోసం స్థలం లభించనప్పుడు 88

## నమాజును ఖసర్ (సంక్షిప్తం) చేసే అధ్యాయాలు

u నమాజును సంక్షిప్తం చేసే విషయం గురించి.. 89
u మినాలో నమాజు చెయ్యటం గురించి 89
u దైవప్రవక్త (స) హజ్ యాత్రలో ఉన్నప్పుడు మక్కాలో ఎన్నిరోజులు బస చేశారు? 90
u ఎంత దూరం ప్రయాణం చేస్తే ఖసర్ చెయ్యాలి? 90
u ఒక మనిషి ఎవరైనా ప్రయాణం చేసే సంకల్పంతో.... 91
u మగ్రిబ్ నమాజును ప్రయాణంలోకూడా మూడు రకాతులే చెయ్యాలి 92
u వాహనం మీద నఫిల్ నమాజులు చెయ్యటం; దాని ముఖం ఎటుఉన్నా సరే 93
u వాహనం మీద (ఒకవేళ రుకూ చెయ్యలేకపోతే అప్పుడు) సైగ చెయ్యటం సరిపోతుంది 93
u ఫర్జ్ నమాజు కోసం వాహనం మీద నుంచి కిందికి దిగటం 94
u గార్దభం మీద స్వారీ చేస్తూ నఫిల్ నమాజులు చెయ్యటం 94
u ప్రయాణంలో ఉన్నప్పుడు ఫర్జ్ నమాజుకు పూర్వం, తరువాత.... 95
u ఫర్జ్ నమాజుల తరువాత, మునుపటి సున్నత్ నమాజులు తప్ప .... 95
u ప్రయాణంలో ఉన్నప్పుడు మగ్రిబ్, ఇషా నమాజులను (జుహ్ర్, అసర్) నమాజులను కలిపి చెయ్యటం 96
u ఒకవేళ మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి చేసినప్పుడు అజాన్ కూడా ఇవ్వాలా లేక కేవలం తక్బీర్ పలికితే సరిపోతుందా? 97
u బాటసారి పొద్దువాలక ముందే ప్రయాణానికి బయలుదేరితే.... 97
u ప్రయాణంలో ఉన్నప్పుడు పొద్దువాలిన తరువాత బయలుదేరాలనుకున్నప్పుడు.... 98
u కూర్చొని నమాజు చెయ్యటం గురించి 98
u సైగ ద్వారా కూర్చొని నమాజు చెయ్యటం 99
u ఎవరికైనా కూర్చొని నమాజు చేసే శక్తి లేకపోతే ..... 100
u ఒకవేళ ఒక వ్యక్తి ఎవరైనా కూర్చొని నమాజు చెయ్యటం ప్రారంభిస్తే ... 100

## తహజ్జుద్ ప్రకరణం

u రాత్రి సమయంలో తహజ్జుద్ నమాజు చేయటం... 102
u రాత్రిపూట తహజ్జుద్ నమాజు చేసే దాని యొక్క ఘనత 103
u రాత్రి నమాజులో సుదీర్ఘమైన సజ్దాలు చెయ్యటం 104
u వ్యాధిలో ఉన్నప్పుడు తహజ్జుద్ నమాజును వదిలిపెట్టవచ్చు 104
u దైవప్రవక్త (స) రాత్రి నమాజులు, నఫిల్ నమాజులు చెయ్యమని ప్రోత్సహించటం 105
u దైవప్రవక్త (స) రాత్రి నమాజులో ఎంత ఎక్కువగా నిలబడి ఉండేవారు?.... 106
u సహర్ వేళ అంటే ఫజ్ర్ సమయంలో నిద్రపోవటం 106
u సహరీ తిన్న తరువాత ఫజ్ర్ నమాజు చేసే అంతవరకు నిదురపోకపోవటం 107
u రాత్రి నమాజులో ఖియామ్‌ను సుదీర్ఘమైనదిగా చెయ్యటం 108
u దైవప్రవక్త (స) నమాజును ఎలా చేసేవారు? 108
u దైవప్రవక్త (స) రాత్రి నమాజు కోసం నిద్ర నుంచి మేల్కొనటం.. 109
u మనిషి గనక రాత్రి నమాజు చెయ్యకపోతే షైతాన్ మూపు మీద ముడులు వెయ్యటం 110
u రాత్రి చివరి సమయంలో దుఆ చెయ్యటం గురించి, నమాజు చెయ్యటం గురించి 111
u రాత్రి ప్రారంభంలో నిద్రపోవటం, రాత్రి చివరి దశలో మేల్కొని ఉండటం 111
u రమజాన్, రమజానేతర మాసాలలో ప్రవక్త (స) రాత్రివేళలో నమాజులు చెయ్యటం... 112
u రేయింబవళ్ళు వుజూతో ఉండే దాని ఔన్నత్యం.... 112
u ఆరాధనలో అత్యంత కఠినత్వాన్ని పాటించటం అవాంఛనీయం.. 113
u రాత్రిపూట ఆరాధన చేస్తూ ఉండే వ్యక్తి ఒకవేళ దాన్ని నిలిపివేస్తే... 114
u రాత్రిపూట ఏ మనిషి కళ్ళు తెరుచుకుంటాయో అతను నమాజు చేస్తాడో... అతని ఔన్నత్యం 114
u ఫజ్ర్ నమాజుకు చెందిన రెండు రకాతుల సున్నత్ నమాజును ఎల్లప్పుడూ చెయ్యటం 116
u ఫజ్ర్‌కు చెందిన రెండు రకాతుల సున్నత్ చేసిన తరువాత కుడి పక్కకు పడుకోవటం 116
u ఫజ్ర్‌కు సంబంధించిన సున్నత్ నమాజును చేసి మాట్లాడుతూ ఉండటం... 116
u ఫజ్ర్‌కు సంబంధించిన సున్నత్ నమాజు తరువాత మాట్లాడుకోవడం 116
u ఫజ్ర్‌కు సంబంధించిన రెండు రకాతుల సున్నత్ నమాజు.... 117
u ఫజ్ర్‌కు చెందిన రెండు రకాతుల సున్నత్‌లో ఎంత ఖుర్ఆన్ పారాయణం చెయ్యాలి? 117
u ఫర్జ్ నమాజుల తర్వాత చేసే సున్నత్ నమాజులను గురించి... 120
u ఫజ్ర్ నమాజు తరువాత సున్నత్ నమాజు చెయ్యకపోవటం... 121

u ప్రయాణంలో ఉన్నప్పుడు చాష్త్ నమాజును చెయ్యటం... 121
u 'చాష్త్' నమాజును చెయ్యకపోవడం, దానిని అవసరమైనదిగా భావించకపోవడం 122
u చాష్త్ నమాజును తాను నివసించే పట్టణంలో ఉన్నప్పుడు చెయ్యటం... 122
u జుహ్ర్ నమాజుకు ముందురెండు రకాతులు సున్నత్ చేయాలి... 123
u మగ్రిబ్ నమాజుకు ముందు సున్నత్ నమాజును చెయ్యడం... 123
u నఫిల్ నమాజులను జమాఅత్‌తో కలిసి చెయ్యటం ... 123
u ఇంట్లో నఫిల్ నమాజులు చెయ్యటం గురించి... 126
u మక్కాలోని మసీదులోనూ, మదీనాలోని మసీదులోనూ నమాజు చేసే దాని ఔన్నత్యం 126
u ఖుబా మసీదును గురించి... 126
u ప్రతి శనివారం ఖుబా మసీదుకు రావటం... 127
u ఖుబా మసీదులోకి నడుస్తూ లేక స్వారీ చేస్తూనో రావటం.. 127
u మస్జిదె నబవీలో సమాధికి, మెంబర్‌కు మధ్య ఉన్నటువంటి స్థలం యొక్క ఔన్నత్యం 127
u బైతుల్ మఖ్దిస్ మసీదును గురించి (జెరూసలెం) 128


## నమాజులో చేసే నమాజుతో సంబంధంలేని పనులు


u నమాజులో ఉన్నప్పుడు మాట్లాడటం నిషిద్ధం 130
u నమాజులో ఉన్నప్పుడు పురుషులు సుబ్‌హానల్లాహ్, అల్‌హమ్‌దులిల్లాహ్ పలకటం 131
u నమాజులో ఉన్నప్పుడు పేరు పెట్టి దుఆ గానీ లేక బద్‌దుఆ గాని చెయ్యటం 132
u (నమాజులో ఉన్నప్పుడు) చప్పట్లు కొట్టటం అనేది మహిళలు చెయ్యాలి 132
u నమాజులో ఉన్నప్పుడు ఏదైనా ప్రమాదం కారణంగా ... 132
u ఒకవేళ ఎవరైనా నమాజు చేస్తూ ఉన్నప్పుడు అతని తల్లి అతన్ని పిలిస్తే... 133
u నమాజ్‌లో ఉన్నప్పుడు చిన్నచిన్న కంకరరాళ్ళను తొలగించటం 134
u నమాజులో ఉన్న సమయంలో సజ్దా చెయ్యటానికి వస్త్రాన్ని నేలపై పరచటం 134
u నమాజులో ఉన్నప్పుడు ఏ ఏ పనులు చెయ్యటం ధర్మసమ్మతం? 135
u మనిషి నమాజులో ఉన్నప్పుడు, అతని పశువు అతన్ని విడిచి పారి పోయినట్లయితే... 135
u నమాజు చేసేటప్పుడు ఊయటం మరియు ఊదటం 137
u ఒకవేళ నమాజు చేస్తూ ఉన్న వ్యక్తితో ఎవరైనా ఇలా అన్నప్పుడు..... 138

u నమాజులో ఉన్నప్పుడు ఎవరైనా సలామ్ చేస్తే... 138
u నమాజు చేస్తూ ఉన్న సమయంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే... 139
u నమాజు చేసేటప్పుడు నడుముపై చేతులు పెట్టటం.... 140
u నమాజు చేసేటప్పుడు మనిషి ఏదైనా విషయం గురించి ఆలోచించటం... 140
u నాలుగు రకాతుల నమాజులో ఒకవేళ ఎవరైనా మొదటి ఖాయెదా చెయ్యకపోతే... 142
u ఒకవేళ ఐదు రకాతులు చేస్తే.... 142
u రెండు రకాతులుగాని లేక మూడు రకాతులుగాని చేసిన తరువాత సలామ్ చేస్తే... 143
u సహూకు సంబంధించిన సజ్దాల తరువాత, మళ్ళీ తషహ్హుద్ చదివే అవసరం లేదు... 143
u సహూకు సంబంధించిన సజ్దాలలో తక్బీర్ పలకటం 144
u ఒకవేళ ఎవరికైనా తాను మూడు లేక నాలుగు రకాతులు చేశాడా?.... 145
u సజ్దయె సహు ఫరజ్, నఫిల్ నమాజులు రెండింటిలోనూ విధిగా చెయ్యాలి.... 146
u ఒకవేళ నమాజు చేస్తూ ఉన్న మనిషితో ఎవరైనా మాట్లాడితే.. 146
u నమాజులో సైగలు చెయ్యటం, సంకేతాలు ఇవ్వటం.... 147

## జనాయిజ్ ప్రకరణం

u జనాజాల గురించి వచ్చిన ప్రస్తావన 150
u జనాజాలో పాల్గొనే ఆదేశం 151
u శవాన్ని కఫన్‌లో చుట్టబడినప్పుడు, శవ దర్శనం కోసం అక్కడకు పోవటం 151
u ఒక మనిషి స్వయంగా మరణవార్తను మృతుని వారసులకు వినిపించగలడు 154
u జనాజా గనక తయారుగా ఉంటే ప్రజలకు తెలియజెయ్యాలి... 154
u ఎవరి పిల్లవాడైతే మరణిస్తాడో వారు సహనం వహించాలి. దాని ఔన్నత్యం గురించి.. 155
u ఒక స్త్రీ సమాధి వద్ద ఉన్నప్పుడు, ఒక పురుషుడు ఆమెతో 'సహనం వహించు' అనటం 156
u మృతదేహాన్ని బేసి సంఖ్యగల దఫాలు స్నానం చేయించటం... 157
u మృతదేహానికి ఇచ్చే గుసుల్‌ను కుడి వైపు నుండి ప్రారంభించాలి 158
u మృతదేహానికి ఇచ్చే గుసుల్‌ను వుజూ చేసుకునే శరీర భాగాల నుంచి ప్రారంభించటం 158
u మహిళ కఫన్‌లో పురుషుడు తన నడుముకు చుట్టుకునే బట్టను చేర్చవచ్చునా? 158
u చివరిసారి గుసుల్‌లో కర్పూరాన్ని చేర్చటం 159
u మృతదేహం గనక ఒక మహిళది అయినట్లయితే, ..... 159

u మరణించిన స్త్రీ తల వెంట్రుకల్ని మూడు పాయలు చేసి మూడు జడలుగా వెయ్యడం 160
u స్త్రీ మృతదేహానికి చెందిన తలవెంట్రుకలను మూడు భాగాలు చేసి మూడు జడలుగా అల్లి ఆమె వీపు వైపునకు వెయ్యాలి 160
u కఫన్ కోసం తెల్లని వస్త్రాలు ఉపయోగించటం 161
u రెండు వస్త్రాలలో కఫన్ ఇవ్వటం 161
u మృతదేహానికి పరిమళాలు పూయటం 161
u 'హజ్' కోసం లేక 'ఉమ్రా' కోసం ఇహ్రామ్ స్థితిని స్వీకరించిన వ్యక్తికి కఫన్ ఎలా ఇవ్వాలి? 162
u ఖమీజ్‌లో కఫన్ ఇవ్వటం–దాని అంచు కుట్టబడి ఉన్నా లేక కుట్టబడి లేకపోయినా 163
u చొక్కా లేకుండా కఫన్ ఇవ్వటం 164
u కఫన్‌లో అమామా లేకుండా ఉండటం 164
u కఫన్ ఖర్చులను మృతునికి చెందిన మొత్తం ఆస్తినుండి తీయాలి 164
u ఒకవేళ శవం దగ్గర ఒకే ఒక వస్త్రం ఉన్నట్లయితే.... 165
u ఒకవేళ కఫన్‌కు ఉపయోగించే వస్త్రం చిన్నది అయినట్లయితే... 165
u ప్రవక్త (స)కాలంలో ఎవరైనా తమ కఫన్‌ను మరణానికిముందే తయారు చేసుకుంటే, 166
u స్త్రీలు జనాజాతోపాటు పోవటం ధర్మసమ్మతమైన విషయమేనా? 167
u ఒక స్త్రీ తన భర్తకోసం కాక మరొక మృతుని కోసం శోకం పాటించటం 167
u సమాధులను సందర్శించటం 168
u మృతుని శవంపై పడి ఏడ్వటం, రోదించడం మక్రూహ్ (అసహ్యకరమైనది).... 172
u దైవప్రవక్త (స) ఉల్లేఖనం: ఎవరైతే తమకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు విలపిస్తూ తమ బట్టల్ని చించుకుంటారో వారు మాలోని వారు కారు 173
u సాద్ బిన్ ఖౌల మరణం గురించి... 174
u విపత్తులు వచ్చినప్పుడు శిరోముండనం చేయించుకోవటం నిషిద్ధం 175
u ఎవడైతే తన చెంపల మీద కొట్టుకుంటాడో అతడు మాలోని వాడు కాడు 175
u ఆపద సమయంలో రోదించడం అవిశ్వాసపు మాటలు పలకటం నిషిద్ధం 176
u ఆపద సంభవించినప్పుడు విషాద ఛాయలు ఆవహించిన ముఖంతో కూర్చోవడం` 176
u ఎవరైనా సరే ఆపదలు వచ్చినపుడు, ఆత్మను క్షోభకు గురిచేయడం గురించి.... 177
u ఆపద వచ్చి పడగానే సహనం వహించటం 178
u రోగి దగ్గర విలపించటం 179

u ఏడ్వకూడదని, రోదించకూడదని వారించటం, దానిపై కసురుకోవటం 180

u జనాజాను చూసి లేచి నిలబడటం 181

u జనాజా కోసం లేచి నిలబడితే ఎంతసేపు అలా నిలబడాలి? 181

u యూదుని (లేక అవిశ్వాసి) జనాజాను చూసి నిలబడటం 182

u జనాజాను పురుషులు ఎత్తుకోవాలి స్త్రీలు ఎత్తకూడదు 183

u జనాజాను త్వరత్వరగా తీసుకెళ్ళటం 183

u సజ్జనుడు, మంచివాడు అయిన వ్యక్తి శవం మంచం మీద నుంచే ఇలా అంటుంది ... 184

u జనాజా నమాజు చేసేటప్పుడు, ఇమామ్ వెనుక రెండు, మూడు పంక్తులు కట్టటం 184

u జనాజా నమాజులో పంక్తులు కట్టటం 184

u జనాజా నమాజులో పిల్లలు కూడా పురుషులతోపాటు సమానంగా నిలబడటం 185

u జనాజాను గురించి చేసే నమాజు న్యాయబద్ధం కావడం... 186

u జనాజా వెంట వెళ్ళడం మరియు దాని ఔన్నత్యం 187

u ఎవరైతే శవాన్ని సమాధిలో పూడ్చిపెట్టేవరకు జనాజా వెంట ఉంటారో వారిని గురించి 188

u 'నమాజె జనాజా'లో పెద్దలతోపాటు పిల్లలు కూడా పాల్గొనటం 188

u ఈద్గాహ్‌లోగాని లేక మసీదులోగానీ నమాజె జనాజా చెయ్యటం 188

u సమాధులపై మసీదులు నిర్మించటం మక్రూహ్ 189

u కాన్పు సమయంలో స్త్రీ గనక మరణిస్తే ఆమెను గురించి నమాజె జనాజా చెయ్యటం 190

u ఇమామ్ గనక స్త్రీ నమాజె జనాజా చేయిస్తే ... 190

u నమాజె జనాజాలో నాలుగు తక్బీర్‌లు అనాలి.... 190

u జనాజా నమాజులో ఫాతిహా సూరా పఠించడం..... 191

u శవాన్ని పూడ్చిపెట్టిన తరువాత సమాధిపై జనాజా నమాజు చెయ్యటం 191

u మృతుడు, తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోయే ప్రజల అడుగుల సవ్వడిని వింటాడు ... 192

u ఎవరైనా తనను ఏదైనా పవిత్రమైన ఒక స్థలంలో ఖననం చెయ్యాలని కోరుకుంటే.... 193

u రాత్రి సమయంలో శవాన్ని సమాధి చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమేనా? 194

u సమాధిపై మసీదు నిర్మాణం ధర్మసమ్మతమేనా? 194

u స్త్రీల సమాధిలోకి ఎవరు దిగవచ్చు అనే విషయం గురించి 195

u అమరగతి పొందిన వ్యక్తి నమాజె జనాజా చెయ్యవచ్చునా లేక చెయ్యకూడదా? 195

u ఒకే సమాధిలో ఇద్దరు లేక ముగ్గురు మనుషుల్ని ఖననం చెయ్యటం 196
u షహీదులకు గుసుల్ ఇవ్వకూడదు 196
u లహ్‌ద్ (బుగ్‌లి ఖబర్)లోకి ముందు ఎవరిని దించాలి? 197
u ఇజ్‌ఖిర్‌ను, ఎండుగడ్డిని సమాధిలో పరచటం 197
u మృతదేహాన్ని అవసరం నిమిత్తం సమాధి, లహద్‌లో నుంచి బయటికి తీయవచ్చునా? 198
u 'బగ్‌లి' సమాధి తయారు చెయ్యటం శ్రేష్ఠమైనదా?... 199
u ఒకవేళ ఒక ముష్రిక్ ఎవరైనా మరణించేటప్పుడు .... 203
u సమాధిపై ఖర్జూరపు కొమ్మలను నాటడం.... 204
u సమాధి వద్ద ధర్మశాస్త్రం బాగా తెలిసిన ఒక విద్వాంసుడు కూర్చోవటం. 205
u ఆత్మహత్యకు పాల్పడే వ్యక్తికి విధించబడే శిక్ష 206
u కపటుల కోసం నమాజె జనాజా చెయ్యటం.... 206
u మృతుణ్ణి ప్రశంసించటం ధర్మసమ్మతమైన విషయమే 207
u సమాధిలోని శిక్షను గురించి ఖుర్‌ఆన్‌లో ఏమని చెప్పబడింది... 209
u సమాధి శిక్ష నుండి శరణు వేడుకోవటం 211
u చాడీలు చెప్పటం, పరోక్షంగా నిందించటం....సమాధి శిక్షను గురించి. 212
u మృతునికి ఉదయం, సాయంత్రం వేళల్లో అతని నివాస స్థలం చూపించబడుతుంది 212
u శవ పేటికపై పెట్టినప్పుడు మృతుడు మాట్లాడటం 213
u యుక్త వయస్సుకు ఇంకా చేరని, మరణించిన ముస్లిమ్ పిల్లలు ఎక్కడ ఉంటారు? 213
u యుక్త వయస్సుకు ఇంకా చేరని ముష్రిక్కుల సంతానం గురించి 214
u సోమవారం రోజున మరణిస్తే లభించే ఔన్నత్యం 217
u ఆకస్మిక మరణం గురించి 218
u దైవప్రవక్త మహాశయులు(స) గారి సమాధి గురించి... 218
u మరణించినవారిని గురించి చెడ్డగా మాట్లాడటం నిషిద్ధం 221
u దుర్మార్గులైన మృతులు చేసిన చెడ్డ పనుల్ని గురించి ప్రచారం చెయ్యటం... 222

## జకాత్ ప్రకరణం

u జకాత్ చెల్లిస్తామని వాగ్దానం (బైఅత్) చెయ్యటం. 226
u జకాత్ ఇవ్వటానికి తిరస్కరించే వ్యక్తి చేసే పాపం... 226

u దైవప్రవక్త (స)గారి ఉల్లేఖనం,: జకాత్ చెల్లించబడే సంపద దాచిన ద్రవ్యం (దొంగ నిలువ)లోనిది కాదు. 228
u అల్లాహ్ మార్గంలో ధనం ఖర్చుపెట్టేదాని ఔన్నత్యం 231
u ప్రదర్శనాబుద్ధితో దానధర్మాలు చెయ్యటం.... 231
u దొంగ సొమ్ములోనుంచి చేసే దానధర్మాలు స్వీకరించబడవు 232
u హలాల్ సంపాదనలో నుంచి చేసే దానధర్మాలు మాత్రమే స్వీకరించబడతాయి 232
u దానధర్మాలను స్వీకరించేవాడు ఎవ్వడూ ఉండని కాలం రాకమునుపే సాధ్యమైనంత ఎక్కువగా దానధర్మాలు చెయ్యండి. 233
u సగం ఖర్జూరపు పండునైనా లేదా కొద్దిపాటి వస్తువునైనా దానం చేసి.... 235
u ఆరోగ్యం బాగున్నప్పుడు, ధనాపేక్ష ఉన్న కాలంలో చేసే దాన ధర్మాల ఔన్నత్యం 236
u ప్రజల సమక్షంలో దానధర్మాలు చెయ్యటం (ధర్మసమ్మతమే). 237
u తెలియకపోవటం వల్ల ఒకవేళ ఎవరైనా ధనవంతుడైన వ్యక్తికి దానం ఇస్తే .. 238
u ఒక వ్యక్తి ఏదైనా ఒక వస్తువును తన కుమారునికి దానం చేస్తే- 239
u కుడిచేత్తో దానం చెయ్యటం శ్రేష్టమైనది 240
u ఒక వ్యక్తి ఎవరైనా తన నౌకరును ఏదైనా వస్తువును దానం చెయ్యమని ఆజ్ఞాపిస్తే... 240
u చేసిన సహాయాన్ని గుర్తుచేసి మనస్సును నొప్పించేవాణ్ణి ఖండించటం... 243
u దానధర్మాలు చెయ్యటంలో త్వరపడటం ఉత్తమం 243
u దానధర్మాలు చెయ్యమని ప్రజల్ని ఉద్బోధించడం... 243
u శక్తి మేరకు దానం చెయ్యటం 244
u దానధర్మాలు చెయ్యటం వల్ల పాపపరిహారం జరుగుతుంది 244
u కుఫ్ర్ స్థితిలో ఉన్నప్పుడు, షిర్క్ స్థితిలో ఉన్నప్పుడు... దానధర్మాలు చేస్తారో.... 246
u సేవకుడు గనుక తన యజమాని ఆజ్ఞాపించినప్పుడు దానధర్మాలు చేస్తే .... 246
u ఒక స్త్రీ ఎవరైనా తన భర్తకు చెందిన సంపదలోంచి దానం చేస్తే ... 247
u దానధర్మాలు చేసే మనిషి, లోభి అయిన మనిషి- ఈ ఉభయుల ఉపమానం 248
u దానధర్మాలు చెయ్యటం ప్రతి ముస్లింపై వాజిబ్... 249
u ఎంత ధనాన్ని జకాత్, సదఖాల కోసం ఖర్చు పెట్టటం ధర్మసమ్మతం 249
u వెండిపై జకాత్‌ను చెల్లించే విషయం గురించి 250
u ఒంటెలపై చెల్లించవలసిన జకాత్‌ను గురించి... 252

u ఒక సంవత్సరం వయస్సుగల ఆడ ఒంటె లేనట్లయితే, అప్పుడు ఏమి చెయ్యాలి?... 253
u మేకలపై జకాత్ చెల్లించే విషయం 254
u ముసలిదీ, లోపభూయిష్టమైనదీ,మగదీ అయిన పశువును జకాత్‌గా తీసుకోకూడదు.. 255
u మేకపిల్లను జకాత్‌గా తీసుకోవడం 256
u ప్రజల ఆస్తిలోనుంచి జకాత్‌గా నాణ్యమైన వస్తువులను తీసుకోరాదు 256
u ఐదు ఒంటెలకు తక్కువగా ఉంటే జకాత్ లేదు 257
u ఆవు, ఎద్దులపై జకాత్ చెల్లించే విషయం గురించి 257
u బంధువులకు జకాత్ ఇవ్వటం.... 258
u ఒక ముస్లిమ్ తన గుర్రానికి జకాత్ ఇచ్చే అవసరంలేదు 260
u ఒక ముస్లిమ్‌కు తన బానిసపై జకాత్ ఇచ్చే అవసరం లేదు 260
u అనాథలకు దానధర్మాలు చెయ్యటం ఎంతో పుణ్యం 260
u భర్తకూ మరియు అతను పోషించే అనాథలకు జకాత్ ఇవ్వటం 261
u యాచనకు దూరంగా ఉండటం 263
u అల్లాహ్ ఎవరికైనా అడక్కుండానే, అత్యాశ లేకుండానే ఏదైనా వస్తువును ఇప్పిస్తే... 265
u ఒక వ్యక్తి తన సంపదను పెంచే ఉద్దేశ్యంతో ప్రజల్ని ధన సహాయం అర్థించటం 266
u ఖర్జూరపు పండ్లు వృక్షాల మీద ఉన్నప్పుడే వాటి దిగుబడినీ,
వాటి విలువను అంచనా కట్టడం చట్టబద్ధమైన విషయమే 269
u వర్షపు నీటి ద్వారా, నదీజలం ద్వారా సాగుబడిలో వచ్చే దిగుబడిపై జకాత్.... 270
u ఐదు ఔసఖ్‌లు ఖర్జూరపు పండ్ల పంట మీద జకాత్ లేదు. 271
u చెట్ల నుంచి ఖర్జూరపు పండ్లను కోసినప్పుడే వాటిపై జకాత్ తీసుకోవాలి 271
u దైవప్రవక్త (స) గారికి, ఆయన(స) గారి సంతతికీ దానం చెయ్యటం నిషిద్ధం 273
u దైవప్రవక్త (స) గారి భార్యల బానిసలకు సదఖా ఇవ్వటం ధర్మసమ్మతమే 274
u సదఖా (దానంగా లభించిన వస్తువు) అగత్యపరుని సొంత ఆస్తి అయిపోతే .... 273
u సంపన్నులైన ముస్లిమ్‌ల నుంచి జకాత్‌ను తీసుకోవాలి 275
u జకాత్ ఇచ్చే వ్యక్తికోసం ఇమామ్ దుఆ చేయటం 275
u సముద్రంలోనుంచి తీయబడిన వస్తువులపై జకాత్ విధించటం గురించి... 276
u బాటసారులు జకాత్‌కు చెందిన ఒంటెలతో పనులు చేయించుకోవడం, పాలు త్రాగటం 278
u జకాత్‌కు చెందిన ఒంటెలపై పాలకుడే తన చేతులతో గుర్తులు వెయ్యటం 279

## ఫిత్రాదానం


- ఫిత్రాదానం తప్పనిసరికావటం 280
- ఫిత్రాను ఒక స్వతంత్ర ముస్లిమ్‌గానీ, ఒక బానిస ముస్లిమ్‌గాని విధిగా చెల్లించాలి 280
- ఒక 'సా' జౌను ఫిత్రాదానంగా చెల్లించాలి 280
- ఫిత్రాదానం ఒక 'సా' భోజనానికి సమానం 281
- ఖర్జూరపు పండ్లయినా సరే ఒక 'సా' ఫిత్రాదానంగా ఇవ్వాలి 281
- ఎండు ద్రాక్షను ఒక 'సా' ఫిత్రాదానంగా ఇవ్వాలి 281
- ఫిత్రాదానాన్ని పండుగ నమాజుకు ముందే ఇవ్వాలి 281
- ఒక బానిస, ఒక స్వతంత్ర్య ముస్లిమ్ తప్పనిసరిగా(వాజిబ్) ఫిత్రాదానాన్ని చెల్లించాలి 282
- పిన్నలు, పెద్దలు అందరిపైనా ఫిత్రా దానం వాజిబ్ 282


## హజ్ గ్రంథం


- హజ్జ్ యాత్ర విధికావటం 283
- ఒంటె జీనుపై ఎక్కి హజ్జ్ యాత్రకు పోవుట 284
- స్వీకృతి పొందిన హజ్జ్ యొక్క ఔన్నత్యం 285
- హజ్జ్ కోసం, ఉమ్రా కోసం మీఖాతులు... 286
- మక్కావాసులు హజ్, ఉమ్రాలకు సంబంధించిన ఇహ్రామ్‌ను ఏ స్థలం నుండి ధరించాలి? 287
- మదీనా పట్టణవాసుల కోసం మీఖాత్ 287
- సిరియా దేశానికి చెందిన ప్రజలు ఎక్కడ నుంచి ఇహ్రామ్‌ను ధరించాలి? 287
- నజ్ద్ దేశ ప్రజలు ఏ స్థలం నుంచి ఇహ్రామ్‌ను ధరించాలి? అనే విషయం గురించి 288
- మీఖాతుల లోపలి భాగాల్లో నివసించే ప్రజల కోసం మీఖాత్ 288
- యమన్ ప్రజల కోసం 'మీఖాత్' 289
- ఇరాఖ్ దేశ ప్రజల కోసం 'జాతె ఇర్ఖ్' మీఖాత్‌గా ఉంటుంది 289
- జుల్ హులైఫాలో ఇహ్రామ్ ధరించేటప్పుడు నమాజ్ చెయ్యటం 290
- దైవప్రవక్త (స) హజ్‌కు వెళ్ళేటప్పుడు అష్ షజ్‌రా మార్గం గుండా ప్రయాణం చెయ్యటం 290
- దైవప్రవక్త (స) ఇలా అనటం గురించి, 'అఖీఖ్' లోయ ఒక శుభప్రదమైన లోయ 290
- ఇహ్రామ్ దుస్తులకు రాసిన సుగంధాన్ని మూడు సార్లు కడిగెయ్యటం గురించి 291
- ఇహ్రామ్ ధరించేటప్పుడు సుగంధాన్ని లేక అత్తరును రాసుకోవటం గురించి 292

u తల వెంట్రుకలను పేర్చి (కలిపి) ఇహ్రామ్ కట్టుకోవటం. 293

u మదీనావాసులు హజ్ లేక ఉమ్రా చెయ్యాలనే సంకల్పం కలవారు జుల్ హులైఫా వద్ద ఉన్న మసీదు దగ్గర ఇహ్రామ్ కట్టుకోవటం 293

u ముహరిమ్ అయిన వ్యక్తి ఎలాంటి దుస్తులు ధరించ కూడదు? 293

u వాహనంపై హజ్ చెయ్యటం, వాహనంపై ఎవరితోనైనా కూర్చోవటం గురించి.. 293

u (మదీనా నుంచి బయలుదేరి) జుల్ హులైఫాలో ఉదయం వరకు ఆగటం... 295

u 'లబ్బైక్'ను కంఠస్వరాన్ని పెంచి పలకటం 296

u లబైక్‌ను గురించి 296

u ఇహ్రామ్‌ను ధరించి ప్రయాణ పశువుపైకి ఎక్కే సమయంలో .... 297

u వాహనం నిటారుగా నిలబడినప్పుడు లబైక్ పలకటం 297

u ఒక ముహ్‌రిమ్ ఎవరైనా కాలువలోకి దిగినట్లయితే, అతను లబ్బైక్ పఠించాలి 298

u బహిష్టు అయిన మహిళ, ప్రసవించిన మహిళ– వీరు ఇహ్రామ్‌ను ఎలా ధరించాలి? 299

u హజ్జె తమత్తు, హజ్జె ఖిరాన్ మరియు హజ్జె ఇఫ్రాద్‌లను గురించి... 303

u ఒకవేళ ఎవరైనా లబ్బైక్ అంటూ హజ్ పేరును ఉచ్ఛరిస్తే. 307

u దైవప్రవక్త (సఅసమ్) గారి కాలంలో హజ్జె తమత్తు అమలులో ఉండటం 307

u మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు గుసుల్ చేసుకోవాలి 308

u మక్కానగరంలోకి ఎటునుంచి ప్రవేశించాలి? 309

u మక్కా నగరం నుంచి వెళ్ళిపోయేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళిపోవాలి? 309

u మక్కా పవిత్ర నగరం, దానిలోని కట్టడాల ఔన్నత్యం... 310

u కాబా గృహం ఉన్న భూమి ఔన్నత్యం.... 313

u దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా మహానగరంలో ఎక్కడ దిగారు? 315

u కాబా గృహానికి గిలాఫ్ తొడిగించటం లేక ఆచ్ఛాదన 317

u హజరె అస్వద్ (నల్లరాయి)ని గురించి.... 318

u పవిత్ర కాబా గృహ ద్వారాన్ని లోపల నుంచి మూసివేయటం గురించి 318

u కాబా గృహం లోపలి భాగంలో నమాజు 318

u కాబా గృహం లోపలకు పోవటం ఏమంత అవసరమైన విషయమేమీ కాదు... 319

- కాబా గృహంలోని నాలుగు మూలల్లో 'అల్లాహు అక్బర్' అని పలకటం 319
- రమల్ చేసే ఆచారం ఎలా ప్రారంభమయింది? 320
- మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు, మొదట హజ్రె అస్వద్‌ను ముద్దు పెట్టుకోవాలి 320
- హజ్‌లో మరియు ఉమ్రాలో 'రమల్' చెయ్యటం గురించి 321
- కర్రతో హజ్రే అస్వద్‌ను తాకటం మరియు దానిని ముద్దు పెట్టుకోవటం 321
- రెండు యమాని స్తంభాలు తప్ప ఇతర స్తంభాలను ముద్దుపెట్టుకోవటం 322
- హజ్రే అస్వద్‌ను ముద్దుపెట్టుకోవటం 322
- హజ్రె అస్వద్‌కు ముందు భాగంలోకి వచ్చి సంజ్ఞ చెయ్యటం 323
- హజ్రె అస్వద్ ముందుకు వచ్చి అల్లాహు అక్బర్ అని పలకటం 323
- స్త్రీలు కూడా పురుషులతోపాటే కలసి తవాఫ్ చేయవచ్చునా? 324
- తవాఫ్ చేసే సమయంలో మాట్లాడటం గురించి- 326
- తవాఫ్‌లో ఉన్నప్పుడు ఎవరినైనా దారంతో గాని లేక మరొక వస్తువు దేనితోనైనా గాని కట్టుకుని ఉండ టాన్ని చూస్తే- 326
- నగ్నంగా వున్న స్థితిలో ఎవరైనా కాబా గృహ ప్రదక్షిణ చేయడానికి వీలులేదు 326
- ఒకవేళ తవాఫ్ చేస్తూ చేస్తూ మధ్యలో ఆగిపోవలసి వస్తే అప్పుడు ఏమి చెయ్యాలి? 327
- ఏ వ్యక్తి అయితే మొదటి తవాఫ్ అంటే 'తవాఫె ఖుదూమ్' తరువాత మళ్ళీ కాబా దగ్గరకు వెళ్ళకుండా, హజ్ కోసం అరఫాత్‌కు వెళతాడో. 328
- తవాఫ్‌కు సంబంధించిన రెండు రకాతుల నమాజును మసీదు బయట చెయ్యటం.. 328
- తవాఫ్ రెండు రకాతుల నమాజును మఖామె ఇబ్రాహీమ్ వెనుక స్థలంలో చెయ్యటం 328
- వాహనం మీద ఉండి తవాఫ్ చెయ్యవచ్చు 330
- హాజీలకు మంచి నీళ్ళు త్రాపటం 330
- జమ్‌జమ్‌ను గురించి 331
- ఖిరాన్ చేసే వ్యక్తి ఒకే తవాఫ్ చెయ్యాలా? లేక రెండు తవాఫ్‌లు చెయ్యాలా? 332
- వుజూ స్థితిలో తవాఫ్ చెయ్యటం 333
- సఫా మర్వాల మధ్య పరుగెత్తడం వాజిబ్, అవి అల్లాహ్ చిహ్నాలు 335
- సఫా మర్వాల మధ్య ఏవిధంగా పరుగెత్తాలి? 336

u బహిష్టు అయిన స్త్రీ హజ్‌కు సంబంధించిన ఆచార వ్యవహారాలన్నింటినీ నిర్వహించవచ్చు 338
u జిల్‌హజ్జ ఎనిమిదవ తేదీన మనిషి జొహర్ నమాజును ఎక్కడ చెయ్యాలి? 341
u మినా వద్ద నమాజు చేయడం 341
u అరఫా రోజున ఉపవాసం ఉండటం గురించి 342
u ఉదయం సమయంలో మినా నుండి అరఫాత్‌కు బయలుదేరుతూ తల్బియాను, తక్బీర్‌ను రెండింటిని పలకటం 343
u అరఫా దినం నాడు మిట్టమధ్యాహ్నం పూట ఎండలో ప్రయాణం కట్టటం. 343
u అరఫాత్‌కు చెందిన ఆగటాన్ని స్వారీ చేస్తున్న వాహనంపై ఆగి చెయ్యటం 344
u అరఫాత్‌లో ఖుత్బా ప్రసంగాన్ని కుదించటం 345
u అరఫాత్‌లో ఆగటానికి త్వరగా వెళ్ళటం 345
u అరఫాత్‌లో ఆగే విషయం గురించి 345
u అరఫాత్ నుంచి వెనుతిరిగి వచ్చేటప్పుడు ఒక మనిషి నడక వేగం ఎంత ఉండాలి? 346
u అరఫాత్, ముజ్‌దలిఫాల మధ్య ఒంటెపై నుంచి దిగటం 347
u ముజ్దలిఫా వద్ద రెండు నమాజులను కలిపి చెయ్యటం 348
u మగ్రిబ్, ఇషా నమాజుల్ని ముజ్దలిఫాలో కలిపి చెయ్యటం 349
u ప్రతి నమాజు కోసం అజాన్, తక్బీర్ ఇవ్వటం అవసరం 349
u స్త్రీలను, పిల్లలను ముజ్దలిఫాకు చేరిన రాత్రి వేళే మినాకు పంపి వెయ్యాలి 350
u ముజ్దలిఫాలో ఉదయం పూట చేసే నమాజును ఏ సమయంలో చెయ్యాలి? 351
u ముజ్దలిఫా నుంచి ఎప్పుడు వెళ్ళిపోవాలి? 353
u పదవ తేదీ ఉదయం పూట తక్బీర్‌ను మరియు తల్బియాను పఠించటం 353
u ఎవరైతే ఖుర్బానీ పశువును తనతోపాటు తీసుకువచ్చాడో అతన్ని గురించి 355
u ప్రయాణ మార్గంలో ఉన్నప్పుడు ఖుర్బానీ పశువును కొనటం 357
u జుల్ హులైఫా వద్ద ఖుర్బానీ పశువుపై గుర్తువేయటం 357
u ఖుర్బానీ ఒంటెల కోసం, గోవుల కోసం త్రాళ్ళను పేనటం 358
u ఖుర్బానీ పశువులపై గుర్తులు వేయటం 358
u ఎవరైతే స్వయంగా తమ చేతులతో త్రాళ్లు పేనారో వారిని గురించి 359

u గొర్రెలు, మేకల మెడలలో పట్టాలు వెయ్యటం 359
u త్రాళ్ళు ఉన్నితో అల్లబడేవి 360
u పాదరక్షల దండను అల్లటం 360
u ఖుర్బానీ కోసం ఉద్దేశించబడిన ఒంటెలపై కప్పే వస్త్రాన్ని ఏమి చెయ్యాలి? 361
u ఖుర్బానీ పశువును మార్గమధ్యంలో కొనటం, దాని మెడలో పట్టా వెయ్యటం 361
u భార్యల తరఫు నుంచి వారి అనుమతి లేకుండానే గోవులను జిబహ్ చేయడం 362
u మినాలో దైవప్రవక్త (స) ఏ స్థలంలోనైతే నహర్ చేశారో ఆ స్థలంలో నహర్ చెయ్యటం 363
u తన ఖుర్బానీ పశువును తానే స్వయంగా నహర్ చేయటం 363
u ఒంటెల్ని కట్టివేసి జిబహ్ చెయ్యటం 363
u ఒంటెల్ని నిలబెట్టి నహర్ చేయటం. 364
u ఖుర్బానీ పశువుకు సంబంధించిన ఏ వస్తువునూ ఖస్సాబ్‌కు వేతనంగా గానీ,
శ్రమకు ఫలితంగా గాని ఇవ్వకూడదు 365
u ఖుర్బానీ పశువు చర్మాన్ని దీనులకు దానం చెయ్యవచ్చు 365
u ఖుర్బానీ పశువులపై వేసి ఉంచబడే వస్త్రాలను పేదలకు దానంగా ఇవ్వాలి 365
u మొదట ఖుర్బానీ ఇవ్వాలి. ఆ తరువాతనే శిరోముండనం చేయించుకోవాలి 367
u ఇహ్రామ్ కట్టుకునేటప్పుడు తలవెంట్రుకలను దువ్వుకోవటం. 369
u ఇహ్రామ్‌ను విప్పివేసేటప్పుడు శిరోముండనం చేయించుకోవటం 369
u హజ్జె తమత్తుకు సంబంధించిన ఉమ్రాను నిర్వహించిన తరువాత
వెంట్రుకలను పొట్టివిగా కత్తిరింపజేసుకోవటం 370
u పదవ తేదీన తవాఫె జియారత్ చేయాలి 371
u ఎవరైనా ఒకరు సాయంత్రం అయ్యేవరకు 'రమీ' చెయ్యక పోతే ... 372
u జమ్రా వద్ద ఒంటె మీద కూర్చొని ప్రజలకు సమస్యల్ని గురించి చెప్పటం 373
u మినాకు సంబంధించిన దినాలలో ఉపన్యసించటం 373
u మినాకు చెందిన రాత్రులలో మక్కాలో జనులకు నీళ్ళు తాపించేవారు మరియు
మరొక పనిని దేన్నయినా చేసినవారు వారు మక్కా పట్టణంలో ఉండవచ్చునా? 375
u కంకరరాళ్ళు విసిరే విషయం గురించి 376

u లోయ దిగువ భాగంలోకి పోయి కంకరరాళ్ళు విసరటం 376
u ప్రతి జమ్‌రాపై ఏడు కంకరరాళ్ళను విసరాలి 377
u జమ్‌రా అఖబాను కంకరరాళ్లతో కొట్టేటప్పుడు .... 377
u ప్రతి కంకర రాయిని, తీసుకుని విసిరి కొట్టినప్పుడల్లా .... 377
u జమ్‌రతుల్ అఖబాను కంకర రాళ్లతో కొట్టిన తరువాత .... 378
u మొదటి జమ్‌రాను, రెండో జమ్‌రాను కంకర రాళ్ళతో విసిరికొట్టినప్పుడు ఖిబ్లా వైపుకు తిరిగి నిలబడాలి మెత్తని నేలపై. 378
u రెండు జమ్‌రాల వద్ద (దుఆ కోసం) చేతులు ఎత్తటం 379
u రెండు జమరాలవద్ద ఆగి దుఆ చేయటం 379
u కంకరరాళ్ళతో కొట్టిన తరువాత సువాసనను ఒంటిపై రాసుకోవడం మరియు తవాఫె జియారత్‌కు ముందే శిరోముండనం చేయించుకోవటం 380
u తవాఫె విదాను గురించి 380
u ఒక స్త్రీ ఎవరైనా తవాఫె జియారా తరువాత బహిష్టు అయినట్లయితే, అప్పుడు ఆమె తప్పని సరిగా తవాఫె ఇఫాజా నిర్వహించవలయునా? 381
u బయలుదేరే రోజున అసర్ నమాజ్‌ను ముహస్సబ్‌లో చెయ్యటం 383
u ముహస్సబ్‌లో దిగేటప్పటి ఉపదేశం 383
u మక్కా మహానగరంలోకి ప్రవేశించటానికి ముందు జీతువాలో .... 384
u మక్కా మహానగరం నుంచి తిరిగి వచ్చేటప్పుడు కూడా జీతువాలో దిగటం 385
u హజ్జ్ యాత్రలో ఉన్నప్పుడు వ్యాపారం చెయ్యటం ...... 385
u ముహస్సబ్ నుంచి రాత్రి చివరి భాగంలో బయలుదేరటం 386

*మహా కరుణగలవాడు, అత్యంత దయామయుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను*

# జుమా ప్రకరణం

## 1వ అధ్యాయం

జుమా నమాజు చెయ్యటం ఫర్జ్. అంటే విధి.[1] ఎందుకంటే కరుణామయుడైన అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో 'జుమా' సూరాలో ఇలా సెలవిచ్చాడు: జుమా (శుక్ర వారం) రోజున నమాజు కోసం అజాన్ ఇచ్చినప్పుడు అల్లాహ్‌ను స్మరించటానికి లేచి నిలబడండి మరియు వెళ్ళండి. క్రయవిక్రయాలను వదిలి పెట్టండి. 'ఫస్అవ్' అంటే అర్థం, లేచి నిలబడండి మరియు వెళ్ళండి.[2]

1. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; 'మనం అన్ని సంఘాలు (ఉమ్మత్‌లు) వచ్చిన తరు వాత ప్రపంచంలోకి వచ్చాము. కాని ప్రళయదినం నాడు మనం అందరికంటే ముందు ఉంటాము.[1] విషయం ఏమిటంటే, యూదులకు, క్రైస్తవులకు మనకంటే ముందు గ్రంథాలు లభించాయి. తరువాత ఈ జుమా రోజే వారికోసం కూడా (ఆరాధన కొరకు) నిర్ణయించబడింది. కాని వారు ఈ విషయంలో గందరగోళం సృష్టించి తారు మారు చేశారు. మనకు అల్లాహ్ ఈ రోజును గురించి తెలియజేశాడు. ప్రజలందరూ మనవెనుక ఉండిపోయారు. యూదుల దినం రేపు, క్రైస్తవుల దినం ఎల్లుండి.[2]

---

1-1. అంటే 'ఫర్జె ఐన్' అన్నమాట. అంటే అత్యవసరమైన విధి. ఇబ్నె మున్జిర్ ఈ విషయంలో 'ఇజ్మా' (ఏకాభి ప్రాయం) ఉంది అని వ్రాశారు.

1-2. అంటే పరుగెత్తడం అని అర్థంకాదు. ఎందుకంటే నమాజు కోసం పరుగెత్తటం వారించబడింది. ఈ విషయంపైన ఇదివరకే ప్రస్తావించబడింది. ఖుర్ఆన్ ఆయత్ ద్వారా స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే, జుమాకు సంబంధించిన అజాన్ ఇచ్చినప్పుడు నమాజు కోసం లేచి నిలబడటం మరియు మసీదుకు వెళ్ళడం ఫర్జ్ అంటే విధి. కనుక జుమా నమాజు కూడా ఫర్జ్ అయిపోయింది.

1-1. తీర్పుదినం నాడు లెక్క ఇచ్చే విషయంలోనూ, స్వర్గంలో ప్రవేశించే విషయంలోనూ మనం ముందు ఉంటాము అని భావం.

1-2. ఏమి జరిగిందంటే, దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) జుమా దినాన్ని ఆరాధన కోసం ప్రత్యే కించుకోమని ఆజ్ఞాపించారు. కాని వారు శనివారం రోజు శ్రేష్ఠమైనది అని అన్నారు.

## 2వ అధ్యాయం

**జుమా రోజున స్నానం చేసే దాని ఔన్నత్యం మరియు జుమా నమాజు కోసం పిల్లలూ, స్త్రీలూ మసీదుకుపోవటం ఫర్జ్ అవునా కాదా? అనే విషయం గురించి.**

**2.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు: 'మీలో ఎవరైనా జుమా నమాజు కోసం వెళ్ళదలిస్తే అప్పుడు గుసుల్ చేసుకోండి.' [1]

**3.** అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి హజ్రత్ ఉమర్ (రజిఅన్) జుమారోజున నిలబడి ఖుత్బా ప్రసంగాన్ని చేస్తున్నారు ఇంతలో ఒక మనిషి మసీదులోకి వచ్చారు : 'ఆయన(ర) ముందుగా వచ్చిన ముహాజిర్ల లోని వారు మరియు దైవప్రవక్త(స)గారి సహాబాలలోని వారు అయిన హజ్రత్ ఉస్మాన్(ర). హజ్రత్ ఉమర్(ర) ఖుత్బా ఇచ్చే సమయంలోనే ఆయన్ని కేకవేసి పిలిచారు: 'బాగుంది! ఇదేమిటి ఇప్పుడొచ్చారు? మీరు రావలసిన సమయం ఇదేనా?' అని అన్నారు. ఆయన(ర) 'నాకు ఒక పని తగిలింది. నేను ఇంట్లోకి కూడా పోలేదు. అజాన్ వినగానే నేను వుజూ చేసుకుని నేరుగా ఇక్కడికే వచ్చాను.' అని సమాధానం పలికారు: హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు: "అలాగా! అంటే మీరు కేవలం వుజూ చేసుకుని సంతృప్తి చెందారన్న మాట. వాస్తవానికి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమా రోజున గుసుల్ చేసుకోమని ఆజ్ఞాపించేవారు కదా! ఈ విషయం మీకు బాగా తెలుసు.'

---

అల్లాహ్ ఆజ్ఞానుసారం హజ్రత్ మూసా (అ) మౌనంగా ఉండిపోయారు. యూదుల మంకుపట్టు కారణంగా క్రైస్తవులు ఆదివారాన్ని ఆరాధనా దినంగా నిర్ణయించుకున్నారు. అల్లాహ్ ముస్లిములకు జుమా దినాన్ని ప్రత్యేకించుకోమని తెలియజేశాడు. వారు దానిని అంగీకరించారు. కనుక ముస్లిములు మొదటి స్థానంలోనూ, యూదులు ఒకరోజు వెనుకనూ క్రైస్తవులు రెండు రోజులు వెనుకనూ ఉన్నారు.

2-1. జుమా రోజున ఏదైనా శాస్త్రపరమైన కారణం ఉంటే తప్ప గుసుల్ చేసుకోవటం అహ్లెహదీస్ వారి దృష్టిలోనూ మరియు ఉలమాయె జాహిర్‌ల దృష్టిలోనూ వాజిబ్ అంటే అత్యవసరంగా చెయ్యవలసిన పని. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై) కూడా ఇలాంటి ఒక ఉల్లేఖనాన్ని ఉటంకించారు; హనఫి, షాఫయి విద్వాంసుల దృష్టిలో ఇది సున్నత్. ఇమామ్ బుఖారీ (రహ్మలై) ముందు రాబోయే ఒక హదీసులో ఇది సున్నత్ అనే విషయాన్ని ఆధారాలతో నిరూపించారు.

**4.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఉల్లేఖించారు: 'యువకుడైన ప్రతి పురుషుడూ తప్పని సరిగా జుమారోజున గుసుల్ చేసుకోవాలి. ఇది వాజిబ్.'

## 3వ అధ్యాయం

### జుమా రోజున నమాజుకు పోయేటప్పుడు సువాసన రాసుకోవటం.

**5.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెల విచ్చారని, అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఉల్లేఖించారు: 'జుమా రోజున యువకుడైన ప్రతి వ్యక్తీ గుసుల్ చెయ్యటం వాజిబ్. ఇంకా అతను మిస్వాక్ చేసుకోవాలి. ఇంకా ఒకవేళ తేలికగా లభ్యమైతే అత్తరు కూడా రాసుకోవాలి.' అమ్రూ బిన్ సులైమ్ ఇలా అన్నారు: 'గుసుల్ విషయంలోనైతే అది వాజిబ్ అని నేను సాక్ష్యమిస్తాను. కాని మిస్వాక్ చెయ్యటం గురించి, అత్తరు రాసుకోవటం గురించి అది వాజిబ్ అవునో కాదో అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. కాని హదీసులో మాత్రం ఇలాగే వచ్చింది.'

## 4వ అధ్యాయం

### జుమా నమాజుకు పోయేదాని ఘనత.

**6.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెల విచ్చారని హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'జుమా రోజున ఎవరైతే (భార్యతో సంభోగించి) జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకుని తరువాత నమాజుకు వెళతారో వారు ఒక ఒంటెను ఖుర్బానీ ఇచ్చినట్లు అవుతుంది. ఆ తరువాత ఎవరైతే నమాజుకు వెళతారో వారు ఒక ఆవును ఖుర్బానీ ఇచ్చినదానితో సమానం. మూడో స్థానంలో ఎవరైతే ఉంటారో వారు కొమ్ములుగల ఒక పొట్టేలును ఖుర్బానీ ఇచ్చినట్లు అవు తుంది. నాలుగోస్థానంలో ఎవరైతే ఉంటారో వారు ఒక కోడిని ఖుర్బానీ ఇచ్చినట్లు లెక్క. అయిదో స్థానంలో ఎవరైతే ఉంటారో వారు అల్లాహ్ మార్గంలో ఒక కోడిగుడ్డును ఇచ్చినట్లు లెక్క. తరువాత ఖుత్బా ప్రసంగం చెయ్యటానికి ఇమామ్ బయలుదేరినప్పుడు హాజరు వేసే దైవదూతలు కూడా మసీదులోకి ప్రవేశిస్తారు మరియు ఖుత్బా ప్రసంగాన్ని వింటారు.'

## 5వ అధ్యాయం

**7.** హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు ఒకసారి హజ్రత్ ఉమర్ (రజిఅన్) జుమా రోజున ఖుత్బా ప్రసంగం చేస్తున్నారు. ఇంతలోనే ఒక పెద్ద మనిషి (హజ్రత్ ఉస్మాన్(ర)) మసీదులోకి ప్రవేశించారు. అప్పుడు హజ్రత్ ఉమర్(ర)

ఆయన్ను ఉద్దేశించి ఇలా అన్నారు: 'మీరంతా నమాజుకు రాకుండా ఎందుకు ఆగి పోతారు? (మీరు నమాజుకు ముందుగానే ఎందుకు రారు?) సమాధానంగా ఆయన(ర) ఇలా అన్నారు: "నేను ఏమాత్రం ఆలస్యం చెయ్యలేదు. అజాన్ వినగానే వుజూ చేసుకున్నాను మరియు నమాజు కోసం వచ్చేశాను". అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు: 'ఏమిటి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) చెప్పిన విషయాన్ని మీరు వినలేదా?' ఆయన(స) ఇలా సెలవిచ్చేవారు: 'మీలో ఎవరైనా జుమా నమాజుకు రావాలని సంకల్పించుకుంటే గుసుల్ చేసుకుని నమాజుకు రావాలి.'

## 6వ అధ్యాయం

## జుమా నమాజుకోసం తలవెంట్రుకలకు నూనె రాసుకోవటం.

**8.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని సల్మాన్ ఫార్సీ(రజిఅన్) ఉల్లేఖించారు 'ఏ మనిషైతే జుమారోజున గుసుల్ చేసుకుంటాడో, శక్తిమేరకు పరిశుభ్రతను పాటిస్తాడో[1] తనవద్ద ఉన్నటువంటి నూనెలో నుంచి కొంత నూనెను తలకు రాసుకుంటాడో లేదా తన ఇంటివారి అత్తరు[2]లోనుంచి కొంత తీసు కుని తన వస్త్రాలకు రాసుకుంటాడో, తరువాత నమాజు కోసం బయలుదేరుతాడో (మస్జిద్‌లోకి ప్రవేశిస్తాడో), మస్జిద్‌లో కూర్చొని ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తుల మధ్యనుంచి దూరిపో[3]డో తరువాత తన అదృష్టం రాసి పెట్టి ఉన్నదాని ప్రకారం నమాజు చేస్తాడో (అంటే సున్నత్, నఫిల్ నమాజులు) ఇంకా ఇమామ్ ఖుత్బా పఠించేటప్పుడు మౌనంగా ఉంటాడో అతని వల్ల ఈ జుమా నుంచి మరొక జుమా వరకు గల కాలంలో జరిగే పాపాలన్నీ[4] క్షమించబడతాయి.

---

1. శరీరం మీద ఉన్న మట్టినీ మాలిన్యాన్నీ కడిగెయ్యటం. మీసాలనూ, గోళ్ళనూ కత్తిరించటం, నాభి క్రింద ఉన్న వెంట్రుకలను తొలగించటం. ఇంకా పరిశుభ్రమైన మంచి వస్త్రాలను ధరించటం.
2. అబూదావూద్ ఉల్లేఖనంలో ఇలాగే ఉంది తన భార్యకు చెందిన అత్తరులోనుంచి కొంత తీసుకుని రాసుకోవటం. ఈ హదీసు ద్వారా స్పష్టమైన విషయం ఏమిటంటే, స్త్రీలు తమ ఇళ్ళల్లో అత్తరు, సాంబ్రాణి వంటి సువాసన పదార్థాలను ఉంచుకోవాలి.
3. అంటే, ఇద్దరు వ్యక్తులు కలిసి కూర్చొన్నచోట అనవసరంగా వారి మధ్యనుంచి వారిని వేరుచేసి దూరిపోకూడదు. ప్రజల మెడలమీదనుంచి దూకిపోకూడదు. ఎక్కడ స్థలం దొరికితే అక్కడ కూర్చోవాలి.
4. ఖస్తలానీ ఇలా అన్నారు: పాపాలు అంటే చిన్నచిన్న పాపాలు అని అర్థం. ఈ విషయం ఇబ్నెమాజా ఉల్లేఖనం ద్వారా కూడా తెలుస్తోంది.

**9.** తావుస్ బిన్ కైసాన్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్)ను ఇలా అడిగారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ప్రజలు అంటున్నారు : 'జుమా రోజున గుసుల్ చెయ్యండి. మీ తలను నీళ్ళతో కడగండి– మీకు స్నానం చేసే అవసరం లేకపోయినప్పటికీ. ఇంకా అత్తరు రాసుకోండి''. ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు : 'గుసుల్ చెయ్యమని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించిన విషయం వాస్తవమే. ఇందులో ఏమాత్రం సందేహంలేదు. అత్తరు విషయం గురించి నాకు తెలియదు.'

**10.** జుమా రోజున చేసే గుసుల్‌ని గురించి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఆజ్ఞాపించిన విషయాన్ని ఇబ్నె అబ్బాస్(ర) చెప్పారని తావుస్ ఉల్లేఖించారు. తావుస్ ఇలా అన్నారు : 'నేను ఇబ్నె అబ్బాస్(ర)ను ఇలా అడిగాను : ఒకవేళ అతని ఇంటివారి దగ్గర నూనెగాని, అత్తరుగాని ఉంటే అప్పుడు దానిని కూడా రాసుకోవాలా? దానికి సమాధానంగా ఆయన(స), 'నాకు తెలియదు' అని అన్నారు.

## 7వ అధ్యాయం

**జుమా రోజున ఉన్నంతలోనే మంచి వస్త్రాలు, చక్కని వస్త్రాలు ధరించటం.**

**11.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా ఉల్లేఖించారు : హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఒకసారి బజారులో (మస్జిద్ ద్వారంవద్ద) ఒక జత పట్టువస్త్రాలు అమ్మబడుతూ ఉండగా చూశారు. అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు 'ఓ దైవప్రవక్తా (స)! ఈ పట్టువస్త్రాలను మీరు కొంటే ఎంత బాగుంటుంది. జుమా రోజున మరియు ఇతర దేశాలనుంచి రాయబారులు మీవద్దకు వచ్చినప్పుడూ వాటిని మీరు ధరించ వచ్చు. దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) దానికి సమాధానంగా ఇలా సెలవిచ్చారు: ఈ పట్టువస్త్రాలనైతే పరలోకంలో ఎలాంటి వాటాలేని వ్యక్తియే ధరిస్తాడు. తరవాత కొన్ని రోజులు గడిచిపోయిన పిదప ఏమి జరిగిందంటే, దైవ ప్రవక్త(స) గారి వద్దకు ఇలాంటి పట్టు వస్త్రాల జతలు ఎన్నో వచ్చాయి. అప్పుడు వాటిలోనుంచి ఒక జత పట్టుబట్టలను ఆయన (స) హజ్రత్ ఉమర్(ర)కు కూడా ఇచ్చారు. అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా విన్నవించుకున్నారు: 'ఓ దైవప్రవక్తా(స)! ఈ జత బట్టలను మీరు నన్ను ధరించమంటున్నారా?' స్వయంగా మీరే ఉతారిద్ అమ్మే జత వస్త్రాలను గురించి అలా అన్నారు కదా!' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : "నీవు ధరించాలని నేను ఈ జత వస్త్రాలను నీకు ఇవ్వలేదు". చివరకు హజ్రత్ ఉమర్(ర) ఆ జత వస్త్రాలను తన ఒక ముష్రిక్ సోదరునికి ఇచ్చేశారు. అతను మక్కాలోనే ఉండేవాడు.

## 8వ అధ్యాయం

**జుమా రోజున మిస్వాక్ చెయ్యటం. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మిస్వాక్ చెయ్యమని చెప్పారని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు.**

**12.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు : 'నాకు గనక నా ఉమ్మత్‌కు లేదా ప్రజలకు కలిగే కష్టాన్ని గురించి ఆలోచన రాకపోయినట్లయితే నేను ప్రతి నమాజు సమయంలో మిస్వాక్ చెయ్యమని వారికి ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి.[1]'

**13.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: "నేను మిస్వాక్‌ను గురించి మీకు చాలా ఎక్కువగానే చెప్పాను."[1]

**14.** హుజైఫా ఇబ్నె యమాన్ ఇలా ఉల్లేఖించారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి పూట తహజ్జుద్ నమాజుకోసం లేచినప్పుడు తన నోటిని మిస్వాక్‌తో తోముకునేవారు.'

## 9వ అధ్యాయం

**ఎవరైనా ఇతరుల మిస్వాక్‌ను ఉపయోగిస్తే....**

**15.** హజ్రత్ ఆయెషా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు :'ఒకసారి అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్(రజిఅన్) (హజ్రత్ ఆయెషా(ర) గారి సోదరుడు గదిలోకి) వచ్చారు. అతని వద్ద ఒక మిస్వాక్ ఉన్నది. దానిని అతను ఉపయోగించేవాడు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) (వ్యాధిగ్రస్త స్థితిలో) దానిని చూశారు.[1] అప్పుడు నేను

---

12-1. ప్రసిద్ధిగాంచిన ఈ హదీసు ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) విశ్లేషించిన విషయం ఏమిటంటే, జుమా నమాజు కోసం కూడా మిస్వాక్ చేసుకోవాలి. ఎందుకంటే, అది కూడా నమాజే కాబట్టి. ఇతర నమాజులకంటే జుమా నమాజు స్థానం గొప్పది. దాని కోసం గుసుల్ చేసుకోవాలనే ఆజ్ఞ ఉన్నది. మొత్తం శరీరాన్ని పరిశుభ్రం చేసుకోవాలనే ఆజ్ఞ ఉన్నప్పుడు నోటిని తప్పనిసరిగా పరిశుభ్రపరచుకోవలసి ఉంటుంది.

13-1. ప్రతి నమాజు సమయంలోనూ మిస్వాక్ చెయ్యాలని దైవప్రవక్త(స) ఆదేశించారు. కనుక జుమా నమాజు కోసం కూడా ఈ ఆదేశం వర్తిస్తుంది. జుమా నమాజులోనైతే ఇతర నమాజుల కంటే ఎక్కువమంది ప్రజలు మస్జిద్‌లో హాజరవుతారు. కనుక నోటిని పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచుకోవటం అనేది ఆ రోజున చాలా అవసరమవుతుంది. ఎందుకంటే నోటి దుర్వాసనవల్ల తోటి ముస్లిమ్ సోదరులకు ఇబ్బంది కలగకూడదు.

ఇలా అన్నాను: "ఓ అబ్దుర్రహ్మాన్! నీవద్ద ఉన్న ఆ మిస్వాక్‌ను నాకు ఇచ్చెయ్యి". అతను దానిని నాకు ఇచ్చేశాడు. నేను దానిని విరిచేశాను.[2] తరువాత (నా పళ్ళతో దానిని నమిలి మెత్తబరిచాను) ఆ మిస్వాక్‌ను నేను దైవప్రవక్త(స)గారికి ఇచ్చాను. ఆయన(స) గారు దానిని ఉపయోగించారు. అప్పుడు ఆయన(స)గారు నా గుండెల మీద పండుకుని ఉన్నారు.

## 10వ అధ్యాయం

**జుమా రోజున ఉదయం పూట చేసే నమాజులో ఖుర్ఆన్‌లోని ఏ సూరాను పఠించాలి.**

**16.** హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమా రోజున ఉదయంపూట చేసే నమాజులో అలిఫ్ లామ్ మీమ్ సజ్‌ద మరియు హల్ అతా అలల్ ఇన్‌సాన్‌లను పఠించేవారు'.

## 11వ అధ్యాయం

**గ్రామం మరియు పట్టణం రెండు చోట్లా జుమా నమాజు చెయ్యటం ధర్మ సమ్మతమే.**

**17.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి మసీదు తరువాత మొదటి జుమా నమాజు బహ్‌రైన్ దేశంలోని జవాసాలో ఉన్నటువంటి అబ్దుల్ ఖైస్ మసీదులో జరిగింది.

**18.** హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను అని ఆయన అన్నారు: మీరందరూ సంరక్షకులే. మిమ్మల్ని మీ అధీనంలో ఉన్న వారిని గురించి ప్రశ్నించటం జరుగుతుంది. చక్రవర్తి కూడా సంరక్షకుడే. అతన్ని అతని అధీనంలో ఉన్న వారిని గురించి అడగటం జరుగుతుంది. పురుషుడు తన ఇంటికి సంరక్షకుడు. అతన్ని అతని అధీనంలో ఉన్న వారిని గురించి ప్రశ్నించటం జరుగుతుంది. ఒక స్త్రీ తన భర్త సంపదకు సంరక్షకురాలు. ఆమెను దాని గురించి అడగటం జరుగుతుంది. ఒక

---

15-1. హజ్రత్ ఆయెషా(ర) దైవప్రవక్త(స)గారిని చూడటాన్నిబట్టి ఆయన(స) ఆ మిస్వాక్‌ను ఉపయోగించదలిచారు అనే విషయాన్ని గ్రహించారు. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే, ఒక మనిషి మరొక మనిషికి చెందిన మిస్వాక్‌ను ఉపయోగించగలడు.

15-2. అంటే అబ్దుర్రహ్మాన్ తన నోట్లో పెట్టుకునే అంత పొడుగు పుల్లను ఆమె(ర) విరిచేశారు.

సేవకుడు తన యజమాని సంపదకు బాధ్యుడు. అతన్ని అతని అధీనంలో ఉన్న వారిని గురించి ప్రశ్నించటం జరుగుతుంది. క్లుప్తంగా మీరందరూ సంరక్షకులే. మిమ్మల్ని మీ అధీనంలో ఉన్న వారిని గురించి అడగటం జరుగుతుంది.

## 12వ అధ్యాయం

**ఎవరైతే జుమా నమాజు కోసం మసీదుకు వెళ్ళరో - స్త్రీలు, పిల్లలు, బాటసారులు, అంధులు, వికలాంగులు మొదలైన వారు- వారిపై గుసుల్ కూడా వాజిబ్ కాదు. ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు : ఏ వ్యక్తి మీదనయితే జుమా నమాజు వాజిబ్ అవుతుందో ఆ వ్యక్తి మీదనే గుసుల్ కూడా వాజిబ్ అవుతుంది.**

**19.** తన తండ్రిగారు ఇలా చెబుతూ ఉండగా తాను విన్నానని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు : 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను. 'మీలో ఎవరైతే జుమా నమాజుకు రాదలచుకుంటారో వారు గుసుల్ (స్నానం) చేసుకోవాలి.'

**20.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు: "జుమా రోజున యుక్త వయస్సుకు చేరిన ప్రతి యువకుడూ తప్పనిసరిగా గుసుల్ చేసుకోవాలి. అది అతనిపై వాజిబ్".

**21.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు మనం (అంటే ముస్లిములం) ప్రపంచంలోకైతే తరువాత వచ్చాము. కాని ప్రళయదినం నాడు అందరికంటే ముందు ఉంటాము. యూదులకు, క్రైస్తవులకు మనకంటే ముందే గ్రంథం లభించింది మనకు వారి తరువాత లభించింది. ఈ విషయంలో ఏ మాత్రం సందేహం లేదు. కాని జుమా దినం విషయంలో వారు విభేదించారు. అప్పుడు అల్లాహ్ మనకు ఈ దినాన్ని గురించి తెలియజేశాడు. రేపు యూదుల దినం (అంటే ఆదివారం). తరువాత ఆయన (స) గారు మౌనంగా ఉండిపోయారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చారు: ఏడు దినాలలో ఒక దినం (జుమా రోజున) ముస్లిములు తమ తలను మరియు మొత్తం శరీరాన్ని నీళ్లతో పరిశుభ్రం చేసుకోవాలి. ఈ హదీసును అబాన్ బిన్ సాలెహ్ ముజాహిద్‌కు ఉల్లేఖించారు ఆయన తావూస్‌కు ఉల్లేఖించారు. ఆయన అబూ హురైరా (ర)తో ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు 'ప్రతి ముస్లిమ్‌పై అల్లాహ్‌కు

ఉన్నటువంటి హక్కు ఏమిటంటే, ఏడు రోజుల్లో ఒక రోజున (అంటే జుమా రోజున) అతను స్నానం చెయ్యాలి.'[1]

**22.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు: "రాత్రి సమయాలలో స్త్రీలను మసీదులకు వెళ్ళనివ్వండి".

**23.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'హజ్రత్ ఉమర్(ర)గారి ఒక భార్య ఉదయం నమాజునూ, ఇషా నమాజునూ మసీదుకు వచ్చి జమాఅత్‌తో కలిసి చేసేవారు. ఆమె గారిని ఇలా అడగటం జరిగింది- 'నీవు నమాజు కోసం బయటకు ఎందుకు వస్తున్నావు? హజ్రత్ ఉమర్(ర) ఈ విషయాన్ని సహించరని నీకు తెలియదా?' అప్పుడు ఆమెగారి ఆత్మాభిమానం దెబ్బతిన్నది. ఆమె ఇలా అన్నారు: 'అలాంటప్పుడు ఆయన ఇలా చెయ్యవద్దని ఎందుకు వారించరు? ప్రజలు ఇలా అన్నారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ఒక హదీసు కారణంగా ఆయన వారించటం లేదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ దాసీలను అల్లాహ్ మసీదుల్లోకి రాకుండా ఆపకండి".

## 13వ అధ్యాయం

**ఒకవేళ వర్షం కురుస్తూ ఉంటే అప్పుడు జుమా నమాజులో పాల్గొనటం వాజిబ్ (తప్పనిసరి) కాదు.**

**24.** ముహమ్మద్ బిన్ సీరీన్ ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి వర్షం కురుస్తున్న రోజున హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) తన మౌజన్‌తో ఇలా అన్నారు 'అజాన్‌లో నీవు 'అష్హదు అన్న ముహమ్మదుర్ రసూలుల్లాహ్' అని అన్న తరువాత ఇక 'హయ్యా అలస్సలాహ్' అని అనవద్దు. ఇలా బిగ్గరగా చెప్పు 'జనులారా! మీరు మీ మీ ఇళ్ళల్లోనే నమాజు చేసుకోండి'. ఈ విషయాన్ని విని అక్కడ ఉన్నటువంటి ప్రజలు ఆశ్చర్యపోయారు. అప్పుడు ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారు: నాకంటే ఉత్తములూ, శ్రేష్ఠులూ

---

21-1. కొందరు ఏమన్నారంటే, దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: 'ప్రతి ముస్లిమ్ ఏడు రోజుల్లో ఒక రోజున తన శిరస్సును, తన శరీరాన్ని నీళ్ళతో పరిశుభ్రపరచుకోవటం చాలా అవసరం. కనుక తెలిసిన విషయం ఏమిటంటే, ఇక్కడ ముస్లిమ్ అంటే ముస్లిమ్ పురుషుడు అని భావం. ఎందుకంటే ముస్లిమ్ అనే పదం పురుషలింగం, దాని ద్వారా స్పష్టమైన విషయం ఏమిటంటే, స్త్రీ గుసుల్‌ను చేసుకునే అవసరంలేదు, అది ఆమెపై వాజిబ్ కాదు.

అయినవారే (అంటే ముహమ్మద్(స)) ఇలా చేశారు. జుమా నమాజు నిస్సందేహంగా విధియే. కాని మిమ్మల్ని బయటకు రప్పించి బురదలో, వర్షంలో నడిపించటం నాకు ఇష్టంలేదు.'

## 14వ అధ్యాయం

జుమా నమాజు కోసం మసీదు నుంచి ఎంత దూరంలో ఉన్నా సరే ప్రజలు రావాలి. జుమా నమాజు ఎవరిపైన వాజిబ్ అవుతుంది? ఎందుకంటే అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో జుమా సూరాలో ఇలా సెలవిచ్చాడు: 'జుమా రోజున నమాజు కోసం అజాన్ ఇవ్వబడినప్పుడు అల్లాహ్ స్మరణ కోసం వెళ్ళండి. అతా బిన్ అబీ రిబాహ్ ఇలా అన్నారు: 'నీవు గనక జుమా నమాజు జరిగే పట్టణంలో ఉన్నప్పుడు ఇంకా అక్కడ జుమా నమాజు కోసం అజాన్ ఇవ్వబడినప్పుడు జుమా నమాజుకు పోవటం నీపై వాజిబ్ అవుతుంది- అజాన్ వినినా లేక వినకపోయినా. అనస్ బిన్ మాలిక్(ర) ఒక్కొక్కప్పుడు తన ఇంట్లోనే జుమా నమాజు చేసుకునేవారు. మరొకప్పుడు చేసేవారు కాదు. (బస్రాలో ఉన్నటువంటి జామె మసీదుకు వెళ్ళేవారు) ఆయనగారి ఇల్లు జావియాలో ఉన్నది. అది బస్రాకు ఆరు మైళ్ళదూరంలో ఉండేది.

**25.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి భార్య అయిన హజ్రత్ ఆయెషా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రజలు తమ తమ గృహాలనుంచీ, మదీనా పురం చుట్టు ప్రక్కల్లో ఉన్న శివారు (గ్రామీణ) ప్రాంతాల నుంచీ వంతుల వారీగా జుమా నమాజు చెయ్యటానికి వచ్చేవారు. మార్గ మధ్యంలో వారి మీద దుమ్మూ, ధూళి పడేది. వారి శరీరం నుంచి చెమట కారుతూ ఉండేది. చెమటవల్ల వారు ధరించిన వస్త్రాల నుంచి దుర్వాసన వెలువడేది. వారిలోని ఒక వ్యక్తి దైవప్రవక్త ముహమ్మద్(స) వద్దకు వచ్చాడు. అప్పుడు ఆయన(స) నా దగ్గర కూర్చొని ఉన్నారు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'మీరు ఈ రోజున పరిశుభ్రతను పాటిస్తే ఎంతో బాగుంటుంది'.

## 15వ అధ్యాయం

**జుమా వేళ పొద్దువాలటంతో ప్రారంభమవుతుంది. హజ్రత్ ఉమర్(ర), హజ్రత్ అలీ(ర), హజ్రత్ నూమాన్ బిన్ బషీర్(ర), అమ్ర్ బిన్ హురైస్ (ర)గార్లు కూడా ఇదే విషయాన్ని చెప్పారు.**

**26.** యహ్యా బిన్ సయీద్ ఇలా అన్నారు: 'జుమా రోజున గుసుల్ చేసు కునే విషయం గురించి నేను అమ్రా బిన్తె అబ్దుర్రహ్మాన్‌ను అడిగాను. హజ్రత్

ఆయెషా(ర) ఇలా అన్నారని ఆమె చెప్పారు : 'ప్రజలు తమ పనుల్ని తామే చేసుకునేవారు. వారు పొద్దువాలిన తరు వాత జుమా కోసం వెళ్ళేటప్పుడు అదే స్థితిలో వెళ్ళేవారు. (వారి బట్టల మీద దుమ్మూ, ధూళి ఉండేది. ఈ కారణం వల్ల "మీరుగనక గుసుల్ చేసుకొని నమాజుకు వస్తే ఎంత బాగుంటుంది?" అని ఆజ్ఞాపించటం జరిగింది.

**27.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమా నమాజును పొద్దువాలినప్పుడు చేసేవారు.

**28.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు మేము జుమా నమాజును పెందలకడనే చేసుకునేవారము. ఇంకా జుమా రోజున నమాజు చేసిన తరువాత విశ్రాంతి తీసుకునేవారం.'

## 16వ అధ్యాయం

### ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు జుమా వచ్చినట్లయితే అప్పుడు ఏమి చెయ్యాలి?

**29.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) చలి తీవ్రంగా ఉన్నప్పుడు జుమా నమాజును పెందలకడనే చేసేవారు. ఇంకా ఎండలు తీవ్రంగా కాస్తున్నప్పుడు, ఎండ తీవ్రత తగ్గిన తరువాత చల్లబడినప్పుడు నమాజు చేసేవారు. (అంటే జుమా నమాజును చేసేవారు).

## 17వ అధ్యాయం

జుమా నమాజు కోసం కాలినడకన పోవటం. అల్లాహ్ జుమా సూరాలో ఇలా సెలవిచ్చాడు: "విశ్వాసులారా! శుక్రవారంనాడు నమాజుకై పిలిచినప్పుడు, అల్లాహ్ సంస్మరణ వైపునకు వెళ్ళండి' 'సయీ' అంటే ఆచరించటం, నడవటం అని అర్థం. బనీ ఇస్రాయీల్ సూరాలో ఉన్న మాదిరిగా. ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారు జుమా నమాజు కొరకు ఇచ్చే అజాన్ అయిపోగానే క్రయవిక్రయాలు హరామ్ అయిపోతాయి. ఇంకా అతా బిన్ అబీ రిబాహ్ ఇలా అన్నారు: ప్రపంచానికి సంబంధించిన ప్రతి పని హరామ్ అయిపోతుంది. ఇబ్నె షిహాబ్ జుహ్రి ఇలా ఉల్లేఖించారు: 'జుమా రోజున ముఅజ్జిన్ అజాన్ ఇచ్చినట్లయితే ఎవరైనా ఒక బాటసారి దానిని విన్నట్లయితే అప్పుడు జుమా నమాజు కోసం మసీదుకు వెళ్ళటం అతనిపై వాజిబ్ అవుతుంది.'

**30.** అబూ అబ్స్ అబ్దుర్రహ్మాన్ బిన్ జుబైర్(ర) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను. 'అల్లాహ్ మార్గంలో (పని చేసిన కారణంగా) ఎవరి కాళ్ళమీదనైతే దుమ్ము, ధూళి పడుతుందో అల్లాహ్ వారిపై నరకాన్ని హరామ్ చేస్తాడు.

**31.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నానని హజ్రత్ అబూ హురైరా (ర) ఉల్లేఖించారు. నమాజు కోసం తక్బీర్ ఇవ్వ బడినప్పుడు నమాజు చెయ్యటానికి పరుగెత్తుకుంటూ రాకండి. మామూలు నడక నడుస్తూ నెమ్మదిగా, ప్రశాంతంగా రండి. తరువాత ఎంత నమాజు లభిస్తే అంత నమాజును ఇమామ్ తోపాటు చేసుకోండి. ఎంత నమాజైతే దొరకలేదో అంత నమాజును పూర్తి చేసుకోండి.

**32.** అబ్దుల్లా బిన్ అబీ ఖతాద అన్సారీ తన తండ్రిగారిని ప్రమాణంగా తీసుకుని ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు "మీరు నన్ను చూడనంతవరకు లేచి నిలబడకండి. నెమ్మదిగా నడవటాన్ని విధిగా పాటించండి".

## 18వ అధ్యాయం

**జుమా రోజున ఇద్దరు మనుషులు కలిసి కూర్చున్నచోట వారి మధ్యనుంచి చొరబడి పోకండి.**

**33.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ సల్మాన్ ఫార్సీ(రజి) ఉల్లేఖించారు: 'ఏ మనిషైతే జుమా రోజున గుసుల్ చేసుకుంటాడో, సాధ్యమైనంతవరకు పరిశుభ్రతను పాటిస్తాడో, తరువాత తలకు నూనె రాసుకుంటాడో మరియు సువాసనను బట్టలకు రాసుకుంటాడో, ఆ తరువాత మసీదుకు పోయి ఇద్దరు మనుషుల మధ్య నుంచి దూరిపోడో, తన అదృష్టంలో వ్రాయబడి ఉన్న (నఫిల్) నమాజులను చేసుకుంటాడో తరువాత ఇమామ్ వచ్చి ఖుత్బా (హితబోధ) ఇచ్చేటప్పుడు నిశ్శబ్దంగా వింటూ కూర్చుంటాడో, ఈ జుమా నుంచి మరొక జుమావరకు గల కాలంలో అతను చేసే పాపాలన్నీ క్షమించబడతాయి'.

## 19వ అధ్యాయం

**జుమారోజున ఒక ముస్లిమ్ సోదరుణ్ణి అతను కూర్చున్న స్థలం నుంచి లేపి స్వయంగా అక్కడ కూర్చోకూడదు.**

**34.** ఇబ్నె జురైజ్ ఇలా ఉల్లేఖించారు 'నేను నాఫె చెప్పగా విన్నాను. ఆయన ఇలా అన్నారు: నేను అబ్దుల్లా బిన్ ఉమర్(ర) చెప్పగా విన్నాను, ఆయన ఇలా అనేవారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక మనిషి మరొక మనిషిని (ముస్లిమ్‌ను) అతను కూర్చున్న స్థలం నుంచి అతన్ని లేపి స్వయంగా అక్కడ కూర్చోవటాన్ని నిషేధించారు. ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు: నేను, ఏమిటి ఇది జుమా రోజుకు మాత్రమే సంబంధించిన ఆదేశమా? అని నాఫెను అడిగాను. దానికి ఆయన, ఇది జుమా రోజుకు, జుమా కాని రోజులకూ, అన్ని రోజులకూ వర్తిస్తుంది' అని అన్నారు.

## 20వ అధ్యాయం

### జుమా రోజున అజాన్ ఇవ్వటం గురించి

**35.** సాయబ్ బిన్ యజీద్ ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త ముహమ్మద్(స) గారి కాలంలోను అబూబకర్(ర) మరియు ఉమర్(ర)గార్ల కాలంలో కూడా జుమారోజున మొదటి అజాన్ ఇమామ్ ఖుత్బా ఇచ్చేందుకు మెంబర్‌మీద కూర్చున్నప్పుడు ఇవ్వబడేది. హజ్రత్ ఉస్మాన్(ర)గారి కాలంలో ప్రజల సంఖ్య పెరిగినప్పుడు (మదీనాపురం జనాభా పెరిగింది) ఆయన(ర) జూరా అనే స్థలం వద్ద నుండి మూడో అజాన్‌ను ఇవ్వమని చెప్పి అజాన్ సంఖ్యను మూడుకు పెంచారు. ఇమామ్ బుఖారీ (రహ్మాలై), జూరా మదీనా పట్టణంలోని ఒక వీధిలోని స్థలం పేరు అని అన్నారు.

## 21వ అధ్యాయం

### జుమా రోజున ఒకే ముఅజ్జిన్ అజాన్ ఇవ్వటం.

**36.** సాయబ్ బిన్ యజీద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు 'జుమా రోజున మూడో అజాన్‌ను హజ్రత్ ఉస్మాన్(ర) పెంచారు. అప్పుడు మదీనాపురంలోని జనాభా పెరిగింది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి కాలంలో జుమా రోజున ఒకే ముఅజ్జిన్ అజాన్ ఇచ్చేవారు ఆ అజాన్‌ను ఇమామ్ మెంబర్ మీద కూర్చున్న తరువాతనే ముఅజ్జిన్ ఇచ్చేవారు.

## 22వ అధ్యాయం

### ఇమామ్ మెంబర్‌మీద కూర్చొని అజాన్‌ను విని దానికి సమాధానం పలకాలి.

**37.** అబూ ఉమామ బిన్ సహెల్ బిన్ హునైఫ్ ఇలా ఉల్లేఖించారు: 'నేను

ముఆవియా బిన్ అబీ సుఫ్‌యాన్ (రజిఅన్) నుంచి విన్నాను. ఆయనగారు మెంబర్ మీద కూర్చొని ఉన్నారు. అప్పుడు ముఅజ్జిన్ అజాన్ ఇచ్చాడు. అతను ఇలా పలికాడు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్. ముఆవియా(ర) కూడా ఇలా అన్నారు: 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్'. తరువాత ముఅజ్జిన్ ఇలా 'అష్‌హదుఅన్‌లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలికాడు. ముఆవియా(ర) ఇలా అన్నారు 'వఅనా' అంటే నేను కూడా ఇలాగే సాక్ష్యమిస్తున్నాను. తరువాత ముఅజ్జిన్ ఇలా పలికాడు: 'అష్‌హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్' ముఆవియ(ర) 'వఅనా' అని పలికారు. అంటే, నేను కూడా ఇలాగే సాక్ష్యమిస్తున్నాను. ముఅజ్జిన్ అజాన్ ఇవ్వటం పూర్తి అయినప్పుడు, ముఆవియ(ర) ఇలా అన్నారు : ప్రజలారా! నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నుంచి విన్నాను ఇదే స్థలంలో అంటే ఈ మెంబర్ మీద ఆయన(స) కూర్చొని ఉన్నారు. ముఅజ్జిన్ అజాన్ ఇచ్చాడు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలానే, నేను చెప్పగా మీరు విన్నదాన్ని పలికారు.

## 23వ అధ్యాయం

**జుమా కొరకు ఇచ్చే అజాన్ పూర్తి అయ్యేవరకు ఇమామ్ మెంబర్ మీదనే కూర్చొని ఉండాలి.**

**38.** సాయబ్ బిన్ యజీద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: జుమా రోజున రెండో అజాన్ ఇవ్వమని హజ్రత్ ఉస్మాన్(రజిఅన్) ఆజ్ఞాపించారు'. అప్పుడు మసీదులోకి వచ్చే ప్రజల సంఖ్య పెరిగిపోయింది. జుమారోజున ఇమామ్ మెంబర్ మీద కూర్చున్నప్పుడే అజాన్ ఇవ్వటం జరుగుతుంది.

## 24వ అధ్యాయం

**జుమాకు సంబంధించిన అజాన్‌ను ఖుత్బాకు ముందు ఇవ్వాలి.**

**39.** జుహ్‌రీ ఇలా ఉల్లేఖించారు: 'నేను సాయబ్ బిన్ యజీద్ (రజిఅన్) ఇలా చెబుతూ ఉండగా విన్నాను, జుమా నమాజుకు సంబంధించిన మొదటి అజాన్ దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలంలో ఇమామ్ ఖుత్బా ఇవ్వటానికి మెంబర్ మీద కూర్చున్న సమయంలో ఇవ్వబడేది. హజ్రత్ అబూబకర్(రజిఅన్) మరియు హజ్రత్ ఉమర్(రజిఅన్)గార్ల కాలంలోనూ ఇలాగే జరుగుతూ వచ్చింది. హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్)గారి కాలం వచ్చినప్పుడు నమాజు చేసే ప్రజల సంఖ్య చాలా ఎక్కువగా పెరిగిపోయినప్పుడు ఆయన(ర) మూడోసారి అజాన్ ఇవ్వమని ఆజ్ఞాపిం

చారు. ఈ అజాన్ జురా అనే స్థలంలో ఇవ్వబడింది. తరువాత ఈ ఆచారమే స్థిరపడి పోయింది:

## 25వ అధ్యాయం

**ఖుత్బాను మెంబర్ మీద నుంచి చదవటం. హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా అన్నారు: దైవప్రవక్త ముహమ్మద్(స) ఖుత్బాను మెంబర్ మీద నుంచి వినిపించారు.**

**40.** అబూ హాజిమ్ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు: 'కొందరు ప్రజలు సహెల్ బిన్ సాద్ సాయిదీ వద్దకు వెళ్ళారు. వారు దైవప్రవక్త(స)గారి మెంబర్‌ను గురించి, అది చెయ్యబడిన కర్ర ఏ వృక్షానికి చెందినది- అనే విషయం గురించి తగవు లాడుకుంటు న్నారు. వారు ఈ విషయం గురించి ఆయన్ని అడిగారు. ఆయన ఇలా అన్నారు: 'దేవుని సాక్షిగా చెబుతున్నాను! అది ఎలాంటి కర్రో ఏ చెట్టుకు చెందినదో నేను ఎరుగు దును. ఇంకా ఏ రోజునైతే అది అక్కడ పెట్టబడిందో, మొట్ట మొదటి సారిగా దైవ ప్రవక్త(స) దాని మీద ఎప్పుడు కూర్చున్నారో కూడా నేను ఎరుగుదును. జరిగింది ఏమిటంటే, దైవప్రవక్త(స) ఒక అన్సారీ మహిళ వద్దకు ఇలా కబురు పంపారు. (సహెల్ ఆమె పేరును కూడా చెప్పారు). వడ్రంగి కూడా అయిన నీ బానిసకు చెప్పు- 'ప్రజలకు హితోప దేశం చేసేటప్పుడు నేను కూర్చోవటానికి అనువైన మెంబర్ లాంటి కొన్ని చెక్కలను నా కోసం చెయ్యమని'. ఆమె తన బానిసకు అదే విధంగా ఆజ్ఞాపించారు. ఆ బానిస గాబాకు చెందిన ప్రసిద్ధిగాంచిన ఒక చెట్టుకర్రతో మెంబర్‌ను తయారు చేసి ఆ స్త్రీ వద్దకు తీసుకువచ్చాడు. ఆమె దానిని దైవ ప్రవక్త(స) గారి వద్దకు పంపారు. తరువాత దైవప్రవక్త(స)గారి ఆజ్ఞానుసారం అది మస్జిద్‌లో పెట్టబడింది'. సహెల్ ఇలా అన్నారు : తరువాత దైవప్రవక్త(స)గారు దాని మీదనే నమాజు చెయ్యటం ప్రారంభించటాన్ని నేను చూశాను. తక్బీర్ పలికారు, రుకూ కూడా దానిమీదనే చేశారు. రుకూ తరువాత వెనక్కి జరిగి క్రిందికి దిగారు. క్రిందికి దిగిన తరువాత దాని అడుగు భాగాన నేలమీద సజ్దా చేశారు. ఆ తరువాత మెంబర్ మీదకు వెళ్ళిపోయారు. (రెండో రకాతులో కూడా అలాగే చేశారు). నమాజు ముగిసిన తరు వాత ప్రజల వైపునకు తన ముఖాన్ని త్రిప్పి ఇలా సెలవిచ్చారు: 'నేను ఇలా ఎందుకు చేశానంటే, మీరు నన్ను అనుసరించాలని. మరియు నేను చేసే నమాజును నేర్చుకో వాలని'.

**41.** హ్రజత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: '(మస్జిదె నబవీలో) ఒక ఖర్జూరపు చెట్టు బోదె ఉండేది. దైవప్రవక్త(స) ఖుత్బా వినిపించేటప్పుడు ఆ బోదే మీద నిలబడేవారు. కాని ఆయన(స)గారి కోసం మసీదులో ఒక మెంబర్‌ను తెచ్చిపెట్టినప్పుడు, ఆ చెట్టు బోదెలోనుంచి మేము ఏడ్పు ధ్వనిని విన్నాము. ఆ ఏడ్పు ధ్వని పది మాసాల సూడి ఒంటె ఏడ్పు ధ్వని మాదిరిగా ఉన్నది. దైవ ప్రవక్త(స) బోదె యొక్క ఈ స్థితిని గమనించినప్పుడు, మెంబర్ మీద నుంచి కిందికి దిగివచ్చి తన పవిత్ర హస్తాన్ని ఆ బోదెపై ఉంచారు. (అప్పుడు బోదెలో నుంచి వచ్చే ధ్వని ఆగిపోయింది)

**42.** సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'నా తండ్రి గారైన అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహ మ్మద్(స) ఒకసారి మెంబర్ మీద నుంచి ఖుత్బా ఇస్తున్నారు. ఆయన(స) ఇలా చెప్పటాన్ని నేను విన్నాను: "ఎవరైతే జుమా నమాజుకు వస్తారో వారు గుసుల్ చేసుకుని మరీ రావాలి."

## 26వ అధ్యాయం

**ఖుత్బా నిలబడి ఇవ్వటం. హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు : ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నిలబడి ఖుత్బా వినిపించారు.**

**43.** హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నిలబడి ఖుత్బా పఠించేవారు. తరువాత (అంటే మొదటి ఖుత్బా తరువాత) కూర్చునేవారు, ఆ తరువాత నిలబడేవారు, మీరు ఇప్పుడు చేస్తున్న విధంగా;

## 27వ అధ్యాయం

**ఇమామ్ ఖుత్బా పఠించేటప్పుడు ప్రజలు తమ ముఖాన్ని ఇమామ్ వైపునకు త్రిప్పాలి. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) మరియు అనస్(ర) (ఖుత్బాలో) ఇమామ్ వైపునకు ముఖాన్ని త్రిప్పారు.**

**44.** హ్రజత్ అబూసయీద్ ఖుద్రీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'ఒకరోజున దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మెంబర్ మీద కూర్చున్నారు. మేమందరం ఆయన చుట్టూ కూర్చున్నాము.

## 28వ అధ్యాయం

**ఖుత్బాలో అల్లాహ్ యొక్క 'హమ్ద్ వ సనా' (స్తుతి స్తోత్రాలు) తరువాత 'అమ్మా బాద్' (దీనితరువాత) అని అనటం. ఈ విష యాన్ని ఇక్రిమా (ర) గారు ఇబ్నె అబ్బాస్(ర) నుంచి ఉల్లేఖించారు. ఆయన దైవప్రవక్త(స)గారినుంచి ఉల్లేఖించారు.**

**45.** అమ్రూ బిన్ తగ్లిబ్ ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి వద్దకు కొంతధనం లేక ఒక వస్తువు తీసుకురాబడింది. ఆయన(స)గారు దానిని ప్రజలకు పంచిపెట్టారు. కొందరికి ఇచ్చారు. మరికొందరికి ఇవ్వలేదు. తరువాత ఎవరికైతే ఇవ్వలేదో వారు కోపంగా ఉన్నారు అనే సమాచారం ఆయన(స)కు చేరింది. దైవ ప్రవక్త(స) అల్లాహ్ యొక్క 'హమ్ద్ వ సనా' చేశారు. మరియు ఇలా సెలవిచ్చారు: "అమ్మాబాద్! దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను ఒక వ్యక్తికి (ధనం మొదలైన వాటిని) ఇస్తాను. మరొక వ్యక్తికి ఇవ్వను. ఎవరికైతే ఇవ్వనో నేను అతన్ని, ఇచ్చినవాని కంటే ఎక్కువగా ఇష్టపడతాను. కాని ఎవరికైతే నేను ఇస్తానో వారికి ఎందుకిస్తానంటే, వారి హృదయాలలో సహనం, సంతృప్తి లేవని నేను భావిస్తున్నాను. ఎవరికైతే నేను ఇవ్వనో వారు సహనశీలురు, ఆత్మ తృప్తి కలవారు. అల్లాహ్ వారి హృదయాలలో మంచితనాన్ని మేలును మరియు ధనాన్ని పెట్టాడు. అమ్రూ బిన్ తగ్లిబ్ కూడా వారిలోని ఒకరు.' అమ్రూ బిన్ తగ్లిబ్ ఇలా అన్నారు : 'దేవుని సాక్షిగా చెబుతున్నాను, ఏ మాటలైతే దైవప్రవక్త(స) నన్ను గురించి సెలవిచ్చారో ఆ మాటలకు బదులుగా ఎర్రని మేలు జాతి ఒంటెలు నాకు లభించినా నాకు అంత సంతోషం కలిగి ఉండేదికాదు.'

**46.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అర్ధరాత్రివేళ తన గదిలోనుంచి బయటికి వచ్చేశారు. ఆయన(స)గారు మసీదులో తరావీహ్ నమాజు చేశారు. ప్రజలు కూడా ఆయన(స) గారితో కలిసి నమాజు చేశారు. మరునాడు ఉదయం ప్రజలు ఈ విషయం గురించి చర్చించుకున్నారు. అప్పుడు మొదటి రాత్రికంటే ఎక్కువ సంఖ్యలో ప్రజలు మరుసటి రోజున మసీదుకు వచ్చి దైవప్రవక్త(స) గారితో కలిసి నమాజు చేశారు. తరువాత ఉదయం పూట ప్రజలు మళ్ళీ దాన్ని గురించి విస్తృతంగా చర్చించుకున్నారు. మూడో రాత్రి మసీదులో మరింత ఎక్కువ సంఖ్యలో ప్రజలు సమావేశమయ్యారు. దైవ

ప్రవక్త(స) తన గదిలోనుంచి బయటికి వచ్చారు. ప్రజలు ఆయన(స)గారితో కలిసి నమాజు చేశారు. నాలుగో రాత్రి అయితే ప్రజలు మసీదులో ఎంత పెద్దసంఖ్యలో సమావేశమయ్యారంటే మసీదులో అసలు స్థలమనేదే మిగలకుండా పోయింది. (కాని దైవప్రవక్త(స) గారు తన గదిలోనుంచి బయటకు రాలేదు) ఫజ్ర్ నమాజు సమయంలో ఆయన(స)గారు బయటికి వచ్చారు. నమాజు పూర్తిచేసిన తరువాత ఆయన (స)గారు తన ముఖాన్ని ప్రజల వైపునకు త్రిప్పారు. మరియు 'తషహ్హుద్'ను పఠించారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చారు, 'అమ్మాబాద్' మీరు మసీదులో సమావేశమయ్యారనే విషయం నాకు తెలిసింది. కాని నేను బయటికి రాలేదు. ఎందుకంటే, ఈ నమాజు మీపై విధిగా చెయ్యబడుతుందేమో, దానిని ఆచరించటం మీకు సాధ్యంకాదేమో అని నేను భయపడ్డాను. అఖీల్‌తోపాటు ఈ హదీసును యూనుస్ కూడా జుహ్రీ నుంచి ఉల్లేఖించారు:

**47.** హజ్రత్ అబూ హుమైద్ సాయిదీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకనాటి రాత్రి (ఇషా) నమాజు తరువాత లేచి నిలబడ్డారు. మరియు తషహ్హుద్ పఠించారు. ఇంకా అల్లాహ్‌ను ఎలా స్తుతిస్తే ఆయనకు తగిన విధంగా ఉంటుందో అలా స్తుతించారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చారు: 'అమ్మాబాద్. జుహ్రీతోపాటు ఈ హదీసును అబూ ముఆవియ మరియు అబూ ఉసామా కూడా హిష్షామ్ బిన్ ఉర్వా నుంచి ఉల్లేఖించారు.

**48.** మిస్‌వర్ బిన్ మఖ్‌రమా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుత్బా ఇవ్వటానికి లేచి నిలబడ్డారు. స్వయంగా నేను విన్నాను. ఆయన(స)గారు తషహ్హుద్ పఠించి 'అమ్మాబాద్' అని అన్నారు. షుఐబ్‌తో పాటు ఈ హదీసును ముహమ్మద్ బిన్ వలీద్ జుబైదీ కూడా జుహ్రీ నుంచి ఉల్లేఖించారు.'

**49.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి (మరణ కారణమైన వ్యాధిలో ఉన్నప్పుడు) మెంబర్ మీదకు ఎక్కారు. ఇది ఆయన(స)గారు కూర్చున్న చిట్టచివరి సమావేశం. అప్పుడు ఆయన(స)గారు తన భుజాలమీద ఒక దుప్పటిని కప్పుకుని ఉన్నారు, ఇంకా ఒక నల్లని గుడ్డను తన శిరస్సుకు కట్టుకుని ఉన్నారు. ఆయన(స)గారు అల్లాహ్ యొక్క

హమ్‌ద్ వ సనా చేశారు. తరువాత ఇలా సెలవిచ్చారు : "ప్రజలారా! నాకు దగ్గరగా రండి. వారందరూ ఆయన(స) వద్దకు వచ్చి ఆయన(స) చుట్టూ కూర్చున్నారు. అప్పుడు ఆయన(స)ఇలా సెలవిచ్చారు; 'అమ్మాబాద్! చూడండి! ఈ అన్సారు తెగకు చెందిన ప్రజలు (ఇప్పుడు వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు) భవిష్యత్తులో తగ్గిపోతారు. ఇతర తెగలకు చెందిన ప్రజలు పెరిగిపోతారు. తరువాత ముహమ్మద్(స) సంఘానికి చెందిన వ్యక్తి ఎవరైనా అధికారాన్ని పొందటం వల్ల ఎవరికైనా లాభనష్టాలు కలిగించ గలిగినప్పుడు అతను అన్సారు ప్రజల్లోని సజ్జనుల సత్కార్యాలను స్వీకరించాలి. మరియు వారిలోని దుర్జనుల చెడును మన్నించాలి."

## 29వ అధ్యాయం

### జుమా రోజున రెండు ఖుత్బాల మధ్య (కాసేపు) కూర్చోవటం.

**50.** హజ్రత్ ఉబైదుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర)ఇలా అన్నారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమా రోజున రెండు ఖుత్బాలు పఠించేవారు. మరియు వాటి మధ్య కూర్చునేవారు.'

## 30వ అధ్యాయం

### జుమా రోజు ఖుత్బాను శ్రద్ధగా చెవి యొగ్గి వినటం.

**51.** హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; జుమారోజు వచ్చి నప్పుడు, దైవదూతలు ఏమి చేస్తారు? వారు (జుమా) మసీదు ద్వారం దగ్గర నిలబడి నమాజుకు వచ్చేవారి పేర్లు రాసుకుంటారు. మొదట వచ్చిన మనిషి పేరు మొదట, తరువాత వచ్చిన వ్యక్తి పేరు తరువాత. ఎవరైనా ఇంకా పెందలకడ మసీదుకు వస్తే అతని ఉపమానం ఒక ఒంటెను ఖుర్బానీ ఇచ్చిన వ్యక్తి లాంటిది. తరువాత వచ్చిన వ్యక్తి ఆవును ఖుర్బానీ ఇచ్చిన వ్యక్తిలాంటివాడు. ఆ తరువాత వచ్చిన వ్యక్తి ఒక పొట్టేలును ఖుర్బానీ ఇచ్చిన వ్యక్తిలాంటివాడు. ఆ తరువాత వచ్చిన మనిషి ఉదాహరణ ఒక కోడిని ఖుర్బానీ ఇచ్చిన మనిషి లాంటిది. ఆ పిదప వచ్చిన వ్యక్తి ఉపమానం ఒక గుడ్డును ఖుర్బానీ ఇచ్చిన వ్యక్తిలాంటిది. ఆ తరువాత ఇమామ్ ఖుత్బా ఇవ్వటానికి బయలుదేరినప్పుడు, ఆ దైవదూతలు తమ తమ పట్టికలను ముడుచుకుని ఖుత్బాను శ్రద్ధగా, చెవియొగ్గి ఉంటారు.'

## 31వ అధ్యాయం

**ఇమామ్ ఖుత్బా ఇచ్చే స్థితిలో ఉన్నప్పుడు ఒక మనిషి ఎవరైనా మసీదులోకి ప్రవేశిస్తే ఆ మనిషిని రెండు రకాతుల 'తహియతుల్ మస్జిద్' నమాజు చెయ్యమని ఇమామ్ ఆజ్ఞాపించగలడు.**

**52.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు– జుమా రోజున ఒక మనిషి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుత్బా పఠిస్తున్న సమయంలో మసీదులోకి ప్రవేశించాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; మంచి మనిషివే! నీవు (తహియతుల్ మస్జిద్) నమాజు చేశావా? అతను, లేదు అని సమాధానం చెప్పాడు. అప్పుడు దైవప్రవక్త(స) "నీవు లేచి నిలబడు, రెండు రకాతుల నమాజు చెయ్యి." అని సెలవిచ్చారు.

## 32వ అధ్యాయం

**ఖుత్బా అవుతూ ఉన్నప్పుడు, ఎవరైనా మసీదులోకి ప్రవేశిస్తే అప్పుడు అతను తేలికపాటి నమాజు రెండు రకాతులు చేసుకోవాలి.**

**53.** హజ్రత్ జాబిర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమారోజున ఖుత్బా పఠిస్తూ ఉన్నప్పుడు ఒక వ్యక్తి మసీదులోకి ప్రవేశించాడు. ఆయన(స)గారు అతన్ని, నీవు తహ్యతుల్ మస్జిద్ నమాజు చేశావా? అని అడిగారు. అతను 'లేదు'అని జవాబు పలికాడు. అప్పుడు ఆయన(స) 'లేచి రెండు రకాతులు నమాజు చేసుకో' అని సెలవిచ్చారు.

## 33వ అధ్యాయం

**ఖుత్బాలో రెండు చేతులు ఎత్తి దుఆ చెయ్యటం.**

**54.** హజ్రత్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమా రోజున ఖుత్బా పఠిస్తూ ఉన్నారు. ఇంతలో ఒక వ్యక్తి మసీదులోకి వచ్చి ఇలా అనసాగాడు, 'ఓ దైవప్రవక్తా(స)! వర్షం కురవక పోవడం వల్ల గుర్రాలు ఎన్నో నాశనమైపోయాయి. ఎన్నో మేకలు చనిపోయాయి. కనుక వర్షాన్ని కురిపించమని దుఆ చెయ్యండి'. అప్పుడు దైవప్రవక్త(స) తన రెండు చేతులు ఎత్తి అల్లాహ్‌ను ప్రార్థించారు.

## 34వ అధ్యాయం

### జుమారోజున ఖుత్బా ప్రసంగంలో వర్షం కోసం దుఆ చెయ్యటం.

**55.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలంలో ఒకసారి ప్రజలమీద కరువు కాటకాలు విరుచుకుపడ్డాయి. అప్పుడు దైవప్రవక్త(స)గారు జుమా రోజున మసీదులో ఖుత్బా పఠిస్తున్నారు. ఆ సమయంలో ఒక పల్లెటూరు మనిషి లేచి నిలబడి ఇలా విన్నవించుకున్నాడు 'ఓ దైవప్రవక్తా(స)! మా వద్ద ఉన్న సంపద అంతా నాశనమైపోయింది. చిన్నపిల్లలు ఆకలిదప్పుల బాధకు తట్టుకోలేక మరణిస్తున్నారు. మీరు మా కోసం దుఆ చెయ్యండి'. అప్పుడు ఆయన(స)గారు దుఆ కోసం తన రెండు చేతుల్ని పైకి ఎత్తారు. ఆ సమయంలో ఆకాశం మీద మబ్బు తునక ఒక్కటి కూడా లేదు. కాని, ఏ దేవుని చేతుల్లోనైతే నా ప్రాణం ఉన్నదో, ఆ దేవుని సాక్షిగా చెబుతు న్నాను! దైవప్రవక్త(స) తన చేతుల్ని ఇంకా కిందికి దించనేలేదు. పర్వతాల్లాంటి మేఘాలు ఆకాశాన్ని కమ్ముకున్నాయి. ఆయన(స) మెంబర్ మీద నుంచి ఇంకా క్రిందికే దిగలేదు. నేను చూశాను ఆయన(స)గారి పవిత్రమైన గడ్డంమీద వర్షపు చినుకులు కురుస్తున్నాయి. ఆ రోజున పెద్ద వర్షమే కురిసింది. రెండో రోజు కూడా, మూడోరోజు కూడా వర్షం బాగానే కురిసింది. తరువాత నాలుగో రోజు కూడా వర్షం పడింది. చివరకు రెండో జుమా వచ్చేవరకు ఈ వర్షం ధారాపాతంగా కురుస్తూనే ఉంది. ఆ తరువాత ఆ పల్లెటూరి మనిషో లేక మరొక వ్యక్తి ఎవరో లేచి నిలబడ్డాడు. మరియు ఇలా విన్నవించుకున్నాడు, 'ఓ దైవప్రవక్తా(స)! ఇళ్ళు కూలిపోయాయి. ధనధాన్యాలు మునిగిపోయాయి. కనుక మీరు మాకోసం అల్లాహ్‌ను ప్రార్థించండి'. అప్పుడు ఆయన(స) తన రెండు చేతుల్ని పైకెత్తి ఇలా దుఆ చేశారు: ఓ అల్లాహ్! మా పరిసర ప్రాంతాల్లోనైతే వర్షాన్ని కురిపించు. కాని మాపై వర్షాన్ని కురిపించటం ఆపెయ్యి. తరువాత ఆయన(స) ఆ సమయంలో ఆకాశం మీద ఉన్న ఏ మబ్బు తునక నైతే సైగచేసి సూచిస్తారో అది వెంటనే అక్కణ్ణుంచి తొలగిపోతుంది. చివరకు మదీనా పురం అంతా ఒక పెద్ద గుండ్రని వృత్తంగా మారిపోయింది. ఇంకా ఖనాత్ కాలువ నెల రోజులవరకు నిరవధికంగా ప్రవహిస్తూనే ఉన్నది. మనుషులు ఎటువైపునుంచి వచ్చినా వారు భారీ వర్షాలను గురించే ప్రస్తావించేవారు.

## 35వ అధ్యాయం

**జుమా రోజున ఖుత్బా ప్రసంగం జరిగే సమయంలో మౌనంగా ఉండటం.**

ఎవరైనా ఖుత్బా ప్రసంగం జరిగేటప్పుడు తన సహచరునితో 'మౌనంగా ఉండు' అని అంటే, అతనే స్వయంగా ఒక నిరర్థకమైన పనిని చేశాడన్న మాట. సల్మాన్ ఫార్సీ(రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, ఉల్లేఖించారు: ఇమామ్ ఖుత్బా ప్రసంగాన్ని ప్రారంభించినపుడు నిశ్శబ్దంగా ఉండాలి."

**56.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: జుమారోజున ఇమామ్ ఖుత్బా ఇస్తూ ఉన్న సమయంలో నీవు గనక (నీ సహచరునితో) 'మౌనంగా ఉండు అని అంటే, అప్పుడు నిస్సందేహంగా స్వయంగా నీవే ఒక (వ్యర్థమైన) పనిని చేశావన్న మాట.[1]

## 36వ అధ్యాయం

**జుమా రోజున ఒక ఘడియ ఉంది. ఆ ఘడియలో దుఆ చేస్తే అది దైవ స్వీకారానికి నోచుకుంటుంది.**

**57.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) గారే ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) జుమారోజున హితబోధ చేస్తూ ఇలా సెల విచ్చారు: "జుమా రోజున ఒక ఘడియ కాలం వస్తుంది. ఖచ్చితంగా ఆ ఘడియ కాలంలో ముస్లిమ్ దాసుడు ఎవరైనా నిలబడి నమాజు చేస్తే మరియు ఏదైనా వస్తువును ఇవ్వమని అల్లాహ్‌ను వేడుకుంటే, అప్పుడు అల్లాహ్ ఆ దాసునికి ఆ వస్తువును తప్పకుండా ప్రసాదిస్తాడు". ఇంకా ఆయన(స) గారు తన చేత్తో సైగ చేసి చూపించారు. మరియు ఇలా అన్నారు: "ఆ ఘడియ కొద్దిసేపు మాత్రమే ఉంటుంది."

## 37వ అధ్యాయం

**ఒకవేళ జుమా నమాజులో నుంచి కొందరు ఇమామ్‌ను వదిలి వెళ్లిపోయినా,**

---

56–1. సైగ ద్వారా వద్దని చెప్పాలి. లేదా ఒక చిన్న కంకర రాయి విసిరి అయినా చెప్పాలి. ఒక ఉల్లేఖనంలో ఏమని ఉందంటే, అతని జుమా నమాజు కాలేదు. అతను చేసిన నమాజు జొహర్ నమాజు అయిపోయింది. అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజిఅన్) గారి ఒక హదీసులో ఇలా ఉంది: ఎవడైతే జుమా రోజున ప్రజల మెడల మీదుగా దూకుతూ లోపలకు పోయాడో అతను చేసిన జుమా నమాజు జొహర్ నమాజు అయిపోయింది.

అప్పుడు ఇమామ్, మిగతా ముఖ్తదీలు చేసే నమాజు ధర్మసమ్మతమైనదే.

**58.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా సెలవిచ్చారు: ఒకసారి మేము దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి నమాజులో ఉన్నాము. అప్పుడు (కొన్ని ఒంటెలు) ధాన్యపు బస్తాలను మోస్తున్న ఒక బృందం వచ్చింది. మసీదులోని ప్రజలు (ప్రసంగం వినకుండా) వాటిని చూడటానికి వెళ్ళిపోయారు. అప్పుడు మసీదులో దైవప్రవక్త(స) గారి వద్ద కేవలం పన్నెండు మంది మనుషులు మాత్రమే మిగిలి పోయారు. ఈ సందర్భంలో ఈ ఖురాను వాక్యం అవతరించింది. "వారు వ్యాపారం, వినోద క్రీడలు జరుగుతూ ఉండగా చూసి, అటు వైపు పరుగెత్తారు నిన్ను నిలబడి ఉన్న స్థితిలో వదిలివెళ్ళిపోయారు."

*(జుముఅ- 11)*

## 38వ అధ్యాయం

**జుమాకు ముందు మరియు జుమాకు తరువాత సున్నత్ నమాజు చెయ్యటం.**

**59.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్ (సఅసమ్) గారు జొహర్ నమాజుకు ముందు రెండు రకాతుల నమాజును మరియు జొహర్ నమాజు తరువాత కూడా రెండు రకాతుల నమాజును చేసేవారు. మగ్రిబ్ తరువాత తమ ఇంట్లో రెండు రకాతులు మరియు ఇషా తరువాత కూడా రెండు రకాతులు చేసేవారు. కాని జుమా నమాజు తరువాత మసీదులో ఏ నమాజునూ చేసేవారు కాదు. అయితే ఇంటికి తిరిగి వచ్చిన తరువాత రెండు రకాతుల నమాజు చేసేవారు.

## 39వ అధ్యాయం

**(దివ్యఖుర్ఆన్‌లోని అల్ జుముఅహ్ సూరాలో) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'జుమా నమాజు ముగిసిన తరువాత భూమిపై వ్యాపించండి, అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి'.**

**60.** సహెల్ బిన్ సాద్ సాయిదీ (రజి) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- మాలో ఒక మహిళ కూడా ఉండేది. ఆమెకు పొలాలు, తోటలు ఉండేవి. ఆమె తన

పొలాలలో ప్రవహించే కాలువ గట్టుల మీద బీట్‌రూట్ దుంపలను పండించేది. జుమారోజు వచ్చినప్పుడు ఆ మహిళ బీట్‌రూట్ దుంపలను భూమిలోనుంచి తీసి ఒక కుండలో పోసి వండేది. దాని మీద ఓ గుప్పెడు బార్లీ పిండిని చల్లేది. అప్పుడు బీట్‌రూట్ దుంపలు బాగా ఉడికిన తరువాత మాంసపు ముక్కల మాదిరిగా అయిపోయేవి. మేము జుమా నమాజు చేసిన తరువాత ఆ మహిళ ఇంటికిపోయి ఆమెకు సలామ్ చేసేవారము. అప్పుడు ఆమె ఈ ఆహారాన్ని మా ముందు పెట్టేది. మేము దానిని శుబ్బరంగా తినేసేవారము. ఈ భోజనం కారణం గానే మేము జుమాకోసం ఎదురు చూసేవారము. జుమా రోజును ఆకాంక్షించేవారము.

**61.** సహెల్ బిన్ సాద్(రజి) ఇదే హదీస్‌లో ఈ విషయాన్ని అదనంగా ఉల్లేఖించారు, సహెల్ ఇలా అన్నారు: 'మేము జుమా నమాజు చేసిన తరువాతనే మధ్యాహ్న భోజనం చేసేవారము. మరియు పండుకుని నిద్రపోయేవారము.'

## 40వ అధ్యాయం

### జుమా నమాజు తరువాత పండుకోవటం.

**62.** హుమైద్ తవీల్ ఇలా అన్నారు: నేను హజ్రత్ అనస్(రజి) చెబుతూ ఉండగా విన్నాను. ఆయన(ర) ఇలా అన్నారు, 'మేము జుమా నమాజును పెందల కాడనే చేసుకునేవారము. ఆ తరువాతనే మధ్యాహ్నపు నిద్రకు ఉపక్రమించేవారము.'

**63.** సహెల్ బిన్ సాద్ (రజి) ఇలా ఉల్లేఖించారు: 'మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి జుమా నమాజు చేసేవారము. ఆ తరువాతనే మధ్యాహ్నపు నిద్రకు ఉపక్రమించేవారము.'

# భయానికి సంబంధించిన నమాజుల అధ్యాయాలు

## 1వ అధ్యాయం

భయం నమాజును గురించి దివ్యఖుర్‌ఆన్‌లోని నిసా సూరాలో కరుణామయు డైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీరు ప్రయాణానికి బయలుదేరినప్పుడు నమాజును సంక్షిప్తం చేస్తే అది తప్పుకాదు, (ముఖ్యంగా) అవిశ్వాసులు మిమ్మల్ని వేధిస్తారనే భయం మీకు కలిగినప్పుడు. ఎందుకంటే వారు మీతో బహిరంగ వైరానికి పూనుకున్నారు. ఓ ప్రవక్తా(స)! నీవు ముస్లింల మధ్య ఉండి (పోరాటం జరుగుతూ ఉండగా) నమాజు చేయించటానికి వారితో నిలబడితే, వారిలోని ఒక వర్గం నీతోపాటు నిలబడాలి. ఇంకా వారు అస్త్రధారులై ఉండాలి. వారు తమ సజ్‌దాను పూర్తి చేసుకుంటే వెనక్కి వెళ్ళి పోవాలి. అప్పుడు ఇంకా నమాజు చెయ్యని రెండోవర్గం వచ్చి నీతోపాటు కలిసి నమాజు చెయ్యాలి. వారు కూడా జాగరూకులై ఉండాలి. తమ ఆయుధాలను ధరించి ఉండాలి. ఎందుకంటే, మీరు మీ ఆయుధాలపట్ల, మీ సామానులపట్ల ఏ కొద్దిపాటి అజాగ్రత్త చూపినా మీపై ఒక్క సారిగా విరుచుకుపడాలని అవిశ్వాసులు కాచుకుని ఉన్నారు. అయితే వర్షంవల్ల మీకు ఇబ్బందిగా ఉంటే, లేక మీరు అస్వస్థులైతే ఆయుధా లను దించటం తప్పుకాదు. అయినప్పటికీ మీ జాగ్రత్తలో మీరు ఉండాలి. అవిశ్వాసుల కొరకు అల్లాహ్ నిశ్చయంగా అవమానకరమైన శిక్షను సిద్ధంచేసి ఉంచాడు." **(101, 102)**

**64.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారితో కలిసి నజ్ద్ వైపునకు జిహాద్ కోసం వెళ్ళాను. మేము శత్రువులను ఎదుర్కొన్నాము మరియు బారులు తీరి నిలబడ్డాము. అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్(స) మాచేత నమాజు చేయించటానికి నిలబడ్డారు. రెండోవర్గం వారు శత్రువులతో పోరాడుతున్నారు. తరువాత దైవప్రవక్త మహా శయులు (స) రుకూ చేశారు. మరియు నమాజులో ఆయన(స)గారితో పాటు నిలబడ్డ వారు కూడా రుకూ చేశారు. ఆ తరువాత ఆయన(స) రెండు సజ్‌దాలు చేశారు. ఆ పిదప ఈ వర్గంవారు ఇంకా నమాజు చెయ్యనటువంటి వర్గం వారి స్థలం వద్దకు వెళ్ళిపోయారు. వారు వచ్చినప్పుడు దైవప్రవక్త(స) వారితో కూడా ఒక రుకూ

రెండు సజ్దాలు చేశారు. తరువాత సలామ్ చేశారు. ఇప్పుడు ఈ వర్గంలోని ప్రతి ఒక్క మనిషి నిలబడ్డాడు. మరియు ఒక్కొక్క రుకూ రెండేసి సజ్దాలు చేసి తాము పొందలేకపోయిన రకఅత్‌ను పూర్తిచేశారు.'

## 2వ అధ్యాయం

### నమాజె ఖౌఫ్‌ను నడుస్తూ, స్వారీ చేస్తూ చెయ్యటం.

**65.** హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్)గారే ఒక ఉల్లేఖనంలో ఈ విషయాన్ని అదనంగా చెప్పారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ శత్రువులు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పుడు నడుస్తూనో మరియు స్వారీ చేస్తూనో ఎలా సాధ్యపడితే అలా నమాజు చెయ్యాలి."

## 3వ అధ్యాయం

### నమాజె ఖౌఫ్‌లో నమాజీలు పరస్పరం ఒకరినొకరు రక్షించుకుంటారు.

**66.** హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) (యుద్ధ మైదానంలో) నిలబడి ఉన్నారు. ప్రజలు కూడా ఆయన(స)తో పాటు నిలబడి ఉన్నారు ఆయన(స) తక్బీర్ పలికారు. జనులందరు కూడా ఆయన(స)గారితోపాటు తక్బీర్ పలికారు. తరువాత ఆయన(స) రుకూ చేశారు. తరువాత ఆయన సజ్దా చేసినప్పుడు కొందరు జనులు మాత్రమే ఆయన(స)గారితో పాటు సజ్దా చేశారు. ఆ పిదప ఆయన(స)గారు రెండో రకాతు చెయ్యటం కోసం నిలబడ్డారు. ఎవరైతే రుకూ సజ్దాలు ఆయన(స)గారితోపాటు చేసి ఉన్నారో వారు నిలబడే తమ తోటి సోదరులను కనిపెట్టి ఉన్నారు, కాపాడుతూ ఉన్నారు. అంతలో రెండో వర్గంవారు వచ్చారు. వారు ఆయన(స)గారితో రుకూ మరియు సజ్దాలు చేశారు. ఈ విధంగా ప్రజలందరూ నమాజులోనే నిమగ్నమై ఉన్నారు. కాని పరస్పరం ఒకరినొకరు కాపలా కాస్తూ ఉన్నారు.

## 4వ అధ్యాయం

### కోటలపై దాడి జరుగుతూ ఉన్నప్పుడు, విజయం లభించే అవకాశం ఉన్నప్పుడు మరియు శత్రువును ఎదుర్కొన్నప్పుడు- నమాజు చెయ్యవచ్చునా?

**67.** హ్రజత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి హ్రజత్ ఉమర్(రజిఅన్) కందకాల యుద్ధం నాడు ఖురైష్ అవిశ్వాసులను

దూషిస్తూ, శాపనార్థాలు పెట్టుకుంటూ వచ్చారు. మరియు ఇలా విన్నవించుకో సాగారు 'ఓ దైవప్రవక్తా(స)! నేను అస్ర్ నమాజును సూర్యుడు అస్తమించే సమయం వరకూ చెయ్యలేకపోయాను.' దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: "(నీవైతే చివరి సమయంలోనైనా అసర్ నమాజును చెయ్యగలిగావు) దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. నేనైతే అస్ర్ నమాజును ఇంతవరకు చెయ్య నేలేదు.' తరువాత ఆయన(స) గారు (మదీనాపురంలోని) బత్‌హాన్ అనే ఒక లోయలో దిగి అక్కడ వుజూ చేసుకుని అస్ర్ నమాజు చేశారు. సూర్యుడు అస్తమించాడు. తరువాత మగ్రిబ్ నమాజును చేశారు.

## 5వ అధ్యాయం

**ఎవరైనా శత్రువును వెంటాడుతూ వున్నట్లయితే లేక శత్రువు అతన్ని తరుముతూ ఉన్నట్లయితే అప్పుడు అతను వాహనం మీద ఉండే, సైగల ద్వారానే నమాజు చేసుకోవచ్చు.**

వలీద్ బిన్ ముస్లిమ్ ఇలా అన్నారు 'నేను ఇమామ్ అవ్‌జాయిగారి ముందు షుర్‌హబీల్ బిన్ సమ్‌త్ మరియు ఆయనగారి సహచరులు చేసిన నమాజునుగురించి ప్రస్తావించాను. వారు వాహనం మీద ఉండే నమాజు చేశారు. ఆయన ఇలా అన్నారు, 'మా విధానం కూడా ఇదే, నమాజు ఖజా అయి పోతుందనే భయం కలిగినప్పుడు వలీద్, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ఈ సూక్తిని ప్రమాణంగా తీసుకున్నారు." మీలో ఎవరైనా సరే బనీ ఖురైజాకు చేరనంతవరకు అస్ర్ నమాజును చెయ్యకూడదు."

## 6వ అధ్యాయం

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖందఖ్ (అహ్‌జాబ్) యుద్ధం నుంచి తిరిగి వచ్చినప్పుడు ఇలా సెలవిచ్చారు; ఏ వ్యక్తి కూడా బనీ ఖురైజాలోని వీధిలోకి ప్రవేశించనంతవరకు అస్ర్ నమాజును చెయ్యకూడదు. తరువాత మార్గమధ్యంలోనే అస్ర్ నమాజు సమయం వచ్చేసింది. వారిలోని కొందరు ఏమన్నారంటే 'మేమైతే దైవప్రవక్త(స)గారు ఆజ్ఞాపించిన విధంగా బనీ ఖురైజా వాడకు చేరనంతవరకు అస్ర్ నమాజును చెయ్యము మరికొందరు ఇలా అన్నారు 'మేము నమాజును చేసుకుంటాము. ఎందుకంటే, నమాజును ఖజా చెయ్యటం అనేది దైవప్రవక్త(స)గారి ఉద్దేశం కాదు. తరువాత

దైవప్రవక్త(స) గారిముందు ఈ విషయాన్ని ప్రస్తావించినప్పుడు ఆయన(స)వారిలో ఎవరినీ నిందించలేదు.

## 7వ అధ్యాయం

**శత్రువుపై మెరుపు దాడి చేసేముందు ఫజ్ర్ నమాజును చీకటి ఉన్నప్పుడే పెందలకాడనే చేసుకోవాలి. ఇదేవిధంగా యుద్ధమైదానంలో కూడా చెయ్యాలి.**

**68.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి ఫజర్ నమాజును ఇంకా చీకటి ఉన్నప్పుడే చేశారు. ఆ తరువాత వాహనం మీదకు ఎక్కారు. మరియు ఇలా సెలవిచ్చారు; అల్లాహు అక్బర్![1] ఖైబర్ నాశనమైపోయింది. మేము ఏదైనా జాతి ప్రాంగణంలో అడుగుపెట్టామంటే, అది హెచ్చరిక చెయ్యబడిన ప్రజల ఉదయాన్ని అశుభకరమైన దిగా చేస్తుంది. తరువాత యూదులు వీధుల్లోకి పరుగెత్తుకుంటూ వచ్చారు. 'ముహమ్మద్(స) సైన్యంతోపాటు వచ్చేశారు' అని కేకలు వెయ్యసాగారు. 'ఖమీస్' అంటే సైన్యం అని ఉల్లేఖకుడు వివరించారు. చివరకు దైవప్రవక్త(స) వారిపై ప్రాబల్యం వహించారు. మరియు పోరాడే సైనికుల్ని హతమార్చారు. ఇంకా మహిళల్ని, పిల్లల్ని ఖైదీలుగా చేసుకున్నారు. యాదృచ్ఛికంగా సఫియా(ర), దిహ్యా కల్బీకు లభించారు. ఆ తరువాత దైవప్రవక్త(స) గారి వాటాలోకి వచ్చారు. ఆయన(స) ఆమెను వివాహం చేసుకున్నారు మరియు ఆమెను స్వతంత్రురాలుగా చేశారు. ఇదే ఆమె మహర్‌గా నిర్ణయించబడింది. అబ్దుల్ అజీజ్ సాబిత్‌ను ఇలా అడిగారు; 'ఓ అబూ ముహమ్మద్! నీవు అనస్(ర)ను అడిగావా? దైవప్రవక్త(స) ఆమె(ర)గారికి ఎంత మహెర్ ఇచ్చారో? సమాధానంగా సాబిత్ ఇలా అన్నారు: దైవప్రవక్త(స) స్వయంగా ఆమె(ర)గారినే ఆమెకు మహెర్‌గా ఇచ్చారు.' ఆ తరువాత ఆయన చిరునవ్వు చిందించారు.

---

68-1. అధ్యాయంలోని ప్రధాన విషయం దీనిద్వారా వ్యక్తమవుతోంది, దైవప్రవక్త(స)గారు ఫజ్ర్ నమాజును పెందలకాడే చీకట్లోనే చేసేశారు. మరియు అల్లాహ్ అక్బర్ అని పలికారు. తెలిసిన విషయం ఏమిటంటే, భయంకరమైన పరిస్థితులు తలెత్తినప్పుడల్లా 'అల్లాహ్ అక్బర్' అని పలకటం 'మస్నూన్' అంటే దైవప్రవక్త(స)గారి సంప్రదాయం అన్నమాట. ఒక హదీసులో ఇలా ఉంది. ఒకవేళ అగ్నివల్ల మంటలు లేస్తే 'అల్లాహు అక్బర్' అని పలుకుతూ దాన్ని ఆర్పివేయాలి.

# పండుగల ప్రకరణం

## 1వ అధ్యాయం

**రెండు పండుగలను గురించి మరియు వాటిని జరుపుకునేటప్పుడు అలంక రించుకోవటం గురించి.**

**69.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఒకసారి హజ్రత్ ఉమర్(ర) బజారులో అమ్మ బడుతూ ఉన్న ఒక దళసరి పట్టు వస్త్రపు జుబ్బాను తీసుకొని దైవప్రవక్త ముహమ్మద్(స) వద్దకు వెళ్ళారు. మరియు ఆయన(స) గారితో ఇలా అన్నారు: "ఓ దైవప్రవక్తా(స)! ఈ జుబ్బాను మీరు కొనుక్కోండి. పండుగ రోజున మరియు ఇతర దేశాల నుంచి రాయబారులు వచ్చి నప్పుడు దానిని ధరిస్తూ ఉండండి". అప్పుడు దైవప్రవక్త(స) ఆయనగారితో ఇలా సెలవిచ్చారు: "దీన్నయితే పరలోకంలో దురదృష్టవంతుడుగా రూపొందేవాడు మాత్రమే ధరిస్తాడు". తరువాత హజ్రత్ ఉమర్(రజి) అల్లాహ్ కోరినంతసేపు అక్కడే ఉండి పోయారు. ఆ తరువాత దైవప్రవక్త(స)గారే స్వయంగా హజ్రత్ ఉమర్(ర)గారి వద్దకు పట్టువస్త్రంతో తయారుచేయబడిన ఒక జుబ్బాను కానుకగా పంపారు. హజ్రత్ ఉమర్(ర) ఆ జుబ్బాను తీసుకొని దైవప్రవక్త(స) వద్దకు వచ్చారు. మరియు ఆయన(స) గారితో ఇలా విన్నవించుకున్నారు; 'ఓ దైవప్రవక్తా(స)! పరలోకంలో దౌర్భాగ్యుడయ్యేవాడే దీనిని ధరిస్తాడు అని మీరు సెలవిచ్చారు కదా! అలాంటప్పుడు మీరు నా వద్దకు ఈ జుబ్బాను ఎందుకు పంపినట్లు?' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: నేను దానిని నీవు ధరించాలని నీవద్దకు పంపలేదు సుమా! దానిని నీవు అమ్మాలని దానిద్వారా వచ్చిన డబ్బును నీ పనులకోసం వినియోగించాలని మాత్రమే పంపాను."

## 2వ అధ్యాయం

**పండుగనాడు బల్లెములతో, డాలులతో ఆడుకోవడం గురించి.**

**70.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె(ర)గారు ఇలా సెలవిచ్చారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి నావద్దకు వచ్చారు.

ఆ సమయంలో నావద్ద ఇద్దరు బాలికలు కూర్చొని ఉన్నారు వారు బుఆస్ యుద్ధానికి సంబంధించిన గేయాలు[1] పాడుతున్నారు. దైవప్రవక్త(స) తన ముఖాన్ని తిప్పుకుని మేనువాల్చారు. ఇంతలో హ్జ్రత్ అబూ బకర్(ర) అక్కడికి వచ్చారు. ఆయన నన్ను గద్దిస్తూ ఇదేమిటి, దైవప్రవక్త(స)గారి సమక్షంలో ఈ షైతానీ గేయాలు? అని అన్నారు. దీనిపై దైవప్రవక్త(స)గారు ఆయన(ర) వైపునకు తిరిగి ఇలా సెలవిచ్చారు: వారిని వదిలెయ్యండి", తరువాత అబూబకర్ సిద్దీఖ్(ర)వారిని పట్టించుకోలేదు. అప్పుడు నేను ఆ బాలికలకు సైగ చేశాను, వారు వెళ్ళిపోయారు. ఆ రోజు పండుగ రోజు. ఆ రోజున హబషీ ప్రజలు డాలులతో, బరిశెలతో ఆడుకుంటారు. అప్పుడు నేను దైవప్రవక్త(స)ను స్వయంగా కోరానో లేక ఆయన(స) గారే స్వయంగా నాతోనే ఇలా అన్నారో వారు ఆడే ఆటను చూస్తావా అని. 'అవును దైవప్రవక్తా(స)! నాకు చూడాలని ఉంది' అని నేను విన్నవించుకున్నాను. తరువాత దైవప్రవక్త(స) నన్ను తన వెనుక నిలబెట్టుకున్నారు. అప్పుడు నా చెంప ఆయన(స) గారి చెంపను తాకుతూ ఉంది. ఆయన(స)గారు 'ఆడండి, ఆడండి. ఓ బనీ అర్ఫిదా' అని అనేవారు. నేను విసిగి పోయినప్పుడు ఆయన(స) ఇలా సెల విచ్చారు "ఓ ఆయెషా! చాలా! తృప్తిగా ఉందా?" నేను చాలు! ఓ దైవప్రవక్తా(స)! అని అన్నాను. ఆయన(స) "మంచిది ఇక వెళ్ళిపో." అన్నారు.

## 3వ అధ్యాయం

## పండుగ సమయాలలో ముస్లిములు ఏమి చేయాలి?

**71.** అల్ బరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'నేను పండుగ రోజున దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా ఉపదేశిస్తూ ఉండగా విన్నాను ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు: "పండుగ రోజున మేము చేసే మొట్టమొదటి పని నమాజు చెయ్యటం. తరువాత ఇళ్ళకు తిరిగి వచ్చి (బక్రీదు పండుగలో) ఖుర్బానీ ఇస్తాము. ఎవరైతే ఇలా చేస్తారో వారు మా సంప్రదాయాన్ని పాటించినట్లు."

**72.** హ్జ్రత్ ఆయెషా(రజిఅన్) ఇలా ఉల్లేఖనం: ఆమె(ర) ఇలా అన్నారు– హ్జ్రత్ అబూబకర్ (రజిఅన్) వచ్చారు. ఆ సమయంలో నా వద్ద ఇద్దరు అన్సారీ బాలికలు కూర్చొని ఉన్నారు. వారు బుఆస్ యుద్ధం జరిగినప్పుడు పాడిన గేయాలనే

---

70–1. మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది, ఈ గేయాలు డప్పుల సహాయంతో పాడబడుతూ ఉన్నాయి.

అప్పుడు కూడా నా దగ్గర కూర్చొని పాడుతున్నారు. హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు; ఈ బాలికలు వృత్తిపరంగా పాటలు పాడేవారు కారు. అప్పుడు హజ్రత్ అబూబకర్(ర) ఇలా అన్నారు "అయ్యో! ఇదేమిటి? ఈ షైతానీ పాటలు దైవ ప్రవక్త(స)గారి ఇంట్లోనా?" మరియు ఆ రోజు పండుగ రోజు. చివరకు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అబూబకర్(ర)తో ఇలా అన్నారు: 'ఓ అబూబకర్! ప్రతి జాతిలో పండుగలు ఉంటాయి. ఈ రోజు మన పండుగ.

## 4వ అధ్యాయం

### ఈదుల్ ఫిత్ర్ రోజున నమాజు కోసం బయలుదేరే ముందు ఏదైనా వస్తువు కొంచెం తినటం.

**73.** హజ్రత్ అనస్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా సెలవిచ్చారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈదుల్ ఫిత్రనాడు కొన్ని ఖర్జూరపు పండ్లు సేవించనంతవరకు నమాజు కోసం వెళ్ళేవారు కాదు. హజ్రత్ అనస్(ర)గారే మరొక ఉల్లేఖనంలో ఇలా సెలవిచ్చారు దైవప్రవక్త(స) ఖర్జూరపు పండ్లను బేసి సంఖ్యలో తినేవారు.'

## 5వ అధ్యాయం

### బక్రీదు రోజున తినటం.

**74.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు : ఏ వ్యక్తి అయితే నమాజుకు ముందే ఖుర్బానీ ఇస్తాడో ఆ వ్యక్తి రెండోసారి మళ్ళీ ఖుర్బానీ ఇవ్వాలి. ఒక వ్యక్తి (అబూబర్దా (ర) లేచి నిలబడి ఇలా అనసాగాడు: 'ఈ రోజైతే ప్రతి మనిషి మాంసం తినాలని కోరుకుంటాడు'. తరువాత ఆ వ్యక్తి తన పొరుగువారి నిస్సహాయతను గురించీ, పేదరికాన్ని గురించీ వివరించాడు.[1] దైవప్రవక్త(స) అతను చెప్పేది నిజమని నమ్మారు. ఆ వ్యక్తి ఇంకా ఇలా అన్నాడు– నా దగ్గర ఒక సంవత్సరం వయస్సు ఉన్న మేక ఉన్నది. అది మంచి మాంసం కలిగిన రెండు మేకలకంటే శ్రేష్ఠమైనది. ఆయన(స) ఆ మేకనే ఖుర్బానీ ఇవ్వమని ఆ వ్యక్తికి అనుమతి ఇచ్చారు. ఇప్పుడు నాకైతే తెలియదు. ఈ అనుమతి ఇతరులకూ్కడా వర్తిస్తుందో లేదో.[2]

---

74–1. అబూబర్దా (రజిఅన్) ఇలా విన్నవించుకున్నారు: ఈ రోజున ప్రతి మనిషీ మాంసం తినాలని కోరుకుంటాడు. మరియు నా పొరుగున ఉండే మనుషులు కడు బీదవారు.

**75.** హ|జత్ బరా బిన్ ఆజిబ్(రజిఅన్) ఒక ఉల్లేఖనంలో ఇలా అన్నారు: దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) బక్రీదు రోజున నమాజు చేసిన తరువాత మాకు హితోపదేశం చేశారు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'ఏ వ్యక్తి అయితే మేముచేసే నమాజులాంటి నమాజును చేస్తాడో, ఇంకా మేము ఇచ్చే ఖుర్బానీలాంటి ఖుర్బానీని ఇస్తాడో అతను ఇచ్చే ఖుర్బానీ నిజమైన, యదార్థమైన ఖుర్బానీ అవుతుంది. ఏ వ్యక్తి అయితే నమాజుకు ముందే ఖుర్బానీ ఇస్తాడో ఆ వ్యక్తి (నమాజుకు ముందు మాంసం తింటాడు). ఇచ్చింది ఖుర్బాని కాదు. అబూబర్ద బిన్ నియార్ ఇలా విన్నవించు కున్నారు– ఆయన బరాబిన్ ఆజిబ్‌కు మామయ్య అవుతారు– 'ఓ దైవప్రవక్తా(స)! నేనైతే నా మేకను నమాజుకు ముందే కోసేశాను. ఎందుకంటే, ఈ రోజు తినే, త్రాగే రోజు అని నేను భావించాను. కనుక అందరికంటే ముందు నా ఇంట్లోనే ఒక మేక కొయ్యబడాలి. ఈ కారణంగా నేను నా మేకను కోసి వేశాను. మరియు నమాజుకు రాకముందే తినేశాను'. అప్పుడు దైవప్రవక్త మహనీయులు(స) ఇలా సెలవిచ్చారు: 'నీ మేక అయితే మాంసపు మేకగా మాత్రమే నిలబడింది. (ఖుర్బానీ మేక మాత్రం కాదు) అతను ఇలా విన్నవించుకున్నాడు : ఓ దైవప్రవక్తా(స)! నా దగ్గర ఒక సంవత్సరం వయస్సు ఉన్న మేక ఉంది. అది బాగా మాంసం ఉన్న రెండు మేకలకంటే మంచిదిగా, శ్రేష్టమైనదిగా కనిపిస్తుంది. అది నా తరఫున ఖుర్బానీ ఇవ్వటానికి సరిపోతుందా? దానికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "నీ తరువాత మరెవరి తరఫునుంచీ అది సరిపోదు." (అంటే ఇలాంటి అనుమతి వేరెవరికీ ఉండదు)

## 6వ అధ్యాయం

### ఈద్గాహ్‌కు మెంబర్ లేకుండా పోవటం గురించి.[1]

**76.** హ|జత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఒక ఉల్లేఖనంలో ఇలా సెలవిచ్చారు: 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఈదుల్ ఫిత్ర్ నాడూ, ఈదుల్

---

మరియు నిస్సహాయులు. నేను వారిని దృష్టి లోపెట్టుకుని నమాజుకు ముందే ఖుర్బానీ ఇచ్చేశాను. మరియు ఉదయాన్నే పెందలకడ మాంసాన్ని వారికి కూడా తినిపించాను. మరియు నేను కూడా తినేశాను.

74–2. ఈ అనుమతి ప్రత్యేకంగా అబూబర్దా(రజిఅన్)కే ఇవ్వబడింది. ఈ విషయం ఇక ముందు రాబోతోంది. అనస్ బిన్ మాలిక్(రజిఅన్)కు దీనిని గురించి తెలియదు.

6–1. పండుగ నమాజును పట్టణాల నుంచి బయటకుపోయి ఖాళీగా ఉన్న ఏదైనా మైదానంలో చెయ్యటం దైవప్రవక్త(స)గారి సున్నత్. మరియు అక్కడ మెంబర్ లేకుండా ఖుత్బాను పఠించాలి.

అజ్‌హా రోజునా మదీనా పట్టణం నుంచి ఈద్గాహ్‌కు వెళ్ళేవారు. అక్కడ ఆయన(స) గారు మొదట నమాజు చేసేవారు. నమాజు పూర్తిచేసిన తరువాత ఆయన(స)గారు ప్రజల ముందు లేచి నిలబడేవారు. ప్రజలు తమ తమ స్థానాల్లో వరుసగా కూర్చొని ఉండేవారు. అప్పుడు ఆయన(స)గారు వారికి హితోపదేశం చేసేవారు, సత్కార్యాలు చెయ్యమని ఉద్బోధించేవారు. తరువాత ఒకవేళ ఆయన(స) గారు ఎక్కడికైనా సైన్యాన్ని పంపదలిస్తే అప్పుడు దానిని సిద్ధపరిచేవారు. లేదా ఏదైనా పనిని గురించి ఆజ్ఞాపించదలిస్తే ఆజ్ఞాపించేవారు. ఆ తరువాత ఇంటికి తిరిగివచ్చే వారు. హ్రజత్ అబూసయీద్(ర) ఇలా సెలవిచ్చారు; ఆ తరువాత కూడా ప్రజలు ఇలానే చేస్తూ వచ్చారు. ఒకసారి నేను హ్రజత్ మర్వాన్(ర)గారితో కలిసి ఈదుల్ అజ్‌హా నమాజుకో లేక ఈదుల్ ఫిత్ర్ నమాజుకో వెళ్ళాను. అప్పుడు ఆయన(ర)గారు మదీనా పురానికి గవర్నరుగా ఉండేవారు. మేము ఈద్గాహ్‌కు చేరుకున్నప్పుడు అక్కడ ఒక మెంబర్ ఉంచబడి ఉండటాన్ని నేను గమనించాను. ఆ మెంబర్‌ను కసీర్ బిన్ సల్త్ తయారు చేశారు. హ్రజత్ మర్వాన్(ర) నమాజు చెయ్యటానికి ముందు అకస్మాత్తుగా ఆ మెంబర్‌పైకి ఎక్కదలిచారు. అప్పుడు నేను ఆయన(ర) వస్త్రాన్ని పట్టుకుని లాగాను. కాని ఆయన(ర) నన్ను విదిలించి పారేశారు. ఇంకా మెంబర్‌పైకి ఎక్కేశారు. ఆ తరువాత ఆయన(ర) నమాజుకు ముందే ఖుత్బా ఇచ్చారు. అప్పుడు కూడా నేను ఆయనతో ఇలా అన్నాను: అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను, మీరు దైవప్రవక్త(స) గారి సంప్రదాయాన్ని మార్చివేశారు. సమాధానంగా ఆయన(ర) ఇలా అన్నారు: "ఓ అబూసయీద్ ఖుద్రీ(ర)! నీకు ఏ విషయమైతే తెలుసో అది కాలగర్భంలో కలిసిపోయింది". నేను జవాబుగా ఇలా అన్నాను : 'అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను! ఏదైతే నేను ఎరుగుదునో అది నేను ఎరుగని దానికంటే ఎంతో ఉత్తమమైనది. దానిపై మర్వాన్(ర) ఇలా అన్నారు: అసలు విషయం ఏమిటంటే, ప్రజలు మా ఖుత్బా వినటానికి నమాజు తరువాత కూర్చోరు, వెళ్ళిపోతారు. కనుక నేను నమాజు చేయటానికి ముందే ఖుత్బా ఇచ్చాను.'

## 7వ అధ్యాయం

**పండుగ నమాజు కోసం కాలినడకన పోవటం మరియు వాహనం మీద పోవటం గురించి. ఇంకా పండుగ నమాజును ఖుత్బా (హితోపదేశం)కు ముందే చెయ్యటం గురించి. పండుగ నమాజులో అజాన్ మరియు తక్బీర్ లేకపోవటం గురించి.**

**77.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈదుల్ అజ్‌హాలోనూ, ఈదుల్ ఫిత్రలోనూ ప్రథమంగా నమాజు చేసేవారు. నమాజు తరువాతనే ఖుత్బా వినిపించేవారు.

**78.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈదుల్ ఫిత్ర నాడు ఈద్గాహ్‌కు వెళ్ళారు. మొట్ట మొదట నమాజు చేశారు. ఆ తరువాత ఖుత్బా వినిపించారు. ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు. మరియు అతా నాతో ఈ విషయాన్ని కూడా చెప్పారు. ఇబ్నె అబ్బాస్(ర)గారు ఇబ్నె జుబైర్ ద్వారా ఇలా కబురు పంపారు. ప్రారంభంలో ఆయనగారి ఖిలాఫత్ కాలంలో ఈదుల్ ఫిత్రలో అజాన్ పిలుపు ఇవ్వబడేదికాదు. (అంటే దైవప్రవక్త(స)గారి కాలంలో) మరియు నమాజు చేసిన తరువాతనే ఖుత్బా ఇవ్వబడేది. ఇబ్నె జురేజ్ ఇలా అన్నారు. మరియు ఇబ్నె అబ్బాస్(ర) మరియు జాబిర్ గార్లు ఈ సూక్తిని నాకు వివరించారు. దైవప్రవక్త(స)గారి కాలంలో ఈదుల్ ఫితర్‌నాడు గాని, ఈదుల్ అజ్‌హా రోజున గాని అజాన్ ఇవ్వబడేది కాదు. జాబిర్ బిన్ అబ్దుల్లా(ర)గారు ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త(స) (పండుగ రోజున) నిలబడేవారు మొదట నమాజు చేసేవారు. నమాజు తరువాత ప్రజలకు ఖుత్బా వినిపించేవారు. ఖుత్బా ప్రసంగం ముగిసిన తరువాత అక్కడ నుంచి వెళ్ళిపోయేవారు. స్త్రీలు సమావేశమై ఉన్న స్థలానికి వచ్చేవారు. వారికి ఉపదేశం చేసేవారు. ఆ సమయంలో ఆయన(స) బిలాల్(ర) గారి చేతికి ఆనుకుని నిలబడి ఉన్నారు. మరియు బిలాల్(ర)గారు తన వస్త్రాన్ని పరచి ఉంచారు. స్త్రీలు ఆ వస్త్రంలో తమ వస్తువులను వేసేవారు. ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు "నేను అతాగారిని ఇలా అడిగాను; 'ఏమిటి ఇప్పుడు కూడా ఇమామ్ నమాజు ముగిసిన తరువాత స్త్రీల వద్దకు వెళ్ళటం మరియు వారికి హితోపదేశం చెయ్యటం అవసరమా?" దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు: 'అవసరం ఎందుకు లేదు? అలా చెయ్యకపోవటానికి కారణ మేదైనా ఉందా?'

## 8వ అధ్యాయం

### పండుగ రోజున నమాజు చేసిన తరువాత ఖుత్బాను పఠించటం.

**79.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) ఇలా ఉల్లేఖించారు: పండుగ రోజున నేను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి నమాజు చేశాను. ఇంకా అబూబకర్ సిద్దీఖ్(ర), ఉమర్(ర), ఉస్మాన్(ర) గార్లతో కూడా కలిసి పండుగ

నమాజును చేశాను వారందరూ ప్రప్రథమంగా నమాజు చేశారు. ఆ తరువాతనే ఖుత్బా ప్రసంగం చేశారు.

**80.** హజ్రత్ ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) గారూ, హజ్రత్ అబూబకర్(ర)గారూ మరియు హజ్రత్ ఉమర్(ర)గారూ రెండు పండుగల నమాజులను, ఖుత్బా ప్రసంగానికి ముందే చేసే వారు.

**81.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) కథనం: దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ఈదుల్ ఫిత్ర్ రోజున రెండు రకాతుల నమాజు చేశారు. ఆ రెండు రకాతులకు ముందుగానీ, తరువాతగానీ ఆయన(స) ఎలాంటి నఫిల్ నమాజునూ చెయ్యలేదు. ఆ తరువాత (ఖుత్బా ప్రసంగం చేసి) ఆయన(స)గారు స్త్రీల వద్దకు వచ్చారు. హజ్రత్ బిలాల్(ర) ఆయన(స)గారి వెంట ఉన్నారు. 'ఆయన(స) స్త్రీలను ఉద్దేశించి దానం చెయ్యండి' అని సెలవిచ్చారు. అప్పుడు స్త్రీలు దానంగా ఇచ్చే వస్తువులను విసరివేయసాగారు. ఒకరు తన చెవి రింగులను దానం చేస్తే మరొకరు తమ కంఠహారాన్ని దానంగా ఇచ్చారు.

**82.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని బరా బిన్ ఆజిబ్(ర) ఉల్లేఖించారు: 'ఈ పండుగ రోజున మేము చేసే మొట్టమొదటి పని నమాజ్. తరువాత (ఖుత్బా చదివిన పిదప) అక్కడనుంచి తిరిగి వచ్చి ఖుర్బానీ ఇస్తాము. ఎవరైతే అలా చేస్తాడో అతడు మా సంప్రదాయాన్ని పాటించాడు. ఎవరైతే నమాజుకు ముందే పశువును కోశాడో ఆ పశువు (అతని పాలిట కేవలం) మాంసపు పశువు. అతడు దానిని తన ఇంటి వారి కోసం కోశాడు. దానికి ఖుర్బానీతో ఎలాంటి సంబంధం లేదు." ఇక అన్సారీ పురుషుడు ఇలా విన్నవించుకున్నాడు: అతని పేరు అబూబర్దా బిన్ నియార్. ఓ 'దైవప్రవక్తా(స)! నేనైతే నమాజుకు ముందే పశువును జిబహ్ చేశాను. ఇప్పుడు నా వద్ద ఒక సంవత్సరం వయస్సుగల మేక ఉన్నది. అది రెండుసంవత్సరాల వయస్సు గల మేకకంటే శ్రేష్టమైనది'. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు సరే మంచిది, దానినే రెండు సంవత్సరాల వయస్సుగల మేకకు బదులుగా కోసెయ్యి. ఇంకా ఇది నీకు తప్ప మరెవరికీ వర్తించదు.'

## 9వ అధ్యాయం

**పండుగనాడు మరియు కాబా గృహంలోనూ ఆయుధాలు ధరించటం అయిష్ట మైనది. ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా అన్నారు : పండుగనాడు ప్రజలు**

ఆయుధాలను తమవెంట తీసుకుపోవటం నిషేధించబడింది. కాని శత్రువు భయం ఉంటే, అప్పుడు ఆయుధాలు తమతో తీసుకుపోవచ్చు.'

**83.** సయీద్ బిన్ జుబైర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి నేను (హజ్జ్ యాత్రలో) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర)గారితో ఉన్నాను. బల్లెము యొక్క మొన ఆయనగారి అరికాలుకు గుచ్చుకున్నప్పుడు, ఆయనగారి పాదం గుర్రపు రికాబుకు అతుక్కుపోయింది. నేను నా వాహనం మీద నుంచి కిందికి దిగి బల్లెపు మొనను ఆయన గారి పాదంలో నుంచి తీసేశాను. ఈ సంఘటన మినాలో జరిగింది. తరువాత హజ్జాజ్ ఆయన(ర) గారిని పరామర్శించటానికి వెళ్ళాడు. అతను ఇలా అనసాగాడు, "ఈ నికృష్టమైన చేష్టకు ఒడిగట్టినవాడెవడో మాకు తెలిస్తే మేము అతన్ని శిక్షిస్తాము". హజ్రత్ ఇబ్నెఉమర్(ర) ఇలా అన్నారు: "నీవేకదా బల్లెముతో నన్ను పొడిచావు". అప్పుడు హజ్జాజ్ 'అదెలా'! అని అడిగాడు. ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు: ఏ రోజునైతే ఆయుధాలు పట్టకూడదో ఆ రోజున నీవు ఆయుధాలు పట్టేలా చేశావు. ఇంకా కాబా గృహంలోకి ఆయుధాలు ధరించి రావటం నిషిద్ధం. కాని నీవు, ఆయుధాలు ధరించిన ప్రజల్ని కాబాగృహంలోకి రానిచ్చావు.'

**84.** సయీద్ బిన్ అమ్ర్ బిన్ సయీద్ బిన్ ఆస్ ఇలా ఉల్లేఖించారు హజ్జాజ్ అబ్దుల్లా బిన్ ఉమర్(ర) వద్దకు వెళ్ళాడు. అప్పుడు నేను అక్కడ్డే ఉన్నాను. అతను ఇలా అనసాగాడు. "మీ ఆరోగ్యం ఎలా ఉంది". ఆయన(ర) సమాధానంగా 'నేను బాగానే ఉన్నాను' అని అన్నారు. అతను మళ్ళీ ఇలా అడిగాడు. "బల్లెముతో మిమ్మల్ని ఎవరు పొడిచారు?" అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఇలా అన్నారు. 'ఏ రోజునైతే ఆయుధాలు ధరించటం నిషేధించబడిందో ఆ రోజున ఆయుధాలు ధరించమని ప్రజల్ని ఆజ్ఞాపించినవాడు, అంటే హజ్జాజ్, నన్ను బల్లెంతో పొడిచాడు.'

## 10వ అధ్యాయం

**పండుగ నమాజును చెయ్యటానికి పెందలకాడనే పోవటం. అబ్దుల్లా బిన్ బుస్ర్ ఇలా అన్నారు : "(దైవప్రవక్త(స)గారి కాలంలో) మేము పండుగ నమాజును 'తస్బీహ్' సమయానికే ముగించేవారం. (ఇష్రాఖ్ నమాజు సమయానికే) అంటే సూర్యోదయం తరువాత."**

**85.** బరాబిన్ ఆజిబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఈదుల్ అజ్హా పండుగ నాడు, దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) మాకు ఖుత్బా ప్రసంగాన్ని

వినిపించారు. మరియు ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'చూడండి! ఈ రోజున మేము చేసే మొదటిపని నమాజ్. తరువాత (ఖుత్బా చదివి వినిపించారు) ఇళ్ళకు తిరిగి వచ్చినప్పుడు ఖుర్బానీ చేస్తాము. ఎవరైతే అలా చేస్తాడో అతను మా విధానం మీద నడిచాడు. ఎవరైతే నమాజుకు ముందే పశువును ఖుర్బానీ ఇచ్చాడో అతను ఖుర్బానీ ఇచ్చిన పశువు మాంసపు పశువు. అతను దానిని తొందరపడి తన ఇంటివారి కోసం కోశాడు. దానికి ఖుర్బానీతో ఎలాంటి సంబంధమూ లేదు. ఇది విని అబూబర్ద బిన్ నియార్(ర) (నాకు మామయ్యగారవుతారు) లేచి నిలబడి ఇలా అనసాగారు: "ఓ దైవప్రవక్తా(స)! నేనైతే నమాజుకు ముందే పశువును జిబహ్ చేశాను. నా వద్ద ఒక సంవత్సరం వయస్సుగల మేక ఉంది. అది రెండు సంవత్సరాల వయస్సుగల మేక కంటే కూడా ఉత్తమమైనది". దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "దానినే మొదటి దానికి బదులుగా భావించు. లేదా కోసెయ్యి, నీ తరువాత ఒక సంవత్సరంగల మేక ఇక ఎవరికీ సరిపోదు."

## 11వ అధ్యాయం

తష్రీఖ్ దినాలలో (జిల్‌హజ్జా మాసం **11, 12, 13** తేదీలలో) చేసే (మంచి) కర్మల ఔన్నత్యం. ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారు: 'దివ్యఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడిన 'అయ్యామె మాలూమాత్' (నిర్ధారిత దినాలు) అంటే జిల్‌హజ్జాలోని మొదటి పది దినాలు అని భావం. మరియు 'అయ్యామె మఅదూదాత్' (లెక్కించదగిన కొన్ని దినాలు) అంటే 'అయ్యామె తష్రీఖ్' (తష్రీఖ్ దినాలు) అని భావం. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) మరియు అబూ హురైరా (రజిఅన్) గార్లు ఉభయులూ జిల్‌హజ్జ మాసం లోని మొదటి పది దినాలలో బజారుకు వెళుతూ తక్బీర్ పఠించే వారు. ప్రజలు కూడా వారితోపాటు తక్బీర్ పలికేవారు. ఇమామ్ ముహమ్మద్ బాఖర్(రహ్మాలై) గారు నఫిల్ నమాజు చేసిన తరువాత కూడా తక్బీర్ పలికేవారు.

**86.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు: "ఇతర దినాలలో చెయ్యబడే సత్కార్యాలు ఈ దినాలలో చెయ్యబడే సత్కార్యాల కంటే ఘనమైనవి, ఉన్నతమైనవి ఏమీకావు.' అప్పుడు ప్రజలు ఇలా విన్నవించుకున్నారు; 'జిహాద్ కూడానా ఓ దైవప్రవక్తా (స)!' ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు: "అవును, జిహాద్ కూడా ఉన్నతమైనది కాదు. కాని అతను జిహాద్ చేసి తన ప్రాణాన్నీ, తన సంపదనూ అపాయానికి గురిచేసి తిరిగి వచ్చేటప్పుడు రవ్వంత కూడా తీసుకురాలేకపోతే అప్పుడది ఉన్నతమైనదిగా పరిగణించబడుతుంది."

## 12వ అధ్యాయం

'మినా' దినాలలో తక్బీర్ పలకటం. తొమ్మిదవ తేదీ ఉదయం అరఫాత్‌కు వెళుతూ ఇబ్నె ఉమర్(రజిఅన్) మినాలో ఆగినప్పుడు తన గుడారంలో తక్బీర్ పలికేవారు. మస్జిద్‌లో ఉన్నవారు ఈ తక్బీర్ ధ్వనిని విని వారు కూడా తక్బీర్ పలికేవారు. బజారులోని ప్రజలు, మార్కెట్టులోని ప్రజలు కూడా తక్బీర్ పలికేవారు. చివరకు మినా అంతా తక్బీర్‌తో దద్దరిల్లేది. ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఆ దినాలలో మినాలో తక్బీర్ పలికేవారు. ఇంకా నమాజులు చేసిన తరువాత తమ పడక మీద ఉన్నప్పుడు, తన గుడారం లోనూ మరియు తన సభలలోనూ, మార్గంలో ప్రయాణం చేస్తూ ఉన్నప్పుడు కూడా ఆ అన్నిదినాలలోనూ ఆవిధంగా చేసేవారు. విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ మైమూన (రజిఅన్) పదవతేదీన తక్బీర్ పలికేవారు. మస్జిద్‌లో స్త్రీలు అబాన్ బిన్ ఉస్మాన్ మరియు ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (ర)గార్ల వెనుక తష్రీఖ్ దినాలలో పురుషులతో పాటు తక్బీర్ పలికేవారు.

**87.** ముహమ్మద్ బిన్ అబీబకర్ సఖఫీ ఇలా ఉల్లేఖించారు: 'మేము ఉభయులమూ ఉదయంపూట మినానుంచి అరఫాత్‌కు వెళుతూ ఉన్నప్పుడు, నేను అనస్ బిన్ మాలిక్(ర)ను ఇలా అడిగాను, లబ్బైక్‌ను పలకటం ఎలా ఉంటుంది. నీవు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో ఉన్నప్పుడు లబ్బైక్ ఎలా పలికేవాడవు? దానికి సమాధానంగా ఆయన(ర) ఇలా అన్నారు: లబ్బైక్ పలికేవాడు లబ్బైక్ పలికేవాడు. దాని పట్ల ఎవరూ అభ్యంతరం చెప్పేవారు కాదు. ఇంకా తక్బీర్ పలికే వాడు తక్బీరే పలికేవాడు. దీని విషయంలో కూడా ఎవరూ అభ్యంతరం చెప్పేవారు కారు.

**88.** ఉమ్మె అతియా(ర.అ) ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) గారి కాలంలో మమ్మల్ని పండుగ రోజున బయటికి వచ్చెయ్యమని ఆజ్ఞాపించేవారు. చివరకు కన్యలైన స్త్రీలు కూడా పరదాలో నుంచి బయటికి వచ్చేవారు. బహిష్టు అయిన స్త్రీలు కూడా బయటికి వచ్చేవారు. వారు పురుషుల వెనుక నిలబడే వారు. వారితో కలిసి తక్బీర్లు పలికేవారు. ఇంకా పురుషులు చేసే దుఆలలో పాల్గొనే వారు. ఆ దినానికి చెందిన శుభాలను, పరిశుద్ధతను పొందాలని ఆశించేవారు."

## 13వ అధ్యాయం

**పండుగ రోజున బరిసెను అడ్డంగా పాతి నమాజు చెయ్యటం.**

**89.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఈదుల్ ఫిత్ర్‌నాడు మరియు ఈదుల్ అజ్‌హా నాడు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స)గారి ముందు ఒక బరిసె భూమిలో పాతబడేది. తరువాత ఆయన(స)గారు దానిని అడ్డంగా చేసుకుని నమాజు చేసేవారు.

## 14వ అధ్యాయం

### బరిసెను లేక ఈటెను తీసుకుని పండుగ నాడు ఇమామ్‌కు ముందు నడవటం.

**90.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉదయాన్నే బయలుదేరి ఈద్గాహ్‌కు వెళ్ళేవారు. మరియు ఆయన(స)గారి ముందు బరిసెను తీసుకుని కొందరు నడుస్తూ పోయేవారు. ఆ బరిసెను దైవప్రవక్త(స)గారి ముందు భూమిలో పాతటం జరిగేది. ఆయన(స)గారు దానికి ఎదురుగా నిలబడి నమాజు చేసేవారు'.

## 15వ అధ్యాయం

### స్త్రీలు మరియు బహిష్టు అయిన మహిళలు ఈద్గాహ్‌కు పోయే విషయం గురించి.

**91.** ఉమ్మెఅతియా (ర.అ) ఇలా అన్నారని, ముహమ్మద్ బిన్ సీరీన్ ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) పండుగ రోజున యువతులను, పరదాలో ఉండే స్త్రీలనూ బయటికి తీసుకురావాలని మమ్మల్ని ఆజ్ఞాపించారు'. హఫ్సా (ర) ఇలా అన్నారని అయ్యూబ్ ఉల్లేఖించారు: హఫ్సా (ర) గారి హదీసులో ఇలా ఉంది- అయ్యూబ్ ఇలా అన్నారు లేదా హఫ్సా (ర) ఇలా అన్నారు: 'యువతులు మరియు పరదాలో ఉండేవారు మరియు బహిష్టు అయిన స్త్రీలు నమాజు చేసే స్థలం నుంచి వేరుగా ఉండాలి.'

## 16వ అధ్యాయం

### పిల్లలు ఈద్‌గాహ్‌కు పోవటం గురించి.

**92.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి నేను ఈదుల్ ఫిత్ర్ నాడో లేక ఈదుల్ అజ్‌హానాడో దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) గారితో ఈద్గాహ్‌కు బయలుదేరాను. దైవప్రవక్త (స) పండుగ నమాజును చేయించారు. తరువాత ఖుద్బా ప్రసంగాన్ని మాకు వినిపించారు. ఆ తరువాత మహిళల వద్దకు విచ్చేశారు. వారిని ఉద్దేశించి ప్రసంగం చేశారు, వారికి హితవులు గరిపారు. మరియు దాన ధర్మాలు చెయ్యమని ఆజ్ఞాపించారు.

## 17వ అధ్యాయం

**పండుగనాడు ఖుత్బా ప్రసంగం చేసేటప్పుడు ఇమామ్ ప్రజల వైపునకు తన ముఖాన్ని పెట్టి నిలబడాలి. అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా అన్నారు: 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రజలకు ఎదురుగా నిలబడేవారు.'**

**93.** బరాబిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఈదుల్ అజ్హా రోజున బఖీ (మదీనాలోని స్మశాన వాటిక) వైపునకు వెళ్ళారు. ఆయన (స) గారు రెండు రకాతులు పండుగ నమాజును చేయించారు. తరువాత ఆయన (స) తన ముఖాన్ని మా వైపునకు త్రిప్పారు. మరియు ఇలా సెలవిచ్చారు; ఈ రోజున మనం చెయ్యవలసినటువంటి మొదటి ఆరాధన ఏమి టంటే, నమాజు చెయ్యటం. తరువాత (నమాజు, ఖుత్బాలనుంచి) తిరిగి వచ్చిన తరువాత ఖుర్బానీ చెయ్యాలి. ఎవరైతే ఇలా చేస్తాడో అతను మా సంప్రదాయంపై నడిచాడు. ఎవడైతే నమాజుకు ముందే పశువును జిబహ్ చేస్తాడో అతను తన ఇంటి వారికి మాంసం తినిపించటానికి తొందరపడి పశువును కోసేశాడు. కాని అది ఎంత మాత్రం ఖుర్బానీ కాబోదు. ఇది విని ఒక వ్యక్తి (అబూ బర్దా(ర) లేచి నిలబడ్డాడు. మరియు ఇలా అన్నాడు: ఓ దైవప్రవక్తా (స) నేనైతే పశువును కోసేశాను. ఇప్పుడు నా వద్ద ఒక మేక ఉన్నది. దాని వయస్సు ఒక సంవత్సరం. కాని అది రెండు సంవత్సరాల వయస్సుగల మేక కంటే ఉత్తమమైనదిగా కనిపిస్తుంది'. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "దానినే కొయ్యి. నీ తరువాత మళ్లీ ఎవరి తరఫు నుంచి అలాంటి మేక ఖుర్బానీ ఇవ్వటం అనేది ధర్మసమ్మతంకాదు".

## 18వ అధ్యాయం

**ఈద్గాహ్‌లో గుర్తు (చిహ్నం) పెట్టటం.**

**94.** అబ్దుర్రహ్మాన్ బిన్ ఆబిస్ ఇలా ఉల్లేఖించారు: 'నేను ఇబ్నె అబ్బాస్(రజిఅన్) చెప్పగా విన్నాను. ఆయన్ని (ర) ఎవరో ఇలా అడిగారు : దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి మీరు పండుగ నమాజ్‌ను చేశారా? ఆయన (ర), సమాధానంగా ఇలా అన్నారు 'అవును. చేశాను. నా చిన్నతనం కారణంగా దైవప్రవక్త (స) గారికి నాపై ప్రేమ, వాత్సల్యం కలగకపోతే, నేను ఆయన (స) గారితో కలిసి నమాజు చేసేవాణ్ణి కాను. ఆయన (స)గారు, గుర్తుపెట్టి ఉన్న స్థలానికి వచ్చారు.

అది కసీర్ బిన్ సలత్ ఇంటికి దగ్గరగా ఉన్నది. తరువాతాయన (స) నమాజు చేయించారు. ఖుత్బా ప్రసంగాన్ని వినిపించారు. తరువాత మహిళలు ఉన్న స్థలం వద్దకు వచ్చారు. హజ్రత్ బిలాల్ (రజిఅన్) ఆయన (స) గారితో ఉన్నారు. దైవప్రవక్త (స) స్త్రీలను ఉద్దేశించి ఉపన్యాసం చేశారు. వారికి హితవులు గరిపారు. దాన ధర్మాలు చెయ్యమని ఆజ్ఞాపించారు. స్వయంగా నేను చూశాను, స్త్రీలు తమ చేతులను చాపుతున్నారు. బిలాల్ (ర) గారు పట్టుకున్న వస్త్రంలో ఏవో వస్తువులను వేస్తున్నారు. ఆ తరువాత ఆయన (స) బిలాల్ (ర)తో కలిసి తన ఇంటికి వెళ్ళి పోయారు.

## 19వ అధ్యాయం

## పండుగ రోజు ఇమామ్ స్త్రీలనుద్దేశించి హితబోధ చేయటం

**95.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజిఅన్) తన ఒక ఉల్లేఖనంలో ఇలా అన్నారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఈదుల్ ఫిత్ర్ నాడు లేచి నిలబడ్డారు. మొదట నమాజు చేశారు. తరువాత ఖుత్బా ప్రసంగాన్ని వినిపించారు. ఖుత్బా ప్రసంగాన్ని ముగించిన పిదప ఆ స్థలం నుంచి వెళ్ళిపోయారు. హజ్రత్ బిలాల్ (రజిఅన్) చేతిని ఆధారంగా చేసుకుని ఆయన మహిళల వద్దకు వచ్చారు. వారికి హితోపదేశం చేశారు. హజ్రత్ బిలాల్(ర) తన వస్త్రాన్ని చాపారు. మహిళలు ఆ వస్త్రంలో తమతమ దానధర్మాలను వేస్తున్నారు. ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు 'నేను అతాను అడిగాను. 'ఆ వస్త్రంలో స్త్రీలు ఫిత్రా దానం వేస్తున్నారా?' ఆయన ఇలా అన్నారు: 'లేదు ఇది అప్పుడు వారు చేసిన ఒక ప్రత్యేక దానం.' ఒక స్త్రీ తన చేతి ఉంగరాన్ని ఇస్తే మరొక స్త్రీ కూడా అలానే ఇచ్చింది. తరువాత నేను అతాను ఇలా అడిగాను; స్త్రీలకు ఇమామ్ తప్పనిసరి (విధి)గా హితోపదేశం చేయాలా? ఆయన ఇలా అన్నారు 'అవును, విధిగా చెయ్యాలి.' మరి ఇప్పుడు ఇమామ్‌లు అలా చెయ్యటం లేదు ఎందుకని? ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారని హసన్ ఇబ్నె ముస్లిమ్ నాకు చెప్పారు "నేను ఈదుల్ ఫిత్ర్ నమాజును దైవప్రవక్త(స) గారి తోనూ, హజ్రత్ అబూబకర్(ర), హజ్రత్ ఉమర్(ర) మరియు హజ్రత్ ఉస్మాన్ (ర)గార్లతోనూ కలిసి చేశాను. వారందరూ మొదట నమాజు చేసేవారు. తరువాత ఖుత్బా ప్రసంగాన్ని వినిపించేవారు. క్లుప్తంగా, (ఖుత్బా వినిపించిన తరువాత) దైవప్రవక్త(స) ఆ స్థలం నుంచి వెళ్ళిపోయేవారు. నేను ఆయన(స)గారిని గమనిస్తున్నాను. ఆయన(స) ప్రజల్ని కూర్చోమని చేత్తో సైగ చేస్తున్నారు.[1] ఆ తరువాత

ఆయన(స) గారు నమాజు పంక్తులను చీల్చుకుంటూ మహిళల వద్దకు వచ్చారు. హజ్రత్ బిలాల్(ర) ఆయన(స) గారితో ఉన్నారు. ఆయన(స) ముమ్తహినహ్ సూరాలోని ఈ ఆయతును పఠించారు: "ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు బైఅత్ చేయటానికి నీ వద్దకు వచ్చి, తాము ఎవరినీ అల్లాహ్‌ను సాటిగా నిలబెట్టము అనీ, దొంగతనం చేయము అనీ, వ్యభిచారం చేయము అనీ, తమ సంతానాన్ని హత్య చేయము అనీ, తమ కాళ్ళూచేతుల మధ్య ఏ అపనిందనూ కల్పించి తీసుకురాము అనీ, ధర్మసమ్మతమైన మంచి విషయాలలో మీకు అవిధేయత చూపము అనీ ప్రమాణం చేస్తే, వారి నుండి బైఅత్ తీసుకో, వారిని క్షమించు అని అల్లాహ్‌ను ప్రార్థించు, నిశ్చయంగా అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడూను". (ముమ్తహినహ్- **12**) మరియు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'మీరు ఈ మాటలకు కట్టుబడి ఉన్నారా? ఏ ఒక్క స్త్రీ కూడా ఆయన(స)గారికి సమాధానం చెప్పలేదు. కేవలం ఒక్క స్త్రీ మాత్రమే 'అవును' అని అన్నది. ఆ స్త్రీ ఎవరో హసన్ బిన్ ముస్లిమ్‌కు తెలియదు.[2] దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, 'మంచిది, దానమైతే చెయ్యండి.' తరువాత హజ్రత్ బిలాల్(ర) తన వస్త్రాన్ని చాపి పట్టుకున్నారు. మరియు ఇలా అన్నారు: 'రండి, తీసుకురండి. ఈ వస్త్రంలో వెయ్యండి. నా తల్లిదండ్రుల్ని మీకు అర్పింతు! అప్పుడు వారు తమ కాలిమెట్టెలను, తమ చేతి ఉంగరాలను హజ్రత్ బిలాల్(ర)గారి వస్త్రంలో వెయ్యసాగారు. ఉల్లేఖకుడైన హజ్రత్ అబ్దుర్ రజ్జాఖ్ ఇలా అన్నారు: హదీసులో 'ఫతఖ్' అనే పదం వాడబడింది. దాని భావం ఒక పెద్ద మెట్టె అని వస్తుంది. దానిని అజ్ఞాన కాలంలో స్త్రీలు ధరించేవారు.[3]

---

95–1. హాఫిజ్ ఇలా అన్నారు: బహుశా ప్రజలు వెళ్ళిపోవాలని సంకల్పించుకున్నారేమో. అందుకని దైవప్రవక్త(స) చేత్తో సైగ చేసి కూర్చోమని సెలవిచ్చారు.

95–2. ఈ స్త్రీ అస్మా బిన్తె యజీద్ అని అంటారు. ఈ విషయం బైహఖీ ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది. అందులో ఇలా ఉంది: దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు ఓ మహిళలారా! మీలోఅనేకమంది నరకంలోకి పోతారు. అప్పుడు అస్మా(ర) గారు ఇలా అన్నారు: నేనుదైవప్రవక్త మహనీయులు ముహ మ్మద్(స)గారి ముందు ధైర్యంగా మాట్లాడేదాన్ని. నేను ఆయన(స) గారితో ఇలా విన్నవించుకున్నాను "ఓ దైవప్రవక్తా(స)! ఎందుకని ఎక్కువమంది స్త్రీలు నరకంలోకి పోతారు?" సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు– "మీరు ఎక్కువగా శాపనార్థాలు పెడతారు. మరియు భర్తపట్ల కృతఘ్నుత చూపుతారు. ఇది మీ ఆనవాయితీ."

95–3. అంటే కాలి వేళ్ళకు తొడుక్కునేవి.

## 20వ అధ్యాయం

### ఒకవేళ ఏ స్త్రీ వద్దనైనా ఓణిగాని లేదా దుప్పటిగాని లేని పక్షంలో.

**96.** హఫ్సా బిన్తె సీరీన్ ఇలా అన్నారని అయ్యూబ్ సఖ్తియాని ఉల్లేఖించారు: 'మేము మా బాలికలను పండుగరోజున బయటికి వెళ్ళకుండా వారించేవారము. తరువాత ఒక మహిళ బయటి నుంచి బస్రాలోనికి వచ్చింది. ఆ మహిళ బనీ ఖలఫ్‌కు చెందిన భవనంలో విడిది చేసింది. నేను ఆమెను కలుసుకోవటానికి అక్కడకు వెళ్లాను. ఆమె, తన బావగారు దైవప్రవక్త (స) గారితో కలిసి పన్నెండు పవిత్ర యుద్ధాలు చేశారు అని వివరించింది. ఇంకా ఆరు పవిత్ర యుద్ధాలలో ఆమె సోదరి కూడా దైవప్రవక్త(స) గారితో ఉన్నారు. ఆమె ఇలా అన్నది 'మేము అస్వస్థులైన వారికి సేవ చేసే వారము. క్షతగాత్రులకు మందూ మాకు ఇచ్చేవారము'. ఆమెగారు దైవప్రవక్త (స) గారితో ఇలా విన్నవించుకున్నారు 'ఓ దైవప్రవక్తా! మాలో ఏ స్త్రీ వద్దనైనా ఓణీగాని, దుప్పటిగాని లేకపోవటంచేత ఆమె పండుగనాడు బయటకు వెళ్ళలేకపోతే అది దోషం కాదుకదా! ఆయన (స) గారు సమాధానంగా ఇలా సెలవిచ్చారు: 'అప్పుడు ఆమె సహచారిణి తన దుప్పటిని లేక తన ఓణిని ఆమెతో పంచుకోవాలి. స్త్రీలు తప్పనిసరిగా పుణ్యకార్యాలలో పాల్గొనాలి. మరియు దుఆలలో పాలుపంచుకోవాలి.' హఫ్సా ఇలాఉన్నారు: ఉమ్మె అతియా (ర) బస్రాకు వచ్చినప్పుడు నేను ఆమె గారిని ఇలా అడిగాను: మీరు ఈ విషయాలనేమైనా విన్నారా? ఆమె (ర) గారు ఇలా అన్నారు: 'అవును, నా తండ్రి గారు ఆయన (స) కోసం త్యాగమైపోవుదురుగాక!' మరియు ఉమ్మె అతియ(ర) దైవప్రవక్త (స)గారి పేరును ప్రస్తావిస్తూ ఇలా అనకుండా ఉండటం అనేది చాలా తక్కువ 'నా తండ్రి ఆయన (స) గారిపై త్యాగమైపోవుదురుగాక!' అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: 'బురఖా ధరించిన యువతులు బురఖా ధరించిన స్త్రీలు మాత్రమే బయటకు పోవాలి. ఈ అనుమానం అయ్యూబ్ గారికి కలిగింది. ఇంకా బహిష్టు అయిన స్త్రీలు కూడా వెళ్ళాలి. కాని బహిష్టు అయిన స్త్రీలు నమాజు స్థలం నుంచి వేరుగా ఉండాలి. ఇంకా పుణ్యకార్యాలలో వారు పాలుపంచుకోవాలి మరియు ముస్లిములు చేసే దుఆలలో పాల్గొనాలి. హఫ్సా ఇలా అన్నారు: 'నేను ఉమ్మె అతియా(ర) తో ఇలా అన్నాను: బహిష్టు అయిన స్త్రీలు కూడా బయలు దేరాలా? ఆమె (ర) ఇలా అన్నారు: 'అదేమిటి? బహిష్టు అయిన స్త్రీలు హజ్‌లోనూ, అరఫాత్ లోనూ పాల్గొనటం లేదా? ఇంకా ఫలానా స్థలంలోకి రావటం లేదా?'

## 21వ అధ్యాయం

**బహిష్టు అయిన స్త్రీలు నమాజు చేసే స్థలం నుంచి వేరుగా, దూరంగా ఉండాలి.**

**97.** ఉమ్మె అతియా (ర.అ) ఇలా ఉల్లేఖించారు: 'పండుగ రోజున మేము బయటికి రావాలని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మమ్మల్ని ఆజ్ఞాపించారు. తరువాత మేము బహిష్టు అయిన స్త్రీలను మరియు యువతులను ఇంకా పరదాలో ఉండే మహిళలనూ మాతోపాటు తీసుకుపోవాలని ఆయన (స) ఆదేశించారు. ఇబ్నె ఔన్ ఇలా అన్నారు: పరదాలో ఉన్న మహిళలను తీసుకుపోవాలి కాని బహిష్టు అయిన స్త్రీలు కేవలం ముస్లిముల సమావేశంలోను, దుఆలలోను పాల్గొనవచ్చు. అయితే నమాజు చేసే స్థలం నుంచి వారు వేరుగా, దూరంగా ఉండాలి.

## 22వ అధ్యాయం

**ఈదుల్ అజ్‌హా రోజున ఈద్గాహ్‌లోనే నహ్ర్ మరియు జిబహ్ చెయ్యటం గురించి.[1]**

**98.** హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు ఈద్గాహ్‌లోనే నహ్ర్ మరియు జిబహ్ చేసేవారు.[1]'

## 23వ అధ్యాయం

**పండుగ రోజున ఖుత్బా ప్రసంగం జరిగేటప్పుడు ఇమామ్ మరియు ప్రజలు మాట్లాడు కోవడం[1] ఖుత్బా ఇచ్చే సమయంలో ఇమామ్‌ను ప్రజలు ఏదైనా విషయం గురించి అడిగినప్పుడు అతను దానికి సమాధానం చెప్పటం.**

---

22-1. నహ్ర్ అనేది ఒంటెకు సంబంధించినది. మిగతా పశువులను పండుకోబెట్టి జిబహ్ చేస్తారు. ఒంటెను కూర్చోబెట్టి లేదా నిలబెట్టి దాని రొమ్ముల్లోకి బరిశెనుగాని, కత్తినిగాని పొడుస్తారు. దీనినే నహ్ర్ అని అంటారు.

98-1. ఎందుకంటే ఖుర్బానీ చెయ్యటం అనేది ఇస్లామ్ ధర్మానికి సంకేతం, గుర్తు. అది విద్యుక్త ధర్మం. కనుక దాని ప్రదర్శన, దాని వ్యక్తీకరణ బహిరంగంగా జరగటం శ్రేష్ఠమైనది, ఉత్తమమైనది. మాలికియ మస్లక్‌వారు ఏమన్నారంటే, ఇమామ్ జిబహ్ చెయ్యనంత వరకు ఇతరులెవ్వరూ ఖుర్బానీ చెయ్య కూడదు. ఇది ముతషర్ర ఇమామ్ (షరీయత్ ప్రకారం పని చేసే ఇమామ్) ఉన్న చోటనే జరుగుతుంది.

23-1. శుక్రవారం రోజున ఖుత్బా ప్రసంగం జరిగేటప్పుడు మాత్రమే మాట్లాడు కోవడం నిషిద్ధం. పండుగ రోజున ఖుత్బా ప్రసంగం జరిగేటప్పుడు కాదు.

**99.** బరా బిన్ ఆజిబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఒకసారి ఈదుల్ అజ్‌హా పండుగనాడు మమ్మల్ని ఉద్దేశించి ఖుత్బా ప్రసంగం చేశారు. ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు: 'ఎవరైతే మేము నమాజుచేసే విధంగా నమాజు చేస్తారో మరియు మేము చేసే ఖుర్బానీ మాదిరిగా ఖుర్బానీ చేస్తారో, అతను చేసిన ఖుర్బానీ మా సంప్రదాయం ప్రకారం చేసిన ఖుర్బానీ అవుతుంది. "ఎవరైతే నమాజుకు ముందే ఖుర్బానీ చేశాడో అది ఖుర్బానీ ఎలా అవుతుంది? అది కేవలం మేక మాంసమే అవుతుంది. అప్పుడు అబూ బర్దాబిన్ నియార్(ర) ఇలా విన్నవించుకున్నారు: 'ఓ దైవప్రవక్తా(స)! నేనైతే నమాజుకు బయలుదేరే ముందే ఖుర్బానీ చేశాను. ఈ రోజు తినే త్రాగే రోజని నేను అనుకున్నాను. కనుక నేను తొందరపడ్డాను. ఆ మాంసాన్ని స్వయంగా నేను కూడా తిన్నాను, నా ఇంటివారికీ, నా పొరుగువారికి కూడా తినిపించాను. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; ఇదైతే కేవలం మాంసపు మేకగానే నిలుస్తుంది.[1] అబూ బర్దా(ర) ఇలా అన్నారు: నా దగ్గర సంవత్సరం వయస్సుగల ఒక మేక ఉన్నది. అది రెండు మేకలకంటే కూడా శ్రేష్టమైనది. నేనుగనక దానిని ఖుర్బానీగా ఇస్తే అది నా తరఫునుంచి సరిపోతుందా? ధర్మ సమ్మతమవుతుందా? దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "అవును సరిపోతుంది. కాని నీ తరువాత అది మరెవరికీ సరిపోదు".

**100.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి ఈదుల్ అజ్‌హా పండుగరోజున నమాజు చేయించారు, తరువాత ఖుత్బా ప్రసంగాన్ని వినిపించారు. ఇంకా ప్రజల్ని ఉద్దేశించి ఇలా ఆజ్ఞాపించారు. 'ఎవరైతే నమాజుకు ముందే జిబహ్ చేశారో వారు రెండోసారి కూడా పశువును జిబహ్ చెయ్యాలి. ఇది విన్నటువంటి ఒక అన్సారీ పురుషుడు లేచి నిలబడ్డాడు మరియు ఇలా అన్నాడు: "ఓ దైవప్రవక్తా(స)! నా పొరుగున కొందరు ప్రజలు ఉన్నారు వారు ఆకలివల్ల బాధపడుతూ ఉంటారు. లేదా ఆయన ఇలా అన్నారు "వారు నిస్సహాయులు, నిరుపేదలు" ఈ కారణంగా నేను నమాజుకు ముందే పశువును జిబహ్ చేశాను. ఇప్పుడు నా దగ్గర ఒక సంవత్సరం వయస్సుగల

---

99-1. దీనిద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఇమామ్ మరియు ప్రజలు పండుగ రోజున ఖుత్బా ప్రసంగ సమ యంలో పరస్పరం మాట్లాడుకోవచ్చు. ఇంకా ఎవరైనా ఏదైనా విషయం గురించి ఇమామ్‌ను అడిగితే ఆయన జవాబు కూడా చెప్పవచ్చు.

ఒక మేక ఉన్నది. అది మాంసం గల రెండు మేకలకంటే నాకు ఎక్కువ ఇష్టమైనది". అప్పుడు దైవప్రవక్త(స) అతనికి అనుమతి ఇచ్చారు.

**101.** జున్‌దబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స), ఒకసారి ఈదుల్ అజ్‌హా పండుగ రోజున నమాజు చేశారు, తరువాత ఖుత్బా ప్రసంగాన్ని వినిపించారు. ఆ తరువాత ఖుర్బానీ చేశారు. ఇంకా ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయితే నమాజుకు ముందే పశువును జిబహ్ చేశాడో ఆ వ్యక్తి దానికి బదులుగా మరొక ఖుర్బానీ చెయ్యాలి. ఎవరైతే అసలు జిబహ్ చెయ్య లేదో అతను అల్లాహ్ పేరుతో జిబహ్ చెయ్యాలి."

## 24వ అధ్యాయం

**ఏ మనిషైతే ఈద్గాహ్‌కు ఒక మార్గం నుంచి పోతాడో ఆ మనిషి తన ఇంటికి మరొక మార్గం ద్వారా తిరిగి రావాలి.**

**102.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) పండుగ రోజున ఒక మార్గం గుండా ఈద్గాహ్‌కు పోయేవారు. మరొక మార్గం గుండా ఇంటికి తిరిగి విచ్చేసేవారు.

## 25వ అధ్యాయం

**ఒకవేళ ఎవరికైనా పండుగ నమాజు దొరక్కపోతే (అంటే జమాఅత్‌తో కలిసి చేసే ఈ పండుగ నమాజు) అప్పుడు అతను ఒంటరిగా రెండు రకాతుల నమాజును చేసుకోవాలి. స్త్రీలు కూడా మరియు ఎవరైతే తమ గృహాలలోనూ, గ్రామాలలోనూ, ఇతర స్థలాలలోనూ ఉండిపోతారో (అంటే జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యలేకపోతారో) వారు కూడా పై విధంగానే చెయ్యాలి. ఎందుకంటే, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: 'ఓ ముస్లిములారా! ఇది మన అందరి పండుగ' అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) తన బానిస అయిన ఇబ్నె అబీ గనియ్యను జావియాలో ఆజ్ఞాపించారు: ఆయనగారి ఆజ్ఞానుసారం అతను అనస్ (ర) గారి కుటుంబ సభ్యులందరినీ మరియు ఆయన గారి పిల్లలందరినీ ఒకచోట సమావేశపరిచాడు. హజ్రత్ అనస్ (ర) నగరవాసుల మాదిరిగా వారిచేత పండుగ నమాజును చేయించారు. మరియు వారు చెప్పిన మాదిరిగానే తక్బీర్‌లు కూడా పలికారు. ఇక్రిమ ఇలా అన్నారు; గ్రామస్థులు పల్లెటూరి వారు కూడా పండుగ రోజున ఒకచోట సమావేశం కావాలి. మరియు నగరవాసుల మాదిరిగానే రెండు రకాతుల నమాజు చెయ్యాలి ఇమామ్ చేసిన విధంగానే. అతా ఇలా అన్నారు; ఒకవేళ పండుగ నమాజు దొరకని పక్షంలో రెండు రకాతుల నమాజు చేసుకోవాలి.**

**103.** హజ్రత్ ఆయెషా (ర.అ) ఇలా ఉల్లేఖించారు; 'మినా రోజులలో అంటే జిల్‌హజ్జా మాసం **11, 12, 13** తేదీలలో హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (రజిఅన్) ఆమెగారి ఇంటికి వెళ్ళారు. అక్కడ ఇద్దరు బాలికలు దప్పు (ఖంజరి) వాయిస్తున్నారు (బుఆస్ యుద్ధానికి చెందిన గీతాలను వారు పాడుతున్నారు). దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) తమ వస్త్రాన్ని కప్పుకుని అక్కడ పండుకుని ఉన్నారు. అబూబకర్ (ర) ఆ బాలికలను ఉద్దేశించి కేకలేశారు. అప్పుడు ఆయన (స) గారు తన ముఖం మీద ఉన్న వస్త్రాన్ని తొలగించి ఇలా సెలవిచ్చారు: "ఓ అబూబకర్! వారిని వదిలెయ్యండి, ఇవి పండుగ రోజులు, ఇవి మినా దినాలు" హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా అన్నారు; 'నేను గమనించాను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నాకు అడ్డంగా నిలుచున్నారు. నేను హబషీల (నల్లబానిసల) వైపునకు చూస్తూ ఉన్నాను. వారు మస్జిద్‌లో (ఆయుధాలతో) ఆడుకుంటున్నారు. హజ్రత్ ఉమర్ (రజిఅన్) వారిని చివాట్లు పెడుతున్నారు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "ఓ ఉమర్! వారిని వదిలెయ్యి. ఓ బనీ అర్‌ఫిద! మీరు నిర్భయంగా ఆడుకోండి."

## 26వ అధ్యాయం

**ఈద్గాహ్ మైదానంలో ఈద్ నమాజుకు ముందుగానీ లేదా ఈద్ నమాజు చేసిన తరువాతగాని నఫిల్ నమాజు చేసే విషయం గురించి. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఈద్ నమాజుకు ముందు నఫిల్ నమాజు చెయ్యటాన్ని అవాంఛనీయ మైన విషయంగా భావించేవారు.**

**104.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'ఒకసారి ఈదుల్ ఫిత్ర్ నాడు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) తమ ఇంటినుంచి బయలు దేరారు. తరువాత ఆయన (స) గారు రెండు రకాతులు పండుగ నమాజును చేయిం చారు. ఆ రెండు రకాతులకు ముందుగానీ తరువాతగానీ ఆయన (స)గారు నఫిల్ నమాజు చెయ్యలేదు. హజ్రత్ బిలాల్ (ర) ఆయన (స) గారితో ఉన్నారు.[1]

# విత్ర్ అధ్యాయాలు

## 27వ అధ్యాయం

**105.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి

---

104-1. చాలామంది విద్వాంసుల అభిప్రాయం ఏమిటంటే, ఈద్గాహ్ మైదానంలో ఈద్ నమాజుకు ముందుగాని దాని తరువాత గాని నఫిల్ నమాజు చెయ్యటం మక్రూహ్ అంటే అవాంఛనీయమైనది. హనఫీ మస్లక్ వారు ఈద్‌కు ముందు నఫిల్ నమాజు చెయ్యటం మక్రూహ్, దాని తరువాత మటుకు మక్రూహ్ కాదు అని అంటారు.

ఒక మనిషి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) లేదా మరొక వ్యక్తి ఎవరైనానేమో) దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) గారిని రాత్రి నమాజు (తహజ్జుద్ నమాజు) ను గురించి అడిగాడు. దానికి సమాధానంగా దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: 'రాత్రి నమాజును రెండేసి రకాతులు చొప్పున చెయ్యాలి. తరువాత ఎవరైనా ఫజ్ర్ నమాజు సమయం దగ్గర పడుతోందని భయపడితే అప్పుడు ఒకే రకాతు చెయ్యాలి. అది అతను చేసిన మొత్తం నమాజును బేసి నమాజు చేసి వేస్తుంది. ఈ ప్రమాణం ఆధారంగానే నాఫె ఇలా ఉల్లేఖించారు: 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) వితర్‌కు సంబంధించిన మూడు రకాతులు చేసినపుడు రెండు రకాతులు చేసిన తరువాత సలామ్ చేసేవారు. చివరకు ఏదైనా అవసరం కలిగినప్పుడు మాట్లాడేవారు కూడా'.

**106.** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి ఒకనాటి రాత్రి నేను విశ్వాసుల తల్లి అయినటువంటి మైమూన (ర.అ) (ఆయన (ర) గారికి మేనత్త అవుతారు) గారి ఇంట్లో గడిపాను. ఆ రాత్రి నేను పక్క మీద కింది భాగంలో అడ్డుగా పండుకుని నిద్రపోయాను. దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మరియు ఆయన (స) గారి భార్య ఉభయులూ ఆ పక్క మీద నిలువుగా పండుకున్నారు. సగం రాత్రి గడచిన తరువాత లేదా దాదాపు అంత సమయం గడచిన తరువాత దైవప్రవక్త (స) మేల్కొన్నారు. ముఖాన్ని చేత్తో తుడుచుకుంటూ నిద్ర మత్తును దూరం చేసుకున్నారు. ఆ తరువాత ఆయన (స) గారు ఖురానులోని ఆలె ఇమ్రాన్ సూరాలోని చివరి పది ఆయతులను పఠించారు. ఇంట్లో వ్రేలాడుతూ ఉన్న, నీళ్లు ఉన్న తోలు సంచి వద్దకు వెళ్లారు. చక్కగా వుజూ చేసుకున్నారు. తరువాత నిలబడి నమాజు చెయ్య సాగారు. నేను కూడా ఆయన (స) గారు ఎలా చేశారో అలాగే చేశాను. ఆయన (స) గారి ప్రక్కన నిలబడ్డాను. ఆయన (స) ప్రేమతో, వాత్సల్యంలో తన కుడి హస్తాన్ని నా శిరస్సు మీద పెట్టారు. ఇంకా నా చెవి పట్టుకుని మెలిపెట్టసాగారు. ఆ తరువాత రెండు రకాతుల నమాజు చేశారు, మళ్లీ రెండు రకాతులు, మళ్లీ రెండు రకాతులు. మళ్లీ రెండు రకాతులు, మళ్లీ రెండు రకాతులు, మళ్లీ రెండు రకాతులు మొత్తం కలిపి పన్నెండు రకాతులు చేశారు. ఆ తరువాత ఒక రకాతు వితర్ నమాజు చేశారు. తరువాత పక్కమీద మేను వాల్చారు. చివరకు నమాజు కోసం పిలవటానికి ముఅజ్జిన్ వచ్చారు. అప్పుడు ఆయన (స) గారు లేచి రెండు రకాతులు సున్నత్ చేశారు. ఆ తరువాత బయటికి వెళ్ళారు. మరియు ఫజ్ర్ నమాజును చేయించారు.

**107.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు; 'రాత్రి నమాజును రెండేసి రకాతులుగా చెయ్యాలి. తరువాత నీవు నమాజును ముగించదలచినప్పుడు ఒక రకాతు వితర్ నమాజు చెయ్యి. అది నీ మొత్తం నమాజును బేసి నమాజుగా చేసేస్తుంది. ఖాసిమ్ బిన్ ముహమ్మద్ ఇలా అన్నారు: 'మాకు ప్రాజ్ఞత వచ్చినప్పటి నుంచి మేము చాలా మందిని మూడు రకాతుల వితర్ నమాజును చేస్తూ ఉండగా చూశాము. మూడు రకాతుల వితర్‌గానీ లేదా ఒక రకాతు వితర్ గానీ అన్నీ ధర్మసమ్మత మైనవే. దేనిలోనూ దోషం లేదు అని నేను ఆశిస్తున్నాను.

**108.** హజ్రత్ ఆయెషా (ర.అన్‌హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) రాత్రి సమయంలో పదకొండు రకాతుల (వితర్ మరియు తహజ్జుద్) నమాజు చేసేవారు. (ఆయన (స) గారు చేసే రాత్రి నమాజు ఇదే. ఆ నమాజులలో సజ్దా ఎంత సేపు చేసే వారంటే, ఆయన (స) గారు తన శిరస్సును ఎత్తే వరకు మీలో ఎవరైనా సరే, యాభై ఖురాను వాక్యాలను పఠించవచ్చు. ఇంకా ఫజ్ర్ నమాజుకు ముందు ఆయన (స) గారు రెండు రకాతులు సున్నత్ నమాజు చేసేవారు. ఆ తరువాత కుడి వైపునకు తిరిగి కొంచెం సేపు పండుకునేవారు. చివరకు నమాజు కోసం ఆయన (స) గారిని పిలిచేందుకు ముఅజ్జిన్ ఆయన (స) వద్దకు వచ్చేవాడు.

## 28వ అధ్యాయం

**విత్ర్ నమాజు చేసే సమయం, అబూ హుర్రైరా (రజిఅన్) ఇలా అన్నారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నాకు ఇలా బోధించారు: "నిదురపోయే ముందు వితర్ నమాజు చేసుకో."**

**109.** అనస్ బిన్ సీరీన్ ఇలా ఉల్లేఖించారు: 'నేను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర)ను ఇలా అడిగాను, ఫజ్ర్ సమయంలో నేను చేసే సున్నత్ నమాజుల్లో ఖుర్‌ఆన్ పారాయణాన్ని మరింత పొడవుగా చెయ్యమంటారా? సమాధానంగా ఆయన ఇలా అన్నారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారైతే రాత్రిపూట చేసే నమాజు (తహ జ్జుద్)ను రెండేసి రకాతులుగా చేసేవారు. ఆ తరువాత ఒక రకాతు నమాజు చేసి వాటిని బేసిగా చేసుకునేవారు. ఇంకా ఫజ్ర్ నమాజుకు ముందు చేసే రెండు రకాతుల సున్నత్ నమాజునైతే ఎలా చేసేవారంటే, ఆయన(స) గారి చెవుల్లో తక్బీర్ ధ్వని ప్రతిధ్వనిస్తూ ఉండేది. అంటే త్వరత్వరగా చేసేవారని హమ్మాద్ అన్నారు.

**110.** హ్రజత్ ఆయెషా(ర.అన్హా) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలోని అన్నివేళల్లో (భాగాలలో) వితర్ నమాజు చేసేవారు. చివర్లో ఆయన(స)గారు చేసే వితర్ నమాజు ఫజర్ నమాజుకు దగ్గరగా ఉండేది.

## 29వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వితర్ నమాజు కోసం తన ఇంటివారిని లేపేవారు.**

**111.** హ్రజత్ ఆయెషా(ర.అ) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) తహజ్జుద్ నమాజును చేసేవారు. నేను పక్కమీద అడ్డంగా తిరిగి పడుకునే ఉండేదాన్ని. ఆయనగారు వితర్ నమాజు చేసేముందు నన్ను లేపే వారు. నేను కూడా వితర్ నమాజు చేసుకునేదాన్ని.

## 30వ అధ్యాయం

**విత్ర్ నమాజును రాత్రి నమాజు చివర్లో చెయ్యాలి.**

**112.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు: 'రాత్రి సమయంలో వితర్ నమాజును చివరి నమాజుగా చేసుకోండి.'

## 31వ అధ్యాయం

**పశువుపై స్వారీ చేస్తూ విత్ర్ నమాజు చెయ్యటం.**

**113.** సయీద్ బిన్ యసార్ ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి నేను అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్(రజిఅన్)తో కలిసి మక్కా పట్టణానికి వెళుతున్నాను. ఫ్రజ్ సమయం అయిందేమోనని నేను భయపడ్డాను. అప్పుడు నేను వాహనం మీదనుంచి కిందికి దిగి విత్ర్ నమాజు చేశాను. తరువాత వాహనాన్ని (త్వరత్వరగా తోలి) ఆయన(ర) గారిని కలిశాను. ఆయన, 'నీవు ఇంతసేపు ఎక్కడున్నావు?' అని అడిగారు. నేను ఇలా జవాబు చెప్పాను: 'ఫ్రజ్ వేళ అయిపోయిందేమోనని నేను భయపడ్డాను. అప్పుడు నేను కిందికి దిగి విత్ర్ నమాజు చేశాను'. అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స)గారిని అనుసరించటం నీకు మేలైన విషయంగా అనిపించటంలేదా?' 'ఎందుకు అనిపించదు? అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను అది మేలైనదే.' అని నేను అన్నాను : ఆయన(ర) ఇలా అన్నారు 'దైవప్రవక్త(స) గారైతే ఒంటెమీద స్వారీ చేస్తూనే విత్ర్ నమాజు చేసేవారు.'

## 32వ అధ్యాయం

## ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా విత్ర్ నమాజు చెయ్యటం.

**114.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ప్రయాణంలో ఉన్నప్పుడు రాత్రి నమాజును తన ఒంటెమీద ఉండే సైగల ద్వారా చేసేవారు, అది ఆయన(స)గారిని ఎటువైపు తీసుకు పోయినాసరే. కాని ఫజ్ర్ నమాజు మాత్రం ఒంటె మీద చేసేవారు కాదు. విత్ర్ నమాజును మటుకు తన ఒంటెమీద ఉండే చేసేవారు.'

## 33వ అధ్యాయం

## (వితర్ నమాజులోనూ మరియు ప్రతి నమాజులోనూ) రుకూకు ముందు, రుకూ తరువాత ఖునూత్ ప్రార్థన పఠించటం.

**115.** ముహమ్మద్ బిన్ సీరీన్ ఇలా ఉల్లేఖించారు: 'హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్)ను ఇలా అడగడం జరిగింది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫజ్ర్ నమాజులో ఖునూత్ ప్రార్థన పఠించేవారా? సమాధానంగా ఆయన(ర) 'అవును పఠించేవారు' అని అన్నారు. ఆయన్నే మళ్ళీ ఇలా అడగటం జరిగింది: 'రుకూ చెయ్యటానికి ముందా?' హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు 'ఆయన ఖునూత్ ప్రార్థనను రుకూ చేసిన తరువాత కొన్ని దినాల వరకు పఠించేవారు (ఒక మాసం వరకు)'.

**116.** ఆసిమ్ బిన్ సులైమాన్ ఇలా ఉల్లేఖించారు: 'నేను ఒకసారి అనస్ బిన్ మాలిక్(రజిఅన్)ను ఖునూత్ ప్రార్థనను గురించి అడిగాను. సమాధానంగా ఆయన (ర), ఖునూత్ ప్రార్థన దైవప్రవక్త(స)గారి హయాంలో ఉండేది. అది నిస్సందేహంగా పఠించబడేది అని అన్నారు. నేను ఆయన్ని(ర) అడిగాను. 'రుకూకు ముందా? లేక రుకూ తరువాతనా?' అని. ఆయన(ర), రుకూకు ముందు అని జవాబు చెప్పారు. అప్పుడు, నేను ఆయన్ని ఇలా అడిగాను 'ఫలానా వ్యక్తి అయితే, మీరు రుకూ తరువాత' అని అన్నారని ఉల్లేఖించాడు. అప్పుడు ఆయన(ర) 'అది తప్పు, రుకూ తరువాతనైతే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక మాసం వరకు ఖునూత్ ప్రార్థనను పఠించారు. అసలు జరిగింది ఏమిటంటే, దైవప్రవక్త(స) గారు తన సహాబాలలో నుంచి దాదాపు డెబ్బైమంది ఖారీలను బనీ ఆమిర్ అనే ఒక ముష్రిక్కు తెగ వైపునకు,

వారికి ధర్మజ్ఞానం నేర్పటానికి పంపారు. వీరు దైవప్రవక్త(స) శపించినవారిలో లేరు. (బద్దుఆ చేసినవారిలో లేరు) వారికీ, దైవ ప్రవక్త(స) గారికీ మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. కాని వారు ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. మరియు ఖారీలను దారుణంగా హతమార్చారు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక నెలవరకు (రుకూ తరువాత) ఖునూత్ ప్రార్థన పఠిస్తూ వచ్చారు. మరియు ఆ దుర్మార్గులను శపిస్తూ వుండేవారు.

**117.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక మాసం వరకు ఖునూత్[1] ప్రార్థన చేశారు. (ఫజర్ నమాజులో) అందులో ఆయన(స) రఅల్ మరియు జక్వాన్ తెగలను శపించేవారు (బద్దుఆ చేసేవారు).

**118.** హజ్రత్ అనస్(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఆయన ఇలా అన్నారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలంలో మగ్రిబ్, ఫజర్ నమాజులలో 'ఖునూత్', పఠించబడేది.

---

117-1. ఖునూతె నాజిలాకు తెలుగు అనువాదం: ఓ అల్లాహ్! నీవు మాకు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించు. మమ్మల్ని సన్మార్గగాములలో చేర్చు. మాకు శ్రేయస్సును ప్రసాదించి శ్రేయస్సు పొందినవారిలో చేర్చు. నీవు మా రక్షకుడవై నీ రక్షణ పొందినవారిలో మమ్మల్ని చేర్చు. నీవు మాకు ప్రసాదించిన వాటిలో వృద్ధిని కలిగించు. నీవు నిర్ణయించిన చెడుల చెడుగునుండి మమ్మల్ని కాపాడు. నీవు అన్నింటిని నిర్ణయిస్తావు. నీపైన ఎవరి నిర్ణయమూ చెల్లదు. నీ రక్షణ పొందినవారు ఎన్నటికీ అవమానంపాలు కాలేరు. నీచే శత్రువుగా పరిగణించ బడినవాడు ఎన్నటికీ గౌరవం పొందలేదు. నీవు అపారమైన శుభాలు ప్రసాదించేవాడవు. మహోన్నతుడు, మహోత్కృష్టుడవైన మా ప్రభూ! మేము నిన్ను క్షమాపణ అర్థిస్తున్నాము. నీ సన్నిధిలో పశ్చాత్తాపాన్ని వెల్లడిస్తు న్నాము. ప్రభూ! నీ మార్గంలో అవరోధాలు సృష్టిస్తున్న, నీ ప్రవక్తలను తిరస్కరిస్తున్న, నీ భక్తులతో పోరాడుతున్న తిరస్కా రులను శిక్షించు.

ఓ ప్రభూ! విశ్వసించిన పురుషులను స్త్రీలను, ముస్లిమ్ పురుషులను, స్త్రీలను క్షమించు. వారి పరస్పర సంబంధా లను మెరుగుపరుచు. వారి అంతరాళాల్లో ప్రేమ, విశ్వాసం, వివేకం సృజించు. వారిని వారి ప్రవక్త(స)సమాజంలో స్థిరంగాఉంచు. నీవు వారినుంచి తీసుకున్న వాగ్దానాన్ని వారు నెరవేర్చగలిగే, సద్బుద్ధిని అనుగ్రహించు. నీకూ,వారికీ శత్రువు లైనవారిని ఎదుర్కొనేలా వారికి సహాయం చెయ్యి. ప్రభూ! మా మొరలనాలకించు, మమ్మల్ని కూడా వారిలో చేర్చు.

# ఇస్తిస్ఖా అధ్యాయాలు

(వర్షాన్ని కురిపించమని అల్లాహ్‌ను వేడుకునే అధ్యాయాలు)

## 1వ అధ్యాయం

**వర్షాన్ని కురిపించమని వేడుకోవటం. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వర్షం కోసం దుఆ చెయ్యటానికి బయటికి పోవటం.**

**119.** అబ్బాద్ బిన్ తమీమ్‌గారి బాబాయి అయిన అబ్దుల్లాహ్ బిన్ జైద్(ర) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) వర్షం కోసం వేడుకోవటానికి బయటికి వెళ్ళారు. మరియు తన దుప్పటిని తిరగవేశారు.'

## 2వ అధ్యాయం

**దైవప్రవక్త(స) ఖురైష్ అవిశ్వాసులను శపించటం. అంటే "ఓ అల్లాహ్! వారిపైకి పవక్త యూసుఫ్‌కు సంబంధించిన కరవు సంవత్సరాల్లాంటివి పంపు" అని కోరటం.**

**120.** హజ్రత్ అబూహురైరా(ర) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫర్జ్ నమాజులోని చివరి రకాతులో రుకూలోనుంచి తన శిరస్సును పైకి ఎత్తినప్పుడల్లా ఇలా సెలవిచ్చేవారు 'ఓ అల్లాహ్! అయాష్ బిన్ అబీ రబీఅను విడిపించు. ఓ అల్లాహ్! సలమా బిన్ హిషామ్‌ను విడిపించు ఓ అల్లాహ్! వలీద్ బిన్ వలీద్‌ను విడిపించు ఓ అల్లాహ్! నిస్సహాయులు, అశక్తులు అయిన ముస్లింలను విడిపించు.'

ఓ అల్లాహ్! ముజర్‌కు చెందిన అవిశ్వాసులను కఠినంగా పట్టుకో, ఓ అల్లాహ్! ప్రవక్త యూసుఫ్(అ)పైకి వచ్చిన కరవు సంవత్సరాలను వారిపైకి పంపు, ఇంకా దైవ ప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: 'గఫ్ఫార్ తెగకు చెందిన ప్రజలను అల్లాహ్ క్షమించాడు. మరియు అస్లం తెగకు చెందిన ప్రజలను అల్లాహ్ రక్షించాడు.' ఇబ్నె అబీ జినాద్ (ఒక ఉప ఉల్లేఖకుడు) ఇలా అన్నారు 'దైవప్రవక్త ముహమ్మద్(స) ఖునూత్‌ను ఫజ్ర్ నమాజులో పఠించేవారు.'

**121.** మస్రూఖ్ ఇలా ఉల్లేఖించారు: మేము ఒకసారి అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్)గారి దగ్గర కూర్చొని ఉన్నాము. ఆయన(ర) ఇలా అన్నారు "ఖురైష్‌కు చెందిన అవిశ్వాసులు ఇక ఎట్టిపరిస్థితిలోనూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించరు అనే విషయాన్ని గమనించిన దైవప్రవక్త(స) మహాశయులు ముహమ్మద్(స) వారికోసం బద్‌దుఆ చేశారు (వారిని శపించారు). 'ఓ అల్లాహ్! 'ఏడు సంవత్సరాల కరవు కాటకాలను వారిపైకి పంపు. ప్రవక్త యూసుఫ్(అ) కాలంలో పంపినట్లుగా.' తరువాత వారిపై ఎలాంటి కరవు వచ్చి పడిందంటే, అది ప్రతి వస్తువునూ నాశనం చేసివేసింది. చివరకు వారు తోళ్ళనూ, మృతకళేబరాలను, కుళ్ళిపోయిన శవాలను తినేవారు. వారిలో ఒకడు ఎవరైనా ఆకాశాన్ని చూసినప్పుడు ఆకలి బాధ కారణంగా అది పొగమాదిరిగా కనిపించేది. చివరకు (నిస్సహాయుడై) అబూ సుఫ్యాన్ దైవప్రవక్త(స) వద్దకు వచ్చి ఇలా అనసాగాడు, 'ఓ ముహమ్మద్(స)! మీరైతే అల్లాహ్‌కు విధేయత చూపమని, బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండమనీ ఆదేశిస్తారు కదా! ఇప్పుడు మీ జాతి ప్రజలైతే దారుణంగా మరణిస్తున్నారు. వారికోసం దుఆ చెయ్యండి'. అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో దుఖాన్ సూరాలో ఇలా సెలవిచ్చాడు: "సరే స్పష్టమైన పొగను తీసుకుని ఆకాశం వచ్చే దినం కోసం నిరీక్షించండి. అది ప్రజలను కమ్ముకుంటుంది. ఇదే వ్యధాభరితమైన శిక్ష... మీరు పూర్వం చేస్తూ ఉన్న దానినే మళ్ళీ చేస్తారు" (దుఖాన్ **10– 15**). కనుక ఖుర్‌ఆన్‌లో ఏ పొగను గురించి, ఏ గట్టి దెబ్బను గురించి, ఏ ఖైదును గురించి ప్రస్తావించబడిందో అదంతా జరిగింది. ఇదేవిధంగా రూమ్ సూరాలో వచ్చిన ఆయత్ కూడా నిజమయింది.

## 3వ అధ్యాయం

### అనావృష్టి సమయంలో వర్షం కోసం దుఆ చెయ్యమని...

**122.** అబ్దుల్లాహ్ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు: 'నా తండ్రి గారు ఇలా అన్నారు, నేను ఇబ్నెఉమర్ (రజిఅన్) చెప్పగా విన్నాను, ఆయన అబూతాలిబ్‌గారి ఈ కవితను చదువుతూ ఉండేవారు.

శ్వేత వర్ణం గలవారు ఆయన, అనాథలకు వితంతువులకు సంరక్షకుడాయన, శుభప్రదమైన ఆయన నోటి ద్వారా ప్రజలు వర్షం కురిపించమని దుఆ చేయించేవారు.

సాలిమ్ తండ్రిగారైన ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు: 'అబూతాలిబ్ గారి ఈ

కవిత నా మనస్సుకు తట్టేది. అప్పుడు నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స)గారి ముఖాన్ని చూసేవాణ్ణి. ఆయన(స) గారు మెంబర్‌పై నిలబడి నీటికోసం దుఆ చేసేవారు. తరువాత మెంబర్‌పైనుంచి ఇంకా దిగేవారు కూడా కాదు. వర్షం వల్ల పిల్ల కాలువలు ఉధృతంగా ప్రవహించేవి. ఆ కవిత ఏమిటంటే శ్వేత వర్ణంగలవారు ఆయన. అనాథలకు వితంతువులకు సంరక్షకుడాయన. శుభప్రదమైన ఆయన నోటిద్వారా ప్రజలు నీరు అడిగేవారు, ఇది అబూతాలిబ్‌గారి కవిత.

**123.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'హ్రజత్ ఉమర్ (రజిఅన్) గారి కాలంలో అనావృష్టి సంభవించినప్పుడల్లా ఆయన(ర) హ్రజత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ దగ్గరకు వెళ్ళి వర్షాన్ని కురిపించమని అల్లాహ్‌ను ప్రార్థించ వలసిందిగా కోరేవారు. ఇంకా ఆయన (ర) ఇలా అనేవారు 'ఓ అల్లాహ్! పూర్వం వర్షం కోసం మేము మా ప్రవక్త(స)ను నిన్ను ప్రార్థించమని కోరేవారం. అప్పుడు నీవు వర్షాన్ని కురిపించేవాడవు. ఇప్పుడు మా ప్రవక్త(స)గారి బాబాయిగారి ద్వారా వర్షాన్ని కురిపించమని వేడుకుంటున్నాము. మాపై వర్షాన్ని కురిపించు." ఉల్లేఖకుడు ఇలా అన్నారు 'ఆ తరువాత వర్షం కురిసింది.'

## 4వ అధ్యాయం

### ఇస్తిస్ఖాలో దుప్పటిని తిరగవెయ్యటం.

**124.** హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇస్తిస్ఖా చేశారు (వర్షాన్ని కురిపించమని వేడు కున్నారు) అప్పుడు ఆయన(స)గారు తన దుప్పటిని తిరగేశారు.

**125.** అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి ఈద్‌గాహ్‌కు వెళ్ళారు. అక్కడకుపోయి ఆయన(స) వర్షం కురవటానికి దుఆ చేశారు. అప్పుడు ఆయన(స) ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని త్రిప్పారు. ఇంకా తన దుప్పటిని తిరగేశారు. మరియు రెండు రకాతులు నమాజు చేశారు.[1]

---

125-1. అంటే ఈద్ నమాజు మాదిరిగా. 'ఇస్తిస్ఖా' నమాజు సమయం కూడా ఈద్ నమాజు సమయంలాంటిదే. కొందరేమంటారంటే, ఈ నమాజుకు ఒక ప్రత్యేక సమయం అంటూ ఏదీ నిర్ణయించబడలేదు. మొదటి రకాతులో ఈద్ నమాజుకు మాదిరిగా ఏడు తక్బీర్‌లు

## 5వ అధ్యాయం

**అల్లాహ్ నిషేధించిన వస్తువులను ప్రజలు గనక లక్ష్యపెట్టకపోతే అప్పుడు అల్లాహ్ వారిపైకి దుర్భిక్షాన్ని పంపి వారికి ప్రతీకారం చేస్తాడు.**

## 6వ అధ్యాయం

### జామా మసీదులో వర్షం కోసం దుఆ చెయ్యటం.

**126.** షరీక్ ఇబ్నె అబ్దుల్లా బిన్ అబీనమిర్ ఇలా ఉల్లేఖించారు: 'ఆయన అనస్ బిన్ మాలిక్(రజిఅన్) చెబుతూ ఉండగా విన్నారు. ఆయన ఇలా అన్నారు; ఒకసారి ఒక మనిషి(కాబ్ బిన్ ముర్ర లేక అబూ సుఫ్యాన్) జుమారోజున మస్జిదె నబవీలోకి ప్రవేశించాడు. అతను మెంబర్‌కు ఎదురుగా ఉన్న ద్వారంలోనుంచి ప్రవేశించాడు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అప్పుడు మెంబర్ మీద నిలబడి ఖుత్బా పఠిస్తున్నారు. ఆ వ్యక్తి నిలబడే దైవప్రవక్త(స)గారి వైపునకు తన ముఖాన్ని పెట్టి ఇలా అనసాగాడు, 'ఓ దైవప్రవక్తా(స)! వర్షం కురవని కారణంగా పశువులు మరణించాయి, మార్గాలు మూసుకుపోయాయి.[1] కనుక వర్షాన్ని కురిపించమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి'. అనస్(ర)ఇలా అన్నారు: ఇది విని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తన రెండు చేతుల్ని ఎత్తి ఇలా అన్నారు: "ఓ అల్లాహ్! మాకు నీరు త్రాగించు ఓ అల్లాహ్! మాకు నీరు త్రాపించు. ఓ అల్లాహ్! మాకు నీరు త్రాపించు.' అనస్(ర) ఇలా అన్నారు 'ఎంతమాత్రం కాదు. దేవుని సాక్షిగా చెబుతున్నాను! మేము ఆకాశం మీద ఎలాంటి మబ్బునూ చూడలేదు. ఒక మబ్బు తునకను కూడా చూడలేదు, మరొక వస్తువు దేనినీ చూడలేదు. (గాలి మొదలైనవి ఏవీ చూడలేదు, వర్షం కురవబోతోందని తెలుసుకోవడానికి) మాకూ 'సలయి' మధ్య ఒక ఇల్లుగాని, ఒక భవనంగాని లేదు.[2]

---

పలకాలి, రెండో రకాతులో ఐదు తక్బీరులు మరియు ఖిరాత్‌ను బిగ్గరగా చెయ్యాలి. 'ఖాఫ్ సూరా, ఇఖ్‌తర బతిస్సాఅ'ను పఠించాలి. లేదా సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా మరియు గాషియా సూరాలను పఠించాలి. ఇది ఇమామ్ షాఫియి గారి అభిప్రాయం. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) ఇమామ్ అహ్మద్(రహ్మాలై), ఇమామ్ అబూ యూసుఫ్ (రహ్మాలై) మరియు ముహమ్మద్(రహ్మాలై)గార్ల అభి ప్రాయం ప్రకారం తక్బీర్‌లు పలకకూడదు. కేవలం తక్బీరె తహరీమా సరిపోతుంది. ఇంకా నమాజు తరువాత ఖుత్బా పఠించాలి. కొందరేమన్నారంటే నమాజ్‌కు ముందే ఖుత్బా పఠించాలి. ఈ రెండు అభిప్రాయాలూ హదీసుల్లో వచ్చాయి.

126–1) ఎందుకంటే, మార్గంలో మేయటానికి మేత దొరక్కపోతే పశువులు ఎలా ప్రయాణం చేస్తాయి.

ఇంతలోనే సలయి (మదీనా నగరంలోని ఒక కొండ) వెనుక భాగం నుంచి డాలు అంత పెద్ద మబ్బు తనుక ఒకటి ప్రత్యక్షమయింది. అది ఆకాశం మధ్యలోకి వచ్చినప్పుడు నలువైపులా వ్యాపించింది. మరియు వర్షం కురవసాగింది. అనస్(ర) ఇలా అన్నారు: దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను! తరువాత పరిస్థితి ఎంతగా మారిపోయిం దంటే, ఒకవారం రోజులవరకు సూర్యుడు ఆకాశంమీద కనిపించనే లేదు. మరియు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. రెండో జుమా రోజున ఒక వ్యక్తి ఆ ద్వారంలో నుంచే మసీదులోకి ప్రవేశించాడు[3] అప్పుడు దైవప్రవక్త(స) మెంబర్‌పై నిలబడి ఖుత్బా పఠిస్తున్నారు. ఆ వ్యక్తి ఇలా అనసాగాడు: 'ఓ దైవప్రవక్తా(స)! (వర్షం ఎక్కువగా కురవటం వల్ల) పశువులు మరణించాయి, మార్గాలు మూసుకు పోయాయి. కనుక వర్షాన్ని ఆపమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి.' ఇది విని దైవప్రవక్త(స) తన రెండు చేతులను పైకి ఎత్తారు. తరువాత ఇలా దుఆ చేశారు: "ఓ అల్లాహ్! మాకు చుట్టుపక్కల ఉన్న ప్రదేశాలలో వర్షాన్ని కురిపించు. మాపై కురుస్తున్న వర్షాన్ని ఆపెయ్యి. ఓ అల్లాహ్! పీఠ భూముల మీదా, పర్వతాల మీదా, కొండలమీదా, లోయలలోనూ, వృక్షాలు పెరిగే స్థలంలోనూ, వర్షాన్ని కురిపించు." అనస్(ర) ఇలా అన్నారు 'ఈ దుఆ చెయ్యగానే ఆకాశంలోని మబ్బులు తొలగిపోయాయి. మేము ఎండలో బయలు దేరాము. అటూ ఇటూ తిరగసాగాము'. షరీక్ ఇలా అన్నారు: 'నేను అనస్(ర)ను అడిగాను, ఈ రెండోసారి వ్యక్తి మొదట వచ్చిన వ్యక్తియేనా? ఆయన(ర), దానికి సమాధానంగా 'నాకు తెలియదు' అని అన్నారు.'[4]

## 7వ అధ్యాయం

**జుమా ఖుత్బా పఠించేటప్పుడు- ముఖం కాబావైపునకు లేనప్పుడు- నీటి కోసం దుఆ చెయ్యటం.**

---

126-2) సలయి మదీనా నగరంలోని ఒక కొండ. భావం ఏమిటంటే, ఎత్తైన ఒక ఇల్లుగాని, లేక ఒక భవనంగాని అడ్డంగా లేదు. అద్దం మాదిరిగా ఆకాశం నిర్మలంగా ఉంది. వర్షానికి సంబంధించిన ఎలాంటి గుర్తులు లేవు.

126-3) ఇతను మొదట వచ్చిన మనిషేనా లేక రెండో మనిషా? కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, ఈ మనిషి మొదట వచ్చిన మనిషే.

126-4) ఇమామ్ బుఖారి(రహ్మలై) ఈ హదీసు ఆధారంగా తెలియజేసిన విషయం ఏమిటంటే, జామియా మసీదులో కూడా ఇస్తిస్ఖా నమాజు చెయ్యవచ్చును.

**127.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'జుమా రోజున ఒక వ్యక్తి దారుల్ ఖజా[1] వైపున ఉన్నటువంటి ద్వారంలోనుంచి మస్జిదె నబవీ లోకి ప్రవేశించాడు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నిలబడి ఖుత్బాను పఠిస్తూ ఉన్నారు. మసీదులోకి వచ్చిన ఆ వ్యక్తి నిలబడే దైవప్రవక్త(స)గారి ముందుకు వచ్చాడు. మరియు ఇలా అనసాగాడు: 'ఓ దైవప్రవక్తా(స)! పశువులు చనిపోయాయి, మార్గాలు మూసుకుపోయాయి. కనుక మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి మాపై వర్షాన్ని కురిపించమని.' దైవప్రవక్త(స) తన రెండుచేతుల్ని పైకి ఎత్తారు. మరియు ఇలా దుఆ చేశారు "ఓ అల్లాహ్! మాపై వర్షాన్ని కురిపించు, ఓ అల్లాహ్! మాపై వర్షాన్ని కురిపించు, ఓ అల్లాహ్! మాపై వర్షాన్ని కురిపించు." హజ్రత్ అనస్(ర)ఇలా అన్నారు: "దేవునిపై ప్రమాణంచేసి చెబుతున్నాను! (ఆ సమయంలో, ఆకాశం మీద ఎలాంటి మబ్బులూ లేవు. ఇంకా కనీసం ఒక మబ్బు తునుక అయినా లేదు. ఇంకా మాకూ సలయి కొండకూ మధ్య ఒక ఇల్లుగాని లేక ఒకపెద్ద భవనంగాని అడ్డంగాలేదు. ఇంతలోనే సలయి కొండ వెనుక భాగంలోనుంచి డాలు అంత మబ్బుతునక ఆకాశం మీద ప్రత్యక్షమయింది. అది ఆకాశం మధ్య భాగంలోకి వచ్చి నలువైపులా వ్యాపించింది. అప్పుడు ఆకాశంనుంచి వర్షం కురవనారంభించింది. కనుక దేవుని సాక్షిగా చెబుతున్నాను! ఒక వారం వరకు మేము అసలు సూర్యుణ్ణే చూడలేదు. తరువాత అదే ద్వారం నుంచి రెండో జుమారోజున ఒక వ్యక్తి మస్జిద్‌లోకి ప్రవేశించాడు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నిలబడి ఖుత్బాను పఠిస్తున్నారు. ఆ వ్యక్తి నిలబడే దైవప్రవక్త(స) గారి ముందుకు వచ్చాడు. మరియు ఇలా అనసాగాడు : 'ఓ దైవ ప్రవక్తా(స)! పశువులు మృత్యువాతకు గురి అయ్యాయి. మరియు మార్గాలు తెగి పోయాయి (అతివృష్టివల్ల). మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి

---

127–1) 'దారుల్ ఖజా' ఒక గృహం పేరు. ఆ గృహాన్ని హజ్రత్ ఉమర్(రజిఅన్) కట్టించారు. హజ్రత్ ఉమర్(ర)గారికి మరణసమయం వచ్చినప్పుడు లేదా ఆయన(ర) మరణిస్తూ ఉన్నప్పుడు ఆయన ఒక వీలునామా ద్వారా ఇలా వ్రాయించారు "ఈ నా గృహాన్ని అమ్మి నేను చేసిన అప్పులు తీర్చాలి. అంటే నేను బైతుల్ మాల్‌నుంచి తీసుకున్న అప్పు లను" అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) తన తండ్రి ఆజ్ఞానుసారం ఈ గృహాన్ని హజ్రత్ ముఆవియా(ర)కు అమ్మి, హజ్రత్ ఉమర్(ర) గారి అప్పులను తీర్చివేశారు. ఈ కారణం వల్లనే ఆ గృహాన్ని దారుల్ ఖజా' అని ప్రజలు పిలువసాగారు. అంటే ఆ గృహం ద్వారా అప్పు తీర్చబడింది.

వర్షాన్ని ఆపమని.' అప్పుడు దైవ ప్రవక్త(స) తన రెండు చేతుల్ని పైకి ఎత్తారు మరియు ఇలా దుఆ చేశారు "ఓ అల్లాహ్! మాకు నలువైపులా వర్షాన్ని కురిపించు." మాపై వర్షాన్ని కురిపించబాకు. ఓ అల్లాహ్! పీఠభూముల మీదా, పర్వతాల మీదా, కొండలమీదా, లోయలలోనూ, వృక్షాలు పెరిగే స్థలాలలోనూ కాలువల కింది భాగంలోనూ వర్షాన్ని కురిపించు. హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు: అప్పటికప్పుడే మబ్బులు ఆకాశం మీదనుంచి మాయమైపోయాయి. మేము ఎండలో బయలుదేరాము. షరీక్ ఇలా అన్నారు: 'నేను హజ్రత్ అనస్(ర)ను ఇలా అడిగాను ఈ రెండో వ్యక్తీ, మొదట వచ్చిన వ్యక్తీ ఇద్దరూ ఒకరేనా? అనస్(ర) ఇలా సమాధానం చెప్పారు; 'నాకు తెలియదు.'

## 8వ అధ్యాయం

### మెంబర్‌పై నిలబడి నీటికోసం దుఆ చెయ్యటం.1

**128.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఆయన(ర) ఇలా అన్నారు- దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమా రోజు ఖుత్బా పఠిస్తూ ఉన్నారు. ఇంతలోనే ఒక వ్యక్తి వచ్చాడు అతను ఇలా అనసాగాడు 'ఓ దైవ ప్రవక్తా(స)! వర్షం కురవటంలేదు. అది ఆగిపోయింది. కనుక వర్షాన్ని కురిపించమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి.' దైవప్రవక్త(స) దుఆ చేశారు. అప్పుడు వర్షం కురవటం ప్రారంభించింది.మేము మా ఇళ్ళకు పోవటం కష్టతరమై పోయింది. రెండో జుమా రోజున మొదటి జుమారోజున వచ్చిన (లేక) మనిషో (లేక) మరొక మనిషో వచ్చి నిలబడ్డాడు. ఇలా అనసాగాడు: 'ఓ దైవప్రవక్తా(స)! ఈ వర్షాన్ని మాపై కురవకుండా ఆపివెయ్యమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి.' అప్పుడు ఆయన(స) గారు ఇలా దుఆ చేశారు "ఓ అల్లాహ్! మాపై కాకుండా ఈ వర్షాన్ని మాకు చుట్టు పక్కల కురిపించు". హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు: నేను చూశాను- మబ్బులు కుడివైపునకు, ఎడమవైపునకు వీడిపోతున్నాయి. ఇతరులపైన వర్షం కురుస్తోంది. కాని మదీనావాసులపై అది కురవటం లేదు.'

## 9వ అధ్యాయం

### నీటికోసం దుఆ చేసే విషయంలో జుమా నమాజు సరిపోతుందని భావించటం.

**129.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త

---

8-1. హదీసులో మెంబర్‌కు సంబంధించిన వివరణ లేదు. కాని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మెంబర్ వచ్చిన తరువాత ఖుత్బా పఠించినప్పుడల్లా మెంబర్ మీద నుంచే ఖుత్బాను పఠించారు. దీని ద్వారా అధ్యాయం యొక్క అర్థం స్పష్టంగా వ్యక్తమవుతుంది.

మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు ఒక మనిషి వచ్చి, ఇలా అనసాగాడు పశువులు మృతి చెందాయి. మార్గాలు మూసుకు పోయాయి. మీరు దుఆ చేసిన కారణంగా ఈ జుమా నుంచి రెండో జుమా వరకు వర్షం ఎడతెగకుండా కురుస్తూనే ఉంది. తరువాత అతను మళ్ళీ వచ్చాడు, ఇలా అనసాగాడు; 'ఇళ్ళు కూలిపోయాయి. మార్గాలు మూసుకుపోయాయి. పశువులు చనిపోయాయి'. అప్పుడు దైవప్రవక్త(స) నిలబడి ఇలా దుఆ చేశారు : "ఓ అల్లాహ్! మిట్టలమీదా, దిబ్బల మీదా, కొండల మీదా, వృక్షాలు పెరిగే స్థలంలో వర్షాన్ని కురిపించు." ఆయన(స) దుఆ చెయ్యగానే మదీనా నుంచి ఒక వస్త్రం మాదిరిగా మబ్బు చీలిపోయింది.

## 10వ అధ్యాయం

**అతివృష్టి వల్ల మార్గాలు మూసుకుపోతే అప్పుడు వర్షం తగ్గటానికి దుఆ చెయ్యవచ్చు.**

**130.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహ మ్మద్(స)గారి వద్దకు వచ్చాడు. ఆయన(స)గారితో ఇలా అనసాగాడు. 'ఓ దైవప్రవక్తా(స)! (వర్షం కురవకపోవటం వల్ల) పశువులు మృతి చెందాయి. మరియు మార్గాలు మూసుకు పోయాయి. మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి. అప్పుడు ఆయన(స)గారు అల్లాహ్‌ను ప్రార్థించగానే ఒక జుమానుంచి రెండో జుమావరకు ఎడతెగకుండా వర్షం కురుస్తూనే ఉంది. తరువాత ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి వద్దకు వచ్చాడు. మరియు ఆయన(స)గారితో ఇలా అన్నాడు 'ఓ దైవప్రవక్తా(స)! వర్షం ఎక్కువగా కురవటం వల్ల ఇళ్ళు కూలి పోయాయి. మరియు మార్గాలు మూసుకుపోయాయి. పశువులు మృతి చెందాయి.' అప్పుడు దైవప్రవక్త(స) ఇలా దుఆ చేశారు: "ఓ అల్లాహ్! కొండ శిఖరాలపైనా, మిట్టల మీదా, కాలువల క్రింది భాగంలోనూ, వృక్షాలు పెరిగే స్థలాలలోను వర్షాన్ని కురి పించు." ఈ దుఆ చెయ్యగానే ఒక వస్త్రం మాదిరిగా మదీనా నగరంపై నుంచి మబ్బు తొలగిపోయింది.

## 11వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుమా రోజున మసీదులోనే నీటికోసం దుఆ చేసినప్పుడు దుప్పటిని తిరగవేయలేదు.**

**131.** హ[జత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒక వ్యక్తి దైవ[ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ముందు పశువులు మృతి చెందాయనీ, పిల్లలు ఆకలిబాధతో అలమటిస్తున్నారనీ ఫిర్యాదు చేశాడు. అప్పుడు ఆయన (స)గారు అల్లాహ్‌ను [పార్థించారు. వర్షాన్ని కురిపించమని దుఆ చేశారు. ఈ హదీసులో దైవ[ప్రవక్త(స) గారు తన దుప్పటిని తిరగేశారనో, ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని పెట్టారనో [ప్రస్తావించబడలేదు.

## 12వ అధ్యాయం

### ప్రజలు ఇమామ్‌ను వర్షం కోసం ప్రార్థించమని అడిగితే, వారి విజ్ఞప్తిని త్రోసిపుచ్చ కూడదు.

**132.** హ[జత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి దైవ[ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వచ్చి ఇలా అన్నాడు: 'ఓ దైవ[ప్రవక్తా (స) (వర్షం కురవకపోవటం వల్ల) పశువులు చనిపోయాయి. మార్గాలు మూసుకుపోయాయి. కనుక మీరు అల్లాహ్‌ను [పార్థించండి. అప్పుడు ఆయన (స) గారు దుఆ చేశారు. ఆ కారణంగా ఒక జుమా నుంచి మరొక జుమా వరకు మాపై వర్షం కురుస్తూనే ఉంది. ఆ తరువాత ఒక మనిషి దైవ[ప్రవక్త (స) గారి వద్దకు వచ్చి ఇలా అన్నాడు– 'ఓ దైవ[ప్రవక్తా (స) (అతివృష్టి వల్ల) ఇళ్లు కూలిపోయాయి. మార్గాలు మూసుకుపోయాయి. పశువులు చనిపోయాయి.' అప్పుడు ఆయన (స) ఇలా దుఆ చేశారు: "ఓ అల్లాహ్! కొండలపైనా, పీఠభూముల మీదా, లోయలలోనూ మరియు వృక్షాలు పెరిగే స్థలాలలోనూ వర్షాన్ని కురిపించు". వెంటనే ఒక వ[స్త్రం మాదిరిగా మబ్బులు మదీనా పట్టణం నుంచి చీలి పోయాయి.'

## 13వ అధ్యాయం

### ముష్రిక్కులు గనక దుర్భిక్షం వచ్చినపుడు వర్షం కోసం ప్రార్థించమని అడిగితే....

**133.** మ[సూఖ్ ఇలా ఉల్లేఖించారు: 'నేను ఇబ్నె మసూద్ (రజిఅన్) వద్దకు వచ్చాను. ఆయన ఇలా అన్నారు: "ఖురైష్ తెగకు చెందిన అవిశ్వాసులు ఇస్లామ్‌ను స్వీకరించే విషయంలో ఆలస్యం చేశారు. అప్పుడు దైవ[ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) వారిని శపించారు. వారి కోసం బద్‌దుఆ చేశారు. వారిపైకి దుర్భిక్షం వచ్చిపడింది. వారు చనిపోసాగారు. మృత పశువులను, ఎముకలను సయితం తినేశారు. చివరికు అబూ సుఫ్యాన్ దైవ[ప్రవక్త (సఅసమ్) గారి వద్దకు

వచ్చి ఇలా అనసాగాడు: 'ఓ ముహమ్మద్ (స)! నీవయితే (అల్లాహ్ వద్ద నుంచి) బంధుత్వాలను కలిపే ఆజ్ఞను తీసుకు వచ్చావు. నీ జాతి ప్రజలు చచ్చిపోతున్నారు. కనుక నీవు అల్లాహ్‌ను ప్రార్థించు' – అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఖుర్‌ఆన్ గ్రంథంలోని దుఖాన్ సూరాలోని ఈ ఆయతును పఠించారు: 'సరే స్పష్టమైన పొగను ఆకాశం తీసుకుని వచ్చే దినం కొరకు నిరీక్షించండి.' **(44:10).** (దైవప్రవక్త (స)దుఆ చేశారు, వర్షం కురిసింది. కరువు కాటకాలు తొలగిపోయాయి). ఆ తరువాత కూడా వారు అవిశ్వాసపు వైఖరికే కట్టు బడ్డారు. దీనికి సంబంధించిన ప్రస్తావన దుఖాన్ సూరాలోని ఈ ఆయత్‌లో ఉన్నది. మేము గట్టిదెబ్బ కొట్టే ఆ రోజు, మేము మీకు ప్రతీకారం చేసే రోజు అవుతుంది. **(44 :16).** దీని భావం బదర్ యుద్ధం రోజు. అస్‌బాత్ మన్సూర్ నుంచి అదనంగా ఈ విషయాన్ని ఉల్లేఖించారు: దైవప్రవక్త (స) వారికోసం దుఆ చేశారు. అప్పుడు ఏడు రోజుల వరకు ఎడతెగకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఇప్పుడు ప్రజలు అతివృష్టిని గురించి ఫిర్యాదు చేశారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా దుఆ చేశారు "ఓ అల్లాహ్! మా చట్టుపక్కల ఉన్న ప్రదేశాలలో వర్షాన్ని కురిపించు. మాపై వర్షాన్ని కురిపించబాకు". తక్షణం ఆయన (స) శిరస్సు మీద ఉన్న మబ్బులు మటుమాయమై పోయాయి. చుట్టుపక్కల్లో మాత్రం వర్షం కురుస్తూనే ఉంది.'

## 14వ అధ్యాయం

### వర్షం అతిగా కురిసినప్పుడు ఇలా దుఆ చెయ్యటం.

**134.** అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) జుమా రోజున ఖుత్బా పఠిస్తున్నారు. ఇంతలో ప్రజలు హాహాకారాలు చేయసాగారు. వారు ఇలా అన్నారు: 'ఓ దైవప్రవక్తా (స)! వర్షం కురవటం లేదు. వృక్షాలు ఎండిపోయి ఎర్రగా మారిపోయాయి. మరియు పశువులు నాశనమై పోయాయి. వర్షాన్ని కురిపించమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి. దైవప్రవక్త (స) రెండుమార్లు ఇలా విన్నవించుకున్నారు– 'ఓ అల్లాహ్! మాకు మంచినీళ్లు త్రాపించు.' దేవుని సాక్షిగా! అప్పటి వరకు ఆకాశం మీద ఒక మబ్బు తునక కూడా లేదు. దుఆ చేసినంతనే ఒక మబ్బు ఆకాశాన్ని కమ్ముకుంది. మరియు వర్షం కురవసాగింది. ఆయన(స) మెంబర్ మీద నుంచి కిందికిదిగారు. మరియు నమాజు చేయించారు. నమాజు ముగిసింది. మరొక జుమా వరకు ఎడతెగకుండా వర్షం కురుస్తూనే ఉంది.

దైవప్రవక్త (స) రెండో జుమా రోజున ఖుత్బా పఠించటానికి లేచి నిలబడ్డారు. అప్పుడు ప్రజలు మళ్లీ గొడవ చేశారు. ఇళ్లు పడిపోయాయి. రాకపోకలు స్తంభించాయి. మా మీద కురిసే వర్షం ఆపివెయ్యమని అల్లాహ్‌ను ప్రార్థించండి'. ఇది విని ఆయన (స) గారు నవ్వారు మరియు ఇలా దుఆ చేశారు. "ఓ అల్లాహ్! మాకు చట్టుపక్కల్లో ఉన్న ప్రాంతంలో వర్షాన్ని కురిపించు. మాపై కురిపించబాకు". (ఈ దుఆ వల్ల) మదీనా మీద ఉన్న మబ్బులు తొలగిపోయాయి. మదీనా చుట్టుపక్కల్లో వర్షం కురుస్తూనే ఉంది. మదీనాలో మాత్రం ఒక్క చినుకు కూడా పడలేదు. నేను మదీనా పట్టణాన్ని చూశాను. మబ్బు కిరీటం మాదిరిగా వలయాకారంలో ఉంది. మదీనా దానికి మధ్యన ఉంది."

## 15వ అధ్యాయం

'ఇస్తిస్ఖా'లో నిలబడి ఖుత్బా పఠనం చేసేటప్పుడు దుఆ చెయ్యటం; అబూ నుఅయిమ్ ఫజల్ బిన్ దకీన్ మాకు వివరించారు; ఆయన జహీర్‌కు వివరించారు; ఆయన అబూ ఇస్‌హాఖ్‌కు చెప్పారు; ఆయన ఇలా అన్నారు; 'అబ్దుల్లా బిన్ యజీద్ అన్సారీ(ర) 'ఇస్తిస్ఖా' కోసం బయలుదేరారు. మరియు బరా బిన్ ఆజిబ్(ర), యజీద్ బిన్ అర్ఖమ్ (ర) గార్లు కూడా ఆయన(ర)తో ఉన్నారు; ఆయన నీటి కోసం దుఆ చేశారు. అప్పుడు ఆయన తన కాళ్ళ మీద నిలబడ్డారు. మెంబర్ లేదు, దుఆ చేశారు. తరువాత రెండు రకాతుల నమాజ్ చేశారు. వాటిలో బిగ్గరగా ఖుర్ఆన్ పఠించారు. అజాన్ ఇవ్వలేదు. ఇఖామత్ కూడా లేదు. అబూ ఇస్‌హాఖ్ ఇలా అన్నారు; అబ్దుల్లా బిన్ యజీద్ అన్సారీ(ర) గారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని చూశారు.'

**135.** అబ్బాద్ బిన్ తమీమ్ ఉల్లేఖించారు; 'ఆయన గారి బాబాయి, ఒక సహాబి కూడా అయినటువంటి అబ్దుల్లాహ్ బిన్ జైద్ గారు ఆయనకు ఈ సమాచారాన్ని అందించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రజల్ని తమతో తీసుకుని ఇస్తిస్ఖా కోసం బయలుదేరారు. ఆయన(స) గారు నిలబడ్డారు. నిలబడి ఉండే అల్లాహ్‌ను వేడుకున్నారు. తరువాత ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని తిప్పారు. మరియు తన దుప్పటిని తిరగేశారు. ఆ తరువాత వర్షం కురిసింది.'

## 16వ అధ్యాయం

**ఇస్తిస్ఖా నమాజులో బిగ్గరగా ఖుర్ఆన్ పఠించటం.**

**136.** అబ్బాద్ బిన్ తమీమ్ ఉల్లేఖించారు; ఆయన గారికి ఆయన బాబాయి

గారైన అబ్దుల్లాహ్ బిన్ జైద్ గారు ఈ విషయాన్ని తెలియజేశారు; ఆయన ఇలా అన్నారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇస్తిస్ఖా కోసం బయలుదేరారు. అప్పుడు ఆయన(స) గారు తన ముఖాన్ని ఖిబ్లా వైపునకు పెట్టి దుఆ చేశారు. ఇంకా ఆయన(స) తన దుప్పటిని తిరగవేశారు. ఆ తరువాత రెండు రకాతులు నమాజ్ చేశారు. ఆ రకాతులలో ఖుర్ఆన్ వాక్యాలను బిగ్గరగా పఠించారు.'

## 17వ అధ్యాయం

### దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇస్తిస్ఖా నమాజులో తన వీపును ప్రజల వైపునకు ఎలా తిప్పారు?

**137.** తనతో తన బాబాయి అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజిఅన్) ఇలా అన్నారని అబ్బాద్ బిన్ తమీమ్ ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇస్తిస్ఖా నమాజు కోసం బయలుదేరిన రోజున నేను ఆయన(స) గారిని చూశాను. ఆయన(స) తన వీపును ప్రజల వైపునకు త్రిప్పారు. ఇంకా ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని పెట్టారు; దుఆ చేశారు; తరువాత తన దుప్పటిని తిరగేశారు; ఆ తరువాత మా చేత రెండు రకాతులు నమాజ్ చేయించారు. ఆ రకాతులలో బిగ్గరగా ఖుర్ఆన్ వాక్యాలను పారాయణం చేశారు.'

## 18వ అధ్యాయం

### రెండు రకాతులు ఇస్తిస్ఖా నమాజ్ చెయ్యటం.

**138.** తన బాబాయి అయినటువంటి అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్)గారు తనతో ఇలా అన్నారని అబ్బాద్ బిన్ తమీమ్ ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇస్తిస్ఖా నమాజును చేసినప్పుడు రెండు రకాతులు చేశారు. ఇంకా తన దుప్పటిని తిరగేశారు.'

## 19వ అధ్యాయం

### ఈద్గాహ్ మైదానంలో ఇస్తిస్ఖా నమాజు చెయ్యటం.

**139.** తనకు తన బాబాయి అయిన అబ్దుల్లాహ్ బిన్ జైద్ ఇలా చెప్పారని అబ్బాద్ బిన్ తమీమ్ ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇస్తిస్ఖా నమాజు కోసం ఈద్గాహ్ మైదానానికి బయలుదేరారు. అక్కడ ఆయన(స) ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని పెట్టారు. తరువాత రెండు రకాతులు నమాజ్ చేశారు.

ఇంకా తన దుప్పటిని తిరగేశారు. అబూబకర్(ర) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త(స) తన దుప్పటి యొక్క కుడి చివరి భాగాన్ని తన ఎడమ భుజం మీదకు వేసుకున్నారు.'

## 20వ అధ్యాయం

### ఇస్తిస్ఖా నమాజులో ఖిబ్లా వైపునకు ముఖం తిప్పటం.

**140.** అబ్దుల్లా బిన్ జైద్ అన్సారి(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) (ఇస్తిస్ఖా కోసం) ఈద్గాహ్ మైదానం వైపునకు నమాజ్ చెయ్యటానికి బయలుదేరి వెళ్ళారు. ఆయన(స) గారు దుఆ చెయ్యటం ప్రారంభించినప్పుడు లేదా దుఆ చెయ్యదలుచుకున్నప్పుడు తన ముఖాన్ని ఖిబ్లా వైపునకు త్రిప్పారు. ఇంకా తన దుప్పటిని తిరగేశారు.'

## 21వ అధ్యాయం

### ఇస్తిస్ఖా నమాజులో ఇమామ్‌తో పాటు ప్రజలు కూడా చేతులు ఎత్తటం.

అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "ఒక పల్లెటూరు మనిషి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు జుమా రోజున వచ్చాడు. మరియు ఇలా అనసాగాడు; ఓ దైవప్రవక్తా(స)! (ఆకలి బాధకు తట్టుకోలేక) పశువులు నాశనమైపోయాయి. పిల్లలు మృత్యువాతకు గురయ్యారు. ప్రజలు చనిపోయారు." దైవప్రవక్త(స) ఇది విని తన రెండు చేతుల్ని ఎత్తారు. దుఆ చెయ్యసాగారు. ప్రజలు కూడా ఆయన(స) గారితోపాటు తమ చేతుల్ని ఎత్తారు. దుఆ చెయ్యసాగారు. అనస్ (ర) ఇలా అన్నారు. 'తరువాత మేము మసీదులోనుంచి ఇంకా బయటిక్కూడా వెళ్ళ లేదు. వర్షం కురవడం ప్రారంభమయింది. ఆ వర్షం రెండో జుమా వచ్చేవరకు ఎడతెగకుండా కురిసింది. ఆ తరువాత అదే వ్యక్తి (రెండో జుమా రోజున) దైవప్రవక్త(స) వద్దకు వచ్చాడు. మరియు ఇలా అనసాగాడు; ఓ దైవప్రవక్తా(స)! (వర్షం విపరీతంగా కురవటం వల్ల) బాటసారులు భయాందోళనకు గురయ్యారు. మరియు మార్గాలు మూసుకుపోయాయి. అనస్(ర) అదనంగా ఈ విషయాన్ని చేర్చారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) (ఇస్తిస్ఖా నమాజులో దుఆ కోసం) తన చేతుల్ని ఎంతగా పైకి ఎత్తారంటే, నేను ఆయన(స) గారి చంకల్లోని తెల్లదనాన్ని చూశాను.'

### ఇస్తిస్ఖా నమాజ్‌లో (దుఆ కోసం) ఇమామ్ చేతులు ఎత్తటం.

**141.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా

అన్నారు; “దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక్క ఇస్తిస్ఖాకు సంబంధించిన దుఆలో తప్ప ఏ దుఆలోనూ తన చేతుల్ని ఎత్తలేదు. ఇస్తిస్ఖాలో ఆయన (స) తన చేతుల్ని ఎంతగా పైకి ఎత్తేవారంటే ఆయన(స) గారి చంకల్లోని తెల్లదనం స్పష్టంగా కనిపించేది.”

## 22వ అధ్యాయం

## వర్షం కురిసేటప్పుడు ఏమని పలకాలి?

**142.** హజ్రత్ ఆయెషా(ర) ఇలా ఉల్లేఖించారు; “దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వర్షం కురుస్తూ ఉండగా చూస్తే, ఇలా సెలవిచ్చేవారు; 'అల్లాహుమ్మ సయ్యిబన్ నాఫిఅన్' ఓ అల్లాహ్! లాభాన్ని కలిగించే వర్షాన్ని కురిపించు.[1] ముహమ్మద్ బిన్ మఖాతిల్‌తోపాటు ఈ హదీసును ఖాసిమ్ బిన్ యహ్యా కూడా ఉబేదుల్లా ఉల్లేఖించారు; మరియు అవ్‌జాయి అఖీల్ గార్లు కూడా నాఫె నుండి ఉల్లేఖించారు.'

## 23వ అధ్యాయం

## గడ్డంపైనుంచి నీటి చుక్కలు రాలిపడేవరకు[1] వర్షంలో నిలబడి ఉండటం.

**143.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి కాలంలో ప్రజలపైకి కరవు కాటకాలు వచ్చిపడ్డాయి. ఒకసారి ఏమి జరిగిందంటే, దైవప్రవక్త(స) జుమా రోజున మెంబర్‌పై నిలబడి ఖుత్బా ఇస్తున్నారు. ఇంతలోనే ఒక పల్లెటూరి వ్యక్తి లేచి నిలబడి ఇలా అనసాగాడు; 'ఓ దైవప్రవక్తా(స)! పశువులు చనిపోయాయి. పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. కనుక వర్షాన్ని కురిపించమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి.' ఇది విని ఆయన(స)గారు దుఆ కోసం తన రెండు చేతుల్ని పైకి ఎత్తారు. ఆ సమయంలో ఆకాశం మీద ఒక్క మబ్బు తునక కూడా లేదు. ఆయన(స) గారు ప్రార్థన చేసినంతనే పర్వతాల మాదిరిగా మేఘాలు ఆకాశాన్ని కమ్ముకున్నాయి. తరువాత ఆయన(స) మెంబర్‌మీద నుంచి ఇంకా కిందకు దిగనే లేదు, నేను

---

142-1. అంటే కారుణ్యంతో కూడుకున్న వర్షం; దానివల్ల మనుషులకు, పశువులకు ప్రయోజనం కలగాలి. పంటలు పుష్కలంగా పండాలి. ఆపదలు కలిగించే వర్షం కాకూడదు. అంటే నష్టాన్ని కలిగించే వర్షం అని భావం.

23-1. వర్షం ఆకాశం నుంచి కురుస్తుంది. దేవుడు కూడా ఆకాశం మీదనే ఉన్నాడు. కనుక ఆ వర్షం తన ప్రభువు దగ్గర నుంచి తాజాగా వచ్చి కురుస్తుంది.

చూశాను. పవిత్రమైన ఆయన(స) గడ్డం మీద నుంచి వర్షపు నీరు కింద పడుతోంది. ఆ రోజంతా వర్షం కురుస్తూనే ఉంది; రెండో రోజు, మూడో రోజు, నాలుగో రోజు కూడా.. మరొక జుమా రోజు వరకు వర్షం కురుస్తూనే ఉంది. తరువాత ఆ పల్లెటూరి మనిషే లేచి నిలబడి లేదా మరొక వ్యక్తి ఎవరైనా నిలబడి ఇలా అనసాగాడు; 'ఓ దైవప్రవక్తా(స)! ఇళ్ళు కూలిపోయాయి. పశువులునీటిలో మునిగిపోయాయి. వర్షం కురవటాన్ని ఆపివెయ్యమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి.' అప్పుడు ఆయన(స) గారు తన రెండు చేతుల్ని పైకి ఎత్తి ఇలా అన్నారు; "ఓ అల్లాహ్! వర్షాన్ని మా చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిపించు. మా మీద నుంచి దాన్ని తొలగించు. హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు; తరువాత ఆయన(స) తన చేతుల్ని ఆకాశంలోని ఏ దిక్కువైపునకు తిప్పుతారో ఆ దిక్కులో ఆకాశం మీదినుంచి మబ్బులు తొలగిపోతాయి. చివరకు మదీనాపురం ఒక హౌజ్ (సరస్సు) మాదిరిగా అయిపోయింది; ఖనాత్ కాలువ ఒక నెల రోజుల వరకు ప్రవహిస్తూనే ఉంది. ఎవరైనా ఏ దిక్కు నుంచి వచ్చినా అతను ఇలానే వ్యాఖ్యా నించాడు; వర్షం బాగానే కురుస్తోందని.

## 24వ అధ్యాయం

### పెనుగాలులు వీచినప్పుడు ఏమి చేయాలి?

**144.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'తీవ్రమైన తుఫాను వచ్చినప్పుడు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి శుభప్రదమైన ముఖం మీద భయపు ఛాయలు కనిపించేవి.'

## 25వ అధ్యాయం

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ఈ ప్రకటన; నాకు తూర్పు దిక్కు నుంచి వీచే గాలి ద్వారా సహాయం లభించింది.[1]

**145.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; తూర్పు దిక్కు నుంచి వీచే గాలి ద్వారా

25-1. కందక యుద్ధంలో పన్నెండువేల మంది అవిశ్వాసులు ముస్లిములను అన్నివైపులనుంచి చుట్టుముట్టారు. చివరకు అల్లాహ్ తూర్పు దిక్కు నుంచి శక్తివంతమైన గాలిని పంపాడు. దాని కారణంగా అవిశ్వాసుల గుడారాలు ధ్వంసమయ్యాయి. నిప్పులు (మంటలు) ఆరిపోయాయి. వారి కళ్ళల్లో ఇసుక పడింది. భయపడి పారిపోయారు.

నాకు సహాయం లభించింది, ఆద్ జాతి ప్రజలు వెనుక వైపు నుంచి వీచే గాలి వల్ల నాశనమై పోయారు.'

## 26వ అధ్యాయం

### భూకంపాలు, ప్రళయ దినపు సూచనలను గురించి.

**146.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూ హురైరా(ర) ఉల్లేఖించారు; ధర్మజ్ఞానం లేపుకోబడనంతవరకు, భూకంపాలు తరచుగా రానంత వరకు, కాలం త్వరత్వరగా గడిచిపోనంతవరకు, ఆపదలు (కల్లోలాలు) విరుచుకుపడనంతవరకు, హత్యలు ఎక్కువ కానంతవరకు, డబ్బు మీ మధ్య వరద మాదిరిగా పొంగి పొరలనంతవరకు ప్రళయం రాదు'

**147.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖించారు; 'ఓ అల్లాహ్! మా సిరియాపైనా, మా యమన్‌పైనా నీ శుభాలను అవతరింపజెయ్యి' అప్పుడు ప్రజలు ఇలా అన్నారు; మానజ్‌ద్‌పై కూడా' దైవప్రవక్త(స) మళ్ళీ ఇలా అన్నారు. 'ఓ అల్లాహ్ మా సిరియాపైనా, మా యమన్‌పైనా నీ శుభాలను అవతరింపజెయ్యి' ప్రజలు కూడా మళ్ళీ ఇలా అన్నారు; 'మానజ్‌ద్‌పైన కూడా. దానిపై దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "అక్కడ భూకంపాలు వస్తాయి. ఆపదలు విరుచుకుపడతాయి, అక్కడ నుంచే షైతానుల వర్గం ఒకటి బయలుదేరు తుంది."

## 27వ అధ్యాయం

**"ఏమిటి, మీరు అల్లాహ్‌ను తిరస్కరించటాన్నే మీ ఉపాధి (కృతజ్ఞత)గా చేసుకున్నారా?" అని (వాఖిఅహ్ సూరా- 82లో) అల్లాహ్ సెలవీయటం. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు; ఈ ఆయత్‌లో ఉపాధి అంటే కృతజ్ఞతలు తెలుపటం అని భావం.**

**148.** జైద్ బిన్ ఖాలిద్ జుహన్నీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)హుదైబియాలో మాకు ఫజర్ నమాజ్‌ను చేయించారు. ఆ రాత్రి వర్షం కురిసింది. నమాజును ముగించిన తరువాత ఆయన(స) ప్రజల వైపునకు తన ముఖాన్ని పెట్టి ఇలా సెలవిచ్చారు; "మీ ప్రభువు ఏమని సెలవిస్తున్నాడో మీకేమైనా తెలుసా?" వారు ఇలా అన్నారు; '(మాకేమి తెలుసు) అల్లాహ్‌కు, ఆయన

ప్రవక్త(స)కు మాత్రమే బాగా తెలుసు'. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: ప్రభువు అయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు; ఈనాడు రెండు రకాల నా దాసులు ఉదయాన్ని గడిపారు. ఒక దాసుడు, విశ్వాసి, మరొక దాసుడు అవిశ్వాసి. అల్లాహ్ అనుగ్రహం వల్ల, ఆయన కారుణ్యం వల్ల వర్షం కురిసింది అని ఏ దాసుడైతే అన్నాడో ఆ దాసుడైతే నన్ను విశ్వసించాడు. మరియు నక్షత్రాలను తిరస్కరించాడు. ఇంకా ఏ దాసుడైతే 'పలానా నక్షత్రాలు, ఫలానాస్థలం వద్దకు వచ్చినప్పుడు వర్షం కురిసింది అని అన్నాడో ఆ దానుడు నన్ను తిరన్కరించాడు, మరియు నక్షత్రాలను విశ్వసించాడు."

## 28వ అధ్యాయం

**వర్షం ఎప్పుడు కురుస్తుందో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియదు. హజ్రత్ అబూ హురైరా(ర) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; ఐదు విషయాలకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు.**

**149.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు; ఐదు విషయాలు "అగోచరానికి చెందిన తాళపు చేతులు. వాటిని గురించి అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియదు. ఒకటి, రేపు ఏమవుతుందో ఎవరికీ తెలియదు. రెండోది, తల్లిగర్భంలో ఏముందో (మగ పిల్లవాడా లేక ఆడపిల్ల) ఎవరికీ తెలియదు. మూడోది, మనిషి రేపు ఏమి చేస్తాడో (మంచి లేక చెడు) ఎవరికీ తెలియదు. నాలుగోది, మనిషి ఎక్కడ చస్తాడో ఎవరికీ తెలియదు. ఐదో విషయం, వర్షం ఎప్పుడు కురుస్తుందో ఎవరికీ తెలియదు."

# కుసూఫ్ (గ్రహణాల) అధ్యాయాలు

## 1వ అధ్యాయం

### సూర్య గ్రహణానికి సంబంధించిన నమాజును గురించి[1]

**150.** అబూబక్రా నఫీ బిన్ హారిస్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; ఒకసారి మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్ద ఉన్నాము. ఇంతలోనే సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు దైవప్రవక్త (స) తన దుప్పటిని నేలమీద ఈడ్చుకుంటూ (త్వరత్వరగా) లేచి నిలబడ్డారు. మరియు మసీదు లోకి వచ్చారు. (మేము కూడా ఆయన(స) గారితో పాటు మసీదులోకి వచ్చాము) ఆయన(స) గారు సూర్యుడుస్పష్టంగా కనిపించేవరకు రెండు రకాతులు నమాజ్ చేశారు. తరువాత ఇలా సెలవిచ్చారు; "చూడండి! సూర్యుడికి, చంద్రుడికి, ఎవరైనా మరణించటంవల్ల గ్రహణం పట్టదు.[2] గ్రహణం పట్టినప్పుడు మీరు గనక చూస్తే అప్పుడు నమాజ్ చెయ్యండి. మరియు గ్రహణం తొలగిపోయేంతవరకు దుఆ చేస్తూ ఉండండి."

**151.** అబూ మసూద్ అన్సారీ(ర) అనే పేరు గల ఒక సహాబి ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; ఎవరైనా మరణించిన కారణంగా సూర్యుడికి, చంద్రుడికీ గ్రహణం

---

1-1. చాలామంది విద్వాంసుల దృష్టిలో నమాజె కుసూఫ్ సున్నతె ముఅక్కిద.

150-2. యాదృచ్ఛికంగా దైవప్రవక్త(స) గారి కుమారుడు హజ్రత్ ఇబ్రాహీమ్ (రజి) మరణించి నప్పుడు సూర్యుడికి గ్రహణం పట్టింది. ఆయన మరణించిన కారణంగా సూర్యుడికిగ్రహణం పట్టిందని కొందరు అనుకున్నారు. దైవప్రవక్త(స) ఈ నమ్మకాన్ని ఖండించారు. అజ్ఞాన కాలపు ప్రజలు నక్షత్రాల ప్రభావం భూమిపై పడుతుందని విశ్వసించేవారు. ధర్మశాస్త్రం ఇది అబద్ధమని ఖండించింది. ఏది జరిగినా అల్లాహ్‌యే చేస్తాడు. ఇది ముమ్మాటికి సత్యం, నక్షత్రాలు సృష్టితాలు మాత్రమే! పాపం అవి ఏమి చెయ్యగలవు? అవి దైవాదేశానికి లోబడి ఉన్నాయి.

పట్టదు. ఆ రెండూ అల్లాహ్ యొక్క మహత్తరమైన శక్తికి సూచనలు. మీరు గనుక గ్రహణం పట్టణాన్ని చూసినట్లయితే అప్పుడులేచి నిలబడి నమాజు చెయ్యండి."

**152.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు; "ఎవరైనా మరణించటం వల్ల గాని లేక జీవించటం వల్ల గానీ సూర్యచంద్రులకు గ్రహణం పట్టదు. అవి అయితే అల్లాహ్ యొక్క సూచనల్లోని రెండు సూచనలు మాత్రమే. మీరు గనుక గ్రహణం పట్టటాన్ని చూస్తే అప్పుడు నమాజు చెయ్యండి."

**153.** ముగీరా బిన్ షూబా (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి జీవిత కాలంలో ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది. దైవప్రవక్త(స) గారి కుమారుడైన హ్రజత్ ఇబ్రహీం ఏ రోజునైతే మరణించారో ఆ రోజునే సూర్యుడికి గ్రహణం పట్టింది. ఆయన గారి మరణం కారణంగానే సూర్యుడికి గ్రహణం పట్టిందని ప్రజలు అన్నారు. అప్పుడు దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: "ఒకరు మరణించటం వల్ల గానీ,జీవించి ఉండటం వల్ల గానీ సూర్యుడికి, చంద్రుడికీ గ్రహణంపట్టదు. మీరు గనుక సూర్యచంద్రులకు గ్రహణం పట్టటాన్ని చూసినట్లయితే అప్పుడు నమాజు చెయ్యండి. దుఆ చెయ్యండి."

## 2వ అధ్యాయం

### సూర్యుడికి గ్రహణం పట్టినప్పుడు దానధర్మాలు చెయ్యటం.

**154.** హ్రజత్ ఆయెషా(ర.అ) ఉల్లేఖించారు; ఆమె(ర) గారు ఇలా అన్నారు; 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి జీవిత కాలంలో సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు ఆయన (స) గారు ప్రజలకు నమాజు చేయించారు. మొదట ఆయన(స) గారు లేచి నిలబడ్డారు. చాలాసేపు నిలబడే ఉన్నారు. తరువాత రుకూ చేశారు. చాలాసేపటివరకు రుకూలోనే ఉన్నారు. ఆ తరువాత నిలబడ్డారు. చాలాసేపటి వరకు నిలబడేఉన్నారు. కాని మొదటిసారి కంటే తక్కువసేపు నిలబడ్డారు. తరువాత చాలా సేపటి వరకు రుకూలోనే ఉన్నారు. కాని మొదటి సారి చేసిన రుకూ కంటే తక్కువ సేపు రుకూలో ఉన్నారు. ఆ తరువాత సజ్దా చేశారు. చాలాసేపటి వరకు సజ్దా లోనే ఉన్నారు. ఆ పిదప రెండోరకాతులో కూడా మొదటి రకాతులో చేసినట్లుగానే చేశారు. తరువాత నమాజును ముగించినప్పుడు సూర్యుడు స్పష్టంగా కనిపించ

సాగాడు. దైవప్రవక్త(స) ప్రజల్ని ఉద్దేశించి ఖుత్బా వినిపించారు. అల్లాహ్‌ను ప్రశంసించారు. మరియు స్తుతించారు. తరువాత ఇలా సెలవిచ్చారు; "సూర్యచంద్రులు రెండూను అల్లాహ్ చిహ్నాలూ. ఎవరైనా మరణించటం వల్ల గాని, జీవించి ఉండటం వల్ల గాని వాటికి గ్రహణం పట్టదు. మీరు వాటికి గ్రహణం పట్టినప్పుడు చూస్తే అల్లాహ్‌ను స్మరించండి. మరియు తక్బీర్ పలకండి. మరియు నమాజ్ చెయ్యండి. మరియు దానధర్మాలు చెయ్యండి." తరువాత ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; ముహమ్మద్(స) సంఘానికి చెందిన ఓ ప్రజలారా! చూడండి. అల్లాహ్‌కంటే ఎక్కువ పౌరుషం కలవాడు మరెవ్వడూ లేడు. తన బానిస లేక బానిసరాలు వ్యభిచారం చేసేటప్పుడు ఆయన పౌరుషం విజృంభిస్తుంది. ముహమ్మద్ సంఘానికి చెందిన ఓ ప్రజలారా! నాకు ఏదైతే తెలుసో, ఒకవేళ అది మీకు తెలిస్తే అప్పుడు మీరు తక్కువ నవ్వుతారు, ఎక్కువ ఏడుస్తారు."

## 3వ అధ్యాయం

**సూర్యుడికి గ్రహణంపట్టినప్పుడు నమాజు కోసం రండి అని బిగ్గరగా ప్రకటించటం (జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యండి)**

**155.** అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి జీవిత కాలంలో ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది, అప్పుడు ప్రజల్నిఉద్దేశించి ఇలా ప్రకటించటం జరిగింది; నమాజు కోసం రండి. జమాఅత్‌తో కలిసి నమాజ్ చెయ్యండి."

## 4వ అధ్యాయం

**సూర్య గ్రహణానికి సంబంధించిన నమాజులో ఇమామ్ ఖుత్బా పఠించటం. హజ్రత్ ఆయెషా(ర), అస్మా బిన్తె అబీబకర్(ర)లు ఉభయులూ ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సూర్యుడికి గ్రహణం పట్టినప్పుడు ఖుత్బా వినిపించారు.**

**156.** విశ్వాసుల తల్లి, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి భార్య అయిన హజ్రత్ ఆయెషా(ర.అన్హా) ఉల్లేఖించారు; ఆమె(ర)గారు ఇలా అన్నారు; "దైవప్రవక్త ముహమ్మద్(స)గారి జీవిత కాలంలో ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు ఆయన(స)గారు మసీదులోకి వెళ్ళారు. ప్రజలుఆయన(స) గారి వెనుక బారులు తీరి నిలుచున్నారు. ఆయన(స) తక్బీర్‌పలికారు. మరియు సుదీర్ఘమైన పారా యణం చేశారు.తరువాత తక్బీర్‌పలికారు. మరియు పొడుగైన రుకూ చేశారు.

తరువాత 'సమిఅల్లాహులిమన్ హమిద' అని పలికారు. (రుకూలో నుంచి శిరస్సు ఎత్తి) ఆ తరువాత నిలబడే ఉన్నారు. సజ్దా చెయ్యలేదు. మరియు సుదీర్ఘ మైన పారాయణం చేశారు. కాని మొదటి పారాయణం కంటే కొంచెం తక్కువ. ఆ తరువాత తక్బీర్‌పలికారు. సుదీర్ఘమైన రుకూ చేశారు. కాని మొదటి రుకూ కంటే కొంచెం తక్కువైనది. తరువాత శిరస్సు ఎత్తి 'సమిఅల్లాహులిమన్ హమిద' 'రబ్బనా వలకల్ హమ్‌ద్' అని పలికారు. ఆ తరువాత సజ్దా చేశారు. రెండో రకాతులో కూడా అలాగే చేశారు. కనుక (రెండు రకాతుల్లో) నాలుగు రుకూలు మరియు నాలుగు సజ్దాలు చేశారు. మరియు దైవప్రవక్త(స) ఇంకా నమాజును కూడా పూర్తి చెయ్యనేలేదు; సూర్యుడు స్పష్టంగా కనిపించసాగాడు. గ్రహణం తొలగిపోయింది. ఆ తరువాత ఆయన(స) ఖుత్బా వినిపించటానికి లేచి నిలబడ్డారు. అల్లాహ్‌ను ఎలా స్తుతిస్తే సముచితంగా ఉంటుందో ఆయన(స) అలా స్తుతించారు. తరువాత ఇలా సెలవిచ్చారు; చంద్రుడు, సూర్యుడు, ఈరెండూ అల్లాహ్ సూచనలు. ఎవరైనా మరణించటం వల్ల గాని, జీవించి ఉండటం వల్ల గాని వాటికి గ్రహణం పట్టదు. మీరు గ్రహణం పట్టినప్పుడు చూస్తే అప్పుడు నమాజు కోసం వేగిరపడండి."

## 5వ అధ్యాయం

**సూర్య గ్రహణం- కుసూఫ్, ఖుసూఫ్ ఈ రెండు పదాలు గ్రహణం అనే అర్థంలో వాడవచ్చు. అల్లాహ్ 'ఖియామహ్' సూరాలో ఇలా సెలవిచ్చాడు: 'వ ఖసఫల్ ఖమర్'**

**157.** దైవప్రవక్త మహనీయ ముహమ్మద్(స) గారి సతీమణి అయిన హజ్రత్ ఆయెషా(ర) ఇలా ఉల్లేఖించారు; "సూర్యుడికి గ్రహణం పట్టినరోజున దైవప్రవక్త(స) నమాజుచేయించారు. ఆయన (స) గారు లేచి నిలబడ్డారు. తక్బీర్ పలికారు; తరువాత సుదీర్ఘమైన ఖురాన్ పారాయణం చేశారు. ఆ తరువాత చాలా పొడుగైన రుకూ చేశారు. తరువాత రుకూలోనుంచి తన శిరస్సును ఎత్తారు. మరియు 'సమిఅల్లాహులిమన్ హమిదమ్' అని పలికారు. ఆ తరువాత ఇదేవిధంగా నిలబడ్డారు. మరియు పొడుగైన పారాయణం చేశారు. కాని మొదటి పారాయణం కంటే కొంచెం తక్కువ. ఆ పిదప పొడుగైన రుకూ చేశారు. కాని మొదటి రుకూ కంటే కొంచెం తక్కువ నిడివి కలది. తరువాత సుదీర్ఘమైన సజ్దా చేశారు. ఆ తరువాత రెండో రకాతులో కూడా ఇదే విధంగా చేశారు. తరువాత సలామ్ చేశారు, అప్పుడు సూర్యుడు ప్రకాశించసాగాడు. ఆ

తరువాత ఆయన(స) గారు ప్రజలకు ఖుత్బాను వినిపించారు. మరియు ఇలా సెలవిచ్చారు; సూర్య గ్రహణం, చంద్రగ్రహణం రెండింటిలోనూ అల్లాహ్ సూచనలు ఉన్నాయి. ఒకరి మరణంవల్ల గాని, మరొకరి జీవితం వల్ల గాని వాటికి గ్రహణం పట్టదు. మీరు దానిని చూసినప్పుడు నమాజు కోసం వేగిరపడండి."

## 6వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; అల్లాహ్ తన దాసులకు గ్రహణాన్ని చూపించి వారిని భయపెడతాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారని అబూమూసా అష్అరీ (రజి) ఉల్లేఖించారు.**

**158.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ బక్రా(రజిఅన్) ఉల్లేఖించారు; "సూర్యుడు, చంద్రుడు రెండూ అల్లాహ్ సూచనలు. అవి ఎవరైనా మరణించటంవల్ల గ్రహణానికి గురికావు. కాని అల్లాహ్ వాటికి గ్రహణం పట్టేలా చేసి తన దాసులను భయపెడతాడు."

## 7వ అధ్యాయం

**సూర్యగ్రహణ సమయంలో సమాధి శిక్ష నుంచి విముక్తి కోసం అల్లాహ్ శరణు వేడటం.**

**159.** అమ్రా బిన్తె అబ్దుర్రహ్మాన్ ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి సతీమణి అయిన హజ్రత్ ఆయెషా(ర.అ) వద్దకు ఒక యూద స్త్రీ సహాయం చెయ్యమని అడిగేందుకు వచ్చింది. ఆ స్త్రీ ఆయెషా(ర)ను ఉద్దేశించి 'అల్లాహ్ నిన్ను సమాధి శిక్ష నుండి కాపాడుగాక' అని ప్రార్థించింది. హజ్రత్ ఆయెషా(ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను 'ఓ దైవప్రవక్తా! సమాధుల్లో కూడా ప్రజలు శిక్షకు గురవుతారా?' అని అడిగారు. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; ఆ శిక్ష నుంచి నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను.' తరువాత ఒక రోజున ఉదయం పూట దైవప్రవక్త(స) గారు ఎక్కడికో పోవటానికి తన వాహనం మీద ఎక్కి కూర్చున్నారు. అదే రోజున సూర్యుడికి గ్రహణం పట్టింది. ఆయన(స) గారు మధ్యాహ్న సమయం దాటిపోయిన తరువాత తిరిగివచ్చారు. తన భార్యలు నివాసం ఉండే గదుల మధ్యగా నడుచుకుంటూ వెళ్ళారు. ఆ తరువాత నిలబడి సూర్య గ్రహణానికి సంబంధించిన నమాజును చెయ్యసాగారు. ప్రజలు కూడా ఆయన(స) గారి వెనుక నమాజు కోసం నిలబడ్డారు. దైవప్రవక్త(స) చాలాసేపటి వరకు నిలబడే

ఉన్నారు. తరువాత ఒక సుదీర్ఘమైన రుకూ చేశారు; ఆ తరువాత చాలాసేపు నిలబడి ఉన్నారు (రుకూలో నుంచి శిరస్సు ఎత్తి). కాని మొదటిసారికంటే తక్కువ. ఆ తరువాత ఒక పొడుగైన రుకూ చేశారు. కాని మొదటి రుకూ కంటే చిన్నది. ఆ పిదప తన శిరస్సును ఎత్తారు. మరియు సజ్దాలోకి వెళ్ళారు. (రెండు సజ్దాలు చేశారు). తరువాత సజ్దాలోనుంచి తన శిరస్సును ఎత్తారు. మరియు చాలాసేపటి వరకు నిలబడి ఉన్నారు. కాని మొదటి రకాతులో నిలబడి ఉన్న సమయం కంటే తక్కువ. తరువాత సుదీర్ఘమైన రుకూ చేశారు. కాని మొదటి రకాతులోని రుకూ కంటే చిన్నది. తరువాత రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తారు. మరియు చాలాసేపటి వరకు నిలబడి ఉన్నారు. కాని మొదట నిలబడి ఉన్నదానికంటే తక్కువ సేపు. ఆ తరువాత సుదీర్ఘమైన రుకూ చేశారు. కాని ముందు చేసిన రుకూ కంటే చిన్నది. ఆ తరువాత రుకూలోనుంచి తన శిరస్సును ఎత్తారు. మరియు సజ్దా చేశారు. మరియు నమాజును ముగించారు. ఇంకా అల్లాహ్ కోరినదాన్ని ఆయన(స) బోధించారు. తరువాత సమాధి శిక్షనుంచి అల్లాహ్‌ను శరణువేడుకోమని ప్రజలకు ఆదేశించారు."

## 8వ అధ్యాయం

**గ్రహణానికి సంబంధించిన నమాజ్‌లో సజ్దా కూడా సుదీర్ఘమైనదిగా ఉండాలి.**

**160.** అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు: "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) గారి శుభప్రదమైన జీవిత కాలంలో ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు 'నమాజ్ కోసం రండి' అని ప్రజల్ని కేకవేసి పిలవటం జరిగింది. తరువాత దైవప్రవక్త(స) ఒకే రకాతులో రెండు రుకూలు చేశారు. (మరియు సజ్దా చేసి) తరువాత లేచి నిలబడ్డారు. రెండు రుకూలు చేశారు. ఆ తరువాత (సజ్దా చేసి) కూర్చున్నారు. తరువాత సూర్యుడు ప్రకాశించటం ప్రారంభించాడు. హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు; నేను ఎన్నడూ ఈ నమాజులో చేసినంత పొడుగైన, పెద్దదైన సజ్దా చెయ్యలేదు.

## 9వ అధ్యాయం

**గ్రహణానికి సంబంధించిన నమాజును జమాఅత్‌తో చెయ్యటం. ఇబ్నె అబ్బాస్ (రజి) ప్రజలకు గ్రహణానికి సంబంధించిన నమాజ్‌ను జమ్‌జమ్ నీడలో చేయించారు. అలీ బిన్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (తాబయి) ప్రజల్ని గ్రహణానికి**

**సంబంధిం చిన నమాజు కోసం సమీకరించారు. ఇబ్నె ఉమర్ (రజిఅన్) నమాజు చేయిం చారు.**

**161.** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా వివరించారు; "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) గారి జీవితకాలంలో ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది; అప్పుడు ఆయన(స) నమాజు చేయించారు. మరియు చాలాసేపటి వరకు నిలబడే ఉన్నారు, ఆ సమయంలో ఎవరైనా మొత్తం బఖరా సూరాను పారాయణం చేయవచ్చు. తరువాత ఆయన(స) ఒక సుదీర్ఘమైన రుకూ చేశారు. ఆ తరువాత రుకూలోనుంచి తన శిరస్సును పైకిఎత్తారు. మరియు చాలాసేపు నిలబడి ఉన్నారు. ఇది మొదటిసారికంటే తక్కువ వ్యవధి కలది. తరువాత ఒక పొడుగైన రుకూ చేశారు. ఇది మొదటి రుకూకంటే తక్కువ వ్యవధి కలది. ఆ తరువాత సజ్దా చేశారు. ఆ పిదప రెండు సజ్దాల తరువాత చాలాసేపటి వరకు నిలబడే ఉన్నారు. మరియు ఇది ముందు దానికంటే తక్కువ వ్యవధి కలది. తరువాత ఆయన(స) గారు ఒక సుదీర్ఘమైన రుకూ చేశారు. ఇది మొదటి రుకూ కంటే తక్కువ నిడివి కలది. ఆ తరువాత రుకూలోనుంచి తన శిరస్సును పైకి ఎత్తారు. ఆ తరువాత చాలాసేపు నిలబడి ఉన్నారు. ఇది మొదటి దానికంటే తక్కువ వ్యవధి కలది. తరువాత ఒక సుదీర్ఘమైన రుకూ చేశారు. ఇది మొదటి రుకూ కంటే తక్కువ పొడవు గలది. ఆ తరువాత ఆయన(స) సజ్దాచేశారు. తరువాత నమాజును పూర్తి చేశారు. ఆ సమయంలో సూర్యుడు స్పష్టంగా ప్రకాశిస్తున్నాడు. తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'సూర్యుడు,చంద్రుడు రెండూ అల్లాహ్ చిహ్నాలే. ఎవరైనా మరణించటం వల్లగానీ, జీవించి ఉండటం వల్లగానీ వాటికి గ్రహణం పట్టదు. మీరు ఇలా గ్రహణం పట్టటాన్ని చూస్తే అప్పుడు అల్లాహ్‌ను స్మరించండి.' ప్రజలు ఇలా విన్నవించుకున్నారు; ఓ దైవప్రవక్తా(స)! మేము చూశాము; మీరు నమాజులో ఉన్నప్పుడే మీరు నిలబడిన స్థలంలోనే ఏదో వస్తువును తీసుకోసాగారు; తరువాత మీరు వెనక్కి తగ్గటాన్ని కూడా మేము చూశాము. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "నేను స్వర్గలోకాన్ని చూశాను. అందులోనుంచి ఒక పండ్ల గుత్తిని తీసుకోవటానికి చేతులు చాపాను. ఒకవేళ ఆ పండ్ల గుత్తిని నేను గనక తీసుకుని ఉన్నట్లయితే ప్రపంచం ఉన్నంతవరకు మీరు అందులోనుంచి పండ్లను తింటూనే ఉండేవారు. ఇంకా నేను నరక లోకాన్ని కూడా చూశాను. ఈనాటి వరకు అంత భయంకరమైన దృశ్యాన్ని నేను చూడనే లేదు. ఇంకా నరకంలో స్త్రీలు చాలా ఎక్కువమంది ఉండటాన్ని కూడా నేను చూశాను".

ప్రజలు ఇలా విన్నవించుకున్నారు; ఓ దైవప్రవక్తా(స)! ఇలా నరకంలో ఎక్కువ మంది స్త్రీలు ఉండటానికి కారణం ఏమిటి? ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "స్త్రీలు చాలా కృతఘ్నులు". ప్రజలు, 'ఓ ప్రవక్తా(స)! అల్లాహ్ పట్లనా కృతఘ్నులు?' అని అడిగారు. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "కాదు. వారు తమ భర్తల పట్ల కృతఘ్నత చూపుతారు. (మరియు వారి) ఉపకారాన్ని ఒప్పుకోరు. నీవుగనక ఒక స్త్రీకి జీవిత కాలం అంతా ఉపకారం చేసినా ఆమె ఒక చిన్నపాటి చెడును నీలోగనక చూస్తే అప్పుడు ఆమె 'నీ వల్ల నాకు ఎన్నడూ మేలు జరగలేదు.' అని అంటుంది.

## 10వ అధ్యాయం

### గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులలో పురుషులతోపాటు స్త్రీలు కూడా పాల్గొనటం.

**162.** అస్మా బిన్తె అబీబకర్ (ర.అ) ఇలా అన్నారని ఫాతిమా బిన్తె మున్జిర్ ఉల్లేఖించారు; 'ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి భార్య అయిన హజ్రత్ ఆయెషా(ర.అ) గారి వద్దకు వచ్చాను. ఆ సమయంలో సూర్యుడికి గ్రహణం పట్టింది. ప్రజలు నిలబడి నమాజు చేస్తూ ఉండటాన్ని నేను చూశాను. ఇంకా హజ్రత్ ఆయెషా(ర) కూడా నమాజులో నిలబడి ఉన్నారు. ప్రజలకు ఏమయింది? అని నేను ఆమె(ర) గారిని అడిగాను. ఆమె(ర)గారు సమాధానంగా తన చేతిని ఆకాశం వైపునకు ఎత్తి సైగచేసి 'సుబ్హానల్లాహ్' అని పలికారు. అప్పుడు నేను ఇలా అన్నాను; 'ఏమిటి, అదేమైనా ఆపదకు సూచనా?' ఆమె(ర) గారు సైగ చేసి 'అవును' అని తెలియజేశారు. అస్మా(ర) ఇలా అన్నారు; నేను కూడా నమాజులో నిలబడిపోయాను. చివరకు నాకు మూర్ఛ రావటం మొదలయింది. నేను నా తలపై నీళ్ళు పోసుకున్నాను. దైవప్రవక్త(స) నమాజును పూర్తిచేసిన తరువాత అల్లాహ్‌ను స్తుతిస్తూ హమ్ద్ వ సనా చేశారు. తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "ఏ ఏ వస్తువులనైతే నేను ఇంతవరకు చూడలేదో వాటిని ఈనాడు, ఈ స్థలంలో చూశాను. చివరకు నరకాన్ని, స్వర్గాన్ని కూడా చూశాను. నా పైకి ఒక వహీ ఇలా వచ్చింది. సమాధులలో మీరు పరీక్షకు గురిచెయ్య బడతారు, దజ్జాల్ రాకకు ముందు మాదిరిగా లేక అతడి రాక సమీపంలో మాదిరిగా.' అస్మా(ర) ఏ పదాన్ని ప్రయోగించారో నాకు తెలియదు. అస్మా(ర) ఇంకా ఇలా అన్నారు; 'సమాధులలో మీలోని ప్రతి ఒక్కరి వద్దకు దైవదూత వస్తాడు. మరియు అతనిని ఇలా అడుగుతాడు; నీవు ఆ వ్యక్తి (దైవ ప్రవక్త(స)) విషయంలో ఎలాంటి విశ్వాసాన్ని కలిగి వుండేవాడవు - విశ్వసించిన

వాడు లేక గట్టి నమ్మకం కలిగి ఉన్నవాడు- అస్మా(ర) ఏ పదాన్ని ప్రయోగించారో నాకు తెలియదు. ఇలా అంటాడు; 'ఆయన అల్లాహ్ పంపిన ప్రవక్త(స) మా వద్దకు నిదర్శనాలను, సన్మార్గాన్ని తీసుకువచ్చారు. మేము ఆయన్ని విశ్వసించాము. ఆయన్ని అనుసరించాము'. తరువాత అతనితో ఇలా అనటం జరుగుతుంది : నీవు ఇక హాయిగా నిదురపో నీవు విశ్వసించినవాడవని మాకు తెలుసు. వంచకుడు లేక శంకించే వాడు- అస్మా(ర) ఏ పదాన్ని ప్రయోగించారో తెలియదు. ఇలా అంటాడు; 'నాకు తెలియదు, ప్రజలు ఆయన్ని(ర) గురించి చెప్పుకుంటూ ఉండగా కొన్ని విషయాలు నేను విన్నాను. వాటినే ఇక్కడ చెబుతున్నాను.'

## 11వ అధ్యాయం

### సూర్య గ్రహణం పట్టినప్పుడు బానిసలను విడుదల చెయ్యటం.

**163.** హజ్రత్ అస్మా (ర.అన్హా) ఇలా ఉల్లేఖించారు; 'సూర్య గ్రహణం పట్టిన సమయంలో బానిసలను విడుదల చెయ్యమని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఆజ్ఞాపించారు అనే విషయంలో ఎలాంటి సందేహమూ లేదు.'

## 12వ అధ్యాయం

### గ్రహణానికి సంబంధించిన నమాజును మసీదులో చెయ్యటం.

**164.** అమ్రా బిన్తె అబ్దుర్రహ్మాన్ ఇలా ఉల్లేఖించారు; 'ఒకసారి ఒక యూదస్త్రీ హజ్రత్ ఆయెషా(రజిఅన్) వద్దకు వచ్చి ఏదో అర్థిస్తూ ఇలా అనసాగింది. 'అల్లాహ్ నిన్ను సమాధి శిక్ష నుంచి రక్షించుగాక!' హజ్రత్ ఆయెషా (ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఇలా అడిగారు; 'ఓ దైవప్రవక్తా(స)! సమాధుల్లో కూడా ప్రజలు శిక్షకు గురవుతారా?' దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; "అల్లాహ్ ఆ శిక్ష నుంచి రక్షించుగాక!". తరువాత ఒకరోజున ఉదయం పూట ఆయన(స) తన వాహనం మీద ఎక్కి కూర్చున్నారు. అదేరోజున సూర్యుడికి గ్రహణం పట్టింది. ఆయన(స) మధ్యాహ్నానికి ముందే ఇంటికి తిరిగి వచ్చారు. మరియు తన భార్యల గదుల మధ్య నుంచి వెళ్ళిపోయారు. తరువాత నిలబడి గ్రహణం నమాజును చెయ్య సాగారు. ప్రజలు కూడా ఆయన(స) గారి వెనుక నిలబడి నమాజు చెయ్య సాగారు. దైవప్రవక్త(స) చాలాసేపు నిలబడే ఉన్నారు. ఆ తరువాత చాలాసేపటి వరకు రుకూ చేశారు. తరువాత తన శిరస్సును ఎత్తారు. మరియు చాలాసేపటి వరకు నిలబడే ఉన్నారు. కాని మొదటిసారి కంటే తక్కువ సేపు. ఆ

తరువాత ఒకసుదీర్ఘమైన రుకూ చేశారు. కాని మొదటి రుకూ కంటే తక్కువ నిడివి కలది. ఆ తరువాత రుకూలోనుంచి ఆయన(స) తన పవిత్రమైన శిరస్సును పైకి ఎత్తారు. మరియు పొడుగాటి సజ్దా చేశారు. తరువాత రెండు సజ్దాలు చేసి నిలబడిపోయారు. కాని గతంలోకంటే తక్కువ. ఆ తరువాత ఒక పొడుగాటి రుకూ చేశారు. కాని మొదటి రుకూ కంటే తక్కువ పొడవైనది. తరువాత చాలాసేపటి వరకు నిలబడి ఉన్నారు. కాని మొదటి సారి కంటే తక్కువ సేపు. ఆ తరువాత ఒక సుదీర్ఘమైన రుకూ చేశారు. కాని మొదట చేసిన రుకూ కంటే తక్కువ. ఆ తరువాత సజ్దా చేశారు. కాని మొదటి సజ్దా కంటే తక్కువసేపు. నమాజ్‌ను ముగించిన తరువాత ఏదైతే అల్లాహ్ కోరాడో దానిని- ఆయన(స) ఇలా వినిపించారు. (ప్రజలకు బోధించారు); తరువాత సమాధి శిక్ష నుంచి అల్లాహ్ శరణు వేడుకోమని ప్రజలను ఆజ్ఞాపించారు.

## 13వ అధ్యాయం

**సూర్యగ్రహణం ఒకరి మరణం వల్లగాని, ఒకరి జీవితం వల్లగానీ పట్టదు. దీనిని అబూబక్ర్(ర), ముగీరా(ర), అబూ మూసా అషారీ(ర), ఇబ్నె అబ్బాస్(ర) మరియు ఇబ్నె ఉమర్ (ర)- ఈ సహాబాలందరూ ఉల్లేఖించారు.**

**165.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ మసూద్ ఉఖ్బా బిన్ ఆమిర్ అన్సారీ(రజిఅన్), ఒక సహాబీ ఉల్లేఖించారు; "ఒక వ్యక్తి ఎవరైనా మరణించటం వల్ల గానీ లేక జీవించి ఉండటం వల్ల గానీ సూర్యచంద్రులకు గ్రహణం పట్టదు. కాని అవి రెండూ అల్లాహ్ సూచనలలోని రెండు సూచనలు. మీరు వాటికి గ్రహణం పట్టటాన్ని చూస్తే అప్పుడు నమాజు చెయ్యండి."

**166.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి కాలంలో ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు ఆయన(స) గారు లేచి నిలబడ్డారు. మరియు ప్రజల చేత నమాజు చేయించారు. బహుదీర్ఘమైన ఖురాన్ పారాయణం చేశారు. తరువాత సుదీర్ఘమైన రుకూ చేశారు. ఆ తరువాత రుకూలోనుంచి తన శిరసును పైకి ఎత్తారు. తరువాత సుదీర్ఘమైన ఖురాను పారాయణం చేశారు; కాని మొదటి పారాయణం కంటే తక్కువ. ఆ పిదప రుకూ చేశారు. మరియు పొడుగాటి రుకూ చేశారు, కాని మొదట చేసిన రుకూ కంటే తక్కువ సేపు రుకూ చేశారు. తరువాత రుకూలో నుంచి శిరసును పైకి ఎత్తారు. రెండు సజ్దాలు చేశారు. తరువాత లేచి నిలబడ్డారు. రెండో రకాతులో కూడా ఇలాగే చేశారు. తరువాత లేచి నిలబడ్డారు. (నమాజు ముగిసిన తరువాత) ఇలా

సెలవిచ్చారు; సూర్యచంద్రులకు ఒకరి మరణం వల్ల గానీ లేదా జీవితం వల్లగానీ గ్రహణం పట్టదు. అవి అల్లాహ్ సూచనల్లోని రెండు సూచనలు. అల్లాహ్ తన దాసులకు వాటిని చూపిస్తున్నాడు. మీరు ఇలా గ్రహణం పట్టటాన్ని చూస్తే అప్పుడు నమాజు చెయ్యటానికి త్వరపడండి."

## 14వ అధ్యాయం

**సూర్యుడికి గ్రహణం పట్టిన సమయంలో అల్లాహ్‌ను స్మరించటం; దీనిని ఇబ్నె అబ్బాస్(ర) ఉల్లేఖించారు;**

**167.** అబూ మూసా అష్అరీ(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'సూర్యుడికి గ్రహణం పట్టినప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కలవరంతో లేచి నిలబడ్డారు; ప్రళయం వస్తుందేమో అని భయపడుతూ ఆయన(స) అక్కడ నుంచి వెళ్ళి పోయారు. తరువాత ఆయన(స) మసీదులోకి విచ్చేశారు. చాలా సుదీర్ఘమైన ఖియామ్, రుకూ, సజ్దాలతో నమాజు చేశారు. అలా చేస్తూ ఉండగా నేను ఆయన్ని(స) ఎల్లప్పుడూ చూస్తూనే వచ్చాను. మరియు నమాజు పూర్తి అయిన తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'ఈ సూచనలను అల్లాహ్ పంపుతూ ఉంటాడు. ఎవరో ఒకరు మరణించటం వల్ల గానీ, జీవించటం వల్లగానీ వాటిని ఆయన పంపడు. కాని వాటిని పంపి ఆయన తన దాసులను భయపెడతాడు. మీరు అలాంటి సూచనను చూసినప్పుడు అల్లాహ్‌ను స్మరించండి. ఆయన్ని ప్రార్థిం చండి మరియు క్షమించమని ఆయన్ని వేడుకోండి.'

## 15వ అధ్యాయం

**సూర్యగ్రహణం పట్టినప్పుడు దుఆ చెయ్యటం. ఈ విషయాన్ని దైవప్రవక్త మహా శయులు(స) బోధించారని అబూ మూసా (ర) మరియు హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా)గారు కూడా ఉల్లేఖించారు.**

**168.** అల్ ముగీరా బిన్ షూబా ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; యాదృచ్ఛికంగా హజ్రత్ ఇబ్రాహీం (దైవప్రవక్త(స)గారి కుమారుడు) మరణించిన రోజునే సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు ప్రజలు ఇలా అనసాగారు; ఇబ్రాహీమ్ మరణం వల్లనే సూర్యుడికి గ్రహణం పట్టింది. దైవప్రవక్త మహాశయులు ముహ మ్మద్(స) ఇలా సెలవిచ్చారు: 'సూర్యచంద్రులైతే అల్లాహ్‌సూచనలోని రెండుసూచనలు. ఒకరు మరణించటం వల్ల గానీ, జీవించటంవల్ల గానీ వాటికి గ్రహణం పట్టదు. ఇలా గ్రహణం పట్టటాన్ని మీరుగనుక చూస్తే అప్పుడు అల్లాహ్‌ను వేడుకోండి. నమాజు చెయ్యండి. గ్రహణం తొలగిపోయే అంతవరకు.'

## 16వ అధ్యాయం

**గ్రహణానికి సంబంధించిన ఖుత్బాలో ఇమామ్ 'అమ్మాబాద్' అని అనటం, అస్మా బిన్తె అబీబకర్(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గ్రహణం నమాజును పూర్తి చేశారు. అప్పటికే సూర్యగ్రహణం తొలగిపోయింది. సూర్యుడు స్పష్టంగా ప్రకాశిస్తూ ఉన్నాడు. ఆ తరువాత ఆయన (స) గారు ప్రసంగం చేశారు. అల్లాహ్‌కు తగినవిధంగా స్తోత్రం చేశారు. తరువాత 'అమ్మాబాద్' అని సెలవిచ్చారు.**

## 17వ అధ్యాయం

### చంద్ర గ్రహణం పట్టినప్పుడు కూడా నమాజుచెయ్యటం.

**169.** అబూ బక్‌రహ్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలాఅన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి కాలంలో ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు ఆయన(స)గారు రెండు రకాతులు నమాజు చేశారు.'

**170.** అబూబకరహ్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలంలో సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు ఆయన(స) గారు తన దుప్పటిని లాక్కుంటూ బయలుదేరారు. మసీదు వరకు వెళ్ళారు. ప్రజలు కూడా ఆయన(స) గారి వద్ద సమావేశమయ్యారు. ఆయన(స) వారికి రెండు రకాతులు నమాజు చేయించారు. తరువాత సూర్య గ్రహణం తొలగిపోయింది. సూర్యుడు ప్రకాశించసాగాడు. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; 'సూర్యుడు, చంద్రుడు ఈ రెండూ అల్లాహ్ సూచనలలోని రెండు సూచనలు. ఒకరు మరణించటం వల్ల వాటికి గ్రహణం పట్టదు. మీరు గనక ఇలా గ్రహణం పట్టటాన్ని చూస్తే నమాజు చెయ్యండి. దుఆ చేస్తూ ఉండండి. గ్రహణం తొలగిపోయే వరకు.' ఆయన(స) గారు ఇలా ఎందుకు సెలవిచ్చారంటే, ఆయన(స) గారి పుత్రుడు ఇబ్రాహీమ్ మరణించారు. అప్పుడు ప్రజలు, ఆయన మరణం వల్లనే గ్రహణం పట్టింది అని అనసాగారు."

## 18వ అధ్యాయం

### గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులో మొదటి రకాతును పొడుగైనదిగా చెయ్యాలి.

**171.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సూర్యగ్రహణం పట్టినప్పుడు మాచేత నమాజు చేయించారు.

రెండు రకాతులలో ఆయన(స) గారు నాలుగు రుకూలు చేశారు. మొదటి రకాతు రెండో రకాతుకంటే పొడుగైనది'.

## 19వ అధ్యాయం

**గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులో ఖుర్ఆన్ వాక్యాలను బిగ్గరగా పఠించటం.**

**172.** హ్రజత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె(ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులో ఖుర్ఆన్ వాక్యాలను బిగ్గరగా పారాయణం చేశారు. ఖురాన్ పారాయణం ముగిసి నప్పుడు ఆయన(స) గారు తక్బీర్ పలికారు. రుకూ చేశారు. రుకూలోనుంచి తన శిరస్సును పైకి ఎత్తినప్పుడు 'సమి అల్లాహు లిమన్ హమిదహ్,రబ్బనా వలకల్ హమ్ద్' అని పలికారు. తరువాత ఆయన(స) ఖుర్ఆన్ పారాయణాన్ని మళ్ళీ ప్రారంభించారు. క్లుప్తంగా చెప్పాలంటే గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులోని రెండురకాతులలో ఆయన(స) నాలుగు రుకూలుచేశారు. నాలుగు సజ్దాలు చేశారు. ఇమామ్ అవ్జాయి మొదలైనవారు ఇలా అన్నారు; నేను జుహ్రీ నుంచి విన్నాను; ఆయన ఉర్వా నుంచి విన్నారు; ఆయన హ్రజత్ ఆయెషా(ర) నుంచి విన్నారు. ఆమె(ర) గారు ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికాలంలో సూర్యుడికి గ్రహణం పట్టినప్పుడు, ఆయన(స) గారు ఒక వ్యక్తిని ఇలాప్రకటించమని చెప్పి పంపారు, 'నమాజు కోసం రమ్మని ప్రజల్ని పిలిచి చెప్పు'. తరువాత ఆయన(స) గారు ముందుకు వెళ్ళి నిలబడ్డారు. రెండురకాతులు నమాజు చేశారు. ఆ రెండు రకాతులలో నాలుగు రుకూలు చేశారు నాలుగు సజ్దాలు చేశారు'. వలీద్ బిన్ ముస్లిమ్ ఇలా అన్నారు; నాకు అబ్దుర్రహ్మాన్ బిన్ నమిర్ చెప్పారు. ఆయన ఇబ్నె షిహాబ్ నుంచి పైవిధంగానే విన్నారు. జుహ్రీ ఇలా అన్నారు; నేను ఉర్వాతో ఇలా అన్నాను; 'మీ సోదరుడైన అబ్దుల్లా బిన్ జుబైర్(రజి) ఏమి చేశారు? ఆయన(స) గారైతే గ్రహణం పట్టినప్పుడు చేసే నమాజులో మదీనా పట్టణంలో ఫజర్ నమాజు మాదిరిగా రెండు రకాతులుచేశారు.' ఉర్వా ఇలా అన్నారు; అవును అందులో సందేహం లేదు. ఆయన దైవప్రవక్త(స) గారి సున్నత్‌కు వ్యతిరేకంగా తప్పు చేశారు. అబ్దుర్రహ్మాన్ బిన్ నమిర్‌తోపాటు ఈ హదీసును సులైమాన్ బిన్ కసీర్ మరియు సుఫ్యాన్ బిన్ హుసేన్ గార్లు కూడా జుహ్రీ నుంచి ఉల్లేఖించారు; అందులో కూడా బిగ్గరగా ఖుర్ఆన్ పారాయణం చేసిన విషయం ప్రస్తావించబడింది."

# సజ్దయె తిలావత్- దానికి సంబంధించిన సున్నతుల అధ్యాయాలు

## 1వ అధ్యాయం

### సజ్దయె తిలావత్, ఇది సున్నత్ అవటం గురించి.[1]

**173.** అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా నగరంలో నజ్మ్ సూరాను పఠించారు. సజ్దా చేశారు. ఇంకా ఎంతమంది అయితే ఆయన(స) గారి వద్ద ఉన్నారో వారంతా (ముస్లిమ్‌లు, సత్య తిరస్కారులు) సజ్దా చేశారు. కాని ఒక ముసలి మనిషి మాత్రం (ఉమయ్యా బిన్ ఖలఫ్) సజ్దా చెయ్యలేదు. అతను ఒక గుప్పెడు నిండా చిన్న కంకరరాళ్ళలో లేక మట్టినో తీసుకొని తన నుదుటివరకు దాన్ని లేపాడు. ఇలా అన్నాడు; 'నాకు కేవలం ఈ మట్టి మాత్రమే సరిపోతుంది.' అబ్దుల్లాహ్(ర) ఇలా అన్నారు; ఆ తరువాత నేను అతను ఒక అవిశ్వాసిగానే చంపబడటాన్ని చూశాను."

## 2వ అధ్యాయం

### అలిఫ్ లామ్ మీమ్ తన్‌జీల్ అస్ సజ్దాలో సజ్దా చెయ్యటం.

**174.** అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) శుక్రవారం నాడు ఫజ్ర్ నమాజులోని

---

1-1. సజ్దే తిలావత్ ఎక్కువ మంది ఇమామ్‌ల దృష్టిలో 'సున్నత్' (దైవప్రవక్త(స) గారి సంప్రదాయం). ఒకవేళ ఎవరైనా దానిని విడిచిపెడితే వారు దోషులు కారు. ఇమామ్ అబూ హనీఫా(రహ్మాలై) గారు దానిని వాజిబ్‌గా అభివర్ణించారు. అహ్లె హదీసు ప్రభృతులు, ఇమామ్ అహ్మద్(రహ్మాలై) గార్ల దృష్టిలో మొత్తం ఖురానె షరీఫ్‌లో పదిహేను సజ్దా తిలావత్‌లు ఉన్నాయి. సూరె హజ్‌లో రెండు సజ్దాలు ఉన్నాయి. ఒక సజ్దా సూరె సాద్‌లో ఉంది. ఇమామ్ షాఫయి(రహ్మాలై) ఇమామ్ అబూ హనీఫా(రహ్మాలై) గార్ల దృష్టిలో పద్నాలుగు సజ్దే తిలావత్‌లే ఉన్నాయి. కాని ఇమామ్ షాఫయి (రహ్మాలై) గారి దృష్టిలో సూరె సాద్‌లో సజ్దా లేదు. ఇమామ్ అబూ హనీఫా(రహ్మాలై) గారి దృష్టిలో సూరె హజ్‌లో కేవలం ఒకే ఒక సజ్దా ఉంది.

మొదటి రకాతులో అలిఫ్ లామ్ మీమ్ తన్‌జీల్ అస్‌సజ్‌దా సూరాను, రెండో రకాతులో హల్‌అతా అలల్ ఇన్సాని అంటే అద్దహర్ సూరాను పారాయణం చేసేవారు."

## 3వ అధ్యాయం

**'సాద్' సూరాను పఠించేటప్పుడు సజ్‌దా చెయ్యటం.**

**175.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'సాద్ సూరాకు సంబంధించిన సజ్‌దా విధిగా చెయ్యవలసిన సజ్‌దాలలోనిది కాదు. కాని ఆ సూరాను పారాయణం చేసేటప్పుడు దైవప్రవక్త(స) సజ్‌దా చెయ్యటాన్ని నేను చూశాను.'

## 4వ అధ్యాయం

**నజ్మ్ సూరాలో సజ్దా చెయ్యటం గురించి. ఈ విషయాన్ని హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) గారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి నుంచి ఉల్లేఖించారు.**

**176.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అన్ నజ్మ్ సూరాను పారాయణం చేశారు. దాన్ని పారాయణం చేసేటప్పుడు సజ్దా చేశారు. అప్పుడు అక్కడ ఎంతమంది అయితే ఉన్నారో (విశ్వాసులు, అవిశ్వాసులు) వారందరూ సజ్దా చేశారు. కాని ప్రజలలోని ఒక వ్యక్తి ఏమి చేశాడంటే, అతను తన గుప్పెట్లో చిన్నచిన్న కంకరరాళ్ళనో లేక మట్టినో తీసుకుని పైకి ఎత్తాడు. ఆ గుప్పెటిని తన ముఖం వరకు తీసుకువచ్చాడు. ఇలా అన్నాడు; 'ఇది నాకు సరిపోతుంది.' అబ్దుల్లాహ్(ర) ఇలా అన్నారు; తరువాత నేను చూసింది ఏమిటంటే, అతను అవిశ్వాస స్థితిలోనే హతమార్చబడ్డాడు."

## 5వ అధ్యాయం

**ముష్రిక్కులతో కలిసి ముస్లిములు సజ్‌దా చెయ్యటం. వాస్తవానికి ముష్రిక్కులు అపరిశుద్ధులు. వారు వుజూ చేసుకోరు కదా! ఇబ్నె ఉమర్(రజిఅన్) వుజూ లేకుండానే సజ్‌దా చేసేవారు.**

**177.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అన్ నజ్మ్ సూరా పఠించేటప్పుడు సజ్దా చేసేవారు. ఆయన (స) గారితో ముస్లిములు, ముష్రిక్కులు, జిన్నులు, మనుషులందరూ సజ్దా చేశారు.

**ఈ హదీసును ఇబ్రాహీమ్ బిన్ తహ్మాన్ కూడా అయ్యూబ్ సఖ్తియానితోపాటు ఉల్లేఖించారు.'**

## 6వ అధ్యాయం

**సజ్దాకు సంబంధించిన ఖుర్ఆన్ వాక్యాన్ని పఠించి కూడా సజ్దా చెయ్యక పోవడం.**

**178.** అతా బిన్ యసార్ ఇలా ఉల్లేఖించారు; 'ఆయన జైద్ బిన్ సాబిత్‌ను అన్ నజమ్ సూరాలో సజ్దా ఉందా? అని అడిగారు. ఆయన సమాధానంగా ఇలా అన్నారు; నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి ఈ సూరాను పఠించి వినిపించాను. ఆయన(స) సజ్దా చెయ్యలేదు.'

**179.** జైద్ బిన్ సాబిత్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన (రజి) గారు ఇలా అన్నారు; "ఒకసారి నేను దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) గారి సమక్షంలో అన్ నజ్మ్ సూరాను పఠించాను; కాని ఆయన(స) గారు సజ్దా చెయ్యలేదు."[1]

## 7వ అధ్యాయం

**ఇజస్సమాఉన్ షఖ్ఖత్ సూరా పఠించే సమయంలోసజ్దా చెయ్యటం.**

**180.** అబూసలమా ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; "నేను అబూ హురైరా(ర)ను చూశాను; ఆయన గారు ఇజస్సమా ఉన్ షఖ్ఖత్ సూరాను పఠించారు. దానిని పఠించేటప్పుడు ఆయన సజ్దా చేశారు. తరువాత నేను అబూహురైరా(ర)ను ఇలా అడిగాను; నేను మిమ్మల్ని ఈ సూరాను పఠించేటప్పుడు సజ్దా చేస్తూ ఉండగా చూడలేదా? దానికి ఆయన(ర) గారు ఇలా అన్నారు; నేను గనక దైవప్రవక్త(స) గారు సజ్దా చేస్తూ ఉండగా చూసి ఉండకపోతే నేను కూడా ఎన్నటికీ సజ్దా చేసేవాణ్ణి కాదు."

## 8వ అధ్యాయం

**ఖుర్ఆన్ వాక్యాలను పఠించేవాడు సజ్దా చేసినప్పుడే వినేవాడు కూడా సజ్దా చెయ్యాలి; అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) తమీమ్ బిన్ హజ్లమ్‌తో అన్నారు;**

179– 1) ఎందుకంటే, సజ్దయె తిలావత్ చెయ్యటం వాజిబ్ కాదు. ఎవరైతే వాజిబ్ అని అంటారో వారు కూడా వెంటనే సజ్దా చేసే అవసరం లేదని భావిస్తారు. బహుశా దైవప్రవక్త(స) తరు వాత ఎప్పుడైనా సజ్దా చేసి ఉండవచ్చు. బజ్జార్, దారెఖుతనీ గార్లు అబూహురైరా నుంచి తీసుకున్నారు; అందులో ఇలా వుంది : దైవప్రవక్త(స) నజమ్ సూరాను పఠించినప్పుడు సజ్దా చేశారు; మేము కూడా ఆయన(స) గారితో పాటు సజ్దా చేశాము.

**అతను ఒక పిల్లవాడు; అతను సజ్దా ఉన్న ఖుర్ఆన్ వాక్యాన్ని పఠించాడు; అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు; 'సజ్దా చెయ్యి. ఎందుకంటే నీవు ఈ సజ్దాలో మాకు ఇమామ్వు."[1]**

**181.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుర్ఆన్‌లోని ఒక సూరాను పఠించి మాకు వినిపించేవారు. అందులో గనక సజ్దా వాక్యం ఉంటే ఆయన(స) సజ్దా చేసేవారు, మేము కూడా ఆయన(స) గారితో పాటు సజ్దా చేసేవారము. చివరకు కొందరికి తమ నుదుటిని భూమిపై పెట్టి సజ్దా చేసే స్థలం కూడా దొరికేది కాదు.[1]

## 9వ అధ్యాయం

### ఇమామ్ సజ్దా ఉన్న వాక్యాన్ని పఠించినప్పుడు మరియు ప్రజలు అధికసంఖ్యలో ఉన్నప్పుడు...

**182.** ఇబ్నె ఉమర్(ర) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సజ్దా ఉన్నటువంటి ఖుర్ఆన్ వాక్యాన్ని పఠించినప్పుడు మరియు మేము ఆయన(స) గారి వద్ద ఉంటే, తరువాత ఆయన(స) గారు సజ్దా చేస్తే మేము కూడా ఆయన(స) గారితోపాటు సజ్దా చేసేవారము. ప్రజలు ఎంత ఎక్కువగా గుమిగూడేవారంటే, మాలో కొందరికి తమ నుదుటిని నేలపై ఆనించి సజ్దా చేసే అంత స్థలం కూడా లభించేది కాదు."

---

8-1) దీనిని సయీద్ బిన్ మన్సూర్ 'వసల్' చేశారు. ఇబ్నె అబీ షైబా గారు వెలికి తీశారు. ఒక బాలుడు దైవప్రవక్త ముహమ్మద్(స) గారి సమక్షంలో సజ్దా ఉన్న ఖుర్ఆన్ వాక్యాన్ని పఠించాడు. మరియు దైవప్రవక్త(స) గారు సజ్దా చేస్తారని నిరీక్షించాడు. ఆయన(స) గారు సజ్దా చెయ్యలేదు; అప్పుడు అతను, ఓ దైవప్రవక్తా(స)! ఇక్కడ సజ్దా లేదా? అని అడిగాడు. అప్పుడు ఆయన(స) గారు ఇలాసెలవిచ్చారు; ఇక్కడ సజ్దా అయితే ఉన్నది. కాని నీవు మాకు ఇమామ్‌గా ఉన్నావు. నీవుగనుక సజ్దా చేసిఉంటే మేము కూడా సజ్దా చేసిఉండేవారము.

181-1 : ఈ హదీసు ద్వారానే కొందరు ఒక విషయాన్ని వెలికి తీశారు; అదేమిటంటే, ఖుర్ఆన్ వాక్యాలను పఠించేవాడు సజ్దా చేస్తే, అప్పుడు వినేవాడు కూడా సజ్దా చెయ్యాలి. అంటే ఈ సజ్దాలో వినేవాడు 'ముఖ్తది', పఠించేవాడు ఇమామ్. బైహాఖీ హజ్రత్ ఉమర్(ర) గారి నుంచి ఇలా ఉల్లేఖించారు; 'ప్రజలు అధికసంఖ్యలో గుమిగూడినప్పుడు మీలో ఎవరైనా సరే తమ సోదరుని వీపుపై నుదుటిని ఆనించి సజ్దా చెయ్యవచ్చు.'

## 10వ అధ్యాయం

సజ్దయె తిలావత్‌ను వాజిబ్‌గా భావించని వ్యక్తి చూపించే ప్రమాణం. ఇమ్రాన్ బిన్ హుసైన్‌ను ఇలా అడగటం జరిగింది; 'ఒక వ్యక్తి సజ్దా ఉన్న ఖురాన్ వాక్యాన్ని విన్నాడు. కాని అతను దానిని వినే ఉద్దేశ్యంతో అక్కడ కూర్చోలేదు. అలాంటప్పుడు అతను తప్పనిసరిగా సజ్దా చెయ్యవలసిందేనా?' ఆయన(ర) ఇలా అన్నారు; అతను ఆ ఉద్దేశ్యంతో కూర్చున్నప్పటికీ సజ్దా చేసే అవసరం లేదు. అంటే, ఆయన సజ్దే తిలావత్‌ను వాజిబ్‌గా భావించలేదన్నమాట. సల్మాన్ ఫార్సీ (రజిఅన్) ఇలా అన్నారు; “మేము ఇందుకోసం రాలేదు. హజ్రత్ ఉస్మాన్(రజిఅన్) ఇలా అన్నారు;ఎవరైతే సంకల్పం చేసుకుని సజ్దా ఉన్న ఖురాన్ వాక్యాన్ని వింటారో వారే సజ్దాను తప్పనిసరిగా చెయ్యాలి. జుహ్రీ ఇలా అన్నారు; సజ్దే తిలావత్ చెయ్యరాదు. వుజూతో ఉంటే తప్ప. తరువాత నీవు సజ్దా చేస్తే, ప్రయాణంలో లేకపోతే ఖిబ్లా వైపునకు ముఖాన్ని త్రిప్పు. ఒకవేళ ఏదైనా వాహనంపై ఉంటే (ప్రయాణంలో ఉంటే) అప్పుడు నీ ముఖం ఏ దిక్కువైపునకు ఉంటే ఆ దిక్కుకే సజ్దా చెయ్యి.” సాయిబ్ బిన్ యజీద్ (ర) గారు ప్రసంగాలు చేసేవారు (ప్రబోధకులు) సజ్దా ఉన్న వాక్యాలను పఠించినప్పుడు సజ్దా చేసేవారు కాదు.

**183.** అబూబక్ర్ బిన్ అబీ ములైకా కథనం : రబీఅ చాలా మంచి వ్యక్తి. ఆయన హజ్రత్ ఉమర్(ర) గారి సభలో తాను చూసిన స్థితిని ఇలా వివరించారు. “హజ్రత్ ఉమర్(ర) జుమా రోజున మెంబర్ మీద నిలబడి అన్ నహ్ల్ సూరాను పఠించారు. సజ్దా ఉన్న ఆయత్‌ను (వలిల్లాహి యస్‌జుద్ మా ఫిస్సమావాతి... నుంచి చివరివరకు) వచ్చినప్పుడు మెంబర్‌పై నుంచి కిందికి దిగి సజ్దా చేశారు. ప్రజలు కూడాఆయన గారితోపాటు సజ్దా చేశారు. రెండో జుమా రోజున కూడా ఆయన(ర) మళ్ళీ ఈ సూరానే పారాయణం చేశారు. సజ్దా ఉన్న ఖుర్‌ఆన్ వాక్యం వద్దకు వచ్చినప్పుడు ఆయన ఇలా అన్నారు; “ప్రజలారా! మేము సజ్దా ఉన్న ఆయత్‌ను పఠిస్తూ పోతున్నాము. ఎవరైతే సజ్దా చేశారో వారు మంచిపని చేశారు. ఎవరైతే సజ్దా చెయ్యలేదో వారిపై ఎలాంటి దోషమూ లేదు.” హజ్రత్ ఉమర్(ర) గారు సజ్దా చెయ్యలేదు. నాఫె గారు ఇబ్నె ఉమర్(ర) నుంచి నకలు చేశారు; అల్లాహ్ సజ్దయె తిలావత్‌ను విధిగా నిర్ణయించలేదు. ఆయన దానిని మన ఇష్టానికి వదిలేశాడు.

## 11వ అధ్యాయం

**నమాజ్ చేసే సమయంలో సజ్దా ఉన్న ఖురాన్ వాక్యాన్ని పఠించటం, నమాజులోనే సజ్దా చెయ్యటం గురించి.**

**184.** అబూ రాఫె ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; నేను అబూ హురైరా (రజిఅన్)తో కలిసి ఇషా నమాజును చేశాను. ఆయన 'ఇజస్సమావున్ షఖ్ఖత్' సూరాను పారాయణం చేశారు. సజ్దా చేశారు. నేను ఇలా అడిగాను; 'ఈ సజ్దా ఏమిటి?' అని. ఆయన(ర) ఇలా సమాధానం పలికారు; 'నేను ఈ సూరాలో దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) గారివెనుక సజ్దా చేశాను. కనుక ఈ సూరాను పఠించి నప్పుడల్లా సజ్దా చేస్తాను; ఆయన గారిని కలిసేవరకు.'

## 12వ అధ్యాయం

**ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నప్పుడు సజ్దయె తిలావత్ కోసం స్థలం లభించనప్పుడు.**

**185.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; "దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సజ్దయె తిలావత్ ఉన్నటువంటి ఖురాన్ వాక్యం గల సూరాను పఠించినప్పుడు సజ్దా చేసేవారు. మేము కూడా ఆయన(స) గారితో పాటు సజ్దా చేసేవారు. చివరకు మాలోని కొందరికి తమ నుదుటిని ఆనించి సజ్దా చేసే స్థలం కూడా లభించేదికాదు."

# నమాజును ఖసర్ (సంక్షిప్తం) చేసే అధ్యాయాలు

## 1వ అధ్యాయం

**నమాజును సంక్షిప్తం చేసే విషయం గురించి; ప్రయాణంలో ఎంతకాలం వరకు ఒక వ్యక్తి ఖసర్ నమాజును చెయ్యగలడు?**

**186.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా విజయం లభించినప్పుడు పందొమ్మిది రోజుల వరకు ఆగిపోయారు. ఖసర్ నమాజులు చేస్తూ ఉండిపోయారు; అందువల్ల మేము ప్రయాణంలో పందొమ్మిది రోజుల వరకు ఆగిపోవలసి వస్తే ఖసర్ నమాజులు చేసేవారము. ఒకవేళ దానికంటే ఎక్కువ కాలం వరకు ఆగిపోతే పూర్తి నమాజులను చేసేవారము.'

**187.** యహ్యా బిన్ ఇస్హాఖ్ ఇలా ఉల్లేఖించారు; అనస్ (రజిఅన్) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను; ఆయన ఇలా అనేవారు, 'మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో (హజ్జతుల్ విదాలో) మదీనా పట్టణం నుంచి మక్కా నగరం వరకు ప్రయాణంచేశాము. ఆయన(స) గారు రెండు రెండు రకాతుల చొప్పున నమాజ్ చేసేవారు. (ఖసర్ చేసేవారు) చివరకు మేము మదీనాకు తిరిగి వచ్చాము. యహ్యా ఇలా అన్నారు; నేను అనస్(రజిఅన్)ను, మీరు మక్కాలో ఎన్ని రోజులు ఉన్నారు? అని అడిగాను. సమాధానంగా ఆయన పదిరోజులు అని అన్నారు.'

## 2వ అధ్యాయం

**మినాలో నమాజు చెయ్యటం గురించి.**

**188.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'నేను ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స), అబూబకర్ (ర),ఉమర్(ర) గార్లతో కలిసి మినాలో రెండు రకాతుల నమాజును మాత్రమే చేశాను; ఇంకా హజ్రత్ ఉస్మాన్ (ర) గారితో కలిసి ఆయన గారి ఖిలాఫత్ ప్రారంభ కాలంలో కూడా రెండు రకాతుల నమాజును మాత్రమే చేశాను. ఆ తరువాత ఆయన గారు పూర్తి నమాజును చెయ్యసాగారు.'

**189.** హారిస బిన్ వహబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఆయన ఇలా అనే వారు; 'మినాలో ప్రశాంత పరిస్థితిలో- ఏమాత్రం భయంతో కూడుకున్న వాతావరణం లేనప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మాకు రెండు రకాతుల నమాజును చేయించారు.'

**190.** అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ ఇలా అనేవారు; 'హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) మాకు మినాలో నాలుగు రకాతులు నమాజును చేయించారు. (ఖసర్ చేయించలేదు). ప్రజలు ఈ స్థితినిగురించి అబ్దుల్లా బిన్ మసూద్(రజిఅన్)కు విన్నవించుకున్నారు. ఆయన(ర) 'ఇన్నాలిల్లాహ్' అని పలికారు. మరియు ఇలా అన్నారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి మినాలో రెండు రకాతులు నమాజు చేశాను. అబూ బకర్ సిద్దీఖ్(రజి)తో కలిసి మినాలో రెండు రకాతులు నమాజు చేశాను. మరియు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజిఅన్)తో కలిసి మినాలో రెండు రకాతులు నమాజు చేశాను. అయ్యో! (సున్నత్‌కు విరుద్ధమయిన) ఆ నాలుగు రకాతులకు బదులుగా నాకు రెండు స్వీకారయోగ్యమైన రకాతులు లభిస్తే ఎంత బాగుంటుంది.'

## 3వ అధ్యాయం

**దైవప్రవక్త ముహమ్మద్(స) హజ్జ్ యాత్రలో ఉన్నప్పుడు మక్కాలో ఎన్ని రోజులు బస చేశారు?**

**191.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స), ఆయన(స) గారి సహాబా మదీనా నుంచి మక్కాకు జిల్‌హజ్జ మాసం నాల్గవ తేదీ ఉదయం వచ్చారు. వారందరూ హజ్‌కు సంబంధించిన లబ్బైక్‌ను పఠిస్తూ మక్కాలో ప్రవేశించారు. దైవప్రవక్త(స) వారిని ఇలా ఆజ్ఞాపించారు; 'హజ్‌ను ఉమ్రాగా చేసుకుని ఇహ్రామ్‌ను విప్పివెయ్యండి. కాని అతనితో ఖుర్బానీ పశువు ఉండాలి.' అబుల్ ఆలియాతోపాటు ఈ హదీసును అతా బిన్ అబీ రిబాహ్ కూడా జాబిర్ (రజిఅన్) గారికి ఉల్లేఖించారు.

## 4వ అధ్యాయం

**ఎంత దూరం ప్రయాణం చేస్తే ఖసర్ చెయ్యాలి? దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక దినం, ఒక రాత్రి చేసే ప్రయాణాన్ని కూడా ప్రయాణం అన్నారు.**

ఇబ్నె ఉమర్(రజిఅన్), ఇబ్నె అబ్బాస్(రజిఅన్) గార్లు ఉభయులూ నాలుగు బురుద్‌ల ప్రయాణంలో ఖసర్ చేశారు. మరియు ఇఫ్తార్ చేశారు; నాలుగు బురుద్‌లు పదహారు ఫర్‌సఖ్‌లకు సమానం అంటే 48 మైళ్ళు అన్నమాట.

**192.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఇబ్నె ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; 'ఒక స్త్రీ మూడు రోజుల ప్రయాణాన్ని తన మహరమ్ బంధువు లేకుండా చెయ్యకూడదు. (మహరమ్ బంధువు అంటే ఆమె సోదరుడు, ఆమె తండ్రి, ఆమె తాతయ్య లాంటి వారు)'

**193.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నె ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; 'ఒక స్త్రీ మూడు రోజుల ప్రయాణాన్ని మహరమ్ బంధువు లేకుండా చెయ్యకూడదు.'

**194.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; 'ఏ స్త్రీ అయితే అల్లాహ్‌నూ, ప్రళయదినాన్ని దృఢంగా నమ్ముతుందో ఆమె ఒకదినం ఒక రాత్రి ప్రయాణాన్ని మహరమ్ బంధువు ఎవరూ లేకుండా చెయ్యటం ధర్మసమ్మతం కాదు.'

## 5వ అధ్యాయం

ఒక మనిషి ఎవరైనా ప్రయాణం చేసే సంకల్పంతో తన పట్టణంలోనుంచి బయటికి వెళ్ళిపోతే అప్పుడు అతను ఖసర్ చెయ్యాలి. హజ్రత్ అలీ (రజిఅన్) (కూఫా నుంచి) బయలుదేరారు. మరియు ఖసర్ చెయ్యసాగారు. ఇంకా కూఫా పట్టణంలోని ఇళ్లు కనిపిస్తూనే ఉన్నాయి. ఆయన ప్రయాణంనుంచి తిరిగివచ్చి నప్పుడు ప్రజలు ఇదిగో ఇదే కూఫా అని అన్నారు. ఆయన(ర) ఇలా అన్నారు; మేము కూఫాలోకి ప్రవేశించనంతవరకు 'ఖసర్' చేస్తూనే ఉంటాము.

**195.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితోకలిసి మదీనా పట్టణంలో జొహ్ర్ నమాజుకు చెందిన నాలుగు రకాతులు చేశాను. జుల్‌హులైఫాకు వెళ్ళిన తరువాత అక్కడ అసర్ నమాజు రెండు రకాతులు చేశాము.

**196.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; "మొదట ఇస్లామ్

ప్రారంభ దశలో నమాజు రెండు రకాతులు మాత్రమే ఫరజ్ (అంటే విధి) అయింది. తరువాత ప్రయాణంలో చేసే నమాజైతే అదే స్థితిలో ఉంచబడింది. మరియు ఇంటి నమాజు పెంచబడింది. జుహ్‌రీ ఇలా అన్నారు; 'నేను ఉర్‌వాను ఇలా అడిగాను; అయితే హజ్రత్ ఆయెషా(ర) ప్రయాణంలో పూర్తి నమాజును ఎందుకుచేస్తారు; ఆయన ఇలా అన్నారు; హజ్రత్‌ఉస్మాన్ మాదిరిగానే ఆమె(ర) గారు కూడా షరీయత్ పరమైన భావాన్వయం చేసేవారు.'

## 6వ అధ్యాయం

## మగ్రిబ్ నమాజును ప్రయాణంలోకూడా మూడు రకాతులే చెయ్యాలి.

**197.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'నేను చూశాను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రయాణానికి బయలుదేరే తొందరలో ఉన్నప్పుడు (అంటే తొందరగా చేరాలనే సంకల్పం ఉన్నప్పుడు) మగ్రిబ్ నమాజును చేసే విషయంలో ఆలస్యం చేసేవారు. ఇంకా మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి చేసేవారు. సాలిమ్ ఇలా అన్నారు; అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) గారు కూడా ప్రయాణం చేసేటప్పుడు తొందరగా చేరవలసి ఉన్నప్పుడు ఈ విధంగానే చేసేవారు సాలిమ్ అదనంగా ఇలా అన్నారు; ఇబ్నెఉమర్(ర) ముజ్దలిఫాలోకి ప్రవేశించిన తరువాత మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి చేసేవారు. ఇంకా సాలిమ్ ఇలా అన్నారు; ఇబ్నె ఉమర్(ర) మగ్రిబ్ నమాజును చేసే విషయంలో ఆలస్యం చేశారు. అప్పుడు ఆయన గారి భార్య సఫియ బిన్తె అబీ ఉబైద్ వ్యాధి తీవ్రరూపం దాల్చిందనే దుర్వార్త అందింది. నేను ఆయన గారితో 'నమాజ్' అని అన్నాను. ఆయన పదండి ముందుకు అన్ని అన్నారు. తరువాత నేను మళ్ళీ నమాజ్ అని అన్నారు. ఆయన ముందుకు పదండి అని అన్నారు. చివరకు రెండు లేక మూడుమైళ్ళ దూరాన్ని దాటి వచ్చాము. అప్పుడు ఆయన ఒంటె మీద నుంచి కిందికి దిగారు. మరియు నమాజు చేశారు. ఆయన ఇలా అన్నారు; దైవప్రవక్త(స) గారు కూడా తొందరగా వెళ్ళవలసిన అవసరం కలిగినప్పుడు ఇలాగే చెయ్యటాన్ని నేను చూశాను. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఇలా అన్నారు; నేనుదైవప్రవక్త(స) గారిని చూశాను; ఆయన(స) గారు ప్రయాణంలో ఉన్నప్పుడు మగ్రిబ్ నమాజును ఆలస్యంగా చేసేవారు, ఇంకా మూడు రకాతులు చేసి సలామ్ చేసేవారు. ఆ తరువాత కొంచెంసేపు ఆగి ఇషా నమాజు కోసం

ఇఖామత్ పలికించేవారు. ఇషా నమాజు రెండు రకాతులు చేసి సలామ్ చేసేవారు. ఇషా నమాజు తరువాత సున్నత్ నమాజు గాని, ఇతర నమాజులుగానీ చేసేవారు కాదు. తరువాత అర్ధరాత్రి దాటినప్పుడు లేచి నిలబడి నమాజు చేసేవారు.'

## 7వ అధ్యాయం

**వాహనం మీద నఫిల్ నమాజులు చెయ్యటం; దాని ముఖం ఎటుఉన్నా సరే.**

**198.** తన తండ్రిగారైన ఆమిర్ బిన్ రబీయ ఇలా అన్నారని అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ ఉల్లేఖించారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని చూశాను; ఆయన(స) గారు తన ఒంటె మీద నమాజులు చేస్తూ ఉండేవారు. దాని ముఖం ఏ దిక్కులో ఉన్నాసరే.'

**199.** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(ర) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) నఫిల్ నమాజులను ఒంటె మీద (వాహనం మీద) స్వారీ చేస్తూ ఉన్నప్పుడు చేసేవారు. ఖిబ్లా వైపునకు కాకుండా మరొక దిక్కు వైపునకు తిరిగి చేస్తూ ఉండేవారు.'

**200.** నాఫె ఇలా ఉల్లేఖించారు; 'ఇబ్నె ఉమర్ (రజిఅన) తన ఒంటె మీద (నఫిల్) నమాజులను చేసేవారు. మరియు వితర్ నమాజును కూడా దాని మీదనే చేసేవారు. ఇంకా ఆయన ఇలా వివరణ ఇచ్చేవారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారుకూడా ఇలానే చేసేవారు.'

## 8వ అధ్యాయం

**వాహనం మీద (ఒకవేళ రుకూ చెయ్యలేకపోతే అప్పుడు) సైగ చెయ్యటం సరిపోతుంది.**[1]

**201.** అబ్దుల్లాహ్ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు; 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ప్రయాణంలో ఉన్నప్పుడు తన ఒంటె మీదనే (నఫిల్) నమాజులను చేసేవారు. ఆ వాహనం ఎటు తీసుకుపోయినా సరే; సైగ చేసేవారు. ఇంకా అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఇలా అనేవారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలాగే చేసేవారు".

---

8–1: అంటే సజ్దాను రుకూ కంటే కొంచెం కిందకు వంగి మరీ చెయ్యాలి. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) ఇలా అన్నారు; వాహనం మీద నమాజు చేసే వ్యక్తి సజ్దా చెయ్యకూడదు. సైగ సరిపోతుంది.

## 9వ అధ్యాయం

### ఫర్జ్ నమాజు కోసం వాహనం మీద నుంచి కిందికి దిగటం.

**202.** ఆమిర్ బిన్ రబీఅ(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని చూశాను. ఆయన(స) గారు అప్పుడు తన ఒంటె మీద కూర్చుని నఫిల్ నమాజు చేస్తూ ఉన్నారు. తన శిరస్సుతో సైగ చేస్తూ పోతున్నారు. తన ముఖం ఎటు ఉంటే అటే. ఆయన(స) గారు ఫర్జ్ నమాజులో అలా చెయ్యరు. (వాహనం మీద కూర్చోరు) సాలిమ్ ఇలా ఉల్లేఖించారు; 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ప్రయాణంలో ఉన్నప్పుడు రాత్రి సమయంలో తన పశువు మీదనే నమాజు చేసేవారు. దాని ముఖం ఏ దిక్కువైపున ఉన్నదో లెక్క చేసేవారు కాదు. ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) కూడా ఒంటె మీదనే నఫిల్ నమాజు చేసేవారు. దాని ముఖం ఎటువైపు ఉన్నాసరే. ఇంకా వితర్ నమాజు కూడా దానిమీదనే చేసేవారు. కేవలం ఫరజ్ నమాజును మాత్రమే దానిపై చేసేవారు కాదు.'

**203.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తమ ఒంటె మీద కూర్చొని నఫిల్ నమాజులు చేసేవారు; అప్పుడు దాని ముఖం తూర్పు దిక్కు వైపునకు ఉండేది. ఆయన(స) గారు ఫర్జ్ నమాజును చెయ్యదలిచినప్పుడు, ఒంటె మీద నుంచి కిందికి దిగేవారు. మరియు ఖిబ్లా వైపునకు ముఖాన్ని పెట్టేవారు.

## 10వ అధ్యాయం

### గార్దభం మీద స్వారీ చేస్తూ నఫిల్ నమాజులు చెయ్యటం.

**204.** అనస్ బిన్ సీరీన్ ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; మేము హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్)కు స్వాగతం పలకటానికి బయలుదేరాము. అప్పుడు ఆయన(ర) సిరియా నుంచి తిరిగి వస్తున్నారు. మేము ఆయన గారిని అయ్‌నిత్తమ్ర్ అనే స్థలం వద్ద కలుసుకున్నాము. మేము ఆయన్ని చూశాము. అప్పుడు ఆయన గారు ఒక గాడిద మీద స్వారీ చేస్తూ నమాజు చేస్తున్నారు. అప్పుడు ఆయన గారి ముఖం ఖిబ్లా దిక్కుకు ఎడమ వైపునకు ఉన్నది. నేను ఇలా అన్నాను; 'నేను చూస్తున్నాను మీరు ఖిబ్లా వైపునకు కాక మరొక వైపునకు తిరిగి నమాజు చేస్తున్నారు. అప్పుడు

ఆయన ఇలా అన్నారు; నేను గనక దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను అలా చేస్తూ ఉండగా చూసి ఉండకపోతే నేనుకూడా ఇలా చేసి ఉండేవాణ్ణి కాను.'

## 11వ అధ్యాయం

**ప్రయాణంలో ఉన్నప్పుడు ఫర్జ్ నమాజుకు పూర్వం లేక ఫర్జ్ నమాజు తరువాత సున్నత్ నమాజులను చెయ్యకపోవటం.**

**205.** హఫ్స్ బిన్ ఆసిమ్ ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ప్రయాణం మీద వెళ్ళారు. అప్పుడు ఆయన ఇలా అన్నారు: నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితోకలిసి ఒకసారి ప్రయాణం చేస్తూ ఉన్నాను. ఆయన(స) గారు ప్రయాణంలో సున్నత్ నమాజులు చేస్తుండగా నేను ఎన్నడూ చూడలేదు. అల్లాహ్ అల్ అహ్జాబ్ సూరా(21)లో ఇలా సెలవిచ్చాడు; వాస్తవంగా అల్లాహ్ ప్రవక్తల్లో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది.'

**206.** హజ్రత్ ఇబ్నెఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఆయన ఇలా అంటూ ఉండేవారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి ఒకసారి ప్రయాణంచేశాను. ఆయన(స) గారు ప్రయాణంలో రెండు రకాతుల కంటే ఎక్కువ నమాజు చెయ్యలేదు. ఇంకా హజ్రత్ అబూబకర్(రజిఅన్), హజ్రత్ ఉమర్(రజిఅన్), హజ్రత్ ఉస్మాన్(రజిఅన్)గార్లు కూడా అలాగే చేసేవారు.'

## 12వ అధ్యాయం

**ఫర్జ్ నమాజుల తరువాత మరియు మునుపటి సున్నత్ నమాజులు తప్ప ఇతర నఫిల్ నమాజులను ప్రయాణంలో ఉన్నప్పుడు చెయ్యటం.[1] దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ప్రయాణంలో ఉన్నప్పుడు ఫజ్ర్ నమాజుకు సంబంధిం చిన సున్నత్ నమాజులను కూడా చేశారు.**

**207.** ఇబ్నె అబీలైలా ఉల్లేఖించారు; ఆయన గారు ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇష్రాఖ్ (చాష్త్) నమాజును చేశారని, 'ఉమ్మెహానీ తప్ప మరెవరూ మాకు ఈ విషయం గురించి చెప్పలేదు. ఉమ్మెహానీ ఇలా వివరించారు:

12-1. ఇమామ్ బుఖారి(రహ్మలై) గారు చెప్పదలచుకున్న విషయం ఏమిటంటే, ప్రయాణంలో ఉన్నప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫర్జ్ నమాజులకు ముందు, వాటి తరువాత ఉన్నటువంటి సున్నత్ నమాజులను చెయ్యలేదు. కాని ఇతర నఫిల్ నమాజులను,

'మక్కా విజయం లభించిన రోజున దైవప్రవక్త(స) ఆమె గారి ఇంట్లో గుసుల్ చేశారు. మరియు ఎనిమిది రకాతులు నమాజు చేశారు. అవి చాలా తేలికపాటి నమాజులు. ఇలాంటి తేలికపాటి నమాజులను ఆయన(స) గారు చేస్తూ ఉండగా నేను ఎన్నడూ చూడలేదు. కాని ఆయన(స) రుకూను, సజ్దాను మాత్రం పూర్తిగా చేశారు'.

అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ రబీయ తనకు తన తండ్రి గారు ఇలా చెప్పారని ఉల్లేఖించారు; ఆయన ఏమన్నారంటే 'దైవప్రవక్త(స) గారిని రాత్రిపూట నిద్ర నుంచి మేల్కొని తన ఒంటె మీద స్వారీ చేస్తూ నఫిల్ నమాజులు చేస్తూ ఉండగా తాను చూశానని తెలిపారు. ఆ ఒంటె ఆయన(స) గారిని ఎటువైపుకు తీసుకుపోతే అటువైపుకే తిరిగి నమాజు చేసేవారు.

**208.** సాలిమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తన ఒంటె వీపు మీద కూర్చొని స్వారీ చేస్తూనే నఫిల్ నమాజులను చేస్తూ ఉండేవారు, ఆయన(స) గారి ముఖం ఏ దిక్కులో ఉన్నా. ఆయన(స) తన శిరస్సుతో (రుకూలోను, సజ్దాలోనూ) సైగ చేసేవారు. ఇబ్నె ఉమర్(ర)గారు కూడా అలానే చేసేవారు.

## 14వ అధ్యాయం

**ప్రయాణంలో ఉన్నప్పుడు మగ్రిబ్, ఇషా నమాజులను (జుహ్రా, అసర్) నమాజు లను కలిపి చెయ్యటం.**

**209.** సాలిమ్ గారి తండ్రి (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ప్రయాణ తొందరలో ఉన్నప్పుడల్లా మగ్రిబ్, ఇషా నమాజు లను కలిపి చేసేవారు.'

ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ప్రయాణంలో ఉన్నప్పుడు జుహ్రా, అస్ర్ నమాజులను కలిపి వరుసగా చేసేవారు. ఇంకా మగ్రిబ్, ఇషా నమాజులను కూడా ఆయన(స) గారు ప్రయాణంలో

---

ఇష్రాఖ్ మొదలైన వాటినిప్రయాణంలో ఉన్నప్పుడు ఆయన(స) చేసినట్లు ఆధారాలు ఉన్నాయి. ఆయన(స) ఫజర్‌కు సంబంధించిన సున్నత్‌ను చేసినట్లు కూడా రుజువులు ఉన్నాయి.

ఉన్నప్పుడు కలిపి చేసేవారు.' అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రయాణంలో ఉన్నప్పుడు మగ్రిబ్ ఇషా నమాజులను కలిపి చేసేవారు.'

## 14వ అధ్యాయం

**ఒకవేళ మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి చేసినప్పుడు అజాన్ కూడా ఇవ్వాలా లేక కేవలం తక్బీర్ పలికితే సరిపోతుందా?**

**210.** జుహ్రి ఇలా ఉల్లేఖించారు; సాలిమ్ నాతో ఇలా అన్నారు; అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా అన్నారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స)ను చూశాను, ఆయన(స) గారు ప్రయాణంలో తొందరగా వెళ్ళవలసి ఉన్నప్పుడు మగ్రిబ్ నమాజు చేసే విషయంలో ఆలస్యం చేసేవారు. మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి చేసేవారు.' సాలిమ్ ఇలా అన్నారు; 'అబ్దుల్లా బిన్ ఉమర్(ర) కూడా అలానే చేసేవారు. తొందరగా వెళ్ళవలసి ఉన్నప్పుడు ఆయన కూడా మగ్రిబ్‌కు సంబంధించిన తక్బీర్‌ను పలికింపజేసేవారు. మూడు రకాతులు నమాజు చేసి సలామ్ చేసేవారు. ఆ తరువాత కొంచెంసేపు ఆగి ఇషాకు సంబంధించిన తక్బీర్‌ను పలికింపచేసేవారు. దానికి చెందిన రెండు రకాతులు నమాజ్ చేసి సలామ్ చేసేవారు. ఇంకా ఆ నమాజుల మధ్య కాలంలో ఒక్క నఫిల్ నమాజు కూడా చేసేవారు కాదు. ఇషా నమాజు తరువాత కూడా ఏ నమాజును కూడా చేసేవారు కాదు. చివరకు అర్ధరాత్రి సమయంలో నిద్ర నుంచి మేల్కొనేవారు.'

**211.** హజ్రత్ అనస్‌బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈ రెండు నమాజులను అంటే మగ్రిబ్, ఇషా నమాజులను ప్రయాణంలో ఉన్నప్పుడు కలిపి చేసేవారు.'

## 15వ అధ్యాయం

**బాటసారి పొద్దువాలక ముందే ప్రయాణానికి బయలుదేరితే అప్పుడు అసర్ నమాజు వేళ అయ్యే వరకు జుహ్రా నమాజులో ఆలస్యం చెయ్యాలి. ఈ విషయాన్ని ఇబ్నె అబ్బాస్(రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి నుంచి ఉల్లేఖించారు.**

**212.** హ(జత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రయాణంలో ఉన్నప్పుడు పొద్దు వాలటానికి ముందే ప్రయాణానికి బయలుదేరితే అప్పుడు జుహ్ర్ నమాజు విషయంలో ఆలస్యం చేసేవారు. అస్ర్ నమాజు సమయం వచ్చేవరకు ఆగేవారు. తరువాత ఆ రెండు నమాజులను కలిపి చేసేవారు. ఒకవేళ బయలుదేరటానికి ముందే పొద్దువాలితే, అప్పుడు జుహ్ర్ నమాజు చేసి బయలుదేరేవారు.'

## 16వ అధ్యాయం

**ప్రయాణంలో ఉన్నప్పుడు పొద్దువాలిన తరువాత బయలుదేరాలని అనుకున్నప్పుడు, జుహ్ర్ నమాజు చేసిన తరువాతనే బయలుదేరాలి.**

**213.** హ(జత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రయాణంలో ఉన్నప్పుడు పొద్దువాలటానికి ముందే బయలుదేరితే అప్పుడు జుహ్ర్ నమాజును, అసర్ నమాజు సమయం వచ్చేవరకు ఆలస్యం చేస్తారు. తరువాత ఒంటె మీద నుంచి కిందికి దిగి రెండు నమాజులను కలిపి చేసేవారు. ఒకవేళ ప్రయాణానికి బయలుదేరకముందే సూర్యుడు గనక వాలితే అప్పుడు జుహ్ర్ నమాజును చేసి ఒంటెమీద ఎక్కి బయలుదేరేవారు.'

## 17వ అధ్యాయం

**కూర్చొని నమాజు చెయ్యటం గురించి.**

**214.** హ(జత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె(ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి అస్వస్థులయ్యారు. ఈ కారణంగా ఆయన(స) గారు తమ ఇంట్లో కూర్చొని నమాజు చేశారు. ప్రజలు కొందరు ఆయన (స) గారి వెనుక నిలబడి నమాజు చెయ్యసాగారు. ఆయన(స) గారు సైగద్వారా వారిని కూర్చొని నమాజు చెయ్యమని సూచించారు. నమాజు చెయ్యటం ముగిసిన తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు; ఇమామ్ నియామకం జరిగేది ప్రజలు అతన్ని అనుసరించటానికే. అతను రుకూ చేసినప్పుడు మీరు కూడా రుకూ చెయ్యండి. అతను శిరస్సును ఎత్తినప్పుడు మీరు కూడా శిరస్సును ఎత్తండి."

**215.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గుర్రం మీద నుంచి పడిపోయారు. అప్పుడు ఆయన(స) గారి కుడివైపు శరీర భాగం గీచుకుపోయింది. అప్పుడు మేము ఆయన్ని(స) పరామర్శించటానికి వెళ్ళాము. ఇంతలోనే నమాజు చేసే సమయం వచ్చేసింది. ఆయన(స) కూర్చొని నమాజు చేయించారు. మేము కూడా ఆయన(స) గారి వెనుక కూర్చొని నమాజు చేశాము. అప్పుడు ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; 'ఒక మనిషి ఇమామ్‌గా ఎందుకు చెయ్యబడతాడంటే; ప్రజలు అతన్ని అనుసరించాలని. అతను తక్బీర్ పలికినప్పుడు మీరు కూడా తక్బీర్ పలకండి. ఇంకా అతను రుకూ చేసినప్పుడు మీరు కూడా రుకూ చెయ్యండి. అతను తన శిరస్సును ఎత్తినప్పుడు మీరు కూడా మీ శిరస్సును ఎత్తండి. అతను 'సమిఅల్లాహులిమన్ హమిద' అని పలికినప్పుడు మీరు 'అల్లాహుమ్మ రబ్బనా వలకుల్ హమ్‌ద్' అని పలకండి.'

**216.** ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజిఅన్) ఉల్లేఖించారు; 'ఆయన గారు పైల్స్ (మూలవ్యాధి) వ్యాధితో బాధపడుతూ ఉండేవారు. ఆయన(ర) ఇలా అన్నారు; ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారిని కూర్చొని నమాజు చేసే వ్యక్తిని గురించి అడిగాను. ఆయన(స) ఇలా సెలవిచ్చారు; అతనుగనక నిలబడి నమాజు చేస్తే, అది ఎంతో ఉత్తమమైనది; కూర్చొని నమాజు చేసే వ్యక్తికి నిలబడి నమాజు చేసే వ్యక్తికి లభించే బహుమానంలోని సగం బహుమానం లభిస్తుంది. ఇంకా పండుకొని నమాజు చేసే వ్యక్తికి కూర్చొని నమాజు చేసే వ్యక్తికి లభించే బహుమానంలోని అర్థ బహుమానం మాత్రమే లభిస్తుంది.'

## 18వ అధ్యాయం

### సైగ ద్వారా కూర్చొని నమాజు చెయ్యటం.

**217.** అబ్దుల్లాహ్ బిన్ బురైదా ఇలా ఉల్లేఖించారు; 'ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజిఅన్) పైల్స్ వ్యాధితో బాధపడుతూ ఉండేవారు. ఇమ్రాన్ బిన్ హుసేన్ (రజి) ఇలా అన్నారని అబూ మఅమర్ ఉల్లేఖించారు; నేనుదైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని, కూర్చొని నమాజు చేసే వ్యక్తి నమాజును గురించి అడిగాను. దానికి సమాధానంగా ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; 'మనిషి నిలబడి నమాజు చెయ్యటం చాలా మంచిది. ఎంతో ఉత్తమమైనది. కూర్చొని నమాజ్ చేసే వ్యక్తి నిలబడి నమాజు చేసే వ్యక్తి పొందే బహుమానంలోని సగం బహుమానాన్ని మాత్రమే

పొందుతాడు. పండుకుని నమాజ్ చేసే మనిషి కూర్చొని నమాజు చేసే మనిషిపొందే పుణ్యంలోని సగం పుణ్యాన్ని మాత్రమే పొందుతాడు.'

## 19వ అధ్యాయం

**ఎవరికైనా కూర్చొని నమాజు చేసే శక్తి లేకపోతే అప్పుడు అతను పక్కకు తిరిగి పండుకుని నమాజు చెయ్యవచ్చు. అతా బిన్ అబీరిబాహ్ ఇలా అన్నారు; మనిషి గనక ఖిబ్లా వైపునకు ముఖాన్ని తిప్పలేకపోతే ఏ దిక్కు వైపునకు తిప్పగలిగితే ఆ దిక్కువైపునకే ముఖాన్ని తిప్పి నమాజు చెయ్యవచ్చు.**

**218.** ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'నేను పైల్స్ అనే వ్యాధితో బాధపడుతూ ఉండేవాణ్ని. కనుక నేను నమాజును చెయ్యటం గురించి దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను అడిగాను. సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "నిలబడి నమాజు చెయ్యి, నీవు గనక అలా చెయ్యలేకపోతే కూర్చొని నమాజు చెయ్యి; కూర్చొని కూడా నీవు నమాజు చెయ్యలేకపోతే అప్పుడు పక్కకు తిరిగి పండుకుని నమాజు చెయ్యి."

## 20వ అధ్యాయం

**ఒకవేళ ఒక వ్యక్తి ఎవరైనా కూర్చొని నమాజు చెయ్యటం ప్రారంభిస్తే ఆ తరువాత ఆరోగ్యం మెరుగైతే లేక వ్యాధి కొంచెం తగ్గినట్లు అతను భావిస్తే ఇంకా లేచి నిలబడగలిగితే అప్పుడు ఎంత నమాజైతే మిగిలిపోయిందో అంత నమాజును అతను నిలబడి చేసుకోవచ్చు. ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా అన్నారు; 'వ్యాధిగ్రస్తుడైన వ్యక్తి ఎవరైనా ఇష్టపడితే ఫర్జ్ నమాజులోని రెండు రకాతులను కూర్చొని చెయ్యవచ్చు. మిగతా రెండు రకాతులను నిలబడి చెయ్యవచ్చు.'**

**219.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని రాత్రి (తహజ్జుద్) నమాజును కూర్చొని చేస్తూ ఉండగా నేను ఎన్నడూ చూడలేదు; అయితే ఆయన (స) గారు వార్ధక్యంలోకి ప్రవేశించిన తరువాత కూర్చొని తహజ్జుద్ నమాజులో ఖుర్ఆన్ పారాయణం చేసేవారు. రుకూ చెయ్యదలిచినప్పుడు నిలబడి ముప్పై, నలభై ఖుర్ఆన్ ఆయతులు పఠించి తరువాత రుకూ చేసేవారు.'

**220.** విశ్వాసుల మాత హజ్రత్ ఆయెషా సిద్దీఖా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) కూర్చొని తహజ్జుద్ నమాజు చేసేవారు, కూర్చొని ఖుర్ఆన్ ఆయత్‌లను పఠించేవారు. ముప్పై లేక నలభై ఖుర్ఆన్ ఆయత్‌లను పఠించటం మిగిలి ఉన్నప్పుడు లేచి నిలబడేవారు. లేచి నిలబడి మిగిలిపోయిన ఆయతులను పఠించేవారు. తరువాత రుకూ చేసేవారు. ఆ తరువాత రెండో రకాతులో కూడా పై మాదిరిగానే చేసేవారు. నమాజు చెయ్యటం ముగిసిన తరువాత నావైపు చూసేవారు. నేను మేల్కొని ఉంటే నాతో మాట్లాడేవారు. ఒకవేళ నేను నిద్రపోతూ ఉంటే అప్పుడు ఆయన(స) గారు కూడా పడుకునేవారు."

# తహజ్జుద్ ప్రకరణం

## 1వ అధ్యాయం

**రాత్రి సమయంలో తహజ్జుద్ నమాజును చెయ్యటం. ఖుర్ఆన్ గ్రంథంలోని 'బనీ ఇస్రాయీల్' సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; 'రాత్రిలోని ఒక భాగంలో తహజ్జుద్ నమాజు చెయ్యి. ఇది నీ కొరకు అదనం' (నఫిల్)**

**221.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో తహజ్జుద్ నమాజు చెయ్యటానికి లేచినప్పుడు ఈ దుఆ చేస్తారు; 'అల్లాహుమ్మ లకల్ హమ్‌దు అన్‌త ఖయ్యిముస్స మావాతి వల్ అర్‌జి వమన్ ఫీహిన్న వలకల్ హమ్‌దు లక ముల్‌కుస్సమావాతి వల్ అర్‌జి వమన్ ఫీహిన్న వలకల్ హమ్‌దు అన్‌త నూరుస్సమావాతి వల్ అర్‌జి, వలకల్ హమ్‌దు అనత మలికుస్సమావాతి వల్ అర్‌జి, వలకల్ హమ్‌దు అన్‌తల్ హఖ్ఖు వవఅదుకల్ హఖ్‌ఖు వలిఖావుక హఖ్‌ఖున్, వ ఖవ్‌లుక హఖ్ ఖున్, వల్ జన్నతు హఖ్‌ఖున్, వన్నారు హఖ్‌ఖున్, వన్నబియ్యూన హఖ్‌ఖున్,వ ముహమ్మదున్ సల్లెల్లాహు అలైహివ సల్లమ హఖ్‌ఖున్ వస్సాఅతు హఖ్‌ఖున్. అల్లాహుమ్మ లక అస్‌లమ్‌తు వబిక ఆమన్‌తు, వ అలయ్‌క తవక్కల్‌తు, వ ఇలైక అనబ్‌తు వ బిక ఖాసమ్‌తు వ ఇలైక హాకమ్‌తు ఫగ్‌ఫిర్‌లీ మా ఖద్దమ్‌తు వమా అఖ్ఖిర్‌తు వమా అస్‌రర్‌తు వమా అఅలన్‌తు అన్‌తల్ ముఖద్దిము వ అన్‌తల్ ముఅఖ్‌ఖరు లా ఇలాహ ఇల్లా అన్‌త' "ఓ నా అల్లాహ్! స్తోత్రాలన్నీ నీకే శోభిస్తాయి. ఆకాశాలనూ, భూమినీ, వాటిలో ఉన్నవాటికి ఆధారం, సంరక్షకుడవూ నీవే. ప్రశంసలన్నీ నీకే తగినవి. ఆకాశాలలోనూ, భూమిలోనూ, వాటిలో ఉన్నటువంటి వస్తువులపైనా రాజ్యాధికారం నీదే. స్తోత్రం నీకు మాత్రమే తగినది. నీవే ఆకాశాలకు వెలుగు, భూమికి కాంతి. నీకు మాత్రమే స్తోత్రం తగినది. ఆకాశాలకూ, భూమికీ వాటిలో ఉన్న వాటికీ మహారాజువు నీవే. నీకు మాత్రమే స్తోత్రం చెందుతుంది. నీవు సత్యవంతుడవు. నీ వాగ్దానం సత్యమైనది. మరణానంతరం నిన్ను కలవటం అనేది సత్యం. నీవు చెప్పే మాటలు సత్యమైనవి. స్వర్గం సత్యమైనది. నరకం ఉన్నది సత్యం. నీ ప్రవక్తలు సత్యసంధులు. ముహమ్మద్(స)

సత్యవంతులు. ప్రళయం రావటం అనేది సత్యం. ఓ నా అల్లాహ్! నేను నీకు విధేయు డను. నీకు లోబడి ఉన్నాను. నేను నిన్ను విశ్వసించాను, నిన్నే నమ్ముకున్నాను. ప్రతి కష్ట సమయంలోనూ నేను నీవైపునకే తిరుగుతాను. నీ కోసమే అవిశ్వాసులతోనూ, ఇస్లామ్ శతృవులతోను పోరాడతాను. నేను నీ తీర్పునే కోరుతాను. నేను ఇదివరకు, ఇప్పుడు చేసిన పాపాలను బహిరంగంగాను, రహస్యంగాను చేసిన పాపాలను క్షమించు. నీవు ఎవరిని కోరితే వారిని ముందుకు పంపుతావు. మరియు నీవు ఎవరిని కోరితే వారిని వెనక్కు నెట్టివేస్తావు. నీవు తప్ప మరొక నిజ దైవం లేనేలేదు. సుఫ్యాన్ బిన్ ఉమైనా ఇలా అన్నారు; 'అబ్దుల్ కరీమ్ అబూ ఉమయ్య పై దానికి అదనంగా ఈ విషయాన్ని చేర్చారు. 'పాపాల నుండి కాపాడేవాడు, సత్కార్యాలు చేసే భాగ్యాన్ని కలిగించేవాడు అల్లాహ్ తప్ప మరొకదెవ్వడూ లేదు.'

## 2వ అధ్యాయం

### రాత్రిపూట తహజ్జుద్ నమాజు చేసే దాని యొక్క ఘనత

**222.** సాలిమ్ తండ్రి గారైన అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) గారు ఉల్లేఖిం చారు; ఆయన ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి జీవిత కాలంలో ఒక వ్యక్తి ఎవరైనా ఏదైనా కలను చూస్తే దానిని గురించి అతను దైవ ప్రవక్త (స) గారికి విన్పించేవాడు (ఆయన(స) గారు దాని గూఢార్థాన్ని గురించి వివరించే వారు). ఒక స్వప్నాన్ని దేన్నయినా చూడాలనే అభిలాష, దానిని గురించి దైవ ప్రవక్త(స) గారికి చెప్పాలనే ఆకాంక్ష నాకు కూడా కలిగింది. నేను అప్పుడు ఇంకా వివాహం కానటువంటి యువకుడను. దైవప్రవక్త(స) గారి జీవిత కాలంలో నేను మసీదులోనే పండుకునేవాణ్ణి. నేను ఒక కలను చూశాను. అందులో ఇద్దరు దైవ దూతలు వచ్చి నన్ను పట్టుకుని నరకం వైపునకు తీసుకుపోయారు. నేను ఏమి చూశా నంటే, అది (నరకం) ఒకపెద్ద బావి మాదిరిగా కట్టబడి ఉంది. దాని మీద రెండు స్తంభాలు నిర్మించబడి ఉన్నాయి. ఇంకా నేను ఏమి చూశానంటే, అందులో నాకు తెలిసినవారు కూడా కొందరు ఉన్నారు. నేను నరకం నుంచి నన్ను కాపాడమని అల్లాహ్‌ను శరణు వేడుకున్నాను. తరువాత మరొక దైవదూత మమ్మల్ని కలిశాడు. అతను భయపడవద్దని మాకు ధైర్యం చెప్పాడు. తరువాత నేను ఈ కలను గురించి నా సోదరి, విశ్వాసుల తల్లి అయినటువంటి హఫ్సా (రజిఅన్)కు వివరించాను. ఆమె గారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ముందు ఈ స్వప్నం గురించి ప్రస్తావించారు.' ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; అబ్దుల్లాహ్ ఒక మంచి వ్యక్తి.

అతను రాత్రి సమయంలో తహజ్జుద్ నమాజు చేస్తే ఎంత బాగుండును!' (ఉల్లేఖకుడు ఇలా అన్నారు; దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చిన తరువాత) అబ్దుల్లాహ్ రాత్రి సమయంలో నిద్రపోయేవారు కాదు. ఆరాధనలో నిమగ్నమైపోయేవారు. అయితే కొంచెం సేపు మాత్రమే నిద్రపోయేవారు.'

## 3వ అధ్యాయం

### రాత్రి నమాజులో సుదీర్ఘమైన సజ్దాలు చెయ్యటం.

**223.** హజ్రత్ ఆయెషా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో తహజ్జుద్ నమాజు పదకొండు రకాతులు చేసేవారు. ఇదే ఆయన(స) గారి నమాజు. ఈ రకాతుల్లో దైవప్రవక్త(స) గారు ఎంత సేపు సజ్దాలో ఉండేవారంటే, మీలో ఎవరైనా యాభై ఖుర్ఆన్ వాక్యాలను ఆయన(స) గారు తన శిరస్సును ఎత్తే ముందు పఠించగలుగుతారు. ఉదయం కాగానే ఫజ్ర్ నమాజుకు ముందు రెండురకాతులు సున్నత్ నమాజు చేసేవారు. ఆ తరువాత కుడిపక్కకు తిరిగి పరుండేవారు. చివరకు ముఅజ్జిన్ నమాజ్ కోసం ఆయన్ని పిలవటానికి వచ్చేవారు.[1]

## 4వ అధ్యాయం

### వ్యాధిలో ఉన్నప్పుడు తహజ్జుద్ నమాజును వదిలిపెట్టవచ్చు.

**224.** జున్‌దుబ్ బిన్ అబ్దుల్లాహ్ బజ్‌లి (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) అస్వస్థులయ్యారు. ఈ కారణంగా ఆయన (స) ఒకటి లేక రెండురాత్రులు తహజ్జుద్ నమాజు కోసం మేల్కోలేకపోయారు.

**225.** జున్‌దుబ్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా సెలవిచ్చారు; 'హజ్రత్ జిబ్రీల్ (అ) కొన్ని రోజుల వరకు దైవప్రవక్త ముహమ్మద్(స) గారి వద్దకు రాకుండా ఆగిపోయారు. అప్పుడు ఖురైష్ తెగకు చెందిన అవిశ్వాసురాలైన

---

223-1. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సజ్దాలో ఉన్నప్పుడు మాటిమాటికి ఇలా పఠించేవారు. 'సుబ్‌హానకల్లాహుమ్మ వబిహమ్‌దిక అల్లాహుమ్మగ్ ఫిర్‌లి' మరొక ఉల్లేఖనంలో ఇలా పఠించేవారు అని ఉంది; 'సుబ్‌హానక లా ఇలాహ ఇల్లాఅన్‌త'. పూర్వకాలంలో సజ్జనులు, దైవభక్తులూ అయిన వారు కూడా దైవప్రవక్త(స) గారి అనుసరణలో పొడుగాటి సజ్దాలు చేసేవారు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజిఅన్) ఎంతసేపు సజ్దాలో ఉండేవారంటే పిచ్చుకలు ఆయన(స) గారి వీపును గోడగా భావించి కూర్చుండిపోయేవి.

ఒక స్త్రీ (అబూలహబ్ భార్య అయిన ఉమ్మె జమీల్) ఇలా అన్నది; ఇప్పుడు అతని షైతాన్ అతని వద్దకు రావటంలో ఆలస్యం చేసినట్టున్నాడు. అప్పుడు ఈ ఖురాను వాక్యాలు అవతరించాయి. "వజ్జుహా వల్లయ్‌లి ఇజా సజా. మావద్దఅక రబ్బుక వమా ఖలా."

## 5వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు రాత్రి నమాజులు మరియు నఫిల్ నమాజులు చెయ్యమని ప్రోత్సహించటం. కాని వాటిని వాజిబ్‌గా (తప్పనిసరిగా) చెయ్యకపోవటం. ఒకసారి ఒక రాత్రి దైవప్రవక్త(స) హజ్రత్ ఫాతిమా(ర) మరియు హజ్రత్ అలీ(ర) గార్ల ఇంటికివెళ్ళటం, వారిని నమాజు కోసం మేల్కొల్పటం.**

**226.** విశ్వాసుల తల్లి అయినటువంటి ఉమ్మె సలమా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక రాత్రి నిద్ర నుంచి మేల్కొన్నారు. మరియు ఇలా సెలవిచ్చారు; సుబ్‌హానల్లాహ్! ఈ రోజు రాత్రి ఎలాంటి ఆపదలు భూమిపై అవతరించాయి! మరియు ఎన్ని కారుణ్య నిధులు భూమిపై అవతరించాయి! ఈ గృహాలలో నిదురించే మహిళల్ని ఎవరు లేపుతారు? ప్రజలారా! చాలామంది మహిళలు ఈ ప్రపంచంలోనైతే (శరీరం నిండా) బట్టలు ధరించి ఉన్నారు. కాని పరలోకంలో మాత్రం దిగంబరులైపోతారు."

**227.** అలీ ముర్తుజా బిన్ అబీతాలిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఒకసారి ఒక రాత్రి సమయంలో హజ్రత్ అలీ(ర), హజ్రత్ ఫాతిమా(ర)ల వద్దకు వెళ్ళారు. మరియు వారితో ఇలా సెలవిచ్చారు; "ఏమిటి! మీరు ఉభయులూ తహజ్జుద్ నమాజును చెయ్యరా?" అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను; ఓ దైవప్రవక్తా(స)! మా ప్రాణాలైతే అల్లాహ్ చేతుల్లో ఉన్నాయి కదా! ఆయన మమ్మల్ని లేపదలచినప్పుడు తప్పకుండా లేపుతాడు. నేను ఈ మాటలు అన్నప్పుడు, ఆయన(స) వెనక్కి మరలి వెళ్ళిపోయారు. మాకు ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు. తరువాత నేను ఇలా విన్నాను; ఆయన(స) వెనక్కి తిరిగి వెళ్ళిపోతూ తన తొడమీద చేత్తో కొట్టుకుంటూ పోయారు. మరియు ఖురాన్‌లోని కహఫ్ సూరాలోని ఈ వాక్యాన్ని పఠించుకుంటూపోయారు. "వ కానల్ ఇన్‌సాను అక్‌సర షయ్‌యిన్ జదలా" (కాని మానవుడు పరమ జగడాలమారి)'

**228.** విశ్వాసుల తల్లి హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఉల్లేఖించారు; ఆమె(ర)

గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఒక పనిని చేస్తూ చేస్తూ మధ్యలో విడిచిపెట్టేవారు. వాస్తవానికి ఆయన (స) గారికి ఆ పని చెయ్యటం చాలా ఇష్టంగా ఉండేది. ప్రజలు ఆ పనిని నియమం తప్పకుండా చేస్తూపోతే తరువాత అది వారిపై విధిగా పరిణమిస్తుందేమోనని ఆయన(స) భయ పడేవారు. దైవప్రవక్త(స) చాష్త్ నఫిల్ నమాజును ఎన్నడూ చెయ్యలేదు. నేనైతే దాన్ని చేస్తూనే ఉన్నాను.

**229.** విశ్వాసుల తల్లి హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; 'ఒకసారి ఒక రాత్రి దైవప్రవక్త(స) మసీదులో తరావీహ్, తహజ్జుద్ నమాజులు రెండూ చేశారు. ప్రజలు కూడా ఆయన(స) గారితో ఈ నమాజులను చేశారు. రెండో రోజు రాత్రి కూడా దైవప్రవక్త(స) ఈ నమాజులను చేశారు. ముఖ్తదీల సంఖ్య పెరిగి పోయింది. తరువాత మూడో రోజు నాలుగో రోజు రాత్రులలో కూడా ప్రజలు మసీదుకు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. కాని దైవప్రవక్త(స)గారి దర్శనం మాత్రం కాలేదు. మరుసటి రోజు ఉదయం ఆయన(స) ప్రజల్నిఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; నేను మీరు చేసే పనిని గమనించాను. మీ వద్దకు రాకుండా నన్ను ఏ వస్తువూ ఆపలేదు. కాని ఈ నమాజులు మీపై విధిగా చెయ్యబడతాయేమోనని భయపడ్డాను." ఈ సంఘటన రమజాను మాసంలో జరిగింది.

## 6వ అధ్యాయం

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో నమాజులో ఎంత ఎక్కువగా నిలబడి ఉండేవారంటే, ఆయన(స) గారి పవిత్రమైన పాదాలు వాసేవి.

**230.** ముగీరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఎంతసేపు నిలబడి ఉండేవారంటే, లేదా ఎంత సుదీర్ఘమైన నమాజు చేసేవారంటే, ఆయన(స) గారి పవిత్రమైన పాదాలు లేక పిక్కలు వాసిపోయేవి. ఆయన(స) గారిని ఈ విషయం గురించి అడిగినప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చే వారు; 'ఏమిటి నేనుఅల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపే దాసుడను కావద్దా?"

## 7వ అధ్యాయం

**సహర్ వేళ అంటే ఫజర్ సమయంలో నిద్రపోవటం.**

**231.** అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజి) దైవప్రవక్త మహాశయులు ముహ

మ్మద్(స) తనతో ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు; “అన్ని నమాజుల కంటే దైవప్రవక్త హజ్రత్ దావూద్(అ) చేసే నమాజు అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైనది. అన్ని ఉపాసాల కంటే అల్లాహ్‌కు దైవప్రవక్త హజ్రత్ దావూద్(అ) పాటించే ఉపవాసం ఎంతో ఇష్టమైనది. దైవప్రవక్త హజ్రత్ దావూద్(అ) సగం రాత్రి వరకు నిద్రపోయే వారు. తరువాత రాత్రి మూడో భాగం వరకు ఆరాధనలో నిమగ్నమైపోయేవారు. ఆ తరువాత రాత్రి ఆరో భాగంలో నిద్ర పోయేవారు. ఒకరోజు ఉపవాసం ఉండేవారు. మరొక రోజు ఉండేవారు కాదు”.

**232.** మస్‌రూఖ్ ఉల్లేఖించారు; ఆయన ఇలాఅన్నారు; 'నేను హజ్రత్ ఆయెషా (రజిఅన్హా)ను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు ఏ సత్కార్యం అంటే ఎక్కువగా ఇష్టపడేవారు?' అని అడిగాను. ఆమె (ర) ఇలా అన్నారు; 'ఏ సత్కార్య మయితే ఎడతెగకుండా నిరంతరం చెయ్యబడుతుందో ఆ సత్కార్యాన్ని ఆయన(స) ఎక్కువగా ప్రేమించేవారు.' నేను ఇంకా ఇలా అడిగాను; 'రాత్రి సమయంలో ఆయన (స) గారు ఎప్పుడు లేస్తూ ఉండేవారు?' ఆమె(ర) గారు ఇలా అన్నారు; 'కోడిపుంజు కూత విన్నప్పుడు ఆయన(స) లేచేవారు.'

**233.** అష్అత్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కోడి కూసినప్పుడు దాని కూతను విని లేచి నిలబడి నమాజు చేసే వారు.'

**234.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె (ర) గారు ఇలా అన్నారు; 'నా దగ్గరైతే సహరీ సమయంలో (రాత్రి చివరి ఘడియల్లో) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నిదురపోతూనే ఉండేవారు.'

## 8వ అధ్యాయం

## సహరీ తిన్న తరువాత ఫజ్ర్ నమాజు చేసే అంతవరకు నిదురపోకపోవటం.

**235.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా అన్నారని ఖతాద ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు, జైద్ బిన్ సాబిత్(రజిఅన్) గారు ఉభయులూ కలిసి సహరీ భోజనం తిన్నారు. సహరీ భోజనం ముగించిన తరువాత దైవప్రవక్త(స) ఫజ్ర్ నమాజు కోసం నిలబడ్డారు. తరువాత వారిద్దరూ నమాజు చేశారు. ఖతాద ఇలా అన్నారు; మేము అనస్(ర)ను, సహరీ భోజనం, ఫజ్ర్ నమాజు

లకూ మధ్య ఎంత వ్యవధి ఉంటుంది?' అని అడిగాము. ఆయన(ర) ఇలా అన్నారు; 'మీలో నుంచి ఎవరైనా యాభై ఖురాన్ వాక్యాలు చదివితే ఎంతసేపు పడుతుందో అంత వ్యవధి ఉంటుంది.'

## 9వ అధ్యాయం

### రాత్రినమాజులో ఖియామ్‌ను సుదీర్ఘమైనదిగా చెయ్యటం (అంటే ఖుర్ఆన్ పారాయణాన్ని ఎక్కువగా చెయ్యటం)

**236.** అబూ వాయల్ షఖీఖ్ బిన్ సల్మా ఇలా ఉల్లేఖించారు; 'అబ్దుల్లా ఇబ్నె మసూద్ (రజిఅన్) ఇలా అన్నారని, నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి ఒక రాత్రి నమాజు చేశాను. ఆయన(స) గారు ఎంతసేపు నమాజులో నిలబడి ఉన్నారంటే, నా సంకల్పం చెడిపోసాగింది.' అబూ వాయల్ ఇలా అన్నారు; మేము అడిగాము; మీ మదిలోకి ఏ చెడు విషయాలు వచ్చాయి? అని. ఆయన ఇలా అన్నారు; నా మదిలోకి ఏ చెడ్డ విషయాలు వచ్చాయంటే, 'కూర్చోవాలనీ' లేదా దైవ ప్రవక్త(స) గారిని 'విడిచిపెట్టి పోవాలని.'

**237.** హుజైఫా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో తహజ్జుద్ నమాజు కోసం లేచినప్పుడు తన నోటిని అంటే దంతాలను మిస్వాక్‌తో తోముకునేవారు.'

## 10వ అధ్యాయం

### దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నమాజును ఎలా చేసేవారు? రాత్రిపూట దైవప్రవక్త(స) ఎన్ని రకాతుల నమాజు చేసేవారు?

**238.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు. 'ఒక వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు; ఓ దైవప్రవక్తా (స)! రాత్రిపూట నమాజును ఎలా చేయాలి?' ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "రెండేసి రకాతుల చొప్పున చేయాలి. ఫజ్ర్ వేళ అవుతోందనే అనుమానం కలిగినప్పుడు ఒక రకాత్ వితర్ నమాజు చేసి మిగతా అన్ని రకాతులను బేసి రకాతులుగా చేసుకోవాలి.'

**239.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు రాత్రిపూట చేసే నమాజులు పద మూడు రకాతులు.'

**240.** మస్రూఖ్ బిన్ అజ్‌ద ఇలా ఉల్లేఖించారు; 'నేను హజ్రత్ ఆయెషా(ర) గారిని, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి రాత్రి నమాజులను గురించి అడిగాను. ఆమె(ర) గారు ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స) ఒకప్పుడు ఏడు రకాతులు చేసేవారు. మరొకప్పుడు తొమ్మిది రకాతులు చేసేవారు. ఇంకొకప్పుడు పదకొండు రకాతులు చేసేవారు. ఫజ్ర్ పూట చేసే సున్నత్ నమాజులు తప్ప.'

**241.** హజ్రత్ ఆయెషా(ర.అ) ఉల్లేఖించారు; ఆమె(ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) రాత్రిపూట పదమూడు రకాతులు చేసే వారు. వాటిలోనే వితర్, ఫజ్ర్ పూట చేసే సున్నత్ నమాజులు కూడా కలిసి ఉండేవి.'

## 11వ అధ్యాయం

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి నమాజు కోసం నిద్ర నుంచి మేల్కొనటం, రాత్రి నమాజులోనుంచి ఎంత భాగం తగ్గించబడింది. దీని గురించి దేవుని సూక్తి; 'ఓ దుప్పటి కప్పుకుని పడుకునేవాడా! రాత్రి వేళ నమాజులో నిలబడుతూ ఉండు. కాని కొంచెం సేపు మాత్రమే. రాత్రిలో సగభాగం లేదా దానిని కొంచెం తగ్గించుకో లేదా దానిని కొంచెం పొడిగించుకో. ఖుర్ఆన్‌ను నెమ్మదిగా ఆగి ఆగి పఠించు. మేము నీపై ఒక గంభీరమైన వాణిని అవతరింపజేయ బోతున్నాము. వాస్తవానికి రాత్రివేళ లేవటం మనసును అదుపులో ఉంచేందుకు ఎంతో ఉపయుక్తమైనది. ఖుర్ఆన్‌ను శ్రద్ధగా పఠించేందుకు ఎంతో అనువైనది. ఎందుకంటే, పగటివేళ నీకు చాలా పనులుంటాయి'. ఇంకా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; 'కనుక ఆయన నీపై దయ చూపాడు. ఇప్పుడు నీవు ఖుర్ఆన్‌ను సులభంగా పఠించగలిగినంత మేరకే పఠించు. ఆయనకు తెలుసు. మీలో కొందరు వ్యాధిగ్రస్తులు ఉండవచ్చు. మరికొందరు అల్లాహ్ అను గ్రహాన్ని అన్వేషిస్తూ ప్రయాణాలలో ఉండవచ్చు. ఇంకా కొందరు అల్లాహ్ మార్గంలో యుద్ధంచేస్తూ ఉండవచ్చు. కనుక మీరు ఖుర్ఆన్‌ను సులభంగా పఠించగలిగినంత పఠించండి. నమాజ్‌ను స్థాపించండి, జకాత్ ఇవ్వండి, అల్లాహ్‌కు మంచి అప్పును ఇస్తూ ఉండండి. మీరు ఏ సత్కార్యాన్ని మీ కోసం ముందుగా పంపించుకుంటారో, దానిని మీరు అల్లాహ్ వద్ద చూసుకుంటారు. అదే చాలా శ్రేష్ఠమైనది, ప్రతిఫలం చాలా పెద్దది. (దివ్యఖుర్ఆన్ 73: 1–7, 20)'

**242.** హ|జత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక మాసంలో చాలా రోజుల వరకు అసలు ఉప వాసమే ఉండేవారు కాదు. ఇక ఆ మాసంలో ఆయన(స) ఉపవాసమే ఉండరని మేము అనుకునేవారము. మరొక మాసంలో ఆయనే (స) ఎంత ఎక్కువగా ఉపవాసాలు పాటించేవారంటే, ఇక ఆ మాసంలో ఆయన(స) ఉపవాసాన్ని వదిలి పెట్టరేమో అని భావించేవారము. రాత్రిపూట ఆయన(స) నమాజు ఎంత ఎక్కువగా చేసేవారంటే, మీరు ఎప్పుడుబడితే అప్పుడు ఆయన్ని (స) నమాజులో చూస్తారు. మరియు మీరు ఎప్పుడుబడితే అప్పుడుఆయన్ని(స) నిద్రలో చూస్తారు.'

## 12వ అధ్యాయం

**మనిషి గనక రాత్రి నమాజు చెయ్యకపోతే షైతాన్ మూపు మీద (మెడ వెనుక భాగం) ముడులు వెయ్యటం.**

**243.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; 'మనిషి గనక (రాత్రిపూట) నిద్రపోతే, షైతాన్ అతని మూపు (మెడ వెనుక భాగం)పై మూడు ముడులు వేస్తాడు (చేతబడికి సంబంధించిన ముడులు). మరియు ప్రతి ముడిపై ఇంకా రాత్రి చాలా ఉంది. నిర్భయంగా నిశ్చింతగా నిదురపో అని మంత్రాలు చదివి ఊదుతారు. తరువాత ఒకవేళ మనిషి మేల్కొని అల్లాహ్‌ను జ్ఞాపకం చేసుకుంటే, అప్పుడు ఒక ముడి తెగిపోతుంది. తరువాత ఒకవేళ అతను వుజూ చేసుకుంటే, అప్పుడు రెండో ముడి తెగిపోతుంది. ఆ తరువాత ఒకవేళ అతను నమాజు, చేస్తే (ఫర్జ్ లేక నఫిల్) అప్పుడు మూడో ముడి తెగిపోతుంది. మరియు అతను ఉదయం పూట సహృదయంతో, ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటాడు. లేకపోతే అతను ఉదయం పూట బద్ధకంగా, అనారోగ్యంగా ఉంటాడు.'

**244.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తాను చూసిన ఒక స్వప్నం గురించి వివరిస్తూ ఇలా సెలవిచ్చారని సమురబిన్ జున్‌దబ్ (రజిఅన్) ఉల్లేఖించారు; 'ఎవరి శిరస్సు అయితే బండరాయితో మోదబడుతుందో అతడు (ప్రపంచంలో) ఖురాన్ గ్రంథాన్ని నేర్చుకున్నాడు. ఆ తరువాత దానిని వదిలేశాడు. దాని ప్రకారం నడుచుకోలేదు. మరియు ఫజ్ర్ నమాజులు చేయకుండా నిదురపోయేవాడు.

**245.** హ|జత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ముందు ఒక వ్యక్తికి సంబంధించిన ప్రస్తావన

వచ్చింది. ప్రజలు అతన్ని గురించి ఏమన్నారంటే, 'అతను ఉదయం అయ్యేవరకు నిద్రపోతూనే ఉన్నాడు. ఫర్జ్ నమాజు కోసం కూడా లేవలేదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; షైతాన్ అతని చెవుల్లో మూత్రం పోశాడు.'

## 13వ అధ్యాయం

**రాత్రి చివరి సమయంలో దుఆ చెయ్యటం గురించి, నమాజు చెయ్యటం గురించి. అల్లాహ్ అజ్జారియాత్ సూరాలో ఇలా సెలవిచ్చాడు; వారు రాత్రిపూట చాలా తక్కువగా నిద్రించేవారు (51: 17)**

**246.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; 'మహోన్నతుడూ, శుభాల వాడు అయిన మా ప్రభువు ప్రతిరోజూ రాత్రి ఎప్పుడయితే రాత్రి చివరి భాగం మూడో భాగం మిగిలి వుంటుందో అప్పుడు మొదటి ఆకాశంపైకి దిగి వస్తాడు. మరియు ఇలా సెలవిస్తాడు; "నన్ను వేడుకునేవాడెవడైనా ఉన్నాడా? నేను అతని వేడుకోలును స్వీకరిస్తాను. నన్ను అడిగే వాడెవడయినా ఉన్నాడా? నేను అతను అడిగినదాన్ని ఇస్తాను. నన్ను క్షమాభిక్ష పెట్టమని కోరుకునేవాడెవడైనా ఉన్నాడా? నేను అతనికి క్షమాభిక్ష పెడతాను".

## 14వ అధ్యాయం

**రాత్రి ప్రారంభంలో నిద్రపోవటం. మరియు రాత్రి చివరి దశలో మేల్కొని ఉండటం, సల్మాన్ ఫార్సీ (రజిఅన్), అబూ దర్దా(రజిఅన్)తో ఇలా అన్నారు; రాత్రి ప్రారంభ దశలో పండుకొని నిద్రపో, రాత్రి చివరి దశలో మేలుకో, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈ విషయాన్ని విని ఇలా సెలవిచ్చారు; 'సల్మాన్(ర) నిజమే పలికారు.'**

**247.** అస్వద్ బిన్ యజీద్ ఇలా సెలవిచ్చారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో ఎలా నమాజు చేసేవారు?' అని నేను హజ్రత్ ఆయెషా(రజిఅన్హా)ను అడిగాను. ఆమె(ర)గారు ఇలా సమాధానం చెప్పారు; దైవ ప్రవక్త(స) రాత్రి ప్రారంభ దశలో నిదురపోతూ ఉండేవారు. రాత్రి చివరి సమయంలో నిద్ర నుంచి మేల్కొనేవారు. తహజ్జుద్ నమాజ్ చేసేవారు, తరువాత తన పడక మీదకు వచ్చేవారు. ముఅజ్జిన్ అజాన్ ఇచ్చినప్పుడు లేచి నిలబడేవారు. ఒకవేళ ఆయన(స)

గారికి తలంటి స్నానం చేసే అవసరం ఉంటే అప్పుడు గుసుల్ చేసుకునేవారు. లేకపోతే వుజూ చేసుకుని బయటికి వెళ్ళిపోయేవారు.

## 15వ అధ్యాయం

రమజాన్ మాసంలోనూ, రమజానేతర మాసాలలోనూ దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో నమాజులు చెయ్యటం గురించి.

**248.** అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ ఉల్లేఖనం: ఈయన ఒకసారి హజ్రత్ ఆయెషా(ర)ను ఇలా అడిగారు. 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రమజాన్ మాసంలో రాత్రి సమయంలో ఎన్ని రకాతులు నమాజు చేసేవారు అని. ఆమె(ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త(స) రమజానుమాసంలోనూ, రమజానేతర మాసంలోనూ పదకొండు రకాతులకు మించి నమాజు చేసేవారు కారు. మొదట నాలుగు రకాతులు చేసేవారు. వాటి సౌందర్యం గురించి, వాటి సుదీర్ఘతను గురించి అడగ కండి. తరువాత మరొక నాలుగు రకాతులు నమాజు చేసేవారు. వాటి శోభను గురించి, వాటి పొడుగును గురించి అడగకండి. ఆ తరువాత మూడు రకాతులు చేసేవారు". హజ్రత్ ఆయెషా సిద్దీఖా(ర) ఇలా అంటున్నారు; నేను దైవప్రవక్త(స) గారితో ఇలా అన్నాను; 'ఓ దైవప్రవక్తా(స)! మీరు వితర్ నమాజు చేసే ముందు నిదుర పోతారా?' అప్పుడు ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; 'ఓ ఆయెషా! నా కళ్ళు పైకి నిదురపోతూ ఉంటాయి. కాని నా మనస్సు మాత్రం నిదురపోదు.'

**249.** హజ్రత్ ఆయెషా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని రాత్రిపూట చేసే ఏ నమాజులోనూ కూర్చొని ఖురాన్ పఠిస్తూ ఉండగా చూడలేదు. చివరకు ఆయన(స) గారు ముసలివారై పోయి నప్పుడు కూర్చొని ఖురాన్ వాక్యాలను పఠిస్తూ ఉండేవారు. సూరాలోని ముప్పై గాని, నలభైగాని ఆయత్‌లు మిగిలి ఉన్నప్పుడు నిలబడేవారు. తరువాత ఆ మిగిలి పోయిన ఆయత్‌లను పఠించిన పిదపనే రుకూ చేసేవారు.'

## 16వ అధ్యాయం

**రేయింబవళ్ళు వుజూతో ఉండే దాని ఔన్నత్యం, వుజూ తరువాత రేయింబవళ్ళు నమాజు చేసేదాని ఔన్నత్యం.**

**250.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త

మహాశయులు ముహమ్మద్(స) ఒకనాడు ఫజ్ర్ నమాజు సమయంలో హజ్రత్ బిలాల్(ర)తో ఇలా అన్నారు; "ఓ బిలాల్(ర)! ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన తరువాత నీవు చేసిన ఉత్తమమైన కార్యమేదో నాకు చెప్పు; ఎందుకంటే, స్వర్గలోకంలో నా ముందే నేను నీ పాదరక్షల సవ్వడిని విన్నాను". అప్పుడు హజ్రత్ బిలాల్(ర) ఇలా విన్నవించు కున్నారు, 'ఓ దైవప్రవక్తా(స)! నేనైతే నా దృష్టిలో దీనికంటే ఎక్కువ మంచికార్యం ఏదీ చేయలేదు. అదేమిటంటే నేను రాత్రి గానీ, పగలుగానీ ఏ సమయంలోనైనా వుజూ చేసుకుంటే నేను ఆ వుజూతో నఫిల్ నమాజును చేస్తూ వచ్చాను. నా అదృష్టంలో ఎంత వ్రాసిపెట్టి ఉన్నదో అంత నమాజును.'

## 17వ అధ్యాయం

### ఆరాధనలో అత్యంత కఠినత్వాన్ని పాటించటం అవాంఛనీయం.

**251.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'ఒకసారి దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) మసీదులోకి విచ్చేశారు. అక్కడ ఆయన(స) రెండు స్తంభాల మధ్య ఒక తాడు వేలాడుతూ ఉండటాన్ని గమనించారు. అప్పుడు ఆయన(స) ఇదేమిటి ఈ తాడును ఇలా కట్టేశారు? అని అడిగారు. ప్రజలు ఇలా అన్నారు; ఈ త్రాడును విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ జైనబ్(ర) ఇక్కడ కట్టారు. ఆమె(ర) గారు నమాజులో చాలాసేపు నిలబడి అలసిపోయినప్పుడు ఆ తాడు ఆసరాతో నిలబడే ఉంటారు. నిలబడి ఉండటాన్ని వదిలిపెట్టరు. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; "వద్దు, ఈ త్రాడు ఇక్కడ ఇలా ఉండకూడదు; దాన్ని విప్పివెయ్యండి. మీలోని ప్రతి వ్యక్తి మన:పూర్వకంగా మనసుకు ఇష్టమైనంతవరకు నమాజు చెయ్యాలి. అలసిపోయినప్పుడు కూర్చుండిపోవాలి". ఇమామ్ బుఖారీ(రహ్మాలై) ఇలా అన్నారు; మాకు అబ్దుల్లా బిన్ మస్లమ చెప్పారు. ఆయన ఇమామ్ మాలిక్ (రహ్మాలై) ద్వారా విన్నారు; ఆయన హిషామ్ బిన్ ఉర్వా నుండి విన్నారు; ఆయన తన తండ్రి గారి నుంచి విన్నారు; ఆయన హజ్రత్ ఆయెషా(ర) చెప్పగా విన్నారు, ఆమె(ర)గారు ఇలా అన్నారు; బనీ అసద్ తెగకు చెందిన ఒక స్త్రీ నా వద్దకు వచ్చారు. ఆమె నావద్ద కూర్చున్నారు. ఇంతలోనే దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) అక్కడకు విచ్చేశారు. ఈ స్త్రీ ఎవరు? అని ఆయన(స)నన్ను అడిగారు. నేను ఇలా చెప్పాను; ఈ స్త్రీ ఫలానా స్త్రీ, ఆమె రాత్రి అంతా నిద్రపోదు. తరువాత ఆమె చేసే నమాజులను గురించి చెప్పటం జరిగింది. అప్పుడు ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; చాలు!

చాలు మీకు ఎంత పని చెయ్యగల శక్తి ఉందో అంతే పని చెయ్యండి (హాయిగా ప్రశాంతంగా ఎంత చెయ్యగలరో). ఎందుకంటే అల్లాహ్ పుణ్యాన్ని, ప్రతిఫలాన్ని ఇస్తూ అలసిపోడు. పనిచేస్తూ చేస్తూ మీరే అలసిపోతారు.

## 18వ అధ్యాయం

**రాత్రిపూట ఆరాధన చేస్తూ ఉండే వ్యక్తి ఒకవేళ దాన్ని నిలిపివేస్తే అది అయిష్టకర మైన విషయం అవుతుంది.**

**252.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తనతో ఇలా సెలవిచ్చారని అబ్దుల్లాహ్ ఇబ్నె అమ్ర్ బిన్ ఆస్(ర) ఉల్లేఖించారు; 'ఓ అబ్దుల్లా! నీవు ఫలానా వ్యక్తి లాంటివాడవు అయిపోబాకు. అతను (మొదట) రాత్రిపూట లేస్తూ ఉండేవాడు. తరువాత అతను రాత్రిపూట లేవటాన్ని వదిలిపెట్టాడు.'

## 19వ అధ్యాయం

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి నాతో ఇలా సెలవిచ్చారు; "నీవు రాత్రి అంతా ఆరాధనలు చేస్తావనీ, పగలంతా ఉపవాసం ఉంటావని నాకు తెలిసింది". నేను ఇలా అన్నాను. 'ఓ దైవప్రవక్తా(స)! ఇది నిజమే. నేను అలానే చేస్తాను'. ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "నీవు గనక అలా చేస్తే నీ కళ్ళు శక్తిహీనమైపోతాయి. నీ ప్రాణం బలహీన బడిపోతుంది. నీ మనసుకు కూడా నీపై హక్కు ఉందనీ, నీ భార్యకు కూడా నీపై హక్కు ఉందని నీవు తెలుసుకోవాలి. ఉపవాసం కూడా ఉండు, ఇఫ్తార్ కూడా చెయ్యి. మరియు నిద్ర కూడా పో."

## 20వ అధ్యాయం

**రాత్రిపూట ఏ మనిషి కళ్ళు అయితే తెరుచుకుంటాయో తరువాత అతను నమాజు చేస్తాడో... అతని ఔన్నత్యం.**

**253.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఉబాదా బిన్ సామిత్ (రజిఅన్) ఉల్లేఖించారు; 'ఏ మనిషైతే రాత్రిపూట మేల్కొని 'లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లాషరీక లహు, లహుల్ ముల్కు వలహుల్ హమ్దు వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్, అల్హమ్దులిల్లాహ్, సుబ్హానల్లాహ్, వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్, వలాహౌల వలా ఖువ్వత ఇల్లాబిల్లాహ్- అని అంటాడో

తరువాత దుఆ చేస్తే లేదా ఇలా అంటే, 'ఓ అల్లాహ్! నన్ను క్షమించు' అప్పుడు అతని దుఆకు స్వీకారం లభిస్తుంది. ఒకవేళ అతను వుజూ చేసి నమాజు చేస్తే అప్పుడు అతని నమాజు స్వీకరించబడుతుంది.'

**254.** హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ప్రజలకు ప్రసంగాన్ని వినిపిస్తున్నారు. ఆ ప్రసంగంలో ఆయన (ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి గురించి ప్రస్తావించారు. ఇలా అనసాగారు; మీ సోదరుడైన అబ్దుల్లా బిన్ రవాహ ఎలాంటి అశ్లీల విషయాన్ని మరియు ఎలాంటి తప్పుడు మాటనూ అనలేదు. ఆయన ఈ కవిత్వాన్ని చదివారు; దేవుని ప్రవక్త ఒకాయన అల్లాహ్ గ్రంథాన్ని పఠిస్తారు మరియు మాకు వినిపిస్తారు తెల్లవారుజామున. మేమైతే అంధులము ఆయనే మాకు మార్గాన్ని చూపించారు. ఆయన చెప్పే మాటలు సత్యమైనవి, నమ్మదగినవి, హృదయానికి హత్తుకుంటాయి. ఆయన తన పక్కలను పడకనుంచి వేరుగా, దూరంగా ఉంచుతాడు. అప్పుడు అవిశ్వాసులందరూ గాఢమయిన నిద్రలో పడివుంటారు.'

**255.** హజ్రత్ ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా అన్నారని నాఫె ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలంలో నేను ఒక స్వప్నాన్ని చూశాను. ఆ స్వప్నంలో నా చేతిలో ఒక దళసరి పట్టు వస్త్రపు ముక్క ఉన్నట్లు మరియు అది స్వర్గంలో నేను కోరిన చోటికల్లా నన్ను ఎగరేసుకుపోతున్నట్లు గమనించాను. ఇంకా ఇద్దరు దైవదూతలు నా వద్దకు వచ్చారు. మరియు నన్ను నరకంలోకి తీసుకుపోసాగారు. తరువాత ఒక దైవదూత మార్గమధ్యంలో వారిని కలుసుకున్నారు; అతను నాతో, భయపడబాకు అని అన్నాడు. మరియు ఆ ఇద్దరు దైవదూతలతో 'ఇతన్ని విడిచి పెట్టండి' అని అన్నాడు; ఈ విషయాలను కూడా నేను ఆ స్వప్నంలో చూశాను. విశ్వాసుల తల్లి అయినటువంటి నా సోదరి హఫ్సా(ర) నాకు వచ్చినటువంటి స్వప్నాలలో ఒక స్వపాన్ని గురించి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి తెలియజేశారు. ఆయన(స) అప్పుడు ఇలా సెలవిచ్చారు. అబ్దుల్లాహ్ అయితే చాలా మంచి మనిషి అతను గనక రాత్రిపూట నమాజు చేసే సంప్రదాయాన్ని పాటిస్తే. (దైవప్రవక్త (స) గారి ఈ హితోపదేశం తరువాత) అబ్దుల్లాహ్ రాత్రి పూట నమాజు చెయ్యసాగారు. దైవప్రవక్త(స) గారి సహచరుల స్థితి ఎలా ఉండేదంటే, వారు ఎల్లప్పుడూ తమకువచ్చిన కలలను గురించి ఆయన(స)కు వివరిస్తూ ఉండేవారు. వారు షబె ఖదర్(విలువైన రాత్రి) రమజాన్ మాసంలోని ఇరవై ఏడవ రాత్రిలో వస్తుందని తమ అందరికి వచ్చిన ఒక కలను గురించి దైవప్రవక్త(స) గారికి

తెలియజేశారు. చివరికు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; షబేఖదర్‌ను గురించి మీ అందరి కలలు రమజాను మాసంలోని చివరి పదిరోజులలో వస్తుందనే విషయంలో ఏకాభిప్రాయం ఉందనే విషయాన్ని నేను గమనిస్తున్నాను. కనుక షబె ఖదర్‌ను అన్వేషించే కాంక్ష గల వ్యక్తి దానిని రమజాన్ మాసంలోని చివరి పది దినాలలో అన్వేషించాలి."

## 21వ అధ్యాయం

**ఫజ్ర్ నమాజుకు చెందిన రెండు రకాతుల సున్నత్ నమాజును ఎల్లప్పుడూ చెయ్యటం**

**256.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు; ఆమె(ర)గారు ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇషా నమాజును చేయించారు. మరియు తహజ్జుద్ నమాజును ఎనిమిది రకాతులు చేశారు. ఇంకా రెండు రకాతులు కూర్చొని చేశారు. ఇంకా మరొక రెండు రకాతులను ఫజ్ర్‌కు చెందిన అజాన్, తక్బీర్‌ల మధ్య కాలంలో చేశారు. ఆయన(స) గారు వాటిని ఎన్నడూ విడిచిపెట్టలేదు."

## 22వ అధ్యాయం

**ఫజ్ర్‌కు చెందిన రెండు రకాతుల సున్నత్ నమాజును చేసిన తరువాత కుడి పక్కకు తిరిగి పండుకోవటం.**

**257.** హజ్రత్ ఆయెషా(ర) ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫజ్ర్‌కు చెందిన సున్నత్ నమాజు రెండు రకాతులు చేసిన తరువాత కుడిపక్కకు తిరిగి పండుకునేవారు."

## 23వ అధ్యాయం

**ఫజ్ర్‌కు సంబంధించిన సున్నత్ నమాజును చేసి మాట్లాడుతూ ఉండటం మరియు పండుకోకుండా ఉండటం.**

**258.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హ) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఫజ్ర్‌కు సంబంధించిన సున్నత్ నమాజును చేసిన తరువాత, ఒకవేళ నేను మేల్కొని ఉన్నట్లయితే అప్పుడు నాతో మాట్లాడేవారు. లేకపోతే ఫజ్ర్ నమాజుకు అజాన్ అయ్యేవరకు పండుకునే వారు."

## 24వ అధ్యాయం

**ఫజ్ర్‌కు సంబంధించిన సున్నత్ నమాజు తరువాత మాట్లాడుకోవడం.**

**259.** హజ్రత్ ఆయెషా(రజి) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫజ్ర్‌కు సంబంధించిన సున్నత్ నమాజు రెండు రకాతులను చేస్తారు. తరువాత ఒకవేళ నేను మేల్కొని ఉంటే అప్పుడు నాతో మాట్లాడేవారు. లేకపోతే పడుకునేవారు.

## 25వ అధ్యాయం

**ఫజ్ర్‌కు సంబంధించిన రెండు రకాతుల సున్నత్ నమాజును ఎల్లప్పుడూ తప్పని సరిగా చేసుకోవటం. మరియు ఆ రెండు రకాతులు సున్నత్ అని చెప్పటానికి రుజువు.**

**260.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఏ నఫిల్ నమాజునూ ఇంత నియమబద్ధంగా చెయ్యలేదు. ఎంత నియమబద్ధంగా ఫజ్ర్‌కు సంబంధించిన రెండు రకాతుల (సున్నత్ నమాజు)ను చేశారో."

## 26వ అధ్యాయం

**ఫజ్ర్‌కు చెందిన రెండు రకాతుల సున్నత్‌లో ఎంత ఖుర్ఆన్ పారాయణం చెయ్యాలి?**

**261.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రిపూట 13 రకాతుల నమాజు చేసేవారు. తరువాత ఫజ్ర్ నమాజుకు చెందిన అజాన్ విన్నప్పుడు తేలికపాటి రెండు రకాతుల సున్నత్ నమాజు చేసేవారు."

**262.** హజ్రత్ ఆయెషా సిద్దీఖా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫజ్ర్ నమాజుకు ముందు చేసే సున్నత్ రకాతులు రెండు ఎంతో తేలికపాటి రకాతులు. నేను ఆయన(స) గారితో ఇలా అనేదాన్ని; 'ఓ దైవప్రవక్తా(స)! మీరు ఫాతిహా సూరానయినా పఠించారా లేదా?'

## 27వ అధ్యాయం

నఫిల్ నమాజులను రెండేసి రకాతుల చొప్పున చెయ్యటం. ఈ విషయాన్ని అమ్మార్, అబూజర్, అనస్‌ల ద్వారా ఇలాగే ఉటంకించబడిందని ఇమామ్ బుఖారీ తెలిపారు. జాబిర్ బిన్ జైద్, ఇక్రిమా మరియు అజ్‌జుహ్రి గార్లు కూడా ఇలాగే

ఉల్లేఖించారు; యహ్యా బిన్ సయీద్ అన్సారీ (తాబయి) ఇలా అన్నారు; నేను మా పట్టణం పవిత్ర మదీనా పురంలోని మత విద్వాంసులను కూడా చూశాను; వారు పగటిపూట (నఫిల్ నమాజులలో) ప్రతి రెండు రకాతుల తరువాత సలామ్ చేస్తారు.

**263.** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మాకు ప్రాపంచిక, ధార్మిక పనులు అన్నింటిలోనూ 'ఇస్తిఖార' చెయ్యటం నేర్పేవారు. ఖుర్ఆన్‌లోని ఏదైనా సూరాను నేర్పే విధంగా (ఇస్తిఖార అంటే ఒక పనిని గురించి, ఒక ఉద్యోగం గురించి మంచి నిర్ణయం తీసుకునే విషయంలో మార్గం చూపమని అల్లాహ్‌ను వేడుకోవడం). ఆయన(స) ఇలా సెలవిస్తూ ఉండేవారు; "మీలో ఎవరైనా ఏదైనా పని చెయ్యదలిచి నప్పుడు, ఫర్జ్ నమాజు కాదు, నఫిల్ నమాజు రెండు రకాతులు చెయ్యాలి. ఆ తరువాత ఇలా వేడుకోవాలి; "అల్లాహుమ్మ ఇన్నీ అస్తఖీరుక బి ఇల్‌మిక వ అస్‌తఖ్ దిరుక బి ఖుద్‌రతిక వ అస్ అలుక మిన్ ఫజ్‌లికల్ అజీమి, ఫ ఇన్నక తఖ్‌దిరువలా అఖ్‌దిరు వ తఅలము వలా ఆలము వ అన్‌త అల్లాముల్ గుయూబి, అల్లాహుమ్మ ఇన్‌కున్‌త తఅలము అన్న హాజల్ అమ్‌ర ఖైరుల్ లి ఫీ దీని వ మాషి వ ఆఖిబతి అమ్‌రి అవ్ ఆజిలి అమ్‌రి వ ఆజిలిహీ ఫఖ్‌దిర్‌హులీ వ యస్సిర్‌హులీ సుమ్మ బారిక్‌లీ ఫీహి, వ ఇన్‌కున్‌త త అలము అన్న హాజల్ అమ్‌ర షర్రుల్‌లి ఫీ దీని వ మఆషీ వ ఆఖిబతి అమ్‌రి వ ఆజిలి అమ్‌రి, వ ఆజిలిహీ ఫస్‌రిఫ్‌హు అన్నీ వస్‌రిఫ్‌నీ అన్‌హు వఖ్‌దిర్ లిల్ ఖైర హైసు కాన సుమ్మ అర్‌జిని బిహీ వ యుసమ్మా హాజతహు"

"ఓ నా అల్లాహ్! నేను నీ నుంచి నీకు ఉన్న జ్ఞానం ఆధారంగా మేలు కోరు తాను. మరియు నీకు ఉన్న శక్తి ఆధారంగా నేను శక్తిని కోరుతాను. మహత్తరమైన నీ అనుగ్రహాన్ని కోరుతాను. నీకు శక్తి సామర్థ్యాలుఉన్నాయి. నాకు శక్తిసామర్థ్యాలు లేవు. 'నీకు జ్ఞానం ఉన్నది, నాకు జ్ఞానం లేదు. ఇంకా నీవు అగోచర విషయాలను ఎరిగినవాడవు. లేక ఓ నా అల్లాహ్! నీవు గనక ఎరిగినవాడవు అయితే ఈ పని (దేని కోసమయితే ఇస్తిఖార చెయ్యబడుతూ ఉందో) నా ధర్మం కోసం మరియు నా ప్రపంచం కోసం, మరియు ముగింపు కొరకు ఉత్తమమైనదీ, ఉపయోగకరమైనది అయితే లేక ఇలా సెలవిచ్చారు; వర్తమానంలో, భవిష్యత్తులో అది గనక నా కొరకు శ్రేష్టమైనది అయితే దాని భాగ్యం నాకు కలుగజెయ్యి. దానిని నా కోసం సులభతరమైనదిగా చెయ్యి. ఇంకా అందులో శుభాలను కలుగజెయ్యి. నీవు గనక ఎరిగిన వాడవు అయితే, ఈ పని నా ధర్మం కొరకు, నా ప్రపంచం కొరకు మరియు ముగింపు కొరకు చెడ్డది

అయితే లేక ఇలా అన్నారు; మరియు భవిష్యత్తులో ఆ పని నా కొరకు చెడ్డది అయితే అప్పుడు దానిని నా నుంచి తిరిగిపోయేలా చెయ్యి. ఎక్కడయితే నా కోసం మేలు ఉంటుందో అక్కడ ఆ మేలు భాగ్యాన్నీ నాకు కలుగజెయ్యి. మరియు దానిపై నాకు తృప్తిని, ఆనందాన్ని ప్రసాదించు.' 'ఈ పని అనే మాటలు ఉన్న స్థానంలో 'ఆ పని పేరును' ఉచ్చరించాలి.'

**264.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ ఖతాద బిన్ రబీ అన్సారి (రజిఅన్) ఉల్లేఖించారు; 'మీలో ఎవరైనా మసీదులోకి ప్రవేశిస్తే వారు రెండు రకాతులు నమాజు చేస్తే అంతవరకు (అంటే తహియతుల్ మస్జిద్) కూర్చోరాదు.[1]'

**265.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఒకసారి విందు భోజనానికి మా ఇంటికి వచ్చారు. అప్పుడు ఆయన(స)గారు మా చేత రెండు రకాతులు నమాజు చేయించారు. ఆ తరువాత వెళ్ళిపోయారు."

**266.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు, ఆయన(ర) ఇలా అన్నారు; "నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారితో కలిసి రెండు రకాతులు సున్నత్ నమాజును జొహర్ నమాజుకు ముందు చేశాను. మరియు రెండు రకాతులు జొహర్ నమాజ్ తరువాత చేశాను. ఇంకా రెండు రకాతులు జుమా నమాజు తరువాత, రెండు రకాతులు మగ్రిబ్ నమాజు తరువాత ఇంకా రెండు రకాతులు ఇషా నమాజు తరువాత చేశాను."[1]

**267.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; ఆయన (స)గారు ఒక సారి జుమా ప్రసంగం చేస్తూ ఇలా అన్నారు; ఇమామ్ ఖుత్బా ప్రసంగం చేస్తూ ఇలా అన్నారు; 'ఇమామ్ ఖుత్బా ప్రసంగం చేస్తూ ఉన్నప్పుడు గాని లేక ఖుత్బా ప్రసంగం చెయ్యటానికి బయలుదేరినప్పుడు గానీ మీలో ఎవరైనా మసీదులోకి ప్రవేశిస్తే అప్పుడు రెండురకాతులు (తహియ్యతుల్ మస్జిద్) నమాజు చేసుకోవాలి."

---

264–1. ఈ హదీసు ద్వారా కూడా ఇమామ్ బుఖారి(రహ్మలై) ఒక విషయాన్ని వెలికితీశారు. అదేమిటంటే నఫిల్ నమాజులు రెండేసి రకాతుల చొప్పున చెయ్యాలి.

266–1. షౌకానీ ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నాలుగేసి రకాతులు కూడా సున్నత్ నమాజులు చేసినట్లు ఆధారాలు ఉన్నాయి.

**268.** ముజాహిద్ ఇలా ఉల్లేఖించారు; "అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) మక్కా లోని తన గృహానికి వచ్చేశారు. ఆయన గారితో ఎవరో ఇలా అన్నారు; (ఏమిటి ఇలా కూర్చున్నారు?)" దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వచ్చారు. మరియు కాబా గృహంలోకి ప్రవేశించారు కూడా. అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఇలా అన్నారు; "ఈ విషయాన్ని గురించి విని నేను వచ్చాను. దైవప్రవక్త(స) గారు కాబా గృహంలో నుంచి బయటికి రావటాన్ని చూశాను. మరియు బిలాల్(ర) కాబా గృహ ద్వారం వద్ద నిలబడి ఉన్నారు. నేను బిలాల్‌తో ఇలా అన్నాను. 'ఓ బిలాల్ (ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కాబా గృహం లోపల నమాజు చేశారా?' ఆయన(ర) 'అవును చేశారు' అని సమాధానంగా అన్నారు. అప్పుడు నేను 'నమాజు ఎక్కడ చేశారు?' అని అడిగాను. అప్పుడు బిలాల్(ర) ఇలా అన్నారు; 'ఈ రెండు స్తంభాల మధ్య నిలబడి నమాజు చేశారు. తరువాత ఆయన(స) బయటికి వెళ్ళి కాబా గృహద్వారం ముందు రెండు రకాతులు నమాజు చేశారు.' ఇమామ్ బుఖారీ(రహ్మాలై) ఇలా అన్నారు; అబూ హురైరా (రజిఅన్) ఇలాచెప్పారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు రెండు రకాతులు చాష్త్ నమాజును చెయ్యమని నన్ను ఆదేశించారు. మరియు ఉత్బా బిన్ మాలిక్ (రజిఅన్)ఇలా అన్నారు; 'ఉదయం పూట పొద్దెక్కిన తరువాత దైవప్రవక్త(స) మరియు హజ్రత్ అబూ బకర్(రజి) మరియు హజ్రత్ ఉమర్(రజిఅన్) నా వద్దకు వచ్చారు. మేము దైవప్రవక్త(స)గారి వెనుక నిలబడి వరుసగా పంక్తి కట్టి నిలబడ్డాము. ఆయన (స) గారు మా చేత రెండు రకాతులు నమాజు చేయించారు.'[1]

## 28వ అధ్యాయం

### ఫర్జ్ నమాజుల తర్వాత చేసే సున్నత్ నమాజులను గురించి

**269.** ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖించారు; ఆయన(ర) గారు ఇలా అన్నారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి సున్నత్ నమాజు రెండు రకాతులు జొహర్ నమాజుకు ముందు మరియు రెండు రకాతులు జొహర్ తరువాత మరియు రెండు రకాతులు మగ్రిబ్ తరువాత రెండు రకాతులు ఇషా తరువాత చేశాను. మగ్రిబ్, ఇషాకు చెందిన సున్నత్ నమాజులను దైవప్రవక్త(స) తమ ఇంట్లో చేస్తూ ఉండేవారు.' అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా అన్నారు; నా సోదరి అయిన

---

268-1. ఈ అన్ని హదీసులను పగటిపూట రెండేసి రకాతుల నఫిల్ నమాజులను చెయ్యాలనే విషయాన్ని ఇమామ్ బుఖారి(రహ్మాలై) ఆధారంగా తీసుకున్నారు.

విశ్వాసుల తల్లి హఫ్సా (రజిఅన్హా) నాతో ఇలా వివరించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉషోదయం తరువాత రెండు రకాతుల తేలికపాటి సున్నత్ నమాజు లను చేసేవారు. ఈ సమయంలోనైతే నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వెళ్ళేవాణ్ణికాను.'

## 29వ అధ్యాయం

### ఫర్జ్ నమాజు తరువాత సున్నత్ నమాజు చెయ్యకపోవటం.

**270.** అమ్ర్ బిన్ దీనార్ ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; అబూ అష్షాష జాబిర్ ఇలా అంటూ ఉండగా నేను విన్నాను. 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారితోకలిసి జొహర్, అసర్కు చెందిన ఎనిమిది రకాతుల నమాజ్ను మగ్రిబ్, ఇషాలకు చెందిన ఏడు రకాతులను కలిపి చేశాను.' (మధ్యలో సున్నత్ మొదలైన నమాజులు ఏమీలేవు) అమ్ర్ ఇలా అన్నారు; నేను అబూ అష్షాషతో ఇలా అన్నాను. "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జొహర్ నమాజులో ఆలస్యం చేశారు. మరియు అసర్ నమాజు విషయంలో తొందర చేశారు. ఇషా నమాజులో తొందర చేశారు. మగ్రిబ్ నమాజులో ఆలస్యం చేశారు అని నేను అనుకుంటాను. అబూ అష్షాష ఇలా అన్నారు; "నేను కూడా అలాగే అనుకుంటున్నాను."

## 30వ అధ్యాయం

### ప్రయాణంలో ఉన్నప్పుడు చాష్త్ నమాజును చెయ్యటం.

**271.** మువర్రిఖ్ ఇలా ఉల్లేఖించారు; నేను ఇబ్నె ఉమర్ (రజిఅన్)ను, మీరు చాష్త్ నమాజును చేస్తారా? అని అడిగాను. ఆయన 'లేదు' అని అన్నారు. నేను, ఉమర్ (రజిఅన్) చేసేవారా? అని అడిగాను. దానికి ఆయన 'లేదు' అని సమాధానం చెప్పారు. నేను, 'అబూ బకర్(రజిఅన్) చేసేవారా?' అని అడిగాను. ఆయన 'లేదు' అని జవాబు పలికారు. నేను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) చేసేవారా? అని అడిగాను, సమాధానంగా ఆయన ఇలా అన్నారు. 'ఆయన(స) చేసేవారని నేను అనుకోవడంలేదు.'

**272.** అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ లైలా ఉల్లేఖించారు. ఆయన ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను చాష్త్కు చెందిన నమాజును చేస్తూ ఉండగా నేను చూశాను అని ఏ సహాబీ అనలేదు. ఒక్క ఉమ్మెహానీ మాత్రమే అలా అన్నారు. ఆమె ఏమన్నారంటే, మక్కా నగరం జయించబడిన రోజున (దైవప్రవక్త(స) అక్కడ ప్రయాణ స్థితిలో ఉన్నారు.) ఆయన(స) ఆమె గారి ఇంటికి వెళ్ళారు. మరియు

గుసుల్ చేసుకున్నారు. ఇంకా ఎనిమిది రకాతులు చాష్త్ నమాజును చేశారు. అప్పుడు ఆయన(స) చేసినంత తేలికపాటి నమాజును ఎన్నడూ చూడలేదు. అయితే ఆయన(స) రుకూలను మరియు సజ్దాలను ఖచ్చితంగా, చక్కగా చేశారు."

## 31వ అధ్యాయం

**'చాష్త్' నమాజును చెయ్యకపోవడం, దానిని అవసరమైనదిగా భావించక పోవడం.**

**273.** హజ్రత్ ఆయెషా(రజి) ఉల్లేఖించారు; ఆమె గారు ఇలా అన్నారు, "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు 'చాష్త్' నమాజును చేస్తూ ఉండగా నేను ఎన్నడూ చూడలేదు. కాని నేను మాత్రం చాష్త్ నమాజును చేస్తాను."

## 32వ అధ్యాయం

**చాష్త్ నమాజును తాను నివసించే పట్టణంలో ఉన్నప్పుడు చెయ్యటం, ఈ విషయాన్ని ఇత్‌బాన్ బిన్ మాలిక్ దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఉటంకిస్తూ చెప్పారు.**

**274.** హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు; 'నా ప్రాణ స్నేహితులైన దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మూడు విషయాలు చేస్తూ ఉండమని నాకు తాకీదు చేశారు. మరణించేవరకు నేను వాటిని చేస్తూ ఉండాలని కూడా ఆయన(స) నాతో అన్నారు. ఒకటి, నీవు ప్రతి మాసంలో మూడు రోజులు ఉపవాసం ఉండాలి. రెండు, చాష్త్ నమాజును చేస్తూ ఉండు. మూడు, వితర్ నమాజు చేసి నిద్రపో.

**275.** అనస్ బిన్ సీరీన్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు. నేను అనస్ బిన్ మాలిక్ చెబుతూ ఉండగా ఇలా విన్నాను, ఆయన ఇలా అన్నారు; "లావుగా ఉండే ఒక అన్సారీ పురుషుడు (ఇత్‌బాన్ బిన్ మాలిక్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో ఇలా అన్నాడు: 'నేను మీతోపాటు కలిసి నమాజు చెయ్యలేను.' తరువాత అతను ఆయన(స) గారి కోసం భోజనం తయారు చేశాడు. ఆ తరువాత అతను ఆయన(స) గారిని తన ఇంటికి ఆహ్వానించాడు. చాపలోని ఒక భాగాన్ని నీళ్ళతో కడిగి పరిశుభ్రం చేశాడు. దైవప్రవక్త మహాశయులు (స) దాని పైన రెండు రకాతులు నమాజు చేశారు. అబ్దుల్ హమీద్ బిన్ మన్‌జర్ బిన్ జారూద్ అనస్

(రజి)ను, దైవప్రవక్త(స) చాష్త్ నమాజును చేస్తూ ఉండేవారా? అని అడిగారు. సమాధానంగా ఆయన(రజి) ఇలా అన్నారు. నేనైతే ఆయన(స) గారిని ఆ రోజు తప్ప మరెన్నడూ 'చాష్త్' నమాజును చేస్తూఉండగా చూడలేదు."

## 33వ అధ్యాయం

### జుహ్రా నమాజుకు ముందు రెండు రకాతులు సున్నత్ చేయటం.

**276.** హజ్రత్ ఆయెషా(రజి) ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త ముహమ్మద్ (స) జుహ్రా నమాజుకు ముందు నాలుగు రకాతులు సున్నత్ నమాజును మరియు ఫజ్ర్ నమాజుకు ముందు రెండురకాతులు సున్నత్ నమాజును విడిచిపెట్టేవారు కాదు."

## 34వ అధ్యాయం

### మగ్రిబ్ నమాజుకు ముందు సున్నత్ నమాజును చెయ్యడం.

**277.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా ముజ్ని ఉల్లేఖించారు; మగ్రిబ్ నమాజుకు ముందు (రెండు రకాతులు సున్నత్) నమాజ్ చెయ్యి. మూడోసారి ఇలా అన్నారు: 'ఎవరైనా కోరుకుంటే అలా చెయ్యవచ్చు. ప్రజలు దానిని విధిగా చేసుకోవడం, ఆయన(స) గారికి ఇష్టంలేదు.'

**278.** మర్సద్ బిన్ అబ్దుల్లా యజ్ని ఇలా ఉల్లేఖించారు; 'ఒకసారి నేను ఉఖబా బిన్ ఆమిర్ జుహన్నీ వద్దకు వెళ్ళాను. ఆయనతో నేను ఇలా అన్నాను; 'అబూ తమీమ్ అబ్దుల్లా బిన్ మాలిక్‌ను చూసి మీకు ఆశ్చర్యం కలగటంలేదా? ఆయన మగ్రిబ్ నమాజుకు ముందు రెండు రకాతుల నమాజును చేస్తారు.' ఉఖబా ఇలా అన్నారు; 'మేము కూడా దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి కాలంలో ఆ రెండు రకాతులను చేసేవారం.' అప్పుడు నేను ఆయనతో ఇలా అన్నాను; అయితే ఇప్పుడు మీరుఎందుకు చెయ్యటం లేదు? ఆయన ఇలా అన్నారు; వ్యాపారం అడ్డుగా నిలిచింది."

## 35వ అధ్యాయం

### నఫిల్ నమాజులను జమాఅత్‌తో కలిసి చెయ్యటం. హజ్రత్ అనస్(ర), హజ్రత్ ఆయెషా(ర) ఉభయులూ ఈ విషయాన్ని ఉల్లేఖించారు.

**279.** మహ్మూద్ బిన్ రబీ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఆయనకు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) బాగా జ్ఞాపకం ఉన్నారు. ఇంకా ఆయన(స)

గారు పుక్కిలించి అతని ముఖం మీద ఊయటం కూడా జ్ఞాపకం ఉంది. ఆ నీళ్ళను ఆయన (స) గారు ఒక బావిలో నుండి తీసుకుని పుక్కిలించి ఊశారు. ఈ బావి వారి ఇంట్లో ఉన్నది. మహమూద్ ఇలా అన్నారు; నేను ఇత్‌బాన్ ఇబ్నె మాలిక్ అన్సారీ (రజిఅన్) చెబుతూ ఉండగా విన్నాను. తాను బదర్ యుద్ధంలో దైవప్రవక్త(స) గారితో కలసి యుద్ధం చేశారు. ఆయన ఇంకా ఇలా అనేవారు; నేను నా తెగ బనీ సాలిమ్‌కు చెందిన ప్రజలకు ఇమామత్ చేస్తూ ఉండేవాణ్ణి. నాకూ, వారికి మధ్య ఒక కాలువ ఉండేది. వర్షం కురిసినప్పుడు ఆ కాలువను దాటటం మరియు వారి మసీదు వైపునకు వెళ్ళటం నాకు చాలా కష్టంగా ఉండేది. చివరికి నేను దైవప్రవక్త(స) గారి వద్దకు వెళ్ళి ఇలా విన్నవించుకున్నాను; 'నేను నా దృష్టిలో లోపాన్ని గమనిస్తున్నాను; వర్షాలు కురిసి నప్పుడు నాకూ, నా తెగ వారికి మధ్య ఉన్న ఈ కాలువ పొంగిపొరలుతూ ఉంటుంది. అప్పుడు దానిని దాటటం నాకు కష్టతరమవుతుంది. మీరు దయచేసి నా ఇంటికి రండి. నా ఇంట్లో ఏదైనా స్థలంలోఎక్కడైనా సరే నమాజు చెయ్యండి. నేను ఆ స్థలాన్ని నమాజు చేసే స్థలంగా నిర్ణయించుకుంటున్నాను.' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; నేను తప్ప కుండా వస్తాను (ఇన్షాఅల్లాహ్). తరువాత మరుసటి రోజు ఉదయం పూట ఆయన (స) గారు అబూబకర్ (రజిఅన్) గారితో కలిసి నా వద్దకు వచ్చారు. అప్పుడు పొద్దెక్కింది. ఆయన(స) గారు ఇంటి లోపలికి ప్రవేశించే అనుమతిని అడిగారు. నేను అనుమతి ఇచ్చేశాను. ఆయన(స) గారు ఇంట్లో కూర్చోనైనా లేదు, ఇలా సెలవిచ్చారు; 'నువ్వు నీ ఇంట్లో నేను ఎక్కడ నమాజు చేయాలనుకుంటున్నావు?' నేను నాకు ఇష్టమైన ఒక స్థలాన్ని చూపించాను. ఆ స్థలంలో నమాజు చెయ్యమని ఆయన(స) గారిని కోరారు. అప్పుడు దైవప్రవక్త(స) ఆ స్థలంలో నిలబడి 'అల్లాహుఅక్బర్' అని పలికారు. మేము ఆయన(స) గారి వెనుక పంక్తి కట్టి నిలబడ్డాము. ఆయన(స) రెండు రకాతులు నమాజు చేశారు. తరువాత సలాము చేశారు. మేము కూడా ఆయన(స) గారి సలామ్‌తోపాటే సలాము చేశాము. నేను ఆయన(స) గారిని హలీమ్ తినేందుకు ఆపి ఉంచాను. అది అప్పుడు తయారై తినటానికి యోగ్యమైనదిగా ఉంది. మా వీధిలో ఉండే ప్రజలు దైవప్రవక్త(స) గారు మా ఇంటికి వచ్చారని విని, తెలుసుకుని ఎక్కువ సంఖ్యలో మా ఇంటికి వచ్చేశారు. చాలామంది ప్రజలు మా ఇంట్లో సమావేశ మయ్యారు. వారిలోని ఒక మనిషి ఇలా అన్నాడు; 'మాలిక్ బిన్ దఖ్‌షిన్ ఎక్కడ? కనిపించడంలేదేమిటి?' మరొక మనిషి ఇలా అన్నాడు; 'ఏమండి! ఆయనైతే కపటి

కదా? అతనికి అల్లాహ్ పట్ల, దైవప్రవక్త(స) పట్ల ప్రేమ లేనేలేదు.' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; అయ్యో! ఇదేమిటి? అలాంటి మాటలు అనకూడదు. నీవు అతన్ని 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలుకుతూ ఉండగా చూడలేదా? అతనైతే అల్లాహ్ కోసమే ఇలా అన్నాడు; అప్పుడు అతను ఇలా అన్నాడు. 'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తయే అసలు విషయం ఏమిటో బాగా ఎరుగుదురు. మేమైతే పైకి మాత్రమే దేవునిపై ప్రమాణం చేసి ఇలా అంటాము. అతను కపటులతోనే ఎక్కువగా స్నేహం చేస్తాడు. వారితోనే ఎక్కువగా మాట్లాడుతూ ఉంటాడు. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; "ఎవరైనా కేవలం అల్లాహ్ ప్రసన్నతను పొందటానికే లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరొక దేవుడు లేడు) అని అంటే అతని కోసం అల్లాహ్ నరకాన్ని నిషేధిస్తాడు." మహమూద్ బిన్ రబీ ఇలా అన్నారు; 'నేను ఈ హదీసును గురించి కొందరి దగ్గర ప్రస్తావించాను. వారిలో అబూ అయ్యూబ్ అన్సారీ(రజిఅన్) కూడా ఒకరు. ఆయన(ర) దైవప్రవక్త(స)గారి అనుచరులు కూడా (సహాబి). రోమ్ దేశంలో జరిగిన ఒక యుద్ధంలో ఆయన(ర)గారు మరణించారు. మరియు ముఆవియా (ర) కుమారుడైన యజీద్ అప్పుడు వారికి సేనాధిపతిగా ఉండేవాడు. అబూ అయ్యూబ్ ఈ హదీసు నిజమైన హదీసు కాదని తిరస్కరించేవారు. ఇంకా ఆయన ఇలా అన్నారు; 'దేవుని సాక్షిగా చెబుతున్నాను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స), నీవు ఏదైతే చెప్పావో అది చెప్పారని నేను అనుకోవటంలేదు. ఆయన గారు చెప్పిన ఈ మాట నాకు ఎంతో బాధ కలిగించింది. అప్పుడు నేను అల్లాహ్‌పై ఈ విధంగా ప్రమాణం చేశాను. అల్లాహ్ గనక ఆ పవిత్ర యుద్ధంలో నన్ను క్షేమంగా, సురక్షితంగా ఇంటికి చేర్చినట్లయితే ఇత్‌బాన్ బిన్  మాలిక్‌ను ఆయన గారి తెగకు చెందిన మసీదులో సజీవంగా చూసినట్లయితే అప్పుడు (రెండోసారి) ఆయన గారిని ఈ హదీసును గురించి అడుగుతాను.' చివరకు యుద్ధం నుంచి తిరిగి వచ్చాను. మరియు నేను హజ్ లేక ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించాను.  అన్నీ ముగించుకున్న తరువాత ముందుకు సాగిపోయాను. మదీనా పురంలోకి ప్రవేశించాను. బనీ సాలిమ్ తెగకు చెందిన వీధిలోకి చూశాను. అప్పుడు ఇత్‌బాను చాలా ముసలివారైపోయారు. కళ్ళు కూడా కనిపించడంలేదు. మరియు అప్పుడు ఆయన(ర) తన తెగకు చెందిన ప్రజలకు నమాజు చేయిస్తున్నారు. నమాజు ముగిసిన తరువాత నేను ఆయన(ర) గారికి సలాము చేశాను. నేను  ఫలానా వ్యక్తినని ఆయన గారికి పరిచయం చేసుకున్నాను.

ఆ తరువాత నేను ఆయన గారిని ఈ హదీసును గురించి ప్రశ్నించాను. ఆయన(ర) గారు మొదటిసారి నాకు ఏవిధంగా చెప్పారో అదే విధంగా ఇప్పుడు కూడా చెప్పారు.

## 36వ అధ్యాయం

### ఇంట్లో నఫిల్ నమాజులు చెయ్యటం గురించి

**280.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్‌ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; 'కొన్ని నమాజులను మీ ఇళ్ళల్లో కూడా చేస్తూ ఉండండి. వాటిని (ఇండ్లను) సమాధులుగా చెయ్యకండి.'

## 37వ అధ్యాయం

మక్కా నగరంలోని మసీదులోనూ (అల్‌మస్జిద్ అల్ హరామ్), మదీనాపురం లోని మసీదు (దైవప్రవక్త(స) గారి మసీదు)లోనూ నమాజు చేసే దాని ఔన్నత్యం.

**281.** ఖుజా బిన్ యహ్‌యా ఇలా ఉల్లేఖించారు; అబూ సయీద్ ఖుద్రీ (రజి అన్) నాలుగు విషయాలు చెబుతూ ఉండగా నేను విన్నాను. ఆయన(ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను; అబూ సయీద్ ఖుద్రీ దైవప్రవక్త(స)గారితో కలసి పన్నెండు పవిత్ర యుద్ధాలలో పాల్గొన్నారు.'

అబూ హురైరా (రజిఅన్)ఇలా ఉల్లేఖించారు;దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; "మూడు మసీదులవైపునకు తప్ప మరే వైపునకూ ప్రయాణం కట్టకూడదు. అంటే **1)** అల్ మస్జిద్ అల్‌హరామ్, **2)** దైవప్రవక్త(స) గారి మసీదు మరియు **3)** అల్ అఖ్సా మసీదు."

**282.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; "నా మసీదులో చేసే ఒక్క నమాజు ఇతర మసీదులలో చేసే వెయ్యి నమాజులకంటే ఎంతో ఉత్తమమైనది; మస్జిదె హరామ్ తప్ప".

## 38వ అధ్యాయం

### ఖుబా మసీదును గురించి.

**283.** నాఫె ఇలా ఉల్లేఖించారు; ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఎన్నడూ చాష్త్ నమాజును చెయ్యలేదు. రెండు సమయాలలో తప్ప. ఒకటి ఆయన మక్కా నగరాన్ని సందర్శించినప్పుడల్లా. ఆయన మక్కా నగరానికి ఎల్లప్పుడూ మధ్యాహ్న సమయానికి ముందే వస్తూ వుండేవారు. ఆయన కాబా గృహం చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. తరువాత

ఆయన మఖామె ఇబ్రాహీం వెనుక భాగంలో రెండు రకాతులు నమాజు చేసేవారు. రెండు, ఆయన ఖుబా మసీదుకు వెళ్ళినప్పుడల్లా. ఆయన అక్కడకు ప్రతి శనివారం వెళ్ళేవారు. ఆయన మసీదులోనికి ప్రవేశించినప్పుడు రెండు రకాతులు నమాజు చెయ్యకుండా మసీదులోనుంచి నిష్క్రమించటాన్ని ఇష్టపడేవారు కాదు.

ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుబా మసీదుకు ఒకసారి కాలినడకన మరొకసారి స్వారీ చేస్తూ వెళ్ళేవారు. అతను (అంటే ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా అనేవారు; నా సహచరులు ఏమి చేస్తూ ఉండేవారో అదే నేను చేస్తున్నాను. ఎవరైనా పగటి సమయంలో ఎప్పుడైనా గాని లేక రాత్రి సమయంలో ఎప్పుడైనా గాని నమాజు చెయ్యదలిస్తే నేను వారిని చెయ్యవద్దని వారించను. సూర్యోదయం అయినప్పుడు లేక సూర్యాస్తమయం అయినప్పుడు ఎవరైనా నమాజు చెయ్యదలిస్తే తప్ప.'

## 39వ అధ్యాయం

### ప్రతి శనివారం ఖుబా మసీదుకు రావటం.

**284.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలాఅన్నారని అబ్దుల్లా బిన్ దీనార్ ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుబా మసీదుకు ప్రతి శనివారం వచ్చేవారు– కొన్నిసార్లు నడుస్తూ, మరికొన్ని సార్లు స్వారీ చేస్తూ, అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) అలాగే చేసేవారు.'

## 40వ అధ్యాయం

### ఖుబా మసీదులోకి నడుస్తూ లేక స్వారీ చేస్తూనో రావటం.

**285.** హజ్రత్ ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుబా మసీదుకు కొన్నిసార్లు కాలినడకన, మరి కొన్నిసార్లు వాహనంపై స్వారీ అయి వెళ్ళేవారు. నాఫె ఇలా ఉల్లేఖించారు; తరువాత ఆయన(స) రెండు రకాతులు నమాజు చేసేవారు.'

## 41వ అధ్యాయం

### మస్జిదె నబవీలో సమాధికి- మెంబర్‌కు మధ్య ఉన్నటువంటి స్థలం యొక్క ఔన్నత్యం

**286.** అబ్దుల్లా బిన్ జైద్ అల్ మాజని(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త

మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; అని ఆయన (ర) అన్నారు; 'నా నివాస గృహానికి, మెంబర్‌కూ మధ్య స్వర్గంలోని తోటలలోని ఒక తోట ఉన్నది.'

**287.** అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఆయన అన్నారు; నా గృహానికి, నా మెంబర్‌కూ మధ్య ఒక తోట ఉన్నది. ఈ తోట స్వర్గలోకంలోని తోటలలోని ఒక తోట. నా మింబర్ (ప్రళయదినాన) అల్ కౌసర్ కోనేరు మీద ఉంటుంది.'

## 42వ అధ్యాయం

### బైతుల్ మఖ్‌దిస్ మసీదును గురించి (జెరూసలెం)

**288.** జియాద్ బానిస అయినటువంటి ఖజా మౌలా ఇలా ఉల్లేఖించారు; 'నేను అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్‌హు) గారి నుంచి నాలుగు హదీసులు విన్నాను. వాటిని ఆయన, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు చెబుతూ ఉండగా విని ఉల్లేఖించారు. ఆ నాలుగు హదీసులు నాకు ఎంతో బాగా నచ్చాయి.

ఒకటి ఏమిటంటే, ఒక స్త్రీ తన భర్తగానీ లేక ఒక మహరం బంధువుగానీ తనతో లేకుండా రెండు రోజుల ప్రయాణం మీద వెళ్ళకూడదు.

రెండోది ఏమిటంటే, సంవత్సరంలో రెండు రోజులు ఉపవాసం ఉండకూడదు. ఈదుల్ ఫితర్ నాడు మరియు ఈదుల్ అజ్‌హా నాడు.

మూడోది ఏమిటంటే, ఫజ్ర్ నమాజు చేసిన తరువాత సూర్యోదయం అయ్యే వరకు నమాజు చెయ్యకూడదు. ఇదేవిధంగా అస్ర్ నమాజు చేసిన తరువాత సూర్యాస్త మయం అయ్యేవరకు నమాజు చెయ్యకూడదు.

నాలుగో హదీసు ఏమిటంటే; మూడు మసీదుల వైపునకు తప్ప మరే వైపునకూ ప్రయాణం కట్టకూడదు. ఒకటి, మస్జిదె హరామ్. రెండు, మస్జిదె అఖ్సా అంటే బైతుల్ మఖ్‌దిస్. మూడు, నా మసీదు.[1]

---

1. ఈ హదీసు ద్వారా మస్జిదె అఖ్సా అంటే బైతుల్ మఖ్‌దిస్ మసీదు ఔన్నత్యం స్పష్టమవుతోంది. ఈ మసీదులో చేసే ఒక నమాజు యాభై వేల నమాజులకు సమానమవుతుంది. దైవప్రవక్త సులైమాన్(అ) ఈ మసీదును నిర్మించారు. అప్పుడు ఆయన ఇలా దుఆ చేశారు; ఓ అల్లాహ్! ఎవరైనా ఈ మసీదుకు నమాజు చేసే సంకల్పంతో వచ్చినట్లయితే వారి పాపాలను క్షమించు; వారు తమ తల్లి గర్భం నుంచి పుట్టినరోజు ఎంత పవిత్రంగా ఉన్నారో వారిని అంత పవిత్రులుగా చెయ్యి.

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# నమాజులో చేసే నమాజుతో సంబంధంలేని పనులు

## 1వ అధ్యాయం

నమాజులో నమాజుకు సంబంధించిన ఏదైనా పనిని చేతులతో చెయ్యటం.[1] అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలాఅన్నారు; 'మనిషి నమాజు చేసేటప్పుడు తన శరీరంలోని అవయవాల చేత తాను కోరిన ఏ పనైనా చేయించుకోవచ్చు. అబూ ఇస్‌హాఖ్ సబయీ తాబయి గారు నమాజులో ఉన్నప్పుడు తన టోపీని శిరస్సు మీద నుంచి కిందకి దించేవారు. మరియు నమాజులోనే టోపీని శిరస్సు మీద ధరించేవారు. హజ్రత్ అలీ(రజిఅన్) నమాజులో తన అరచేతిని తన ఎడమ చేయి మణికట్టు మీద పెట్టేవారు. కాని శరీరాన్ని ఎక్కడైనా గీకే అవసరం కలిగినప్పుడు లేదా బట్టలను సవరించుకునేప్పుడు చేతిని ఎత్తేవారు.'

**289.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారని, ఇబ్నె అబ్బాస్ గారి బానిస అయినటువంటి కురైబ్ ఉల్లేఖించారు; 'ఆయన ఒకనాటి రాత్రి తన పిన తల్లి, విశ్వాసుల తల్లి అయిన మైమూనా (రజిఅన్‌హా) గారి ఇంట్లో గడిపారు. ఆయన ఇలా అన్నారు; నేను పడక మీద అడ్డంగా పడుకున్నాను. మరియు దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) గారు తన భార్యతో దానిపై నిలువుగా పడుకున్నారు. తరువాత దైవప్రవక్త(స) నిద్రపోయారు. అర్థరాత్రి గడిచిన తరువాత లేదా దానికంటే కొంచెం ముందు లేదా దానికంటే కొంచెం తరువాత, ఆయన(స) మేల్కొన్నారు. నింపాదిగా కూర్చొని నిద్ర మత్తు గుర్తులను తన ముఖం మీద నుంచి చేతులతో చెరిపి వేసేవారు. తరువాత ఆలి ఇమ్రాన్ సూరాలోని చివరి పది వాక్యాలను పారాయణం చేశారు. ఆ తరువాత ఇంట్లో వేలాడుతూ ఉన్న ఒక పాత తోలు సంచి వైపునకు వెళ్ళారు. అందులో నుంచి నీళ్ళు తీసుకొని చక్కగా తృప్తికరంగా వుజూ చేసుకున్నారు. ఆ పిదప లేచి నిలబడి నమాజు చెయ్యసాగారు. అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర) ఇలా అన్నారు; 'నేను కూడా లేచి నిలబడ్డాను. దైవప్రవక్త(స) ఎలా చేశారో నేను కూడా

1. ఉదాహరణకు :- నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి ఎవరైనా దాటిపోతూ ఉంటే అతనిని అలా చెయ్యకుండా తొలగించటం లేక సజ్దా చేసే స్థలం మీద, సజ్దా చెయ్యటానికి వీలులేని వస్తువు ఏదైనా వచ్చిపడితే దానిని దూరంగా జరపటం.

అలాగే చేశాను. నేను వెళ్ళి దైవప్రవక్త(స) గారి పక్కన నిలబడ్డాను. అప్పుడు ఆయన (స) గారు తన కుడిచేయిని నా శిరస్సుపై పెట్టి నా కుడిచెవిని పట్టుకుని దానిని తన చేత్తో మెలిపెట్టసాగారు. తరువాత ఆయన(స) గారు రెండు రకాతులు నమాజ్‌చేశారు. ఆ తరువాత రెండు రకాతులు చేశారు. మళ్ళీ రెండు రకాతులు చేశారు. తరువాత రెండు రకాతులు చేశారు. ఆ తరువాత రెండు రకాతులు చేశారు. మళ్ళీ రెండు రకాతులు చేశారు. (అన్నీ కలిపి పన్నెండు రకాతులు చేశారు). ఆ తరువాత వితర్ నమాజ్ చేశారు. తరువాత విశ్రాంతి తీసుకున్నారు. చివరకు మౌజన్ ఆయన(స) గారి వద్దకు వచ్చారు. అప్పుడు ఆయన(స) లేచి నిలబడి రెండు రకాతులు తేలికపాటి నమాజు చేశారు. ఆ తరువాత బయటికి వెళ్ళారు. ఫజ్ర్ నమాజును మసీదులో చేయించారు.'

## 2వ అధ్యాయం

### నమాజులో ఉన్నప్పుడు మాట్లాడటం నిషిద్ధం

**290.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'మేము నమాజులో ఉన్నప్పుడే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి సలామ్ చేస్తూ ఉండేవారము. ఆయన(స)గారు సమాధానంగా ప్రతిసలాము కూడా చేసేవారు. మేము హబష్ దేశం నుంచి(ఎథియోపియా నుంచి) ఆ దేశానికి పాదుషా అయిన నజాషీ దగ్గర నుంచి మదీనా పురానికి వచ్చినప్పుడు దైవప్రవక్త(స) గారికి సలామ్ చేశాము. (అప్పుడు ఆయన(స) నమాజులో ఉన్నారు) ఆయన(స) మా సలామ్‌కు జవాబు పలకలేదు.' నమాజు తరువాత దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు; 'నమాజులో మనిషికి తీరిక ఎక్కడుంటుంది?'

**291.** 290వ హదీసులో ఉన్న విషయాన్నే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) బోధించారని అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఉల్లేఖించారు.

**292.** జైద్ బిన్ అర్ఖమ్ (ఒక సహాబి) ఇలా ఉల్లేఖించారు; "ప్రారంభంలో, దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి జీవిత కాలంలో మేము నమాజులో పరస్పరం మాట్లాడుకుంటూ ఉండేవారం. మాలోని ఒకరు తన స్నేహితునితో ఏదో ఒక పనిని గురించి ప్రస్తావించేవాడు. ఖుర్‌ఆన్ గ్రంథంలోని బఖరా సూరాలోని ఈ ఆయతు అవతరించే వరకు నమాజులో ఇలా మాట్లాడుకోవడం జరిగేది. 'మీరు మీ నమాజులను సంరక్షించుకోండి. ముఖ్యంగా అత్యుత్తమమైన నమాజును. అల్లాహ్ సన్నిధానంలో విధేయులైన దాసులుగా నిలబడండి' కనుక నమాజులో మౌనంగా ఉండాలని మమ్మల్ని ఆజ్ఞాపించడం జరిగింది.'

## 3వ అధ్యాయం

**నమాజులో ఉన్నప్పుడు పురుషులు సుబ్‌హానల్లాహ్, అల్‌హమ్‌దులిల్లాహ్ అని పలకటం[1] గురించి.**

**293.** సహల్ బిన్ సాద్ అనే పేరు గల ఒక సహాబి(రజి) ఉల్లేఖించారు; ఆయన గారు ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి బనీ అమ్ర్ బిన్ ఔఫ్‌కు చెందిన తెగల మధ్య రాజీ కుదర్చటానికి వెళ్ళారు. నమాజు చేసే సమయం ఆసన్నమయింది. హజ్రత్ బిలాల్ (ర) హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి అన్) గారి వద్దకు వెళ్ళి ఇలా అన్నారు; దైవప్రవక్త(స) గారైతే అక్కడ చిక్కుకు పోయారు. ఇప్పుడు మీరు ఇమామత్ బాధ్యతలను నిర్వహిస్తారా? ఆయన(ర)గారు, మంచిది మీరు గనుక కోరితే నేను నమాజు చేయిస్తాను అని అన్నారు. తరువాత హజ్రత్ బిలాల్(ర) ఇఖామత్ చెప్పారు. అబూబకర్ ముందుకు పోయి నమాజు చేయించటం ప్రారంభించారు. ఆ తరువాత దైవప్రవక్త(స) విచ్చేశారు. పంక్తులను చీల్చుకుంటూ ఆయన(స) నడుస్తూ వస్తున్నారు. చివరకు మొదటి పంక్తిలోకి వచ్చి నిలబడ్డారు. ప్రజలు చప్పట్లు కొట్టడం ప్రారంభించారు. సహల్ బిన్ సాద్ ఇలా అన్నారు; 'తస్‌ఫీఖ్' అని దేన్ని అంటారో మీకు తెలుసా? 'తఫ్‌సీఖ్' అంటే చప్పట్లు కొట్టటం. హజ్రత్ అబూ బకర్ (రజి) గారి అలవాటు ఏమిటంటే ఆయన నమాజులో ఉన్నప్పుడు అటు ఇటూ చూసి తన ధ్యానాన్ని భగ్నం చెయ్యరు. ప్రజలు ఎక్కువగా చప్పట్లు కొట్టటాన్ని గమనించిన ఆయన(ర) తన దృష్టిని మరలించారు. ఆయన (ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) పంక్తిలో నిలబడి ఉండటాన్ని చూశారు. దైవప్రవక్త(స) గారు, నమాజు చేయించమనీ, తన స్థానంలోనే ఉండమనీ సైగ చేసి ఆయన (ర)కు సూచించారు. కాని హజ్రత్ అబూబకర్ (ర) తన రెండు చేతుల్ని ఎత్తి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తరువాత వెనక్కి తిరిగి తొలగిపోయారు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు (స) ముందుకు పోయి నమాజుకు నాయకత్వం వహించారు."

---

1. అంటే ఏదైనా ఆపద సంభవించినప్పుడుచ ఉదాహరణకు:- ఇమామ్ ఏదైనా విషయాన్ని మరిచిపోయినప్పుడు లేదా ఎవరైనా ఒక అంధుడుగానీ లేదా ఒక పిల్లవాడు గానీ బావిలో పడుతూ ఉన్నప్పుడు లేదా ఒక పాము కనిపించినప్పుడు.

## 4వ అధ్యాయం

**నమాజులో ఉన్నప్పుడు పేరు పెట్టి దుఆ గానీ లేక బద్‌దుఆ గాని చెయ్యటం. లేదా ఎవరికైనా సలామ్ చెయ్యటం,**

**294.** హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) గారు ఇలా అన్నారు; "మేము ప్రారంభంలో నమాజులో ఉన్నప్పుడు ఇలా అంటూ ఉండే వారము, ఫలానా వ్యక్తికి సలామ్, పేరుపెట్టి సలాము చేసేవారము. మరియు పరస్పరం సలామ్ చేసుకునేవారము. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు ఈ విషయాన్ని గురించి విని ఇలా సెలవిచ్చారు; 'మీరు ఇలా అనండి. (అంటే అత్తహియ్యాతును చివరి వరకు చదవండి) 'సకల దాస్యాలు, స్తుతి స్తోత్రాలు మరియు మంచి విషయాలు (మాటలు) అల్లాహ్‌కే చెందుతాయి. ఓ దైవప్రవక్తా! మీపై శాంతి వర్షించుగాక! అల్లాహ్ కారుణ్యం మరియు ఆయన శుభాలు మీపై కురియుగాక! నేను ఇలా సాక్ష్యమిస్తున్నాను. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవ్వడూ లేడు. ఇంకా నేను ఇలా సాక్ష్యమిస్తున్నాను; ముహమ్మద్(స) అల్లాహ్ దాసులు మరియు అల్లాహ్ పంపిన వారు. మీరు ఇలా అన్నప్పుడు సజ్జనులైన అల్లాహ్ దాసులందరికీ వారు ఆకాశంలో ఉన్నా లేక భూమిలో ఉన్నా మీ సలాము వారికి చేరుతుంది.'

## 5వ అధ్యాయం

**(నమాజులో ఉన్నప్పుడు) చప్పట్లు కొట్టటం అనేది మహిళలు చెయ్యాలి.**

**295.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; '(నమాజులో ఉన్న సమయంలో) మహిళలు చప్పట్లు కొట్టాలి. పురుషులు సుబ్‌హానల్లాహ్ అని పలకాలి.'

**296.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని సహల్ బిన్ సాద్(రజిఅన్) ఉల్లేఖించారు; 'సుబ్‌హానల్లాహ్'అని పలకటం పురుషుల కోసమైతే, చప్పట్లు కొట్టటం అనేది మహిళల కోసం.

## 6వ అధ్యాయం

**నమాజులో ఉన్నప్పుడు ఏదైనా ప్రమాదం కారణంగా ఒక వ్యక్తి ఎవరైనా వెనక్కి జరిగిపోతే లేదా ముందుకు సాగిపోతే అప్పుడు అతని నమాజు చెడిపోదు.**

సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఈ విషయాన్ని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) చెబుతూ ఉండగా విని ఉల్లేఖించారు.

**297.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "ఒకరోజున సోమ వారం నాడు ముస్లిములు ఉదయం నమాజు చేస్తూ ఉన్నారు. హజ్రత్ అబూబకర్(రజి) ఇమామత్ చేస్తూ ఉన్నారు. అకస్మాత్తుగా వారి దృష్టి దైవప్రవక్త మహాశయులు ముహ మ్మద్(స)గారిపై పడింది. ఆయన(స) గారు హజ్రత్ ఆయెషా(ర) గదికి ఉన్న పరదాను తొలగించారు. మరియు వారిని చూశారు; వారు (నమాజులో) పంక్తులు కట్టి నిలబడి ఉన్నారు. ఆయన(స) చిరునవ్వు నవ్వారు. హజ్రత్ అబూబకర్ (ర) వెనక్కి జరిగారు. మరియు దైవప్రవక్త(స) నమాజు కోసం విచ్చేశారని అనుకున్నారు. నమాజులో ఉన్న ముస్లిములు దైవప్రవక్త(స) గారిని చూసి పరమానందభరితులై నమాజులనే భంగపరిచే స్థితికి చేరుకున్నారు. కాని దైవప్రవక్త(స) తమ చేత్తో సైగ చేసి తమ నమాజులను పూర్తి చేసుకోమని సూచించారు. తరువాత ఆయన(స) గారు గదిలోకి వెళ్ళిపోయారు. మరియు పరదా వేసి ద్వారాన్ని మూసివేశారు. అదేరోజున ఆయన(స) గారు పరమపదించారు. అల్లాహ్ కారుణ్యం ఆయన(స) గారిపై కురియు గాక! శాంతి సలాములు ఆయన(స) గారిపై వర్షించుగాక!"

## 7వ అధ్యాయం

ఒకవేళ ఎవరైనా నమాజు చేస్తూ ఉన్నప్పుడు అతని తల్లి అతన్ని పిలిస్తే అప్పుడు అతను ఏమి చెయ్యాలి. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు; 'బనీ ఇస్రాయీల్‌కు చెందిన ఒక స్త్రీ ఉండేది. ఒకసారి ఆమె తన కుమారుణ్ని తన వద్దకు రమ్మని పిలిచింది. అప్పుడు అతను తన ఆరాధనా గృహంలో ఉన్నాడు. ఆమె జురైజ్, జురైజ్ అని పిలవసాగింది. ఆ సమ యంలో అతను నమాజులో నిమగ్నమై ఉన్నాడు. మరియు ఇలా దుఆ చెయ్యసాగాడు. 'ఓ నా అల్లాహ్! ఇప్పుడు నేనేమి చెయ్యాలి? నమాజు చెయ్యాలా? లేక తల్లి పిలుపునకు జవాబు పలకాలా?' మళ్ళీ ఆ తల్లి జురైజ్! జురైజ్! అని పిలిచింది. జురైజ్ ఇలా దుఆ చేశాడు; 'ఓ నా అల్లాహ్! ఇప్పుడు నేనేమి చెయ్యాలి? కన్న తల్లిని చూడాలా? లేక నమాజునా?' తరువాత ఆమె మళ్ళీ జురైజ్! అని పిలిచింది. జురైజ్ మళ్ళీ ఇదే దుఆను

చేశారు. 'ఓ నా అల్లాహ్! నమాజు చెయ్యమంటావా? లేక తల్లి పిలుపుకు జవాబు పలక మంటావా?' చివరకు అతని తల్లి విసిగిపోయి ఇలా బద్దుఆ చేసింది; 'ఓ అల్లాహ్! వేశ్యల ముఖాన్ని చూడనంత వరకు జురైజ్ చావకూడదు.' అతని ఆరాధనా లయం వద్ద గొర్రెలను మేపే ఒక మహిళ ఉండేది. ఆమె ప్రసవించి నప్పుడు,ప్రజలు ఈ బాలుణ్ణి నువ్వు ఎక్కడ నుంచి తీసుకువచ్చావు? అని అడిగారు. అప్పుడు ఆమె ఈ బాలుడు జురైజ్ కుమారుడు, మరెవరికీ కుమారుడు కాదు అంది. అతను తన ఆరాధనా గృహం నుంచి కిందకి దిగి నా వద్దకు వచ్చేశాడు అని చెప్పింది. జురైజ్‌కు ఈ విషయం తెలిసినప్పుడు ఇలా అన్నాడు; 'తన బాలుణ్ణి నాకు పుట్టాదని చెప్పి నాకు అంటగట్టిన ఆ స్త్రీ ఏది?' అప్పుడు ఆ స్త్రీ ఆ బాలుణ్ణి జురైజ్ ముందుకు తీసుకు వచ్చింది. జురైజ్ ఆ బాలుణ్ణి, 'బాబూ! నీ తండ్రి ఎవరో చెప్పు?' అని అడిగితే, ఆ బాలుడు ఎలుగెత్తి నా తండ్రి ఒక గొర్రెల కాపరి అని చెప్పాడు.

## 8వ అధ్యాయం

### నమాజ్‌లో ఉన్నప్పుడు చిన్నచిన్న కంకరరాళ్ళను తొలగించటం.

**298.** ముఐఖిబ్ బిన్ అబీఫాతిమా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సజ్దా చేసే స్థలంలో ఉన్న మట్టిని చదును చేస్తూ ఉన్నటువంటి ఒక మనిషిని ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; 'ఒకవేళ నీవు అలా చెయ్య వలసి వస్తే ఒకేసారి అలా చెయ్యి'.

## 9వ అధ్యాయం

### నమాజులో ఉన్న సమయంలో సజ్దా చెయ్యటానికి వస్త్రాన్ని నేలపై పరచటం.[1]

**299.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'తీవ్రంగా ఉన్నప్పుడు మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి నమాజు చేసేవారం. మాలోని ఒక వ్యక్తి ఎవరైనా ఎండతాపం వల్ల తన నుదుటిని నేలపై ఆనించలేకపోతే అప్పుడు తన వస్త్రాన్ని నేలపై పరిచి దానిపై సజ్దా చేసేవాడు.'

---

9-1. అంటే, నమాజులో ఉన్న సమయంలోనే సజ్దా చేసేటప్పుడు ఎవరైనా ఒక వ్యక్తి నేలపై వస్త్రాన్ని పరిచి దానిపై సజ్దా చేస్తే అది ధర్మసమ్మతమే.

## 10వ అధ్యాయం

### నమాజులో ఉన్నప్పుడు ఏ ఏ పనులు చెయ్యటం ధర్మసమ్మతం?

**300.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె గారు ఇలా అన్నారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ఖిబ్లా వైపునకు (అంటే, ఆయన(స) గారి ముఖం వైపునకు) నేను నా కాళ్ళను చాచి పడుకునేదాన్ని. ఆయన(స) గారు నమాజ్ చేస్తూ ఉండేవారు. ఆయన (స) గారు సజ్దా చేయబోయేటప్పుడు నన్ను తన చేత్తో తాకేవారు. అప్పుడు నేను కాళ్ళను ముడుచుకునే దాన్ని. తరువాత ఆయన(స) గారు లేచి నిలబడేటప్పుడు నేను నా కాళ్ళను చాపుకునేదాన్ని.'

**301.** హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు; 'మహాప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక నమాజ్ చేశారు; ఆ తరువాత ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; "షైతాన్ నా ముందుకు వచ్చాడు. వాడు నా నమాజును భగ్నం చేయడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశాడు. కాని అల్లాహ్ వాణ్ణి నాకు లోబడి ఉండేలా చేశాడు (అంటే వాడిపై నాకు ప్రాబల్యాన్ని ప్రసాదించాడు). అప్పుడు నేను వాడి గొంతును నొక్కేశాను. లేదా వాణ్ణి తోసేశాను. మసీదులోని ఒక స్తంభానికి వాణ్ణి కట్టి పడేద్దామని మొదట అనుకున్నాను. తెల్లవారిన తరువాత మీరు వాణ్ణిచూడాలని నేను అలా చేయదలుచుకున్నాను. కాని నాకు హజ్రత్ సులైమాన్(అ) చేసిన దుఆ జ్ఞాపకం వచ్చింది. 'ఓ నా ప్రభూ! నా తరువాత మరెవరికీ లభించని రాజ్యాధికారాన్ని నాకు ప్రసాదించు.' చివరికి అల్లాహ్ షైతాన్‌ను అతి నీచమైన రీతిలో అక్కడినుంచి పారి పోయేలా చేశాడు.'

## 11వ అధ్యాయం

**ఒకవేళ మనిషి నమాజులో ఉన్నప్పుడు, అతని పశువు అతన్ని విడిచి పారి పోయినట్లయితే-ఖతాద ఇలా అన్నారు; 'ఒకవేళ దొంగ ఎవరైనా నమాజు చేసే వ్యక్తి వస్త్రాలను తీసుకొని పారిపోతూ ఉన్నట్లయితే అప్పుడు ఆ వ్యక్తి ఆ దొంగను పట్టుకోవ టానికి అతనివెంట పడాలి. మరియు నమాజును వదిలివెయ్యాలి.'**[1]

---

11-1. దీనిని అబ్దుర్రహ్మాన్, అబ్దుర్రజాక్ వసల్ చేశారు. ఇందులో ఈ విషయం మాత్రమే అదనంగా వుంది. ఒక పిల్లవాడు ఎవరైనా బావిలో పడిపోతూ వుండగా చూస్తే అప్పుడు ఆ బావి వద్దకు పోయి ఆ పిల్లవాణ్ణి రక్షించాలి. అలాంటి స్థితిలో నమాజును వదిలివెయ్యటం వాజిబ్ అవుతుంది.

**302.** అల్ అజ్రఖ్ బిన్ ఖైస్ ఇలా ఉల్లేఖించారు; 'మేము అల్ అహ్వాజ్ వద్ద ఉన్నాము. అప్పుడు మేము అల్‌హరూరియా తెగకు చెందిన ప్రజలతో పోరాడుతూ ఉన్నాము. ఒకసారి నేను ఒక కాలువ గట్టు మీద కూర్చొని ఉన్నాను. ఇంతలో ఒక వ్యక్తి అక్కడకు వచ్చాడు. (అబూ బర్జమ్- ఒక సహాబి(ర), మరియు నమాజు చెయ్య సాగాడు. అప్పుడు అతని గుర్రం కళ్ళెం అతని చేతిలోనే ఉంది. గుర్రం గింజు కుంటూ అతన్ని లాగుతోంది. అతను దాని వెనుక పోసాగాడు. (షూబ ఇలా అన్నాడు; ఆ వ్యక్తి పేరు అబూ బర్జా అస్‌లమీ(ర) ఒక సహాబి) ఈ దృశ్యాన్ని చూసి ఖవారిజ్‌కు చెందిన ఒక మనిషి ఇలా అన్నాడు; 'ఓ అల్లాహ్! ఈ ముసలివాణ్ణి నాశనం చెయ్యి.' ఆ వృద్ధుడు నమాజును ముగించిన తరువాత ఇలా అన్నాడు; 'నేను నీవు అన్నమాట లను విన్నాను (నీవెంతటి వాడవు? నీకు ఏమి తెలుసు?) నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి ఆరు లేక ఏడు లేక ఎనిమిది పవిత్ర యుద్ధాలలో పాల్గొన్నాను. నేను చూశాను, ఆయన (స) ప్రజల పట్ల ఎంత సౌమ్యంగా, ఎంత దయార్ద్ర హృదయంతో వ్యవహరించేవారో. ఆయన ప్రజలకు ఎలా సౌలభ్యం కలిగించేవారో. నేను తిరిగి వెళ్ళేటప్పుడు నా గుర్రాన్ని నాతోపాటు తీసుకువెళ్ళాలనే విషయం నాకు మంచిదిగా తోచింది. దానిని వదిలి వెళ్లటం నాకు అయిష్టమైనదిగా అనిపించింది. అది ఎక్కడపడితే అక్కడ తనకు ఇష్టమైన చోటికి వెళ్ళటం వల్ల నాకు ఇబ్బంది కలగటం అనేది నాకు రుచించలేదు."

**303.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; "ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టింది. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నమాజు చెయ్యటానికి లేచి నిలబడ్డారు. ఆయన(స)ఒక పొడుగాటి సూరాను పఠించారు. తరువాత రుకూ చేశారు. సుదీర్ఘమైన రుకూ చేశారు. ఆ తరువాత రుకూలో నుంచి తన శిరస్సును పైకి ఎత్తారు. తరువాత రెండో సూరాను పఠించడం ప్రారంభించారు. ఆ తరువాత రుకూ చేశారు. అప్పుడు ఆ రుకూను ముగించారు. మరియు సజ్దాలోనికి పోయారు. తరువాత రెండో రకాతులో కూడా పైవిధంగానే చేశారు. ఆ తరువాత నమాజును ముగించి ఇలా సెలవిచ్చారు; సూర్యుడు, చంద్రుడు అల్లాహ్ యొక్క సూచనలలోని రెండు సూచనలు. మీరు గనుక వాటికి గ్రహణం పట్టినప్పుడు చూస్తే గ్రహణం వీడేవరకు నమాజు చేస్తూ ఉండండి. చూడండి! ఈ స్థలంలో నేను నాకు

వాగ్దానం చెయ్యబడిన సకల వస్తువులను చూశాను. చివరకు నేను స్వర్గంలోని ఒక ద్రాక్షపండ్ల గుత్తిని తెంచుకుందామని కోరుకున్నాను. దీన్ని కూడా నేను చూశాను. నేను నమాజులో ముందుకు సాగిపోవటాన్ని మీరు చూసి ఉండవచ్చు. ఇంకా నేను నరకాన్ని కూడా చూశాను. అది తనను తానే తింటూ ఉంది. అప్పుడు నేను నమాజులో వెనక్కి జరిగిపోవటాన్ని మీరు గమనించి ఉంటారు. ఇంకా నేను అమ్ర్ బిన్ లుహయ్యిని నరకంలో చూశాను. సాన్‌డ్ (విగ్రహాల పేరుతో పశువులకు స్వేచ్ఛను ఇవ్వటం) అనే ఆచారాన్ని ప్రవేశపెట్టిన వాడు అతడే."

## 12వ అధ్యాయం

**నమాజు చేసేటప్పుడు ఊయటం మరియు ఊదటం- రెండూ ధర్మసమ్మత మైనవే. గ్రహణం హదీసులో అబ్దుల్లా బిన్ అమ్ర్ ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) గ్రహణానికి సంబంధించిన నమాజులో సజ్దాలో ఉన్నప్పుడు ఊదారు."**

**304.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మసీదులో కళ్ళె (కఫం)ను చూశారు. అప్పుడు ఆయన (స) గారు మసీదు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరియు ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ ముఖానికి ఎదురుగా ఉన్నాడు, మీలో ఎవరైనా నమాజు చేస్తూ ఉన్నప్పుడు ఉమ్మివేయరాదు; లేదా ఆయన (స) ఇలా సెలవిచ్చారు : కళ్ళె ఊయరాదు. ఆ తరువాత ఆయన (స) గారు క్రిందికి దిగి తన చేత్తో ఆ కళ్ళెను గీకి పారవేశారు. ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు; 'ఎవరైనా ఉమ్మి వెయ్యదలచినప్పుడు తన ఎడమ వైపున ఉన్న స్థలంలో ఉమ్మివెయ్యాలి.'

**305.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు : 'మీలో ఎవరైనా నమాజులో ఉన్నప్పుడు అతను తన ప్రభువుతో రహస్యంగా ఏకాంతంగా మాట్లాడుతున్నాడు; కనుక అతను తన ముందు భాగంలో ఉమ్మివెయ్యకూడదు. మరియు కుడివైపు కూడా ఉమ్మి వెయ్య కూడదు. అయితే ఎడమ వైపు ఎడమ పాదం క్రింద ఉమ్మివేయవచ్చు.'[1]

## 14వ అధ్యాయం

**ఒకవేళ నమాజు చేస్తూ ఉన్న వ్యక్తితో ఎవరైనా ముందుకు జరుగు అని అన్నప్పుడు లేదా అక్కణ్నే నిలబడి ఉండు అని చెప్పినప్పుడు అతను (ముందుకు జరిగితే) లేదా అక్కణ్ణే ఆగిపోతే అది దోషం కాదు.**

**306.** సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఆ కాలంలో పురుషులు తమ నడుముకు కట్టుకునే వస్త్రాన్ని (లుంగీని) మెడ నుంచి కట్టుకుని దైవప్రవక్త ముహమ్మద్(స) గారితో కలిసి నమాజు చేసేవారు. ఎందుకంటే, ఆ వస్త్రాలు చిన్న విగా ఉండేవి. ఇంకా మహిళలను ఉద్దేశించి ఇలా అనటం జరిగేది; 'మీరు మీ శిరస్సులను (సజ్దాలో నుంచి) పురుషులు నిటారుగా కూర్చోనంతవరకు ఎత్తరాదు.'

## 15వ అధ్యాయం

**నమాజులో ఉన్నప్పుడు ఎవరైనా సలామ్ చేస్తే, దానికి నోటితో సమాధానం చెప్పకూడదు**

**307.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఉల్లేఖించారు ; ఆయన ఇలా అన్నారు: 'పూర్వం నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నమాజులో ఉన్నప్పుడు సలామ్ చేసేవాణ్ణి, ఆయన (స) సమాధానం పలికేవారు కూడా. మేము ఇథియోపియా నుంచి తిరిగి వచ్చిన తరువాత నేను ఆయన (స) గారికి సలామ్ చేశాను. ఆయన (స) సమాధానం ఇవ్వలేదు. మరియు ఇలా సెలవిచ్చారు: నమాజులోనైతే మనిషి దైవధ్యానంలో నిమగ్నమై ఉంటాడు.

**308.** జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన ఇలా అన్నారు : "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఒకసారి నన్ను ఒక పనికోసం పంపారు. నేను ఆ పనికోసం వెళ్ళాను. ఆ పనిని పూర్తి చేసుకుని తిరిగి వచ్చాను. తరువాత నేను దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చాను. నేను ఆయన (స) గారికి సలామ్ చేశాను. కాని ఆయన (స) సమాధానం పలకలేదు. నేను నా మనస్సులో బాధకు గురి అయ్యాను; ఈ విషయం అల్లాహ్‌కు తెలుసు. అప్పుడు నేను నా మనస్సులో

---

305-1. ఖస్తలాని ఇలా అన్నారు : మసీదులో లేనప్పుడు మాత్రమే ఇలా చెయ్యవచ్చు. ఒకవేళ మసీదులో ఉంటే, అప్పుడు ఒక వస్త్రంలో ఉమ్మివెయ్యవచ్చు. నమాజు చెడిపోదు. తిరస్క రించబడదు. ఈ అధ్యాయంలో సహల్ బిన్ సాద్ దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి నుంచి ఉల్లేఖించారు.

ఇలా అనుకున్నాను, బహుశా నేను ఆలస్యంగా వచ్చాను. ఈ కారణంగా దైవప్రవక్త (స) గారు నా పట్ల కోపంగా ఉన్నారు. ఆ తరువాత నేను ఆయన (స) గారికి మళ్ళీ సలామ్ చేశాను. కాని ఆయన (స) జవాబు ఇవ్వలేదు. అప్పుడు నా మనస్సులో నేను మొదటిసారికంటే ఎక్కువ బాధకు గురయ్యాను. తరువాత నేను మూడోసారి మళ్ళీ సలామ్ చేశాను. అప్పుడు ఆయన (స) గారు జవాబు ఇచ్చారు. మరియు ఇలా సెలవిచ్చారు; 'మొదట రెండుసార్లు నేను నీ సలామ్‌కు జవాబు చెప్పలేదు. దానికి కారణమేమిటంటే, అప్పుడు నేను నమాజు చేస్తూ ఉన్నాను.' అప్పుడు దైవప్రవక్త (స) తమ ఒంటెపై కూర్చొని ఉన్నారు. దాని ముఖం ఖిబ్లా వైపునకు తిరిగి లేదు. మరొక దిక్కుకు తిరిగి ఉంది."

## 16వ అధ్యాయం

### నమాజు చేస్తూ ఉన్న సమయంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే అప్పుడు చేతులెత్తి దుఆ చెయ్యటం

**309.** సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన (ర) గారు ఇలా అన్నారు: "ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) బనీ అమ్ర్ బిన్ ఔఫ్‌కు చెందిన తెగల మధ్య రాజీ కుదర్చటానికి వెళ్ళారు. అప్పుడు నమాజు చేసే సమయం వచ్చేసింది. హజ్రత్ బిలాల్ (ర), హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (ర) గారి వద్దకు వెళ్ళి ఇలా అన్నారు; "దైవప్రవక్త (స) గారైతే అక్కడ కలహాల పరిష్కారంలో చిక్కుకు పోయారు. నమాజు సమయం సమీపించింది. ఇప్పుడు మీరు ఇమామత్ బాధ్యతలను నిర్వహిస్తారా?" ఆయన (ర) గారు ఇలా అన్నారు; 'మంచిది మీకు ఇష్టమైతే నేను నమాజు చేయిస్తాను.' ఆ తరువాత హజ్రత్ బిలాల్ (ర) ఇఖామత్ చెప్పారు. అబూ బకర్(ర) ముందుకుపోయి నమాజు చేయించసాగారు. ఇంతలోనే దైవప్రవక్త (స) వచ్చేశారు. పంక్తులను చీల్చుకుంటూ ఆయన (స) వస్తున్నారు. చివరకు మొదటి పంక్తిలోకి వచ్చి నిలబడ్డారు. అప్పుడు ప్రజలు చప్పట్లు కొట్టటం ప్రారంభించారు. అంటే 'తస్ఫీహ్' చెయ్యసాగారు. సహల్ బిన్ సాద్ (ర) ఇలా అన్నారు; 'తస్ఫీహ్' అని దేన్ని అంటారో మీకు తెలుసా? 'తస్ఫీహ్' అంటే చప్పట్లు కొట్టటం అని అర్థం. హజ్రత్ అబూబకర్ (ర) గారి అలవాటు ఏమిటంటే, ఆయన (ర) నమాజు చేసే టప్పుడు అటూ ఇటూ చూసి తన ధ్యానాన్ని భగ్నం చెయ్యరు. ప్రజలు అతిగా చప్పట్లు కొట్టటాన్ని గమనించిన ఆయన (ర) తన దృష్టిని మరలించారు. అప్పుడు దైవప్రవక్త

మహాశయులు ముహమ్మద్ (స) పంక్తిలో నిలబడి ఉండటాన్ని చూశారు. దైవప్రవక్త (స) గారు నమాజు చేయించమనీ, తన స్థానంలోనే ఉండమనీ సైగచేసి ఆయన (ర)కు సూచించారు. కాని హజ్రత్ అబూబకర్ (ర) తన రెండు చేతుల్ని ఎత్తి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తరువాత వెనక్కి ఇమామత్ స్థానం నుంచి తొలగి పోయారు. అప్పుడు దైవప్రవక్త (స) ముందుకు పోయి నమాజుకు నాయకత్వం వహించారు. నమాజు ముగిసిన తరువాత దైవప్రవక్త (స) ప్రజల వైపునకు తన ముఖాన్ని పెట్టి ఇలా హితోపదేశం చేశారు; 'ప్రజలారా! మీకేమయింది, నమాజులో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు మీరు చప్పట్లు కొడుతున్నారు? చప్పట్లు కొట్టడం మహిళలుచేసే పని. నమాజులో ఉన్నప్పుడు ఎవరికైనా ఏదైనా ప్రమాదం జరిగితే అప్పుడు సుబ్‌హానల్లాహ్ అని అనాలి'. తరువాత ఆయన (స) అబూబకర్ (ర) వైపునకు చూసి ఇలా సెలవిచ్చారు; 'ఓ అబూబకర్! నమాజు ఎందుకు చేయించలేదు? నేను నీకు సైగ చేసి చెప్పానుగదా! 'అబూబకర్ ఇలా అన్నారు; 'బాగుంది! అల్లాహ్ ప్రవక్త (స) గారి సమక్షంలో అబూ ఖహాఫ కుమారుడు నమాజు చేయించటం సముచితమైన విషయం కాదు కదా!'

## 17వ అధ్యాయం

**నమాజు చేసేటప్పుడు నడుముపై చేతులు పెట్టటం ధర్మసమ్మతమైన విషయమేనా?**

**310.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'నమాజు చేసేటప్పుడు నడుముపై చేతులు పెట్టటం నిషిద్ధం. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని, అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు.'

**311.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నడుముపై చేతులుపెట్టి నమాజు చెయ్యటాన్ని నిషేధించారు అని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు.

## 18వ అధ్యాయం

**నమాజు చేసేటప్పుడు మనిషి ఏదైనా విషయం గురించి ఆలోచించటం ధర్మ సమ్మతమైన విషయమేనా? ఒకసారి హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు; నమాజులో ఉన్నప్పుడు నేను జిహాద్ కోసం నా సైనిక దళానికి కావలసిన సామానుల గురించి మరియు చెయ్యవలసిన ఏర్పాట్లను గురించి ఆలోచిస్తాను.**

**312.** ఉఖబా బిన్ హారిస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స)గారితో కలిసి అసర్ నమాజు చేశాను. సలాము చేసిన తరువాత ఆయన (స) త్వరత్వరగా లేచి నిలబడ్డారు. మరియు తమ ఒక భార్య వద్దకు వెళ్ళారు. తర్వాత అక్కడి నుంచి బయటికి వచ్చారు. ఆయన (స) గారు వేగంగా లేచిపోవడం వల్ల ప్రజల ముఖాలపై ఏర్పడిన దిగ్భ్రమను ఆయన (స) గమనించారు. ఇలా సెలవిచ్చారు; 'నమాజులో ఉన్నప్పుడు నాకు మా ఇంట్లో ఉన్న బంగారం జ్ఞాపకం వచ్చింది. ఆ బంగారం రాత్రి వరకు లేక సాయంత్రం అయ్యేవరకు మా వద్ద ఉండటం అనేది నాకు చెడ్డ విషయంగా తోచింది. నేను ఆ బంగారాన్ని పంచిపెట్టమని ఆజ్ఞా పించి వచ్చాను.'

**313.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; 'నమాజ్‌కు సంబంధించిన అజాన్ అవుతూ ఉన్నప్పుడు షైతాన్ వీపు త్రిప్పి అపానవాయువు నిడుస్తూ పారిపోతాడు. ఎందుకంటే, అజాన్ వినటం వాడికి ఇష్టం లేదు. అజాన్ ఇచ్చే మౌజన్ మౌనంగా ఉంటే శాప గ్రస్తుడైన వాడు మళ్ళీ తిరిగి వస్తాడు ఇఖామత్ అయ్యేటప్పుడు వాడు మళ్ళీ పారి పోతాడు. ఇఖామత్ సమాప్తం కాగానే వాడు మళ్ళీ వస్తాడు. మరియు మనిషి మనస్సు లోకి దూరిపోయి అతనితో ఇలా అంటాడు; ఆ విషయాన్ని గురించి ఆలోచించు; ఫలానా విషయాన్ని జ్ఞాపకం చేసుకో, అది చెయ్యి, ఇది చెయ్యి అని ఎన్నో విషయాలను వాడు జ్ఞాపకం చేస్తాడు. ఈ విషయాలు మనిషికి ఎన్నడూ జ్ఞాపకం రావు. చివరకు మనిషి ఎన్ని రకాతులు చేశాడో మరిచిపోతాడు.' అబూ సలమా ఇలా అన్నారు; 'ఎవరికైనా ఇలాంటి దురాలోచనలు కలిగినప్పుడు వారు రెండు సజ్దాలు చేసు కోవాలి. అబూ సలమా ఈ విషయాన్ని అబూహురైరా (ర) చెబుతూ ఉండగా విన్నారు.'

**314.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'ప్రజలు ఇలా అంటారు; అబూ హురైరా (ర) చాలా హదీసుల్ని ఉల్లేఖించారు. పరిస్థితి ఎలా ఉందంటే, (దైవప్రవక్త (స) గారి కాలంలో) నేను ఒక మనిషిని, గడిచిన రాత్రి ఇషా నమాజులో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఏ సూరాలు పఠించారు అని అడిగారు. ఆ మనిషి, నాకు తెలియదు అని సమాధానం చెప్పాడు. అప్పుడు నేను అతనితో ఏమిటి నీవు రాత్రి నమాజులో పాల్గొనలేదా? అని అడిగాను; అతను ఇలా

అన్నాడు, నమాజులోనైతే పాల్గొన్నాగానీ, నాకు జ్ఞాపకం లేదు. అప్పుడు నేను ఇలా అన్నాను. 'నాకైతే సరిగా జ్ఞాపకం ఉన్నది, ఆయన (స) గారు ఫలానా ఫలానా సూరా లను నమాజులో పారాయణం చేశారు.'

## 19వ అధ్యాయం

**నాలుగు రకాతుల నమాజులో ఒకవేళ ఎవరైనా మొదటి ఖాయెదా చెయ్యకపోతే మరియు మరిచిపోయి లేచి నిలబడితే, అప్పుడు సజ్దయె సహూ చేసుకోవాలి.**

**315.** అబ్దుల్లా బిన్ బుహైనా (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఒక నాలుగు రకాతుల నమాజులో రెండు రకాతులు చేయించారు. ఆ తరువాత లేచి నిలబడ్డారు. మొదటి ఖాయిదాను ఆయన (స) గారు చెయ్యలేదు. ముఖ్తదీలు కూడా ఆయన (స) గారితో పాటు లేచి నిలబడ్డారు. నమాజు ముగిసినప్పుడు మేము ఆయన (స) గారు సలామ్ చేస్తారని నిరీక్షిస్తున్నాము. దైవప్రవక్త (స) అల్లాహు అక్బర్ అని పలికారు. మరియు సలామ్ చేసే ముందు కూర్చొనే రెండు సజ్దాలు చేశారు. ఆ తరువాత సలామ్ చేశారు.'

**316.** అబ్దుల్లా బిన్ బుహైనా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జొహర్‌కు సంబంధించిన రెండు రకాతులు చేసి నిలబడ్డారు. మరియు ప్రథమ ఖాయెదాను చెయ్యలేదు. నమాజు సమాప్తమైపోయినప్పుడు ఆయన (స) గారు రెండు సజ్దాలు చేశారు. ఆ సజ్దాల తరువాత సలామ్ చేశారు."

## 20వ అధ్యాయం

**ఒకవేళ ఐదు రకాతులు చేస్తే ....**

**317.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మరిచిపోవడం వల్ల జొహర్ నమాజులో ఐదు రకాతులు చేయించారు. ప్రజలు, నమాజు రకాతుల సంఖ్య పెరిగిందా? అని అన్నారు. ఆయన(స) గారు, విషయం ఏమిటి? అని అడిగారు. ప్రజలు ఇలా అన్నారు; మీరు (స) ఐదు రకాతులు చేశారు కదా! అప్పుడు దైవప్రవక్త (స) గారు సలామ్ చేసిన తరువాత రెండు సజ్దాలు చేశారు."

## 21వ అధ్యాయం

**రెండు రకాతులుగాని లేక మూడు రకాతులుగాని చేసిన తరువాత సలామ్ చేస్తే అప్పుడు నమాజులోని సజ్దాల మాదిరిగా లేక వాటికంటే పొడువైనవిగా (సహూకు చెందిన) రెండు సజ్దాలు చేసుకోవాలి.**

**318.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మాకు జుహ్ర్ నమాజునో లేక అస్ర్ నమాజునో చేయించారు. తరువాత సలామ్ చేశారు. అప్పుడు జుల్‌యదైన్ ఇలా అన్నారు; 'నమాజు పరిస్థితి ఏమిటి? ఓ దైవప్రవక్తా (స)! నమాజు రకాతుల సంఖ్య తగ్గిపోయిందా?' అప్పుడు దైవప్రవక్త (స) తన సహచరులను ఇలా అడిగారు; 'జుల్ యదైన్ నిజం పలుకుతున్నాడా?' అప్పుడు వారు, 'అవును దైవప్రవక్తా(స)!' అని విన్నవించుకున్నారు. అప్పుడు ఆయన (స) గారు మరొక రెండు రకాతులు నమాజు చేయించారు. ఆ తరువాత రెండు సజ్దాలు చేశారు. సాద్ ఇలా అన్నారు; 'నేను చూశాను; ఉర్వా బిన్ జుబైర్ (రజిఅన్) మగ్రిబ్ నమాజులో రెండు రకాతులు చేసి సలామ్ చేశారు. ఇంకా ప్రజలతో మాట్లాడారు కూడా. తరువాత మిగతా ఒక రకాతు నమాజును చేశారు. మరియు రెండు సజ్దాలు చేశారు. మరియు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు (స) ఇలానే చేశారు.'

## 22వ అధ్యాయం

**సహూకు సంబంధించిన సజ్దాల తరువాత, మళ్ళీ తషహ్హుద్ చదివే అవసరం లేదు. అనస్ (రజిఅన్), హసన్ బస్రీ (రహ్మాలై) గార్లు సలామ్ చేశారు. (అంటే సజ్దాలుచేసిన తరువాత) మరియు తషహ్హుద్ చదవలేదు. ఖతాద, తషహ్హుద్ చదవకూడదు అని అన్నారు.**

**319.** అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) రెండు రకాతులు నమాజుచేసి లేచి నిల బడ్డారు. అప్పుడు జుల్‌యదైన్ ఇలా అనసాగారు; 'ఏమిటి, నమాజు సంక్షిప్తమై పోయిందా? లేక ఓ దైవప్రవక్తా (స)! మీరు మరిచిపోయారా?' దైవప్రవక్త (స) కొందరి వైపునకు తన దృష్టిని సారించి ఇలా సెలవిచ్చారు; జుల్‌యదైన్ సత్యమే పలుకు తున్నాడా? వారు, అవును దైవప్రవక్తా (స)! అతను నిజమే పలుకుతున్నాడు అని విన్నవించుకున్నారు. ఇది విని ఆయన (స) నిలబడ్డారు. మిగిలిపోయిన రెండు

రకాతులను చేశారు. తరువాత సలామ్ చేశారు. ఆ తరువాత అల్లాహుఅక్బర్ అని పలికారు. మరియు తాను చేసే సజ్దా మాదిరిగా అంటే నమాజులోని మామూలు సజ్దాల మాదిరిగా సజ్దా చేశారు. లేదా దానికంటే పొడుగైనది. ఆ తరువాత తన శిరస్సును పైకి ఎత్తారు."

**320.** సలమా బిన్ అల్ ఖమా ఇలా ఉల్లేఖించారు; నేను ఇబ్నె సీరీన్‌ను ఇలా అడిగాను; సహూకు సంబంధించిన సజ్దాల తరువాత తషహ్హుద్‌ను చదివే అవసరం ఉందా? అప్పుడు ఆయన ఇలా అన్నారు; అబూహురైరా (రజిఅన్) గారి హదీసు లోనైతే తషహ్హుద్ ప్రస్తావన లేనేలేదు.

## 23వ అధ్యాయం

## సహూకు సంబంధించిన సజ్దాలలో తక్బీర్ పలకటం

**321.** అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) సాయంత్రం పూట చేసే రెండు నమాజులలోని (జొహర్ లేక అసర్) ఒక నమాజును చేయించారు.' ఇబ్నె సీరీన్ ఇలా అన్నారు; "అది అసర్ నమాజు అని నా అభిప్రాయం. దైవప్రవక్త (స) రెండు రకాతులు చేసి సలామ్ చేశారు. ఆ తరువాత ఒక కర్రను ఊతంగా చేసుకుని ఆయన (స) నిలబడ్డారు. ఆ కర్ర మసీదుకు ముందు భాగంలో ఉంది. ఆయన (స) తన చేతిని దానిపై పెట్టారు. మసీదులో ఉన్న జనులలో అబూబకర్ సిద్దీఖ్ (ర), ఉమర్ (ర) గారు కూడా ఉన్నారు. వారు ఆయన (స) గారితో మాట్లాడటానికి భయపడుతున్నారు. తొందరపాటు మనుషులు కొందరు మసీదులో నుంచి వెళ్ళిపోయారు కూడా. పోతూ పోతూ ఇంకా అంటున్నారు; 'నమాజు సంక్షిప్తమైపోయిందా? దైవప్రవక్త (స) జుల్‌యదైన్ అని పిలుస్తూ ఉండే ఒక వ్యక్తి మాత్రం ఆయన (స) గారితో ఇలా విన్నవించుకున్నాడు; ఏమిటి ఓ దైవప్రవక్తా (స)! మీరు (స) మరిచిపోయారా? లేక నమాజు తగ్గి పోయిందా? ఆయన (స) ఇలా సెలవిచ్చారు; నేను మరిచిపోనూ లేదు, నమాజు రకాతుల సంఖ్య తగ్గనూ లేదు. అతను ఇలా అన్నాడు; లేదు, ఓ ప్రవక్తా(స)! మీరు మరిచిపోయారు. తరువాత ఆయన (స) రెండు రకాతులు చేశారు. తరువాత సలామ్ చేశారు; ఆ తరువాత అల్లాహు అక్బర్ అని పలికారు. మరియు తన నమాజులోని సజ్దా మాదిరిగా సజ్దా చేశారు. లేక దానికంటే కొంచెం పొడుగైన సజ్దా. ఆ తరువాత తన శిరస్సును ఎత్తారు. మరియు తన నమాజులోని మాదిరిగా సజ్దా చేశారు. లేక

దానికంటే పొడుగైన సజ్దా చేశారు. ఆ తరువాత తన శిరస్సును ఎత్తారు. మరియు అల్లాహు అక్బర్ అని పలికారు."

**322.** బనీ అబ్దుల్ ముత్తలిబ్‌కు మిత్రుడైన అబ్దుల్లా బిన్ బుహైన అసది (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఒకసారి జొహర్ నమాజులో ఖాయెదయె ఊలా (మొదటి ఖాయెదా) చెయ్యకుండానే లేచి నిలబడ్డారు. (మూడో రకాతు కోసం మరియు తషహ్హుద్ కోసం కూర్చోకుండానే). నమాజు పూర్తిచేసిన తరువాత సలామ్‌కు ముందు సహూకు సంబంధించిన రెండు సజ్దాలు చేశారు; ప్రతి సజ్దాలో కూర్చొని ఉన్న స్థితిలోనే 'అల్లాహు అక్బర్' అని పలికారు. ప్రజలు కూడా ఆయన (స) గారితో పాటు రెండు సజ్దాలు చేశారు. ఈ సజ్దాలను ఆయన (స) గారు, మరిచిపోయినటువంటి ఖాయెదాకు బదులుగా చేశారు. లైస్‌తోపాటు ఈ హదీసును ఇబ్నె జురైజ్ కూడా ఇబ్నె షిహాబ్ నుంచి ఉల్లేఖించారు. మరియు సజ్దాలలో 'అల్లాహు అక్బర్' అనటాన్ని అనుకరించారు."

## 24వ అధ్యాయం

**ఒకవేళ ఎవరికైనా తాను మూడు రకాతులు చేశాడా లేక నాలుగు రకాతులు చేశాడా? అనే విషయం జ్ఞాపకం ఉండకపోతే, అతను సలామ్ చేసే ముందు కూర్చొని రెండు సజ్దాలుచేసుకోవాలి.[1]**

**323.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని, అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; "నమాజు కోసం అజాన్ అయ్యేటప్పుడు షైతాన్ అపానవాయువు విడుస్తూ వీపు తిప్పి పారిపోతాడు. అజాన్ వినకూడదని వాడు కోరుకుంటాడు. తరువాత అజాన్ ఇవ్వటం ముగిసిన పిదప వాడు తిరిగి వస్తాడు. ఆ తరువాత తక్బీర్ అయ్యేటప్పుడు వీపు తిప్పి పారిపోతాడు. తక్బీర్ ముగిసిన తరువాత మళ్ళీ తిరిగి వచ్చేస్తాడు. మరియు నమాజు చేసేవారి మనస్సులను మరొకవైపు లగ్నం చేస్తాడు; ఇంకా ఇలా అంటాడు. ఫలానా విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. ఫలానా విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. ఆ విషయం నమాజు చేసేవారికి జ్ఞాపకం ఉండదు. చివరకు నమాజు చేసేవారు తాము ఎన్ని రకాతులు చేశారో అనే విషయాన్ని మరిచిపోతారు. మీలో ఎవరికైనా తాను మూడు రకాతులు చేశాడా? లేక నాలుగు రకాతులు

---

24-1. మరియు రెండు సజ్దాలు చేసి సలామ్ చెయ్యాలి. ఇక మరొకసారి తషహ్హుద్ పఠించే అవసరం లేదు. అహ్లె హదీస్ వారి అభిప్రాయం కూడా ఇదే.

చేశాడా అనే విషయం జ్ఞాపకం ఉండకపోతే అప్పుడు అతను కూర్చొని సహూకు సంబంధించిన రెండు సజ్దాలు చేసుకోవాలి."

## 25వ అధ్యాయం

**సజ్దయె సహు ఫరజ్, నఫిల్ నమాజులు రెండింటిలోనూ విధిగా చెయ్యాలి. అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర) గారు వితర్ నమాజు తరువాత సహూకు సంబంధించిన రెండు సజ్దాలు చేశారు.**

**324.** అబుహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని ఆయన (ర) అన్నారు; 'మీలో ఎవరైనా నమాజు కోసం నిలబడినప్పుడు, షైతాన్ వచ్చి అతని నమాజులో సందేహాలను రేకెత్తిస్తాడు. అతనికి తాను ఎన్ని రకాతుల నమాజు చేశాడో జ్ఞాపకం ఉండదు. మీలో ఎవరికైనా ఇలాంటి సంఘటన ఎదురైతే అప్పుడు అతను కూర్చొని రెండు సజ్దా సహూలు చేసుకోవాలి.'

## 26వ అధ్యాయం

**ఒకవేళ నమాజు చేస్తూ ఉన్న మనిషితో ఎవరైనా మాట్లాడితే, అతను విని చేత్తో సైగచేసి తద్వారా జవాబు ఇస్తే, అప్పడు నమాజు భంగం కాదు.**

**325.** కురైబ్ ఇలా ఉల్లేఖించారు; అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) మిస్వర్ బిన్ మఖ్రమ (రజిఅన్), మరియు అబ్దుర్రహ్మాన్ బిన్ అజ్హర్ (రజిఅన్) ఈ ముగ్గురు ఆయన గారిని హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) గారి వద్దకు పంపారు మరియు ఇలా అన్నారు; 'మా అందరి తరఫున ఆమె (ర) గారికి సలాములు చెప్పు. మరియు ఇలా అడుగు; అసర్ నమాజు తరువాత రెండు రకాతులు సున్నత్ నమాజు చెయ్యటం ధర్మ సమ్మతమైన విషయమేనా? మీరు ఆ రెండు రకాతులను చేస్తూ ఉంటారని మాకు సమా చారం అందింది. ఇంకా మాకు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి ఈ హదీసును గురించి కూడా తెలిసింది. అదేమిటంటే, దైవప్రవక్త (స) ఆ రెండు రకాతులు చెయ్యకూడదని వారించారు.' హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు; 'నేనైతే హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారితో కలిసి ఆ రెండు రకాతులు చేసే వారిని కొడుతూ ఉండేవాణ్ణి. కురైబ్ ఇలా అన్నారు; నేను హజ్రత్ ఆయెషా (ర) గారి వద్దకు వెళ్ళాను. మరియు నేను నన్ను పంపినవారి సందేశాన్ని ఆమె (ర) గారికి అంద జేశాను. ఆమె (ర) గారు ఇలా అన్నారు; 'నీవు ఉమ్మె సలమా (రజిఅన్హా) గారి

వద్దకు వెళ్ళి ఆమె (ర) గారిని ఈ విషయం గురించి అడుగు. నేను తిరిగి నన్ను పంపినవారి వద్దకు వచ్చాను. హజ్రత్ ఆయెషా(ర) గారు చెప్పిన విషయాలను వారికి చెప్పాను. వారు మళ్ళీ నన్ను విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఉమ్మె సలమా (ర) గారి వద్దకు పంపారు. మరియు హజ్రత్ ఆయెషా (ర)కు చెప్పమన్న విషయాలనే ఆమె (ర)కు కూడా చెప్పమన్నారు. ఆమె (ర) గారు ఇలా అన్నారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారు చెబుతూ ఉండగా విన్నాను. ఆయన (స) గారు అసర్ నమాజు తరువాత నమాజు చెయ్యటాన్ని వారిస్తూ ఉండేవారు. ఆ తరువాత ఆయన (స) గారు అసర్ నమాజు చేసిన తరువాత ఈ రెండు రకాతులను చెయ్యటాన్ని నేను చూశాను. తరువాత ఆయన (స) నా వద్దకు విచ్చేశారు. ఆ సమయంలో అన్సారులలోని బనీ హరామ్ తెగకు చెందిన చాలామంది స్త్రీలు నా వద్ద కూర్చొని ఉన్నారు. నేను బానిస స్త్రీని ఆయన (స) గారి వద్దకు పంపాను.' మరియు ఆమెకు ఇలా చెప్పాను; నీవు ఆయన (స) గారి వద్దకుపోయి ఆయన (స) పక్కన నిలబడి ఇలా అడుగు, ఓ దైవప్రవక్తా(స)! మీరైతే ఈ 'దుగానా' నమాజును చెయ్యకూడదని వారిస్తూ ఉండేవారు కదా! ఇప్పుడేమో మీరు ఆ నమాజునే చేస్తూ ఉండటాన్ని నేను చూస్తున్నాను అని ఉమ్మె సలమా (ర) అంటున్నారు. ఒకవేళ ఆయన (స) గారు చేత్తో సైగచేస్తే అప్పుడు వెనక్కి జరగాలి. ఆ బానిస స్త్రీ ఆయన (స) వద్దకు పోయి ఈ విషయాన్నే చెప్పింది. ఆయన (స) గారు చేత్తో సైగ చేశారు. అప్పుడు ఆమె (ర) వెనక్కి తొలగిపోయింది. ఆయన (స)గారు నమాజు చెయ్యటం ముగించిన తరువాత (ఉమ్మె సలమా-ర)తో ఇలా అన్నారు; 'ఓ అబూ ఉమయ్యా కూతురా! నీవు అస్ర్ నమాజు తరువాత రెండు రకాతులు నమాజు చెయ్యటాన్ని గురించి అడిగావు. విషయమేమిటంటే, అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన కొందరు ప్రజలు నా వద్దకు వచ్చారు. వారితో నేను మాట్లాడుతూ ఉన్న కారణంగా జుహ్ర్ తరువాత చెయ్యవలసిన రెండు రకాతులు చెయ్యలేక పోయాను; 'ఇప్పుడు ఆ రెండు రకాతులను చేశాను.'

## 27వ అధ్యాయం

**నమాజులో సైగలు చెయ్యటం, సంకేతాలు ఇవ్వటం; ఈ విషయాన్ని కురైబ్ విశ్వాసుల తల్లి అయిన ఉమ్మె సలమా (ర.అ) గారి నుంచి నకలు చేశారు. ఆమె (ర) గారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి నుంచి నకలు చేశారు.**

**326.** సహ్లా బిన్ సాద్ సాయిదీ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన (ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారికి, బనీ అమ్ర్ బిన్ ఔఫ్ తెగకు చెందిన ప్రజల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తి వివాదాలు చెలరేగాయని సమాచారం అందింది. అప్పుడు ఆయన (స) గారు వారి మధ్య రాజీ కుదర్చటానికి కొంత మందిని తనతో తీసుకొని వారి వద్దకు వెళ్ళారు. అక్కడ నుంచి బయలు దేరటంలో ఆయన (స) గారికి ఆలస్యమైపోయింది. ఈ కారణం వల్ల ఆయన (స) అక్కడ ఆగి పోయారు. ఇక్కడ నమాజుకు సమయం ఆసన్నమైంది.' హజ్రత్ బిలాల్ (రజిఅన్) అబూ బకర్ (రజిఅన్) వద్దకు వెళ్ళి ఇలా అనసాగారు– 'ఓ అబూబకర్ (ర)! ప్రవక్త (స) గారైతే అక్కడ చిక్కుకుపోయారు. ఇక్కడ నమాజుకు సమయం అయిపోయింది. కనుక మీరు ప్రజలకు నమాజులో నాయకత్వం వహించగలరా?' ఆయన (ర) ఇలా అన్నారు, మంచిది. నీవు గనుక కోరితే నేను ఇమామత్ చేస్తాను. తరువాత హజ్రత్ బిలాల్ (ర) తక్బీర్ పలికారు. మరియు అబూ బకర్ సిద్దీఖ్ (ర) ముందుకు పోయి 'అల్లాహు అక్బర్' అని పలికారు. ఇంతలో ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) విచ్చేశారు. మరియు మొదటి పంక్తిలో నిలబడిపోయారు. ఆ సమయంలో ప్రజలు చప్పట్లు కొట్టడం ప్రారంభించారు. అబూ బకర్ (ర) నమాజులో ఉన్నప్పుడు ఏ వైపునకూ తన ధ్యానాన్ని మరల్చరు. ప్రజలు చాలా ఎక్కువగా చప్పట్లు కొట్టారు. అప్పుడు ఆయన (ర) తన దృష్టిని మరల్చి చూశారు. దైవప్రవక్త (స) నమాజులో నిలబడి కనిపించారు. ఆయన (స) అబూబకర్ సిద్దీఖ్ (ర)కు సైగచేసి ఇలా చెప్పారు; నీవు నమాజు చేయించు. (నీ స్థలంలోనే నిలబడి ఉండు). అప్పుడు అబూబకర్ (ర) తన రెండు చేతుల్ని ఎత్తి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మరియు వెనక్కి జరిగిపోయి పంక్తిలో నిలబడ్డారు. దైవప్రవక్త (స) ముందుకు పోయారు. ప్రజలకు నమాజు చేయించారు. నమాజును ముగించుకున్న తరువాత ఆయన (స) ప్రజల వైపునకు ముఖం పెట్టి ఇలా సెలవిచ్చారు; 'ప్రజలారా! మీకేమయింది? నమాజులో ఉన్నప్పుడు ఏదైనా ప్రమాదం సంభవిస్తే అతను 'సుబ్‌హానల్లాహ్' అని పలకాలి. ఎవడైతే వింటాడో అతను ఇటు వైపు ధ్యానాన్ని మరల్చుతాడు. ఓ అబూ బకర్! నీకు ఏమయింది? నేను నీకు సైగచేసి చెప్పినప్పుడు నీవు నమాజు ఎందుకు చేయించలేదు? హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (ర) ఇలా

విన్నవించుకున్నారు; 'బాగుంది! అబూ ఖహాఫ కుమారుడికి ఎంత ధైర్యం! దైవప్రవక్త (స) గారి సమక్షంలో నమాజు చేయించటమా!'

**327.** హజ్రత్ అస్మా బిన్తె అబీబకర్(ర) ఇలా ఉల్లేఖించారు; 'ఆమెగారు హజ్రత్ ఆయెషా (ర) వద్దకు వెళ్ళారు. అప్పుడు హజ్రత్ ఆయెషా (ర) ((గ్రహణానికి సంబంధించిన) నమాజును చేస్తూ ఉన్నారు. ప్రజలు కూడా నమాజులో నిలబడ్డారు. అస్మా (ర) ప్రజలకు ఏమయింది? అని అడిగారు. హజ్రత్ ఆయెషా (ర) తన శిరస్సుతో ఆకాశం వైపునకు సైగ చేశారు. అప్పుడు నేను ఇలా అన్నాను; 'ఏమిటి? ఏదైనా శిక్షకు సంబంధించిన సూచన కనిపించిందా?' ఆమె (ర) గారు, 'ఔను' అని శిరస్సుతో సైగచేసి తెలియజేశారు.

**328.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి భార్య అయిన హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె (ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త ముహమ్మద్ (స) గారు ఒకసారి అస్వస్థులైనప్పుడు, తన ఇంట్లో కూర్చొని నమాజు చేశారు. కొంతమంది ప్రజలు, ఆయన (స) గారి వెనుక నిలబడి నమాజు చేస్తున్నారు. ఆయన (స) వారిని కూర్చోమని సైగచేసి చెప్పారు. నమాజు చెయ్యటం ముగిసిన తరువాత ఆయన (స) ఇలా సెలవిచ్చారు; 'ఇమామ్‌ను ఎందుకు నియమిస్తారంటే, ప్రజలు అతన్ని అనుసరించాలని, అతను రుకూ చేసినప్పుడు, మీరు కూడా రుకూ చెయ్యాలి. అతను తన శిరస్సును ఎత్తినప్పుడు మీరు కూడా మీ శిరస్సును పైకి ఎత్తాలి.'

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# జనాయిజ్ ప్రకరణం

## జనాజాలకు సంబంధించిన ఆజ్ఞల ప్రకరణం

### 1వ అధ్యాయం

జనాజాలను గురించి వచ్చిన ప్రస్తావన. ఏ మనిషి అయితే చివరిసారిగా 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే మాటలు పలుకుతాడో ఆ మనిషిని గురించి, వహబ్ బిన్ మునబ్బిహ్‌ను ఎవరో ఇలా అడిగారు; 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే పవిత్ర వచనం స్వర్గలోకానికి తాళపు చెవి కాదా! ఆయన ఇలా సమాధానం చెప్పారు; 'ఎందుకు కాదు? కాని ప్రతి తాళపు చెవికి దంతాలు అనేవి తప్పకుండా ఉండాలి. ఒకవేళ దంతాలుగల తాళపు చెవిని తీసుకువస్తే అప్పుడు తాళం తెరుచుకుంటుంది లేకపోతే తెరచుకోదు.'

**329.** అబూజర్ గిఫ్ఫారీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన (ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; ఒకసారి నా వద్దకు (ఒక స్వప్నంలో) నా దగ్గరకు వస్తూ ఉండే ఒక దైవదూత ప్రభువు వద్ద నుంచి వచ్చాడు. అతను ఇలా వివరించాడు; లేక నాకు ఈ శుభవార్తను అందజేశాడు. 'నా సంఘానికి చెందిన ఏ మనిషి అయినా అల్లాహ్‌తో పాటు ఎవరినీ భాగస్వాములుగా నిలబెట్టని స్థితిలో మరణించినట్లయితే అప్పుడు అతను స్వర్గంలోకి ప్రవేశిస్తాడు'. నేను (ర) ఇలా విన్నవించుకున్నాను; 'ఒకవేళ అతడు వ్యభిచారం చేసినా లేక దొంగతనం చేసినా స్వర్గంలోకి ప్రవేశిస్తాడా?' అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'అతడు వ్యభిచారం చేసినా లేక దొంగతనం చేసినా స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.'

**330.** హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఆయన (ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అన్నారు. 'ఏ మనిషైతే షిర్క్ (దేవుని దైవత్వంలో ఇతరుల్ని భాగస్వాములుగా చేయటం) చేసిన స్థితిలో మరణిస్తాడో ఆ మనిషి నరకంలోకి పోతాడు'. నేను ఇలా అంటున్నాను, ఏ మనిషైతే అల్లాహ్‌తో పాటు మరెవ్వరినీ భాగస్వాములుగా చెయ్యని స్థితిలో మరణిస్తాడో అతను స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.'

## 2వ అధ్యాయం

## జనాజాలో పాల్గొనే ఆదేశం

**331.** బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఏడు విషయాలు చెయ్యమని మమ్మల్ని ఆజ్ఞాపించారు. మరియు ఏడు విషయాల నుండి వారించారు. ఆయన (స) ఇలా ఆజ్ఞాపించారు; 1) జనాజాతో పాటు వెళ్ళమని, 2) రోగులను పరామర్శించమని, 3) ఆహ్వానాన్ని స్వీకరించమని, 4) పీడితులకు సహాయపడమని, 5) ప్రమాణాలను నెరవేర్చమని, 6) సలామ్‌కు జవాబు ఇవ్వమని, 7) తుమ్మినవారి కోసం ప్రార్థించమని.'

ఆయన (స) ఏడు విషయాల నుండి వారించారు: 'వెండి పళ్ళాలు, బంగారపుటుంగరాలు, పట్టు వస్త్రాలు, దిబాజ్ (స్వచ్ఛమైన సిల్కు వస్త్రం), ఖిస్సి మరియు ఇస్‌తబ్‌రఖ్ (ఈ రెండు కూడా రెండు రకాల సిల్కు వస్త్రాలు).'

**332.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను అని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; 'ఆయన (స) ఇలా సెలవిచ్చారు; ఒక ముస్లిమ్‌కు మరొక ముస్లింపై ఐదు హక్కులు ఉన్నాయి. అవి ఏమిటంటే, సలామ్ చేస్తే జవాబు ఇవ్వటం, వ్యాధిగ్రస్తుడైతే అతని వద్దకు పోయి పరామర్శించటం, అతని జనాజా వెంట వెళ్ళటం, ఆహ్వానాన్ని అంగీకరించటం, తుమ్ముకు జవాబు ఇవ్వటం.

## 3వ అధ్యాయం

## శవాన్ని కఫన్‌లో చుట్టబడినప్పుడు, శవదర్శనం కోసం అక్కడకు పోవటం మరియు అతన్ని చూడటం[1]

**333.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి భార్య అయినటువంటి హజ్రత్ ఆయెషా సిద్దీఖా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; (దైవప్రవక్త (స) గారు పరమపదించినప్పుడు) హజ్రత్ అబూబకర్ (రజిఅన్) అస్‌సున్‌లో ఉన్నటువంటి తమ నివాసం నుంచి ఒక గుర్రం మీద ఎక్కి వచ్చారు. గుర్రం మీద నుంచి క్రిందికి దిగి

3-1. కొంతమంది అలా చెయ్యకూడదని వారించారు. ఇంకా వారు ఇలా అన్నారు; 'గుసుల్ ఇచ్చే వారూ మరియు సంరక్షకులు తప్ప ఇతరులెవరూ శవాన్ని చూడకూడదు. ఇమామ్ బుఖారి (రహ్మాలై) వీటిని ఖండించారు.'

మసీదులోకి వెళ్ళారు. ఎవరితోనూ ఆయన మాట్లాడలేదు. తరువాత ఆయన హజ్రత్ ఆయెషా (ర) గారి కుటీరంలోనికి వెళ్ళారు. అక్కడ ఆయన దైవప్రవక్త (స) గారిని చూస్తూ ఉండి పోయారు. ఆయన (స) గారిపై చారలు ఉన్న యమన్ దేశానికి చెందిన ఒక దుప్పటిని కప్పారు. అబూబకర్ సిద్దీఖ్ (ర) గారు దైవ ప్రవక్త (స) గారి ముఖం మీద ఉన్న ముసుగును తొలగించారు. నేలపై మోకాళ్ళమీద పడి దైవప్రవక్త (స) గారిని ముద్దుపెట్టుకున్నారు. తరువాత విలపించారు. మరియు ఇలా అన్నారు:

'ఓ అల్లాహ్ ప్రవక్తా (స)! నా తల్లిదండ్రులు మీ కోసం అర్పితమవుగాక! అల్లాహ్ మీకు మరొకసారి మరణాన్ని ఇవ్వడు. కనుక ఏ మరణాన్నయితే అల్లాహ్ మీ భాగంలో రాసిపెట్టాడో ఆ మరణం వచ్చేసింది.' అబూ సలమా (రజిఅన్) ఇలా అన్నారు; ఇబ్నె అబ్బాస్ (ర) నాతో ఇలా అన్నారు; 'అబూబకర్ సిద్దీఖ్ (ర) దీని తరువాత ఆయెషా (ర) గారి గదిలో నుంచి బయటికి వచ్చారు. హజ్రత్ ఉమర్ (ర) ప్రజలతో మాట్లా డుతూ ఉన్నారు. అప్పుడు అబూబకర్ (ర) ఇలా అన్నారు; ఓ ఉమర్! కూర్చోండి. ఆయన (ర) కూర్చోలేదు. తరువాత అబూబకర్ (ర) మళ్ళీ అన్నారు. 'ఓ ఉమర్! కూర్చోండి.' కాని ఆయన వినలేదు. చివరకు అబూబకర్ (ర) కలిమయె షహాదత్‌ను పఠించారు. అప్పుడు ప్రజలందరూ ఆయన వైపునకు మరలారు. హజ్రత్ ఉమర్ (ర)ను వదిలేశారు. అబూబకర్ (ర) ఇలా అన్నారు; అమ్మాబాద్! చూడండి! ముస్లిములారా! మీలో ఎవరైనా ఒకవేళ ముహమ్మద్ (స)ను పూజిస్తూ ఉంటే, ముహమ్మద్ (స) అయితే మరణించారు. ఎవరైతే అల్లాహ్‌ను పూజిస్తూ వచ్చారో వారు భయపడవలసిన పనిలేదు. అల్లాహ్ ఎల్లప్పుడూ సజీవంగా ఉంటాడు, అల్లాహ్ ఎన్నటికీ మరణించడు. తరువాత ఆలి ఇమ్రాన్ సూరాలోని ఈ ఆయత్‌ను పఠించారు. 'ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కారు. ఆయనకు పూర్వం ఎందరో ప్రవక్తలు గతించారు.' అల్లాహ్ సాక్షిగా! అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడని ప్రజలకు తెలియనే తెలియదు. చివరకు అబూబకర్ (ర) దానిని చదివినప్పుడు ప్రజలు నేర్చుకున్నారు. ఆ తరువాత ఎవరి నోట విన్నా ఆ ఆయత్‌నే పారాయణం చేస్తున్నారు.

**334.** ఖారిజా బిన్ జైద్ బిన్ సాబిత్ ఇలా ఉల్లేఖించారు; అతనితో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి సమక్షంలో బైఅత్ (ప్రమాణం) చేసిన ఉమ్ముల్

అలా అనే ఒక అన్సారీ మహిళ ఇలా అన్నారు; 'ముహాజిర్లు (వలసపోయినవారు) లాటరీ ద్వారా అన్సారులకు పంపిణీ చేయబడ్డారు. మా భాగంలో ఉస్మాన్ బిన్ మజ్వూన్ వచ్చారు. మేము అతన్ని మా గృహాలకు తీసుకుపోయాము. తరువాత ఆయన ఒక వ్యాధికి గురి అయ్యారు. ఆ వ్యాధితోనే ఆయనకు మరణం సంభవించింది. ఆయన మరణించి నప్పుడు ఆయనకు గుసుల్ ఇవ్వటం జరిగింది. ఆయనకు కఫన్ వస్త్రాలు తొడిగించ బడ్డాయి.' అప్పుడు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) అక్కడకు విచ్చేశారు. నేను ఇలా అన్నాను; 'ఓ అబూ అసాయబ్! (ఇది ఉస్మాన్ గోత్ర నామం) అల్లాహ్ నీపై కరుణజూపుగాక! నేనైతే ఇలా సాక్ష్యమిస్తున్నాను! అల్లాహ్ నీకు గౌరవ మర్యాదలను ప్రసాదించాడు'. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'ఓ ఉమ్ముల్ అలా! ఇతనికి అల్లాహ్ గౌరవాన్ని ప్రసాదించాడని నీకు ఎలా తెలిసింది?' అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను. 'ఓ అల్లాహ్ ప్రవక్తా! మీపై నా తల్లిదండ్రులు సదఖా! అయితే అల్లాహ్ ఎవరికి గౌరవాన్ని ప్రసాదిస్తాడు?' దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు. 'ఉస్మాన్ అయితే చనిపోయారు. నిస్సందేహంగా దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. అతనికి మేలు జరుగుతుందని నేను కూడా ఆశిస్తున్నాను. కాని దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేను దైవప్రవక్తను అయినప్పటికీ నా స్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు.' ఉమ్ముల్ అలా ఇలా అన్నారు; 'దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను! దీని తరువాత నేను ఎవరి పవిత్రతను ధృవీకరిస్తూ మాట్లాడలేదు.'

**335.** మాతో సయీద్ బిన్ ఉఫైర్ వివరించారు; ఆయన ఇలా అన్నారు; మాతో అల్లైస్ పైన వచ్చిన హదీసు లాంటి హదీసునే ఉల్లేఖించారు. నాఫె అఖీల్ నుండి ఇలా ఉల్లేఖించారు; ఉస్మాన్ స్థితి ఎలా ఉంటుందో నేను ఎరుగను. అఖీల్‌తో పాటు ఈ హదీసును షుఐబ్ మరియు అమ్ర్ బిన్ దీనార్ మరియు మామర్ వివరించారు.

**336.** జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన (ర) ఇలా అన్నారు; 'నా తండ్రి గారైన అబ్దుల్లా బిన్ అమ్ర్ ఉహుద్ సంగ్రామంలో హత్య చెయ్యబడినప్పుడు, నేను ఆయనగారి ముఖం మీద నుంచి వస్త్రాన్ని తొలగించి విలపించసాగాను. ప్రజలు ఏడ్వవద్దని నన్ను వారించారు. కాని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నన్ను వారించలేదు. నా మేనత్త అయిన హజ్రత్ ఫాతిమా (ర) ఏడ్వసాగారు. దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; 'నీవు విలపించినా,

విలపించకపోయినా అబ్దుల్లా (నీ సోదరుడు) స్థితి అయితే అక్కడ ఇలా ఉంది; దైవదూతలు తమ రెక్కల ఛాయతో అతన్ని కప్పివేశారు, మీరు అతన్ని అక్కడ నుంచి ఎత్తుకుపోయే వరకు.' షూబాతో పాటు ఇబ్నె జురైజ్ కూడా ఈ హదీసును ఉల్లేఖించారు మరియు ఇలా అన్నారు; నాతో ముహమ్మద్ బిన్ మున్కదిర్ ఇలా వివరించారు. ఆయన జాబిర్ బిన్ అబ్దుల్లా చెబుతూ ఉండగా విన్నారు.

## 4వ అధ్యాయం

### ఒక మనిషి స్వయంగా మరణవార్తను మృతుని వారసులకు వినిపించగలడు

**337.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) హబష్ దేశ రాజు అయిన నజాషి మరణం గురించి అతను మరణించిన రోజే ప్రజలకు తెలియజేశారు. మరియు ఈద్గాహ్‌కు వెళ్ళి ప్రజలచేత నమాజుల పంక్తులు కట్టించారు. నాలుగు తక్బీర్‌లు పఠించారు.

**338.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మూతా యుద్ధం (గజ్వాయె మూతా) గురించి ప్రస్తావించినప్పుడు, ఇలా సెలవిచ్చారు; 'మొదట జైద్ (రజిఅన్) జెండాను పట్టుకున్నారు. ఆయన అమరగతి పొందారు. తరువాత జాఫర్ (రజిఅన్) జెండాను పట్టుకున్నారు. ఆయన కూడా అమరగతిని పొందారు. ఆ తరువాత అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజిఅన్) ధ్వజం పట్టుకున్నారు. ఆయన కూడా అమరగతులయ్యారు.' దైవప్రవక్త (స) గారు ఈ విషయాలు సెలవిస్తూ ఉండగా ఆయన (స) గారి కళ్ళనుంచి అశ్రువులు ధారాప్రవాహంగా కారుతూ ఉన్నాయి. 'తరువాత ఖాలిద్ బిన్ వలీద్ (రజిఅన్) జెండాను పట్టుకున్నారు. ఆయన్ని నేను సైన్యాధిపతిగా నియమించలేదు; కాని అల్లాహ్ ఆయనకు విజయాన్ని ప్రసాదించాడు.'

## 5వ అధ్యాయం

**జనాజా గనక తయారుగా ఉంటే ప్రజలకు తెలియజెయ్యాలి. అబూరాఫె, అబూ హురైరా (రజిఅన్) నుంచి ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ప్రజలనుద్దేశించి ఇలా సెలవిచ్చారు; 'మీరు నాకు ఎందుకు కబురు పెట్టలేదు.'**

**339.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; "ఒక మనిషి చనిపోయాడు. అతన్ని పరామర్శించటానికి దైవప్రవక్త (స) అతని ఇంటికి పోతూ ఉండేవారు. అతను రాత్రి సమయంలో మరణించాడు. అదేరాత్రి ప్రజలు అతన్ని ఖననం చేశారు. తెల్లవారిన తరువాత దైవప్రవక్త (స) గారికి ఈ విషయాన్ని తెలియజేశారు. ఆయన (స) ఇలా సెలవిచ్చారు; 'జనాజాను తయారుచేసేటప్పుడు మీరు నాకు ఎందుకు ఈ విషయాన్ని తెలియజెయ్యలేదు?' వారు ఇలా అన్నారు; 'అది రాత్రి సమయం, బాగా చీకటి పడిపోయింది. మిమ్మల్ని కష్టపెట్టడం మంచి విషయంగా మాకు అనిపించలేదు.' చివరకు దైవప్రవక్త (స) గారు అతని సమాధి వద్దకు వెళ్ళారు. మరియు నమాజు చేశారు.

## 6వ అధ్యాయం

**ఎవరి పిల్లవాడైతే మరణిస్తాడో వారు సహనం వహించాలి. దాని ఔన్నత్యం గురించి. బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు, 'సహనం వహించే వారికి శుభవార్తను వినిపించు.'**

**340.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు. 'ఒక ముస్లిమ్‌కు చెందిన యుక్తవయస్సుకు చేరని ముగ్గురు పిల్లలు మరణించినట్లయితే, అప్పుడు అల్లాహ్ అతన్ని స్వర్గంలోకి తీసుకు పోతాడు, ఆ పిల్లలపై ఆయనకున్న మహా కరుణ కారణంగా.

**341.** అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; మహిళలు దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారితో ఇలా విన్నవించుకున్నారు; 'ఓ దైవ ప్రవక్తా (స)! మీ ప్రసంగాన్ని మాకు వినిపించటానికి మా కోసం ఒక దినాన్ని నిర్ణయిం చండి'. వారు కోరిన ప్రకారం ఆయన (స) ఒక దినాన్ని నిర్ణయించారు. ఆయన (స) వారిని ఉద్దేశించి, ఒక ప్రసంగం చేశారు. అందులో ఆయన (స) ఇలా సెలవిచ్చారు; 'ఒక స్త్రీకి చెందిన ముగ్గురు పిల్లలు ఎవరైనా మరణిస్తే, వారు ప్రళయదినం నాడు ఆ స్త్రీకీ, నరకానికీ మధ్య అడ్డంగా, ఒక తెరగా నిలబడతారు.' అప్పుడు ఒక స్త్రీ (ఉమ్మె సులైమ్ –ర) మహాప్రవక్త (స)గారితో ఇలా విన్నవించుకుంది. 'ఓ దైవప్రవక్తా! ఒకవేళ ఇద్దరు పిల్లలు మరణిస్తేనో?' ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'ఇద్దరు మరణించినా సరే.'

**342.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; 'ఒక ముస్లిమ్‌కు చెందిన ముగ్గురు పిల్లలు గనక మరణిస్తే, అప్పుడు అతను కేవలం ప్రమాణాన్ని నెరవేర్చటానికే నరకానికి పోతాడు.'[1]

## 7వ అధ్యాయం

**ఒక స్త్రీ సమాధి వద్ద ఉన్నప్పుడు, ఒక పురుషుడు ఆమెతో 'సహనం వహించు' అని అనటం.**

**343.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స), ఒక స్త్రీ ఒక సమాధి వద్ద కూర్చొని ఏడుస్తూ ఉండటాన్ని గమనించారు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; 'అల్లాహ్‌కు భయపడు మరియు సహనంతో ఉండు.'

## 8వ అధ్యాయం

మయ్యిత్‌కు నీళ్ళతోనూ మరియు రేగిచెట్టు ఆకులతోనూ గుసుల్ ఇవ్వటం, మరియు ఉజూ చేయించటం. మరియు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) సయీద్ బిన్ జైద్ గారి పిల్లవానికి (అతను చనిపోయాడు) అత్తరు పూశారు. అతన్ని ఎత్తుకున్నారు. ఆ తరువాత నమాజె జనాజా చేశారు. అప్పుడు ఆయన ఉజూ చేసుకో లేదు. ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు; 'ముస్లిమ్ జీవించి ఉన్నంతకాలం అప విత్రుడు కాడు. మరియు మరణించిన తరువాత కూడా అపవిత్రుడు కాడు.' సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజిఅన్) ఇలా అన్నారు; 'ఒకవేళ మృతుడు గనక నజస్ (అప విత్రుడు) అయితే నేను అతన్ని తాకను.' దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; 'ఒక విశ్వాసి అపవిత్రుడు కాడు.'

---

342-1. అంటే, అతి తక్కువ కాలం వరకు మాత్రమే అని భావం. ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది; తరువాత సుఫ్యాన్ ఖుర్ఆన్ గ్రంథంలోని ఈ వాక్యాన్ని పఠించారు. 'నరకం మీదుగా ప్రయాణించనివాడు మీలో ఎవ్వడూ లేడు'. అంటే విశ్వాసి అవిశ్వాసి అందరూ 'పుల్‌సిరాత్' మీదుగా ప్రయాణిస్తారు. అది నరకం వీపు మీద ఉంది. కనుక ఒక విశ్వాసి నరకంలోకి పోవటం అంటే, ఈ విధంగా పుల్‌సిరాత్ మీదుగా ప్రయాణించటమే. కొందరు ఏమన్నా రంటే విశ్వాసులు నరకంలోకి ప్రవేశిస్తారు. తరువాత అందులో నుంచి తక్షణం నిష్క్రమి స్తారు. అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) కూడా ఇలానే అన్నారు.

**344.** ఉమ్మె అతియ్యా అల్ అన్సారియా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి పుత్రిక (హజ్రత్ జైనబ్) మరణించినప్పుడు, ఆయన (స) గారు మా వద్దకు విచ్చేశారు. మరియు ఇలా సెలవిచ్చారు; ఆమెకు మూడుసార్లుగాని లేక అవసరమని భావిస్తే, అప్పుడు ఐదుసార్లు లేక ఎక్కువసార్లుగాని నీళ్ళు రేగిచెట్టు ఆకులతో స్నానం చేయించండి. మరియు చివర్లో కర్పూరాన్ని ఆమెకు పూయండి. లేదా కొంత కర్పూరాన్ని కలపండి. తరువాత స్నానం చేయించటాన్ని మీరు ముగించిన తరువాత నన్ను పిలిపించండి.' ఉమ్మె అతియ (ర) ఇలా అన్నారు; 'మేము స్నానం చేయించటాన్ని ముగించిన తరువాత ఆయన (స) గారికి కబురుపెట్టాము. అప్పుడు ఆయన (స) తన తహబంద్‌ను ఇచ్చారు, మరియు ఇలా అన్నారు; దీనిని లోపల ఆమె శరీరానికి చుట్టివెయ్యండి.'

## 9వ అధ్యాయం

**మృతదేహాన్ని బేసి సంఖ్యగల దఫాలు స్నానం చేయించటం అభిలషణీయమైన విషయమే.**

**345.** ఉమ్మె అతియ్యా (రజిఅన్) ఉల్లేఖించారు; ఆమె ఇలా అన్నారు; 'ఒకసారి దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మా వద్దకు విచ్చేశారు. మేము అప్పుడు ఆయన (స) గారి కుమార్తె మృతదేహానికి గుసుల్ ఇస్తూ ఉన్నాము. ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "ఆమెకు మీరు నీళ్ళతోనూ మరియు రేగిచెట్టు ఆకులతోనూ మూడు సార్లుగానీ లేక అయిదుసార్లుగానీ లేక ఇంకా ఎక్కువసార్లు గాని స్నానం చేయించండి. చివరిసారి కర్పూరాన్ని కలపండి. గుసుల్ చేయించటం పూర్తిచేసిన తరువాత నాకు కబురు పంపండి." మేము స్నానం చేయించటాన్ని ముగించిన తరువాత కబురు పెట్టాము. అప్పుడు ఆయన (స) గారు తన తెహబంద్‌ను మా వైపునకు విసిరివేశారు. ఇంకా ఇలా సెలవిచ్చారు; 'దీనిని లోపల ఆమె శరీరానికి చుట్టివెయ్యండి.' అయ్యూబ్ ఇలా అన్నారు; మరియు హఫ్సా బిన్తె సీరీన్ కూడా నాతో ముహమ్మద్ బిన్ సీరీన్ మాదిరిగా ఈ హదీసును వివరించారు. హఫ్సా (రజిఅన్) గారి హదీసులో ఇలా ఉంది; ఆమెకు బేసి సంఖ్యగల దఫాలు స్నానం చేయించండి. మూడుసార్లు లేక ఐదు సార్లు లేక ఏడుసార్లు. మరియు ఇలా కూడా ఉంది; కుడివైపు నుంచి ప్రారంభించండి. మరియు వుజూకు సంబంధించిన భాగాలతో. అందులో ఇలా కూడా ఉంది; ఉమ్మె అతియ్యా

ఇలా అన్నారు; 'మేము ఆమెగారి తల వెంట్రుకలను దువ్వెనతో దువ్వి మూడు జడలు వేశాము.'

## 10వ అధ్యాయం

**మృతదేహానికి ఇచ్చే గుసుల్‌ను కుడి వైపు నుండి ప్రారంభించాలి.**

**346.** ఉమ్మె అతియ్యా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె (ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) తన కుమార్తెకు గుసుల్ ఇచ్చే సమయంలో ఇలా సెలవిచ్చారు; 'గుసుల్‌ను ఆమె కుడి వైపు నుంచి మరియు వుజూ చేసుకునే భాగాల నుంచి ప్రారంభించండి.'

## 11వ అధ్యాయం

**మృతదేహానికి ఇచ్చే గుసుల్‌ను వుజూ చేసుకునే శరీర భాగాల నుంచి ప్రారంభించటం.**

**347.** ఉమ్మె అతియ్యా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె గారు ఇలా అన్నారు; 'మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి ప్రియపుత్రికకు స్నానం చేయించినప్పుడు, మేము ఆమెగారికి స్నానం చేయిస్తూ ఉన్న సమయంలో ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; కుడివైపు శరీర భాగాల నుంచి మరియు వుజూ చేసుకునే శరీర భాగాల నుంచి గుసుల్‌ను ప్రారంభించండి.'

## 12వ అధ్యాయం

**మహిళకు ఉపయోగించే కఫన్‌లో పురుషుడు తన నడుముకు చుట్టుకునే బట్టను చేర్చవచ్చునా?**

**348.** ఉమ్మె అతియ్యా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె (ర) గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి ఒక కుమార్తె మరణించారు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "ఆమెకు మూడుసార్లు స్నానం చేయించండి. లేదా అవసరం అనుకుంటే, అప్పుడు ఐదుసార్లు స్నానం చేయించండి. లేదా ఇంకా ఎక్కువసార్లు అయినా సరే- తరువాత స్నానం చేయించటాన్ని ముగించిన తరువాత- నాకు కబురు పెట్టండి". మేము స్నానాన్ని ముగించిన తరువాత ఆయన (స) గారికి తెలియజేశాము. అప్పుడు ఆయన (స) తన నడుముకు కట్టుకునే బట్టను తీసి ఇచ్చారు. మరియు ఇలా అన్నారు; దీనిని ఆమె లోపలి భాగంలో చుట్టండి.'

## 13వ అధ్యాయం

### చివరిసారి గుసుల్‌లో కర్పూరాన్ని చేర్చటం

**349.** ఉమ్మె అతియ్యా (రజిఅన్‌హా) ఇలా అన్నారని ముహమ్మద్ బిన్ సీరీన్ ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి ఒక కుమార్తె మరణించారు. దైవప్రవక్త (స) అక్కడకు విచ్చేసి ఇలా సెలవిచ్చారు; "ఆమెకు మూడుసార్లు గాని, అవసరం అనుకుంటే అయిసార్లుగాని లేదా దానికంటే కూడా ఎక్కువ నీళ్ళతో, రేగి చెట్టు ఆకులతో స్నానం చేయించండి, మరియు చివర్లో కర్పూరాన్ని చేర్చండి. లేక కాస్తంత కర్పూరాన్నయినా చేర్చండి. స్నానం చేయించటం ముగిసిన తరువాత నాకు కబురు పెట్టండి". ఉమ్మె అతియ్యా (ర) ఇలా అన్నారు; 'స్నానం చేయించటాన్ని పూర్తి చేసిన తరువాత మేము ఆయన (స) గారికి కబురుపెట్టాము. అప్పుడు ఆయన (స) గారు తన నడుముకు కట్టుకునే బట్టను మా వైపునకు విసరివేశారు. మరియు ఇలా అన్నారు; 'ఈ బట్టను లోపలి వస్త్రంగా చేసుకోండి.' అయ్యూబ్ హఫ్సా బిన్తె సీరీన్ నుంచి, ఆమెగారు ఉమ్మె అతియ్యా (ర) నుంచి ఇలాగే ఉల్లేఖించారు. అందులో ఇలా ఉంది; దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'మూడుసార్లుగాని లేక ఐదుసార్లుగాని లేక ఏడుసార్లుగాని లేక అవసరమయితే దానికంటే ఎక్కువసార్లుగాని స్నానం చేయిం చండి.' హఫ్సా (ర) ఇలా అన్నారు; ఉమ్మె అతియ (ర) ఇలా అన్నారు; మేము ఆమె గారి శిరోజాలను మూడు పాయలుగా చేసి మూడు జడలు వేశాము.

## 14వ అధ్యాయం

**మృతదేహం గనక ఒక మహిళది అయినట్లయితే, గుసుల్ చేయించే సమయంలో ఆమె తలవెంట్రుకలను విడదీయటం. ఇబ్నె సీరీన్ ఇలా అన్నారు; స్త్రీ తల వెంట్రుకలను విడదీయటం అంత చెడ్డ విషయమేమీ కాదు.**

**350.** ఉమ్మె అతియ్యా (రజిఅన్‌హా) ఇలా అన్నారని హఫ్సా బిన్తె సీరీన్ ఉల్లేఖించారు; 'స్త్రీలు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి కుమార్తె తల వెంట్రుకలను విడదీసి వాటిని కడిగి మూడు భాగాలుగా చేశారు. ఆ తరువాత వాటిని మూడు జడలుగా చేశారు.'

## 15వ అధ్యాయం

**351.** ఇబ్నె సీరీన్ ఇలా ఉల్లేఖించారు; 'ఉమ్మె అతియ్యా (రజిఅన్‌హా) అన్సారీ

తెగకు చెందిన ఒక మహిళ. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి పట్ల విశ్వాసాన్ని, విధేయతను ప్రకటించిన స్త్రీలలోని ఒక స్త్రీ. ఆమెగారు తన కుమారుణ్ణి చూడటానికి త్వరత్వరగా బస్రాకు వచ్చారు. కాని అతను ఆమెకు అక్కడ కనిపించలేదు. (అతను ఇదివరకే మరణించాడు లేక ఎక్కడికో వెళ్ళిపోయాడు).' ఆమెగారు ఇలా వివరించారు; దైవప్రవక్త (స) మా వద్దకు వచ్చారు; మేము ఆయన (స) గారి కుమార్తెకు గుసుల్ చేయిస్తూ ఉన్నాము. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'మూడు సార్లు గాని లేదా ఐదుసార్లు గాని లేదా అవసరమనుకుంటే ఎక్కువసార్లు గాని నీళ్లతోనూ రేగి చెట్టు ఆకులతోనూ ఆమెకు స్నానం చేయించండి. చివర్లో కర్పూరాన్ని చేర్చండి. స్నానం చేయించటం ముగిసిన తరువాత నాకు కబురు పెట్టండి. ఉమ్మె అతియ్యా (రజిఅన్హా) ఇలా అన్నారు; మేము ఆమె గారికి స్నానం చేయించి దైవప్రవక్త గారికి కబురు పెట్టాము. ఆయన (స) నడుముకు చుట్టుకునే తన వస్త్రాన్ని మా వైపునకు విసరి ఇలా సెలవిచ్చారు; 'ఈ వస్త్రంతో లోపలి శరీర భాగాన్ని చుట్టాలి.' కనుక ఉమ్మె అతియ్యా (ర) ఈ విషయాలను మాత్రమే వివరించారు. 'ఆ మృతదేహం దైవప్రవక్త (స) గారి ఏ కుమార్తెకు చెందినదో నాకైతే తెలియదు.'

## 16వ అధ్యాయం

**మరణించిన స్త్రీ తల వెంట్రుకలను మూడు పాయలుగా చేసి మూడు జడలుగా మెలివెయ్యాలి.**

**352.** ఉమ్మె అతియ్యా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమెగారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి కుమార్తె మృతదేహానికి చెందిన తల వెంట్రుకలను మేము మూడు భాగాలుగా చేసి వాటిని మూడు జడలుగా మెలివేశాము. సుఫ్యాన్ ఇలా అన్నారని వకీ ఉల్లేఖించారు; ఒక జడను నుదుటి వైపునకు మరియు ఇతర రెండు జడలను శిరస్సుకు రెండు వైపులా వదిలేశాము.'

## 17వ అధ్యాయం

**స్త్రీ మృతదేహానికి చెందిన తలవెంట్రుకలను మూడు భాగాలు చేసి మూడు జడలుగా అల్లి ఆమె వీపు వైపునకు వెయ్యాలి.**

**353.** ఉమ్మె అతియ్యా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమెగారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి ఒక కుమార్తె చనిపోయారు. అప్పుడు ఆయన (స) గారు మా వద్దకు వచ్చి ఇలా సెలవిచ్చారు; ఆమెకు రేగి చెట్టు ఆకులను కలిపిన నీళ్లతో స్నానం చేయించండి; బేసి సంఖ్యగల దఫాలు స్నానం చేయించండి. అంటే మూడుసార్లు లేక ఐదుసార్లు లేక దానికంటే ఎక్కువసార్లు –ఒకవేళ అవసరమని భావిస్తే. మరియు చివర్లో కర్పూరాన్ని లేక ఇలా సెలవిచ్చారు; కొంచెం కర్పూరాన్ని కలపండి. స్నానం చేయించటం పూర్తి అయిన తరువాత నాకు కబురుపెట్టండి. మేము స్నానం చేయించటాన్ని ముగించిన తరువాత ఆయన (స) గారికి తెలియజేశాము. అప్పుడు ఆయన (స) తన నడుముకు చుట్టుకునే బట్టను మా వైపునకు విసరివేశారు. మేము మృతదేహం తల వెంట్రుకలను మూడు జడలుగా అల్లి ఆమెగారి వీపు వెనుక వేశాము.'

## 18వ అధ్యాయం

### కఫన్ కోసం తెల్లని వస్త్రాలు ఉపయోగించటం.

**354.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారిని యమన్ దేశానికి చెందిన ఉతకబడిన మూడు తెల్లని వస్త్రాలలో కఫన్ చెయ్యటం జరిగింది. వాటిలో చొక్కాలేదు, అమామా కూడా లేదు.'

## 19వ అధ్యాయం

### రెండు వస్త్రాలలో కఫన్ ఇవ్వటం.

**355.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన (ర) ఇలా అన్నారు; ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారితో అరఫాత్లో కలిసి ఉన్నాడు. ఇంతలోనే అతను తన ఒంటె మీద నుంచి క్రిందపడిపోయాడు. అయ్యూబ్ ఇలా అన్నారు; 'ఒంటె అతని మెడను విరిచివేసింది.' మరియు అమ్ర్ ఇలా అన్నారు; అతను క్రిందపడిపోగానే ఒంటె అతన్ని చంపివేసింది. అతను చనిపోయాడు.' దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; అతనికి రేగిచెట్టు ఆకులు కలిపిన నీళ్లతో స్నానం చేయించండి. మరియు రెండు వస్త్రాలలో కఫన్ ఇవ్వండి. అతనికి పరిమళ ద్రవ్యాలు పూయకండి మరియు అతని ముఖాన్ని కప్పివేయండి. ఎందుకంటే ప్రళయదినం నాడు అతను లబ్బైక్ పలుకుతూ లేస్తాడు.

## 20వ అధ్యాయం

## మృతదేహానికి పరిమళాలు పూయటం.

**356.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒక వ్యక్తి ఇహ్రామ్ కట్టుకున్న స్థితిలో ఉన్నాడు. తాను స్వారీ చేస్తున్న ఒంటె అతన్ని క్రిందపడేసి అతని మెడను విరిచివేసింది. అప్పుడు మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారితో కలిసి ఉన్నాము. ఆయన (స) ఇలా సెలవిచ్చారు; 'మీరు ఇలా చెయ్యండి, రేగి వృక్షపు ఆకులు కలిపిన నీళ్లతో అతనికి గుసుల్ ఇవ్వండి. మరియు రెండు వస్త్రాలలో అతనికి కఫన్ ఇవ్వండి. పరిమళం పూయకండి. ఇంకా అతని తలను కప్పకండి; ఎందుకంటే, అల్లాహ్ అతన్ని ప్రళయదినం నాడు ఇహ్రామ్ స్థితిలోనే లేపుతాడు. అప్పుడు అతను లబ్బైక్ అని పలుకుతూ ఉంటాడు.'

## 21వ అధ్యాయం

## 'హజ్'కోసం గాని లేక 'ఉమ్రా' కోసంగానీ ఇహ్రామ్ స్థితిని స్వీకరించిన వ్యక్తికి (ముహ్రిమ్) కఫన్ ఎలా ఇవ్వాలి?

**357.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'ఒకసారి ముహ్‌రిమ్ అయిన ఒక వ్యక్తి మెడను అతని ఒంటె విరిచేసింది. అప్పుడు మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి వద్ద ఉన్నాము. ఆయన (స) ఇలా సెలవిచ్చారు; అతనికి రేగి చెట్టు ఆకులను కలిపిన నీళ్ళతో గుసుల్ ఇవ్వండి. మరియు రెండు వస్త్రాలలో అతనికి కఫన్ ఇవ్వండి. మరియు సుగంధ ద్రవ్యాలను పూయకండి. అతని శిరస్సును కప్పకండి. ఎందుకంటే అల్లాహ్ అతన్ని ప్రళయదినం నాడు ఇహ్రామ్ ధరించినవారి రూపంలో జిగురుతో వెంట్రుకలు పేర్చి ఉన్న స్థితిలో లేపుతాడు.'

**358.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; 'ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారితో కలిసి అరఫాత్‌లో ఉన్నాడు. అంతలోనే ఆ వ్యక్తి తన ఒంటెమీద నుంచి క్రిందపడిపోయాడు. అయ్యూబ్ ఇలా అన్నారు; 'ఒంటె అతని మెడను విరిచేసింది.' మరియు అమ్ర్ ఇలా అన్నారు; ఒంటె అతను కిందపడిపోగానే అతన్ని చంపివేసింది. చివరకు అతను చని పోయాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; అతనికి రేగిచెట్టు ఆకులను కలిపిన నీళ్ళతో

స్నానం చేయించండి. అతనికి రెండు వస్త్రాలలో కఫన్ ఇవ్వండి. మరియు అత్తరు రాయకండి. ఇంకా అతని ముఖాన్ని కప్పివేయకండి. ఎందుకంటే అతను ప్రళయ దినం నాడు లబ్బైక్ అంటూ లేస్తాడు. ఇలా అని అమ్ర్ అన్నాడు. అయ్యూబ్ ఏమన్నారంటే 'అతను లబ్బైక్ అంటూ ఉంటాడు'.

## 22వ అధ్యాయం

**ఖమీజ్ (చొక్కా)లో కఫన్ ఇవ్వటం-దాని అంచు కుట్టబడి ఉన్నా లేక కుట్టబడి లేకపోయినా.**

**359.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'అబ్దుల్లా బిన్ ఉబై (వంచకుల నాయకుడు) మరణించినప్పుడు, అతని కుమారుడు (అబ్దుల్లా ఇతను ఒక మంచి ముస్లిమ్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి వద్దకు వచ్చాడు. మరియు ఇలా అనసాగాడు; 'ఓ ప్రవక్తా! దయచేసి మీ చొక్కా ఇవ్వండి. మరియు మా నాన్నగారి నమాజె జనాజా చేయించండి. ఇంకా అతని కోసం అల్లాహ్‌ను ప్రార్థించండి.' అప్పుడు దైవప్రవక్త (స) తన చొక్కాను అతనికి ఇచ్చేశారు. మరియు ఇలా సెలవిచ్చారు; 'జనాజా సిద్ధంగా ఉన్నప్పుడు నాకు కబురు పంపిం చండి.' తరువాత అబ్దుల్లా దైవప్రవక్తకు కబురుపెట్టాడు. ఆయన (స) నమాజె జనాజా చేయించటానికి సంకల్పించుకున్నారు. హజ్రత్ ఉమర్ (రజిఅన్) దైవప్రవక్త (స) గారి చెయ్యిపట్టుకు లాగి ఇలా విన్నవించుకున్నారు; 'ఓ దైవప్రవక్తా (స)! వంచకుల నమాజె జనాజా చేయించవద్దని అల్లాహ్ మిమ్మల్ని వారించలేదా?' అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; నాకు వారికోసం దుఆ చేసే లేక చెయ్యకపోయే అధికారం ఇవ్వబడింది. ఒకవేళ డెబ్భైసార్లు దుఆ చేసినా అప్పుడు కూడా అల్లాహ్ వారిని క్షమించడు. చివరకు ఆయన (స) అతని నమాజె జనాజాను చేయించారు. ఆ తరువాత 'బరాత్' సూరాలో ఈ ఆయత్ అవతరించింది. 'ఇక ముందు వారిలో ఎవడైనా మరణిస్తే, అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంతమాత్రం చెయ్యకు. ఎన్నడూ అతడి గోరీవద్ద నిలబడకు'.

**360.** జాబిర్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన (ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) పరమ వంచకుడైన అబ్దుల్లా బిన్ ఉబై సమాధి వద్దకు, అతని శవాన్ని పాతిపెట్టిన తరువాత వచ్చారు. ఆయన (స) అతని శవాన్ని సమాధిలో

నుంచి బయటికి తీయించారు. మరియు తన ఉమ్మిని (లాలాజలాన్ని) అతనిపై వేశారు. మరియు తన చొక్కాను అతని శవానికి తొడిగించారు.'

## 23వ అధ్యాయం

### చొక్కా లేకుండా కఫన్ ఇవ్వటం

**361.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఉల్లేఖించారు; ఆమె గారు ఇలా అన్నారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి ఉతకబడిన మూడు నూలు వస్త్రాలతో కఫన్ ఇవ్వటం జరిగింది. వాటిలో చొక్కాగానీ, అమామగాని లేదు.'

**362.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారికి మూడు వస్త్రాలతో కఫన్ ఇవ్వటం జరిగింది. వాటిలో ఖమీజ్ లేదు అమామ కూడా లేదు.'

## 24వ అధ్యాయం

### కఫన్‌లో అమామా లేకుండా ఉండటం.

**363.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారికి ఉతకబడిన మూడు తెల్లని వస్త్రాలలో కఫన్ ఇవ్వటం జరిగింది. వాటిలో ఖమీజుగానీ, అమామా గాని లేదు.'

## 25వ అధ్యాయం

కఫన్ ఖర్చులను మృతునికి చెందిన మొత్తం ఆస్తిలో నుంచి తీయాలి. అతా మరియు జుహ్రి మరియు అమ్ర్ బిన్ దీనార్ మరియు ఖతాదాల అభిప్రాయం కూడా ఇదే. అమ్ర్ బిన్ దీనార్ ఇలా అన్నారు; 'సుగంధ ద్రవ్యాలకు అయ్యే ఖర్చును కూడా మొత్తం ఆస్తిలో నుంచి తీయాలి.' ఇబ్రాహీమ్ నఖీ ఇలా అన్నారు; మొదట ఆస్తిలో నుంచి కఫన్‌కు సంబంధించిన ఖర్చులు పెట్టాలి. తరువాత అప్పులు తీర్చాలి. ఆ తరువాత వసియ్యత్ పూర్తిచెయ్యాలి. సుఫియాన్ సౌరి ఇలా అన్నారు; సమాధి ఖర్చులు, గస్సాల్ ఖర్చులు కూడా కఫన్‌లో చేరి ఉన్నాయి.

**364.** ఇబ్రాహీమ్ బిన్ అబ్దుర్రహ్మాన్ కథనం : 'ఒక రోజున అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ముందు భోజనం పెట్టబడి ఉంది. అప్పుడు ఆయన ఇలా అన్నారు; ముస్అబ్

బిన్ ఉమైర్ నా కంటే ఉత్తములు. ఆయన ఉహుద్ సంగ్రామంలో అమరగతులయ్యారు. ఆయన గారి కఫన్ కోసం కేవలం ఒకే ఒక దుప్పటి లభించింది. హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ లేక మరొకరు ఎవరో అమరగతి నొందారు. ఆయన నాకంటే శ్రేష్ఠులు, ఆయన కఫన్ కోసం కేవలం ఒకే ఒక దుప్పటి లభించింది. నేను భయపడుతున్నాను, మా సుఖానికి, మా విశ్రాంతికి చెందిన సామానులు మాకు ఈ లోకంలోనే ఇక్కడనే తొందరగా ఇవ్వబడుతున్నాయేమో అని. తరువాత ఆయన విలపించటం ప్రారంభించారు.'

## 26వ అధ్యాయం

### ఒకవేళ శవం దగ్గర ఒకే ఒక వస్త్రం ఉన్నట్లయితే.

**365.** ఇబ్రాహీమ్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గారి ముందుకు భోజనం తీసుకురాబడింది. అప్పుడు ఆయన గారు ఉపవాస వ్రతంలో ఉన్నారు; ఆయన ఇలా అనసాగారు; 'అయ్యో! ముస్అబ్ బిన్ ఉమైర్ అమరగతి నొందారు. ఆయన నాకంటే ఉత్తములు. ఆయనకు ఒకే ఒక దుప్పటి కఫన్‌గా లభించింది. ఆయన శిరస్సును ఆ దుప్పటితో కప్పితే ఆయన పాదాలు కనిపించేవి. ఆయన ఇలా కూడా అన్నారని నేను అనుకుంటున్నాను. హమ్జా (ర) షహీదు అయ్యారు; ఆయన నాకంటే శ్రేష్ఠులు. వారి తరువాత మాకు ఇహలోకపు సౌఖ్యాలు బాగా లభించాయి. (లేక ఆయన ఇలా అన్నారు); మాకు ప్రపంచం పుష్కలంగా దొరికింది. మేము చేసిన పుణ్యాలకు ప్రతిఫలం ప్రపంచంలోనే ఇవ్వబడలేదు కదా! అని మేము భయపడుతున్నాము. తరువాత ఆయన ఏడ్వటం ప్రారంభించారు. మరియు భోజనాన్ని వదిలేశారు.'

## 27వ అధ్యాయం

### ఒకవేళ కఫన్‌కు ఉపయోగించే వస్త్రం చిన్నది అయినట్లయితే, అంటే శిరస్సు మరియు కాళ్ళు రెండింటినీ కప్పటానికి సరిపోకపోతే, అప్పుడు శిరస్సును మాత్రమే కప్పాలి. (కాళ్ళపై గడ్డి వగైరాలను వేసి ఉంచాలి).

**366.** ఖబ్బాబ్ ఇబ్నె అరత్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారితో కలిసి కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం హిజ్రత్

చేశాము (స్వదేశాన్ని వదిలిపెట్టి వలసపోయాము). అప్పుడు మాకు ఇవ్వవలసిన ప్రతిఫలం యొక్క భారం అల్లాహ్‌పై పడిపోయింది. మాలోని కొందరు మరణించారు వారు తమ ప్రతిఫలంలోనుంచి మరణించేవరకు ఈ లోకంలో ఏమీ తినలేదు. వారిలో ముస్అబ్ బిన్ ఉమైర్ ఒకరు. మిగతా వారందరు తమతమ ప్రతిఫలాలను అనుభవించారు. ముసబ్ బిన్ ఉమైర్(ర) ఉహుద్ సంగ్రామ దినం నాడు అమరగతి నొందారు. ఆయన గారి కఫన్ కోసం మాకు ఏమీ దొరకలేదు. కేవలం ఒక దుప్పటి తప్ప. ఆ దుప్పటితో ఆయనగారి శిరస్సును కప్పితే పాదాలు బయటపడేవి. పాదాలను కప్పితే శిరస్సు కనిపించేది. చివరకు దైవప్రవక్త ముహమ్మద్(స) మాకు ఇలా ఆజ్ఞాపించారు: 'ఆయన గారి శిరస్సును దుప్పటితో కప్పండి. మరియు పాదాల మీద గడ్డివెయ్యండి. (సువాసనలు వెదజల్లే ఒక గడ్డి)'

## 28వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలంలో ఎవరైనా తమ కఫన్‌ను తమ మరణానికి ముందే తయారు చేసుకుంటే, ఆయన అభ్యంతరం చెప్పే వారు కాదు.**

**367.** సహల్ (రజి) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి ఒక స్త్రీ దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి సన్నిధికి వచ్చింది. ఆమె తనతోపాటు అంచుగల ఒక నేసిన దుప్పటిని ఆయన (స)కు కానుకగా ఇవ్వటానికి తీసుకువచ్చింది. సహల్, అక్కడ ఉన్న ప్రజల్ని ఉద్దేశించి 'దుప్పటి అంటే ఏమిటో మీకు తెలుసా?' అని అడిగారు. దానికి సమాధానంగా వారు దుప్పటి అంటే 'షమ్‌లా' అని అన్నారు. సహల్, 'అవును దుప్పటి అంటే షమ్‌లాయే'అని అన్నారు. అప్పుడు ఆ స్త్రీ ఇలా అన్నది. 'దీనిని స్వయంగా నేను నా చేతులతో నేశాను. మీరు దీనిని ధరించాలనే ఉద్దేశంతో తీసుకు వచ్చాను. దైవప్రవక్త(స)గారికి ఆ సమయంలో ఒక దుప్పటి అవసరం ఎంతైనా ఉంది. ఆయన(స) దానిని తీసుకున్నారు. ఆయన(స) దాన్నే తన లుంగీగా ధరించి బయటికి వచ్చారు. అప్పుడు ఒక వ్యక్తి (అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర)) దైవప్రవక్త(స)ను చూసి ఇలా అనసాగారు 'ఈ దుప్పటి ఎంత బాగుంది? దయచేసి మీరు దాన్ని నాకు ఇవ్వండి.' ప్రజలు అబ్దుర్రహ్మాన్‌తో ఇలా అన్నారు: ప్రవక్త(స)గారు ధరించిన దుప్పటిని అడిగి నీవు తప్పు చేశావు. ఆయన(స)గారికి ఆ దుప్పటి అవసరం ఎంతైనా ఉందనే విషయం నీకు తెలియదా? ఆయన(స) దాన్ని ధరించి బయటికి

వచ్చారు. అలాంటప్పుడు ఆయన్ని దుప్పటి ఇవ్వమని ఎలా అడిగావు? ఇంకా ఆయన(స) ఎవరు ఏమి అడిగినా తిరస్కరించరనే విషయం కూడా నీకు తెలుసు కదా! అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఇలా అన్నారు : 'దేవునిపై ప్రమాణంచేసి చెబుతున్నాను నేను దాన్ని కట్టుకునే ఉద్దేశ్యంతో ఆయన(స) గారిని అడగలేదు. నేను దానిని నాకు కఫన్‌గా చేసుకునే సంకల్పంతో అడిగాను. అప్పుడు సహల్ ఇలా అన్నారు: 'తరువాత అది ఆయనకు కఫన్‌గా అయిపోయింది.'

## 29వ అధ్యాయం

## స్త్రీలు జనాజాతోపాటు పోవటం ధర్మసమ్మతమైన విషయమేనా?

**368.** ఉమ్మె అతియ్యా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు 'జనాజాల వెంట వెళ్ళ కూడదని మమ్మల్ని నిషేధించటం జరిగింది. కాని ఆజ్ఞాపూర్వకంగా నిషేధించటం మటుకు జరగలేదు.[1]

## 30వ అధ్యాయం

## ఒక స్త్రీ తన భర్తకోసం కాక మరొక మృతుని కోసం శోకం పాటించటం.

**369.** ముహమ్మద్ బిన్ సీరీన్ ఇలా ఉల్లేఖించారు: 'ఉమ్మె అతియ్యా(రజిఅన్‌హా) (సహాబియ)గారి ఒక కుమారుడు మరణించాడు. ఆమెగారు మూడోరోజున పసుపు పచ్చని పరిమళాన్ని తెప్పించుకుని తన శరీరానికి పూసుకున్నారు. మరియు ఇలా అన్నారు: 'భర్త కోసం తప్ప మరొకరి కోసం మూడురోజుల కంటే ఎక్కువకాలం శోకం పాటించటం మాకు నిషేధించబడింది.'

**370.** జైనబ్ బిన్తె అబీ సలమా ఇలా ఉల్లేఖించారు : సిరియా దేశం నుండి అబూ సుఫ్యాన్ మరణవార్త చేరినప్పుడు ఉమ్ముల్ మోమినీన్ ఉమ్మె హబీబ[1] (రజిఅన్‌హా) ఆ వార్త విన్న మూడవ రోజున పసుపు పచ్చని పరిమళాన్ని తెప్పించి తన బుగ్గలకు, మోచేతులకు పూసుకున్నారు. మరియు ఇలా సెలవిచ్చారు: 'కాని (నేనైతే వితంతువును) పరిమళం అవసరం అయితే నాకు లేదు. అయితే దైవప్రవక్త

---

368-1. కనుక తెలిసిన విషయం ఏమిటంటే స్త్రీలు జనాజాల వెంట వెళ్ళటం అవాంఛనీయం (మక్రూహ్). కాని హరామ్ కాదు (నిషిద్ధం కాదు). ఎక్కువ మంది విద్వాంసులు ఈ అభిప్రాయాన్నే బలపరిచారు. కాని ఇమామ్ మాలిక్(రహ్మాలై) ఈ విషయంలో అనుమతి ఇచ్చారు. కాని యువతులు జనాజా వెంట వెళ్ళటాన్ని మాత్రం ఆయన మక్రూహ్ అన్నారు.

370-1. అబూ సుఫ్యాన్ హజ్రత్ ఉమె హబీబాకు తండ్రి అవుతారు. మరియు హజ్రత్ ముఆవియా(రజిఅన్) ఆయన కుమారుడు.

మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను. ఆయన (స)గారు ఇలా సెలవిచ్చారు: 'ఏ స్త్రీ అయితే అల్లాహ్‌పైనా మరియు ప్రళయదినంపైనా విశ్వాసం కలిగి ఉంటుందో, ఆ స్త్రీ ఏ మృతదేహంపైనా మూడురోజులకంటే ఎక్కువకాలం శోకం పాటించకూడదు. అయితే భర్తపై నాలుగు మాసాల పదిరోజుల వరకు శోకం పాటిం చవచ్చు.'

**371.** జైనబ్ బిన్తె అబీ సలమా(రజిఅన్‌హ) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి నేను ఉమ్మె హబీబా (రజిఅన్‌హ) ఇంటికి వెళ్ళాను, ఆమె దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి సతీమణి. ఆమెగారు ఇలా అన్నారు నేను దైవప్రవక్త (స) గారు ఇలా సెలవిస్తూ ఉండగా విన్నాను. ఆయన(స)ఇలా సెలవిచ్చారు: 'ఏ స్త్రీ అయితే అల్లాహ్ పైనా, ప్రళయ దినంపైనా విశ్వాసం కలిగి ఉంటుందో ఆ స్త్రీ మృతునిపైన మూడురోజుల కంటే ఎక్కువకాలం శోకం పాటించటం ధర్మసమ్మతం కాదు. కాని మరణించిన భర్తపై నాలుగు మాసాల పదిరోజుల వరకు శోకం పాటించాలి.' తరువాత నేను విశ్వాసుల తల్లి అయిన జైనబ్ బిన్తె జహష్(ర) వద్దకు వెళ్ళాను అప్పుడు ఆమె గారి సోదరుడు మృతి చెందారు. ఆమె గారు సుగంధ పరిమళాన్ని తెప్పించి రాసు కున్నారు. తరువాత ఇలా సెలవిచ్చారు: నాకు సుగంధ పరిమళం అవసరం లేదు. విషయం ఏమిటంటే, నేను దైవప్రవక్త మహాశయులు(స) ఇలా సెలవిస్తూ ఉండగా విన్నాను. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు: ఏ స్త్రీ అయితే అల్లాహ్‌పైనా, ప్రళయ దినంపైనా విశ్వాసం కలిగి ఉంటుందో ఆ స్త్రీ ఏ మృతదేహంపైనా మూడురోజులకంటే ఎక్కువకాలం శోకాన్ని పాటించటం ధర్మసమ్మతంకాదు. కాని మరణించిన భర్తపై నాలుగు మాసాల పదిరోజుల వరకు శోకం పాటించాలి."

## 31వ అధ్యాయం

## సమాధులను సందర్శించటం

**372.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : "ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మార్గమధ్యంలో ఒక స్త్రీని చూశారు. ఆమె ఒక సమాధి దగ్గర కూర్చొని ఏడుస్తోంది. ఆయన(స)ఇలా సెలవిచ్చారు "అల్లాహ్‌కు భయపడు మరియు సహనం వహించు." ఆమె ఇలా అన్నది 'దయచేసి వెళ్ళిపోండి. నాకు వచ్చిన ఆపద మీకు రాలేదు కదా!' ఆమె దైవప్రవక్త(స)ను గుర్తుపట్టలేదు. తరువాత అక్కడ ఉన్న ప్రజలు ఆయనగారు మహాప్రవక్త ముహమ్మద్(స) అని ఆమెకు చెప్పారు. అప్పుడు ఆమె భయపడి దైవప్రవక్త(స) గారి ఇంటికి వెళ్ళింది. అక్కడ కాపలాదారు

ఎవరూ ఆమెకు కనిపించలేదు. ఆమె దైవప్రవక్త(స)గారిని ఉద్దేశించి ఇలా అన్నది, 'నేను మిమ్మల్ని గుర్తుపట్టలేదు (క్షమించండి)'. ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు "(ఇప్పుడు లాభమేమిటి) కష్టం కలిగిన ప్రారంభ దశలో సహనం వహించాలి."

## 32వ అధ్యాయం

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు: 'మృతుని కుటుంబ సభ్యులెవరైనా అతని మరణానికి ఏడిస్తే అతనికి శిక్ష పడుతుంది (అంటే ఏడ్వటం, రోదించటం, బాదుకోవటం అతని వంశంలో ఉన్న ఆచారమైతే). ఎందుకంటే, ఖురాను గ్రంథంలో తహ్రీమ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'మిమ్మల్నీ, మీ కుటుంబ సభ్యుల్నీ నరకాగ్ని నుంచి కాపాడుకోండి (చెడ్డ పనులు చెయ్యకుండా వారించండి). దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు 'మీలోని ప్రతి ఒక్కడూ సంరక్షకుడే, బాధ్యుడే. అతని కుటుంబం గురించి అతన్ని ప్రశ్నించటం జరుగుతుంది. ఒకవేళ అతని వంశంలో ఈ ఆచారం లేకపోయినట్లయితే (ఎవరైనా అతన్ని గురించి ఏడిస్తే) అప్పుడు హజ్రత్ ఆయెషా (ర)గారు దీనిపై ప్రమాణం తీసుకోవటం అనేది ఈ ఖురాను వాక్యం ద్వారా సక్రమమే. "బరువు మోసేవాడెవ్వడూ ఇతరుల బరువును మోసుకుపోడు. మరియు ఒకవేళ బరువు మోసే ఆత్మ ఏదైనా ఇతరుల్ని పిలిస్తే (తన బరువు ఎత్తుకోవటానికి అప్పుడు ఏ ఆత్మా ఆ బరువును ఎత్తుకోదు" మరియు పెడబొబ్బలు పెట్టకుండా, రొమ్ములు సద్దుకోకుండా ఎవరైనా ఏడిస్తే అది సక్రమమైన విషయమే. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు: "ప్రపంచంలో ఎక్కడైనా, ఎప్పుడైనా అన్యాయంగా హత్య అనేది జరిగితే అప్పుడు హజ్రత్ ఆదమ్ (అ) గారి ప్రథమ పుత్రుడు (ఖాబీల్)పై దానికి సంబంధించిన కొంత ఆపద, బాధ్యత పడుతుంది. ఎందుకంటే, అన్యాయంగా హత్య చేసే దానికి మొదట అతనే పునాది వేశాడు."

**373.** ఉసామా బిన్ జైద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి ఒక కుమార్తె హజ్రత్ జైనబ్ (ర) ఆయన (స) గారికి ఒక వార్తను పంపారు. అదేమిటంటే, "నా కుమారుడు చావుబ్రతుకుల్లో ఉన్నాడు. దయచేసి మీరు నా వద్దకు వస్తారని ఆశిస్తున్నాను." దైవప్రవక్త (స) ఆమెకు సలాములు పంపారు. దానితోపాటు ఒక సందేశాన్ని కూడా ఆయన (స) ఇలా పంపారు. "సంపద అంతా అల్లాహ్‌కే చెందుతుంది. ఆయన ఇచ్చేది మరియు వాపసు

తీసుకునేది సమస్తమూ ఆయనదే. ప్రతి విషయానికీ ఆయన సన్నిధానంలో ఒక సమయం నిర్ణయమై ఉంది. కనుక సహనం వహించు మరియు పుణ్యఫలాన్ని కోరుకో.' తరువాత ఆమె గారు ప్రమాణం చేసి 'మీరు తప్పకుండా రావాలి' అని మళ్లీ కబురు పంపారు. అప్పుడు ఆయన (స) గారు లేచి బయలుదేరారు. ఆయన (స) గారితో పాటు సాద్ బిన్ ఉబాద (ర), ముఅజ్ బిన్ జబల్ (ర), ఉబై బిన్ కాబ్ (ర), జైద్ బిన్ సాబిత్ (ర), ఇంకా కొందరు వ్యక్తులు తోడుగా ఉన్నారు. (వీరందరూ అన్సార్ తెగకు చెందినవారు) ఆ పిల్లవాణ్ణి దైవప్రవక్త (స) గారి వద్దకు ఎత్తుకుని తీసుకు వచ్చారు. పిల్లవానికి ఊపిరి ఆడటంలేదు. ప్రాణం విడుస్తున్నట్లుగా ఉంది. అబూ ఉస్మాన్ (ర) ఇలా అన్నారు : ఉసామ ఇలా అన్నారని నేను అనుకుంటున్నాను : ఒక 'పాత నీటి తోలు సంచివలె'. ఈ పరిస్థితిని చూసి దైవప్రవక్త (స) గారి కళ్ల వెంట ధారాపాతంగా అశ్రువులు రాలాయి. హజ్రత్ సాద్ బిన్ ఉబాద (ర) ఇలా విన్నవించుకున్నారు: 'ఓ దైవప్రవక్తా (స)! ఏమిటి మీరు ఏడుస్తున్నారా?' ఆయన (స) ఇలా సెలవిచ్చారు : 'ఇది దైవకారుణ్యం. ఆ కారుణ్యాన్ని ఆయన (స) సజ్జనులైన తన దాసుల హృదయాలలో ఉంచుతాడు. ఇంకా ఇతరులపై కరుణజూపే దాసులపై అల్లాహ్ కరుణ జూపుతాడు.'

**374.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "ఒకసారి మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి ఒక కుమార్తె (ఉమ్మెకుల్సుమ్ (ర) జనాజాలో పాల్గొన్నాము. ఆమె గారు హజ్రత్ ఉస్మాన్ (ర) గారి భార్య. దైవప్రవక్త (స) ఆమె సమాధి వద్ద కూర్చొని ఉన్నారు. నేను దైవప్రవక్త (స)గారి కళ్లు అశ్రు వులతో నిండిపోవటాన్ని చూశాను. ఆయన (స) ఇలా సెలవిచ్చారు: 'జనులారా! పోయిన రాత్రి తన భార్యతో సంభోగించని మనిషి మీలో ఎవరైనా ఉన్నారా?' అబూ తల్హా (ర), 'ఓ దైవప్రవక్తా(స)! పోయిన రాత్రి నేను నా భార్య వద్దకు వెళ్లలేదు' అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు 'అయితే నీవు సమాధిలో దిగు.' ఆయన (ర) ఆమె గారి సమాధిలోకి దిగారు."

**375.** అబ్దుల్లా బిన్ ఉబైదుల్లా ఇబ్నె అబీ ములైక ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు "హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) గారి ఒక కుమార్తె (ఉమ్మె అబాన్) మక్కా నగరంలో మరణించారు. మేము ఆమెగారి జనాజాలో పాల్గొనటానికి అక్కడకు వెళ్లాము. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) మరియు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) గార్లు కూడా అక్కడకు వచ్చారు. నేను వారిద్దరి మధ్య కూర్చున్నాను- లేదా ఇలా అన్నారు -

వారిద్దరిలోని ఒకరి వద్ద కూర్చున్నాను. ఇంత లోనే ఒక మనిషి వచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు. అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) అమ్ర్ బిన్ ఉస్మాన్ (ర) (ఉమ్మె అబాన్ గారి సోదరుడు) గారితో ఇలా అన్నారు 'నీవు స్త్రీలు ఏడ్వకుండా, రొమ్ములు బాదుకోకుండా వారించలేవా? దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారైతే ఇలా సెలవిచ్చారు గదా! మృతునిపై అతని ఇంటివారు విలపించటం వల్ల శిక్ష పడుతుందని. ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు: 'ఉమర్ (ర) కూడా ఈ విధంగానే అనేవారు. (మృతుని శవంపై అతని బంధువులు ఏడ్వటం వల్ల అతనికి శిక్షపడుతుంది)'. తరువాత ఆయన ఇలా అన్నారు 'నేను ఒకసారి హజ్రత్ ఉమర్ (ర) గారితో కలసి (హజ్‌యాత్రను పూర్తిచేసుకుని) మక్కా నుంచి తిరిగి వస్తున్నాను. మేము అల్‌బైదాకు చేరుకున్నాము. అక్కడ ఆయన సమురా వృక్షం నీడలో కొంతమంది ప్రయాణీకులు కూర్చోని ఉండటాన్ని చూశారు. నాతో ఆయన ఇలా అన్నారు 'వెళ్ళు, ఆ ప్రయాణీకులు ఎవరో అడిగి తెలుసుకో! నేను అక్కడకు వెళ్ళి చూస్తే అక్కడ ఉన్న వారిలో నాకు సుహైబ్ (ర) కనిపించారు. నేను ఈ విషయాన్ని హజ్రత్ ఉమర్ (ర) గారికి తెలియజేశాను. అప్పుడు ఆయన (ర), వారిని పిలుచుకు రమ్మని నన్ను మళ్లీ పంపారు. నేను మళ్లీ అక్కడకు వెళ్లాను. మరియు సుహైబ్ (ర)తో ఇలా అన్నాను 'పదండి, అమీరుల్ మోమినీన్ మిమ్మల్ని పిలుస్తున్నారు' (ఈ సంగతిని అలా ఉంచితే) తరువాత హజ్రత్ ఉమర్ (ర) గారిని కత్తితో పొడవటం వల్ల ఆయనకు గాయాలయ్యాయి. అప్పుడు సుహైబ్ (ర) విలపిస్తూ వచ్చారు. ఇలా అంటూ వచ్చారు, అయ్యో నా సోదరా! అయ్యో మిత్రమా!' హజ్రత్ ఉమర్ (ర) అప్పుడు ఆయనతో ఇలా అన్నారు 'ఓ సుహైబ్! నీవు నా కోసం ఏడుస్తున్నావా? దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చిన విషయం నీకు తెలియదా? మృతుని శవంపై అతని ఇంటివారు ఏడ్వటం వల్ల శిక్ష పడుతుందని?' ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు: హజ్రత్ ఉమర్ (ర) గారు మరణించినప్పుడు నేను ఆయన ఉల్లేఖించిన ఈ హదీసును గురించి హజ్రత్ ఆయెషా (ర) గారికి చెప్పాను. ఆమె (ర) గారు ఇలా అన్నారు, అల్లాహ్ హజ్రత్ ఉమర్ (ర)పై కరుణ జూపుగాక! (ఆయన (ర) గారి తప్పును మన్నించుగాక!) అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను! దైవప్రవక్త మహాశయులు (సఅసమ్) "అల్లాహ్ విశ్వాసిపై అతని ఇంటివారు విలపించటం వల్ల అతన్ని శిక్షిస్తాడు" అని అనలేదు. ఆయన (స) ఇలా అన్నారు: అవిశ్వాసికి చెందిన కుటుంబ సభ్యులు అతని శవంపై ఏడిస్తే అల్లాహ్ అతనికి మరింత ఎక్కువ శిక్షను విధిస్తాడు అన్నారు. ఇంకా ఇలా అన్నారు : 'ఖుర్‌ఆన్ గ్రంథంలోని ఈ వాక్యం మీకు సరిపోతుంది "బరువు

మోసేవాడెవ్వడూ ఇతరుల బరువును మోయడు." ఇబ్నె అబ్బాస్ (ర) ఆ సమయంలో (అంటే ఉమ్మె అబాన్ జనాజాలో) ఖుర్ఆన్ గ్రంథంలోని ఈ వాక్యాన్ని పఠించారు "అల్లాహ్‌యే నవ్విస్తాడు ఆయనే ఏడ్పిస్తాడు.' ఇబ్నె అబీ ములైకా ఇలా అన్నారు: 'ఇబ్నె అబ్బాస్ (ర)గారి ఈ ప్రసంగాన్ని విని అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) ఎలాంటి సమాధానము చెప్పలేదు.'

**376.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్ )గారి సతీమణి అయిన హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి దైవప్రవక్త (స)గారు ఒక యహూది వనిత సమాధి మీదుగా వెళ్లటం జరిగింది. ఆమె బంధువులు కొందరు ఆమెపై ఏడుస్తున్నారు.' అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: 'వీరైతే ఇక్కడ ఏడుస్తున్నారు. అక్కడ సమాధి లోపల ఆమె శిక్షకు గురి అవుతోంది.'

**377.** తన తండ్రిగారైన అబూ మూసా అష్అరి (రజిఅన్) ఇలా చెప్పారని అబూబుర్‌ద (రజిఅన్) ఉల్లేఖించారు: 'హజ్రత్ ఉమర్(రజిఅన్)ను వాడియైన ఆయుధంతో పొడవగా ఆయన తీవ్రంగా గాయపడ్డారు. అప్పుడు సుహైబ్ (రజిఅన్) 'అయ్యో నా సోదరా! అయ్యో నా సోదరా!' అని ఏడుస్తూ కేకలు వెయ్యసాగారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (ర)ఇలా అన్నారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా అన్నారనే విషయం నీవు ఎరుగవా? మృతుని కోసం అతని ఇంటివారు విలపించటం వల్ల అతనికి బాధాకరమైన శిక్ష పడుతుంది.'

## 33వ అధ్యాయం

**మృతుని శవంపై పడి ఏడ్వటం, రోదించడం మక్రూహ్ (అసహ్యాకరమైనది). హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు : 'అబూసులైమాన్ (ఖాలిద్ బిన్ వలీద్) కోసం స్త్రీలను ఏడ్వనివ్వండి. కాని వారు తమ శిరస్సులపై మట్టిని వేసుకోరాదు, అరవకూడదు మరియు పెడబొబ్బలు పెట్టకూడదు.'**

**378.** ముగైరా ఇబ్నె షూబ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను: 'అబద్ధమైన విషయాన్ని నాకు ఆపాదించటం, అబద్ధమైన విషయాన్ని ఇతరులకు ఆపాదించటం లాంటిది కాదు. ఏ మనిషైతే బుద్ధిపూర్వకంగా అబద్ధాన్ని నాకు ఆపాదిస్తాడో ఆ మనిషి తన నివాసాన్ని నరకలోకంలో నిర్మించుకోవాలి'. దైవప్రవక్త (స) ఇలా చెబుతూ

ఉండగా కూడా నేను విన్నాను. 'ఏ మృతుని కోసమైతే ప్రజలు విలపిస్తారో, కేకలు వేస్తూ ఏడుస్తారో దాని కారణంగా ఆ మృతుడు చిత్రహింసలకు గురిచెయ్యబడతాడు.'

**379.** తన తండ్రిగారైన హజ్రత్ ఉమర్(రజిఅన్) ఇలా చెప్పారని ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: 'ఏ మృతుని శవంపైనైతే ప్రజలు విలపిస్తారో, కేకలు వేస్తూ ఏడుస్తారో దానికారణంగా ఆ మృతుడు సమాధిలో యాతనకు గురవుతాడు.'

**380.** షూబ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : 'బ్రతికి ఉన్నవారు మృతునికోసం విలపించినట్లయితే ఆ విలాపం వల్ల మృతుడు శిక్షకు గురిచెయ్యబడతాడు.

**381.** జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "ఉహుద్ యుద్ధదినం నాడు నా తండ్రిగారి మృతదేహాన్ని తీసుకురావడం జరిగింది. ఆయన గారి ముక్కునూ, చెవుల్నీ శత్రువులు కోసివేశారు. ఈ స్థితిలో మా నాన్నగారి మృత దేహం దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ముందు పెట్టబడింది. ఒక వస్త్రాన్ని ఆ శవంమీద కప్పి ఉంచారు. ఆ వస్త్రాన్ని తొలగించి నేను నా తండ్రిగారి మృతదేహాన్ని చూడదలిచాను. అప్పుడు నా జాతికి చెందిన ప్రజలు అలా చెయ్యవద్దని నన్ను వారించారు. తరువాత నేను మళ్ళీ ఆ వస్త్రాన్ని తొలగించసాగాను. అప్పుడు కూడా నా జాతి ప్రజలు అలా చెయ్యవద్దని వారించారు. ఆ తరువాత దైవ ప్రవక్త(స) గారి ఆజ్ఞ ప్రకారం ఆ మృతదేహం అక్కడ నుంచి ఎత్తుకుపోబడింది. దైవప్రవక్త(స) కేకలు వేస్తూ ఏడుస్తున్న ఒక స్త్రీ కంఠస్వరాన్ని విన్నారు. 'ఈ స్త్రీ ఎవరు?' అని ఆయన (స) అడిగారు. అక్కడ ఉన్న ప్రజలు, ఆమె అమ్ర్ (రజిఅన్) కూతురు లేక ఆయనగారి సోదరీమణి అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'ఆమె ఎందుకు అలా ఏడుస్తోంది?' లేక ఇలా సెలవిచ్చారు 'ఏడ్వబాకు దైవదూతలు తమ రెక్కల ఛాయతో అతన్ని కప్పుతున్నారు. అతని జనాజాను అక్కడినుంచి ఎత్తేవరకు దైవ దూతలు అలా చేస్తూనే ఉంటారు."

## 34వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు : ఎవరైతే తమకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు విలపిస్తూ తమ బట్టల్ని చించుకుంటారో వారు మాలోని వారు కారు.[1]**

---

34-1. అంటే వారు అవలంబించిన పద్ధతి ముస్లిముల పద్ధతి కాదు. అది అవిశ్వాసుల పద్ధతి. దాన్ని వారు అవలంబించారు.

**382.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబ్దుల్లా బిన్ మసూద్(రజి) ఉల్లేఖించారు: 'ఎవడైనా తన చెంపలను వాయించుకుంటే, మరియు తన బట్టలను చించుకుంటే మరియు అవిశ్వాసపు మాటలు పలికితే, అతడు ముస్లింలలోని వాడుకాడు.'[1]

## 35వ అధ్యాయం

**సాద్ బిన్ ఖౌలపై దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సంతాపాన్ని వ్యక్తం చెయ్యటం.**

**383.** తన తండ్రిగారు ఇలా అన్నారని ఆమిర్ బిన్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్జతుల్ విదాకు వెళ్ళిన సంవత్సరంలో అంటే హిజ్రీ పదవ సంవత్సరంలో నేను తీవ్ర అనారోగ్యానికి గురయ్యాను. దైవప్రవక్త(స) నన్ను పరామర్శించటానికి నా వద్దకు వస్తూ ఉండేవారు. నా తల్లి గారు కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నేను ఆయన(స) గారితో ఇలా విన్నవించుకున్నాను 'ఓ దైవప్రవక్తా(స)! వ్యాధి తీవ్రతవల్ల నా ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. నేను ఈ స్థితికి చేరుకున్నాను (నేను ఇంకా బ్రతికి ఉంటాననే ఆశ నాకు లేదు) నాకు ఒకే ఒక కూతురు ఉంది. ఆమె ఒక్కతే ఇప్పుడు నాకు వారసురాలు. నా సంపదలో నుంచి 2/3వ భాగాన్ని దానధర్మాల కోసం వెచ్చించమంటారా?' ఆయన(స) 'వద్దు' అని సమాధానం చెప్పారు. అప్పుడు నేను, 'సగం' ఆస్తిని ఖర్చు పెట్టమంటారా? అని అడిగారు. ఆయన (స) 'వద్దు' అని మళ్ళీ సెలవిచ్చారు. ఆ తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు: నీ ఆస్తిలోని 1/3వ భాగాన్ని ఖర్చుపెట్టు, అది సరిపోతుంది, ఇది కూడా పెద్ద దానమే. లేక చాలా ఎక్కువ దానమే. ఒకవేళ నీవు నీ వారసుల్ని ధనవంతులుగా చేసి విడిచిపెట్టిపోతే, ఇది వారిని నిరుపేదలుగా, నిస్సహాయులుగా విడిచిపెట్టిపోవటం కంటే ఉత్తమమైనది. ఒకవేళ నీవు వారిని నిరుపేదలుగా విడిచిపోతే వారు ప్రజల వద్దకు పోయి వారి ముందు చేతులు చాచి యాచించుకుంటూ తిరుగుతారు. నీవు అల్లాహ్ ప్రసన్నతకోసం ఎంతైతే ఖర్చుపెడతావో

---

382-1. హాఫిజ్ ఇలా అన్నారు 'ఈ హదీసు వెలుగులో తెలిసే విషయం ఏమిటంటే, బట్టలు చించుకోవడం, చెంపల మీద కొట్టుకోవడం హరామ్ అంటే నిషిద్ధం. ఎందుకంటే, అలా చెయ్యటం వల్ల దైవాజ్ఞ పట్ల ఇష్టంలేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఎవడికైతే ఈ నిషేధం గురించి తెలుసో, అయినప్పటికీ అతడు దానిని హలాల్‌గా భావించి ఆచరిస్తాడో, అప్పుడు అతడు నిస్సందేహంగా ధర్మ పరిధి నుండి బహిష్కృతుడవుతాడు.'

(అది కాస్తంతయినా సరే) దానికి నీకు పుణ్యం లభిస్తుంది. చివరకు నీ భార్య నోట్లో నీవు ఏది పెట్టినా దానికి కూడా నీకు పుణ్యం లభిస్తుంది. అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను 'ఓ దైవప్రవక్తా(స)! నా సహచరులైతే మదీనా పట్టణానికి వెళ్ళిపోతారు నేను వారివెనుక మక్కా నగరంలో ఉండిపోతాను.' ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'నీవు ఎన్నటికీ వెనుక ఉండిపోవు నీవుగనుక ఏదైనా సత్కార్యం చేసినట్లయితే, అప్పుడు నీ అంతస్తు, నీ స్థానం పెరుగుతుంది. నేను అంటు న్నాను బహుశా నీవు ఇంకా చాలాకాలం బ్రతికిఉంటావు నీవల్ల కొంత మంది ప్రజలకు లాభం కలుగుతుంది. మరికొంత మందికి నష్టం కలుగుతుంది. ఓ అల్లాహ్! నా అనుచరుల హిజ్రత్(వలస)ను పరిపూర్ణం చెయ్యి. మరియు వారిని మడమలపై వెనక్కి మరలిపోయేలా చెయ్యబాకు. (మక్కా నుంచి హిజ్రత్ చేసి మళ్ళీ మక్కాకు తిరిగి వచ్చి మరణించటం) కనుక నీవు మంచివాడవు.' కాని సాద్‌బిన్ ఖౌల మాత్రం అదృష్ట హీనుడు, అమాయకుడు అతన్ని గురించి దైవప్రవక్త(స) విచారాన్ని వ్యక్తం చేస్తూ ఉండేవారు. అతను మక్కాలోనే మరణించాడు.

## 36వ అధ్యాయం

### విపత్తులు వచ్చిపడినప్పుడు శిరోముండనం చేయించుకోవటం నిషిద్ధం.

అబూ బుర్దా బిన్ అబీ మూసా(ర) ఇలా ఉల్లేఖించారు "ఒకసారి అబూమూసా అష్అరి(ర) తీవ్ర అస్వస్థతకు గురి అయ్యారు. ఈ కారణం వల్ల ఆయన స్పృహ తప్పి పడిపోయారు. అప్పుడు ఆయనగారి శిరస్సు ఆయన కుటుంబసభ్యుల్లోని ఒక స్త్రీ (ఉమ్మె అబ్దుల్లా) ఒడిలో ఉంది. ఆమె ఈ దృశ్యాన్ని చూసి పెద్దగా కేకవేసి ఏడ్వసాగింది. ఆయన ఆమె మాటలకు సమాధానం ఇవ్వలేకపోయారు. స్పృహలోకి వచ్చినప్పుడు ఆయన ఇలా అన్నారు 'దైవప్రవక్త మహాశయులు(స) ఎవరి పట్లనైతే విసుగును, అయిష్టతను వ్యక్తం చేశారో, నేను కూడా వారిపట్ల విసుగును వ్యక్తం చేస్తున్నాను.' దైవప్రవక్త(స), పెద్దగా కేకలు వేస్తూ, ఏడుస్తూ తన బట్టల్ని చించుకునే స్త్రీ పట్ల, శిరోముండనం చేయించుకునే స్త్రీ పట్ల విసుగును వ్యక్తం చేశారు."

## 37వ అధ్యాయం

### ఎవడైతే తన చెంపల మీద కొట్టుకుంటాడో అతడు మాలోని వాడు కాడు.

**384.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ మసూద్(ర) ఉల్లేఖించారు "ఏ మనిషైతే తన చెంపలపై కొట్టుకుంటాడో మరియు

తన బట్టలు చించుకుంటాడో మరియు అవిశ్వాసపు వాగుడు వాగుతాడో ఆ మనిషి మాలోనివాడు కాడు."

## 38వ అధ్యాయం

### ఆపద సమయంలో రోదించడం అవిశ్వాసపు మాటలు పలకటం నిషిద్ధం.

**385.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబ్దుల్లా బిన్ మసూద్(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఎవడైనా చెంపల మీద కొట్టుకుంటే, మరియు తన బట్టలను చించుకుంటే మరియు అవిశ్వాసపు మాటలు మాట్లాడితే అతడు మాలోని వాడు కాడు.'

## 39వ అధ్యాయం

### ఆపద సంభవించినప్పుడు విషాద ఛాయలు ఆవహించిన ముఖంతో కూర్చోవడం.

**386.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: 'యుద్ధరంగంలో జైద్ బిన్ హారిసా (రజిఅన్), జాఫర్ (రజిఅన్) మరియు అబ్దుల్లా బిన్ రవాహాలు ముగ్గురు హతమార్చబడ్డారనే వార్త దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారికి చేరినప్పుడు, ఆయన(స) నేలపై కూర్చున్నారు. దుఃఖితులైనట్లు కనిపించారు. నేను తలుపు సందులో నుంచి చూస్తూ ఉన్నాను. ఇంతలోనే ఒక మనిషి ఆయన(స) గారి వద్దకు వచ్చి ఇలా అనసాగాడు 'జాఫర్ గారి స్త్రీలు ఏడుస్తున్నారు'. అప్పుడు ఆయన(స) 'వెళ్ళు, ఏడ్వ వద్దని చెప్పు'అని అన్నారు. అతను వెళ్ళాడు. తరువాత మళ్ళీ అతనే తిరిగి వచ్చాడు మరియు ఇలా అన్నాడు 'ఆ స్త్రీలు నా మాట వినటం లేదు' అప్పుడు ఆయన (స) 'వెళ్ళు, విలపించవద్దని వారించు' అని మళ్ళీ అన్నారు. అతను వెళ్ళాడు మరియు మూడోసారి తిరిగివచ్చాడు మరియు ఇలా అన్నాడు, 'ఓ దైవప్రవక్తా(స)! దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. ఆ స్త్రీలైతే మనపై ప్రాబల్యం వహించారు.' హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'వెళ్ళు, వారి నోళ్ళల్లోకి మట్టిని పోసి రా' అల్లాహ్ నీ ముక్కులో మట్టి పెట్టుగాక! (నీవు ఎక్కణ్ణుంచి దాపు రించావు?) దైవ ప్రవక్త(స) ఏదైతే చెయ్యమని నిన్ను ఆజ్ఞాపించారో నువ్వు దాన్నయితే చెయ్యలేక పొయ్యావు. తరువాత దైవప్రవక్త(స) గారిని హింసించటాన్ని కూడా నువ్వు మానలేదు.'

**387.** హజ్రత్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : '(శాస్త్రయుక్తంగా) ఖురాను గ్రంథాన్ని పారాయణం చేసేవారు కొందరు ఆమిర్ బిన్ తుఫేల్ చేతుల్లో

హతమార్చ బడ్డారనే విషయం తెలుసుకున్న తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక మాసం వరకు నమాజులో 'ఖునూత్' పఠించారు. దైవప్రవక్త(స) ఆ రోజుల్లో ఉన్నంత విషాదగ్రస్తులుగా, దుఃఖితులుగా నేను ఆయన్ని ఎన్నడూ చూడలేదు.'

## 40వ అధ్యాయం

**ఎవరైనా సరే ఆపదలు వచ్చినపుడు, ఆత్మను క్షోభకు గురిచేసి తమ విచారాన్ని, తమ దుఃఖాన్ని వ్యక్తం చెయ్యకూడదు. ముహమ్మద్ బిన్ కాబ్ ఖురజీ ఇలా అన్నారు : 'చెడ్డ మాటను నోటితో పలకటం మరియు ప్రభువైన అల్లాహ్‌ను శంకిం చటం - ఈ రెండు విషయాలను అసహనం అంటారు.' హజ్రత్ యాఖూబ్ (అ) ఇలా సెలవిచ్చారు (ఈ విషయం దివ్యఖుర్‌ఆన్ లోని 'యూసుఫ్' సూరాలో ఉంది): "నేనైతే నాలోని అసహనాన్ని గురించి మరియు నా దుఃఖాన్ని గురించి అల్లాహ్‌కే ఫిర్యాదు చేస్తాను."**

**388.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు 'అబూ తల్‌హ (రజిఅన్) గారి ఒక కుమారుడు ఒకసారి అస్వస్థతకు గురి అయ్యాడు. తరువాత అతను చనిపోయాడని అనస్ చెప్పారు. ఆ సమయంలో అబూ తల్‌హా (ర) గారు ఇంట్లో లేరు. ఆయన (ర) గారి భార్య మరియు అనస్ (ర) గారి తల్లి అయినటువంటి ఉమ్మె సులైమ్, బాలుడు మరణించిన విషయాన్ని గమనించి, భర్తకోసం భోజనం తయారు చేశారు. ఇంకా ఆమె బాలుని మృత దేహాన్ని ఇంట్లోని ఒక మూలలో పెట్టేశారు. ఇంతలోనే అబూ తల్‌హా రానే వచ్చారు. బాబు ఎలా ఉన్నాడని ఆయన తన భార్యను అడిగారు. ఉమ్మె సులైమ్ ఇలా అన్నారు: బాబు విశ్రాంతి తీసుకుంటు న్నాడు. ఇప్పుడు అతనికి ప్రశాంతి లభించింది అని నేను అనుకుంటున్నాను. ఉమ్మె సులైమ్ సత్యమే పలుకుతున్నారని (బాబు క్షేమంగా ఉన్నాడని) అబూ తల్‌హా భావిం చారు. అనస్ (ర) ఇలా అన్నారు అబూ తల్‌హ (ర) రాత్రి అంతా ఉమ్మె సులైమ్ వద్దనే గడిపారు. ఉదయం కాగానే ఆయన గుసుల్ చేసుకుని బయటికి వచ్చారు. అప్పుడు ఉమ్మె సులైమ్ ఆయనగారితో 'బాబు చనిపోయాడు' అన్నారు. అబూ తల్‌హా (ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారిని కలిసి వచ్చారు. మరియు ఆయన (స)తో కలిసి నమాజు చేశారు. ఆయన దైవప్రవక్త (స) గారికి ఉమ్మె సులైమ్ స్థితిని గురించి తెలియజేశారు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు : బహుశా

వారిద్దరికీ (భార్యాభర్తలకు) అల్లాహ్ ఈనాటి రాత్రి శుభాలను ప్రసాదిస్తాడేమో. సుఫియాన్ ఇలా అన్నారు, ఒక అన్సారీ వ్యక్తి ఇలా అనేవాడు- ఉమ్మె సులైమ్ (ర)కు తొమ్మిది మంది కుమారులు పుట్టారు. వారందరూ హాఫిజ్‌లే (ఖారీలే).

## 41వ అధ్యాయం

### ఆపద వచ్చి పడగానే వెంటనే సహనం వహించటం

అసలు సహనం అంటే ఇదే. హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు- 'ఇరు వైపులా బరువులు మరియు మధ్య బరువు ఎంత మంచి బరువులు!' అంటే ఖుర్‌ఆన్ లోని బఖరా సూరాలో ఇలా ఉంది కష్టకాలం దాపురించినపుడు "మేమంతా అల్లాహ్‌కే చెందినవారము. అల్లాహ్ వైపునకే మరలిపోవలసిన వారము అని అనేవారికి శుభవార్తలు అందజెయ్యి అలాంటి వారిపై వారి ప్రభువు తన అపూర్వ అనుగ్రహాలను కురిపిస్తాడు. ఆయన కారుణ్యఛాయలు వారికి ఆశ్రయమిస్తాయి. వారే సన్మార్గ గాములు." ఇంకా అల్లాహ్ ఖురాను గ్రంథంలోనే బఖరా సూరాలో ఇలా సెలవిచ్చాడు, "విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయాన్ని అర్థించండి. నమాజు కష్టతరమైన కార్యమే. కాని అల్లాహ్‌కు భయపడే వారికి మాత్రం అది కష్టతరమైనది కాదు."

**389.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు 'సహనం అంటే ఆపద వచ్చిపడిన ప్రారంభ దశలో చూపబడేదే.'

## 42వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: 'ఓ ఇబ్రాహీమ్! నీ ఎడబాటుకు మేము ఎంతో చింతిస్తున్నాము.' దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) ఉల్లేఖించారు : "కళ్ళ నుంచి అశ్రువులు రాలుతున్నాయి. హృదయం దుఃఖిస్తోంది".**

**390.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు, ఆయన ఇలా అన్నారు- 'ఒకసారి మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలసి కమ్మరి అయిన అబూ సైఫ్ వద్దకు వెళ్లాము. అతను ఇబ్రాహీమ్‌కు పాలు ఇచ్చే దాదికి భర్త.[1] దైవప్రవక్త (సఅసమ్) ఇబ్రాహీమ్‌ను తన ఒడిలోకి తీసుకున్నారు. మరియు అతన్ని ముద్దుపెట్టుకున్నారు. మరియు వాసన చూశారు. ఆ తరువాత మరొకసారి మేము

అబూ సైఫ్ ఇంటికి వెళ్లటం జరిగింది అప్పుడు ఇబ్రాహీమ్ కడపటి శ్వాసను విడుస్తున్నారు. దీన్ని గమనించిన దైవ ప్రవక్త (స) కళ్ల నుంచి అశ్రువులు రాలటం ప్రారంభించాయి.' అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజిఅన్) దైవప్రవక్త (స) గారితో ఇలా విన్నవించుకున్నారు, 'ఓ దైవప్రవక్తా (స)! మీరు కూడా (సాధారణ మానవులు మాదిరిగా అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారేమిటి?) ఏడుస్తున్నారేమిటి?' అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ఓ ఔఫ్ కుమారుదా! ఇది (అసహనం కాదు) కారుణ్యం. తరువాత రెండోసారి కూడా దైవప్రవక్త (స) విలపిస్తూ ఇలా సెలవిచ్చారు 'కళ్లు అయితే అశ్రువుల్ని రాలుస్తున్నాయి, హృదయం దుఃఖిస్తోంది. అయినప్పటికీ మేము మా ప్రభువుకు ఏదైతే ఇష్టమో అదే అంటున్నాము.[2] నిస్సందేహంగా ఓ ఇబ్రాహీమ్! మేము నీ ఎడబాటు వలన విషాదగ్రస్తులమయ్యాము, దుఃఖిస్తున్నాము.' ఈ హదీసును మూసా బిన్ ఇస్మాయిల్ సులైమాన్ బిన్ ముగైరా నుంచి ఆయన సాబిత్ నుంచి ఆయన అనస్ (ర) నుంచి ఆయన దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) నుంచి ఉల్లేఖించారు.

## 43వ అధ్యాయం

### రోగి దగ్గర విలపించటం.

**391.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన ఇలా అన్నారు- 'సాద్ బిన్ ఉబాద (రజిఅన్) ఒక వ్యాధి కారణంగా అస్వస్థులయ్యారు. అప్పుడు దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అబ్దు ర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజిఅన్)ను, సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజిఅన్)ను మరియు అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్)ను తమతో తీసుకుని సాద్ బిన్ ఉబాద (ర) ఇంటికి పరామర్శించటానికి వెళ్ళారు. అక్కడకు చేరిన తరువాత అతని కుటుంబ సభ్యులు, సేవకులు చాలా మంది అతని చుట్టూ గుమిగూడి ఉండటాన్ని దైవప్రవక్త (స) గమనించారు. ఆయన (స) ఇలా సెలవిచ్చారు 'ఏమిటి సాద్‌బిన్ ఉబాద (ర) మరణించారా?' అక్కడ ఉన్నవారు, "లేదు, మహా ప్రవక్తా (స) అతను మరణించ లేదు." అని అన్నారు. ఇది విన్న దైవప్రవక్త(స)

---

390-1. హజ్రత్ ఇబ్రాహీమ్ దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి కుమారులు. మారియా ఖబ్తియాకు ఆయన పుట్టారు. ఆయనను పెంచిన దాది అబూసైఫ్‌కు భార్య. హజ్రత్ ఇబ్రాహీమ్ వారి ఇంట్లోనే పెరిగారు. అబూ సైఫ్ మరొకపేరు బరా బిన్ అబీ ఔఫ్.

390-2. అంటే ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. సహనం కృతజ్ఞతలు.

ఏడ్వటం ప్రారంభించారు (సాద్ వ్యాధిని చూసి). దైవప్రవక్త (స) విలపించటాన్ని చూసిన ప్రజలు కూడా విలపించ సాగారు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "వినండి కళ్ల నుంచి అశ్రువులు రాలినంత మాత్రాన మరియు హృదయం దుఃఖించినంత మాత్రాన అల్లాహ్ ఎవరినీ శిక్షించదు. అల్లాహ్ దీని కారణంగా శిక్షించనూ వచ్చు, కరుణించనూ వచ్చు ఆయన నాలుకను సూచిస్తూ ఇలా అన్నారు చూడండి! మృతు నిపై పడి అతని ఇంటివారు ఏడ్వటం వల్ల అతనికి శిక్ష పడుతుంది". హజ్రత్ ఉమర్ (రజిఅన్)గారైతే ఇలాంటి దృశ్యాన్ని చూస్తే లాఠీతోగాని, రాళ్లతోగాని కొట్టేవారు. మరియు ఏడ్చేవారి ముఖంపై మట్టిని పోసేవారు.

## 44వ అధ్యాయం

### ఏడ్వకూడదని, రోదించకూడదని వారించటం, దానిపై కసురుకోవటం.

**392.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) ఇలా ఉల్లేఖించారు: 'జైద్ బిన్ హారిస, జాఫర్ బిన్ అబీతాలిబ్(ర), అబ్దుల్లా బిన్ రవాహ(ర)- ఈ ముగ్గురూ ఒక యుద్ధంలో అమరగతి నొందారనే (షహీదులయ్యారనే) వార్త విన్నప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మసీదులో కూర్చొని ఉన్నారు. అప్పుడు ఆయన(స) గారి ముఖార విందంపై దుఃఖిస్తున్న ఛాయలు కనిపించసాగాయి. నేను తలుపు సందులోనుంచి తొంగి చూస్తున్నాను. ఇంతలో ఒక వ్యక్తి అక్కడకు వచ్చి ఇలా అనసాగాడు 'ఓ దైవ ప్రవక్తా (స)! జాఫర్ గారికి చెందిన స్త్రీలు ఏడుస్తున్నారు.' అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు, "వెళ్ళు ఏడ్వవద్దని వారిని వారించు". అతను వెళ్ళిపోయాడు. తరువాత తిరిగి వచ్చాడు. ఇలా అన్నాడు విలపించవద్దని నేను వారిని వారించాను. కాని వారు నా మాట వినలేదు. దైవప్రవక్తా(స)! రెండోసారి ఇలా సెలవిచ్చారు 'వెళ్ళు ఏడ్వ కూడదని వారికి చెప్పు.' అతను అక్కడకు వెళ్ళాడు. తరువాత మూడోసారి తిరిగి వచ్చి ఇలా అన్నాడు. ఓ దైవప్రవక్తా(స) నేను దేవునిపై ప్రమాణం చేసి చెబు తున్నాను. వారైతే నాకంటే లేక మనకంటే శక్తివంతులుగా కనిపించారు. దీని విషయంలో ఏది నిజమో ఏది కాదో అని ఉల్లేఖకుడైన ముహమ్మద్ బిన్ హోషబ్‌కు సందేహం కలిగింది. హజ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారు, అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'వెళ్ళు వారి నోట్లో మట్టి వేసిరా. అప్పుడు నేను ఇలా అన్నాను 'అరె నీపై దేవుని శాపం పడుగాక! నీవైతే దైవప్రవక్త(స) చెయ్యమని ఆజ్ఞాపించిన పనినీ చెయ్యలేకపోయావు. ఇంకా దైవ ప్రవక్త(స) గారిని బాధించటం కూడా నీవు విడిచి పెట్టలేదు'.

**393.** ఉమ్మె అతియ్యా (రజిఅన్హా) ఉల్లేఖించారు ఆమె ఇలా అన్నారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మా నుంచి బైఅత్ (దృఢమైన ప్రతిజ్ఞ) తీసుకున్నప్పుడు, మేము మృతుని శవంపై పడి విలపించము అనే వాగ్దానం కూడా తీసుకున్నారు. తరు వాత ఈ వాగ్దానాన్ని ఐదుగురు స్త్రీలు తప్ప మరె వ్వరూ నెరవేర్చలేదు. ఉమ్మె సులైమ్(ర), ఉమ్ముల్ అలా మరియు అబూసబ్రా కూతురు, మాజ్ బిన్ జబల్(ర) భార్య, ఇద్దరు ఇతర స్త్రీలు. లేక ఇలా అన్నారు అబూ సబ్రా కూతురు, ము ఆజ్(ర) భార్య మరియు మరొక స్త్రీ.'

## 45వ అధ్యాయం

### జనాజాను చూసి లేచి నిలబడటం

**394.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఆమిర్ బిన్ రబిఅ(రజిఅన్) ఉల్లేఖించారు: 'మీరు జనాజాను చూసినప్పుడు లేచి నిలబడండి. మరియు ఆ జనాజా మీకంటే ముందుకు పోయేవరకు నిలబడే ఉండండి.' అల్హుమైది తన ఉల్లేఖనంలో ఈ విషయాన్ని అదనంగా చెప్పారు 'జనాజా ముందుకు పోయేవరకు' లేదా నేలపై పెట్టేవరకు.

## 46వ అధ్యాయం

### జనాజా కోసం లేచి నిలబడితే ఎంతసేపు అలా నిలబడాలి?

**395.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఆమిర్ బిన్ రబిఅ(రజిఅన్) ఉల్లేఖించారు: 'మీలో ఎవరైనా జనాజాను చూస్తే అప్పుడు ఒకవేళ ఆ జనాజా వెంట అతను వెళ్ళకపోతే అప్పుడు అతను అక్కడ నిలబడే ఉండాలి చివరకు అతను జనాజానైనా వెనుక వదిలిపెట్టాలి, లేక ఆ జనాజా అయినా ముందుకు సాగిపోవాలి లేదా అది భూమిపై పెట్టబడాలి. ముందుకుపోవటానికి పూర్వమే.

**396.** తన తండ్రిగారైన కైసాన్ ఇలా చెప్పారని సయీద్ మఖ్బురి ఉల్లేఖించారు: 'ఒకసారి మేము ఒక జనాజా వెంట పోతూ ఉన్నాము. అప్పుడు అబూహురైరా (రజిఅన్) మర్వాన్ చేతిని పట్టుకున్నారు. తరువాత వారు ఉభయులు జనాజాను నేలపై పెట్టకముందే కూర్చుండిపోయారు. ఇంతలో అబూసయీద్ ఖుద్రీ (రజిఅన్) అక్కడకు వచ్చారు. ఆయన మర్వాన్ చేతిని పట్టుకుని ఇలా అన్నారు. 'లే, లేచి నిలబడు. దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా చెయ్యవద్దని మమ్మల్ని వారించిన విషయం ఈ వ్యక్తి (అంటే

అబూహురైర (రజి))కి బాగా తెలుసు. అబూహురైరా(ర) జోక్యం చేసుకుంటూ ఇలా అన్నారు 'అబూ సయీద్(ర) నిజం చెప్పారు.'[1]

## 47వ అధ్యాయం

ఒక వ్యక్తి ఎవరైనా జనాజాతోపాటు ఉంటే, అతను ఆ జనాజాను భుజాలపై నుంచి దించి నేలపై పెట్టేంతవరకు కూర్చోరాదు. ఒకవేళ అతను కూర్చున్నట్లయితే, లేచి నిలబడమని అతనికి చెప్పాలి.

**397.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు: 'మీరు జనాజాను చూసినప్పుడు లేచి నిలబడండి. ఎవరైనా జనాజాతోపాటు ఉన్నట్లయితే వారు ఆ జనాజా నేలపై పెట్టబడనంతవరకు కూర్చోరాదు.'

## 48వ అధ్యాయం

**యూదుని (లేక అవిశ్వాసి) జనాజాను చూసి నిలబడటం.**

**398.** జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- ఒకసారి ఏమి జరిగిందంటే, ఒక యూదుని జనాజా మా ముందునుంచి వెళ్ళిపోయింది. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) లేచి నిలబడ్డారు. ఆయనగారితోపాటు మేము కూడా లేచి నిలబడ్డాము. మేము ఇలా విన్నవించుకున్నాము 'ఓ దైవప్రవక్తా(స) ఇది ఒక యూదుని జనాజా'. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: "మీరు జనాజాను చూసినప్పుడు లేచి నిలబడండి."[1]

**399.** అబ్దుర్రహ్మాన్ బిన్ అబీలైలా ఇలా ఉల్లేఖించారు: 'సహల్ బిన్ హునైఫ్

---

396-1. చాలామంది సహాబాలు, తాబయీన్‌లు దీన్ని అభిలషణీయమైనదిగా భావించారు. షాబి మరియు నఖిగార్లు ఇలా సెలవిచ్చారు 'జనాజాను నేలపై పెట్టటానికి ముందే కూర్చోవటం 'మక్రూహ్' (అసహ్యకరమైనది) అని భావించారు కొందరు. నిలబడి ఉండటాన్ని ఫర్జ్ (విధి) అని అభిప్రాయపడ్డారు.' నసాయి గారు, అబూ హురైరా (రజి) మరియు అబూసయీద్‌ల నుంచి ఇలా గ్రహించారు "జనాజాను నేలపై పెట్టేంతవరకు దైవప్రవక్త(స) గారు కూర్చోవటాన్ని మేము ఏ జనాజాలోను చూడలేదు."

398-1. జనాజా ఎవరిదైనా కావచ్చు. ముస్లిమ్‌దైనా కావచ్చు లేదా కాఫిర్‌దైనా కావచ్చు, లేచి నిలబడాలి. ఉద్దేశ్యం ఏమిటంటే, మనిషి మరణాన్ని చూసి జాగ్రత్తపడాలి. నేను కూడా ఏదో ఒక రోజున ఈవిధంగానే మరణిస్తాను అనే భావన మనిషికి కలగాలి.

(రజిఅన్) మరియు ఖైస్ బిన్ సాద్(రజిఅన్) ఒకసారి వారు ఉభయులు అల్‌ఖాద్‌సియా పట్టణంలో ఒకచోట కూర్చుని ఉన్నారు. ఇంతలోనే ఒక జనాజా వచ్చి వారి ముందు నుంచి వెళ్ళిపోయింది. వారిద్దరు ఆ జనాజాను చూసి లేచి నిలబడ్డారు. ప్రజలు వారితో ఇలా అన్నారు: "ఈ జనాజా అయితే ఇక్కడ నివసించే ఒక అవిశ్వాసిది. వారు ముస్లిముల రక్షణలో ఉన్నారు. (ఈ జనాజా ఇక్కడ నివసించే జిమ్మి అవిశ్వాసులకు చెందినది)" అప్పుడు వారు ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి ముందునుంచి ఇదేవిధంగా ఒక జనాజా ఒకసారి వెళ్ళిపోయింది. అప్పుడు ఆయన(స)గారు ఆ జనాజాను చూసి లేచి నిలబడ్డారు.' అక్కడ ఉన్న ప్రజలు ఇలా అన్నారు 'ఈ జనాజా అయితే ఒక యూదునికి చెందిన జనాజా.' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు- 'ఏమిటి! యూదుని ప్రాణం ప్రాణం కాదా?'

## 49వ అధ్యాయం

### జనాజాను పురుషులు ఎత్తుకోవాలి స్త్రీలు ఎత్తకూడదు.

**400.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ సయీద్ ఖుద్రి(రజిఅన్) ఉల్లేఖించారు: 'మనిషి మృతదేహాన్ని మంచం మీద పెట్టినప్పుడు, దానిని పురుషులు తమ భుజాల మీదకు ఎత్తుకున్నప్పుడు ఒకవేళ జనాజా గనుక సత్పురుషునిది అయితే అతను ఇలా అంటాడు, 'నన్ను ముందుకు తీసుకువెళ్ళండి...' ఒకవేళ ఆ జనాజా సత్పురుషునిది కాకపోతే అప్పుడు అతను ఇలా అంటాడు 'అయ్యో నేను పాడుగాను! నన్ను ఎక్కడకు తీసుకుపోతున్నారు?' అతని మాటల్ని సృష్టితాలన్నీ వింటాయి. కేవలం మనుషులు మాత్రమే వినలేరు. ఒకవేళ వారు విన్నట్లయితే స్పృహను కోల్పోతారు.'

## 50వ అధ్యాయం

**జనాజాను త్వరత్వరగా తీసుకెళ్ళటం.[1] అనస్ (రజిఅన్) ఇలా అన్నారు 'మీరు జనాజాను చేరవేసేవారు. కనుక జనాజాకు ముందూ, వెనుకా, కుడిప్రక్కగా, ఎడమ ప్రక్కగా అన్నివైపులా నడుస్తూ పోవచ్చు.' అనస్(ర)గారే కాక ఇతరులు కూడా ఇలా అన్నారు 'జనాజాకు దగ్గరగా ఉండి నడుస్తూ పోవాలి.'**

50-1. అంటే అలవాటుకంటే ఎక్కువ వేగంగా నడవటం. పరిగెత్తటం కాదు. విద్వాంసులు దీనిని అభిలషణీయమైనదిగా అభివర్ణించారు.

**401.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'జనాజాను తీసుకుని త్వరత్వరగా నడుస్తూ వెళ్ళండి. ఒకవేళ ఆ జనాజా మంచి మనిషికి, సజ్జనుడికి చెందినదైతే అప్పుడు మీరు దానిని మేలు వైపునకు, మంచి వైపునకు దగ్గరగా తీసుకుపోతున్నారు. ఒకవేళ అది సజ్జనుడికి చెందినది కాకపోతే అప్పుడు మీరు మీ భుజాల మీదనుంచి ఒక చెడ్డ మనిషిని కిందకు దించుతున్నారు.'

## 51వ అధ్యాయం

**సజ్జనుడు, మంచివాడు అయిన వ్యక్తి శవం మంచం మీద నుంచే ఇలా అంటుంది. "నన్ను ముందుకు తీసుకెళ్ళండి. (నన్ను త్వరగా పూడ్చిపెట్టండి)".**

**402.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు 'శవాన్ని మంచం మీద పడుకోబెట్టినప్పుడు, తరువాత పురుషులు దానిని తమ భుజాల మీదకు ఎత్తుకున్నప్పుడు, ఒకవేళ ఆ శవం ధర్మనిష్టాపరుడైన వ్యక్తికి చెందినదైతే అప్పుడు అది ఇలా అంటుంది, 'నన్ను ముందుకు తీసుకు వెళ్ళండి'. ఒకవేళ అది పుణ్యపురుషునిది కాకపోతే అప్పుడు తనవారితో ఇలా అంటుంది, 'అయ్యో! నేను పాడుగాను! నన్ను మీరు ఎక్కడికి తీసుకుపోతున్నారు.' దాని కంఠస్వరాన్ని సృష్టిలోని ప్రతి సృష్టితమూ వింటుంది. కాని మనుషులు మాత్రం ఆ పిలుపును వినలేరు ఒకవేళ వారు విన్నట్లయితే స్పృహ తప్పి పడిపోతారు.'

## 52వ అధ్యాయం

**జనాజా నమాజు చేసేటప్పుడు, ఇమామ్ వెనుక రెండు లేక మూడు పంక్తులు కట్టటం.**

**403.** జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హబష్ రాజు మరణంపై జనాజా నమాజు చేశారు. అప్పుడు నేను జనాజా (గాయిబానా) నమాజులో రెండవ పంక్తిలోనో లేక మూడవ పంక్తిలోనో ఉన్నాను."

## 53వ అధ్యాయం

**జనాజా నమాజులో పంక్తులు కట్టటం.**

**404.** అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త మహాశయులు

ముహమ్మద్(స) నజాషి మరణం గురించి తమ అనుచరులకు తెలియజేశారు. తరువాత ఆయన(స)గారు ముందుకు వెళ్ళారు.ప్రజలు దైవప్రవక్త(స) వెనుక పంక్తులు కట్టి నిలబడ్డారు. అప్పుడు ఆయన(స) నాలుగు తక్బీర్‌లు పలికారు."

**405.** అష్షైబాని ఇలా ఉల్లేఖించారు: 'అష్షాబి ఇలా అన్నారు దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) గారితో ఉన్నటువంటి ఒక వ్యక్తి నాకు ఈ విషయాన్ని తెలియజేశారు, ఆయన(స)గారు ఒక సమాధి వద్దకు వెళ్ళారు. ఆ సమాధి ఇతర సమాధులకు దూరంగా, వేరుగా ఉంది. అక్కడ ఆయన(స) గారు పంక్తులు కట్టి నిలబడమని ఆదేశించారు. నాలుగు తక్బీర్‌లు పలికారు. షీబాని ఇలా అన్నారు– ఓ అబూ అమ్ర్! ఈ హదీసును గురించి నీకు ఎవరు చెప్పారు? అప్పుడు ఆయన 'ఇబ్నె అబ్బాస్ (రజిఅన్)' అని చెప్పారు."

**406.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు : 'ఇథియోపియాకు (హబష్) చెందిన సదాచార సంపన్నుడైన ఒక వ్యక్తి ఈ రోజు మరణించాడు. రండి! మన మందరం కలిసి అతని జనాజా నమాజును చేద్దాం'. జాబిర్(ర) ఇలా అన్నారు, మేము పంక్తులు కట్టి నిలబడ్డాము. దైవప్రవక్త(స) జనాజా నమాజును చేయించారు. అప్పుడు నేను రెండవ పంక్తిలో నిలబడి ఉన్నాను.

## 54వ అధ్యాయం

**జనాజాకు సంబంధించిన నమాజులో పిల్లలు కూడా పురుషులతోపాటు సమానంగా నిలబడటం.**

**407.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక సమాధి మీదుగా వెళ్ళటం జరిగింది. ఆ సమాధిలో పోయిన రాత్రి ఒక శవాన్ని పూడ్చిపెట్టారు. 'దైవప్రవక్త(స) ఎప్పుడు ఖననం చేశారు?' అని అడిగారు. ప్రజలు, పోయిన రాత్రి ఖననం చేశారు అని సమాధానం చెప్పారు. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'మీరు ఈ విషయాన్ని గురించి నాకు చెప్ప లేదే!' ప్రజలు ఇలా అన్నారు, మేము ఆ శవాన్ని రాత్రిపూట చీకటిలో ఖననం చేశాము. అటువంటి సమయంలో మిమ్మల్ని లేపటం మంచిది కాదని భావించాము. అప్పుడు ఆయన(స) లేచి నిలబడ్డారు. మేము ఆయన (స)గారి వెనుక పంక్తులు కట్టి నిలబడ్డాము. ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు, 'నేను కూడా

అందరితోపాటు పంక్తిలో నిలబడ్డాను.[1] తరువాత దైవప్రవక్త(స) ఆ శవానికి సంబంధించిన జనాజా నమాజును చేశారు.

## 55వ అధ్యాయం

### జనాజాను గురించి చేసే నమాజు న్యాయబద్ధం కావటం

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: 'ఏ వ్యక్తి అయితే జనాజా నమాజును చేస్తాడో'

ఆయన(స) సహాబాలతో ఇలా అన్నారు: 'మీరు మీ సహచరుని జనాజా నమాజును చెయ్యండి'. ఇంకా ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'నజాషీ జనాజా నమాజును చెయ్యండి ఆ నమాజును ఆయన నమాజు అన్నారు, అందులో రుకూ లేకపోయినా, సజ్దా లేకపోయినా. మరియు అందులో మాట్లాడకూడదు ఇంకా అందులో తక్బీర్ ఉంది. మరియు సలామ్ ఉంది. మరియు ఇబ్నె ఉమర్(రజిఅన్) ఉజూ చేసుకోకుండా జనాజా నమాజు చేసేవారు కాదు. ఇంకా సూర్యుడు ఉదయించే టప్పుడు లేక అస్తమించే సమయంలో నమాజు చేసేవారు కాదు. మరియు జనాజా నమాజులో చేతులు ఎత్తేవారు. ఇమామ్ హసన్ బస్రి(రహ్మాలై) ఇలా అన్నారు : 'నేను చాలామంది సహాబాలను, తాబయీన్‌లను చూశాను- వారు జనాజా నమాజులో ఇమామత్ చెయ్యటానికి ఎక్కువ హక్కుదారుడుగా ఫరజ్ నమాజులో ఇమామత్ చెయ్యటానికి హక్కుగల వ్యక్తినే భావించేవారు. పండుగ రోజున లేక జనాజా నమాజు సమయంలో వుజూ లేకపోతే అప్పుడు నీళ్ళకోసం వెతకాలి. తయమ్ముమ్ చేసుకోరాదు. ఇంకా జనాజా నమాజులో ప్రజలు నమాజు చేస్తూ ఉన్నప్పుడు వచ్చినట్లయితే, అల్లాహుఅక్బర్ అని పలికి నమాజులో చేరిపోవాలి.' సయీద్ బిన్ ముసయ్యబ్ ఇలా అన్నారు, రాత్రి సమయంలోగాని లేక పగటి సమయంలోగాని లేదా ప్రయాణంలో ఉన్నప్పుడుగాని లేదా ఇంట్లో ఉన్నప్పుడుగాని జనాజా నమాజులో నాలుగేసి తక్బీర్‌లు పలకాలి. అనస్(రజిఅన్)

---

407-1. ఇబ్నె అబ్బాస్(రజిఅన్) హజ్జతుల్ విదా వరకు యుక్త వయస్సుకు ఇంకా చేరలేదు. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఎవరైతే శవం యొక్క జనాజా నమాజును చెయ్యలేదో వారు ఆ శవాన్ని పూడ్చిపెట్టిన సమాధి వద్ద నమాజు చెయ్యవచ్చు. తెలిసిన మరొక విషయం ఏమిటంటే, రాత్రి సమయంలో శవాన్ని ఖననం చెయ్యటం దోషం కాదు. నలుగురు ఖలీఫాల మృతదేహాలను కూడా రాత్రి సమయంలోనే ఖననం చెయ్యటం జరిగింది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను బుధవారం నాటి రాత్రి ఖననం చేశారు.

ఇలా అన్నారు: 'జనాజా నమాజులో మొదటి తక్బీర్‌తో నమాజు ప్రారంభమవుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో తౌబా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'ఆ కపటులలో ఎవడైనా మరణిస్తే అప్పుడు అతని జనాజా నమాజును చెయ్యబాకు'. ఇంకా ఆ నమాజులో పంక్తులు ఉంటాయి. మరియు ఇమామ్ కూడా ఉంటాడు.

**408.** షాబీ ఇలా అన్నారని సులైమాన్ షైబానీ ఉల్లేఖించారు: ఇతర సమాధుల నుండి దూరంగా ఉన్నటువంటి ఒక సమాధి మీదుగా మీ ప్రవక్త(స) గారితో కలిసి వెళ్ళిన ఒక వ్యక్తి నాకు ఇలా చెప్పాడు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ఇమామత్‌లో మేము ఆయన(స)గారి వెనుక పంక్తులు కట్టి నమాజు చేశాము" అప్పుడు మేము ఇలా అడిగాము 'ఓ అబూఅమ్ర్! ఈ ఉల్లేఖనాన్ని నీకు ఎవరు చెప్పారు?' అతను, 'ఇబ్నె అబ్బాస్(ర)' అని సమాధానం చెప్పాడు.

## 56వ అధ్యాయం

### జనాజా వెంట వెళ్ళడం మరియు దాని ఔన్నత్యం.

జైద్ బిన్ సాబిత్(రజిఅన్) ఇలా అన్నారు: 'నీవు గనుక జనాజా నమాజును చేసినట్లయితే, అప్పుడు నీవు నీపై ఉన్నటువంటి విధిని (బాధ్యతను) నెరవేర్చావు.[1] హుమైద్ బిన్ హిలాల్ (ఒక తాబయి) ఇలా అన్నారు: 'మేము జనాజా నమాజు చేసిన తరువాత అనుమతి తీసుకోవటాన్ని ఎరుగము. కాని ఎవరైనా కేవలం నమాజును మాత్రమే చేసి తిరిగి వెళ్ళిపోయినట్లయితే అప్పుడు అతనికి ఒక ఖీరాత్‌కు సమానమైన ప్రతిఫలం లభిస్తుంది.'[2]

**409.** నాఫె ఇలా ఉల్లేఖించారు, అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్)తో ఎవరో ఇలా ప్రస్తావించారని ఆయన అన్నారు: అబూహురైరా(ర) ఈ హదీసును ఉల్లేఖించారు 'ఏ వ్యక్తి అయినా శవాన్ని సమాధిలో పూడ్చిపెట్టేవరకు జనాజాతో ఉంటే ఆ వ్యక్తికి ఒక ఖీరాత్‌తో సమానమైన పుణ్యం లభిస్తుంది.' ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు–

---

56–1. దీన్ని సయీద్ బిన్ మన్‌సూర్ వసల్ చేశారు భావం ఏమిటంటే, జనాజాతోపాటు ఖనన వాటికకు వెళ్ళే అవసరం లేదు. ఒకవేళ వెళ్ళినట్లయితే, అప్పుడు ఎక్కువ పుణ్యం లభిస్తుంది.

56–2. ఎవరైతే శవాన్ని సమాధిలో పూడ్చిపెట్టేవరకు ఉంటారో వారికి రెండు ఖీరాత్‌లకు సమానమైన పుణ్యం లభిస్తుంది.

అబూహురైరా (ర) చాలా హదీసుల్ని ఉల్లేఖించారు. తరువాత హజ్రత్ ఆయెషా (ర) కూడా అబూహురైరా (ర) గారి ఈ హదీసును ధ్రువీకరించారు. మరియు ఇలా అన్నారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలాగే బోధిస్తూ ఉండగా అబూహురైరా(ర) గారుచెబుతున్నట్లుగా నేను విన్నాను. ఇబ్నె ఉమర్(రజిఅన్) అప్పుడు ఇలా అనసాగారు, అలాగైతే మనం చాలా ఖీరాత్‌లను కోల్పోయాము.'

## 57వ అధ్యాయం

**ఎవరైతే శవాన్ని సమాధిలో పూడ్చిపెట్టేవరకు జనాజా వెంట ఉంటారో వారిని గురించి.**

**410.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు 'ఏ మనిషైతే నమాజె జనాజా పూర్తి అయ్యేవరకు జనాజాలో పాల్గొంటాడో ఆ మనిషికి ఒక ఖీరాత్‌కు సమానమైన పుణ్యం లభిస్తుంది. ఇంకా ఏ మనిషైతే శవాన్ని సమాధిలో పూడ్చి పెట్టేంతవరకు జనాజాలో పాల్గొంటాడో ఆ మనిషికి రెండు ఖీరాత్‌లు లభిస్తాయి. దైవప్రవక్త(స)ను 'రెండు ఖిరాత్‌ల విలువ ఎంత?' అని జనులు అడిగినప్పుడు, ఆయన(స) 'రెండు మహా పర్వతాలంత ఉంటుంది' అని సెలవిచ్చారు.

## 58వ అధ్యాయం

**'నమాజె జనాజా'లో పెద్దలతోపాటు పిల్లలు కూడా పాల్గొనటం**

**411.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) (అప్పుడు ఆయన ఒక బాలుడు మాత్రమే) ఇలా అన్నారని ఆమిర్ ఉల్లేఖించారు: 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక సమాధి వద్దకు వచ్చారు. అప్పుడు అక్కడ ఉన్న ప్రజలు ఆయన(స) గారితో ఇలా అన్నారు, 'ఇది ఒక పురుషుని శవం. దాన్ని నిన్నరాత్రి ఖననం చేశారు.' అప్పుడు ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారు- తరువాత మేము దైవప్రవక్త(స)గారి వెనుక బారులు తీరి నిలబడ్డాము. ఆయన(స) నమాజె జనాజాను చేయించారు.

## 59వ అధ్యాయం

**ఈద్గాహ్‌లోగాని లేక మసీదులోగానీ నమాజె జనాజా చెయ్యటం.**

**412.** అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇథియోపియో రాజు అయిన నజాషి మరణం గురించి అతను

మరణించిన రోజునే మాకు తెలియజేశారు. (ఇది ఆయన(స)గారి మహాత్యం) దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'మీ సోదరుని కోసం దుఆ చెయ్యండి.'

అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈద్గాహ్‌లో పంక్తులలో నిలబడమని ఆదేశించారు. మరియు నాలుగు తక్బీర్‌లు పలికారు.'

**413.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఖైబర్‌కు చెందిన కొందరు యూదులు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి వద్దకు ఒక యూద పురుషుణ్ణీ, ఒక యూద స్త్రీని తీసుకువచ్చారు. వారు ఉభయులూ వ్యభిచారానికి పాల్పడ్డారు. ఆయన (స) ఆజ్ఞాపన ప్రకారం ఆ స్త్రీ పురుష లిద్దరినీ. మసీదు వద్దకు జనాజా పెట్టే స్థలానికి దగ్గరగా రాళ్లతో కొట్టి చంపటం జరిగింది.'

## 60వ అధ్యాయం

**సమాధులపై మసీదులు నిర్మించటం మక్రూహ్[1] అంటే అవాంఛనీయం. హసన్ బిన్ హసన్ ఇబ్నె అలీ (రజిఅన్) గారు మరణించి నపుడు ఆయన గారి సతీమణి (ఫాతిమా బిన్తె హుసైన్) ఆయన గారి సమాధిపై ఒక సంవత్సర కాలం వరకు ఒక డేరా (టెంట్)ను కట్టి ఉంచారు. చివరకు ఆ డేరాను ఎత్తివేశారు. ఆ సమ యంలో అక్కడ ఉన్న వారికి ఒక పిలుపు (దైవదూత లేక జిన్నాతు) వినిపించింది. ఆ పిలిచేవాడు ఇలా అన్నాడు 'ఏమిటి! ఎవరినయితే వారు పోగొట్టు కున్నారో వారిని పొందారా?' రెండో అతను (దైవదూత లేక జిన్నాతు) ఇలా సమాధానం పలికాడు 'లేదు, వారు పొందలేదు.' వారు నిరాశతో నిస్పృహతో మరలి పోయారు.**

**414.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా చెప్పారని ఉర్వా ఉల్లేఖించారు– దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి మరణానికి కారణమైన వ్యాధిలో

---

60–1. అంటే ప్రత్యేకంగా సమాధి పైనగాని లేదా సమాధి దగ్గర్లో చుట్టూతా ఉన్న ప్రదేశంలో గాని అని భావం. ఇందులో ఉన్న యుక్తి ఏమిటంటే, క్రమక్రమంగా ప్రజలు సమాధుల్ని పూజించటం ప్రారంభిస్తారేమో అని. పూర్వకాలంలో విగ్రహారాధకులు కూడా ఇలాగే చేశారు. కావున సమాధికి దగ్గర్లో కూడా మసీదుల్ని నిర్మించటం నిషేధించబడింది. సమాధిపైనా లేక సమాధికి దరిదాపుల్లో గాని అల్లాహ్ ఆరాధన నిషేధించబడినప్పుడు సమాధి పూజ ఎంత గట్టిగా ఎంత తీవ్రంగా నిషేధించబడుతుందో అనే విషయాన్ని వివేక వంతులు అర్థం చేసుకోవాలి.

ఉన్నప్పుడు ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ యూదుల్ని మరియు క్రైస్తవుల్ని శపించాడు. వారు తమ ప్రవక్త సమాధుల్ని మసీదులుగా చేసుకున్నారు". హజ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారు, ఇలాంటి భయమే లేకుండా ఉన్నట్లయితే దైవప్రవక్త (స) గారి సమాధి ప్రముఖంగా తెరిచి ఉంచబడేది. ఆయన(స) గారి సమాధిని మసీదుగా చేసుకుంటారేమోనని నేను కూడా భయపడుతున్నాను.

## 61వ అధ్యాయం

**కాన్పు సమయంలో స్త్రీ గనక మరణిస్తే ఆమెను గురించి నమాజె జనాజా చెయ్యటం.**

**415.** సమురా బిన్ జున్దబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి వెనుక నిలబడి ఒక స్త్రీ (ఉమ్మెకాబ్)పై నమాజె జనాజా చేశాను. ఆమె కాన్పు సమయంలో మరణించారు. ఆయన (స) గారు శవపేటిక దగ్గర మధ్య భాగంలో నిలబడి నమాజు చేశారు.'

## 62వ అధ్యాయం

**ఇమామ్ గనక స్త్రీ నమాజె జనాజా చేయిస్తే అప్పుడు అతను ఎక్కడ నిలబడాలి? మరియు పురుషుని నమాజె జనాజా చేయిస్తే అప్పుడు అతను ఎక్కడ నిలబడాలి?**

**416.** సమురా బిన్ జున్దబ్ (రజి) ఇలా ఉల్లేఖించారు: 'నేను ఒకసారి దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్)గారి వెనుక నిలబడి ఒక స్త్రీని గురించి నమాజె జనాజా చేశాను. ఆమె ప్రసూతి సమయంలో మరణించారు. అప్పుడు ఆయన (స) గారు ఆమె శవపేటికకు ఎదురుగా మధ్యభాగంలో నిలబడి నమాజు చేయించారు.

## 63వ అధ్యాయం

**నమాజె జనాజాలో నాలుగు తక్బీర్‌లు అనాలి. హుమైద్ తవీల్ ఇలా అన్నారు : 'అనస్ (రజిఅన్) మాచేత నమాజె జనాజా చేయించారు. అప్పుడు ఆయన మూడు తక్బీర్‌లు మాత్రమే పలికారు. ఆ తరువాత సలామ్ చేశారు. అప్పుడు ప్రజలు ఆయన్ని ఈ విషయం గురించి ప్రశ్నించారు. వెంటనే ఆయన మళ్ళీ ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని త్రిప్పి, నాలుగో తక్బీర్ పలికారు. ఆ తరువాత సలామ్ చేశారు.'**

**417.** అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు

**ముహమ్మద్(స) నజాషీ మరణవార్తను అతను మరణించిన రోజునే మాకు తెలియజేశారు. (అతను హబష్ దేశంలో మరణించాడు) అప్పుడు ఆయన(స)గారు ప్రజల్ని తీసుకుని ఈద్గాహ్‌కు వెళ్ళారు. అక్కడ ప్రజల చేత పంక్తులు కట్టించారు. ఇంకా ఆయన జనాజా నమాజులో నాలుగు తక్బీర్లు పలికారు.'**

**418.** **జాబిర్ ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అస్‌హమ అన్‌నజాషి యొక్క నమాజె జనాజాను చేయించారు అప్పుడు ఆయన(స) నాలుగు తక్బీర్‌లు పలికారు."**

## 64వ అధ్యాయం

**జనాజా నమాజులో ఫాతిహా సూరా పఠించడం.[1] ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా అన్నారు: "శిశువు యొక్క జనాజా నమాజు లో ఫాతిహా సూరా పఠించ బడుతుంది. తరువాత ఈ దుఆ చెయ్యాలి 'అల్లాహుమ్మజ్ అల్‌హు లనా ఫరతన్ వ సలఫన్ వ అజ్‌రా"**

**419.** తల్‌హ బిన్ అబ్దుల్లా బిన్ ఔఫ్ ఇలా ఉల్లేఖించారు: 'నేను అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅన్) గారి వెనుక జనాజా నమాజు చేశాను. ఆ నమాజులో ఆయన ఫాతిహా సూరాను పఠించారు (కొంచెం బిగ్గరగా పఠించారు). ఇలా అన్నారు, నేను ఇలా ఎందుకు చేశానంటే ఇది దైవప్రవక్త(స)గారి సంప్రదాయమని మీరు తెలుసుకో వాలని.'

## 65వ అధ్యాయం

**శవాన్ని పూడ్చిపెట్టిన తరువాత సమాధిపై జనాజా నమాజు చెయ్యటం.**

**420.** సులైమాన్ అష్‌షైబాని ఇలా ఉల్లేఖించారు: ఆమిర్ షాబీ ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను 'ఇతర సమాధుల నుంచి దూరంగా ఉన్నటువంటి ఒక సమాధి

---

64-1. ఎందుకంటే, అది నమాజు కావటం చేత, పైన ఇమామ్ బుఖారి(రహ్మాలై) ఆయతుల ద్వారా, హదీసుల ద్వారా ఈ విషయాన్ని నిరూపించారు. సహీ హదీసులో ఇలా ఉంది: లా సలాత్ ఇల్లా బిఫాతిహల్ కితాబ్. ఇమామ్ షాఫయి (రహ్మాలై), ఇమామ్ అహ్మద్ బిన్ హమ్‌బల్(రహ్మాలై), ఇస్‌హాఖ్ (రహ్మాలై) గార్ల అభిప్రాయం కూడా ఇదే. అహ్లె హదీసువారు కూడా దీనినే అవలంబించారు ఇమామ్ మాలిక్ (రహ్మాలై), అబూహనీఫా (రహ్మాలై) గార్లు ఫాతిహా సూరా పఠించకూడదని అన్నారు.

మీదుగా దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వెళుతూ ఉన్నప్పుడు నేను ఆయన(స) గారితో ఉన్నాను' అని ఒక మనిషి నాకు చెప్పాడు. ఇంకా అతను ఇలా అన్నాడు: దైవప్రవక్త(స) అక్కడ నమాజుకు నాయకత్వం వహించారు. ప్రజలు ఆయన(స) గారి వెనుక నిలబడి నమాజు చేశారు. నేను ఇలా అన్నాను 'ఓ అబూ అమ్ర్! ఈ హదీసును గురించి నీకు ఎవరు చెప్పారు?' ఆయన 'ఇబ్నెఅబ్బాస్'అని సమాధానం చెప్పారు.

**421.** హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : 'నల్లగా ఉండే ఒక పురుషుడు మసీదులో కసువు ఊడుస్తూ ఉండేవాడు. లేదా నల్లగా ఉండే ఒక స్త్రీ మసీదులో కసువు ఊడుస్తూ ఉండేది. అతను చనిపోయాడు. లేదా ఆమె చని పోయింది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి అతని లేక ఆమె మరణం గురించి సమాచారం అందలేదు. ఒకరోజున ఆయన(స)గారు అతన్ని గురించి లేక ఆమెను గురించి వాకబు చేశారు. మరియు అతను లేక ఆమె ఎక్కడ ఉన్నారు? అని అడిగారు. (అతను ఏమయ్యాడు? ఆమె ఏమయింది? అని అడిగారు) ప్రజలు ఇలా విన్నవించుకున్నారు ఓ దైవప్రవక్తా(స)! అతను చనిపోయాడు (లేక ఆమె చనిపోయింది). అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'మీరు ఆ విషయం గురించి నాకు ఎందుకు తెలియజెయ్యలేదు?' ప్రజలు ఇలా అన్నారు: ఇలా అయింది అలా అయింది అని అతని గాధను లేక ఆమె వృత్తాంతాన్ని వినిపించారు. క్లుప్తంగా చెప్పాలంటే, వారు అతన్ని లేక ఆమెను అల్పమైన వ్యక్తిగా భావించారు. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'ఇప్పుడు మీరు అతని సమాధి లేక ఆమె సమాధి ఎక్కడ ఉందో చూపించండి.' అబూ హురైరా (ర) ఇలా అన్నారు: తరువాత దైవప్రవక్త(స) అతని లేక ఆమె సమాధి వద్దకు వచ్చి అక్కడ నమాజె జనాజా చేశారు.

## 66వ అధ్యాయం

### మృతుడు, తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోయే ప్రజల అడుగుల సవ్వడిని వింటాడు.

**422.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు: "ఒక మనిషిని సమాధిలో పెట్టినప్పుడు, అతని సహచరులు వీపులు త్రిప్పి తమతమ ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోయినప్పుడు, అతను వారి చెప్పుల సవ్వడిని సైతం వింటాడు. ఆ సమయంలో అతని వద్దకు ఇద్దరు దైవదూతలు వస్తారు. వారు అతన్ని లేపి కూర్చోబెడతారు. ముహమ్మద్(స)ను గురించి నీవు ఎలాంటి

విశ్వాసాన్ని కలిగి ఉండేవాడవు? అని అడుగుతారు. అప్పుడు అతను ఇలా అంటాడు: "ఆయన(స) గారు అల్లాహ్ దాసులనీ, అల్లాహ్ ప్రవక్తలనీ నేను సాక్ష్యమిస్తున్నాను." తరువాత అతనితో ఇలా అనబడుతుంది: 'నరకంలో నీకు కేటాయించబడిన స్థలాన్ని ఒకసారి చూసుకో! దానికి బదులుగా అల్లాహ్ నీకు స్వర్గ లోకంలో నివాస స్థలాన్ని ప్రసాదించాడు'. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: అప్పుడు అతను తనకు ఇవ్వబడిన ఆ రెండు స్థలాలను చూసుకుంటాడు. అవిశ్వాసి లేక వంచకుడు అయిన దుర్మార్గుడు దైవదూతలకు సమాధానంగా ఇలా పలుకుతాడు: 'నేను ఎరుగను, ప్రజలు చెప్పుకునే దాన్నే నేను కూడా చెబుతుండేవాణ్ణి.' తరువాత అతనితో ఇలా అనబడుతుంది: 'స్వయంగా నీవుకూడా ఆలోచించలేదు. పండితులూ, విద్వాంసులూ అయిన వారిని కూడా నీవు అనుసరించలేదు.' ఆ తరువాత ఒక ఇనుప దుడ్డుకర్రతో అతని చెవుల మధ్య ఉన్న స్థలం మీద ఒక దెబ్బ కొట్టబడుతుంది. అప్పుడు అతను ఒక పెద్ద కేక వేస్తాడు. అతనికి దగ్గరగా ఉన్నటువంటి సృష్టితాలు (మనుషులు, జిన్నాతులు తప్ప) ఈ కేకను వింటాయి.

## 67వ అధ్యాయం

**ఒక మనిషి ఎవరైనా తనను ఏదైనా శుభప్రదమైన, పవిత్రమైన ఒక స్థలంలో ఖననం చెయ్యాలని కోరుకుంటే....**

**423.** హజ్రత్ అబూహురైర(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు "ఒకసారి మరణాల దూతను దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) వద్దకు పంపటం జరిగింది (మానవ రూపంలో) ఆ దూత వచ్చినప్పుడు ప్రవక్త మూసా(అ) ఏదో ఒక కార్యంలో నిమగ్నమై ఉన్నారు. ఆ దూత ప్రవక్త మూసా(అ)ను వేధించాడు. అప్పుడు ఆయన అతన్ని గుర్తించని కారణంగా కంటిమీద పెట్టికొట్టారు. ఆ విధంగా ఆయన అతని కంటిని పగలగొట్టేశారు. అప్పుడు అతను తన యజమాని వద్దకు తిరిగివెళ్ళాడు. యజమానితో ఇలా అన్నాడు 'నీవు నన్ను చావటానికి ఇష్టపడని నీ దాసుని వద్దకు పంపావు'. అల్లాహ్ అతని కంటిని బాగుచేసి పూర్వ స్థితికి తెచ్చాడు. మరియు ఇలా సెలవిచ్చాడు, మూసా వద్దకు మళ్ళీ వెళ్ళి అతనితో ఇలా అను: 'ఒక ఎద్దు వీపుపై నీ చేతిని పెట్టు, ఎన్ని వెంట్రుకలైతే నీ చేతికిందకు వస్తాయో నీవు అన్ని సంవత్సరాలు బ్రతికి ఉంటావు.' దైవదూత అలాగే చేశాడు. హజ్రత్ మూసా ఇలా విన్నవించుకున్నారు, దాని తరువాత ఏమిటి?' 'మరణం'అని ఆజ్ఞాపించటం జరిగింది. అతను ఇలా అన్నాడు 'అయితే

మరణం ఇప్పుడే మంచిది కదా! ఆ తరువాత మూసా(అ) అల్లాహ్‌తో ఇలా దుఆ చేశారు: ఓ అల్లాహ్! 'నన్ను బైతుల్ మఖ్దిస్‌కు రువ్విన రాయి పోవునంత దూరంలో ఉండేలా చేర్చు'. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు 'ఒకవేళ నేనుగనుక అక్కడ ఉన్నట్లయితే మీకు ప్రవక్త మూసా(అ) సమాధిని చూపించి ఉండేవాణ్ణి, 'అది ఎర్రని ఇసుక దిబ్బకు దగ్గరగా ఉంది.'

## 68వ అధ్యాయం

**రాత్రి సమయంలో శవాన్ని సమాధి చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమేనా? హజ్రత్ అబూబకర్ సిద్దిఖ్ (రజిఅన్) రాత్రి సమయంలోనే సమాధి చేయబడ్డారు.**

**424.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి రాత్రి సమయంలో సమాధి చేయబడిన ఒక వ్యక్తిని గురించి (రెండో రోజున) నమాజె జనాజా చేశారు. ఆయన(స) గారు తన ప్రత్యక్ష అనుచరులతో కలిసి నమాజు కోసం నిలబడ్డారు. అప్పుడు ఆయన(స)గారు, 'ఈ సమాధి ఎవరిది?' అని అడిగారు. ప్రజలు, 'ఈ సమాధి ఫలానా వ్యక్తిది అని, అతను పోయిన రాత్రి సమాధి చేయబడ్డాడు' అని ప్రజలు సమాధానంగా విన్నవించుకున్నారు. ఆ తరువాత ఆయన(స)గారు నమాజె జనాజా చేశారు.

## 69వ అధ్యాయం

**సమాధిపై మసీదు నిర్మాణం ధర్మసమ్మతమేనా?**

**425.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అస్వస్థులైనప్పుడు (ఆయన(స) గారి మరణానికి కారణమైన వ్యాధిలో) ఆయన(స)గారి సతీ మణులు కొందరు (ఉమ్మె సలమా (ర) మరియు ఉమ్మె హబీబా (ర)) ఒక చర్చిని గురించి ప్రస్తావించారు. దాని పేరు మారియ. వారు ఆ చర్చిని ఇథియోపియా దేశంలో చూశారు. ఉమ్మె సలమా(ర), ఉమ్మె హబీబా(ర) ఉభయులూ కలిసి ఇథియోపియా దేశాన్ని సందర్శించారు. వారు ఆ చర్చి శోభను గురించి దాని అందాన్ని గురించి అక్కడ ఉన్న చిత్రాలను గురించి వివరించారు. అప్పుడు దైవప్రవక్త(స) తన శిరస్సును పైకి ఎత్తి ఇలా సెలవిచ్చారు. "ఆ దేశంలోని ప్రజలు ఒక సంప్రదాయాన్ని పాటించేవారు. వారిలోని ఒక దైవభక్తుడుగానీ, ఒక సౌశీల్యవంతుడు గానీ మరణిస్తే అప్పుడు అతని సమాధిపై మసీదును నిర్మించు

కునేవారు. ఇంకా ఆ మసీదులో అతని చిత్రపటాలను పెట్టేవారు. అల్లాహ్ దృష్టిలో ఈ ప్రజలు సకల సృష్టితాలకంటే నికృష్టులు."

## 70వ అధ్యాయం

### స్త్రీల సమాధిలోకి ఎవరు దిగవచ్చు అనే విషయం గురించి.

**426.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు, ఆయన(ర) ఇలా అన్నారు, 'మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ఒక కుమార్తె జనాజాలో పాల్గొన్నాము. దైవప్రవక్త(స)గారు సమాధికి సమీపంలో కూర్చొని ఉన్నారు. నేను చూశాను, అప్పుడు ఆయన(స)గారి కళ్ళల్లోనుంచి అశ్రువులు ధారాప్రవాహంగా కారుతున్నాయి. ఆయన(స) ఇలా సెలవిచ్చారు: "పోయిన రాత్రి తన భార్య వద్దకు సంభోగ నిమిత్తం వెళ్ళనటువంటి వ్యక్తి మీలో ఎవరైనా ఉన్నారా?" అప్పుడు అబూ తల్హా, ఓ దైవప్రవక్తా(స)! 'నేను' అని అన్నారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు- అయితే ఆమె సమాధిలోకి నువ్వు దిగు.[1] హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు: కనుక అబూ తల్హా(ర) ఆమె సమాధిలోకి దిగారు. మరియు ఆమెగారి జనాజాను సమాధిలో పెట్టారు'.

## 71వ అధ్యాయం

### అమరగతి పొందిన వ్యక్తి నమాజె జనాజా చెయ్యవచ్చునా లేక చెయ్యకూడదా?

**427.** జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ(రజిఅన్) ఉల్లేఖించారు ఆయన ఇలా అన్నారు- ఉహద్ యుద్ధంలో ఏమి జరిగిందంటే, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఎవరైతే హతమార్చబడ్డారో వారిలోనుంచి ఇద్దరిద్దరి శవాలను ఒకచోట పోగుచేసి తరువాత ఇలా అడిగేవారు 'ఈ ఇద్దరిలో దివ్యఖుర్ఆన్ ఎవరికి ఎక్కువగా జ్ఞాపకం ఉన్నది?' ప్రజలు ఆ ఇద్దరిలో ఒకరిని చూపించినప్పుడు, ఆయన (స) అతన్ని మొట్టమొదట సమాధిలోకి దించేవారు. మరియు ఇలా సెలవిచ్చేవారు, 'ప్రళయదినం

426-1. తెలిసిన విషయమేమిటంటే, ఇతర వ్యక్తి కూడా ఒక స్త్రీ జనాజాను సమాధిలో ఉంచ గలుగుతాడు, వాస్తవానికి ప్రవక్త(స) కుమార్తె భర్తగారైన హజ్రత్ ఉస్మాన్(ర) కూడా అక్కడ ప్రత్యక్షంగా ఉన్నారు. కాని దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చినప్పుడు 'ఈరోజు రాత్రి స్త్రీతో సంభోగించని వ్యక్తి ఎవరైనా మీలో ఉన్నారా?' ఆయన అంటే హజ్రత్ ఉస్మాన్(ర) అక్కణ్ణుంచి తొలగిపోయారు.

నాడు నేను అమరగతిని పొందిన వీరికి సాక్షిగా ఉంటాను. ఆయన(స) ఇలా ఆజ్ఞాపించారు, ఈ స్థితిలోనే (ఇదేవిధంగా) రక్తసిక్తమై ఉన్న స్థితిలో వారిని సమాధి చేయాలి. వారికి గుసుల్ కూడా ఇవ్వలేదు. వారి నమాజె జనాజాను కూడా చెయ్యలేదు.'

**428.** ఉఖబా బిన్ ఆమిర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఒక రోజున మదీనా పట్టణం నుంచి బయటకు వెళ్లి ఉహుద్ సంగ్రామంలో అమరగతి పొందిన వారికోసం నమాజు చేశారు (దుఆ చేశారు). ఆయన (స) గారు ఈ నమాజును నమాజె జనాజా చేసినట్లుగా చేశారు. ఆ తరువాత ఆయన (స) మింబర్ వైపునకు వచ్చారు. మరియు దానిపైకి ఎక్కి ఇలా సెలవిచ్చారు 'చూడండి! నేను మీకంటే ముందుగా (ముందస్తుగా) వెళతాను. (మీ కోసం మార్గాన్ని సులభతరం చేస్తాను). అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. నేను నా హౌజ్ (కౌసర్)ను ఇప్పుడు కళ్లారా చూస్తున్నాను. ఇంకా నాకు భూమిలోని నిధులూ నిక్షేపాల తాళం చెవులు ఇవ్వబడ్డాయి. లేక భూమికి చెందిన తాళం చెవులు ఇవ్వబడ్డాయి. ఇంకా అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను, నా తరువాత మీరు ముష్రిక్కులైపోతారని (అందరూ ముష్రిక్కులైపోతారని) నేను భయపడటం లేదు. కాని ప్రాపంచిక వస్తువుల కోసం మీరు పరస్పరం పోరాడుకుంటారని నేను భయపడు తున్నాను.'

## 72వ అధ్యాయం

### ఒకే సమాధిలో ఇద్దరు లేక ముగ్గురు మనుషుల్ని ఖననం చెయ్యటం.

**429.** జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఉహుద్ సంగ్రామంలో షహీదులైన వారిని ఇద్దరిని కలిపి ఒకే సమాధిలో పూడ్చారు.

## 73వ అధ్యాయం

### షహీదులకు గుసుల్ ఇవ్వకూడదు.

**430.** జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు, 'దైవప్రవక్త మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఉహుద్ యుద్ధంలో షహీదులైన వారిని గురించి ఇలా సెలవిచ్చారు: రక్తసిక్తమై ఉన్న స్థితిలోనే వారిని సమాధిలో పూడ్చి పెట్టండి. వారికి గుసుల్ ఇవ్వటం జరగలేదు.'

## 74వ అధ్యాయం

**లహ్‌ద్ (బుగ్‌లి ఖబర్)లోకి ముందు ఎవరిని దించాలి? ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఇలా సెలవిచ్చారు: బుగ్‌లి సమాధిని 'లహ్‌ద్' అని ఎందుకంటారంటే, అది ఒక మూలలో ఉంటుంది. దీని మూలంగానే సూరె కహఫ్‌లో 'ముల్‌తహిదా' అనబడింది. అంటే శరణు పొందే మూల. ఒకవేళ అది తిన్నగా ఉన్న సమాధి అయితే అప్పుడు దాన్ని జరీహ్ అని అంటారు.**

**431.** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఉహుద్ సంగ్రామంలో అమరగతి పొందిన వారిలో నుంచి ఇద్దరిద్దరి మృతదేహాలను కలిపి ఒకే వస్త్రంలో కఫన్ చేసేవారు. ఆ తరువాత 'వారిలో ఎవరికి ఖురాను గ్రంథం ఎక్కువగా జ్ఞాపకం ఉంది?' అని అడిగేవారు. అతను ఎవరో ఆయన (స) గారికి చూపించినప్పుడు, ఆయన(స) అతన్ని బుగ్‌లి సమాధిలో ముందు స్థానంలో ఉంచేవారు.[1] ఇంకా ఇలా సెలవిచ్చేవారు 'నేను వారికి సాక్షిగా ఉన్నాను వారిని ఇదే స్థితిలో రక్తసిక్తమై ఉన్న స్థితిలో సమాధి చేయమని' ఆయన (స) ఆజ్ఞాపించారు. వారిని అదే విధంగా సమాధి చెయ్యటం జరిగింది. వారి నమాజె జనాజాను చెయ్యలేదు, వారికి గుసుల్ కూడా ఇవ్వబడలేదు. జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అదనంగా ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఉహుద్ సంగ్రామంలో షహీదులైన వారిని గురించి ఇలా అడిగేవారు 'వారిలో ఎవరికి ఖురాను గ్రంథం ఎక్కువగా జ్ఞాపకం ఉంది.' ప్రజలు ఆయన (స) గారికి ఆ వ్యక్తిని చూపించినప్పుడు, ఆయన(స) అతన్ని బుగ్‌లి సమాధిలో అతని సహచరునికి ముందు భాగంలో ఉన్న స్థలంలో ఉంచేవారు. జాబిర్ (ర) ఇలా అనే వారు 'నా తండ్రి గారైన అబ్దుల్లాగారు మరియు నా పినతండ్రి అయిన (అమ్ర్ బిన్ జమూహ్) గారు - ఈ ఉభయుల్ని ఒకే కంబలిలో చుట్టి సమాధి చేయటం జరిగింది.'

## 75వ అధ్యాయం

**ఇజ్‌ఖిర్‌ను, ఎండుగడ్డిని సమాధిలో పరచటం.**

**432.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఇబ్నె

---

431-1. అంటే, ఖిబ్లా వైపున అతను ముందు భాగంలో ఉంటాడు. అతని వెనుక అతని కంటే తక్కువ ఖుర్ఆన్ కంఠస్థం చేసిన వ్యక్తి ఉంచబడతాడు అని భావం.

అబ్బాస్(ర) ఉల్లేఖించారు: "అల్లాహ్ మక్కా నగరాన్ని పుణ్య స్థలంగా తీర్చిదిద్దాడు. నాకు పూర్వం కూడా అది ఎవరికొరకూ ధర్మ సమ్మతం చెయ్యబడలేదు. నా తరువాత కూడా అది ఎవరి కొరకూ ధర్మసమ్మతం చెయ్యబడదు. మక్కా విజయ దినం నాదు కొన్ని గంటల వరకు మాత్రమే అది నా కొరకు ధర్మసమ్మతం చెయ్యబడింది. అక్కడ పెరిగే గడ్డిని కోసే అనుమతి ఎవరికీ లేదు. అందులోని చెట్లను ఎవరూ నరకకూడదు. అక్కడ ఉన్న ఏ జంతువునూ (వేట కోసం) పరుగెత్తించకూడదు. అక్కడ నేలపై పడి వున్న వస్తువును దేన్నీ ఎత్తుకోకూడదు. కాని దానిని గుర్తింపజేయాలి". హజ్రత్ అబ్బాస్(ర) ఇలా విన్నవించుకున్నారు; ఓ దైవప్రవక్తా(స)! 'ఇజ్ఖిర్'కు అనుమతివ్వండి. ఎందుకంటే, దానిని మన బంగారం పని చేసేవారు ఉపయోగిస్తారు. మన సమాధులలో అది పరచబడుతుంది. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'సరే మంచిది. ఇజ్ఖిర్‌కు అనుమతి ఉంది.' అబూ హురైరా(ర) దైవప్రవక్త(స) గారి నుంచి ఇలా ఉల్లేఖించారు: "మన సమాధులు, మన గృహాల కోసం అది ఉపయోగపడుతుంది". ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు 'మన కమసాలీల కోసం, గృహాల కోసం అది ఉపయోగ పడుతుంది.'

## 76వ అధ్యాయం

## మృతదేహాన్ని ఏదైనా అవసరం నిమిత్తం సమాధిలో నుంచి, లహద్‌లో నుంచి బయటికి తీయవచ్చునా?

**433.** జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అబ్దుల్లా బిన్ ఉబై(వంచకుడు) సమాధి వద్దకు విచ్చేశారు. అప్పుడు అతని మృతదేహం సమాధిలో పెట్టబడింది 'అతని శవాన్ని బయటికి తీయండి' అని దైవప్రవక్త(స) ఆదేశించారు.' అప్పుడు అది బయటికి తీయ బడింది. దైవప్రవక్త(స) దానిని తన మోకాళ్ళపై పెట్టుకున్నారు. మరియు తన ఉమ్మిని దానిపై వేశారు. ఇంకా తన చొక్కాను ఆ శవానికి తొడిగారు. దానికి కారణం ఏమిటో (అల్లాహ్‌కు మాత్రమే తెలుసు). అబ్దుల్లా బిన్ ఉబై హజ్రత్ అబ్బాస్(ర)కు ఒక చొక్కాను తొడిగారు. సుఫ్యాన్ బిన్ అయ్‌నియ, అబూ హారూన్ నుంచి ఇలా అన్నారు 'దైవప్రవక్త(స) ఆ సమయంలో రెండు చొక్కాలను ఒకదాని మీద ఒకటి తొడుక్కొని ఉన్నారు.' అబ్దుల్లా బిన్ ఉబై కుమారుడు (అతను సత్యవంతుడైన విశ్వాసి) దైవ ప్రవక్త(స) గారితో ఇలా విన్నవించుకున్నారు: 'ఓ దైవప్రవక్తా(స) మీ శరీరానికి తగిలి

ఉన్నటువంటి చొక్కాను అతనికి తొడగండి.' సుఫ్యాన్ ఇలా అన్నారు, దైవ ప్రవక్త(స) అబ్దుల్లా బిన్ ఉబైకు తన చొక్కాను అతడు హజ్రత్ అబ్బాస్(రజిఅన్)కు తొడిగిన చొక్కాకు బదులుగా తొడిగారని ప్రజలు అర్థం చేసుకున్నారు.

**434.** జాబిర్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు– 'ఉహుద్ సంగ్రామం ముంచుకు వచ్చినప్పుడు (అంటే మరుసటి రోజు ఉదయం యుద్ధం ప్రారంభమవుతుంది) నా తండ్రిగారైన అబ్దుల్లా గారు ఆ రోజు రాత్రి నన్ను తన వద్దకు పిలిపించారు. ఆయన నాతో ఇలా అనసాగారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి సహాబాలలోనుంచి మొట్టమొదట నేనే హతమార్చబడతాను అని అనుకుంటున్నాను నేను నా తరువాత విడిచిపెట్టి వెళ్ళే నా సమీప బంధువుల్లోగాని, నా వారసుల్లోగాని నాకు నీకంటే ఎక్కువ ప్రియమైనవాడు మరొకడెవ్వడూ లేడు. అయితే కేవలం దైవప్రవక్త మహాశయులు మాత్రమే నాకు నీకంటే అత్యంత ప్రియమైన వారు. ప్రియమైన కుమారా! చూడు, నాపై అప్పు భారం ఉంది. నీవు ఆ అప్పును చెల్లించు. ఇంకా చూడు! నీ (తొమ్మిది మంది) సోదరీమణుల పట్ల సద్భావంతో వ్యవహరిస్తూ ఉండు. మరుసటి రోజు ఉదయం ప్రారంభమైన యుద్ధంలో అందరికంటే ముందు నా తండ్రిగారే అమరగతి పొంది షహీదుల్లో కలిసిపోయారు. మొదట నేను మరొక వ్యక్తిని (నా బావ గారిని) నా తండ్రిగారితో కలిపి సమాధిలో పూడ్చి పెట్టాను. తరువాత నేను నా తండ్రిగారిని మరొకరితో కలిపి సమాధి చేయటం అనేది మంచి విషయంగా అనిపించలేదు. ఆరు మాసాల తరువాత నా తండ్రిగారి మృతదేహాన్ని నేను బయటికి తీసి చూశాను. అది యధాతథంగా ఎలా పెట్టారో అలాగే చెక్కు చెదర కుండా ఉంది. కాని ఒక చెవి మటుకు కాస్తంత కృశించిపోయింది.

**435.** జాబిర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'నా తండ్రిగారితో పాటు మరొక వ్యక్తిని కూడా సమాధిలో పూడ్చిపెట్టారు. ఇది నాకు సహించలేదు. నేను నా తండ్రి గారిని ఆ సమాధిలోనుండి బయటికి తీసి ఆయన్ని మరొక సమాధిలో పూడ్చిపెట్టాను.'

## 77వ అధ్యాయం

### 'బగ్లి' సమాధి తయారు చెయ్యటం శ్రేష్టమైనదా? లేక 'సందూఖి' సమాధి తయారు చెయ్యటం శ్రేష్టమైనదా?

**436.** జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఆయన ఇలా అన్నారు– దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉహుద్ సంగ్రామంలో అమరగతి

(షహాదత్) పొందినవారిలో నుంచి ఇద్దరిద్దరు వ్యక్తులను కలిపి తరువాత ఇలా అడిగేవారు, ఈ ఉభయుల్లో ఎవరు ఎక్కువ ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేశారు?' వారిలో నుంచి ఒక వ్యక్తిని చూపించినప్పుడు, ఆయన(స)గారు అతన్ని బగ్‌లి సమాధిలో మొట్టమొదట పెట్టేవారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చేవారు 'ఈ వ్యక్తులు ఇస్లామ్ ధర్మంపై విశ్వాసం కలవారని ప్రళయ దినం నాడు నేను సాక్షిగా ఉంటాను.' దైవ ప్రవక్త(స) రక్తసిక్తమై ఉన్న స్థితిలోనే వారిని సమాధిలో పూడ్చిపెట్టారు. గుసుల్ చేయించలేదు.'

## 78వ అధ్యాయం

ఒకవేళ బాలుడు ఇస్లామ్ మతాన్ని స్వీకరిస్తే, యుక్త వయస్సుకు చేరక మునుపే మరణిస్తే అప్పుడు అతని కోసం నమాజె జనాజా చెయ్య వలయునా? లేక చెయ్య కూడదా? ఇంకా ఇస్లామ్‌ను స్వీకరించి ముస్లిమ్ అయిపోవాలని హితోపదేశం చెయ్య వచ్చునా? లేక చెయ్యకూడదా? ఇమామ్ హసన్ బస్రీ(రహ్మాలై), షురైహ్(రహ్మాలై), ఇబ్రాహీం నఖయి (రహ్మాలై), ఖతాద (రహ్మాలై) గార్లు ఇలా అన్నారు: 'తల్లిదండ్రుల్లో నుంచి ఎవరైనా ఒకరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమ్‌గా మారిపోతే, అప్పుడు ఆ బాలుడు ముస్లిమ్ అయిపోయినవారి వద్ద ఉంటాడు'. ఇబ్నె అబ్బాస్(రజిఅన్) తన తల్లిగారి వద్ద ఉండేవారు. ఆమెగారు బలహీన వర్గానికి, నిరుపేద వర్గానికి చెందిన స్త్రీగా పరిగణించబడేవారు. ఆయన తన తండ్రిగారితో ఉండలేదు. ఆయన తండ్రి గారైతే తన జాతివారి మతంపై నడిచేవారు. దైవప్రవక్త(స) గారు లేక ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) గారు ఇలా సెలవిచ్చారు 'ఇస్లామ్ హెచ్చైన స్థితిలోనే ఉంటుంది. లొంగి ఉండే హీనమైన స్థితిలో ఉండదు.'

**437.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'హజ్రత్ ఉమర్ (రజిఅన్), కొందరు మనుషులు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి ఇబ్నె సయ్యాద్ వద్దకు వెళ్ళారు. అక్కడ ఇబ్నె సయ్యాద్ బనీ ముగాల తెగకు చెందిన ఇళ్ళవద్ద పిల్లలతో ఆడుకుంటూ ఉండటాన్ని వారు గమనించారు. అప్పుడు ఇబ్నె సయ్యాద్ యవ్వనారంభ దశలో ఉన్నాడు. దైవప్రవక్త(స)గారు అక్కడకు వచ్చే విషయం గురించి అతనికి అసలు తెలియదు. చివరికి దైవప్రవక్త(స) అతన్ని తన చేత్తో తట్టారు తరువాత ఆయన (స)గారు ఇలా సెలవిచ్చారు 'ఓ ఇబ్నె సయ్యాద్! నేను అల్లాహ్ ప్రవక్తను అనే విషయానికి నీవు సాక్ష్యమిస్తావా?' అప్పుడు అతను ఆయన(స)గారి

వైపునకు చూసి ఇలా అనసాగాడు: 'మీరు నిరక్షరాస్యులకు ప్రవక్తగా వచ్చారనే విషయానికి నేను సాక్ష్యమిస్తాను.' ఆ తరువాత ఇబ్నె సయ్యాద్ దైవప్రవక్త మహాశయుని (స)తో ఇలా అన్నాడు: 'నేను అల్లాహ్ ప్రవక్తను అనే విషయానికి మీరు సాక్ష్యమిస్తారా?' దైవప్రవక్త(స) ఈ మాటను విని అతన్ని వదిలేశారు. మరియు ఇలా సెలవిచ్చారు నేను అల్లాహ్‌నూ మరియు ఆయన పంపిన ప్రవక్తలను విశ్వసించాను. తరువాత దైవప్రవక్త(స) అతన్ని ఇలా అడిగారు 'ఇప్పుడు నీకు ఏమి కనిపిస్తోంది? అతను ఇలా అన్నాడు నా వద్దకు నిజమైన వార్తలు అబద్ధమైన వార్తలు రెండు వస్తూ ఉంటాయి.' ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు 'అయితే నీవు, నీవు చేసే పని అంతా గందర గోళమే, గజిబిజియే.' ఆ తరువాత దైవప్రవక్త(స) (పరీక్ష కోసం) అతనితో ఇలా అన్నారు 'సరే మంచిది. నా మనస్సులో ఒక విషయం ఉంది. అదేమిటో నీవు చెప్ప గలవా?' (ఆయన(స)గారు దుఖ్ఖాన్ సూరాలోని ఈ ఆయత్‌లోని భావాన్ని సూచించారు. ఫర్‌తఖిబ్ యవ్‌మ తఅతిస్సమావు బి దుఖానిమ్ ముబీన్). ఇబ్నె సయ్యాద్ ఇలా అన్నాడు 'అది దుఖ్'. అప్పుడు దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు, 'పో! ఇక్కణ్ణుంచి వెళ్ళిపో! నీవు నీ స్థితిని ఎన్నటికీ దాటలేవు.' హజ్రత్ ఉమర్(రజిఅన్) ఇలా అన్నారు 'ఓ దైవప్రవక్తా(స)! నన్ను వదలిపెట్టండి, నాకు అనుమతి ఇవ్వండి, నేను అతని మెడను నరికివేస్తాను.' అప్పుడు దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు 'ఒకవేళ అతడు దజ్జాల్ అయితే, అప్పుడు నీవు అతడిపై ప్రాబల్యం వహించలేవు. ఒకవేళ అతడు దజ్జాల్ కాకపోతే అప్పుడు అతన్ని చంపటం నీ కోసం మంచి విషయం కాదు'. సాలిమ్ ఇలా అన్నారు- ఇబ్నె ఉమర్(ర)ఇలా అంటూ ఉండగా నేను విన్నాను. తరువాత ఒక రోజున దైవప్రవక్త మహాశయులు (స), ఉబై బిన్‌కాబ్ ఉభయులు కలిసి ఇబ్నె సయ్యాద్ నివసిస్తూ ఉన్నటువంటి ఖర్జూరపు వృక్షాల తోట వద్దకు వెళ్ళారు. ఇబ్నె సయ్యాద్ తనను చూడటానికి మునుపే దైవప్రవక్త(స)గారు అతనినుంచి ఒక విషయాన్ని వినదలుచుకున్నారు. అతను అశ్రద్ధలో ఉన్నప్పుడు అతని నుంచి కొన్ని విషయాలు ఆయన(స) వింటున్నారు. చివరికి దైవప్రవక్త(స) అతన్ని చూశారు. అతను ఒక దుప్పటి కప్పుకుని పండుకుని ఉన్నాడు. నిద్రలో ఏదో గొణుక్కుంటూ ఉన్నాడు. (వాగుతూ ఉన్నాడు) కాని (వచ్చిన కష్టం ఏమిటంటే) ఇబ్నె సయ్యాద్ తల్లి దూరం నుంచే దైవప్రవక్త(స) గారిని చూసింది. అప్పుడు ఆయన(స) గారు ఖర్జూరపు బోదెల మాటున నక్కుతూ నక్కుతూ పోతున్నారు. ఆమె కేకవేసి ఇబ్నె సయ్యాద్‌తో ఇలా అన్నది 'ఓ సాఫ్! (ఇది ఇబ్నె సయ్యాద్ పేరు) చూడు, ముహమ్మద్(స) వచ్చేశారు.' ఇది విన్నంతనే వాడు లేచి నిలబడ్డాడు.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'అయ్యో! అతని తల్లి ఇబ్నె సయ్యాద్‌ను ఇంకా మాట్లాడనిచ్చి ఉన్నట్లయితే ఎంత బాగుండేది! అప్పుడు అతను తన స్థితి యొక్క వాస్తవికతను వెల్లడించి ఉండేవాడే!'

**438.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన(ర) ఇలా అన్నారు- 'యూదులకు చెందిన ఒక బాలుడు (అబ్దుల్ ఖుద్దూస్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి వద్ద పని చేస్తూ ఆయన(స)గారికి సేవలు చేస్తూ ఉండేవాడు. ఒకసారి ఆ బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. అప్పుడు దైవప్రవక్త(స) పరామర్శ కోసం అతని వద్దకు విచ్చేశారు. ఆయన(స) ఆ బాలుని శిరస్సు వద్ద కూర్చొని అతనితో 'ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమ్‌వు అయిపో' అని అన్నారు. అక్కడే కూర్చొని ఉన్న తన తండ్రివైపు ఆ బాలుడు తదేక దృష్టితో చూడసాగాడు. అప్పుడు అతని తండ్రి ఇలా అన్నాడు, '(కంగారు పడకు) అబుల్ ఖాసిమ్ చెప్పిన దాన్ని విశ్వసించు'. వెంటనే ఆ బాలుడు ముస్లిమ్ అయిపోయాడు. అప్పుడు దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిస్తూ బయటికి వెళ్ళిపోయారు. "అల్లాహ్‌కు కృతజ్ఞతలు, స్తోత్రాలు. ఆయన ఆ బాలుణ్ణి నరకం నుండి రక్షించాడు."

**439.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన(ర) ఇలా అన్నారు- 'నేను, నా తల్లి, మేము ఉభయులమూ బలహీనులూ, పీడితులు అయిన ముస్లిములలోని వారము. నేను పిల్లల్లోనుంచి అయితే నా తల్లి స్త్రీలలో నుంచి.'

**440.** ఇబ్నె షిహాబ్ ఇలా ఉల్లేఖించారు 'మరణించిన ప్రతి శిశువు కోసం నమాజె జనాజా చెయ్యాలి. ఆ శిశువు అక్రమ సంతానమైనాసరే! ఎందుకంటే, ఆ బిడ్డ ఇస్లామ్ స్వభావంతో పుట్టింది. దాని తల్లి దండ్రులు ఉభయులూ ముస్లిమ్‌లు అయినా లేక కేవలం తండ్రి మాత్రమే ముస్లిమ్ అయినాసరే. దాని తల్లి ముస్లిమ్ మతస్థురాలు కాకపోయినాసరే! ఆ శిశువు పుట్టే సమయంలో కేకవేస్తే అప్పుడు దాని కోసం నమాజె జనాజా చెయ్యాలి. ఒకవేళ కేక వెయ్యకపోతే (ఏడ్వకపోతే) అప్పుడు నమాజ్ చెయ్యకూడదు, అది గర్భస్రావ శిశువుగా పరిగణించబడుతుంది.' ఎందుకంటే, అబూహురైరా (రజిఅన్) ఇలా అనేవారు, దైవప్రవక్త మహాశయులు(స) ఇలా సెలవిచ్చారు "ప్రతి శిశువు ఇస్లామ్ స్వభావంతో అంటే 'తౌహీద్' భావనతోనే పుడుతాడు. తరువాత దాని తల్లిదండ్రులు దానిని యూదుడుగానో లేక నస్రానీగానో లేక పారసీగానో మార్చివేస్తారు. చతుష్పాదులైన పశువుల్ని చూడండి, అవి పూర్తి శరీరంతో పుడతాయి. వాటితో చెవులు తెగిపోయిన పశువులు పుట్టటాన్ని మీరేమైనా చూశారా?'

అబూహుర్రైరా(ర) ఈ హదీసును వివరించి ఖుర్‌ఆన్‌లోని రూమ్ సూరా లోని ఈ ఆయత్‌ను పఠించేవారు 'అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి." **(30: 30)**

**441.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హుర్రైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఎంతమంది పిల్లలైతే పుడతారో వారందరూ తమ అసలు స్వభావంతో అంటే ఇస్లామ్ స్వభావంతో పుడతారు. తరువాత వారి తల్లి దండ్రులు వారిని యూదులుగానో, క్రైస్తవులుగానో, పారశీలుగానో మార్చివేస్తారు. నాలుగు కాళ్ళ పశు వు పూర్తి శరీరంతో పుట్టినవిధంగానే ఎక్కడైనా మీరు చెవులు తెగి పోయిన పశువు పుట్టడాన్ని చూశారా?, ఈ హదీసును ఉల్లేఖించి అబూ హుర్రైరా (ర) ఖుర్‌ఆన్‌లోని రూమ్ సూరాలోని ఈ ఆయత్‌ను పఠించే వారు "అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి."

## 79వ అధ్యాయం

**ఒకవేళ ఒక ముష్రిక్ ఎవరైనా మరణించేటప్పుడు (సక్రాత్ ముందు అంటే మరణ యాతనకు ముందు) 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు) అని పలికితే...**

**442.** తన తండ్రి గారి నుంచి సయీద్ బిన్ అల్ ముసయ్యబ్ ఇలా ఉల్లేఖించారు "అబూ తాలిబ్‌కు మృత్యు ఘడియలు సమీపిస్తున్నాయి. ఆయన దాదాపు మరణ శయ్యపై ఉన్నారు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఆయన వద్దకు విచ్చేశారు. అక్కడ అబూ జహల్ బిన్ హిష్షామ్, అబ్దుల్లా బిన్ అబీ ఉమయ్యా బిన్ ముగైరా కూర్చొని ఉండటాన్ని ఆయన (స)గారు చూశారు. దైవ ప్రవక్త(స) అబూ తాలిబ్‌ను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు 'బాబాయి గారూ! మీరు ఒక కలిమాను 'లా ఇలాహ ఇల్లల్లాహ్'అని పలకండి. నేను ప్రభువైన అల్లాహ్ వద్ద మీ కోసం సాక్షిగా ఉంటాను.' ఈ విషయాన్ని విని అబూ జహల్, అబ్దుల్లా బిన్ అబీ ఉమయ్యా ఉభ యులూ ఇలా అన్నారు 'అయ్యో! ఓ అబూ తాలిబ్! ఏమిటి, మీరు మీ నాన్నగారైన అబ్దుల్ ముత్తలిబ్ గారి మతధర్మాన్ని విడిచిపెడతారా?' క్లుప్తంగా దైవప్రవక్త(స) క్రమం తప్పకుండా ఈ కలిమాను పఠించమని ఆయనకు బోధిస్తూనే పోయారు. వారు ఉభయులూ ముందు చెప్పిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ చెబుతూ పోయారు. 'ఓ అబూ తాలిబ్! మీ తండ్రి గారైన అబ్దుల్ ముత్తలిబ్‌గారి మతాన్ని త్యాగం చేస్తున్నారా?' చివరకు

అబూతాలిబ్ చివరిమాటగా ఇలా అన్నారు 'నేను అబ్దుల్ ముత్తలిబ్ ధర్మంపై స్థిరంగా ఉన్నాను. లా ఇలాహ ఇల్లల్లాహ్‌ను తిరస్కరించాను.' అప్పుడు దైవప్రవక్త(స) దుఃఖిస్తూ ఇలా సెలవిచ్చారు. 'జరుగవలసింది ఏదో జరిగిపోయింది. ఇక నేను మీ కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తూనే ఉంటాను, అలా చెయ్యి వద్దని ఆయన నన్ను వారించే వరకు.' తరువాత అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో తౌబా సూరాలో ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు. 'ముష్రిక్కులను క్షమించవలసిందిగా ప్రార్థన చెయ్యటం ప్రవక్తకూ, విశ్వాసులకూ తగిన విషయం కాదు. వారు వారికి బంధువులైనప్పటికీ, ఇంకా వారు నరకానికి అర్హులని వారికి స్పష్టమైనప్పటికీ'.

## 80వ అధ్యాయం

### సమాధిపై ఖర్జూరపు కొమ్మలను నాటటం

బురైదా అస్లమీ అనే ఒక సహాబి (ర) తన సమాధిపై రెండు ఖర్జూరపు కొమ్మలను నాటాలని మరణశాసనపూర్వకంగా తెలియజేశారు. ఇబ్నె ఉమర్ (ర) అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్ (ర) గారి సమాధిపై ఒక దేరా వేసి ఉండటాన్ని చూసి ఇలా అన్నారు, 'ఓ బానిసా! ఆ దేరాను తీసివెయ్యి. ఆయనగారు చేసిన సత్కార్యాలే ఆయనపై తమ నీడను కప్పుతాయి.' ఖారిజ బిన్ జైద్ ఇలా అన్నారు: హజ్రత్ ఉస్మాన్ (ర)గారి ఖిలాఫత్ కాలంలో నేను చూశాను. అప్పుడు నేను యవ్వన దశలో ఉన్నాను. మాలో ఎవరైతే ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ గారి సమాధి మీద నుంచి ఎగిరి దూకుతారో వారే దూకటంలో నిపుణులుగా, విజేతలుగా భావించ బడేవారు. ఉస్మాన్ బిన్ హకీమ్ ఇలా అన్నారు: 'ఖారిజ బిన్ జైద్ నా చేతిని పట్టుకుని నన్ను ఒక సమాధిపై కూర్చోబెట్టారు. ఇంకా ఆయన తన బాబాయి యజీద్ బిన్ సాబిత్ నుంచి ఇలా ఉల్లేఖించారు: సమాధిపై మలమూత్ర విసర్జన చేసే ఉద్దేశ్యంతో కూర్చునే వాడు దానిపై కూర్చోవటం నిషిద్ధం. నాఫె ఇలా అన్నారు 'ఇబ్నె ఉమర్ (ర) సమాధులపై కూర్చుంటూ ఉండేవారు.'

**443.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి రెండు సమాధుల మీదుగా పోవటం జరిగింది. అప్పుడు ఆ సమాధుల్లో ఉన్నవారు శిక్షను అనుభవిస్తున్నారు. వారు పెద్ద పాపం చేసినందుకు ఆ శిక్షను అనుభవించటంలేదు. ఆ ఉభయుల్లోని ఒకడు మూత్రం నుంచి తనను కాపాడుకునేవాడు కాదు. రెండోవాడు చాడీలు చెబుతూ తిరుగుతూ ఉండేవాడు. తరువాత దైవప్రవక్త (స) ఒక పచ్చని ఖర్జూరపు కొమ్మను తీసుకున్నారు దానిని

రెండు భాగాలుగా మధ్యలోనుంచి చీల్చారు. ప్రతి సమాధిపై ఒక్కొక్క భాగాన్ని పాతిపెట్టారు. అప్పుడు ప్రజలు ఇలా విన్నవించుకున్నారు 'మీరు(స) ఇలా ఎందుకు చేశారు?' సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'బహుశా ఈ కొమ్మలు ఎండి పోయే వరకైనా వారి శిక్ష తగ్గుతుందేమో అని నేను అలా చేశాను.'

## 81వ అధ్యాయం

**సమాధి వద్ద ధర్మశాస్త్రం బాగా తెలిసిన ఒక విద్వాంసుడు కూర్చోవటం. ప్రజల్ని ఉద్దేశించి ఆయన హితోపదేశం చెయ్యటం మరియు ప్రజలు ఆయన చుట్టూ కూర్చోవటం.**

**444.** హజ్రత్ అలీ (రజిఅన్) ఇలా అన్నారు 'మేము బఖీలో ఒక జనాజా వెంటపోతూ ఉన్నాము. ఇంతలోనే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అక్కడకు విచ్చేశారు. అక్కడ ఆయన కూర్చుండి పోయారు. మేమంతా ఆయన (స) గారి చుట్టూ కూర్చున్నాము. అప్పుడు ఆయన (స) గారి వద్ద ఒక బెత్తం ఉన్నది. ఆయన(స) గారు తన శిరస్సును కిందికి వంచి తన చేతిలో ఉన్న బెత్తంతో నేలమీద గీకటం ప్రారంభించారు. తరువాత ఆయన (స) ఇలా సెలవిచ్చారు, 'మీలో తమ నివాసం స్వర్గంలోగాని, నరకంలోగాని ఈ రెండు స్థలాలలో ఎక్కడైనా గాని వ్రాయబడని వారు ఒక్కరైనా లేక ఒక్క ప్రాణి అయినా ఎవ్వరూ లేరు. ఇంకా వారు అదృష్ట వంతులో లేక దౌర్భాగ్యులో, దురదృష్టవంతులో అనే విషయం కూడా వ్రాయబడని వారు ఎవ్వరూ లేరు'. ఒక వ్యక్తి (హజ్రత్ అలి(ర) లేక హజ్రత్ ఉమర్ (రజి) లేక సురాఖా (ర) ఇలా విన్నవించుకున్నాడు, 'ఓ దైవప్రవక్తా! అలాంటప్పుడు మేము మా విధివ్రాతను ఎందుకు విశ్వసించకూడదు? మరియు పనులు చెయ్యటాన్ని, కష్టపడటాన్ని ఎందుకు విడిచిపెట్టకూడదు? ఎందుకంటే, ఎవరి పేరైతే అదృష్టవంతులలో వ్రాయ బడిందో వారు తప్పకుండా సత్కార్యాల వైపునకే మరలుతారు ఎవరి పేరైతే దౌర్భాగ్యులలో, దురదృష్టవంతులలో వ్రాయబడిందో వారు తప్పనిసరిగా అకృత్యాల వైపునకు మరలుతారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు 'విషయం ఏమిటంటే, ఎవరి పేరైతే పుణ్యాత్ములలో, సజ్జనులలో వ్రాయ బడిందో వారికి సత్కార్యాలు చేసే భాగ్యం, అదృష్టం కలుగజేయబడుతుంది. ఎవరి పేరైతే దురదృష్టవంతులలో, దుర్జనులలో వ్రాయబడిందో వారికి దుష్కార్యాలు చేసే అవకాశం కలిగించబడుతుంది'. ఆ తరువాత ఆయన (స)

ఖుర్ఆన్ గ్రంథంలోని 'వల్లయ్ల్' సూరాలోని ఈ ఆయత్‌ను పఠించారు. 'ఫఅమ్మామన్ అఅతా వత్తఖా' నుంచి చివరకు.

## 82వ అధ్యాయం

### ఆత్మహత్యకు పాల్పడే వ్యక్తికి విధించబడే శిక్ష.

**445.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, సాబిత్ బిన్ జహ్హాక్(రజిఅన్) (ఒక సహాబి) ఉల్లేఖించారు. 'ఒక వ్యక్తి ఎవరైనా తనను తాను అసత్యవంతుడుగా భావించి ఇస్లామ్ ధర్మంపై కాక మరొక మతంపై ప్రమాణం చేసి చెబితే అప్పుడు అతను తాను చెప్పిన ప్రకారమే అసత్యవంతుడు అవుతాడు. ఒక వ్యక్తి ఎవరైనా పదునైన ఆయుధంతో తనను తాను హతమార్చుకుంటే, నరకంలో అలాంటి పదునైన ఆయుధంతోనే అతనికి శిక్ష ఇవ్వబడుతూ ఉంటుంది.' హజ్జాజ్ బిన్ మిన్హాల్ ఇలా అన్నారు మాతో జరీర్ బిన్ హాజిమ్ ఇలా అన్నారు, ఆయన ఇమామ్ హసన్ బస్రి(రహ్మలై) నుంచి ఉల్లేఖించారు ఆయన ఇలా అన్నారు 'మాతో జున్‌దుబ్ బిన్ అబ్దుల్లా బజలి బసర్‌లోని ఒక మసీదులో ఒక హదీసును వినిపించారు. మేము దాన్ని మరిచిపోలేదు. ఇంకా జున్‌దుబ్(ర) దైవప్రవక్త(స)గారికి అబద్ధాన్ని ఆపాదించారేమో అనే అభిప్రాయం కూడా మాకు లేదు.' దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు: ఒక వ్యక్తికి దెబ్బ తగిలి గాయం అయింది. అతను తనను తానే చంపుకున్నాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు, 'నా దాసుడు ప్రాణం తీసుకోవటంలో నన్ను తొందర పెట్టాడు. దానికి శిక్షగా నేను అతనికి స్వర్గాన్ని నిషేధించాను.'

**446.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు- 'ఒక వ్యక్తి ఎవరైనా తన గొంతును తానే నులుముకుని చనిపోతే అతడు నరకంలో కూడా తన గొంతును తానే పిసుక్కుంటూ ఉంటాడు. ఎవరైనా ఒక వ్యక్తి కత్తితోగాని లేదా బాణంతోగాని తనను తాను పొడుచుకుని చనిపోతే అతను నరకంలో కూడా తనను తాను ఇదే విధంగా కత్తితో పొడుచుకుంటూ ఉంటాడు.'

## 83వ అధ్యాయం

**కపటుల కోసం నమాజె జనాజా చెయ్యటం, ముష్రిక్కులను క్షమించమని అల్లాహ్‌ను వేడుకోవటం. ఈ విషయాన్ని అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి నుంచి ఉల్లేఖించారు.**

**447.** హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లా బిన్ ఉబై బిన్ సలూల్ (మునాఫిక్) మరణించినప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స)గారిని అతని నమాజె జనాజాను చేయించటానికి పిలవటం జరిగింది. ఆయన(స) గారు నమాజు చేసే సంకల్పంతో నిలబడినప్పుడు, నేను ఆయన (స) గారి వైపునకు త్వరత్వరగా వెళ్ళాను. నేను ఇలా విన్నవించుకున్నాను 'ఓ దైవ ప్రవక్తా(స)! అబ్దుల్లా బిన్ ఉబై కోసం మీరు నమాజె జనాజా చేస్తారా? అతనైతే ఫలానా రోజున ఈ మాట అన్నాడు, ఫలానా రోజున ఈ మాట అన్నాడు, అవిశ్వాసాన్ని గురించి అతను చెప్పిన మాటల్ని నేను ఏకరువు పెట్టసాగాను. ఈ మాటల్ని విని దైవప్రవక్త(స) చిరునవ్వు నవ్వారు'. ఇలా సెలవిచ్చారు. 'ఓ ఉమర్! కొంచెం వెనక్కి జరుగు. పట్టు విడవకుండా మొండిగా నేను అడిగినప్పుడు ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు, 'అల్లాహ్ తరఫునుంచి నాకు అధికారం లభించింది. డెబ్బై సార్లకంటే అధికంగా దుఆ చేస్తే అల్లాహ్ ఆయన్ని క్షమిస్తాడనే విషయం నాకు గనుక తెలిసి ఉంటే అప్పుడు నేను నిశ్చయంగా డెబ్బైసార్లకంటే ఎక్కువగానే దుఆ చేసి ఉండేవాణ్ణి'.[1] హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు, 'దైవ ప్రవక్త(స) గారు అతని నమాజె జనాజాను చేశారు. నమాజు చేసిన తరువాత తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు. కొంచెం సేపటి తరువాత తౌబా సూరాలోని ఈ రెండు ఆయతులు అవతరించాయి 'ఇక ముందు వారిలో ఎవడైనా మరణిస్తే, అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంత మాత్రం చెయ్యకు. ఎన్నడూ అతడి గోరి వద్ద నిలబడకు. ఎందుకంటే వారు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. ఇంకా వారు ద్రోహులుగానే మరణించారు.' తరువాత హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు : "నాకు నాపైనే ఆశ్చర్యం కలిగింది. ఆ రోజు నేను దైవప్రవక్త ఎదుట అంత ధైర్యం చేశాను. వాస్తవానికి (విషయంలోని పరమార్థాన్ని) ఎరిగినవారు వారే."

## 84వ అధ్యాయం

**మృతుణ్ణి ప్రశంసించటం ధర్మసమ్మతమైన విషయమే.**

**448.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒక జనాజా ఊరేగింపు అటు నుంచి వెళ్ళిపోయింది. అప్పుడు ప్రజలు మృతుణ్ణి పొగిడారు. (అతను

---

447-1. ఇది ఆయన(స)గారి కారుణ్యం, ప్రేమ. సుబ్‌హానల్లాహ్! ఎలాగైనా సరే నా సంఘానికి చెందిన జనులు నరకంలోకి పోకూడదు. వారు దానికి దూరంగా ఉండాలి అనేదే ఆయన(స)గారి కోరిక, అభిమతం. ఎంత దయామయుడైన దైవప్రవక్త ఆయన! తన సమాజం అంటే ఎంత ప్రేమ ఆయనకు! కరుణామయుడైన దేవుడు మనకు ఇంత మంచి దైవప్రవక్తను ప్రసాదించాడు. ఆయనకు కృతజ్ఞతలు.

చాలా మంచివాడు అని) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇది విని ఇలా సెలవిచ్చారు 'అది అతనికి ప్రమాణ పూర్వకంగా వాగ్దానం చెయ్యబడింది. (వాజిబ్ అయిపోయింది).' ఇంతలోనే మరొక జనాజా ఊరేగింపు కూడా వచ్చివెళ్ళి పోయింది. కాని ఈ దఫా మటుకు ప్రజలు అందులోని మృతుణ్ణి గురించి చెడ్డగా మాట్లాడారు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు 'అది అతని విషయంలో వాజిబ్ అయిపోయింది.' హజ్రత్ ఉమర్(ర), అతని విషయంలో ఏది వాజిబ్ అయిపోయింది అని దైవప్రవక్త(స)ను అడిగారు. అప్పుడు ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు: 'మొదటి వ్యక్తిని మీరు స్తుతించారు. కనుక అతని విషయంలో స్వర్గం వాజిబ్ అయిపోయింది. రెండో వ్యక్తిని గురించి మీరు చెడ్డగా దూషిస్తూ మాట్లాడారు. కనుక అతని విషయంలో నరకం వాజిబ్ అయిపోయింది. మీరు భూమిలో అల్లాహ్ సాక్షులు.'

**449.** అబూ అల్ అస్వద్ ఇలా ఉల్లేఖించారు 'నేను ఒకసారి మదీనా పట్టణానికి వచ్చాను. ఆ రోజుల్లో అక్కడ ప్లేగు వ్యాధి వ్యాపించి ఉంది. అప్పుడు నేను హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారి వద్ద కూర్చుని ఉన్నాను. ఇంతలో ఒక జనాజా వచ్చి మా ముందు నుంచి సాగిపోయింది. అక్కడ ఉన్న ప్రజలు జనాజాలో ఉన్న మృతుణ్ణి పొగిడారు.' హజ్రత్ ఉమర్ (రజిఅన్) 'వాజిబ్ అయిపోయింది' అని అన్నారు. ఆ తరువాత మరొక జనాజా మా ముందునుంచి వెళ్ళిపోయింది. ప్రజలు అందులోని మృతుణ్ణి కూడా ప్రశంసించారు. హజ్రత్ఉమర్(రజిఅన్) వాజిబ్ అయిపోయింది అని అన్నారు. తరువాత మరొక జనాజా కూడా వచ్చి ముందుకు సాగిపోయింది. కాని ప్రజలు అందులోని మృతుణ్ణి గురించి చెడ్డగా మాట్లాడారు. అప్పుడు హజ్రత్ ఉమర్(ర) 'వాజిబ్ అయిపోయింది' అని అన్నారు. అబూఅల్ అస్వద్ హజ్రత్ ఉమర్(ర)ను ఉద్దేశించి ఇలా అన్నారు, ఓ అమీరుల్ మోమినీన్! 'ఏ వస్తువు అతని విషయంలో వాజిబ్ అయిపోయింది?' సమాధానంగా హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు, 'దైవప్రవక్త మహాశయులు(స) అన్నవిధంగానే నేను కూడా అన్నాను ఒక ముస్లిమ్ మంచితనం గురించి నలుగురు ముస్లింలు గనుక సాక్ష్యం చెబితే అల్లాహ్ అతన్ని స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు. అప్పుడు మేము ఇలా విన్నవించుకున్నాము ఒకవేళ ముగ్గురు ముస్లిములు కలిసి సాక్ష్యం ఇస్తేనో? దైవప్రవక్త(స) ముగ్గురు కలిసి సాక్ష్యమిచ్చినా సరే అని సెలవిచ్చారు. మేము మళ్ళీ ఇలా విన్నవించుకున్నాము ఒకవేళ ఇద్దరు ముస్లిములు కలిసి సాక్ష్యమిస్తేనో? దైవప్రవక్త(స) ఇద్దరు ముస్లిములు కలిసి సాక్ష్యమిచ్చినా

సరే అని సెలవిచ్చారు. ఆ తరువాత మేము ఒకే ఒక్క ముస్లిమ్ గనుక సాక్ష్యమిస్తేనో? అని అడగలేకపోయాము.'

## 85వ అధ్యాయం

### సమాధిలోని శిక్షను గురించి ఖుర్ఆన్‌లో ఏమని చెప్పబడింది.

'ఈ దుర్మార్గులు మరణ వేదనలో మునిగి తేలుతూ ఉండగా దైవదూతలు తమ హస్తాలను చాచి 'ఇటు తెండి! బయటకు తియ్యండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనిందను మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన ఆయతుల పట్ల తలబిరుసుతనం ప్రదర్శించినం దుకు ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది' అని అంటూ ఉండగా.... **(6: 93)**

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 'మేము వారిని రెట్టింపు శిక్షను విధించే సమయం సమీపంలోనే ఉంది. తరువాత వారు మరింత పెద్దశిక్ష కోసం తీసుకురాబడ తారు."**(9:101)** మరోచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు "ఫిరౌన్ అనుచరులే ఒక భయంకరమైన శిక్షలో చిక్కుకున్నారు. వారు ఉదయం, సాయంత్రం నరకాగ్ని ముందు ఉంచబడుతూ ఉంటారు. ప్రళయ గడియ వచ్చినప్పుడు, 'ఫిరౌన్ ప్రజలను తీవ్రమైన శిక్షలో ప్రవేశించండి'అని ఆజ్ఞాపించబడుతుంది." **(40: 46)**

**450.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని బరా బిన్ ఆజిబ్(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఒక విశ్వాసి తన సమాధిలో కూర్చుండ బెట్టబడి నప్పుడు అతని వద్దకు దైవదూతలు వస్తారు. అప్పుడు అతను ఇలా సాక్ష్యమిస్తాడు 'అల్లాహ్ తప్ప నిజమైన దేవుడు మరొకడెవ్వడూ లేడు. హజ్రత్ ముహమ్మద్(స) ఆయన పంపగా వచ్చిన ప్రవక్త.' 'ఇబ్రాహీం సూరాలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు. ఒక స్థిరమైన, సరైన వాక్కు ఆధారంగా అంటే తౌహీద్‌పై అల్లాహ్ ఇహలోకంలోనూ, పరలోకంలోనూ విశ్వాసులకు నిలకడను ప్రసాదిస్తాడు. అల్లాహ్ దుర్మార్గులను మార్గ భ్రష్టులుగా చేస్తాడు. తనకు ఇష్టమైన దానిని చేసే అధికారం అల్లాహ్‌కు ఉన్నది అనేదాని అర్థం, భావం కూడా ఇదే.'

**451.** షూబా ఈ హదీసునే ఉల్లేఖించారు. ఈ విషయాన్ని మాత్రం అదనంగా చేర్చారు. ఈ ఆయత్‌ను అంటే 'యుసబ్బితుల్లాహుల్లజీన ఆమనూ' సమాధి శిక్ష విషయంలో అల్లాహ్ అవతరింపజేశాడు.

**452.** అబ్దుల్లా బిన్‌ఉమర్(రజి) ఇలా ఉల్లేఖించారు. 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) పాడుబడిన ఒక బావిలోకి తొంగిచూశారు. బద్ర్

సంగ్రామ దినం నాడు హతమార్చబడిన కొందరు అవిశ్వాసుల శవాలను ఆ బావిలోకి పడవేయటం జరిగింది. ఆ శవాలను బావిలోకి తొంగిచూసి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'మీ ప్రభువు మీకు చేసిన సత్యవాగ్దానాన్ని మీరు పొందారు.' జనులు ఇలా విన్నవించుకున్నారు 'అదేమిటి? మీరు(స) మృతులతో మాట్లాడుతున్నారు?' అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'మీరు వారికంటే ఎక్కువగా ఏమీ వినటం లేదు. కాని వారు సమాధానం చెప్పలేరు.'

**453.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు : 'ఆమె(ర)గారు ఇలా అన్నారు– దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) బద్ర్‌కు చెందిన అవిశ్వాసులను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు– 'నేను ఏ విషయాన్నయితే వారికి చెబుతూ ఉండేవాణ్ణో ఇప్పుడు ఆ విషయం సత్య మైనదని వారికి తెలిసిపోయింది.' దివ్యఖుర్ఆన్‌లో రూమ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 'ఓ ప్రవక్తా! నీవు మృతులకు వినిపించలేవు.'

**454.** హజ్రత్ ఆయెషా(రజిఅన్) ఇలా అన్నారని మస్రూఖ్ ఉల్లేఖించారు "ఒకసారి ఒక యహూది వనిత హజ్రత్ ఆయెషా(ర) వద్దకు వచ్చింది. సమాధిలోని శిక్షను గురించి ఆమెగారితో ప్రస్తావించి ఇలా అన్నది 'అల్లాహ్ నిన్ను సమాధిలోని శిక్ష నుండి కాపాడుగాక! 'హజ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారు నేను దైవప్రవక్త(స) గారిని ఇలా అడిగాను, ఓ దైవప్రవక్తా(స)! సమాధిలో శిక్ష పడుతుందా?' ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'అవును, సమాధిలో శిక్ష పడుతుంది. అది సత్యమైన విషయం.' హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు: 'ఆ తరువాత నేను ఆయన(స)గారిని ప్రతీ నమాజు లోనూ గమనించాను. ఆయన(స) ఏ నమాజులోనూ సమాధి శిక్షనుండి తనను రక్షించమనీ, తనకు శరణు ఇవ్వమనీ అల్లాహ్‌ను వేడుకోకుండా ఉండలేదు.' గుందర్ తన ఉల్లేఖనంలో ఈ విషయాన్ని మాత్రం అదనంగా చేర్చారు 'సమాధి శిక్ష సత్యమైన విషయమే."

**455.** అస్మా బిన్తె అబీబక్ర్ (రజిఅన్హా) ఉల్లేఖించారు 'ఆమె గారు ఇలా అన్నారు– దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఖుత్బా ప్రసంగాన్ని వినిపించటానికి నిలబడ్డారు. ప్రజలు సమాధి లోపల ఎదుర్కోబోయే పరీక్షను గురించి ప్రస్తావించారు. ఆ పరీక్షను గురించి విన్న ప్రజలు బిగ్గరగా కేకలు వెయ్యసాగారు. (ఏడ్వసాగారు)'

**456.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: "మనిషిని తన సమాధిలో పూడ్చిపెట్టినప్పుడు,

అతనికి చెందిన జనులు (అతన్ని పూడ్చిపెట్టి) తిరిగి వెళ్ళేటప్పుడు, అతను వారి చెప్పుల ధ్వనిని వింటాడు. తరువాత అతని వద్దకు ఇద్దరు దైవదూతలు (మున్కిర్, నకీర్) వస్తారు. అతన్ని వారు ఇలా అడుగుతారు "ముహమ్మద్(స)గారిని గురించి నీవు ఎలాంటి విశ్వాసాన్ని కలిగి ఉండేవాడవు?" విశ్వాసం (ఈమాన్) కలవాడు ఇలా అంటాడు: 'ఆయన(స) గారు అల్లాహ్ దాసుడని, అల్లాహ్ ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను.' అప్పుడు అతనితో ఇలా అనబడుతుంది- 'అయితే నరకంలో నీకు కేటాయించబడిన నివాస స్థలాన్ని చూసుకో. అల్లాహ్ దానికి బదులుగా నీకు స్వర్గంలో నివాస స్థలాన్ని ఇచ్చాడు.' అతను తనకు కేటాయించబడిన ఆ రెండు నివాస స్థలాలను చూసుకుంటాడు. ఖతాద ఇలా అన్నారు: మాతో ఇలా కూడా అనటం జరిగింది. అతని సమాధి విశాలమైనదిగా తీర్చిదిద్దబడింది. ఆ తరువాత ఖతాద(ర) అనస్(ర) గారి హదీసును గురించి చెప్పటం ప్రారంభించారు. ఆయన ఇలా అన్నారు- 'కాని కపటి, కాఫిర్ అయిన వ్యక్తిని ముహమ్మద్(స) గారి గురించి నీవు ఎలాంటి విశ్వాసాన్ని కలిగి ఉండేవాడవు?' అని అడిగినప్పుడు, అతడు ఇలా అంటాడు 'ఆయన (స) గురించి నాకు తెలియదు. ప్రజలు ఆయన్ని(స) గురించి ఏమి అనుకుంటూ ఉండేవారో నేను కూడా దానినే అంటూ ఉండేవాణ్ణి.' తరువాత అతడితో ఇలా అనబడుతుంది. 'స్వయంగా నీవు కూడా అవగాహన చేసుకోలేదు, అవగాహన చేసుకున్నవారి అభిప్రాయం ప్రకారం నడుచుకోనూ లేదు.' అప్పుడు ఇనుప సుత్తులతో అతన్ని కొట్టడం జరుగుతుంది. అతను అరుస్తాడు, కేకలు వేస్తాడు. అతని వద్ద ఉన్న వారందరూ (మనుషులూ, జిన్నాతులూ తప్ప) ఆ పెడబొబ్బలను వింటారు.

## 86వ అధ్యాయం

### సమాధి శిక్ష నుండి శరణు వేడుకోవటం.

**457.** అబూ అయ్యూబ్ అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి సూర్యుడు అస్తమించిన తరువాత మదీనా పట్టణం నుంచి బయటికి వెళ్ళారు. అక్కడ ఆయన(స)గారు ఒక భయంకరమైన కేకను విన్నారు. అప్పుడు ఆయన(స)ఇలా సెలవిచ్చారు 'యూదులు తమ తమ సమాధులలో శిక్షింపబడుతున్నారు.'

**458.** ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్‌గారి కుమార్తె (ఉమ్మె ఆస్) నుంచి మూసా బిన్ ఉఖబా ఉల్లేఖించారు: ఆమె ఇలా అన్నారు 'నేను దైవప్రవక్త మహాశయులు

ముహమ్మద్(స) గారి నుంచి విన్నాను ఆయన(స) గారు సమాధి శిక్ష నుంచి అల్లాహ్‌ను శరణు వేడుకునేవారు.

**459.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అల్లాహ్‌ను ఈ క్రింది విధంగా వేడుకునేవారని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు- 'అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ అజాబిల్ ఖబ్ర్, వమిన్ అజాబిన్నార్ వమిన్ ఫిత్‌నతిల్ మహ్‌యా వల్ మమాతి వమిన్ ఫిత్‌నతిల్ మసీహిద్దజ్జాల్' 'ఓ అల్లాహ్! నేను నిన్ను శరణు వేడుకుంటున్నాను సమాధి శిక్ష నుంచి, నరక శిక్ష నుంచి జీవన్మరణాల ఆపదల నుంచి కానె దజ్జాల్ ఆపద నుంచి'.

## 87వ అధ్యాయం

**చాడీలు చెప్పటం, పరోక్షంగా నిందించటం, తన మూత్రంతో బట్టలను మలిన పరచుకోవటం- వీటి వల్ల కలిగే సమాధి శిక్షను గురించి.**

**460.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- 'ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రెండు సమాధుల మీదుగా పోవటం జరిగింది. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'ఆ సమాధుల్లోని మనుష లకు శిక్ష పడుతోంది. ఆ శిక్ష పడుతోంది వారు పెద్ద పాపాలు చేసినందుకు కాదు.' తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు: కాని ఒక విషయమైతే ఉంది, వారిలో ఒకడు, చాడీలు చెప్పుకుంటూ, పరోక్షనిందకు పాల్పడుతూ తిరిగేవాడు. రెండో వాడు తన మూత్ర విసర్జన విషయంలో జాగ్రత్తగా ఉండేవాడు కాదు.' ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారు- ఆ తరువాత ఆయన(స) గారు ఒక పచ్చని చెట్టుకొమ్మను తీసుకు న్నారు దాన్ని రెండు భాగాలుగా విరిచారు, ప్రతి సమాధి మీద ఒక్కొక్కదాన్ని పాతారు. మరియు ఇలా సెలవిచ్చారు 'బహుశా ఈ పచ్చని కొమ్మలు ఎండిపోయేవరకైనా వారి శిక్ష తగ్గుతుందేమో.'

## 88వ అధ్యాయం

**మృతునికి ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో అతని నివాస స్థలం (స్వర్గంలో, నరకంలో) చూపించబడుతుంది.**

**461.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: 'మీలో ఎవరైనా మరణించినప్పుడు, అతనికి ఉదయం, సాయంత్రం రెండు వేళల్లోనూ తన నివాస స్థలం చూపించబడుతుంది.

ఒకవేళ అతను స్వర్గవాసులలోని వాడైతే అతనికి స్వర్గంలో తన నివాసం ఏదో చూపించబడుతుంది. ఒకవేళ అతను నరకవాసి అయితే అప్పుడు అతనికి నరకంలో అతని నివాసస్థలం ఏదో చూపించబడుతుంది. అప్పుడు అతనితో ఇలా అనటం జరుగుతుంది 'అల్లాహ్ నిన్ను ప్రళయం నాడు బ్రతికించి లేపేవరకు ఇది నీ నివాస స్థలంగా ఉంటుంది.'

## 89వ అధ్యాయం

### శవపేటికపై పెట్టినప్పుడు మృతుడు మాట్లాడటం.

**462.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు– "జనాజా తయారైనప్పుడు, తరువాత జనులు దానిని తమ భుజాలపైకి ఎత్తుకున్నప్పుడు– ఒకవేళ అతను ధర్మ పరాయణుడు అయినట్లయితే ఇలా అంటాడు, 'నన్ను ముందుకు తీసుకువెళ్ళండి.' ఒకవేళ అతను సజ్జనుడు కాకపోయినట్లయితే ఇలా అంటాడు, 'అయ్యో! నేను నాశనమైపోను. నా జనాజాను ఎక్కడకు తీసుకుపోతున్నారు. అతని కంఠస్వరాన్ని మనుషులు తప్ప సృష్టి లోని జీవరాశులన్నీ వింటాయి. ఒకవేళ అతని కంఠాన్ని మనిషి గనుక వింటే, ఆ మనిషి స్పృహ కోల్పోతాడు.'

## 90వ అధ్యాయం

### యుక్త వయస్సుకు ఇంకా చేరని, మరణించిన ముస్లిమ్ పిల్లలు ఎక్కడ ఉంటారు?

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ హురైరా (ర) ఉల్లేఖించారు– 'ఒక ముస్లిమ్‌కు చెందిన ముగ్గురు మగ పిల్లలు మరణించినట్లయితే వారు పాపాలు చేసే వయస్సుకు ఇంకా చేరకుండా ఉంటే అప్పుడు వారు ఆ ముస్లిమ్‌కూ, నరకానికీ మధ్య అడ్డంగా నిలబడతారు. లేదా వారు స్వర్గానికి పోతారు.'

**463.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖించారు: 'ఒక ముస్లిమ్‌కు చెందిన ముగ్గురు పిల్లలు మరణించి నట్లయితే ఇంకా వారు పాపాలు చేసే వయసుకు చేరకుండా ఉంటే, అప్పుడు అల్లాహ్ వారి పట్ల తనకు ఉన్న కారుణ్యం వల్ల వారిని స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు.'

**464.** బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కుమారుడైన హజ్రత్ ఇబ్రాహీం దివంగతులైనప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'స్వర్గలోకంలో అతనికి పాలు త్రాపటానికి ఒక స్త్రీ ఉన్నారు.'

## 91వ అధ్యాయం

### యుక్త వయస్సుకు ఇంకా చేరని ముష్రిక్కుల సంతానం గురించి.

**465.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఇలా అడగటం జరిగింది. ఓ దైవప్రవక్తా(స)! ముష్రిక్కుల సంతానం పరలోకంలో ఎక్కడ ఉంటారు? సమాధానంగా ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు, 'వారిని అల్లాహ్‌యే సృష్టించాడు కాబట్టి ఆయనకే ఈ విషయం బాగా తెలుసు. వారు పెద్దవారైన తరువాత ఎలాంటి పనులు చేస్తారో.'

**466.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఇలా అడగటం జరిగింది- 'ముష్రిక్కుల సంతానం మరణానంతరం ఎక్కడ ఉంటారు?' ఆయన(స) ఇలా సెలవిచ్చారు, 'వారు ఎలాంటి పనులు చేసేవారో అల్లాహ్‌కే బాగా తెలుసు.'

**467.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) ఉల్లేఖించారు: 'ప్రతి పిల్లవాడు సత్యధర్మమైన ఇస్లామ్‌పైనే (ఇస్లామ్ స్వభావంతోనే) పుడతాడు. ఒక పశువుకు దాని దూడ పుట్టిన విధంగా. కాని అతని తల్లిదండ్రులు అతన్ని యూదుడుగానో, క్రైస్తవుడు గానో, పారశీకుడు గానో మార్చివేస్తారు, మీలో ఎవరైనా అది ఛిన్నాభిన్నమైన స్థితిలో పుట్టటాన్ని చూశారా?'

**468.** సమురా బిన్ జుందబ్(రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన(ర) ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉదయం నమాజు చేసిన తరువాత మా వైపునకు తన ముఖాన్ని తిప్పి ఇలా సెలవిచ్చేవారు, 'పోయిన రాత్రి మీలో ఎవరైనా ఏదైనా కలను చూస్తే దాని గురించి చెప్పండి.' ఒకవేళ ఎవరైనా ఏదైనా స్వప్నాన్ని తిలకిస్తే అప్పుడు అతను దాన్ని గురించి వివరించేవాడు. అల్లాహ్‌కు ఇష్టమైన దాన్ని దైవప్రవక్త(స) ఆ కలలోని మర్మాన్ని గురించి తెలియజేసేవారు. ఒకరోజు ఏమి జరిగిందంటే, ఆయన(స)గారు మామూలుగానే మమ్మల్ని ఇలా అడిగారు, 'మీలో ఎవరైనా

ఏదైనా స్వప్నాన్ని చూశారా?' 'లేదు దైవప్రవక్తా(స)! అని మేము విన్నవించుకున్నాము.' అప్పుడు ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు 'కాని నేను ఈనాటి రాత్రి ఒక కలను చూశాను. ఇద్దరు వ్యక్తులు(దైవదూతలు) నా వద్దకు వచ్చి నా చేతుల్ని పట్టుకుని బైతుల్ మఖ్దిస్(జెరూసలెం) వైపునకు తీసుకుపోయారు. అక్కడ నేనేమి చూశానంటే, అక్కడ ఒక మనిషి కూర్చొని ఉన్నాడు. రెండో వ్యక్తి ఒక ఇనుప కొక్కాన్ని తన చేత్తో పట్టుకుని నిలబడి ఉన్నాడు, (ఇమామ్ బుఖారి (రహ్మాలై) ఇలా అన్నారు) మా సహచరులు కొందరు మూసా ఇబ్నె ఇస్మాయీల్ నుంచి (ఇలా ఉల్లేఖించారు) అతను కూర్చుని ఉన్న వ్యక్తి నోటిలోకి తన చేతిలో ఉన్న ఇనుప కొక్కాన్ని గుచ్చి అది దవడ ఎముక వరకు చేరే వరకు బలంగా తోస్తూ ఉన్నాడు. తరువాత అతని బుగ్గలోని ఒక భాగాన్ని చీల్చివేశాడు. అతని బుగ్గ రెండో వైపు కూడా ఇదే విధంగా చేశాడు. ఇంతలోనే అతని బుగ్గ యొక్క మొదటి భాగం మామూలుగా అయిపోయింది. అప్పుడు అతను మళ్ళీ పైవిధంగానే చేశాడు. నేను వారిని 'ఏమిటి ఇది?'అని అడిగాను. 'ముందుకు సాగి పదండి' అని వారు నాతో అన్నారు. మేము తరువాత ఒక మనిషి వద్దకు వెళ్ళాము. అతను నేలపై సాగిలపడి ఉన్నాడు. మరొక వ్యక్తి అతని శిరస్సు వద్ద నిలబడి ఉన్నాడు. అతని చేతిలో ఒక పెద్దరాయి ఉంది. అతను ఆ రాయితో క్రింద పడి ఉన్న మనిషి తలను పగులగొడుతున్నాడు. అతను రాయితో కొట్టగానే ఆ రాయి దొర్లుకుంటూ కిందికి పోతోంది. రాయితో కొట్టేవాడు దానిని తీసుకురావటానికి పోతాడు. రాయిని తీసుకుని అతను ఇంకా తిరిగి రానేలేదు. అప్పుడు అతను కొట్టినవాని శిరస్సు పూర్వం ఉన్న విధంగానే మళ్ళీ చక్కగా, విచిత్రంగా అతుక్కు పోయింది. తరువాత అతను తిరిగివచ్చి మళ్ళీ కొడుతాడు. నేను నాతో ఉన్నవారిని ఇలా అడిగాను 'ఇతను ఎవరు?' వారు సమాధానంగా ఇలా అన్నారు 'ముందుకు సాగి పదండి'. తరువాత మేము తన్నూర్ పొయ్యిలాంటి ఒక గుంత వద్దకు చేరుకున్నాము, పైనుంచి దాని ముఖద్వారం ఇరుకుగా ఉంటుంది. మరియు కిందనుంచి విశాలంగా ఉంటుంది. దాని క్రింద అగ్ని మండుతోంది. అగ్నిమంటలు పైకి తన్నూర్ పొయ్యి అంచులదాకా వచ్చినప్పుడు దానిలోపల ఉన్నటువంటి ప్రజలు కూడా పైకి వస్తారు. అందులోనుంచి బయటపడటానికి దాపులో ఉన్నప్పుడు మళ్ళీ ఆ మంటల విజృంభణ తగ్గుతుంది. అప్పుడు ప్రజలు కూడా తిరిగి లోపలకు వెళ్ళిపోతారు. ఆ ప్రజల్లో చాలామంది స్త్రీలు, పురుషులు దిసమొలలతో ఉన్నారు. నాతో ఉన్నవారిని నేను 'ఇది ఏమిటి?' అని అడిగాను. వారు 'ముందుకు సాగిపదండి' అని అన్నారు. తరువాత మేము ముందుకు

సాగిపోయాము. ఆ తరువాత మేము ఒక రక్తపుటేరు వద్దకు చేరుకున్నాము. ఆ నదిలో ఒక మనిషి నిలబడి ఉన్నాడు. మరొక మనిషి నది ఒడ్డుపైన నిలబడి ఉన్నాడు. అతని ముందు రాళ్ళు పెట్టబడి ఉన్నాయి. నదిలోపల ఉన్న మనిషి ముందుకు వచ్చి నదిలోనుంచి బయటికి వచ్చే సమయంలో నది ఒడ్డుపై ఉన్న మనిషి ఒక రాయిని అతని ముఖం మీదకు విసిరికొట్టాడు. అప్పుడు పూర్వం ఎక్కడైతే ఉన్నాడో అక్కడికే మళ్ళీ తిరిగి పోయాడు. ఆ విధంగా అతడు నదిలోనుంచి బయటపడటానికి ప్రయత్నించినప్పుడల్లా ఒడ్డుపై నిలబడి ఉన్న మనిషి రాయితో అతని ముఖంమీద కొట్టేవాడు. అప్పుడు అతడు తిరిగి తన పూర్వపు స్థానానికి చేరుకునేవాడు. నేను నా వెంట ఉన్నవారిని ఈ వ్యవహారంపై 'ఇదేమిటి'అని అడిగాను. వారు 'ముందుకు సాగిపొమ్మని' అన్నారు."

"తరువాత మేము నడుస్తూ నడుస్తూ చివరకు ఒక పచ్చని ఉద్యాన వనానికి చేరుకున్నాము. అక్కడ మాకు ఒక మహావృక్షం కనిపించింది. దాని అడుగుభాగంలో ఒక ముసలి మనిషికూర్చుని ఉన్నాడు. ఇంకా చాలామంది పిల్లలు అతనితోపాటు అక్కడ ఉన్నారు. ఆ చెట్టు వద్ద మరొక మనిషి కూడాఉన్నాడు. అతను తన ముందు నిప్పులు రాజేస్తున్నాడు. నాతో వచ్చిన ఇద్దరు సహచరులు నన్ను తీసుకొని ఆ చెట్టుపైకి ఎక్కారు. అక్కడ నున్న ఒక ఇంట్లోకి తీసుకెళ్ళారు. దానికంటే మంచి ఇల్లును, చక్కని గృహాన్ని నేను ఇంతవరకు చూడలేదు. ఆ ఇంట్లో వృద్ధులూ, యువకులూ,స్త్రీలు, పిల్లలు (అన్నిరకాల వారు) ఉన్నారు. తరువాత అక్కణ్ణుంచి తీసుకొని చెట్టుపైకి తీసుకు పోయారు. అక్కడ మరొక ఇంట్లోకి నన్ను తీసుకుపోయారు. మొదటి గృహం కంటే కూడా ఈ గృహం చాలా బాగుంది. ఎంతో చక్కగా ఉంది.ఆ ఇంట్లో వృద్ధురాలు, యువకులు (రెండురకాల వారు) ఉన్నారు. నేను నా సహచరులతో ఇలా అన్నాను మీరైతే నన్ను ఈ రోజు రాత్రి చాలా దూరం త్రిప్పారు. (సంచారం చేయించారు). ఇక నేను ఇంతవరకు చూసిన దాన్ని గురించి, దాని మర్మాన్ని గురించి నాకు వివరిం చండి. వారు ఇలా అన్నారు 'సరే, మంచిది. బుగ్గలు చీల్చబడుతూ ఉన్న మనిషిని మీరు చూశారు కదా! అతడు ప్రపంచంలోని ఒక పెద్ద అసత్యవంతుడు, అబద్ధాల కోరు. అతను చెప్పే ఆ అబద్ధపు మాటల్ని ప్రజలు విని నలువైపులా వ్యాపింపజేశారు. ప్రళయం వచ్చేవరకు అతడు ఈ శిక్షనే అనుభవిస్తూ ఉంటాడు. ఒక మనిషి తల పగులగొట్ట బడుతూ ఉన్న దృశ్యాన్ని మీరు చూశారు. ఆ వ్యక్తికి అల్లాహ్ దివ్యఖుర్ఆన్ జ్ఞానాన్ని ప్రసాదించాడు, కాని రాత్రి అంతా అతను పండుకుని నిద్రపోయేవాడు. పగలంతా

ఆ జ్ఞానం ప్రకారం నడుచుకునే వాడు కాదు. ప్రళయం వచ్చేవరకు అతడు ఈ శిక్షనే అనుభవిస్తూ ఉంటాడు. తనూర్ పొయ్యిలో కాలుతూ ఉన్న మనుషుల్ని మీరు చూశారు. వారు వ్యభిచారులు, అశ్లీలతకు పాల్పడే జనులు. ప్రవహించే కాలువలో మీరు చూసిన జనులు వడ్డీ వ్యాపారం చేసేవారు. వృక్షం కింద వేరు వద్ద మీరు చూసిన వృద్ధ వ్యక్తి దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం(అ), ఆయనగారి చుట్టూ ఉన్న పిల్లలు జనుల పిల్లలు. నిప్పులు మండిస్తూ ఉన్న వ్యక్తి దైవదూత మాలిక్. నరక ద్వారానికి కాపలాదారు. మొదట మీరు ప్రవేశించిన గృహం సాధారణ ముస్లిమ్‌లు నివసించే గృహం. తరువాత మీరు ప్రవేశించిన రెండో గృహం అమరగతి పొందినవారు అంటే షహీదులు నివసించే గృహం. నేను జిబ్రీల్(అ)ను నా సహచరుడైన ఇతను మికాయిల్ (అ). మీరు మీ శిరస్సును పైకి ఎత్తండి అన్నారు. నేను నా శిరస్సును పైకి ఎత్తాను. అప్పుడు నేను మేఘంలాంటి ఒక వస్తువును నా మీద ఉండటాన్ని గమనించాను. ఇది మీ స్థలం అన్నారు. నేను ఇలా అన్నాను. నన్ను వదిలిపెట్టండి. నేను నా స్థలానికి వెళ్ళిపోతాను. అప్పుడు వారు ఇలా అన్నారు ఇంకా ప్రపంచంలో ఉండే మీ వయస్సు మిగిలి ఉంది. మీరు దానిని ఇంకా పూర్తి చెయ్యలేదు. మీరుగనుక ఆ గడువును పూర్తి చేస్తే మీ స్థలానికి చేరుకుంటారు.'

## 92వ అధ్యాయం

### సోమవారం రోజున మరణిస్తే లభించే ఔన్నత్యం.

**469.** హజ్రత్ ఆయిషా (రజిఅన్‌హా) ఇలా అన్నారని హిషామ్ బిన్ ఉర్వ ఉల్లేఖించారు : నా తండ్రిగారైన అబూ బక్ర్ సిద్దీఖ్ (రజిఅన్) వ్యాధిగ్రస్తులై ఉన్నప్పుడు నేను ఆయన (ర) గారి వద్దకు వెళ్లాను. ఆయన (ర) నన్ను ఇలా అడిగారు, 'ఓ ఆయెషా! దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని నీవు ఎన్ని వస్త్రాలలో కఫన్ ఇచ్చావు.' నేను నాన్న గారితో ఇలా అన్నాను 'ఉతికిన మూడు తెల్లని వస్త్రాలలో కఫన్ ఇచ్చాను. వాటిలో ఖమీజూ లేదు. తలపాగా లేదు.' ఆయన (ర) ఇంకా ఈ విషయం కూడా అడిగారు, 'దైవప్రవక్త (స) ఏ రోజున మరణించారు? 'సోమవారం' నాడు అని నేను చెప్పాను. ఆయన (ర) ఇలా అడిగారు 'ఈ రోజు ఏ రోజు?' అని. 'సోమవారం' అని నేను అన్నాను. ఆయన (ర) ఇలా అన్నారు 'ఇప్పటి నుంచి రాత్రి వరకు ఏ సమయంలోనైనా నేను మరణిస్తానేమో అని ఆశిస్తున్నాను.' తరువాత అస్వస్థులైనప్పుడు తాను ధరించిన వస్త్రం మీద ఆయన దృష్టిని సారించారు. దానిపై

జాఫ్రాన్ మరకలు పడి ఉన్నాయి. ఆయన (ర) ఇలా అన్నారు 'ఆ వస్త్రాన్ని పరిశుభ్రంగా ఉతికించండి. ఇంకా రెండు వస్త్రాలను తీసుకుని రండి వాటిలో నన్ను కఫన్ చెయ్యండి. అప్పుడు నేను ఇలా అన్నాను: 'ఈ వస్త్రమైతే చాలా పాతది కదా!' ఆయన (ర) ఇలా అన్నారు: 'కొత్త వస్త్రమైతే ప్రాణంతో ఉన్న మనిషికి తగినదిగా ఉంటుంది, మృతి చెందిన వానికి బదులుగా. ఎందుకంటే, మృతునిపై కప్పబడే వస్త్రమైతే చీము, నెత్తురులో తడిసి చెడిపోయేదే.' తరువాత ఆ రోజున హజ్రత్ అబూ బక్ర్ (ర) మరణించలేదు. చివరకు మంగళవారం రాత్రి వచ్చింది. ఉదయం కాక మునుపే ఆయన(ర) దఫన్ చేయబడ్డారు.

## 93వ అధ్యాయం

### ఆకస్మిక మరణం గురించి.

**470.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; ఒక వ్యక్తి (సాద్ బిన్ ఉబాద) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స)తో ఇలా విన్నవించుకున్నాడు; 'ఓ దైవప్రవక్తా (స)! నా తల్లి అకస్మాత్తుగా చనిపోయింది. ఒకవేళ ఆమె గనక మాట్లాడ గలిగినట్లయితే, ఏదైనా ఒక వస్తువును దానం చేసి ఉండేవారు అని నేను అనుకుంటు న్నాను. ఇప్పుడు నేను గనుక ఆమె తరఫు నుంచి దానం చేస్తే ఆమెకు ఏదైనా పుణ్యం లభిస్తుందా?' దైవప్రవక్త (స) 'అవును, ఆమెకు పుణ్యం లభిస్తుంది' అని సెలవిచ్చారు.

## 94వ అధ్యాయం

### దైవప్రవక్త మహాశయులు(స) గారి సమాధి గురించి, అబూబకర్(రజిఅన్) గారి సమాధి గురించీ, ఉమర్(రజిఅన్) గారి సమాధి గురించీ ఏమని చెప్పబడింది ?

**471.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఉల్లేఖించారు. ఆమె(ర)గారు ఇలా అన్నారు. "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) తన మరణానికి కారణమైన వ్యాధితో ఉన్నప్పుడు, (ఇతర భార్యలతో) క్షమాపణలు చెప్పుకునే రీతిలో ఇలా సెలవిచ్చే వారు; 'ఈ రోజు నేను ఎక్కడ ఉన్నాను? రేపు నేను ఎక్కడ ఉంటాను?' హజ్రత్ ఆయెషా (ర) గారి దినం(వంతు) చాలా దూరంగా ఉందని ఆయన(స) భావించే వారు. చివరకు నా వంతు వచ్చిన రోజునే అల్లాహ్ ఆయన(స) గారిని లేపుకున్నాడు. నా బాహువులు మరియు నా వక్షస్థలం మధ్యలో ఉన్నప్పుడు. ఇంకా నా ఇంట్లోనే ఆయన(స) గారు సమాధి చెయ్యబడ్డారు.'

**472.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) తనకు ప్రాణాంతకమైన వ్యాధితో ఉన్నప్పుడు (ఆ వ్యాధిలో

నుంచి ఆయన(స) కోలుకోలేదు) ఇలా సెలవిచ్చారు; 'యూదుల్ని, క్రైస్తవుల్ని అల్లాహ్ శిక్షించుగాక ! వారు తమ ప్రవక్తల సమాధుల్ని మసీదులుగా చేసుకున్నారు. హజ్రత్ అయెషా(ర) ఇలా అన్నారు. ఒకవేళ ఈ భయమే గనుక లేకపోయినట్లయితే దైవ ప్రవక్త(స) గారి సమాధి తెరువబడి ఉండేది. కాని ఆయన(స) భయపడ్డారు. లేదా ప్రజలు కూడా భయపడ్డారు; ఆయన(స) గారి సమాధి మసీదుగా మారిపోతుందేమో అని.

**473.** అబూబకర్ బిన్ అయాష్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు. ఖర్జూర పండ్లు అమ్మే 'సుఫ్యాన్ బిన్ దీనార్ తాను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి సమాధిని చూశానని, అది ఒంటె మూపురం మాదిరిగా ఉన్నదని నాకు చెప్పారు.'

**474.** హిష్షామ్ బిన్‌ఉర్వా తన తండ్రిగారి నుంచి ఇలా ఉల్లేఖించారు; 'వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ ఖలీఫాగా దేశాన్ని పాలిస్తూ ఉన్న కాలంలో హజ్రత్ అయెషా (రజిఅన్‌హా) గారి హుజ్‌రా(గది)కు చెందిన ఒక గోడ పడిపోయింది. ప్రజలు దానికి మరమ్మత్తులు చేసి బాగు చెయ్యడం ప్రారంభించారు. అప్పుడు వారికి ఒక కాలు (పాదం) కనిపించింది. ప్రజలు భయపడిపోయారు. ఆ పాదం దైవప్రవక్త(స) గారి పవిత్రమైన పాదం అని వారు అనుకున్నారు. ఆ పాదాన్ని గుర్తించేవారెవరినీ వారు పొందలేకపోయారు. చివరకు ఉర్వా బిన్ జుబైర్ వారితో ఇలా అన్నారు; ఎంత మాత్రం కాదు. దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. ఇది దైవప్రవక్త(స) గారి పాదం కానేకాదు. ఈ పాదం హజ్రత్ ఉమర్(ర)గారి పాదం. ఈ ధ్రువీకరణల ద్వారానే హిష్షామ్ ఉల్లేఖించారు; ఆయన తన తండ్రి గారి నుంచి, ఆయన హజ్రత్ ఆయెషా(ర) గారి నుంచి ఆమె (ర) గారు (మరణించే సమయంలో) అబ్దుల్లా బిన్ జుబైర్ (ర)కు ఒక వీలునామా వ్రాసి ఇచ్చారు; అందులో ఆమె (ర) ఇలా అన్నారు; 'నన్ను దైవప్రవక్త (స) గారి సమాధి వద్దగానీ, అబూ బకర్ (ర)గారి సమాధి వద్దగానీ, ఉమర్ (ర) గారి సమాధి వద్దగానీ సమాధి చెయ్యకండి. జన్నతుల్ బఖీలో నన్ను నా సవతులతోపాటు దఫన్ చెయ్యండి. దైవప్రవక్త (స) గారితోపాటు నన్ను కూడా ప్రశంసించటాన్ని నేను ఇష్టపడను.'

**475.** అమ్ర్ బిన్ మైమూన్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు– 'నేను హజ్రత్ ఉమర్ (రజిఅన్)ను ఎవరో కత్తితో పొడవగా గాయపడినప్పుడు చూశాను. అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు, ఓ అబ్దుల్లాహ్(ర)! నీవు విశ్వాసుల తల్లి అయిన హజ్రత్

ఆయెషా సిద్దీఖా(రజిఅన్‌హా) వద్దకు వెళ్ళు, ఆమె(ర)గారితో ఇలా అను, ఉమర్(ర) మీకు సలామ్‌లు చెప్పమన్నారు. తరువాత ఆమె(ర)గారితో ఇలా విన్నవించు, నేను నా ఇద్దరు సహచరులతోపాటు ఒకే సమాధిలో పూడ్చిపెట్టబడటానికి మీరు అనుమతి నిస్తారా?' (అబ్దుల్లా ఆయెషా(ర) గారి వద్దకు వెళ్ళారు. ఈ సందేశాన్ని ఆమె(ర) గారికి అంద జేశారు) హ్రజత్ ఆయెషా(ర) ఇలా అన్నారు: 'ఈ స్థలాన్నయితే నేను నా కోసం ఉంచుకున్నాను. కాని ఈ రోజు నేను ఆయనర గారికి (హ్రజత్ ఉమర్(ర) గారికి) నాకంటే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాను. ఆయన(ర)గారిని అక్కడ (ఆ స్థలంలో) సమాధి చేసే అనుమతిని ఇస్తున్నాను' అబ్దుల్లా బిన్ ఉమర్(ర) తిరిగి వచ్చారు. అప్పుడు హ్రజత్ ఉమర్(ర) 'ఏమయింది?' అని ఆయన్ని అడిగారు. ఆయన(ర)ఇలా అన్నారు : 'ఓ అమీరుల్ మోమినీన్! హ్రజత్ ఆయెషా(ర) అనుమతిని ఇచ్చేశారు.' హ్రజత్ ఉమర్(ర) ఇలా అన్నారు 'ఈ స్థలంలో సమాధి చెయ్యబడటాన్ని నేను ఎంతగానో కోరుకునేవాణ్ణి. ఇంత తీవ్రమైన తలంపు మరొక విషయంలో ఉండేది కాదు. నేను మరణించినప్పుడు నీవు ఇలా చెయ్యి, నా జనాజాను ఎత్తుకుని తీసుకు వెళ్ళండి. హ్రజత్ ఆయెషా(ర)కు నా సలాము చెప్పు. మరియు ఇలా విన్నవించుకో; హ్రజత్ ఉమర్(ర) మీ హుజ్‌రాలో సమాధి చెయ్యబడే అనుమతిని కోరుతున్నారని చెప్పు. ఆమె(ర)గారు గనుక అనుమతి ఇస్తే నన్ను అక్కణ్ణే సమాధి చెయ్యండి. లేకపోతే ముస్లిముల ఖననవాటికకు తీసుకెళ్ళి అక్కడ సమాధి చెయ్యండి. చూడు! దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మరణించేవరకు తాను ఎవరినైతే ఇష్టపడుతూ ఉండేవారో వారిని కాక ఇతరులెవ్వరినీ ఖిలాఫత్‌కు హక్కుదారులుగా నేను భావించను. తరువాత ఈ ప్రజలు ఎవరినైతే ఖలీఫాగా ఎన్నుకుంటారో అతనే నా తరువాత ఖలీఫాగా ఉంటారు. అతని మాటను ప్రజలు వినాలి. అతను చెప్పినట్లు నడుచుకోవాలి. అతనికి విధేయత చూపాలి.' అప్పుడు హ్రజత్ ఉమర్(ర) ఈ పేర్లను ఖలీఫా పదవికి తగినవారని సూచించారు - హ్రజత్ ఉస్మాన్(ర), హ్రజత్ అలీ(ర), హ్రజత్ తల్‌హా(ర), హ్రజత్ జుబైర్(ర), హ్రజత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర), హ్రజత్ సాద్ బిన్ అబీవఖ్ఖాస్(ర)- అప్పుడు ఒక అన్సారీ యువకుడు ఆయన(ర) వద్దకు వచ్చి ఇలా అనసాగాడు: 'ఓ అమీరుల్ మోమినీన్! అల్లాహ్ తరఫు నుంచి మీకు శుభాలే శుభాలు. మీరు ఈ శుభవార్తను విని ఆనందించండి. ఇస్లామ్‌లో మీకు ఉన్న స్థానం ఏమిటో మీరు బాగా ఎరుగుదురు. ఆ

తరువాత మీరు ఖలీఫా పదవిని అలంకరించారు. న్యాయంగా రాజ్య పాలనం చేశారు. ఆ తరువాత మీకు అమరగతి ప్రాప్తించింది.' హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు, "ఓ నా సోదర కుమారా! నా కోరిక ఏమిటంటే, నా ఖిలాఫత్ కాలంలో నేను చేసిన తప్పులు, నా వల్ల జరిగిన మంచి పనులు రెండూ సరిసమానంగా ఉంటే ఎంత బాగుండును. నాకు పుణ్యమూ వద్దు, పాపమూ వద్దు! నా తరువాత ఖలీఫాగా ఎన్నుకోబడే వ్యక్తికి, మునుపటి ముహాజిర్ల పట్ల సద్భావంతో మెలగమనీ, వారికి మేలు చేస్తూ ఉండమనీ వారి హక్కుల్ని నెరవేరుస్తూ ఉండమనీ, వారి గౌరవాన్ని దృష్టిలో పెట్టుకోమనీ, అన్సారులకు కూడా మేలు చేస్తూ ఉండమనీ సిఫారసు చేస్తున్నాను. వారు మదీనా పట్టణంలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. వారు ఈమాన్ (విశ్వాసం)పై స్థిరంగా, నిలకడగా ఉన్నారు. అంటే వారిలో ఎవరైతే పుణ్యాత్ములో వారిని గౌరవించమనీ, వారు చేసిన మంచి పనుల్ని గౌరవభావంతో చూడమనీ, వారిలో ఎవరైనా తప్పులు చేస్తే, ఆ తప్పుల్ని మన్నించమనీ నేను సిఫారసు చేస్తున్నాను. అల్లాహ్, ఆయన ప్రవక్త(స) బాధ్యతలో ఉన్నటువంటి జిమ్మీలకు సంబంధించిన నిబంధనలను తు.చ తప్పకుండా పాటిం చమనీ, వారికి చేసిన వాగ్దానాలను నెరవేర్చమనీ, వారితో యుద్ధం చెయ్యవద్దనీ, వారు తప్ప ఇతర అవిశ్వాసులతో యుద్ధం చెయ్యమనీ, వారి స్థోమతకు మించి వారిని బంధించవద్దనీ నేను రాబోయే ఖలీఫాకు సిఫారసు చేస్తున్నాను.'

## 95వ అధ్యాయం

### మరణించినవారిని గురించి చెడ్డగా మాట్లాడటం నిషిద్ధం.[1]

**476.** హజ్రత్ ఆయెషా సిద్దీఖా (రజిఅన్హా) ఉల్లేఖించారు, ఆమె(ర)గారు ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు 'ఎవరైతే మరణించారో వారిని గురించి చెడ్డగా మాట్లాడకండి. ఎందుకంటే, వారు ఎలాంటి పనులు చేశారో అలాంటి ప్రతిఫలాన్నే పొందారు.[1] అబ్దుల్లా బిన్ అబ్దుల్ ఖుద్దూస్, ముహమ్మద్ బిన్ అనస్ కూడా ఈ హదీసును అమష్ నుంచి ఉల్లేఖించారు. ఆదమ్

---

95–1. అంటే, ముస్లిములు ఎవరైనా మరణిస్తే, వారి మరణం తరువాత వారిని గురించి చెడ్డగా మాట్లాడకూడదు. ఒకవేళ వారు అంటే మృతి చెందినవారు కాఫిర్లు గాని లేక ఫాసిఖ్లుగాని అయితే, అప్పుడు వారిలోని లోపాలను, చెడులను బహిర్గతం చెయ్యటం ధర్మసమ్మతమే. ఎందుకంటే, దానివల్ల ఇతరులకు అది హెచ్చరికగా ఉంటుంది.

బిన్ అబీ అయాస్‌తోపాటు ఈ హదీసును అలీ బిన్ జాద్, ముహమ్మద్ బిన్ అసర్, ఇబ్నె అబి అదీలు కూడా షుఐబ్ నుంచి ఉల్లేఖించారు.

## 96వ అధ్యాయం

**దుర్మార్గులైన మృతులు చేసిన చెడ్డ పనుల్ని గురించి ప్రచారం చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమే.[1]**

**477.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు- ఆయన(ర)గారు ఇలా అన్నారు; అబూలహబ్‌పై అల్లాహ్ శాపం విరుచుకుపడుగాక! అతడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)తో ఇలా అన్నాడు, రోజంతా నీవు నాశనమైపోవు గాక. అప్పుడు ఈ ఖుర్ఆన్ వాక్యం అవతరించింది. 'తబ్బత్ యదా అబీ లహబివ్ వ తబ్'బ (అబూ లహబ్ చేతులు రెండూ విరిగిపోయాయి. అతను నాశనమైపోయాడు).'

---

476-1. ఇప్పుడు వారిని గురించి చెడ్డగా మాట్లాడటం వల్ల ఎలాంటి ప్రయోజనమూలేదు. పైగా వారి బంధువులను, మిత్రులను మానసికంగా హింసించినట్లు అవుతుంది. అయితే హదీసు ఉల్లేఖకుల అభిప్రాయం ప్రకారం మరణానంతరం కూడా వారి చెడుల్ని గురించి చెప్పటం ధర్మసమ్మతమైన విషయమే. ఎందుకంటే దీనివల్ల ధర్మాన్ని రక్షించినట్లు అవుతుంది.

96-1. ఈ అధ్యాయాన్ని తీసుకువచ్చి ఇమామ్ బుఖారి (రహ్మాలై) నిరూపించిన విషయమేమిటంటే, ఏ హదీసులోనైతే మృతులు చేసిన చెడ్డపనుల్ని బహిర్గతం చెయ్యటాన్ని నిషేధించటం జరిగిందో ఆ హదీసులోని ముస్లిములు పైకి పుణ్యాత్ములుగానే జీవించి మరణించిన ముస్లిములు అని భావం. కాని కాఫిర్లు, ఫాసిఖ్‌లు చేసిన అన్యాయాలు, అక్రమాలను గురించి వారి మరణానంతరం కూడా బయట పెట్టడం, ప్రచారం చెయ్యటం ధర్మ సమ్మతమే. ఇబ్నె అబ్బాస్(ర) ధూత్కారి అబూలహబ్ చేసిన అక్రమాలను అతని మరణానంతరం కూడా ప్రకటించారు.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# జకాత్ ప్రకరణం

కరుణామయుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: సక్రమమైన రీతిలో నమాజు చెయ్యండి. మరియు జకాత్ ఇవ్వండి. అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారు అబూ సుఫ్యాన్(రజిఅన్) నాతో అన్నారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నమాజు చెయ్యమనీ, జకాత్ ఇవ్వమనీ[1], నిషిద్ధ విషయాలకు దూరంగా ఉండమనీ, బంధువులతో మంచి సంబంధాలు కలిగి ఉండమనీ ఆజ్ఞాపించారు.'

**478.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్రత్ మాజ్(ర)ను 'యమన్' వైపునకు పంపారు. మరియు ఆయన ఇలా సెలవిచ్చారు, 'యమన్‌కు చెందిన ప్రజలతో ఇలా చెప్పండి- అల్లాహ్ తప్ప నిజదైవం మరొకడెవ్వడూ లేడనీ, నేను అల్లాహ్ పంపిన ప్రవక్తనీ వారు సాక్ష్యమివ్వాలని' తరువాత వారుగనుక ఈ విషయాన్ని అంగీకరిస్తే అప్పుడు వారితో ఇలా అనండి 'అల్లాహ్ ప్రతిరోజూ (రేయింబవళ్ళు) ఐదు పూటలు నమాజు వారిపై విధిగా చేశాడు. వారు గనుక ఈ విషయాన్ని కూడా ఒప్పుకుంటే, అప్పుడు వారికి ఈ విషయాన్ని తెలియజెయ్యి. అల్లాహ్ జకాత్ దానాన్ని వారిపై విధిగా చేశాడని, అది వారికి చెందిన ధనవంతుల నుంచి తీసుకోబడుతుంది. వారికి చెందిన నిరుపేదలకే ఇవ్వబడుతుందని.'

**479.** అబూ అయ్యూబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు, ఒక మనిషి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వద్దకు వచ్చి ఆయన(స)గారితో ఇలా విన్నవించుకున్నాడు 'ఓ దైవప్రవక్తా(స)! నేను స్వర్గంలోకి పోవటానికి దోహదపడే ఏదైనా పనిని గురించి నాకు చెప్పండి.' అతనికి ఏమయింది, అలా అంటున్నాడు?' అని ప్రజలు

1) జకాత్ విధిగా చెయ్యవలసిన దానం అనే విషయం స్వయంగా ఖుర్ఆన్ ద్వారానే నిరూపితమైంది. ఖుర్ఆన్‌లో నమాజ్‌తోపాటు ఎనభై రెండు చోట్ల జకాత్‌కు సంబంధించిన ప్రస్తావన కూడా వచ్చింది. అది ఇస్లామ్ ధర్మసూత్రాలలోని ఒక మూలసూత్రం. దానిని తిరస్కరించే వాడు అవిశ్వాసి అయిపోతాడు. ఎవరైతే జకాత్ ఇవ్వటానికి తిరస్కరిస్తారో వారితో పాలకుడు జిహాద్ చెయ్యగలడు. హిజ్రీ శకం రెండో సంవత్సరంలో జకాత్ విధిగా చెయ్యబడింది.

అనసాగారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'అతనికి దాని అవసరం ఎంతయినా ఉంది. అది ఎంతో ముఖ్యమైన అవసరం. కనుక నీవు ఇలా చెయ్యి (అప్పుడు స్వర్గం లోకి పోతావు). అల్లాహ్‌ను మాత్రం ఆరాధించు, ఆయనకు సాటిగా ఎవరినీ భాగస్వామిగా నిలబెట్టబాకు, సక్రమమైన పద్ధతిలో నమాజు చెయ్యి. మరియు జకాత్ ఇస్తూ ఉండు. మరియు బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండు.[1]

**480.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఒక పల్లెటూరు మనిషి దైవప్రవక్త మహాశయులు ముహ్మమద్ (స) గారి వద్దకు వచ్చి ఇలా అనసాగాడు. 'నాకు ఏదైనా ఒక పనిని గురించి చెప్పండి. దానిని నిర్వహించినప్పుడు, నేను స్వర్గంలోకి పోగలగాలి.' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'అల్లాహ్‌ను మాత్రమే పూజించు; ఇతరులెవ్వరినీ ఆయనకు సాటి నిలబెట్టకు; ఫర్జ్ నమాజులను సక్రమమైన రీతిలో చెయ్యి, ఫర్జ్ జకాత్‌ను చెల్లిస్తూ ఉండు; రమజాను ఉపవాసాలను పాటిస్తూ ఉండు.' ఆ పల్లెటూరు వ్యక్తి ఇలా అన్నాడు; 'ఏ దేవుని చేతుల్లోనైతే నా ప్రాణాలు ఉన్నాయో, ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను ! ఈ పనుల కంటె ఎక్కువగా నేను ఏ పనినీ చెయ్యను.' అతను అక్కడి నుంచి వెళ్ళిపోయిన తరువాత దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'ఎవరైనా స్వర్గంలోకి వెళ్లిపోయే మనిషిని చూడదలిస్తే వారు ఈ వ్యక్తిని చూడండి.'

**481.** పై హదీసులోని విషయాలనే అబూ జురాగారు దైవప్రవక్త(స) గారి నుంచి ఉల్లేఖించారు.

**482.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన (పద్నాలుగు లేక నలభై మంది ప్రజలు గల) ఒక ప్రతినిధి వర్గం దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వచ్చింది. ఆ ప్రతినిధి వర్గ సభ్యులు ఇలా అన్నారు; "ఓ దైవప్రవక్తా(స)! మేము రబియా తెగకు చెందిన ఒక శాఖ ప్రజలము. మాకూ మీకూ(స) మధ్య ముజర్‌కు చెందిన అవిశ్వాసులు అడ్డంకిగా ఉన్నారు. కనుక మేము నిషిద్ధ మాసాలలో తప్ప (ఆ మాసాలలో అరబ్బు

---

479-1. నీవు గనుక ఈ పనులు చేసినట్లయితే నీకు స్వర్గం లభిస్తుంది. ఇమామ్ బుఖారి(రహ్మాలై), జకాత్ విధిగా చెయ్యవలసిన దానం అనే విషయాన్ని ఈ హదీసు ద్వారా నిరూపించారు. ఎందుకంటే, నమాజు తరువాత జకాత్ విధింపు విషయం ప్రస్తావించబడింది. ఇంకా స్వర్గంలోకి పోవటం అనేది జకాత్ ఇవ్వడం మీదనే ఆధారపడి ఉంది. అంటే, జకాత్ ఇవ్వటానికి తిరస్కరించటం వల్లనే మనిషి స్వర్గానికి దూరమవుతాడు.

ప్రజలు యుద్ధాలు చెయ్యరు) ఇతర దినాలలో మీ వద్దకు రాలేము. కావున మీరు మాకు కొన్ని ధార్మిక విషయాలను నేర్పండి. స్వయంగా వాటిని మేము కూడా మీ నుంచి నేర్చుకుంటాము. ఇంకా ఇక్కడకు రానటువంటి మా జాతి ప్రజలకు కూడా వాటిని నేర్పుతాము'. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; "నేను నాలుగు విషయాలను గురించి మీకు ఆజ్ఞాపిస్తున్నాను. మరియు మరొక నాలుగు విషయాలను గురించి నిషేధిస్తూ, ఆజ్ఞాపిస్తున్నాను. అవి ఏమిటంటే, అల్లాహ్‌ను విశ్వసించండి; అల్లాహ్ తప్ప సత్యదేవుడు మరొకడెవ్వడూ లేడని సాక్ష్యమివ్వండి; ఆయన తన ఒక వేలుతో సైగ చేసి మరీ చెప్పారు. ఇంకా సక్రమ మైన రీతిలో నమాజు చెయ్యండి. మరియు జకాత్ ఇవ్వండి. యుద్ధ సంపదలో నుంచి ఐదో భాగాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టండి. ఇంకా నేను దుబ్బాను, హన్‌తమ్‌ను, నఖీర్‌ను, ముజప్ఫత్‌ను (ఇవన్నీ సారాయి తయారు చెయ్యటానికి ఉపయోగించే పాత్రలు) ఉపయోగించకూడదని మీకు నిషేదిస్తున్నాను."

**483.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) దివంగతులైనప్పుడు మరియు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజిఅన్) ఖలీఫా అయినప్పుడు అరబ్బు ప్రజలు చాలామంది అవిశ్వాసులై పోయారు; హజ్రత్ అబూబకర్ (ర) అలాంటి వారితో యుద్ధం చెయ్యదలిచారు. అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు; 'మీరు వారితో ఎలా యుద్ధం చేస్తారు ? దైవప్రవక్త మహాశయులు (స) ఇలా అన్నారు కదా ! వారు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలకనంత వరకు మాత్రమే నేను వారితో యుద్ధం చేసే అనుమతిని కలిగి వున్నాను. వారు గనుక ఈ పవిత్ర వచనాన్ని పలికితే, అప్పుడు వారు తమ సంపదనూ, తమ ప్రాణాలనూ నా నుంచి సురక్షితంగా ఉంచుకోగలుగుతారు. కాని వారు గనుక చట్టాన్ని ఉల్లంఘిస్తే, అది వేరే విషయం. వారిని చట్టం ప్రకారం దండించటం జరుగుతుంది. అప్పుడు వారి నుంచి లెక్క తీసుకోవడం అల్లాహ్ బాధ్యతలో ఉంటుంది. అబూబకర్(ర) ఇలా అన్నారు; 'దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను! ఎవరైనా నమాజును, జకాత్‌ను భిన్నంగా చూస్తే (విభేదాన్ని పాటిస్తే) అప్పుడు నేను వారితో తప్పకుండా యుద్ధం చేస్తాను. ఎందుకంటె, జకాత్ సంపద హక్కు (నమాజు శరీరం యొక్క హక్కు అయి నట్టుగా) దేవుని సాక్షిగా చెబుతున్నాను! ఈ ప్రజలు గనుక దైవప్రవక్త (స) గారికి ఇస్తూ వచ్చిన ఒక మేక పిల్లను కూడా నాకు ఇవ్వకపోతే, అప్పుడు నేను దాని కారణంగా వారితో తప్పకుండా యుద్ధం చేస్తాను. హజ్రత్ ఉమర్ (ర) ఇలా అన్నారు; 'దేవుని

సాక్షిగా! అల్లాహ్ అబూ బకర్ (ర) హృదయాన్ని తెరచివేశాడు. (అంటే ఆయన (ర) గారి ఈ ఆలోచన దైవప్రోక్తమైనదే) ఇదే సత్యమని నేను భావిస్తున్నాను.'

## 1వ అధ్యాయం

**జకాత్ చెల్లిస్తామని వాగ్దానం (బైఅత్) చెయ్యటం. కరుణామయుడైన అల్లాహ్ బరాత్ సూరాలో ఇలా సెలవిచ్చాడు: 'కనుక ఒకవేళ వారు పశ్చాత్తాపపడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ చెల్లిస్తే అప్పుడు వారు మీ ధార్మిక సోదరులే. విజ్ఞుల కొరకు మేము మా ఆజ్ఞలను ఇలా స్పష్టం చేస్తాము.**

**484.** హ్రజత్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'నేను నమాజ్‌ను ఉత్తమమైన రీతిలో చేస్తాననీ, జకాత్‌ను చెల్లిస్తాననీ, ప్రతి ముస్లిమ్‌కు శ్రేయోభిలాషిగా ఉంటానని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)కు వాగ్దానం (బైఅత్) చేశాను.'

## 2వ అధ్యాయం

### జకాత్ ఇవ్వటానికి తిరస్కరించే వ్యక్తి చేసే పాపం

బరాత్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : 'ఓ ప్రవక్తా! వెండి బంగారాలను కూడబెట్టి వాటిని దైవమార్గంలో ఖర్చు పెట్టనివారికి వ్యధాభరితమైన శిక్ష పడుతుందనే శుభవార్తను అందజెయ్యండి. ఈ వెండి బంగారాలను నరకాగ్నిలో వేసి కాల్చబడే ఒకరోజు వస్తుంది. వాటితోనే వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వారి వీపులపై వాతలు వెయ్యబడతాయి. ఇది మీరు మీ కొరకు కూడబెట్టుకున్నది- ఇదిగో, ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచి చూడండి.' (దివ్యఖుర్‌ఆన్ **9 : 34,35**)

**485.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు 'ప్రళయ దినం నాడు ఏ ఒంటెలకు చెందిన జకాతు నైతే ప్రపంచంలో చెల్లించలేదో ఆ ఒంటెలు మంచి ఆరోగ్యంతో బాగా బలిసి ఉన్న స్థితిలో బ్రతికి లేచి వస్తాయి. అవి తమ యజమానిని కాళ్ళతో తన్నుతాయి, తొక్కుతాయి. ఇదే విధంగా ఏ మేకలకు సంబంధించిన జకాతు నైతే ప్రపంచంలో చెల్లించలేదో ఆ మేకలు కూడా మంచి ఆరోగ్యంతో బాగా బలిసి ఉన్న స్థితిలో లేచివస్తాయి. అవి తమ యజమానిపై పడి కాళ్ళ గిట్టెలతో తొక్కుతాయి. తమ కొమ్ములతో పొడు

స్తాయి. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'మేకలకున్న ఒక హక్కు ఏమిటంటే, వాటి ముందు నీళ్ళతో నింపిన బానల్ని ఉంచి వాటి పాలను పితకాలి.' దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ప్రళయదినం నాడు మీలో ఎవరైనా ఒక మేకను తమ భుజాలపై మోసు కుంటూ రాకూడదు మరియు అది మ్యామ్యా అని అరుస్తూ ఉన్న స్థితిలో. అప్పుడు ఆ మేక యజమాని 'ఓ ముహమ్మద్(స)! నన్ను రక్షించండి' అని ప్రాధేయపడితే అప్పుడు నేను ఇలా అంటాను, 'నేను నీకు ఎలాంటి సహాయమూ చెయ్యలేను. నేనైతే దేవుని ఆజ్ఞను నీ దాకా చేరవేశాను'. ఇంకా మీలో ఎవరైనా ప్రళయదినంనాడు ఒక ఒంటెను దేన్నయినా తన భుజాలపై మోసుకుంటూ రాకూడదు అది అరుస్తూ ఉన్న స్థితిలో. ఆ ఒంటె యజమాని, 'ఓ ముహమ్మద్(స)! నన్ను రక్షించండి' అని నన్ను ప్రాధేయపడితే, అప్పుడు నేను ఇలా అనటం తప్ప మరేమీ చెయ్యలేను. 'నేను నీకు ఎలాంటి సహాయమూ చెయ్యలేను. నేనైతే దేవుని ఆజ్ఞను నీ దాకా చేరవేశాను.[1]

**486.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఎవరికైతే అల్లాహ్ సంపదను ప్రసాదించాడో, అతనుగనుక ఆ సంపదపై జకాత్‌ను చెల్లించకపోతే, ప్రళయదినం నాడు అతని సంపద బట్టతల కలిగి ఉన్న ఒక మగ విషసర్పం ఆకారంలో అతని ముందుకు వస్తుంది. దాని కళ్ళ పైభాగంలో రెండు నల్లని మచ్చలు ఉంటాయి.[1] ఇంకా అది అతని మెడకు చుట్టుకుంటుంది. అతని దవడల్ని కరుస్తూ ఇలా అంటూ ఉంటుంది- 'నేను నీవు కూడబెట్టిన సంపదను. నేను నీవు నిలువ చేసిన దివ్య నిధిని.' ఆ తరువాత ఆయన (స) గారు ఆలి ఇమ్రాన్ సూరాలోని ఈ వాక్యాన్ని పఠించారు: 'అల్లాహ్ తన అనుగ్ర హాన్ని విరివిగా ప్రసాదించినప్పటికీ, పిసినారితనం చూపేవారు, ఈ పిసినారితనం తమకు మేలు చేస్తుందని భావించరాదు. ఇది వారి కొరకు ఎంతో హానికరమైనది.

---

485-1. ముస్లిమ్ ఉల్లేఖనంలో ఈ విషయం మటుకు అదనంగా ఉంది. అవి నోటితో కరుస్తాయి. ఆ దినం యాభై వేల సంవత్సరాల కాలం అంత సుదీర్ఘమైన దినం అవుతుంది. ఆ యాభై వేల సంవత్సరాల దినం అంతా ఆ ఒంటెలు, ఆ మేకలు తమ తమ యజమానుల్ని ఇలానే చేస్తూ ఉంటాయి అని భావం. దేవుడు తన దాసుల విషయంలో తీర్పు చెప్పే వరకు- అప్పుడు వారు తమ నివాస స్థలం స్వర్గమో లేక నరకమో చూసుకుంటారు.

486-1. కొందరు ఇలా అనువాదం చేశారు : ఆ సర్పం నోటికి ఇరువైపులా ఉన్న అంచులపై నురుగు ప్రవహిస్తూ ఉంటుంది.

వారు తమ లోభత్వంతో కూడబెడుతూ ఉన్నదే ప్రళయదినం నాడు వారి పాలిట కంఠ పాశం అవుతుంది.' (దివ్యఖుర్ఆన్ 3: 180)

## 3వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ఒక సూక్తి ప్రకారం, జకాత్ చెల్లించబడే సంపద దాచిన ద్రవ్యం (దొంగ నిలువ)లోనిది కాదు. "ఐదు ఉఖియాల కంటే తక్కువగా ఉన్న వెండిపై జకాత్ లేదు (ఒక ఉఖియా 38 2/5 గ్రాములకు సమానం).**

ఖాలిద్ బిన్ అస్లమ్ ఇలా ఉల్లేఖించారు: ఒకసారి మేము అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్)తో కలిసి బయటికి వెళ్ళాము. అప్పుడు ఒక పల్లెటూరు మనిషి అబ్దుల్లా బిన్‌ఉమర్(ర)గారిని ఇలా అడిగాడు: 'అల్లాహ్ యొక్క ఈ సూక్తిని గురించి నాకు వివరించండి.' 'వెండి బంగారాలను పోగుచేసి వాటిని దైవమార్గంలో ఖర్చుపెట్టని వారికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి. (దివ్య ఖుర్ఆన్ 9: 34). ఇబ్నె ఉమర్(ర) ఇలా వివరించారు: ఎవరైతే వెండి బంగారాలను నిలువ చేస్తారో, వాటిపై జకాత్ చెల్లించరో, వారికి శోకం సంభవించుగాక! కాని ఈ పవిత్ర వాక్యాలు జకాత్‌కు సంబంధించిన వాక్యాలు అవతరించకమునుపే అవతరించాయి. కనుక జకాత్‌కు సంబంధించిన వాక్యాలు అవతరించినప్పుడు, అల్లాహ్ జకాత్‌ను 'సంపదను పరిశుద్ధపరిచే వస్తువు'గా చేశాడు.

**487.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఉల్లేఖించారు. 'ఐదు ఉఖియాల కంటే తక్కువగా ఉన్న వెండి సంపదపై జకాత్ చెల్లించే అవసరం లేదు. అదే విధంగా ఐదు ఒంటెలకంటే తక్కువ సంఖ్యలో ఉన్న ఒంటెలపై కూడా జకాత్ లేదు. ఇంకా ఐదు వస్కులకంటే తక్కువ బరువులో ఉన్న ఖర్జూరపు పండ్లపై కూడా జకాత్‌లేదు.' (ఒక వస్క్ 60 'సా'ల బరువుకు సమానం. ఒక 'సా' 3 కే.జీల బరువుకు సమానం.'

**488.** జైద్ బిన్ వహబ్ ఇలా ఉల్లేఖించారు ఒకసారి నేను రబజ[1] అనే గ్రామం మీదుగా వెళ్ళటం జరిగింది. అక్కడ నేను అబూజర్ (రజిఅన్) (ఒక సహాబి)ను కలుసుకోవటం జరిగింది. నేను ఆయనగారిని, 'పట్టణాన్ని వదిలిపెట్టి అడవిలోని ఈ

గ్రామంలో మీరు ఎందుకు ఉంటున్నారు?' అని అడిగాను. అప్పుడు ఆయన సమాధానంగా ఇలా అన్నారు 'నేను సిరియా దేశానికి వెళ్ళి అక్కడ నివసిస్తూ ఉన్నాను. కాని నాకు మరియు ముఆవియా (ర) (ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(ర) గారి తరఫున ఆయన సిరియాకు గవర్నర్‌గా పని చేస్తున్నారు)కు మధ్య దివ్యఖుర్ఆన్‌లోని ఈ వాక్యం గురించి అభిప్రాయబేధం తలెత్తింది' 'వెండి బంగారాలను పోగు చేసి వాటిని దైవ మార్గంలో ఖర్చుపెట్టనివారికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి. ఆ వెండి బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే ఒకరోజు వస్తుంది. వాటితోనే వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వారి వీపులపై వాతలు వెయ్యబడతాయి. ఇది మీరు మీ కోసం కూడబెట్టుకున్నది, ఇదిగో ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచి చూడండి.' (దివ్యఖుర్ఆన్ **9 : 34, 35**) ఈ ఆయత్‌లను గురించి ముఆవియా(ర) ఇలా అన్నారు, "ఈ వాక్యం గ్రంథ ప్రజలను గురించి అవతరించింది." కాని నేను ఇలా అన్నాను. 'కాదు, ఈ వాక్యం ముస్లిములమైన మనల్ని గురించి కూడా అవతరించింది, గ్రంథ ప్రజలను గురించి కూడా అవతరించింది. నాకూ ఆయన గారికీ మధ్య గట్టి వాగ్వివాదమే జరిగింది. ఆయన ఖలీఫా అయిన హజ్రత్ ఉస్మాన్(ర)గారికి నా గురించి ఫిర్యాదు చేశారు. తత్ఫలితంగా హజ్రత్ ఉస్మాన్(ర) నన్ను మదీనా పట్టణానికి రమ్మని ఉత్తరం రాశారు. నేను మదీనా పట్టణానికి వచ్చినప్పుడు చాలా మంది ప్రజలు వచ్చి నా వద్ద గుమిగూడారు. వారు ఇదివరకు నన్ను చూడనేలేదు అన్న విధంగా అధిక సంఖ్యలో వచ్చారు. నేను ఈ విషయాన్ని గురించి హజ్రత్ ఉస్మాన్(ర)గారి ముందు ప్రస్తావిం చాను. అప్పుడు ఆయన(ర) నాతో ఇలా అన్నారు, 'మీకు ఇష్టమైతే మదీనాకు దగ్గర్లో ఉన్న ఏకాంత ప్రదేశంలో ఎక్కడైనా ఉండండి.' ఈ కారణం వల్లనే నేను ఇక్కడ ఈ ఎడారి ప్రదేశంలో ఉన్నాను. (హజ్రత్ ఉస్మాన్(ర) గారైతే చాలా పెద్ద మనిషి) ఒకవేళ నాపై ఒక హబషీని పాలకుడుగా నియమించినా నేను అతనికి విధేయత చూపుతాను. మరియు అతని ఆజ్ఞల్ని పాలిస్తాను.[2]

---

1. రబజ మదీనా పట్టణానికి దగ్గర్లో ఉన్న ఒక కుగ్రామం. అబూజర్ గిఫ్ఫారీ(ర) ఆ గ్రామానికి వెళ్ళి అక్కడే ఉన్నారు, అక్కణ్ణే మరణించారు.

2) హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజిఅన్) ఉత్కృష్టమైన లక్షణాలు గల ఒక మహోవ్యక్తి, ఒక పావన కుమారుడు. సాధు పుంగవుడైన ఒక సహాబి. అయినా మహోనుభావుడి వద్దకు ప్రజలు తండోపతండాలుగా వస్తూ ఉండేవారు. ఆయనగారి వల్ల కల్లోలం చెలరేగు

**489.** అహనఫ్ బిన్ ఖైస్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు 'ఒకసారి నేను ఖురైష్ తెగకు చెందిన కొందరు ప్రజల మధ్య కూర్చుని ఉన్నాను. ఇంతలోనే ఒక మనిషి అక్కడకు వచ్చాడు. అతని తలవెంట్రుకలు చెల్లాచెదురై ఉన్నాయి. అతను కట్టుకున్న బట్టలు ముతకగా, మోటుగా ఉన్నాయి. అతని ముఖవర్చస్సు సర్వసామాన్య మైనదిగా ఉంది. అతడు వారి వద్దకు వచ్చి, నిలబడి సలాం చేసి ఇలా అన్నాడు 'ఎవరైతే సంపదను కూడబెడుతున్నారో వారికి ఈ శుభవార్తను వినిపించండి. ఒక రాయి నరకజ్వాలలో కాల్చబడుతుంది, తరువాత అది వారి చంటి మొనలపై ఉంచబడుతుంది. అది వారి బాహువులలోని ఎముకల్లో నుంచి బయటికి వచ్చే వరకు అక్కడనే ఉంచ బడుతుంది. తరువాత దానిని బాహువుల్లోని ఎముకలపై ఉంచటం జరుగుతుంది. అది వారి చంటి మొనల్లోనుంచి బయటికి వచ్చే వరకు అక్కడనే ఉంచబడుతుంది. ఆ రాయి ఈ విధంగా శరీరంలో అటూ ఇటూ తిరుగుతూ దొర్లిపోతూ ఉంటుంది'. ఈ విధంగా చెప్పిన తరువాత ఆ వ్యక్తి నిశ్శబ్దంగా ఉండిపోయాడు. స్తంభానికి ప్రక్కగా ఉన్న స్థలంలో కూర్చుండిపోయాడు. నేను అతన్ని అనుసరించాను. తరువాత అతనికి పక్కగా దగ్గర్లో నేను కూడా కూర్చుండిపోయాను. అతనెవరో నాకు తెలియదు. అతనితో నేను ఇలా అన్నాను– 'నీవు చెప్పిన విషయాలు విని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని నేను అనుకుంటున్నాను.' అప్పుడు అతను ఇలా అన్నాడు 'ఈ ప్రజలైతే బుద్ధి హీనులు. వారు ఏ విషయాన్నీ అర్థం చేసుకోరు.' ఈ విషయాల గురించి నాకు నా ప్రాణస్నేహితుడు తెలియజేశాడు. అప్పుడు నేను, 'నీ ప్రాణస్నేహితుడు ఎవరు?' అని అతన్ని అడిగాను. దానికి సమాధానంగా అతను ఇలా అన్నాడు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నాతో ఇలా అన్నారు 'ఓ అబూజర్! నీవు ఉహుద్ పర్వతాన్ని చూస్తున్నావా?' ఇది

తుందేమోనని హజ్రత్ ముఆవియా(ర) సంశయం వ్యక్తం చేశారు. ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(ర) ఆయన గారిని అక్కణ్ణుంచి పిలిపించినప్పుడు ఆయన(ర) వెంటనే మదీనాకు వచ్చేశారు. ఇస్లామ్ ధర్మం ప్రకారం ఖలీఫాకు విధేయత చూపటం ప్రతి పౌరుని విద్యుక్త ధర్మం. అబూజర్ గిఫ్ఫారీ(ర) అలానే చేశారు. మదీనా పట్టణానికి వచ్చిన తరువాత కూడా సిరియాలోకంటే కూడా అధికసంఖ్యలో ప్రజలు గుంపులు గుంపులుగా ఆయన వద్దకు రాసాగారు. హజ్రత్ ముఆవియా (ర)కు కలిగిన సంశయమే హజ్రత్ఉస్మాన్(ర) గారికి కూడా కలిగింది. అయినప్పటికీ ఆయన (ర) అబూజర్ గిఫ్ఫారీ(ర)ని మదీనా పట్టణం నుంచి ఎక్కడికైనా వెళ్ళిపొమ్మని స్పష్టంగా చెప్పలేదు. కాని ఆయన ఎక్కడికైనా వెళ్ళమని సలహా మటుకు ఇచ్చారు. ఖలీఫా గారి మనస్సును గ్రహించిన ఆ మహానుభావుడు 'రబజ' అనే గ్రామానికి వెళ్ళి అక్కణ్ణే స్థిరపడిపోయారు.

విని నేను సూర్యుణ్ణి చూశాను ఇంకా ఎంత దినం మిగిలి ఉందో తెలుసుకుందామని. ఆయన(స)గారు ఏదైనా పని కోసం నన్ను ఎక్కడికైనా పంపదలుచుకున్నారేమో. నేను ఇలా విన్నవించుకున్నాను 'అవును చెప్పండి.' అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు- 'నా వద్ద ఉహుద్ పర్వతం అంత బంగారం ఉండాలని నేను కోరుకోవటంలేదు. ఒకవేళ అంత బంగారం నా వద్దనే ఉంటే, అప్పుడు నేను ఆ మొత్తం బంగారాన్ని అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసేస్తాను. ఒక్క మూడు దీనార్‌లను తప్ప.[1]' ఈ జనులు బుద్ధిహీనులు. వారికి అవగాహన లేదు. వారు ప్రాపంచిక సంపదను కూడబెట్టుకుంటున్నారు. అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. ప్రాపంచిక లాభాలను గురించి నేను వారిని అర్థిం చటంలేదు. ఇంకా మత సంబంధమైన ధార్మిక సలహా ఇవ్వమని కూడా నేను వారిని అడగటంలేదు. గౌరవనీయుడు, మహోన్నతుడు అయిన అల్లాహ్‌ను కలిసేవరకు నేను వారిని ఈ విషయాలను గురించి అడగను.'

## 4వ అధ్యాయం

## అల్లాహ్ మార్గంలో ధనం ఖర్చుపెట్టేదాని ఔన్నత్యం[1]

**490.** హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను, కేవలం ఇద్దరు వ్యక్తుల విషయంలో మాత్రమే ఈర్ష్య పడటం ధర్మసమ్మతం అవుతుంది. ఒక వ్యక్తి ఎవరంటే, అల్లాహ్ అతనికి సంపదను ఇచ్చాడు. ఇంకా ఆ సంపదను సత్కార్యాలలో ఖర్చుపెట్టే సద్బుద్ధిని ప్రసాదించాడు. రెండో వ్యక్తి ఎవరంటే, అతనికి అల్లాహ్ ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాల జ్ఞానాన్ని ప్రసాదించాడు. అతను స్వయంగా ఆ జ్ఞానంపై నడుస్తున్నాడు. ఇంకా ఆ జ్ఞానాన్ని అతను ఇతరులక్కూడా నేర్పుతున్నాడు.

## 5వ అధ్యాయం

ప్రదర్శనాబుద్ధితో దానధర్మాలు చెయ్యటం. దివ్య ఖుర్‌ఆన్‌లో బఖరా సూరాలో

489-1) బహుశా అప్పుడు ఆయన(స) గారు మూడు దీనార్‌ల రుణాన్ని ఎవరికైనా ఇవ్వవలసి ఉన్నదేమో. లేదా ఆయన (స) గారి రోజువారి ఖర్చు మూడు దీనార్‌లు ఉన్నదేమో.

4-1. అంటే పుణ్యకార్యాలలో సంపదను ఖర్చుపెట్టటం నిరుపేదలకు, అగత్యపరులకు అన్నం తినిపించటం, ధార్మిక పాఠశాలలను, ధర్మసత్రాలను కట్టించటం, ముజాహిద్‌ల కోసం జిహాద్‌కు అవసరమైన సామగ్రిని కొనివ్వటం, ధర్మజ్ఞానం నేర్చుకునే విద్యార్థుల కోసం, ఆహార పానీయాలను ఏర్పాటు చెయ్యటం లాంటి సత్కార్యాలు అని భావం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొందటానికే తన ధనం ఖర్చుచేసేవాని మాదిరిగా, అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించనివాని మాదిరిగా మీరు దెప్పిపొడిచి గ్రహీత మనస్సును గాయపరచి మీ దానధర్మాలను మట్టిలో కలపకండి. అతడు చేసిన ధన వ్యయాన్ని ఈ విధంగా పోల్చవచ్చు: "ఒక కొండ రాయిపై ఒక మట్టి పొర ఏర్పడి ఉంది. భారీ వర్షం దానిపై కురవగా ఆ మట్టి కాస్తా కొట్టుకుపోయింది. చివరకు మిగిలింది ఉత్త కొండరాయి మాత్రమే. ఇలాంటి వారు తాము దానం చేస్తున్నామని భావించి చేసే పుణ్యకార్యం వల్ల వారికి ఏ ప్రయోజనమూ కలుగదు. అవిశ్వాసులకు సత్యమార్గం చూపటం అల్లాహ్ సంప్రదాయం కాదు." **(2 : 264)**. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారు 'ఈ వాక్యంలో 'సల్‌ద్' అనే పద ప్రయోగం జరిగింది. 'సల్‌ద్' అంటే 'ఉత్త కొండరాయి మాత్రమే' అని అర్థం. ఇంకా దానిపై ఏమీ మిగిలి ఉండలేదు.

## 6వ అధ్యాయం

దొంగ సొమ్ములో నుంచి చేసే దానధర్మాలు స్వీకరించబడవు. ధర్మసమ్మతమైన (హలాల్) మార్గాల ద్వారా సంపాదించిన సొమ్ములోనుంచి చేసే దానధర్మాలు మాత్రమే స్వీకరించబడతాయి. ఎందుకంటే, బఖరా సూరాలోనే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 'మనస్సును గాయపరిచే దానం కంటే, మృదుభాషణం, క్షమాగుణం ఎంతో మేలైనది. అల్లాహ్ అన్నింటికీ అతీతుడు, అత్యంత సహన శీలుడూను." **(2: 263)**

## 7వ అధ్యాయం

హలాల్ సంపాదనలోనుంచి చేసే దానధర్మాలు మాత్రమే స్వీకరించబడతాయి. ఎందుకంటే, దివ్యఖుర్‌ఆన్‌లోని బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు, 'అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు. దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు. కృతఘ్నుడూ, దుష్టుడూ అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు. కాని విశ్వసించి మంచి పనులు చేసే వారికి, నమాజును స్థాపించేవారికి, జకాత్‌ను ఇచ్చేవారికి వారి ప్రభువు వద్ద తగిన ప్రతిఫలం లభిస్తుంది. వారికి భయం కానీ, శోకంకానీ కలిగే అవకాశం లేదు.' **(2 : 277)**

**491.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఒక వ్యక్తి ఎవరైనా తన హలాల్ సంపాదనలో నుంచి ఒక ఖర్జూరపు పండంత వస్తువు దానం చేసినా హలాల్ సంపాదననే అల్లాహ్ స్వీకరిస్తాడు. అల్లాహ్ ఆ దానాన్ని తన కుడిహస్తంతో స్వీకరిస్తాడు. ఆ తరువాత దానం

చేసే వ్యక్తి లాభం కోసం ఆ దానాన్ని పెంచి పోషిస్తూ ఉంటాడు, పెద్దదిగా చేస్తూ ఉంటాడు– మీలో ఎవరైనా తమ పిల్లగుర్రాన్ని పెంచి పోషించినట్లుగా. చివరకు ఆ దానం ఒక మహాపర్వతం అంత పెద్దదైపోతుంది.'

## 8వ అధ్యాయం

**దానధర్మాలను స్వీకరించేవాడు ఎవ్వడూ ఉండని కాలం రాకమునుపే సాధ్యమైనంత ఎక్కువగా దానధర్మాలు చెయ్యండి.**

**492.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను అని హారిస్ బిన్ వహబ్(ర) ఉల్లేఖించారు 'ఓ జనులారా! దానధర్మాలు చెయ్యండి. మీపైకి ఒక కాలం రాబోతోంది అప్పుడు మనిషి దానధర్మాలు తీసుకుని తిరుగుతూ ఉంటాడు. కాని వాటిని స్వీకరించేవాడెవ్వడూ ఉండడు. తీసుకునే వాడు దానధర్మాలు చేసేవానితో ఇలా అంటాడు; 'నీవు గనుక ఈ దానధర్మాలను నిన్నటి రోజున తీసుకుని వచ్చి ఉంటే, అప్పుడు నేను వాటిని తీసుకుని ఉండేవాణ్ణి. ఈ రోజైతే నాకు వాటి అవసరం ఎంతమాత్రం లేదు.'[1]

**493.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'మీ సంపద పుష్కలంగా పెరగనంతవరకు ప్రళయం సంభవించదు. చివరకు తాము చేసే దానధర్మాలను స్వీకరించేవాడెవ్వడూ లేడే అని ధనవంతుడు చింతిస్తాడు. ఇంకా తాను తన జకాత్ దానాన్ని ఇవ్వబోయే వ్యక్తి, నాకు దీని అవసరం లేదు కదా! అని అంటాడు.'

**494.** అదీ బిన్ హాతిమ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి నేను దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి కూర్చుని ఉన్నాను. ఇంతలోనే ఇద్దరు మనుషులు ఆయన (స) గారి వద్దకు వచ్చారు. ఆ ఉభయుల్లోని ఒకడు తన

---

492–1. ప్రళయం దగ్గర్లో ఉన్నప్పుడు భూమిలో ఉన్న సంపద అంతా బయటికి వచ్చేస్తుంది. అప్పుడు ప్రజలు కొద్దిమంది మాత్రమే భూమిపై ఉంటారు. అలాంటి పరిస్థితిలో ఏ మనిషికీ సంపద అవసరం ఏమాత్రమూ ఉండదు. హదీసు భావం ఏమిటంటే, మీలో అవసరాలు తీరని ప్రజలు ఉన్నకాలాన్ని మేలైనదిగా భావించండి. అప్పుడు సాధ్యమైనంతవరకు దానధర్మాలు విరివిగా చెయ్యండి. ఈ హదీసు ద్వారా మరొక విషయం కూడా తేటతెల్లమవుతుంది. ప్రళయం రాబోయే ముందు త్వరత్వరగా పెను మార్పులు సంభవిస్తాయి. పెద్దపెద్ద విప్లవాలు వస్తాయి. ఈనాడు పేదవాడుగా ఉన్న మనిషి రేపు అష్టఐశ్వర్యాలతో తులతూగుతూ ఉంటాడు.

పేదరికం గురించి ఫిర్యాదు చేశాడు, మరొకడు దొంగతనాలు ఎక్కువగా జరగటాన్ని గురించి, అశాంతిని గురించి ఫిర్యాదు చేశాడు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: "బాటసారుల అభద్రత, దొంగతనాలు కొంత కాలంలోనే అంతమవుతాయి. మదీనా నుంచి మక్కానగరం వరకు బాటసారుల సమూహం నిర్భయంగా, సురక్షితంగా ప్రయాణం చేసే కాలం త్వరలోనే రాబోతోంది. ఇంకా అప్పుడు ఎలాంటి రక్షకభటుల అవసరమూ బాటసారులకు ఉండదు. ఇక పేదరికం గురించి, మీలోని ఒకరు ఎవరైనా తాను దానం చెయ్యదలచిన వస్తువులను తీసుకుని తిరుగుతూ ఉన్నంత వరకు, ఆ దానాన్ని స్వీకరించే వ్యక్తి ఎవ్వడూ దొరకని పరిస్థితి ఏర్పడనంతవరకు ప్రళయం సంభవించదు. ఆ తరువాత (ప్రళయదినం నాడు) మీలోని ప్రతి ఒక్కడూ అల్లాహ్ ముందు నిలబడి ఉంటాడు. అప్పుడు అల్లాహ్కూ, అతనికీ మధ్య ఎలాంటి తెర ఉండదు. ఇంకా అనువాదం చేసే మధ్యవర్తి కూడా ఎవ్వడూ ఉండడు. తరువాత అల్లాహ్ అతనితో ఇలా సెలవిస్తాడు 'ఏమిటి? నేను నీవు ప్రపంచంలో ఉన్నప్పుడు నీకు ధనాన్ని ఇవ్వలేదా?' అతను ఇలా విన్నవించు కుంటాడు, 'ఎందుకివ్వలేదు, నిస్సందేహంగా నీవు నాకు రూపాయలు ఇచ్చావు.' తరువాత అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: 'ఏమిటి? నేను ప్రపంచానికి ప్రవక్తలను పంప లేదా?' అతను ఇలా విన్నవించుకుంటాడు: 'ఎందుకు పంపలేదు నీవు ప్రవక్తలను పంపావు.' తరువాత అతను తన కుడివైపును చూస్తాడు. అక్కడ అగ్ని కనిపిస్తుంది, తన ఎడమవైపునకు చూస్తాడు అక్కడ కూడా అగ్నినే కనిపిస్తుంది. మీలోని ప్రతి ఒక్కడూ తనను నరకాగ్ని నుంచి కాపాడుకోవాలి- కేవలం ఒక ఖర్జూరపు పండునైనా సరే దానం చేసి. ఒకవేళ ఖర్జూరపు పండు కూడా లభించని పక్షంలో ఒక మంచి మాట పలికి అయినా సరే."

**495.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ మూసా అష్అరీ (రజి అన్) ఉల్లేఖించారు. "ప్రజలపైకి ఒక కాలం రాబోతోంది. అప్పుడు ఒక వ్యక్తి దానం చెయ్యటానికి బంగారాన్ని తీసుకుని తిరుగుతూ ఉంటాడు. కాని తన నుంచి ఆ బంగారాన్ని దానంగా తీసుకునే మనిషి ఎవ్వడూ అతనికి దొరకడు. ఇంకా మరొక వ్యక్తి కూడా అతనికి కనిపిస్తాడు. ఆ వ్యక్తి సంరక్షణలో నలభై మంది మహిళలు ఉంటారు. ఎందుకంటే, ఆ కాలంలో పురుషులు తక్కువ సంఖ్యలో ఉంటారు. మరియు మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉంటారు."

## 9వ అధ్యాయం

**సగం ఖర్జూరపు పండునైనా లేదా కొద్దిపాటి వస్తువునైనా దానం చేసి మిమ్మల్ని మీరు నరకజ్వాలల నుంచి కాపాడుకోండి. అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో బఖరా సూరాలో ఇలా సెలవిచ్చాడు: "దీనికి భిన్నంగా తమ సంపదను చిత్తశుద్ధితో కేవలం అల్లాహ్ సంతోషం పొందే ఉద్దేశ్యంతో వ్యయపరిచేవారి వ్యయాన్ని మెట్ట ప్రదేశంలో ఉన్న తోటతో పోల్చవచ్చు. భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. ఒకవేళ భారీ వర్షం కురవక, సన్నని జల్లు పడినా అదే దానికి చాలు. మీరు చేసేదంతా అల్లాహ్ దృష్టిలో ఉంది."**

**496.** అబూ మసూద్ అన్సారీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'సదఖా (దాన ధర్మాలు)కు సంబంధించిన ఖుర్ఆన్ వాక్యం అవతరించినప్పుడు మేము హమాలి పని (కూలి పని) చేస్తూ ఉండేవారము. ఒక వ్యక్తి (అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్) వచ్చాడు. అతను చాలా వస్తువుల్ని దానం చేశాడు. అప్పుడు ప్రజలు, 'ఇతను లోకుల మెప్పు పొందటం కోసం దానం చేస్తున్నాడు' అని అనసాగారు. మరొక వ్యక్తి (అబూ అఖీల్) వచ్చాడు, అతను ఒక 'సా' ఖర్జూరపు పండ్లు దానం చేశాడు. ప్రజలు, అతను దానం చేసిన 'సా' ఎత్తు ఖర్జూరపు పండ్లు అవసరం అల్లాహ్‌కు లేదు అని అనసాగారు. అప్పుడు ఖుర్ఆన్‌లోని బరాత్ సూరాలోని ఈ వాక్యం అవతరించింది, 'సంతోషంతో, ఇష్టంతో విశ్వాసులు చేసే ధనత్యాగాలను కించపరుస్తూ వారు మాట్లాడతారు. (దేవుని మార్గంలో ఇచ్చేందుకు) తాము శ్రమకోర్చి ఇచ్చేది తప్ప మరేదీ తమ వద్ద లేనివారిని వారు హేళన చేస్తారు. ఈ హేళన చేసేవారిని అల్లాహ్ హేళన చేస్తున్నాడు. వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది.' **(9 : 79)**

**497.** అబూ మసూద్ అన్సారీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) దానం చెయ్యమని మమ్మల్ని ఆజ్ఞాపించినప్పుడు, మాలోని కొందరు బజారుకు వెళ్ళేవారు. అక్కడ బరువులు మోసి ఒక ముద్ ధాన్యాన్ని కూలీగా సంపాదించేవారు. కాని ఈనాడు మాలోని ఒక్కొక్కరి వద్ద లక్ష దిర్హమ్‌లు ఉన్నాయి.

**498.** అదీ బిన్ హాతిమ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను, 'నరకాగ్ని నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి (సదఖా ఇచ్చి). సగం ఖర్జూరపు పండునైనాసరే దానం చేసి.'

**499.** హ్రజత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: 'ఒకసారి ఒక స్త్రీ ఏదైనా ఉంటే దానం చెయ్యమని అర్థిస్తూ నా వద్దకు వచ్చింది. ఆ స్త్రీ వెంట ఆమె ఇద్దరు కూతుళ్ళు కూడా ఉన్నారు. ఆ సమయంలో దానం చెయ్యటానికి నా వద్ద ఒక ఖర్జూరపు పండు తప్ప మరేమీ లేదు. నేను ఆ ఖర్జూరపు పండునే ఆమెకు ఇచ్చాను. ఆ స్త్రీ ఆ ఖర్జూరపు పండును రెండు భాగాలుగా చేసి వాటిని తన ఇద్దరు కూతుళ్ళకు పంచి పెట్టింది. కాని స్వయంగా తాను మాత్రం ఏమీ తినలేదు. తరువాత లేచి నిలబడి అక్క ణ్ణుంచి తన కూతుళ్ళను తీసుకొని వెళ్ళిపోయింది. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మా వద్దకు వచ్చారు. నేను ఈ వృత్తాంతాన్ని ఆయన(స) గారికి విన్నవించుకున్నాను. ఆయన(స) అప్పుడు ఇలా సెలవిచ్చారు 'మీలో ఎవరైనా ఈ కూతుళ్ళ కారణంగా ఏదైనా పరీక్షలో చిక్కుకుంటే, అప్పుడు వారు ఆమె కోసం ప్రళయదినం నాడు నరకం నుంచి కాపాడే రక్షణ కవచంగా, అడ్డుగా నిలబడతారు.'

## 10వ అధ్యాయం

## ఆరోగ్యం బాగా ఉన్నప్పుడు, ధనాపేక్ష ఉన్న కాలంలో దానధర్మాలు చేసేదాని ఔన్నత్యం.

ఎందుకంటే, అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో మునాఫిఖూన్ సూరాలో ఇలా సెల విచ్చాడు 'మీలో ఎవరికైనా మరణ సమయం సమీపించి, అతను, ఓ ప్రభూ! నీవు నాకు మరికొంత వ్యవధి ఎందుకివ్వలేదు, నేను దానధర్మాలు చేసి సజ్జనులలో కలిసి పోయేవాణ్ణి కదా!' అని వాపోయే పరిస్థితి రాక ముందే మేము మీకు ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చుపెట్టండి. కాని ఎవరి ఆచరణ వ్యవధి అయినా ముగిసిపోయే సమయం ఆసన్నమైనప్పుడు, అల్లాహ్ ఇక అతనికి ఎంతమాత్రం అదనపు వ్యవధి ఇవ్వడు. మీరు చేస్తున్నదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు **(63 : 10)**. అల్లాహ్ బఖర సూరాలో ఇలా సెలవిచ్చాడు విశ్వసించిన ఓ ప్రజలారా! క్రయవిక్రయాలు కూడా జరగని, మైత్రీ ఉపయోగపడని, సిఫారసు కూడా చెల్లని ఆ (చివరి) దినం రాకపూర్వమే, మేము మీకు ప్రసాదించిన సిరిసంపదల నుంచి (మా మార్గంలో) ఖర్చు పెట్టండి. వాస్తవంగా అవిశ్వాసమార్గం అవలంబించే వారే దుర్మార్గులు. **(2 : 254)**

**500.** హ్రజత్ అబూ హురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి వద్దకు ఒక వ్యక్తి వచ్చి ఇలా అడిగాడు; 'ఓ దైవప్రవక్తా(స)! ఎలాంటి దానం చేస్తే మనిషికి ఎక్కువ పుణ్యం, ఎక్కువ ప్రతిఫలం లభిస్తుంది?' సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'నీ ఆరోగ్యం బాగా ఉన్నప్పుడు, ధనవ్యామోహం ఉండి, పేదరికానికి నీవు భయపడుతూ ఉన్నప్పుడు, ఇంకా

ఎక్కువ ధనాన్ని సంపాదించాలనే కోరిక నీలో తీవ్రంగా ఉన్నప్పుడు, అప్పుడు ఆ స్థితిలో నీవు గనుక దానం చేస్తే, నీకు ఎక్కువ పుణ్యం లభిస్తుంది. గుండె గొంతులోకి వచ్చి మరణం సమీపించే వరకు దానం చేసే విషయంలో ఆలస్యం చెయ్యకు. ఆ సమయంలో ఫలానా మనిషికి ఇంత ధనం ఇవ్వండి. ఫలానా మనిషికి ఇది ఇవ్వండి అని అనటం వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. ఎందుకంటే, ఆ ధనం ఫలానా వాడిది ఎప్పుడో అయిపోయింది.'

**501.** హ్రజత్ ఆయెషా(ర) ఇలా ఉల్లేఖించారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి భార్యలు కొందరు ఆయన(స)ను ఇలా అడిగారు 'ఓ దైవ ప్రవక్తా!(స) మాలో అందరికంటే ముందు మిమ్మల్ని ఎవరు కలుస్తారు?' సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'ఎవరి చేతులు ఎక్కువ పొడుగ్గా ఉంటాయో వారు నన్ను ముందుగా కలుస్తారు.' తరువాత వారు ఒక కర్రను తీసుకుని తమ తమ చేతుల్ని కొలుచుకోసాగారు. అప్పుడు హ్రజత్ సౌదా(ర)గారి చేతులు అందరి చేతుల కంటే ఎక్కువ పొడుగ్గా ఉన్నట్లు తేలింది. ఆ తరువాత (దైవప్రవక్త(స)గారి భార్యలలో అందరి కంటే ముందు హ్రజత్ జైనబ్(ర) మరణించారు). చేతులు పొడుగ్గా ఉండటం అంటే దాన ధర్మాలు చెయ్యటం అని మేము అర్థం చేసుకున్నాము. హ్రజత్ జైనబ్(ర) దైవ ప్రవక్త(స)గారి భార్యలలో అందరికంటే ముందు ఆయన్ని(స) కలుసుకున్నారు. దానధర్మాలు చెయ్యటం ఆమె(ర)గారికి చాలా ఇష్టం.'

## 11వ అధ్యాయం

**ప్రజల సమక్షంలో దానధర్మాలు చెయ్యటం (ధర్మసమ్మతమే). కరుణామయుడైన అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో (బఖరా సూరాలో) ఇలా సెలవిచ్చాడు "తమ సంపదను రేయింబవళ్లు బహిరంగంగానూ, రహస్యంగానూ ఖర్చు చేసేవారు తమ ప్రతిఫలాన్ని తమ ప్రభువు వద్ద పొందుతారు. వారికి ఏ విధమైన భయంకాని, దుఃఖంగాని కలిగే అవకాశం లేదు.**

## 12 అధ్యాయం

గుప్తంగా దానధర్మాలు చెయ్యటం (శ్రేష్ఠమైనది). దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు (ఈ విషయం పైన వచ్చింది). ఒక వ్యక్తి ఎంతో గుప్తంగా దానం చేస్తాడు. అతని కుడిచేయి ఎంత ధనాన్ని దానం చేసింది అతని ఎడమ చేతికి కూడా తెలియదు.

కరుణామయుడైన అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో బఖరా సూరాలో ఇలా సెలవిచ్చాడు “మీరు మీ దానధర్మాలను బహిరంగంగా చేసినా మంచిదే. కాని రహస్యంగా నిరుపేద లకు దానమివ్వటం మీకు ఎక్కువ మేలు చేకూరుస్తుంది.” (2:271)

## 13వ అధ్యాయం

**తెలియకపోవటం వల్ల ఒకవేళ ఎవరైనా ధనవంతుడైన వ్యక్తికి దానం ఇచ్చినా అతనికి పుణ్యం లభిస్తుంది.**[1]

**502.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూహురైరా (ర) ఉల్లేఖించారు:(బనీ ఇస్రాయీల్‌కు) చెందిన ఒక వ్యక్తి ఇలా అన్నాడు ‘ఈ రోజు రాత్రి నేను తప్పకుండా దానంచేస్తాను. తరువాత అతను ఆ రోజు రాత్రి తాను దానం చెయ్యదలచుకున్న వస్తువును తీసుకుని బయలుదేరాడు. అతను ఆ వస్తువును ఒక దొంగచేతిలో పెట్టాడు. మరుసటి రోజు ఉదయం ప్రజలు మాట్లాడు కుంటూ, “దొంగకు దానం దొరికింది” అని అనుకున్నారు. ఈ విషయాన్ని తెలుసు కున్న దానం చేసిన ఆ వ్యక్తి ఇలా అన్నాడు, “ఓ అల్లాహ్! నీకు కృతజ్ఞతలు నేను ఈ నాటి రాత్రి మరొక వస్తువును దానం చేస్తాను.” ఆ రోజు రాత్రి ఆ వ్యక్తి తాను దానం చెయ్యదలచిన వస్తువును తీసుకుని బయలు దేరాడు. అతను ఆ వస్తువును ఒక వేశ్య చేతిలో పెట్టాడు. తెల్లవారిన తరువాత ప్రజలు వ్యంగ్యంగా ఇలా అనుకున్నారు- విచిత్రంగా ఉంది. పోయిన రాత్రి ఒక వేశ్యకు ఎవరో ఒక వ్యక్తి దానం చేశాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న దానం చేసిన ఆ వ్యక్తి ఇలా అన్నాడు: ‘ఓ అల్లాహ్! నీకు కృతజ్ఞతలు! ఒక వేశ్యకు దానం లభించింది. నేను ఈనాటి రాత్రి కూడా తప్పకుండా దానం చేస్తాను.’ ఆ రోజు రాత్రి ఆ వ్యక్తి తాను దానం చెయ్యదలచిన వస్తువును తీసుకుని బయలుదేరాడు. అతను ఆ దానాన్ని ధనవంతుడైన ఒకవ్యక్తి చేతిలో పెట్టాడు.

---

13-1. అంటే నఫిల్ సదఖాకు లభించే పుణ్యం లభిస్తుంది. కాని ‘ఫర్జ్ సదఖా’ అంటే ‘జకాత్ దానం’ ఒకవేళ అడిగనక ధనవంతుడైన వ్యక్తికి ఇచ్చినట్లయితే ఆ విషయం సదఖా ఇచ్చే వ్యక్తికి తెలియకపోతే తరువాత అతనికి తెలిసిపోయినట్లయితే అప్పుడు ఆ జకాత్‌ను మరొకసారి ఇవ్వవలసి ఉంటుంది. ఎక్కువమంది ఇమామ్‌లు ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. కాని ఇమామ్ అబూహనీఫా (ర), ఇమామ్ ముహమ్మద్ (ర)ల దృష్టిలో మరొకసారి ఆ దానాన్ని ఇచ్చే అవసరం లేదు. వారు ఇచ్చే తీర్పుకు ఈ హదీసే ఆధారం.

మరుసటి రోజు ఉదయం ప్రజలు ఇలా పరస్పరం అనుకున్నారు- "చూడండి! ధనవంతుడైన వ్యక్తికి దానం లభించింది. ఇది విన్న దానం చేసిన ఆ వ్యక్తి ఇలా అన్నాడు 'ఓ అల్లాహ్! ఒక దొంగకు, ఒక వేశ్యకు, ఒక ధనవంతుడికి దానం లభించినందుకు నేను నీకు కృతజ్ఞతలు సమర్పించుకుంటున్నాను.' తరువాత ఒక వ్యక్తి ఎవరో అతని వద్దకు వచ్చి ఇలా అన్నాడు 'నీవు చేసిన మూడు దానాలు దైవస్వీకారానికి నోచుకున్నాయి. ఎందుకంటే, బహుశ దొంగ ఆ రాత్రి దానం లభించటం వల్ల దొంగతనం చెయ్యటం మానుకుంటాడేమో! ఆ వేశ్య బహుశ తనకు దానం లభించిన కారణంగా వ్యభిచారం చెయ్యటాన్ని మానుకుంటుందేమో! ఆ ధనవంతుడు ఈ దానం లభించటం వల్ల ఆలోచిస్తాడేమో! మరియు గుణపాఠాన్ని స్వీకరిస్తాడేమో! ఇంకా అల్లాహ్ అతనికి ఇచ్చిన దాన్నుంచి అల్లాహ్ మార్గంలో ఖర్చుపెడతాడేమో!'

## 14వ అధ్యాయం

**ఒక వ్యక్తి ఎవరైనా ఏదైనా ఒక వస్తువును తెలియక పోవడం వల్ల, తన కుమారునికి దానం చేస్తే-**

**503.** మఅన్ బిన్ యజీద్(ర) (ఒక సహాబీ) ఇలా ఉల్లేఖించారు: నేను మరియు మా తండ్రి గారైన యజీద్, మా తాతగారు, మేమందరమూ కలిసి దైవప్రవక్త(స) మహాశయులు ముహమ్మద్(స)గారితో బైఅత్(వాగ్దానం) చేశాము. ఆయన (స)గారు నాకు నిశ్చితార్థం చేయించారు. తరువాత నా నికాహ్ కూడా చేయించారు. ఆ తరువాత నేను ఒక వ్యాజ్యాన్ని తీసుకుని దైవప్రవక్త(స)గారి వద్దకు వెళ్ళాను. జరిగిన విషయం ఏమిటంటే, మా తండ్రిగారైన యజీద్ పేదలకు దానం చెయ్యటానికి కొన్ని బంగారు నాణాలను తీసుకుని మసీదుకు వెళ్ళారు. మసీదులో ఉన్న ఒక వ్యక్తికి ఆ నాణాలను పేదలకు దానం చెయ్యమని ఇచ్చారు. నేను మసీదులో ఉన్న ఆ వ్యక్తి వద్దకు వెళ్ళి ఆ బంగారు నాణాలను తీసుకున్నాను. వాటిని తీసుకుని నేను మా తండ్రి గారి వద్దకు వెళ్ళాను. ఆయన (నా తండ్రి గారు) ఇలా అన్నారు- అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను! ఈ నాణాలను నీకు దానంగా ఇవ్వాలనే ఉద్దేశ్యం నాకు లేనేలేదు. చివరకు ఆ తండ్రీ కొడుకులిద్దరూ వాదించుకుంటూ దైవ ప్రవక్త(స)గారి వద్దకు వచ్చారు. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు : 'ఓ యజీద్! నీవు చేసుకున్న సంకల్పం నెరవేరింది. నీకు పుణ్యం లభిస్తుంది. ఓ మఅన్! ఏదైతే నీవు తీసుకున్నావో అది నీ సొంతమైపోయింది.'

## 15వ అధ్యాయం

### కుడిచేత్తో దానం చెయ్యటం శ్రేష్టమైనది.

**504.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఏ రోజైతే అల్లాహ్ నీడ తప్ప మరొక నీడ ఏదీ ఉండదో ఆ రోజున అల్లాహ్ తన నీడలో ఏడుగురు వ్యక్తులకు ఆశ్రయమిస్తాడు. ఆ వ్యక్తులు ఎవరంటే, 1) న్యాయంగా పాలించే రాజు. 2) యవ్వన దశ ప్రారంభమైనప్పటి నుంచీ అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమైపోయిన యువకుడు. 3) ఏ వ్యక్తి మనస్సు అయితే మసీదులో లగ్నమై ఉంటుందో ఆ వ్యక్తి 4) అల్లాహ్ కోసం ప్రేమించుకునే ఇద్దరు వ్యక్తులు. ఆ ప్రేమపై స్థిరంగా నిలకడగా ఉండిపోయినవారు. ఇంకా ఆ ప్రేమతోనే వేరై పోయినవారు (మరణించినవారు). 5) అందమైన స్త్రీ అశ్లీల కార్యం కోసం ఆహ్వానించినప్పుడు 'నేను అల్లాహ్‌కు భయపడతాను. (ఆ దుష్టకార్యానికి పాల్పడలేను' అని ఆమె ఆహ్వానాన్ని తిరస్కరించిన వ్యక్తి) 6) కుడిచేత్తో రహస్యంగా దానం చేసిన వ్యక్తి. ఆ విషయం అతని ఎడమ చేతికి కూడా తెలియదు 7) ఏకాంతంలో ఉన్నప్పుడు అల్లాహ్‌ను స్మరించిన వ్యక్తి. అప్పుడు అతని కళ్ళు అశ్రువులతో నిండిపోతాయి.'

**505.** హారిసా బిన్ వహబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను- 'ఓ జనులారా! అల్లాహ్ మార్గంలో దానం చెయ్యండి. త్వరలోనే ఒకకాలం మీ మీదకు రాబోతోంది. అప్పుడు ఒక వ్యక్తి దానం చేసే ఉద్దేశంతో కొన్ని వస్తువుల్ని తీసుకుని అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. (కాని అతని దానాన్ని స్వీకరించటానికి ఎవరూ ముందుకు రారు) తన దానాన్ని స్వీకరించమని అతను ఏ వ్యక్తిని అడిగినా అతను ఇలానే సమాధానం చెబుతాడు. 'ఈ వస్తువుల్ని నీవు గనుక నిన్న తీసుకుని వచ్చి ఉంటే నేను తప్పకుండా వాటిని తీసుకుని ఉండేవాణ్ణి. కాని ఇప్పుడు ఈనాడు వాటి అవసరం నాకు ఎంత మాత్రమూ లేదు అని తిరస్కరిస్తాడు.'

## 16వ అధ్యాయం

### ఒకవేళ ఒక వ్యక్తి ఎవరైనా తన నౌకరు (సేవకుడు లేక బానిస)ను ఏదైనా వస్తువును దానం చెయ్యమని ఆజ్ఞాపిస్తే మరియు తన చేత్తో ఆ దానాన్ని చెయ్యక పోతే, అప్పుడు .....

**అబూ మూసా అష్అరి (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా చెబుతూ ఉండగా విన్నానని ఉల్లేఖించారు 'దానం చేసిన ఆ నౌకరు కూడా దానం చేసినవారిలోని వాడుగా పరిగణింపబడతాడు.'**

**506.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు 'ఒక స్త్రీ ఎవరైనా తన ఇంట్లోని ఆహార పదార్థాల్లో నుంచి కొంత భాగాన్ని, చెడగొట్టే ఉద్దేశ్యం లేకుండా, దానం చేస్తే అప్పుడు ఆ స్త్రీకి కూడా దానం చేసిన దానికి లభించే పుణ్యం లభిస్తుంది, తన భర్తకు ఆ ఆహార ధాన్యాలు సంపాదించినందుకు గాను లభించే పుణ్యం మాదిరిగా. ఇంకా గోదాము రక్షకునికి కూడా అంతే పుణ్యం లభిస్తుంది. ఎవరి పుణ్యం ఎవరి పుణ్యాన్ని తక్కువ చేయదు.'

## 17వ అధ్యాయం

మంచి దానం ఏదంటే ఆ దానం చేసిన తరువాత మనిషి ధనవంతుడుగానే ఉండిపోవాలి.[1] ఏ వ్యక్తి అయితే తన అవసరాలు తీరకపోయినా తన వద్ద ఉన్న ధనాన్ని దానం చేస్తాడో లేక అతని భార్యాపిల్లలు తమ అవసరాలు తీరని వారుగా ఉంటారో ఆ దానం సమంజసమైన దానం కాదు. అదేవిధంగా ఒకవేళ రుణగ్రస్తుడైతే, అప్పుడు దానం చెయ్యటంకంటే, బానిసకు విముక్తి కలిగించటంకంటే, హిబా (ఇతరులకు బహుమతిగా ఇవ్వటం) కంటే అప్పులు తీర్చటం ముఖ్యమైనది. ధర్మసమ్మతమైనది అవుతుంది. అతను చేసిన దానం అతని మీదకే త్రిప్పికొట్టబడుతుంది. దానం చేసి ప్రజల ధనాన్ని కొల్లగొట్టడం అతనికి ధర్మసమ్మతమైన విషయం కాదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయితే, ఇతరుల సొమ్మును కొల్లగొట్టే ఉద్దేశ్యంతో తీసుకుంటాడో అల్లాహ్ అతన్ని నాశనం చేస్తాడు. అయితే, ఒకవేళ సహనం వహించటం లోనూ, కష్టాలు భరించటంలోనూ ప్రసిద్ధిగాంచి ఉన్నట్లయితే, అప్పుడు అతను తన సొంత అవసరం కంటే, పేదవారి అవసరాన్ని ప్రధానమైనదిగా భావించ వచ్చు. అబూ బకర్ సిద్దీఖ్(ర)తన మొత్తం ఆస్తిని దానధర్మాల కోసం వెచ్చించినట్లుగా. ఇంకా ఇదే విధంగా అన్సారులు తమ అవసరాలకంటే ముహాజిర్ల అవసరాలను ప్రధానమైనవిగా భావించినట్లుగా. దైవప్రవక్త (స) ధనాన్ని నాశనం చెయ్యటాన్ని (దుర్వినియోగం చెయ్యటాన్ని) నిషేధించారు. కనుక తమ ధనాన్ని తామే దుర్వినియోగం చెయ్యటం నిషిద్ధమైనప్పుడు ఇతర ప్రజల ధనాన్ని దానధర్మాల రూపంలో నాశనం చెయ్యటం

---

506-1. అంటే, నీ అవసరాల కోసం కొంత ధనాన్ని ఉంచుకొని మిగతాది దానం చెయ్యి. ఉన్నదంతా దానధర్మాల కోసం ఖర్చుచేసి స్వయంగా నీవే పేదవాడవు అయిపోవద్దు.

ఎన్నటికీ ధర్మసమ్మతమైన విషయం కాబోదు. తబూక్ యుద్ధంలో వెనుక ఉండిపోయిన కాబ్ బిన్ మాలిక్(ర) ఇలా విన్నవించుకున్నారు: 'ఓ దైవప్రవక్తా(స)! నా తౌబాను పరిపూర్ణం చెయ్యటానికి నా సంపదనంతా అల్లాహ్ మార్గంలో, దైవప్రవక్త (స) మార్గంలో ఖర్చు చేసేస్తాను.' అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: (వద్దు, అలా చెయ్యవద్దు) 'కొంత ధనాన్ని నీ వద్ద ఉంచుకో. అది నీ విషయంలో ఎంతో మేలైనది.' అప్పుడు కాబ్ బిన్ మాలిక్(ర) ఇలా అన్నారు 'మంచిది, నేను ఖైబర్‌లోని నా భాగాన్ని నా వద్ద ఉంచుకుంటాను.'

**507.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: ఉత్తమమైన దానం ఏదంటే, అది ఇచ్చిన తరువాత కూడా మనిషి ధనవంతుడుగానే ఉండాలి. ఆ దానాన్ని నీవు మొట్టమొదట నీ ఆశ్రితులతో ప్రారంభించాలి.

**508.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హకీమ్ బిన్ హిజామ్(రజిఅన్) ఉల్లేఖించారు: 'పైన ఉండే (దానం చేసే) చెయ్యి క్రింద ఉండే (తీసుకునే) చెయ్యికంటే ఉత్తమమైనది. మొట్టమొదట నీ భార్యాపిల్లలకు, నీ బంధువులకు ఇవ్వాలి. ఉత్తమమైన దానం ఏదంటే, ఆ దానం చేసిన తరువాత మనిషి ధనవంతుడుగానే ఉండాలి. ఎవరైనా ఆర్థిక సహాయం చెయ్యమని ఇతరుల్ని అర్థించకుండా ఉండదలిస్తే, అలా అడగటం నుంచి తనను కాపాడుకోదలిస్తే అప్పుడు అల్లాహ్ అతన్ని దాన్నుంచి రక్షిస్తాడు. ఇంకా ఎవరైనా ఇతరులపై ఆధారపడకుండా తమను రక్షించమని అల్లాహ్‌ను వేడుకుంటే, అప్పుడు అల్లాహ్ అతనికి స్వయం సమృద్ధిని ప్రసాదిస్తాడు. ఇతరుల ఆశ్రయం కోరటం గురించి అతన్ని అతీతుడుగా చేస్తాడు.'

**509.** అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మింబర్‌పై నిలబడి దానధర్మాలను గురించి, ఆర్థిక సహాయం చెయ్యమని ఇతరుల్ని అర్థించవద్దనే విషయం గురించి ఇంకా ఆర్థిక సహాయం చెయ్యమని అడగటం గురించి మాట్లాడారు. మరియు ఇలా సెలవిచ్చారు: 'పైన ఉండే చేయి క్రింద ఉండే చేయి కంటే ఉత్తమమైనది. పైన ఉండే చేయి ఖర్చు పెట్టే చేయి. మరియు క్రింద ఉండే చేయి అర్థించే చేయి.'

## 18వ అధ్యాయం

**చేసిన సహాయాన్ని గుర్తుచేసి మనస్సును నొప్పించేవాణ్ణి ఖండించటం. ఎందుకంటే, దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు,**

'అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని వ్యయం చేసి ఆ తరువాత తమ దాతృత్వాన్ని మాటిమాటికి చాటుతూ గ్రహీతల మనస్సును గాయపరచని వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంది. వారికి ఏవిధమైన భయం కాని, ఖేదం కాని ఉండవు. మనస్సును గాయపరిచే దానం కంటే మృదు భాషణం, క్షమాగుణం ఎంతో మేలైనవి.'

*(దివ్యఖుర్‌ఆన్ **2: 262**)*

## 19వ అధ్యాయం

**దానధర్మాలు చెయ్యటంలో త్వరపడటం ఉత్తమం.**

**510.** ఉఖబా బిన్ హారిస్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన (ర) ఇలా అన్నారు- ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అసర్ నమాజు చేయించారు. తరువాత త్వరత్వరగా తన ఇంట్లోకి వెళ్ళిపోయారు. కొంతసేపటి తరువాత ఆయన(స) బయటికి విచ్చేశారు. నేను ఆయన (స) గారిని దానికి కారణం అడిగాను. లేక మరొకరు ఎవరైనా అడిగారేమో. అప్పుడు ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు 'దాన ధర్మాలకు ఉద్దేశించబడిన ఒక బంగారు ముక్కను ఇంట్లో వదిలివచ్చాను. ఆ వస్తువు రాత్రి అంతా నా వద్ద ఉండటం అనేది నాకు ఇష్టంలేదు. కనుక నేను దాన్ని పంచి పెట్టాను.'[1]

## 20వ అధ్యాయం

**దానధర్మాలు చెయ్యమని ప్రజల్ని ఉద్బోధించడం, ప్రేరేపించడం మరియు సిఫారసు చెయ్యటం.**

**511.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈదుల్ ఫితర్ (పండుగ) దినంనాడు బయటికి వెళ్ళి పోయారు. అంటే, మదీనా పట్టణం నుంచి బయటికి వెళ్ళి పోయారు. అక్కడ పండుగకు సంబంధించిన రెండు రకాతులు నమాజును చేశారు. దానికి

---

510-1. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసిన విషయమేమిటంటే, దానధర్మాలు చేసే విషయంలో తొందరపడటం ఉత్తమమైన విషయం. ఎందుకంటే, మనిషికి మరణం ప్రాప్తించ వచ్చు. లేక ఆ ధనం మిగిలివుండకపోవచ్చు ఆ విధంగా పుణ్యం లభించకపోవచ్చు.

ముందుగాని లేక తరువాత గాని ఆయన(స) గారు ఎలాంటి నఫిల్ నమాజునూ చెయ్యలేదు. ఆ తరువాత హ(జత్ బిలాల్ (రజిఅన్హు)ను వెంటబెట్టుకుని మహిళల వైపునకు వెళ్ళారు. వారికి హితబోధ చేశారు. దానధర్మాలు చెయ్య మని వారిని ఆదేశించారు. ఒక స్త్రీ తన బంగారు కంకణాన్ని దానం చేస్తే మరొక స్త్రీ తన చెవి రింగుల్ని దానం చేసింది.

**512.** తన తండ్రిగారు ఇలా అన్నారని అబూ బర్దా బిన్ అబూ మూసా ఉల్లేఖించారు, ఒక యాచకుడు ఎవరైనా దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వచ్చినప్పుడల్లా లేక ఒక వ్యక్తి ఎవరైనా తన అవసరాన్ని గురించి దైవప్రవక్త(స)గారి సన్నిధిలో విన్నవించుకున్నప్పుడల్లా ఆయన(స) తన అనుచరులతో ఇలా సెలవిచ్చేవారు; 'మీరు కూడా అతన్ని గురించి సిఫారసు చెయ్యండి. మీకు పుణ్యం లభిస్తుంది.' ఇంకా కరుణామయుడైన అల్లాహ్ తన ప్రవక్త(స) నోటి ద్వారా తాను కోరినదాన్ని ఆజ్ఞాపిస్తాడు.

**513.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తనతో ఇలా సెలవిచ్చారని హ(జత్ అస్మా(రజిఅన్హా) ఉల్లేఖించారు; 'దానధర్మాలు చెయ్యటాన్ని ఆపబాకు. అలా చేస్తే నీ ఉపాధి కూడా ఆపబడుతుంది.'

**514.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబ్దహ్ (రజిఅన్) ఉల్లేఖించారు; 'నీ ధనాన్ని లెక్కబెట్టి దానం చెయ్యబాకు. అలా చేస్తే అల్లాహ్ కూడా నీకు లెక్కబెట్టి ఇస్తాడు.'

## 21వ అధ్యాయం

### శక్తి మేరకు దానం చెయ్యటం.

**515.** తాను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి వద్దకు వెళ్ళినప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారని అస్మా బిన్తె అబూబకర్(రజిఅన్హా) ఉల్లేఖించారు; 'ధనాన్ని సంచుల్లో దాచిపెట్టి ఉంచబాకు, అలా చేస్తే అల్లాహ్ కూడా నీ ఉపాధిని, నీ ఆహారాన్ని ఆపివేస్తాడు. సాధ్యమైనంతవరకు దానధర్మాలు చేస్తూ ఉండు.'

## 22వ అధ్యాయం

### దానధర్మాలు చెయ్యటం వల్ల పాపపరిహారం జరుగుతుంది.

**516.** అబూ వాయెల్ ఇలా ఉల్లేఖించారు; హ(జత్ ఉమర్ (రజిఅన్) ఇలా

అడిగారని హుజైఫా(రజిఅన్) అన్నారు; దుఃఖాలు, ఆపదలను గురించి దైవప్రవక్త(స) గారి హదీసు మీలో ఎవరికి జ్ఞాపకం ఉంది?' హుజైఫా(ర), 'నాకు జ్ఞాపకం ఉంది' అని సమాధానం పలికారు. ఇంకా దైవప్రవక్త(స) ఆ హదీసును ఎలా సెలవిచ్చారో అలానే నాకు జ్ఞాపకం ఉంది అని కూడా ఆయన(ర) అన్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా సెలవిచ్చారు; 'నిస్సందేహంగా నీవు ధైర్యసాహసాలు కలవాడవే. చెప్పు దైవప్రవక్త(స) ఏమని సెలవిచ్చారో చెప్పు.' అప్పుడు నేను ఇలా అన్నాను, 'మనిషికి అతని ఇంటి వారి వల్ల, భార్యాపిల్లల వల్ల, మిత్రుల కారణంగా, పొరుగువారి కారణంగా ఒక ఆపద కలుగుతుంది. (వారి పట్ల అతనికి ఉన్న ప్రేమ కారణంగా అతను ఆరాధనల పట్ల అశ్రద్ధ వహిస్తాడు) నమాజ్, దానధర్మాలు మంచి మాటల్ని బోధించటం వల్ల ఈ ఆపద నశిస్తుంది.

అమష్ ఇలా అన్నారు; అబూ వాయెల్ అప్పుడప్పుడు ఇలా అంటూ ఉండే వారు; నమాజు, దానధర్మాలు, మంచి మాటల్ని ఆజ్ఞాపించడం, చెడ్డ విషయం నుంచి వారించటం– ఇవి ఆ ఆపదను పరిహరిస్తాయి. అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు: 'నేను ఆ ఆపదను గురించి అడగలేదు. నేనైతే సముద్రపు అలలు మాదిరిగా ఎగిసిపడుతూ వచ్చే ఆపదను గురించి అడిగాను.' అప్పుడు నేను ఇలా అన్నాను; 'ఓ అమీరుల్ మోమినీన్! ఆ ఆపదను గురించి మీరు భయపడే అవసరం లేదు. మీకూ దానికీ మధ్య మూసివేయబడి వున్న ఒక ద్వారం ఉంటుంది.' హజ్రత్ ఉమర్(రజిఅన్) ఇలా సెలవిచ్చారు; 'అయితే, ఆ ద్వారం పగలగొట్ట బడుతుందా? లేక తెరువబడుతుందా?' నేను ఇలా అన్నాను, 'లేదు. అది పగలగొట్టబడుతుంది. ఇక ఎన్నడూ మూసివేయబడదు.' "అది పగలగొట్టబడే మాటైతే, ఇక ఎన్నటికీ మూసుకోదు" అని ఆయన అన్నారు. అప్పుడు నేను ఇలా అన్నాను, 'అవును', అబూ వాయెల్ ఇలా అన్నారు; మేము హుజైఫా(ర)ను ఇలా అడగటానికి భయపడ్డాము, 'ద్వారం అంటే భావం ఏమిటి?' మేము మస్రూఖ్‌ను 'మీరు అడగండి'అని అన్నాం. ఆయన అడిగారు. అప్పుడు హుజైఫా(ర) ఇలా అన్నారు; 'ద్వారం అంటే భావం స్వయంగా హజ్రత్ ఉమర్ (ర)గారే.' మేము ఇలా అన్నాము; 'హజ్రత్ ఉమర్(ర)గారికి ఈ విషయం గురించి తెలుసా?' అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు; ఈ రోజు రాత్రి రేపటి దినం కంటే దగ్గర్లో ఉంది' అనేది ఎంత నిజమో అంత నిజంగా ఆయన(ర) దానిని గురించి ఎరుగుదురు. కారణం ఏమిటంటే, నేను ఆయన(ర) గారికి ఒక హదీసును గురించి వివరించాను. అది అసత్యమైన విషయమేమీ కాదు.

## 23వ అధ్యాయం

**ఎవరైతే కుఫ్ర్ (అవిశ్వాస) స్థితిలో ఉన్నప్పుడు, మరియు షిర్క్ స్థితిలో ఉన్నప్పుడు దానధర్మాలు చేస్తారో, ఆ తరువాత వారు గనుక మతం మార్చుకుని ముస్లిమ్‌లుగా అయిపోతే... అప్పుడు**

**517.** హకీమ్ బిన్ హిజామ్(రజిఅన్) ఉల్లేఖించారు. ఆయన ఇలా అన్నారు; నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో ఇలా విన్నవించుకున్నాను; ఓ 'దైవప్రవక్తా(స)! దయచేసి చెప్పండి, అవిశ్వాస స్థితిలో ఉన్నప్పుడు, (కుఫ్ర్‌లో) నేను దానధర్మాలు చేశాను. బానిసలకు విమోచనం కలిగించాను. బంధువులతో మంచి సంబంధాలు కలిగి వుండేవాణ్ణి. ఈ సత్కార్యాలకు గాను నాకు పుణ్యం లభిస్తుందా?' దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; "నీవు ఎన్ని సత్కార్యాలైతే చేశావో ఆ సత్కార్యాలను స్థిరంగా చేస్తూ ముస్లిమ్‌గా మతం మార్చుకున్నట్లయితే నీకు పుణ్యం లభిస్తుంది."

## 24వ అధ్యాయం

**సేవకుడు (భార్య, బానిస, నౌకరు) గనుక తన యజమాని ఆజ్ఞాపించినప్పుడు దానధర్మాలు చేస్తే, అందులో చెడు సంకల్పం లేకపోతే అప్పుడు అతనికి పుణ్యం లభిస్తుంది.**

**518.** ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు; 'ఒక స్త్రీ ఎవరైనా తన భర్త అన్నంలో నుంచి దానం చేస్తే మరియు ఆమె సంకల్పం చెడ్డది కాకుండా ఉంటే, అప్పుడు ఆమెకు పుణ్యం లభిస్తుంది. (దానం చేసినందుకు), ఇంకా ఆమె భర్తకు కూడా పుణ్యం లభిస్తుంది, ఇంకా స్టోర్ కీపర్‌కు కూడా అంతే పుణ్యం లభిస్తుంది.'

**519.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ మూసా(రజిఅన్) ఉల్లేఖించారు; 'ముస్లిమ్ అమానతుదారు అయిన ఒక వ్యక్తి ఎవరైనా తన యజమాని జారీ చేసిన ఆజ్ఞను నెరవేరిస్తే లేదా తన యజమాని ఇవ్వమని తనకు ఆజ్ఞాపించినదాన్ని పూర్తిగా, సహృదయంతో తన యజమాని ఇవ్వమని తనకు ఆజ్ఞాపించినవారికి ఇచ్చినట్లయితే, అందులోనుంచి తన హక్కును కోరకుండా ఉంటే, ఇంకా ఇచ్చే విషయంలో అతను మోసానికి పాల్పడకుండా ఉంటే, అప్పుడు దానం చేసేవారు ఇద్దరిలో నుంచి అతను కూడా ఒకడు అవుతాడు.'

## 25వ అధ్యాయం

**ఒక స్త్రీ ఎవరైనా తన భర్తకు చెందిన సంపదలోంచి దానం చేస్తే లేదా తన భర్త గృహంలోంచి ఎవరికైనా అన్నం తిని పిస్తే - భర్త సంపాదనను నాశనం చేసే దురుద్దేశం ఆమెకు గనుక లేకపోతే - అప్పుడు ఆమెకు పుణ్యం తప్పకుండా లభిస్తుంది.**

**520.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు; 'ఒక స్త్రీ ఎవరైనా తన భర్త ఇంట్లోనుంచి ఏ వస్తువునైనా దానం చేస్తే... దైవప్రవక్త(స) ఇంకా ఇలా సెలవిచ్చారని, హజ్రత్ ఆయెషా(ర) ఉల్లేఖించారు; 'ఒక స్త్రీ ఎవరైనా తన భర్త ఇంట్లో నుంచి అగత్యపరునికి ఎవరికైనా అన్నం తిని పిస్తే, తన భర్త సంపదను నాశనం చేసే దుష్ట సంకల్పం ఆమెకు గనుక లేకపోతే, అప్పుడు ఆ స్త్రీకి దానం చేసిన దానికి పుణ్యం లభిస్తుంది. ఆమె భర్తకు కూడా అంతే పుణ్యం లభిస్తుంది. స్టోర్ కీపర్‌కు కూడా అంతే పుణ్యం లభిస్తుంది. (భర్తకు సంపాదించినందుకుగాను, భార్యకు దానం చేసినందుకుగాను).

**521.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఆయెషా(ర) ఉల్లేఖించారు; 'ఒక స్త్రీ ఎవరైనా తన ఇంట్లోని అన్నంలోనుంచి అల్లాహ్ మార్గం లో ఖర్చు చేసినట్లయితే, ఇంకా అన్నాన్ని నాశనం చేసే దుష్ట సంకల్పాన్ని కలిగి వుండకపోతే అప్పుడు ఆ స్త్రీకి వేరుగా పుణ్యం లభిస్తుంది. మరియు ఆమె భర్తకు సంపాదించి నందుకుగాను వేరుగా పుణ్యం లభిస్తుంది. మరియు స్టోర్ కీపర్‌కు కూడా అంతే పుణ్యం లభిస్తుంది.[1]

## 26వ అధ్యాయం

దివ్యఖుర్‌ఆన్‌లో దేవుని వాక్కు ఇలా వుంది; కనుక ఎవరు (దైవమార్గంలో) ధనాన్ని వినియోగించాడో (దైవ అవిధేయతకు) భయపడ్డాడో, మంచిని సత్యమని అంగీకరించాడో అతనికి మేము సన్మార్గంలో నడిచేందుకు సౌకర్యాన్ని కలుగజేస్తాము. ఎవరు పిసినారితనం వహించాడో (దేవుని పట్ల) నిర్లక్ష్య వైఖరి అవలభించాడో, పైగా

---

521-1. ఇమామ్ బుఖారి(రహ్మాలై) ఈ హదీసును మూడు విధాలుగా వివరించారు. అంతేగాని అది పలుమార్లు రాలేదు. ఎందుకంటే, ప్రతిచోట పదాలు వేర్వేరుగా ఉన్నాయి. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయమేమిటంటే, ముగ్గురికీ సమానమైన పుణ్యమే లభిస్తుంది కాని మరొక ఉల్లేఖనంలో ఇలా వుంది; భర్తకు లభించే పుణ్యంలోని సగభాగం మాత్రమే భార్యకు లభిస్తుంది.

మంచిని తృణీకరించాడో, అతనికి మేము కఠినమార్గంలో నడిచేందుకు సౌకర్యాన్ని కలుగజేస్తాము. **(92 : 5-10)**

దైవదూతలు ఇలా ప్రార్థించారు; 'ఓ అల్లాహ్! ఖర్చు చేసేవానికి దానికి ప్రతిఫలం ఇవ్వు.'

**522.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; ఉదయంపూట ఇద్దరు దైవదూతలు ఆకాశంనుంచి భువి పైకి అవతరించని రోజు ఏదీ దైవదాసుల మీద నుంచి గడిచిపోదు. ఆ దూతల్లోని ఒక దైవదూత ఇలా ప్రార్థిస్తాడు, 'ఓ అల్లాహ్! ఖర్చుపెట్టే వానికి దాని ప్రతిఫలాన్ని ప్రసాదించు'. మరొకదూత ఇలా ప్రార్థిస్తాడు, 'ఓ అల్లాహ్! పిసినారికి చెందిన సంపదను నాశనం చెయ్యి.'

## 27వ అధ్యాయం

### దానధర్మాలు చేసే మనిషి, లోభి అయిన మనిషి- ఈ ఉభయుల ఉపమానం

**523.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'ఒక లోభి, దానధర్మాలు చేసే ఒక మనిషి- ఈ ఉభయుల ఉపమానం రెండు ఇనుప చొక్కాలు ధరించిన ఇద్దరు వ్యక్తుల మాదిరిగా ఉంది. వారు ఆ ఇనుప చొక్కాలను రొమ్ముల నుంచి ప్రక్కటెముకల వరకు ధరించి వున్నారు. దానధర్మాలు చేసేవాడు ఏదైనా వస్తువును తాను దానం చెయ్యదలచుకున్నప్పుడు, ఆ చొక్కా వ్యాకోచిస్తుంది. లేక అది పొడుగవుతుంది, వెడల్పు అవుతుంది. ఆ విధంగా అది పెరిగి అతని మొత్తం శరీరాన్ని కప్పేస్తుంది. అదే చేతివ్రేళ్ళ వరకు కూడా వ్యాపిస్తుంది. ఇంకా అతను నడిచే టప్పుడు, నేలపై పడే అతని కాలివేళ్ళ జాడల్ని సైతం చెరిపి వేస్తుంది. లోభి తాను ఏదైనా వస్తువును దానం చెయ్యదలచినప్పుడు ఆ ఇనుప చొక్కా అతని శరీరానికి అతుక్కు పోతుంది. శరీరంలోని ప్రతి వలయం తన స్థానంలో కదలకుండా అంటుకుపోతుంది. అతను ఆ చొక్కాను విశాలమైనదిగా చెయ్యాలని కోరుకుంటాడు. కాని అది పెరగదు, తరగదు.

## 28వ అధ్యాయం

కష్టపడి, శ్రమించి సంపాదించిన సంపదలో నుంచి, వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన సంపదలో నుంచి దానధర్మాలు చెయ్యటం ఎంతో పుణ్యప్రదమైనది. దివ్య ఖుర్ఆన్‌లో బఖరా సూరాలో కరుణామయుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; 'విశ్వ

సించిన ఓ ప్రజలారా! మీరు సంపాదించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుంచి ఉత్పత్తి చేసిన దానిలోని మేలైన భాగాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టండి. ఆయన మార్గంలో ఇవ్వటానికి పనికిరాని వస్తువులను ఏరి తీసే ప్రయత్నం చెయ్యకండి. ఒకవేళ ఆ వస్తువులనే ఎవరన్నా మీకు ఇస్తే వాటిని తృణీకార భావంతో తప్ప మనసారా స్వీకరించరు కదా! అల్లాహ్‌కు ఏదీ ఏమాత్రం అవసరం లేదనీ ఆయన మహత్తరమైన గుణములు కలవాడనే మీరు తెలుసుకోండి.' **(2: 267, 268)**

## 29వ అధ్యాయం

**దానధర్మాలు చెయ్యటం ప్రతి ముస్లింపై వాజిబ్. ఎవని వద్దనైతే సంపద లేదో అతను మంచి మాటల్ని ఆచరించాలి. లేక మంచి మాటల్ని ఇతరులకు అంద జెయ్యాలి. ఇది కూడా దానధర్మాలు చెయ్యటమే.**

**524.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ మూసా అష్అరీ (రజి) ఉల్లేఖించారు; ప్రతి ముస్లిమ్ తప్పనిసరిగా దానధర్మాలు చెయ్యాలి. ప్రజలు ఇలా అడిగారు; 'ఓ దైవప్రవక్తా(స)! ఒకవేళ ఎవరివద్దనైనా సంపద ఏమీ లేకపోతే అప్పుడు అతను ఏమి చెయ్యాలి?' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'అతను తన చేతులతో కష్టపడి పనిచెయ్యాలి. స్వయంగానూ తినాలి, ప్రయోజనం పొందాలి, దానధర్మాలు కూడా చెయ్యాలి.' ప్రజలు ఇలా అడిగారు; 'ఒకవేళ ఇది కూడా సాధ్యపడకపోతేనో, అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'అగత్యపరులకు నిస్సహాయులకు సహాయం చెయ్యాలి'. అప్పుడు ప్రజలు ఇలా అడిగారు, 'ఓ దైవప్రవక్తా(స)! ఇది కూడా సాధ్యం కాకపోతేనో?' ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'అప్పుడు అతను మంచిని ఆచరించాలి. చెడ్డ విషయాలకు దూరంగా ఉండాలి. ఇదే అతని కోసం దానధర్మాలు చేసినట్లు అవుతుంది'.

## 30వ అధ్యాయం

**ఎంత ధనాన్ని జకాత్, సదఖాల కోసం ఖర్చుపెట్టడం ధర్మసమ్మతం? పూర్తిగా ఒక మేకను ఇవ్వటం.**

**525.** ఉమ్మె అతియా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; (ఆమె గారి పేరు నసీబా) ఆమె గారి వద్దకు ఒక మేక దానానికి చెందినది (సదఖాకు చెందినది) పంపబడింది. ఆమె(ర) గారు ఆ మేక మాంసంలో నుంచి కొంత మాంసాన్ని హజ్రత్ ఆయెషా (ర) గారి వద్దకు పంపారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్రత్

ఆయెషా (ర)ను 'నీ వద్ద తినటానికేమైనా ఉందా?' అని అడిగారు. నేను దైవప్రవక్త(స)గారికి ఇలా విన్నవించుకున్నాను. 'నా వద్ద ఏమీ లేదు. సదఖాకు చెందిన మేక మాంసంలో నుంచి నసీబా నా వద్దకు పంపిన మాంసం మాత్రమే ఉంది.' అప్పుడు ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; 'ఆ మాంసాన్నే తీసుకురా. ఇప్పుడు దాన్ని తినటం ధర్మ సమ్మతమైనదే.'

## 31వ అధ్యాయం

### వెండిపై జకాత్‌ను చెల్లించే విషయం గురించి.

**526.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఉల్లేఖించారు; 'ఐదుకంటే తక్కువ ఒంటెలు ఉన్నట్లయితే వాటిపై జకాత్‌లేదు. ఇంకా ఐదు ఊఖియాల వెండికంటే తక్కువ ఉన్నట్లయితే దానిపై జకాత్ లేదు. ఐదు వసఖ్‌లకంటే తక్కువ ఖర్జూరం గాని లేక ధాన్యం గాని లేక పండ్లు గాని ఉంటే వాటిపై జకాత్ లేదు.'

**527.** అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)పై విషయాలనే చెబుతూ వుండగా నేను విన్నాను. (అంటే **526**వ హదీసులో) ఉన్న విషయాలు.'

## 32వ అధ్యాయం

జకాత్ పద్దు కింద వెండి బంగారాలే కాకుండా ఇతర వస్తువులు, పరికరాలను తీసుకోవటం. మాజ్ బిన్ జబల్(రజిఅన్) యమన్ దేశ ప్రజలను ఉద్దేశించి ఇలా అన్నారని తావుస్ అన్నారు; 'జకాత్ క్రింద నాకు బార్లీ, జొన్నలకు బదులుగా ఏదైనా సామాను ఇవ్వండి. చారలు ఉన్న నల్లని దుప్పట్లుగానీ లేదా కట్టుకునే ఇతర బట్టలు గానీ ఇవ్వండి. ఇందులో మీకూ సౌలభ్యం ఉంది. మదీనాలోని దైవప్రవక్త(స) గారి అనుచరులకు కూడా సౌలభ్యం వుంది. ఉపయోగం ఉంది.' దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; ఖాలిద్ (ర) బిన్ వలీద్ అయితే తన సంపదలో నుంచి ఆయుధాలను, గుర్రాలు మొదలైన (జీవన సామగ్రి) వాటిని అల్లాహ్ మార్గంలో దానం చేశారు. దైవప్రవక్త(స) (పండుగ రోజున) స్త్రీలను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; 'మీరు కూడా ఏదైనా వస్తువును దానం చెయ్యండి. మీ ఆభరణాల్లోనుంచి అయినాసరే; కనుక ఆయన(స) గారు వస్తు సామగ్రినీ, పరికరాలనూ దానం చెయ్యటం

ధర్మసమ్మతమైనది కాదని చెప్పలేదు. తరువాత ఒక స్త్రీ ఎవరో తన చెవి రింగును దానం చేసింది. మరొక స్త్రీ ఎవరో తన కంఠహారాన్ని ఇచ్చేసింది. దైవ ప్రవక్త(స) గారు జకాత్ కోసం వెండి బంగారాల పరిమితి పెట్టలేదు.

**528.** హజ్రత్ అనస్(ర) ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) తనకు ఫర్జ్ జకాత్‌ను గురించి రాశారు. దానికి సంబంధించిన ఆజ్ఞను అల్లాహ్ తన ప్రవక్తకు ఇచ్చాడు. అందులో ఈ విషయం కూడా ఉంది; "ఎవరి విషయంలోనైతే ఒక సంవత్సరం వయస్సుగల ఒంటె జకాత్‌గా 'వాజిబ్' అయిందో అదిగనుక ఒకవేళ అతని వద్ద లేకపోతే అప్పుడు ఒకవేళ అతని వద్ద రెండు సంవత్సరాల వయస్సుగల ఒంటెగనక ఉన్నట్లయితే అప్పడు అదే తీసుకోబడుతుంది. జకాత్ వసూలు చేసే వ్యక్తికి ఇరవై దిరహమ్‌లను లేదా రెండు మేకలను అతనికి ఇవ్వవలసి వుంటుంది. ఒకవేళ సంవత్సరం వయస్సుగల ఒంటెను జకాత్‌గా ఇవ్వవలసి వస్తే, అది అతని వద్ద లేకపోయినట్లయితే మగ ఒంటె రెండు సంవత్సరాల వయస్సు గలది అతని వద్ద ఉంటే, అప్పుడు అదే తీసుకోబడుతుంది. నగదు పైకం ఇచ్చే అవసరం లేదు.

**529.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని నేను సాక్ష్యమిస్తున్నాను; ఆయన (స)గారు పండుగ నమాజ్‌ను ఖుత్బాకు ముందే చేయించారు. తరువాత ఆయన (స) గారు తాను చేసిన ఖుత్బా ప్రసంగం స్త్రీల దాకా (దూరంవల్ల) చేరలేదని అనుకున్నారు. కనుక ఆయన (స)గారు వారి వద్దకు వెళ్ళారు. అప్పుడు హజ్రత్ బిలాల్ (ర) దైవప్రవక్త (స) గారితో ఉన్నారు; ఆయన(ర) తన వద్ద ఉన్న వస్త్రాన్ని విస్తరింపజేశారు. దైవప్రవక్త (స) గారు స్త్రీలను ఉద్దేశించి హితోపదేశం చేశారు. మరియు దానం చెయ్యమని వారిని ఆజ్ఞాపించారు. అప్పుడు స్త్రీలు తమ ఆభరణాలను దానం చెయ్యసాగారు. ఉల్లేఖకుడైన అయ్యూబ్ తన చేత్తో తన చెవుల్నీ మరియు తన మెడను సూచించారు.

## 33వ అధ్యాయం

జకాత్ నిర్ణయించేటప్పుడు వేర్వేరుగా ఉన్న వ్యక్తిగత ఆస్తుల్ని కలపకూడదు. ఇంకా కలిసి ఉన్న ఉమ్మడి ఆస్తుల్ని వేర్వేరుగా విభజించకూడదు. సాలిమ్, ఇబ్నె ఉమర్ (రజిఅన్) నుంచి ఉల్లేఖించారు. ఆయన (ర) గారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నుంచి ఇలాంటి ఉల్లేఖనాన్నే విన్నారు.

**530.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు; హజ్రత్ అబూబకర్(ర) ఆయనకు ఫర్జ్ జకాత్‌ను గురించి వ్రాశారు. ఆ జకాత్‌ను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) (విధిగా) నిర్ణయించారు. అందులో ఈ విషయం కూడా వ్రాయబడి ఉంది. జకాత్‌ను చెల్లించవలసి వస్తుందనే భయం వల్ల వేర్వేరుగా ఉన్న (వ్యక్తి గతంగా ఉన్న) ఆస్తిని కలపకూడదు. ఇంకా కలిసి ఉన్న ఉమ్మడి ఆస్తిని వేర్వేరుగా విభజించకూడదు.

## 34వ అధ్యాయం

ఒకవేళ ఒక ఆస్తికి ఇద్దరు సమానమైన భాగస్వాములు ఉన్నట్లయితే, అప్పుడు ఆ ఆస్తి మొత్తం మీద జకాత్ చెల్లించవలసి ఉంటుంది. ప్రతి భాగస్వామి సమానమైన మొత్తాన్నే చెల్లించాలి. తావూస్ మరియు అతా ఇలా అన్నారు; 'ఇద్దరు సమానమైన భాగస్తులు గనక తమ తమ పశువులను గుర్తించినట్లయితే ఇంకా ఆ పశువులు వేర్వేరుగా ఉన్నట్లయితే, అప్పుడు వాటిని కలపకూడదు. సుఫ్యాన్ సౌరి ఇలా అన్నారు; 'ఉమ్మడి మేకలపై జకాత్ లేదు, ప్రతి భాగస్తుడికీ నలభయ్యేసి మేకలు ఉంటే తప్ప. (లేక అంతకంటే ఎక్కువ).'

**531.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ అబూబకర్ (రజిఅన్) నాకు (ఒక ఉత్తరం) వ్రాశారు. అందులో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) విధిగా చెల్లించవలసిన జకాత్‌ను గురించి చెప్పిన విషయాన్ని ఉదాహరించారు. 'ఒక ఆస్తికి ఇద్దరు సమానమైన భాగస్వాములు గనక ఉన్నట్లయితే వారు ఉభయులు కలిసి సమిష్టిగా ఉమ్మడి జకాత్‌ను చెల్లించాలి. అప్పుడు ఆ భాగస్వాములిద్దరూ తమ తమ జకాత్‌ను సమానంగా చెల్లించినట్లే భావించబడుతుంది.'

## 35వ అధ్యాయం

### ఒంటెలపై చెల్లించవలసిన జకాత్‌ను గురించి

ఈ అధ్యాయంలో హజ్రత్ అబూబకర్ (ర), హజ్రత్ అబూజర్ (ర), హజ్రత్ అబూ హురైరా (ర) గార్లు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి నుంచి ఉల్లేఖించారు.

**532.** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఒక పల్లెటూరు మనిషి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని హిజ్రత్ (వలస పోవటం)ను గురించి అడిగాడు. (అంటే ఓ ప్రవక్తా (స)! మీరు గనక సెలవిస్తే నేను హిజ్రత్ చేసి మదీనాకు వస్తాను). దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'అల్లాహ్

నీపై కరుణ జూపుగాక! హి్జ్రత్ చాలా కష్టంతో కూడుకున్న పని. నీ వద్ద ఒంటె లేమైనా ఉన్నాయా? వాటిపై నీవు జకాత్ చెల్లిస్తున్నావా?' ఆ పల్లెటూరి మనిషి ఇలా అన్నాడు; అవును 'ఓ ప్రవక్తా (స)! నేను జకాత్ చెల్లిస్తాను. నా దగ్గర ఒంటెలు ఉన్నయ్.' అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; అయితే సముద్రానికి ఆ ప్రక్కన (అంటే ఏ దేశంలోనైతే నీవు ఉంటున్నావో ఆ దేశంలోనే) పనులు చేస్తూ ఉండు. నీవు చేసే ఏ పనికీ అల్లాహ్ పుణ్యాన్ని తగ్గించడు.'

## 36వ అధ్యాయం

**ఎవని వద్దనైనా ఒక సంవత్సరం వయస్సుగల ఆడ ఒంటెను జకాత్‌గా ఇచ్చేటన్ని ఒంటెలు గనుక ఉన్నట్లయితే, ఒకవేళ అతని వద్ద ఆ ఆడ ఒంటె లేనట్లయితే, అప్పుడు ఏమి చెయ్యాలి? అనే విషయం గురించి.**

**533.** హ్జ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; హ్జ్రత్ అబూబకర్ (రజిఅన్) ఆయన(ర) గారికి ఒక ఉత్తరం రాశారు. అందులో ఆయన(ర) విధిగా చెల్లించవలసిన (ఫర్జ్) జకాత్‌ను గురించి ప్రస్తావించారు. ఆ జకాత్‌ను గురించి అల్లాహ్ తన ప్రవక్త(స)కు ఆజ్ఞాపించాడు; 'అంటే, ఎవని వద్దనైనా జకాత్‌గా ఇచ్చేటన్ని ఒంటెలు ఉంటే, ఇంకా నాలుగు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె అతనివద్ద గనుక లేకపోయినట్లయితే, కాని అతని వద్ద గనుక మూడు సంవత్సరాల ఆడ ఒంటె గనుక ఉన్నట్లయితే అప్పుడు ఆ ఒంటెను జకాత్‌గా తీసుకోవాలి. ఇంకా దానితోపాటు అతని వద్ద గనుక మేకలు ఉన్నట్లయితే అప్పుడు రెండు మేకలను తీసుకోవాలి. లేదా ఇరవై దిర్హమ్‌లు తీసుకోవాలి. ఎవని వద్దనైనా మూడు సంవత్సరాల ఆడ ఒంటెను, జకాత్ ఇచ్చేటన్ని ఒంటెలు ఉన్నట్లయితే, ఒకవేళ అతనివద్ద మూడు సంవత్సరాల ఆడ ఒంటె గనుక లేకపోయినట్లయితే, మరియు నాలుగు సంవత్సరాల వయస్సుగల ఆడ ఒంటెగనుక ఉన్నట్లయితే అప్పుడు దాన్నే తీసుకోవాలి. మరియు జకాత్‌ను వసూలు చేసే తహసీల్దార్‌కు అతను ఇరవై దిర్హమ్‌లు లేదా రెండు మేకలు ఇవ్వాలి. ఎవని వద్దనైనా మూడు సంవత్సరాల వయస్సుగల ఆడ ఒంటెను, జకాత్‌గా ఇచ్చేటన్ని ఒంటెలు గనుక ఉన్నట్లయితే, ఒకవేళ అది గనుక అతని వద్ద లేకపోయినట్లయితే, అతని వద్ద రెండు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె గనుక ఉన్నట్లయితే దాన్నే తీసుకోవాలి. ఇంకా అతను ఇరవై దిర్హమ్‌లు గాని లేదా రెండు మేకలు గాని తహసీల్దార్‌కు ఇవ్వాలి. ఇంకా ఎవని వద్దనైనా రెండు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటెను జకాత్‌గా ఇచ్చేటన్ని ఒంటెలు గనుక

ఉన్నట్లయితే, కాని అది గనుక అతని వద్ద లేకపోయినట్లయితే అతని వద్ద ఒక సంవత్సరం వయస్సుగల ఆడ ఒంటె ఉన్నట్లయితే, దాన్నే తీసుకోవాలి. మరియు దానితోపాటు తహసీల్దార్‌కు ఇరవై దిర్హమ్‌లుగానీ లేదా రెండు మేకలుగాని ఇవ్వాలి.'

## 37వ అధ్యాయం

## మేకలపై జకాత్ చెల్లించే విషయం.

**534.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'జకాత్ వసూళ్ళ కోసం హజ్రత్ అబూబకర్ సిద్దిఖ్(రజి) నన్ను బహ్రైన్‌కు గవర్నరుగా నియమించి పంపే సమయంలో ఆయన(ర) ఈ క్రిందివిధంగా ఒక అధికార పత్రాన్ని వ్రాసి నాకు పంపారు.'

'అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను, ఆయన అనంత కరుణామయుడు; అపార కృపాశీలుడు. ఈ జకాత్‌ను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ముస్లిములపై విధించారు. దీనికి సంబంధించిన ఆజ్ఞను అల్లాహ్ తన ప్రవక్తకు జారీ చేశాడు. ఈ అధికార పత్రం ప్రకారం ఒక ముస్లిమ్‌ను జకాత్ ఇవ్వమని అడిగినప్పుడు, అతను ఆ జకాత్‌ను విధిగా చెల్లించాలి. ఒకవేళ ఎవరైనా దానికంటే ఎక్కువ జకాత్‌ను అడిగినట్లయితే అప్పుడు అతను దానిని ఇవ్వకుండా తిరస్కరించాలి. ఇరవై నాలుగు ఒంటెలు గాని లేక వాటికంటే తక్కువ ఒంటెలుగాని ఉన్నట్లయితే, అప్పుడు ప్రతి ఐదు ఒంటెలకు ఒక మేక చొప్పున జకాత్ ఇవ్వాలి. (ఐదు కంటే తక్కువ ఒంటెలు ఉంటే అప్పుడు జకాత్ ఇవ్వవలసిన అవసరం లేదు) ఒంటెల సంఖ్య ఇరవై ఐదు వరకు పెరిగినట్లయితే ముప్పై ఐదు ఒంటెల వరకు, ఒక సంవత్సరం వయస్సు గల ఆడ ఒంటెను వాటిలోనుంచి జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య ముప్పై ఆరు వరకు పెరిగితే, నలభై ఐదు ఒంటెల వరకు వాటిలో నుంచి రెండు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటెను జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య నలభై ఆరుకు పెరిగినట్లయితే, అరవై ఒంటెల వరకు మూడు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటెను వాటిలోనుంచి సంయోగానికి తగిన దానిని జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య అరవై ఒకటికి పెరిగి నట్లయితే, డెబ్బై ఐదు ఒంటెల వరకు వాటిలోనుంచి నాలుగు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటెను జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య డెబ్బై ఆరుకు చేరినట్లయితే, తొంభై ఒంటెల వరకు వాటిలోనుండి రెండేసి సంవత్సరాలుగల రెండు ఆడ ఒంటెలను

జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య గనుక తొంభై ఒకటి నుంచి నూట ఇరవై వరకు పెరిగినట్లయితే అప్పుడు వాటిలో నుంచి మూడేసి సంవత్సరాల వయస్సు గల రెండు ఒంటెలను సంయోగానికి తగినవి జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య గనుక నూట ఇరవై కంటే ఎక్కువ అయినట్లయితే, అప్పుడు ప్రతి నలభై ఒంటెలకు రెండు సంవత్స రాల వయస్సు గల ఒక ఆడ ఒంటెనూ, ప్రతి యాభై ఒంటెలకు మూడు సంవత్సరాల వయస్సు గల ఒక ఆడ ఒంటెను జకాత్‌గా ఇవ్వాలి. ఎవని వద్దనైనా కేవలం నాలుగు ఒంటెలు మాత్రమే ఉన్నట్లయితే (లేక నాలుగు ఒంటెల కంటే తక్కువ కూడా ఉంటే) అప్పుడు వాటిపై జకాత్ చెల్లించే అవసరం లేదు. కాని యజమాని గనుక సంతోషంతో ఏదైనా ఇస్తే అది వేరే విషయం. ఒంటెల సంఖ్య ఐదుకు ఎదిగినట్లయితే అప్పుడు ఒక మేకను జకాత్‌గా ఇవ్వాలి. అడవిలో (పొలాలలో) మేత మేసే మేకలు నలభై ఉన్నట్లయితే అప్పుడు ఇరవై మేకల వరకు ఒక మేకను జకాత్‌గా ఇవ్వవలసి వుంటుంది. మేకల సంఖ్య గనుక నూట ఇరవైకంటే ఎక్కువ అయిపోతే అప్పుడు రెండు వందల మేకల వరకు రెండు మేకలను జకాత్‌గా ఇవ్వాలి. మేకల సంఖ్య గనుక రెండు వందల కంటే ఎక్కువగా ఉంటే, అప్పుడు మూడు వందల వరకు మూడు మేకలను జకాత్‌గా ఇవ్వాలి. మేకల సంఖ్య మూడు వందల నుంచి ఎక్కువ అయితే అప్పుడు ప్రతి వంద మేకలకు ఒక మేక చొప్పున జకాత్‌గా ఇవ్వాలి. ఏ వ్యక్తి వద్దనైనా మేత మేసే మేకలు నలభైకంటే తక్కువగా ఉన్నట్లయితే అప్పుడు వాటిపై జకాత్ ఇవ్వవలసిన అవసరం లేదు. కాని యజమాని గనుక ఇష్టపడి సంతోషంతో ఏదైనా ఇవ్వదలిస్తే ఇవ్వవచ్చు. వెండిపై నలభయ్యో భాగం జకాత్‌గా ఇవ్వాలి (రెండు వందల దిర్హమ్‌లు గాని లేదా దానికంటే ఎక్కువ వెండి గాని ఉన్నట్లయితే) ఒకవేళ నూట తొంభై దిర్హమ్‌లకు సమాన మైన వెండి ఉంటే అప్పుడు జకాత్ ఇవ్వవలసిన అవసరం లేదు. కాని దాని యజమాని సంతో షంగా ఏదైనా ఇవ్వ దలిస్తే అది వేరే విషయం."

## 38వ అధ్యాయం

**ముసలిదీ లేదా లోపభూయిష్టమైనదీ లేదా మగదీ అయిన పశువును జకాత్‌గా తీసుకోకూడదు. కాని తహసీల్‌దారు దానిని తీసుకోవడం సముచితమే అని భావిస్తే అప్పుడు తీసుకోవచ్చు, అది వేరే విషయం.**

**535.** హజ్రత్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; అల్లాహ్ తన ప్రవక్త(స)కు

ఆజ్ఞాపించిన జకాత్‌ను గురించి హ॥జత్ అబూబకర్ (రజిఅన్) ఆయనకు (హ॥జత్ అనస్(ర)కు) ఒక ఉత్తరం వ్రాశారు, అదేమిటంటే, 'ముసలి పశువును, లోపభూయిష్ట మైన పశువును, మగ పశువును జకాత్‌గా తీసుకోరాదు. కాని తహసీల్దార్ అలా తీసు కోవటం సముచితమని భావిస్తే ఆ పశువును జకాత్‌గా తీసుకోవచ్చు.'

## 39వ అధ్యాయం

## మేకపిల్లను జకాత్‌గా తీసుకోవడం.

**536.** హ॥జత్ అబూబకర్ సిద్దీఖ్(రజిఅన్) ఇలా అన్నారని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; 'దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. ఒకవేళ వారు గనుక దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి జకాత్‌గా ఇస్తూ ఉన్న మేకపిల్లను నాకు కూడా ఇవ్వకపోతే అప్పుడు నేను (దానిని ఇవ్వకపోవడం వల్ల) వారితో జిహాద్ చేస్తాను.' హ॥జత్ ఉమర్(రజిఅన్) ఇలా అన్నారు; 'ఏమీలేదు, విషయమేమిటంటే, అల్లాహ్ అబూబకర్(ర)గారి హృదయాన్ని తెరిచేశాడు, పోరాటం చేసేందుకు. ఇదే సత్యమని నేను కూడా అర్థం చేసుకున్నాను.'

## 40వ అధ్యాయం

## ప్రజలకు చెందిన ఆస్తిలోనుంచి జకాత్‌గా నాణ్యమైన వస్తువులను తీసుకోరాదు.

**537.** హ॥జత్ అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మాజ్ బిన్ జబల్‌ను యమన్ దేశానికి గవర్నరుగా నియమించి పంపి నప్పుడు, ఆయనతో ఇలా అన్నారు, 'ఓ మాజ్! నీవు గ్రంథ ప్రజల (యూదులు, క్రైస్తవులు) వద్దకు చేరినప్పుడు అన్నింటికంటే ముందు వారిని అల్లాహ్ ఆరాధన వైపునకు ఆహ్వానించు (ఆయన తౌహీద్ వైపునకు). వారు అల్లాహ్‌ను గుర్తించినప్పుడు వారితో నీవు ఇలా అను, వారిపై అల్లాహ్ రోజుకు (రేయింబవళ్ళు) ఐదు నమాజు లను విధించాడని, వారు నమాజులు చెయ్యటం ప్రారంభించినప్పుడు. వారికి ఇలా చెప్పు, వారిపై అల్లాహ్ జకాత్ విధించాడని, వారిలోని ఆస్తిపరుల నుండి దానిని వసూలు చేయాలని, వారిలోని నిరుపేద ప్రజలకు దానిని పంచిపెట్టాలని. వారు దానికి కూడా అంగీకరించినప్పుడు వారినుంచి జకాత్ వసూలు చెయ్యి. వారి ఆస్తులలోని నాణ్యమైన ఆస్తులను, ఉత్తమ ఆస్తులను జకాత్‌గా తీసుకోవద్దు.'

## 41వ అధ్యాయం

### ఐదు ఒంటెలకు తక్కువగా ఉంటే జకాత్ లేదు.

**538.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఉల్లేఖించారు; 'ఖర్జూరపు పండ్లు 'ఐదు' వసఖ్‌లకు తక్కువగా ఉన్నప్పుడు వాటిపై జకాత్ లేదు. ఇంకా వెండిగనుక 'ఐదు ఊఖియాలకు'లకు తక్కువగా ఉంటే అప్పుడు దానిపై జకాత్ లేదు. ఒంటెలు ఐదుకు తక్కువగా ఉన్నప్పుడు వాటిపై జకాత్ లేదు.'

## 42వ అధ్యాయం

### ఆవు, ఎద్దులపై జకాత్ చెల్లించే విషయం గురించి.

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ హుమైద్ సాయిదీ ఉల్లేఖించారు; 'నిశ్చయంగా ప్రళయదినం నాడు అల్లాహ్ వద్దకు తన చేతుల్లో ఒక ఆవును ఎత్తుకుని హాజరయ్యే ఒక మనిషిని నేను మీకు చూపిస్తాను, ఆ అవు అరుస్తూ వుంటుంది.'

**539.** అబూజర్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు, ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వెళ్ళాను. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; 'ఎవని చేతుల్లోనైతే నా ప్రాణాలు ఉన్నాయో ఆయనపై ప్రమాణం చేసి చెబుతున్నాను. లేదా ఎవడైతే దాస్యానికి తగినవాడో ఆయనపై ప్రమాణం చేసి చెబుతున్నాను. లేదా ఇలాంటి ప్రమాణాన్నే చేసి ఆయన(స) ఇలా అన్నారు; ఎవని వద్దనైతే ఒంటెలూ, ఆవులూ, ఎద్దులూ, మేకలు ఉన్నాయో అతను గనక వాటిపై జకాత్ ఇవ్వకపోతే అప్పుడు ప్రళయదినం నాడు ఆ జంతువుల్ని బాగా లావు అయిన విగా, చాలా పెద్దవిగా చేసి తీసుకురావటం జరుగుతుంది. అవి తమ యజమానిని కాళ్ళతో తంతాయి. కొమ్ములతో పొడుస్తాయి. మందలోని జంతువులన్నీ అతని మీదుగా తన్నుకుంటూ, పొడుచుకుంటూ వెళ్ళిపోయినప్పుడు, మళ్ళీ మొదట్లో తన కాళ్ళతో తన్నిన జంతువు తిరిగివస్తుంది. ఇదేవిధంగా యథావిధిగా జంతువులన్నీ తమ హింసా కార్యాన్ని నిర్వహిస్తాయి. మొత్తం మానవులను గురించి తీర్పు చెప్పేవరకు ఇది జరుగుతుంది.' ఈ హదీసును జుబైర్ బిన్ అబ్దుల్లా అబూసాలెహ్ నుంచి, ఆయన అబూ హురైరా (ర) నుంచి, అబూ హురైరా (రజి) మహాప్రవక్త(ర) గారి నుంచి ఉల్లేఖించారు.

## 43వ అధ్యాయం

**బంధువులకు జకాత్ ఇవ్వటం, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; 'బంధువులకు జకాత్ ఇచ్చే వ్యక్తికి రెట్టింపు పుణ్యం లభిస్తుంది. బంధువుల హక్కులు నెరవేర్చినందుకు ఒక పుణ్యం, జకాత్ చెల్లించినందుకు మరొక పుణ్యం.'**

**540.** మాకు అబ్దుల్లా బిన్ యూసుఫ్ తెలియజేశారు. ఆయన ఇలా అన్నారు; మాకు ఇమామ్ మాలిక్ (రహ్మాలై) తెలిపారు; ఆయన ఇస్హాక్ బిన్ అబ్దుల్లా బిన్ అబీ తల్హా నుంచి, ఆయన అనస్(ర) బిన్ మాలిక్ నుంచి విన్నారు; ఆయన ఇలా అనేవారు; "అబూ తల్హా(ర) మదీనా పట్టణంలోని అన్సారులందరిలోకంటే ఎక్కువ సంపద కలవారు. ఆయనకు తోటలు చాలా ఉన్నాయి. తోటలన్నింటిలోకెల్లా ఆయనకు బైరుహా తోట అత్యంత ప్రియమైనది. అది మసీదుకు ముందు భాగంలో ఉన్నది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఆ తోటలోకి అప్పుడప్పుడూ వెళుతూ ఉండే వారు. ఆ తోటలోని స్వచ్ఛమైన నీరును తాగుతూ ఉండేవారు. అనస్ (ర) ఇలా అన్నారు; ఖుర్ఆన్‌లోని ఆలిఇమ్రాన్ సూరాలోని ఈ వాక్యం అవతరించినప్పుడు 'మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంతవరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు.' (3: 92) అప్పుడు అబూ తల్హా(ర) లేచి నిలబడి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి వద్దకు వెళ్ళారు. ఆయన(స)తో ఇలా విన్నవించుకున్నారు. 'ఓ దైవప్రవక్తా (స)! మహోన్నతుడైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు; మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంతవరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. నాకున్న అన్ని సంపదల్లోకెల్లా బైరుహా తోట అత్యంత ప్రియమైనది. దాన్నే నేను అల్లాహ్ మార్గంలో దానం చేస్తాను. అల్లాహ్ నాకు దానికి పుణ్యాన్ని ప్రసాదిస్తాడు అని నేను ఆశిస్తున్నాను. అదే నా సంపదగా ఉంటుంది. ఓ దైవప్రవక్తా(స)! మీకు ఇష్టమైన ఏ ధర్మకార్యంలోనైనా మీరు దానిపై వచ్చే ఆదాయాన్ని ఖర్చుపెట్టండి.' ఈ విషయాన్ని విన్న దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; వహ్వా! శభాష్!! ఈ సంపదైతే చాలా ఆదాయాన్ని తెచ్చిపెట్టే సంపదే. నీవు చెప్పినదాన్ని నేను శ్రద్ధగా విన్నాను. కాని నీవు ఆ తోటను నీ బంధువులందరికీ పంచిపెట్టు. ఇది సమంజసమైన విషయమని నేను అనుకుంటున్నాను. అప్పుడు అబూ తల్హా ఇలా అన్నారు; 'చాలామంచి విషయం చెప్పారు. నేను మీరు చెప్పినట్లుగానే చేస్తూ ఉంటాను. 'ఆ తరువాత అబూ తల్హా (ర) ఆ తోటను తన బంధువులందరికీ, దాయాదులకు పంచిపెట్టారు.'

**541.** అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈదుల్ అజ్‌హా నాడు లేదా ఈదుల్ ఫితర్ నాడు, ఈద్గాహ్‌కు వెళ్ళారు. నమాజు చేసి తిరిగి వచ్చిప్రజలను ఉద్దేశించి ప్రసంగం చేశారు. దానధర్మాలు చెయ్యమని ప్రజల్ని ఆదేశించారు. ఆయన(స) ఇంకా ఇలా సెలవిచ్చారు; 'జనులారా! దానధర్మాలు చెయ్యండి' అని వారిని ఆజ్ఞాపించారు తరువాత స్త్రీలు సమావేశమై ఉన్న స్థలం వైపునకు వెళ్ళి వారినిఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; 'ఓ మహిళలారా! మీరు కూడా దానధర్మాలు చెయ్యండి.ఎందుకంటే, నరకంలో స్త్రీలేఎక్కువ సంఖ్యలో ఉన్న విషయాన్ని నేను గమనించాను.' అప్పుడు స్త్రీలు ఇలా విన్నవించుకున్నారు- 'ఓ దైవప్రవక్తా(స)! దీనికి కారణం ఏమిటి? సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'మీరు తరచూ శాపనార్థాలు పెడుతూ ఉంటారు. మీ భర్తలకు కృతఘ్నత చూపుతారు. ఇది మీ సంప్రదాయం. ఓ మహిళలారా! మీకంటే ఎక్కువ తెలివి తక్కువ వారిని గానీ, తక్కువ ధర్మజ్ఞానం కలవారిని గానీ నేను ఎక్కడా చూడలేదు. ఓ మహిళ లారా! మీలో కొందరు, వివేకవంతుడైన పురుషుణ్ణి మార్గభ్రష్టుడుగా కూడా చెయ్యగలరు.' ఆ తరువాత దైవప్రవక్త(స) అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. ఇంటికి చేరిన తరువాత అబ్దుల్లా బిన్ మసూద్(ర) గారి భార్య అయిన జైనబ్ అక్కడకు వచ్చారు. ఆమె గారు ఇంట్లోకి ప్రవేశించే అనుమతిని దైవప్రవక్త(స) నుంచి కోరారు. అప్పుడు ఎవరో ఇలా అన్నారు; 'ఓ దైవప్రవక్తా(స)! ఇక్కడ జైనబ్ ఉన్నారు. ఆమె ద్వారం దగ్గర నిలబడి ఉన్నారు.

అప్పుడు దైవప్రవక్త(స) గారు 'ఏ జైనబ్?' అని అడిగారు. ఆ మనిషే ఇలా అన్నారు, ఆమె అబ్దుల్లా బిన్ మసూద్(ర) గారి భార్య జైనబ్. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, 'మంచిది. ఆమెను ఇంట్లోకి రానివ్వండి.' అనుమతి లభించిన తరువాత జైనబ్ ఇంట్లోకి ప్రవేశించి ఇలా అనసాగారు; 'ఓ దైవప్రవక్తా(స)! మీరు ఈ రోజున (పండుగ రోజు) దానధర్మాలు చెయ్యమని మమ్మల్ని ఆజ్ఞాపించారు. నా దగ్గర కొన్ని బంగారపు ఆభరణాలు ఉన్నాయి. నేను వాటిని దానం చెయ్యదలుచుకున్నాను. కాని నా భర్త ఇబ్నె మసూద్(ర) ఇలా అంటున్నారు. 'ఆయన(ర), ఆయన(ర) గారి కుమారుడు ఉభయులూ నీవు దానం చెయ్యదలుచుకున్న వారందరికంటే కూడా దానికి ఎక్కువ అర్హులు.' అప్పుడు దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు, 'ఇబ్నె మసూద్(ర) నిజమే పలికారు. నీ భర్త, నీ కుమారుడు ఉభయులూ నీవు దానం చెయ్యదలుచుకున్న జనులందరికంటే ఎక్కువ హక్కుదారులు.'

## 44వ అధ్యాయం

### ఒక ముస్లిమ్ తన గుర్రానికి జకాత్ ఇచ్చే అవసరంలేదు.

**542.** హ(జత్ అబూ హురైరా(ర) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; 'ముస్లిమ్ అయిన ఒక వ్యక్తి తన గుర్రంపైన గాని, తన బానిసకు గానీ జకాత్ ఇచ్చే అవసరం లేదు.'

## 45వ అధ్యాయం

### ఒక ముస్లిమ్‌కు తన బానిసపై జకాత్ ఇచ్చే అవసరం లేదు.

**543.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు, 'ఒక ముస్లిమ్ తనకు చెందిన బానిసపైగాని లేదా ఒక గుర్రం పైగాని జకాత్ ఇచ్చే అవసరం లేదు.'

## 46వ అధ్యాయం

### అనాథలకు దానధర్మాలు చెయ్యటం ఎంతో పుణ్యం.

**544.** అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకరోజున దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మింబర్‌పై కూర్చుని ఉన్నారు. ఆయన(స)గారి ప్రసంగాన్ని వినే ఉద్దేశ్యంతో మేము కూడా ఆయన(స)కు చుట్టూ కూర్చొని ఉన్నాం. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'చూడండి! నా తరువాత నన్ను మీ విషయంలో భయానికి గురిచేసే విషయమేమిటంటే, ఇహలోకపు సౌఖ్యాలు, వైభవాలు, ఆకర్షణలు నలువైపుల నుంచి మీపై వ్యాపిస్తాయి.' ఆ సభలోని ఒక వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు; 'ఓ దైవ ప్రవక్తా(స)! ఏమిటి, మంచి వస్తువు ద్వారా కీడు కూడా ఉద్భవిస్తుందా?' ఈ విషయాన్ని విని దైవప్రవక్త(స) మౌనంగా ఉండిపోయారు. సభికులు అతనితో ఇలా అన్నారు; 'నీకేమైంది? నీవు దైవప్రవక్త(స) గారితో ఇలా మాట్లాడుతున్నావు. ఎక్కువగా మాట్లాడుతున్నావు; దైవప్రవక్త(స)గారు నీతో మాట్లాడటం లేదు కదా!' తరువాత మేము నిశితంగా గమనిస్తే దైవ ప్రవక్త(స)పై దైవవాణి అవతరిస్తోంది. అప్పుడు ఆయన(స) గారు తన పవిత్ర ముఖారవిందానికి పట్టిన చెమటను తుడుచుకున్నారు. 'ప్రశ్న అడిగిన వ్యక్తి ఎక్కడున్నాడు?' అని అడిగారు.

దైవప్రవక్త(స) అడిగిన ఈ తీరు అతను ఆవిధంగా ప్రశ్న అడగటం బాగా

ఉందని తెలియజేస్తోంది. ఆ తరువాత దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, 'నిస్సందేహంగా ఈ మాట అయితే 'మంచి వస్తువు చెడ్డ వస్తువు కానే కాదు' కాని సందర్భ శుద్ధి లేకుండా దానిని ఉపయోగించటం వల్ల చెడు ఉద్భవిస్తుంది.' చూడండి! వసంత రుతువు ప్రారంభంలో ఏ గడ్డి అయితే మొలుస్తుందో లేక పెరుగుతుందో, అది ఒకప్పుడు పశువును చంపుతుంది. లేదా వాటిని చావుకు దగ్గరగా తీసుకుపోతుంది. కాని ఏ పశువైతే పచ్చపచ్చని గడ్డిమేస్తుందో అప్పుడు, దానికి ఇరువైపులా ఉన్న కడుపు బిగుసుకుపోయినప్పుడు అది సూర్యునివైపు ముఖాన్ని పెట్టి ఆ తరువాత పలుచని మలాన్ని విసర్జిస్తే, మూత్రం పోస్తే, మేత మేస్తూ ఉంటే అది చావదు. ఈ ప్రాపంచిక సంపద పైకి పచ్చనిది గాను, తియ్యనిదిగానూ కనిపిస్తుంది. ధనవంతుడైన ముస్లిమ్ తన వద్ద ఉన్న సంపదలోనుంచి నిరుపేదలకూ, అనాథలకూ, బాటసారులకు దాన ధర్మాలు చేస్తూ ఉన్నంతవరకు అతను మంచి ముస్లిమ్‌గానే ఉంటాడు. లేక దైవ ప్రవక్త(స)గారు సెలవిచ్చినట్లు, 'చూడండి! ఎవడైతే అధర్మమైన, నిషిద్ధమైన మార్గాల ద్వారా ధనాన్ని సంపాదిస్తాడో అతని ఉపమానం ఆ మనిషి మాదిరిగా ఉంది– అతను తింటాడు కాని అతని కడుపు నిండదు. ఆ ధనం, ఆ సంపద ప్రళయదినం నాడు అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతుంది.'

## 47వ అధ్యాయం

**భర్తకూ మరియు అతను పోషించే అనాథలకు జకాత్ ఇవ్వటం. ఈ విషయాన్ని దైవప్రవక్త(స) గారు చెప్పారని అబూ సయీద్ ఖుద్రి (రజిఅన్) ఉల్లేఖించారు.**

**545.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) గారి భార్య జైనబ్(ర) ఇలా అన్నారని అమ్ర్ బిన్ అల్ హారిస్ ఉల్లేఖించారు; అప్పుడు నేను మస్జిదె నబవీలో ఉన్నాను; నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారిని చూశాను; ఆయన(స)ఇలా సెలవిచ్చారు; 'మీరు దానధర్మాలు చెయ్యండి. మీరు ధరించిన బంగారు ఆభరణాలలో నుంచి అయినా సరే.' జైనబ్ (ర), తన భర్త అయిన అబ్దుల్లా బిన్ మసూద్(ర)కు తన సంరక్షణలో ఉన్న కొందరు అనాథలకూ వారి ఖర్చుల నిమిత్తం ధనం ఇస్తూ ఉండేవారు. ఆమె(ర) తన భర్తతో ఇలా అన్నారు; 'మీరు దైవప్రవక్త(స) గారి వద్దకు వెళ్ళి ఇలా అడగండి; నేను దానధర్మాలు చేసే ధనాన్ని నా భర్తకూ, నా సంరక్షణలో ఉన్న అనాథలకూ ఒకవేళ ఇచ్చినట్లయితే అది ధర్మసమ్మతం అవుతుందా?' ఆయన(ర) గారు ఇలా అన్నారు; నీవే స్వయంగా ఆయన(స) గారి వద్దకు వెళ్ళి ఈ విషయాన్ని

గురించి అడుగు. చివరకు జైనబ్(ర) దైవప్రవక్త(స) గారి వద్దకు వెళ్ళారు. అక్కడ ఒక అన్సారీ మహిళ (జైనబ్(ర) అబూ మసూద్ అన్సారీ(ర) గారి భార్య) ఆమె(ర) గారికి తటస్థపడింది. ఆమె ఇంటి ద్వారం వద్ద నిరీక్షిస్తూ కనిపించింది. నేను దైవ ప్రవక్త(స)ను ఏ విషయం గురించి అడగదలచి వచ్చానో ఆమె కూడా ఆ విషయాన్ని గురించే దైవ ప్రవక్త(స)ను అడగటానికి వచ్చారు. ఇంతలోనే హ్రజత్ బిలాల్(ర) మా ముందు నుంచి వెళుతూ కనిపించారు. మేము ఆయన(ర)గారితో ఇలా అన్నాము. 'మీరు దైవప్రవక్త(స) గారిని ఒక విషయం గురించి అడగండి. అదేమిటంటే, నేను, నా భర్తకూ, నా సంరక్షణలో ఉన్న కొంతమంది అనాధలకూ దానధర్మాలు ఇచ్చి నట్లయితే అది ధర్మసమ్మతమే అవుతుందా? మేము హ్రజత్ బిలాల్ (ర)తో దైవ ప్రవక్త(స) గారికి మా పేర్లు చెప్పవద్దని చెప్పాము. హ్రజత్ బిలాల్(ర) దైవప్రవక్త(స) గారితో ఇలా విన్నవించుకున్నారు; ఇద్దరు మహిళలు ఈ సమస్యను గురించి ప్రశ్ని స్తున్నారు. ఆ మహిళలు ఎవరు? అనిదైవప్రవక్త(స) అడిగారు. వారు జైనబ్ పేరు గల స్త్రీలు అని బిలాల్(ర) దైవప్రవక్త(స)కు చెప్పారు. ఆమె ఏ జైనబ్? అని ప్రవక్త(స) మరొక ప్రశ్న వేశారు. హ్రజత్ బిలాల్(ర) ఇలా అన్నారు; 'ఆ స్త్రీ అబ్దుల్లా బిన్ మసూద్(ర) గారి భార్య.' అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'నిస్సందేహంగా అది ధర్మసమ్మతమే అవుతుంది. ఆమెకు రెట్టింపు పుణ్యం లభిస్తుంది. ఒకటి బంధువులకు సహాయం చేసినందుకు, రెండు దాన ధర్మాలు చేసినందుకు.'

**546.** ఉమ్మె సలమా (రజిఅన్హా) గారి కూతురు జైనబ్(ర) ఇలా ఉల్లేఖించారు; నా తల్లిగారు దైవప్రవక్త(స)గారిని ఇలా అడిగారు; 'ఓ దైవప్రవక్తా(స)! నేను గనక నా పూర్వపు భర్త సంతానం పోషణ నిమిత్తం ధన సహాయం చేస్తే అది ధర్మసమ్మతమేనా? వారు కూడా నా సంతానమే కదా!' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'ఎందుకు కాదు, వారిపై ఖర్చుపెట్టటం పూర్తిగా ధర్మ సమ్మతమైన విషయమే. వారి సంరక్షణ నిమిత్తం ఖర్చుపెట్టు. నీవు ఖర్చుపెట్టే దానికి నీకు పుణ్యం లభిస్తుంది.'

## 48వ అధ్యాయం

దివ్యఖుర్ఆన్‌లోని బరాత్ సూరాలో కరుణామయుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; 'దానధర్మాలు చేసే సంపదను బానిసల విముక్తి కోసం, అప్పుల బాధల్లో ఉన్నవారిని ఆదుకోవటం కోసం, అల్లాహ్ మార్గంలోనూ ఖర్చుపెట్టవచ్చు అనే విషయం గురించి..' హ్రజత్ ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారని చెప్పబడింది. 'ఒక మనిషి తన

సంపదపై వచ్చే జకాత్‌ను బానిసలకు విముక్తి కలుగజెయ్యటం కోసం ఖర్చుపెట్టవచ్చు, హజ్ కోసం వెళ్ళేవారికి కూడా ఆ జకాత్‌ను ఇవ్వవచ్చు' ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా అన్నారు; 'జకాత్ ధనంలో నుంచి (బానిస అయిన) తన తండ్రిని కొనేసి స్వతంత్రుడుగా చేస్తే అది ధర్మసమ్మతమైన విషయమే; జకాత్ ధనాన్ని ముజాహిద్‌ల కోసం ఖర్చుపెట్టవచ్చు. హజ్ చెయ్యని మనిషికి హజ్ చెయ్యటం కోసం జకాత్ ధనాన్ని ఇవ్వవచ్చు.' తరువాత ఆయన గారు 'తౌబా'సూరాలో నుంచి ఈ ఆయత్‌ను పఠించారు; 'ఇన్నమస్సదఖాతు లిల్ ఫుఖరా' నుంచి చివరి వరకు. మరియు ఇలా అన్నారు; వీరిలో నుంచి ఎవరికి జకాత్ ధనాన్ని ఇచ్చినా దానికి మీకు పుణ్యం లభిస్తుంది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; 'ఖాలిద్ అయితే తన యుద్ధ కవచాలను అల్లాహ్ మార్గంలో వక్ఫ్ చేశారు, అబుల్ ఆస్ ఇలా అన్నారు; 'దైవప్రవక్త(స)గారు మమ్మల్ని జకాత్‌కు చెందిన ఒంటెలపైకి ఎక్కించి హజ్ కోసం సాగనంపారు.'

**547.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త(స) గారు జకాత్ ధనాన్ని వసూలు చేసుకురమ్మని మమ్మల్ని ఆజ్ఞాపించారు. అప్పుడు ప్రజలు ఆయన(స)గారికి ఇలా విన్నవించుకున్నారు; 'ఇబ్నె జమీల్(ర), ఖాలిద్ బిన్ వలీద్(ర), అబ్బాస్(ర) బిన్ అబ్దుల్ ముత్తలిబ్ గార్లు జకాత్ ఇవ్వటానికి తిరస్కరించారు.' అప్పుడు దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు: 'ఇబ్నె జమీల్‌కు ఏమైంది? అతను కృతజ్ఞతలు ఎందుకు చెప్పుకోడు? అతను పేదరికంలో ఉన్నప్పుడు అల్లాహ్ అతనికి సహాయం చేశాడు. అల్లాహ్ దయ వల్ల, దైవప్రవక్త(స) దుఆ వల్ల అతను ధనవంతుడైపోయాడు. ఖాలిద్ అయితే తన యుద్ధ కవచాలను, ఆయుధాలను అల్లాహ్ మార్గంలో వక్ఫ్ చేశాడు. అతన్ని జకాతు ఇవ్వమని అడిగి మీరు అతనిపై జులుమ్ చేశారు; అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ అయితే దైవప్రవక్త(స) గారికి బాబాయి అవుతారు. ఆయన గారి జకాతు ఆయనపై సదకా చేసినట్లే అవుతుంది. ఇంతే ధనాన్ని నా తరఫునుండి నేను ఇస్తాను.'

## 49వ అధ్యాయం

### యాచనకు దూరంగా ఉండటం.

**548.** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(ర) ఇలా ఉల్లేఖించారు; అన్సారీ జనులు కొందరు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారిని ధనసహాయం చెయ్యమని

అర్థించారు. ఆయన(స) గారు వారికి కొంత ధనాన్ని ఇచ్చారు. వారు ఇంకా సహాయం చెయ్యమని దైవప్రవక్త(స)ను మళ్ళీ అడిగారు. దైవప్రవక్త(స) వారికి మళ్ళీ సహాయం చేశారు. చివరకు ఆయన(స)గారి వద్ద ఉన్న ధనం అంతా అయిపోయింది. అప్పుడు ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు; 'చూడండి! నావద్ద ఎంత ధనం ఉన్నా ఆ ధనాన్ని నేను మీకు ఇవ్వకుండా దాచిపెట్టను. కాని ఎవరైతే ధన సహాయాన్ని చెయ్యమని యాచించకుండా దానికి దూరంగా ఉంటారో అల్లాహ్ వారిని దానికి దూరంగా ఉంచుతాడు. ఎవరైతే ప్రపంచంలోని ధనాన్ని లెక్క చెయ్యరో దానికి అతీతంగా ఉంటారో అల్లాహ్ వారిని దానికి అతీతంగా ఉంచుతాడు. ఇంకా ఎవరైతే బలవంతంగా ప్రాపంచిక కోరికలను అణచుకుని సహనంతో ఉంటారో అల్లాహ్ వారికి సహనాన్ని ప్రసాదిస్తాడు. సహనం కంటే మేలైనది, విశాలమైనదీ అయిన వస్తువు ఏదీ ఎవరికీ లభించలేదు."

**549.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; 'ఎవని చేతుల్లోనైతే నా ప్రాణం ఉన్నదో, ఆయనపై ప్రమాణం చేసి చెబుతున్నాను! మీలోని ప్రతి ఒక్కరికీ ఇదే ఉత్తమమైనది. ఒక త్రాడును తీసుకుని అడవికి పోవటం, కట్టెలు కొట్టి మోపుగా కట్టుకోవటం దానిని తన వీపుపై మోసుకుంటూ తీసుకువచ్చి బజారులో అమ్మటం – అలాంటి మనిషి ముఖాన్ని అగ్ని జ్వాలలకు గురికాకుండా అల్లాహ్ కాపాడుతాడు. ప్రజల్ని ఇవ్వమని అడగటంకంటే ఇది శ్రేష్టమైనది. ప్రజలు అతనికి ఇవ్వనూవచ్చు. లేక ఇవ్వకపోనూ వచ్చు."

**550.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ జుబేర్ బిన్ అవ్వామ్(రజిఅన్) ఉల్లేఖించారు; "మీలోని ప్రతి ఒక్కరికి ఇదే శ్రేష్టమైనది, మీరు ఒక త్రాడును తీసుకుని అడవికిపోయి కట్టెలు కొట్టి వాటిని మోపుగా కట్టి దానిని వీపుపై మోసుకుంటూ తెచ్చి ఆ కట్టెల్ని బజారులో అమ్మి తద్వారా వచ్చే ధనంతో కుటుంబాన్ని పోషించటం శ్రేష్టమైనది. అలాంటి మనిషి ముఖాన్ని నరకాగ్ని నుండి కాపాడుతాడు. సహాయం చెయ్యమని ఒక మనిషిని అడగటంకంటే ఇది ఉత్తమమైనది. ఆ మనిషి ఇవ్వనూవచ్చు. ఇవ్వకపోనూవచ్చు."

**551.** ఉర్వా బిన్ జుబేర్, సయీద్ బిన్ ముసయ్యబ్ ఇలా ఉల్లేఖించారు; హకీమ్ బిన్ హిజామ్(ర) ఇలా అన్నారు అని, ఒకసారి నేను దైవప్రవక్త(స)గారిని (కొంత ధనాన్ని) ఇవ్వమని అడిగాను. ఆయన(స)గారు ఇచ్చారు. తరువాత నేను

మళ్ళీ ఇవ్వమని అడిగాను. ఆయన(స) గారు మళ్ళీ ఇచ్చారు. నేను ఆయన(స) గారిని ఇవ్వమని మళ్ళీ అడిగాను. ఆయన(స)గారు మళ్ళీ ఇచ్చారు. తరువాత దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'ఓ హకీమ్! నేను నీకు ఇచ్చే ఈ ధనం తీయని ఒక తాజాపండు లాంటిది. ఎవడైతే దురాశ లేకుండా దాన్ని తీసుకుంటాడో అతనికి శుభాలు వరిస్తాయి, కాని ఎవడైతే దురాశతో దాన్ని తీసుకుంటాడో అతడు శుభాలకు దూరమవుతాడు. అతడు అన్నం తిన్నా కడుపునిండని మనిషిలాంటివాడు. ఇచ్చే (పై) చేయి తీసుకునే (కింది) చెయ్యి కంటే ఉత్తమమైనది'. హకీమ్ ఇలా అన్నారు; దైవప్రవక్త(స)గారితో నేను ఇలా అన్నాను; 'మీకు సత్యాన్ని ఇచ్చి పంపిన అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. మీ తరువాత ఇక నేను ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి వెళ్ళేవరకు నేను ఎవరినీ ఏదీ ఇవ్వమని అడగను.' తరువాత హజ్రత్ అబూబకర్(రజిఅన్) (తన ఖిలాఫత్ కాలంలో) హకీమ్‌ను తన వద్దకు విజయ ధనంలో నుంచి అతని భాగాన్ని ఇవ్వటానికి తన వద్దకు పిలిపించారు. కాని ఆయన(ర) దాన్ని తీసుకోవటానికి తిరస్కరించారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్(రజిఅన్) తన ఖిలాఫత్ కాలంలో హకీమ్‌ను విజయధనంలో నుంచి అతని భాగాన్ని ఇచ్చేందుకు తన వద్దకు పిలిపించారు. ఆయన వచ్చారు కాని తన భాగాన్ని తీసుకోవటానికి తిరస్కరించారు. అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు; "ఓ ముస్లిములారా! మీరు సాక్షులుగా ఉండండి. విజయధనంలో నుంచి హకీమ్‌కు చెందిన భాగాన్ని నేను అతనికి ఇచ్చాను. కాని ఆయన దాన్ని తిరస్కరించారు." కనుక హకీమ్ ఎవరి దగ్గర నుంచీ ఏ వస్తువునూ తాను మరణించేవరకు తీసుకోలేదు.

## 50వ అధ్యాయం

**ఒకవేళ అల్లాహ్ ఎవరికైనా అడక్కుండానే, ఆశించకుండానే అత్యాశ లేకుండానే ఏదైనా వస్తువును ఇప్పిస్తే, అప్పుడు అతను ఆ వస్తువును తీసుకోవాలి. అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: వారి సంపదలలో అడిగేవారికి, మౌనంగా ఉండేవారికి ఉభయులకూ భాగం ఉంది.**

**552.** అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర)గారు ఇలా అన్నారు; నేను హజ్రత్ ఉమర్(ర) నుంచి విన్నాను, ఆయన(ర) గారు ఇలా అన్నారు, దైవప్రవక్త మహాశయులు (స) నేను చేసిన పనికి ప్రతి ఫలంగా నాకు కొంతధనాన్ని ఇచ్చేవారు. అప్పుడు నేను ఆయన(స) గారితో ఇలా విన్నవించుకునేవాణ్ణి: 'ఓ దైవప్రవక్తా(స)! నాకంటే ఎక్కువ పేదవాడు, వాని అవసరం ఎక్కువగా ఉన్నవాడు,

అర్హుడు అయిన మనిషికి దాన్ని ఇవ్వండి.' అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, 'వద్దు, తీసుకో. నీ వద్దకు ప్రాపంచిక సంపదలో నుంచి కొంత ధనం ఏదైనా వచ్చినట్లయితే, దానిపట్ల నీకు అత్యాశ లేకుండా ఉంటే, ఇంకా నీవు దాన్ని ఇవ్వమని అడగకుండా ఉంటే, అప్పుడు తీసుకో. నీకు ఏదైనా దొరక్కపోతే అప్పుడు నీవు దాన్ని లెక్క చెయ్యకు.'

## 51వ అధ్యాయం

**ఎవరైనా ఒక వ్యక్తి తన సంపదను పెంచే ఉద్దేశ్యంతో ప్రజల్ని ధన సహాయం చెయ్యమని అర్థించటం.**

**553.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ఉమర్(ర) ఉల్లేఖించారు; ఒక మనిషి ఎల్లప్పుడూ ప్రజల్ని ధన సహాయం చెయ్యమని అర్థిస్తూ ఉంటాడు, చివరకు (మరణానంతరం) ప్రళయదినం నాడు అతడు వికృతమైన ముఖంతో వస్తాడు, అతని ముఖంపై ఒక్క మాంసపు కండ కూడా ఉండదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'ప్రళయదినం నాడు సూర్యుడు ప్రజలకు అతి దగ్గరగా వస్తాడు. ప్రజల శరీరాల్లో నుంచి అత్యధికంగా చెమట వెలువడుతూ ఉంటుంది. ఆ చెమట చెవుల వరకు చేరుతుంది. ఈ స్థితిలోనే వారు తమ విముక్తి కోసం సహాయం చెయ్యమని ఆదమ్(అ)ను కోరుకుంటారు. తరువాత ప్రవక్త మూసా(అ)ను అభ్యర్థిస్తారు. ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్(స)ను సహాయం చెయ్యమని అడుగుతారు. ఉప ఉల్లేఖకుడు అదనంగా ఈ విషయాన్ని కూడా ఉల్లేఖించారు, ముహమ్మద్(స) అడ్డుపడి అల్లాహ్‌కు సిఫారసు చేస్తారు. ఆయన(స) చివరకు స్వర్గద్వారపు కంకణాన్ని పట్టుకునేంతవరకు ముందుకు సాగిపోతారు. అప్పుడు అల్లాహ్ ఆయన(స)గారిని 'మఖామె మహ్మూద్' (సిఫారసు చేసే హక్కు) అంత ఎత్తుకు చేరుకునేలా చేస్తాడు. సభలో ఉన్న ప్రజలందరూ అల్లాహ్‌ను స్తుతిస్తారు, స్తోత్రాలు చేస్తారు.

## 52వ అధ్యాయం

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; 'అల్లాహ్ కార్యంలో నిమగ్నులైన కారణంగా, తమ జీవనోపాధి కోసం భూమిపై తిరిగే అవకాశం లేనందువల్ల లేమికి గురైన వారు ప్రత్యేకంగా ధన సహాయానికి అర్హులు. వారిని ఎరుగని మనిషి వారి ఆత్మాభిమానం చూసి వారు భాగ్యవంతులని భావిస్తాడు. వారి ముఖాలను చూసి

మీరు వారి నిజస్థితిని గ్రహించగలరు. లోకుల వెంటబడి సహాయం చెయ్యండి అని బ్రతిమాలే మనుషులు కారు వీరు. మీరు వారి సహాయార్థం ఏమి ఖర్చు చేసినా అది అల్లాహ్‌కు తెలియకుండా ఉండదు. **(2: 273)**

**554.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; ఒకటీ రెండు ముద్దల అన్నం అవసరం ఉన్నవాడు అసలైన పేదవాడు కాడు. ఆ రెండు ముద్దల కోసం అతడు అడుక్కుంటూ ఇంటింటికీ పోతాడు. కాని అసలైన పేదవాడెవడంటే, అతనికి తీరని అవసరాలు ఉన్నప్పటికీ ఇతరుల్ని అడగటానికి సిగ్గుపడతాడు. వెంటపడి ప్రజల్ని పెట్టమని అడగడు.

**555.** అష్షాబి ఉల్లేఖించారు; అల్ ముగైరా బిన్ షూబా గారి గుమాస్తా ఉల్లేఖించారు; ముఆవియా అల్ ముగైరా బిన్ షూబాకు ఇలా వ్రాశారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు చెప్పగా మీరు విన్నటువంటి హదీసు ఏదైనా ఉంటే, నాకు వ్రాసి పంపండి. కనుక అల్ ముగైరా ఇలా వ్రాశారు; దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను; అల్లాహ్‌కు ఈ మూడు విషయాలంటే ఇష్టం లేదు. ఆయన వాటిని ద్వేషిస్తాడు. 1) వ్యర్థమైన మాటలు; ఇతరుల్ని గురించి ఎక్కువగా మాట్లాడటం 2) దుబారా ఖర్చులు పెట్టి సంపదను నాశనంచెయ్యటం 3) వివాదాస్పదమైన ధార్మిక విషయాలను గురించి ఎక్కువగా అడగటం, ప్రశ్నించటం; మరీ ఎక్కువ అవసరం ఉంటే తప్ప ఇతరుల్ని సహాయం చెయ్యమని అడగటం. మూడో సంపుటంలో **591**వ హదీసును కూడా చూడండి.

**556.** సాద్ బిన్ వఖ్ఖాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కొందరికి ధన సహాయం చేశారు. ఆ సమయంలో నేను కూడా అక్కణ్ణే కూర్చుని ఉన్నాను. దైవప్రవక్త(స) గారు ఒక వ్యక్తిని (జాబీల్ బిన్ సురాఖా) సహాయం చెయ్యకుండా వదిలివేశారు. ఆయన(స) అతనికి ఏమీ ఇవ్వలేదు. ధన సహాయం పొందని మనుషుల్లో అతనే నాకు ఎక్కువగా ఇష్టమైనవాడు. చివరకు నేను లేచి నిలబడి ఆయన(స) గారి వద్దకు వెళ్ళాను. దైవప్రవక్త(స) గారి చెవిలో రహస్యంగా నేను ఒక విషయాన్ని విన్నవించుకున్నాను; నేను ఇలా అన్నాను; ఓ దైవప్రవక్తా(స)! ఫలానా వ్యక్తిని గురించి మీరు ఏమనుకుంటున్నారు? అతన్ని మీరు ఎందుకు వదిలిపెట్టారు? సహాయం ఎందుకు చెయ్యలేదు? అల్లాహ్‌పై ప్రమాణం చేసి

చెబుతున్నాను. నేనుఅతన్ని సత్యవంతుడైన విశ్వాసిగా భావిస్తున్నాను. దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు; అతను కేవలం ఒక ముస్లిమేనా? తరువాత కాసేపు నేను మౌనంగా ఉండిపోయాను. ఆ తరువాత; నేను అతని స్థితిని గురించి బాగా ఎరిగిన వాణ్ణి కాబట్టి ఊరుకోలేకపోయాను. నిస్సహాయుడనై పోయాను. అతను నన్ను మాటిమాటికి అడిగాడు. అప్పుడు నేను మళ్ళీ ఇలా విన్నవించుకున్నాను. ఓ దైవ ప్రవక్తా(స)! ఫలానా వ్యక్తిని గురించి మీరు ఎందుకు కోపంగా ఉన్నారు? అతన్ని ఎందుకు వదలిపెట్టారు? దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. నేనైతే అతన్ని నిజమైన విశ్వాసిగా భావిస్తున్నాను. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; కేవలం ముస్లిమేనా? సాద్ ఇలా అన్నారు; తరువాత నేను కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాను. ఆ తరువాత అతని స్థితిని నేను బాగా ఎరిగినవాణ్ణి కాబట్టి అతను నన్ను మళ్ళీ అడిగాడు. అప్పుడు నేను మళ్ళీ ఇలా విన్నవించుకున్నాను; ఓ దైవప్రవక్తా(స)! మీరు ఫలానా వ్యక్తి పట్ల ఎందుకు కోపంగా ఉన్నారు? దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేనైతే అతన్ని సత్యవంతుడైన విశ్వాసిగా భావిస్తున్నాను. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; లేక కేవలం ముస్లిమేనా? మూడుసార్లు ఇలాంటి సంభాషణే జరిగింది. దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు; నేను ఒక వ్యక్తికి ఇస్తాను; మరొక వ్యక్తి అతని కంటే నాకు ఎక్కువగా ఇష్టమైనవాడు అయి వుంటాడు. నేను ఇలా భయపడతాను; అతను బోర్లా పడవేయబడి నరకంలోకి ఈడ్చుకుపోబడి పడవేయబడతాడేమోనని.

**557.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; 'ఒకటీ రెండు ముద్దల అన్నం కోసం లేక ఒకటీ రెండు ఖర్జూరపు పండ్ల కోసం ప్రజల్ని అడుగుతూ వారి చుట్టూ తిరిగేవాడు అగత్య పరుడు కాదు. ఈ కోరిక, ఈ అవసరం అతన్ని ఇళ్ళ చుట్టూ తిరిగేలా చేస్తుంది. అసలు అగత్యపరుడు ఎవడంటే, అతని వద్ద తన అవసరాలు తీరేంత ధనం లేనివాడు, ఇంకా అతని దుస్థితిని గురించి ఇతరులెవ్వరికీ తెలియనివాడు, అందుకని ఎవరూ, ఏ వస్తువునూ అతనికి దానంగా ఇవ్వలేదు, ఇంకా ధన సహాయం చెయ్యమని జనుల్ని అడగనివాడు.'

**558.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: 'మీలోని ఒక వ్యక్తి ఎవరైనా తన త్రాడును తీసుకుని కొండల మీదకు పోయి అక్కడ కట్టెలు కొట్టి వాటిని అమ్మి దానిద్వారా వచ్చే ధనంతో ఇంటి అవసరాలు తీర్చుకుని, ఇంకా ఆ ఆదాయంలో నుంచే దానం కూడా

చేస్తే అప్పుడు, ప్రజల వద్దకుపోయి ధన సహాయం చెయ్యమని అర్థిస్తూ తిరిగేదాని కంటే అది ఉత్తమమైనది.'

## 53వ అధ్యాయం

**ఖర్జూరపు పండ్లు వృక్షాల మీద ఉన్నప్పుడే వాటి దిగుబడినీ, వాటి విలువను అంచనా కట్టడం చట్టబద్ధమైన విషయమే.**

**559.** అబూ హుమైద్ సాయిదీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; మేము తబూక్ యుద్ధంలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారితో కలిసి పాల్గొన్నాము. ఆయన(స) గారు ఖురా లోయకు చేరుకున్నప్పుడు అక్కడ ఒక స్త్రీ కనిపించింది. ఆమె తన తోటలో నిలబడి ఉంది. దైవ ప్రవక్త(స) గారు తన అనుచరులతో ఇలా అన్నారు, 'బాగుంది! ఈ తోటలో ఉన్నటువంటి ఖర్జూరపుపండ్ల విలువ ఎంత ఉంటుందో అంచనా కట్టండి.' అనుచరులు అంచనా కట్టారు. దైవప్రవక్త(స)గారు ఆ తోటలోని పండ్ల విలువ పది వసఖ్‌లు ఉంటుందని అంచనా కట్టారు. అప్పుడు దైవప్రవక్త(స) తోటలో నిలబడి ఉన్న ఆ స్త్రీతో ఇలా అన్నారు; 'ఈ తోటలోని ఖర్జూరపు పండ్ల దిగుబడి, విలువ ఎంత ఉంటుందో పరీక్షించి చూసుకోండి.' మేము తబూక్‌కు చేరు కున్నప్పుడు మాతో దైవప్రవక్త(స) ఇలా అన్నారు: 'ఈ రోజు రాత్రి శక్తివంతమైన ఒక పెద్ద తుపాను వస్తుంది. కనుక మీరందరూ జాగ్రత్తగా ఉండండి. ఎవరూ నిలబడి ఉండకండి. ఒంటెలు కలవారు వాటిని కట్టి వెయ్యండి.' మేము మా ఒంటెల్ని కట్టి వేశాము. ఆ తరువాత శక్తివంతమైన తుపాను వచ్చింది. ఒక వ్యక్తి మాత్రం నిలబడి ఉన్నాడు. తుపాను అతన్ని లేపుకు పోయి 'తయ్' కొండ మీద పడవేసింది. 'అయ్‌లా' దేశపు రాజు అయిన (యొహనా బిన్‌రూబ) దైవప్రవక్త(స) గారికి ఒక శ్వేత అశ్వాన్ని, ధరించటానికి ఒక విశాలమైన వస్త్రాన్ని కానుకలుగా పంపాడు. దైవప్రవక్త(స) అతని దేశ ప్రభుత్వాన్ని అతని పేర రాసి ఇచ్చారు. ఆయన(స)గారు తిరిగి ఖురా లోయకు వచ్చినప్పుడు ఆ స్త్రీని ఇలా అడిగారు; నీ తోటలో ఎంత ఖర్జూరపు పండ్ల దిగుబడి అయింది. ఆమె 'మొత్తం పది వసఖ్‌ల పండ్లు దిగుబడి అయ్యాయి' అనిచెప్పింది. దైవ ప్రవక్త(స) అంచనా కట్టిన ప్రకారమే దిగుబడి జరిగింది. తరువాత ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; 'నేను మదీనా పురానికి తొందరగా వెళ్ళాలి. మీలో ఎవరికైనా మదీనాకు తొందరగా పోవలసి ఉంటే వారు నాతో ప్రయాణం చెయ్యవచ్చు.'

బహల్ బిన్ బకార్ ఒక మాట అన్నారు; దాని అర్థమేమిటంటే, మదీనా పురాన్ని చూసినప్పుడు దైవప్రవక్త(స) 'ఇది తాబ' అని సెలవిచ్చారు. ఉహుద్ కొండను చూసినప్పుడు, ఆయన(స) 'ఈ కొండ మనం అంటే ఇష్టపడుతుంది. మనం కూడా అది అంటే ఇష్టపడతాం, అన్సారులకు చెందిన ఏ కుటుంబం ఉత్తమమైనదో నేను మీకు తెలియజేసేదా?' అన్నారు. "తెలియజెయ్యండి ఓ ప్రవక్తా(స)!" అని ప్రజలు అన్నారు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'బనీ నజ్జార్, తరువాత బనీ అబ్దుల్ అష్హల్ కుటుంబం, ఆ తరువాత బనీ సాయిద కుటుంబం లేక బనీ హారిస్ బిన్ ఖజ్రజ్ కుటుంబం, ఇంకా అన్సారులకు చెందిన ప్రతి కుటుంబమూ ఉత్తమమైనదే.' సులైమాన్ బిన్ బిలాల్ ఇలా అన్నారు; దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారని అమ్ర్ నాతో అన్నారు, తరువాత బనీ హారిస్ బిన్ ఖజ్రజ్‌కు చెందిన కుటుంబం, ఇంకా బనీ సాయిద కుటుంబం. ఇంకా సాయిద బిన్ సయీద్ ఇలా సెలవిచ్చారని సులైమాన్ అన్నారు; ఆయన అమ్మారా బిన్ గజియ్య నుంచి, ఆయన అబ్బాస్ బిన్ సహల్ నుంచి, ఆయన తన తండ్రి గారి నుంచి, ఆయన దైవప్రవక్త(స) నుంచి, అందులో ఇలా ఉంది; 'ఉహుద్ కొండకు మనం అంటే చాలా ఇష్టం మరియు మనకు కూడా అదంటే ఎంతో ఇష్టం.' ఆయన ఇలా అన్నారు. అబూ అబ్దుల్లాహ్ ఇలా అన్నారు : ఏ తోట చుట్టూనైతే ప్రహరీగోడ ఉంటుందో ఆ తోటను 'హదీఖా' అని అంటారు. ఏ తోట చుట్టూనైతే గోడ ఉండదో దాన్ని 'హదీఖా' అని అనరు.

## 54వ అధ్యాయం

**ఏ పొలాన్నయితే వర్షపు నీటి ద్వారా సాగుబడి చేస్తారో లేక ఏ పొలాన్నయితే నదీజలం ద్వారా సాగుబడి చేస్తారో ఆ పొలంలోని దిగుబడిపై పదవ భాగం జకాత్‌ను విధిగా చెల్లించాలి. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్(ర) తేనె దిగుబడిపై జకాత్‌ను విధించేవారు కాదు.**

**560.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని తన తండ్రిగారు తెలియజేశారని సాలిమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; 'ఏ పొలానికయినా ఆకాశం నుంచి కురిసే వర్షపు నీరుతో గాని లేక కాలువలో ప్రవహించే నీటితోగాని సాగుబడి చేస్తే లేక ఏ పొలం భూమి అయినా దగ్గరలో ఉన్నటువంటి కాలువల్లో ప్రవహించే నీళ్ళ ప్రవాహం వల్ల స్వయంగా సాగుబడి

అయితే అప్పుడు ఆ భూముల్లో నుంచి దిగుబడి అయ్యే ఉత్పత్తుల్లోనుంచి పదవ భాగాన్ని జకాత్‌గా చెల్లించవలసి ఉంటుంది. ఏ భూమినైతే బావిలోని నీటిద్వారా సాగుబడి చెయ్యటం జరుగుతుందో ఆ భూమిలోని ఉత్పత్తిపై ఇరవయ్యవ భాగం విధిగా జకాత్ రూపంలో చెల్లించాలి.

## 55వ అధ్యాయం

**ఐదు వసఖ్‌లు ఖర్జూరపు పండ్ల పంట మీద జకాత్ లేదు.**

**561.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఖర్జూరపు పండ్లు ఐదు వసఖ్‌ల కంటె తక్కువగా ఉంటే అప్పుడు వాటిపై జకాత్ లేదు. అదే విధంగా ఐదుకంటే తక్కువగా ఒంటెలు ఉన్నట్లయితే అప్పుడు వాటిపై జకాత్ లేదు. ఇంకా ఐదు ఊఖియాల కంటే తక్కువ వెండి ఉన్నట్లయితే అప్పుడు దానిపై జకాత్ లేదు.

## 56వ అధ్యాయం

**చెట్ల నుంచి ఖర్జూరపు పండ్లను కోసినప్పుడే వాటిపై జకాత్ తీసుకోవాలి. జకాత్ రూపంలో ఉన్న ఖర్జూరపు పండ్లను పిల్లవాడు చేత్తో తాకటం లేక ఆ జకాత్ పండ్లలో నుంచి పిల్లవాడు తినటం.**

**562.** హజ్రత్ అబూ హురైరా(రజి) ఇలా ఉల్లేఖించారు, ఖర్జూరపు పండ్లు చెట్లనుంచి కోసినప్పుడు ప్రజలు తమ తమ జకాతు పండ్లను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅసం) గారి వద్దకు తీసుకువస్తూ ఉండేవారు. చివరకు ఖర్జూరపు పండ్లు దైవప్రవక్త(స) గారి ముందు ఒక పెద్ద కుప్పగా పోగయ్యేవి. ఒకసారి ఏమి జరిగిందంటే, ఇమామ్ హసన్(రజి), ఇమామ్ హుస్సేన్(రజి) ఉభయులూ జకాతు రూపంలో ఉన్న ఆ ఖర్జూరపు పండ్లతో ఆడుకుంటున్నారు. ఇంతలోనే ఆ ఉభయుల్లోని ఒక బాలుడు ఆ జకాతు పండ్లలో నుంచి ఒక పండును తీసుకుని తన నోట్లో వేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన దైవప్రవక్త(స) ఆ బాలుని నోట్లోనుంచి ఆ ఖర్జూరపు పండును తీసేసి ఇలా సెలవిచ్చారు; 'ముహమ్మద్(స) సంతానం జకాతు రూపంలో వచ్చిన పండ్లను తినరని (తినకూడదని) నీకు తెలియదా?'

## 57వ అధ్యాయం

ఒక వ్యక్తి ఎవరైనా తన పండ్లనుగాని లేక ఖర్జూరపు చెట్లనుగాని లేక పొలాన్ని గాని అమ్మితే, వాస్తవానికి అందులోనుంచి పదో భాగం లేక జకాత్ 'వాజిబ్' అయి

వుంటే.(అంటే విధిగా చెల్లించవలసి రావటం). అప్పుడు అతను తనవద్ద ఉన్న వేరే సంపదలో నుంచి ఈ జకాత్‌ను చెల్లించినట్లయితే, అది ధర్మసమ్మతమే. లేక ఇంకా జకాత్ వాజిబ్ కానటువంటి పండ్లను అమ్మితే; దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు- 'ఇంకా పండ్ల పరిపక్వత తెలియనంత వరకు వాటిని అమ్మకూడదు. పండ్ల పరిపక్వతను గురించి తెలిసినప్పుడు వాటిని అమ్మకూడదని ఆయన(స) వారించలేదు; ఆయన(స) గారు ఇలా కూడా అనలేదు; 'జకాత్ వాజిబ్ అయినప్పుడు, వాటిని అమ్మకూడదు. వాజిబ్ కానప్పుడు అమ్మవచ్చు.'

**563.** హ॥జత్ ఇబ్నె ఉమర్(రజి) ఇలా ఉల్లేఖించారు. ఖర్జూరపు పండ్లు పండనంత వరకు వాటిని అమ్మ కూడదని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅ) నిషేధించారు. దాని అర్థమేమిటని ప్రశ్నించగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'అవి చెడిపోయే (కుళ్లిపోయే) ప్రమాదం లేనంత వరకు.'

**564.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅ) ఇలా సెలవిచ్చారు, జాబిర్ బిన్ అబ్దుల్లా(రజి) ఉల్లేఖించారు; 'పండ్ల పరిపక్వత స్పష్టంగా వ్యక్తం కానంతవరకు వాటిని అమ్మకూడదు.'

**565.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅ) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు; "పండ్లు పరిపక్వతకు చేరనంతవరకు వాటిని అమ్మ కూడదు. దాని అర్థం ఏమిటంటే, అవి ఎరుపురంగును సంతరించుకోనంతవరకు"

## 58వ అధ్యాయం

ఒక మనిషి తాను ఇతరులకు దానం చేసిన వస్తువును తానే స్వయంగా మళ్ళీ కొనగలడా, ఇతరులెవరైనా దానం చేసిన వస్తువును కొంటే, అది దోషం కాదు. ఎందుకంటే, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రత్యేకంగా దానం చేసిన వ్యక్తే మళ్ళీ దాన్ని కొనటాన్ని నిషేధించారు. కాని ఇతరులు కొనటాన్ని నిషేధించలేదు.

**566.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; హ॥జత్ ఉమర్ (రజి అన్) ఒకసారి తన గు॥ర్రాన్ని అల్లాహ్ మార్గంలో దానం చేశారు. తరువాత ఏమి జరిగిందంటే, బజారులో అదే గు॥ర్రం అమ్మకానికి వచ్చింది. హ॥జత్ ఉమర్ (ర) దాన్ని చూశారు. ఆయన(ర) తిరిగి దాన్నే కొనాలని ఆశించారు. ఈ విషయం

గురించి సంప్రదించాలని ఆయన(ర) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వెళ్ళారు. ఆ గుర్రాన్ని కొనటానికి అనుమతించమని ఆయన(ర) దైవప్రవక్త(స)ను కోరారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'నీవు దానంగా ఇచ్చిన వస్తువును తిరిగి తీసుకోకు.' ఈ కారణం వల్లనే అబ్దుల్లా బిన్ ఉమర్(ర) తాను దానం చేసిన వస్తువును మళ్ళీ కొనటం జరిగితే, అప్పుడు ఆయన(ర) ఆ వస్తువును తిరిగి దానం చేసేవారు. (ఆ వస్తువును తన కోసం వాడుకునేవారు కాదు).

**567.** హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను నాకు చెందిన ఒక గుర్రాన్ని అల్లాహ్‌మార్గంలో ఉపయోగించటానికి దానంగా ఇచ్చేశాను. నేను ఏ వ్యక్తికైతే ఆ అశ్వాన్ని ఇచ్చానో ఆ వ్యక్తి దాన్ని చెడగొట్టాడు; దాన్ని సరిగ్గా సాకలేదు. నేను మళ్ళీ దాన్ని కొనదలిచాను. అతడు దాన్ని చౌకగా అమ్ముతాడని నేను భావించాను. తరువాత నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఈ విషయం గురించి సంప్రదించాను. అప్పుడు ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; "ఇప్పుడు ఆ గుర్రాన్ని నీవు కొనకు. నీవు దానంగా ఇచ్చిన వస్తువునే తిరిగి తీసుకోకు, అతడు ఆ గుర్రాన్ని నీకు ఒక రూపాయి ధనానికి అమ్మటానికి సిద్ధపడినా సరే. ఎందుకంటే, దానం చేసి తిరిగి దాన్ని తీసుకునేవాడు, వాంతి చేసుకుని దాన్ని మళ్ళీ నాకే లాంటివాడు."

## 59వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి, ఆయన(స) గారి సంతతికీ దానం చెయ్యటం నిషిద్ధం. (సదఖా ఇవ్వటం హరామ్)**

**568.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఇమామ్ హసన్ బిన్ అలీ(రజిఅన్) జకాత్‌గా వచ్చిన ఖర్జూరపు పండ్లల్లో నుంచి ఒక ఖర్జూరపు పండును తీసుకుని తన నోట్లో వేసుకున్నారు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; 'ఛీ, ఛీ!' ఎందుకంటే, ఆయన(ర) ఆ ఖర్జూరపు పండును పారెయ్యాలని అలా అన్నారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చారు; 'ఏమిటి! నీకు తెలియదా? మనం సదఖా వస్తువుల్ని తినకూడదని.'

## 60వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి భార్యల బానిసలకు సదఖా ఇవ్వటం ధర్మసమ్మతమే.**

**569.** హ్ఞజత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి ఒక మేక మృతదేహాన్ని చూశారు. ఆ మేక ఉమ్ముల్ మోమినీన్ మైమూన (ర) గారి స్త్రీ బానిసకు దానంగా లభించింది. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'మీరు ఈ మేక చర్మాన్ని ఎందుకు వినియోగించు కోవటం లేదు?' అప్పుడు వారు ఇలా అన్నారు, 'ఓ దైవప్రవక్తా! అది మరణించింది కదా! అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; మృత పశువు మాంసాన్ని తినటమే హరామ్.'

**570.** అస్వద్ ఇలా ఉల్లేఖించారు; హ్ఞజత్ ఆయెషా (రజిఅన్హా) బానిస కన్య అయిన బరీరాకు దాస్య విముక్తి కలిగించే ఉద్దేశ్యంతో ఆమెను కొనదలిచారు. కాని ఆమె యజమానులు ఒక షరతును విధించారు. అదేమిటంటే, ఆమెకు చెందిన 'తరకా' (ఆమె వదలిపోయిన ఆస్తి) మటుకు వారికే లభించాలి అనేది. హ్ఞజత్ ఆయెషా(ర) ఈ విషయాన్ని గురించి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి తెలియజేశారు; అప్పుడు ఆయన(స) గారు ఆమె(ర)గారితో ఇలా అన్నారు. 'నీవు బరీరాను కొను మరియు ఆమెకు స్వేచ్ఛను కలిగించు. తరకా అయితే దాస్య విముక్తి కలిగించే వారికే లభిస్తుంది.' అప్పుడు హ్ఞజత్ఆయెషా(ర) ఇలా అన్నారు, దైవప్రవక్త(స) గారి వద్దకు మాంసం వచ్చింది. నేను, ఆ మాంసం బరీరాకు దానంగా వచ్చిన మాంసం అని చెప్పాను. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'బరీరా కోసం అది దానంగా వచ్చిన మాంసమే. కాని మన కోసం అది కానుక.'

## 61వ అధ్యాయం

**సదఖా (దానంగా లభించిన వస్తువు) అగత్యపరుని సొంత ఆస్తి అయిపోతే అప్పుడు సయ్యద్‌లు అందులో నుంచి తినటం ధర్మసమ్మతమైనదే.**

**571.** ఉమ్మె అతియ అల్ అన్సారియ(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హ్ఞజత్ ఆయెషా(రజిఅన్హా) గారి వద్దకు వెళ్ళారు. 'తినటానికి నీ వద్ద ఏదైనా వస్తువు వుందా?' అని అడిగారు. ఆమె(ర)గారు, 'ఇంట్లో ఏమీ లేదు కాని మాంసం ఉంది. ఆ మాంసం మీరు (స), నుసైబాకు దానం చేసిన మేకకు చెందినది. నుసైబా ఆ మాంసాన్ని కానుకగా మన ఇంటికి పంపారు". అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; (సరే, తీసుకురా) 'సదఖా అయితే తన స్థలానికి చేరుకుంది.'

**572.** హజ్రత్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి వద్దకు బరీరాకు దానంగా లభించిన మాంసం తీసుకురాబడింది. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు; ఈ మాంసం బరీరాకైతే సదఖాగానే లభించింది. కాని మన వద్దకు అది ఒక కానుకగా వచ్చింది.

## 62వ అధ్యాయం

**సంపన్నులైన ముస్లిమ్‌ల నుంచి జకాత్‌ను తీసుకోవాలి. ఆ జకాత్‌ను నిరుపేద ముస్లిమ్‌లకు పంచిపెట్టాలి, వారు ఎక్కడున్నాసరే.**

**573.** ఇబ్నె అబ్బాస్(ర) గారి బానిస అయిన అబూ మాబద్ ఉల్లేఖించారు; దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ముఆజ్ బిన్ జబల్(ర)ను ఉద్దేశించి, అతన్ని యమన్‌కు పంపే ముందు ఇలా అన్నారు, "అక్కడ గ్రంథ ప్రజలు (యూదులు), (క్రైస్తవులు) నిన్ను కలుసుకుంటారు. నీవు వారి వద్దకు చేరినప్పుడు, వారితో ఇలా అను; 'అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైనవాడెవ్వడూ లేడనీ, మరియు హజ్రత్ ముహమ్మద్(స) దైవప్రవక్త అనీ సాక్ష్యం ఇవ్వండి.' ఒకవేళ వారు ఈ విషయాన్ని విశ్వసిస్తే, అప్పుడు నీవు వారితో ఇలా అను; అల్లాహ్ రేయిం బవళ్ళు అయిదు సార్లు నమాజులు చెయ్యటాన్ని వారిపై విధించాడని. 'ఒకవేళ ఈ విషయాన్ని కూడా వారు విశ్వసిస్తే అప్పుడు, నీవు వారితో ఇలా అను; అల్లాహ్ జకాత్‌ను కూడా వారిపై విధించాడని, అది వారిలోని ధనవంతుల దగ్గర నుంచి వసూలు చెయ్యబడుతుంది. ఇంకా వారికి చెందిన నిరుపేదలకు అది ఇవ్వబడుతుంది; ఒకవేళ వారు దీన్ని కూడా విశ్వసిస్తే, అప్పుడు వారికి చెందిన మేలైన వస్తువులను వారి ఆస్తులలో నుంచి తీసుకోవటం మానుకోవాలి. ఇంకా అణిచివేతకు గురైనవాని శాపనార్థాల నుంచి తమను కాపాడుకోవాలి. ఎందుకంటే అల్లాహ్‌కూ, అతనికీ మధ్య ఎలాంటి అడ్డమూ ఉండదు.'

## 63వ అధ్యాయం

జకాత్ ఇచ్చే వ్యక్తి కోసం ఇమామ్ (పాలకుడు) దుఆ చెయ్యటం. దివ్యఖుర్ఆన్ లోని తౌబా సూరాలో కరుణామయుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; 'ఓ ప్రవక్తా! నీవు వారి సంపదల్లోనుంచి సదఖా తీసుకుని వారిని పరిశుద్ధపరచు. ఇంకా సన్మార్గంలో వారిని ముందుకు నడుపు. వారికోసం దేవుని కారుణ్యానికై ప్రార్థించు. ఎందుకంటే నీ ప్రార్థనవల్ల వారికి ఉపశమనం కలుగుతుంది.

**574.** అబ్దుల్లా బిన్ అబూ అవ్ఫా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని దైవప్రవక్త(స)గారి వద్దకు ఒక వ్యక్తి ఎవరైనా తన జకాత్ దానాన్ని తీసుకుని వచ్చినప్పుడు, ఆయన(స)గారు అతని కోసం ఇలా దుఆ చేసేవారు; 'ఓ అల్లాహ్! ఫలానా వ్యక్తి సంతానంపై కరుణ జూపు.' నా తండ్రి గారు తన జకాత్ ధనాన్ని తీసుకుని దైవప్రవక్త(స) గారి వద్దకు వచ్చి నప్పుడు, ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; 'ఓ అల్లాహ్! అబూ అవ్ఫా(ర) సంతానాన్ని కరుణించు; వారిపై దయచూపు.'

## 64వ అధ్యాయం

### సముద్రంలో నుంచి తీయబడిన వస్తువులపై జకాత్ విధించటం గురించి.

ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారు; అంబర్ (ఒక ప్రత్యేక రకానికి చెందిన సుగంధ ద్రవ్యం)ను రికాజ్ అని అనలేం. అంబర్ అనేది సముద్రం తీరం మీదకు విసిరివేసే ఒక పదార్థం. ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా సెలవిచ్చారు; 'అంబర్ మరియు ముత్యాలలో అయిదో భాగం విధిగా జకాత్ చెల్లించాలి. వాస్తవానికి దైవప్రవక్త(స) రికాజ్‌లో నుంచి ఐదవ భాగాన్ని జకాత్‌గా నిర్ణయించారు. కనుక నీళ్ళల్లో లభించిన దాన్ని 'రికాజ్' అంటామా?' మరియు లైస్ ఇలా అన్నారు; జాఫర్ బిన్ రబిఅ నాతో అన్నారు; ఆయన అబ్దుర్రహ్మాన్ హుర్‌ముజా నుంచి, ఆయన అబూ హురైరా(ర) నుంచి; ఆయన దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి నుంచి. ఇస్రాయీల్ సంతతిలో ఒక వ్యక్తి ఉండేవాడు; అతను ఇస్రాయీల్ సంతతికి చెందిన మరొక వ్యక్తి నుంచి వెయ్యి ముత్యాలను అప్పుగా ఇవ్వమని అడిగాడు. ఆ వ్యక్తి అల్లాహ్‌పై నమ్మకం ఉంచి అతనికి వెయ్యి ముత్యాలను రుణంగా ఇచ్చాడు. అప్పు తీసుకున్న వ్యక్తి సముద్ర ప్రయాణం చేసి అప్పు ఇచ్చిన వ్యక్తికి రుణం తీరుద్దామనే ఉద్దేశ్యంతో సముద్రం వద్దకు వెళ్ళాడు. తనతోపాటు వెయ్యి ముత్యాలను కూడా తీసుకు వెళ్ళాడు. కాని ప్రయాణం చెయ్యటానికి పడవ దొరక్కపోవటం వల్ల తాను వెళ్ళవలసి ఉన్న స్థలానికి అతను వెళ్ళలేక పోయాడు. చివరకు అప్పిచ్చినవాని విషయంలో నిరాశకు లోనై అతను ఒక కర్రను తీసుకున్నాడు. దాన్ని చీల్చి అందులో వెయ్యి ముత్యాలను నింపి చీల్చిన కర్రను అతికించి సముద్రంలోకి దాన్ని విసిరివేశాడు. యాదృచ్ఛికంగా అప్పిచ్చినవాడు దైనం దిన పనుల కోసం ఇంట్లో నుంచి బయటికి వచ్చాడు. సముద్రపు ఒడ్డుకు చేరుకున్న

ప్పుడు అతడు ఒక కర్రను చూశాడు. దాన్ని పొయ్యిలోకి పుల్లగా వాడుకునేందుకు ఇంటికి తీసుకువచ్చాడు. ఆ కర్రను చీల్చి చూసినప్పుడు, అందులోనుంచి వెయ్యి ముత్యాలు గలగల మంటూ నేలపైకి రాలిపోయాయి.'

## 65వ అధ్యాయం

రికాజ్‌లో నుంచి ఐదో భాగం తీసుకోవటం వాజిబ్. అంటే తప్పనిసరి. ఇమామ్ మాలిక్ (రహ్మాలై), ఇమామ్ షాఫయి(రహ్మాలై) ఉభయులూ ఇలా అన్నారు; 'రికాజ్' అజ్ఞానకాలపు నిధి లేక ఖజానా. అందులో నుంచి లభించే నిధి కొద్దిపాటిదైనా లేక పెద్దదైనా ఐదో భాగం జకాత్‌గా తీసుకోబడుతుంది. గనుల్ని రికాజ్‌గా భావించ కూడదు. గనుల్ని గురించి దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు; ఎవరైనా వాటిలో పడి లేక పనిచేస్తూ ఉండగా మరణించినట్లయితే, అప్పుడు అతని ప్రాణం వృధాగా పోయినట్లే. రికాజ్‌లో నుంచి ఐదో భాగం జకాత్‌గా తీసుకోవాలి. ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ గనుల్లో నుంచి నలభయ్యో భాగాన్ని జకాత్‌గా తీసుకునేవారు. రెండు వందల రూపాయల నుంచి ఐదు రూపాయలు. ఇమామ్ హసన్ బస్రి (రహ్మాలై) ఇలా అన్నారు; 'ఏ రికాజ్ అయితే ముస్లిమేతర దేశం నుంచి లభిస్తుందో ఆ రికాజ్‌లోనుంచి ఐదో భాగాన్ని జకాత్‌గా తీసుకోవటం జరుగుతుంది. శాంతి ఒడంబడికలు ఉన్న దేశంలో నుంచి లభిస్తే అందులో నుంచి నలభయ్యో భాగం జకాత్‌గా తీసుకోబడు తుంది. శత్రుదేశంలో పడి ఉన్న వస్తువులు లభించినట్లయితే అప్పుడు వాటిని వారికి అందజెయ్యాలి. (బహుశ అది ముస్లిములకు చెందిన సంపద ఏమో) ఒకవేళ అది శత్రువుకు చెందిన సంపద అయితే, అప్పుడు అందులో నుంచి ఐదోభాగాన్ని చెల్లించాలి. కొందరు ఏమన్నారంటే; 'గనులు కూడా రికాజ్ కిందికే వస్తాయి.' పూర్వపు అజ్ఞానకాలంలో నిక్షిప్తమై ఉన్న నిధులు మాదిరిగా. ఎందుకంటే, అందులోనుంచి ఏదైనా వస్తువు బయల్పడి నట్లయితే, అప్పుడు అరబ్బు ప్రజలు దానిని 'అర్‌కజుల్ మఆదిన్' అని అనేవారు.

**575.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలచ్చారని, అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; 'పశువు వల్ల ఏ నష్టమైతే జరుగుతుందో ఆ నష్టానికి పరిహారం అనేది లేనేలేదు, బావిలో పడినా ఈ సూత్రమే వర్తిస్తుంది. ఇంకా గనుల

విషయంలో కూడా ఈ ఆజ్ఞయే వర్తిస్తుంది. అయితే రికాజ్‌లో నుంచి ఐదోభాగం విధిగా తీసుకోబడుతుంది.'

## 66వ అధ్యాయం

**కరుణామయుడైన అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లోని 'తౌబా' సూరాలో ఇలా సెలవిచ్చాడు; జకాత్‌ను వసూలు చేసే తహసీల్దారులకు కూడా జకాత్‌లో నుంచే జీతాలు చెల్లించాలి. వారు తమ హాకిమ్(గవర్నర్)కు లెక్కలు చూపించవలసి ఉంటుంది.**

**576.** అబూహుమైద్ సాయిదీ(ర) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త (స) గారు అల్‌లుత్‌బియా అనే పేరుగల అల్ అసద్ అనే తెగకు చెందిన ఒక వ్యక్తిని బనీ సులైమ్ తెగనుంచి జకాత్ వసూలు చేసే నిమిత్తం నియమించారు. జకాత్ వసూలు చేసుకుని అతను తిరిగి వచ్చిన తరువాత అతను చూపించిన లెక్కల్ని జాగ్రత్తగా పరిశీలించారు.

## 67వ అధ్యాయం

**బాటసారులైన ప్రజలు జకాత్‌కు చెందిన ఒంటెలతో పనులు చేయించుకోగలరు. వాటి పాలు త్రాగగలరు.**

**577.** హజ్రత్ అనస్(ర) ఇలా ఉల్లేఖించారు; ఉరైనా తెగకు చెందిన ప్రజలు కొందరు మదీనా పురానికి వచ్చారు. కాని వారిలోని కొందరికి మదీనాపుర వాతా వరణం సరిపడలేదు. అప్పుడు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జకాత్‌కు చెందిన ఒంటెలు ఉన్న ప్రదేశంలోకి వెళ్ళమని ఆదేశించారు. వారు ఆ ఒంటెల పాలను, మూత్రాన్ని త్రాగటానికి అనుమతి కూడా ఇచ్చారు. కాని వారు ఏం చేశా రంటే, ఒంటెలు మేపే వ్యక్తిని హతమార్చారు. ఒంటెలన్నిటినీ తోలుకుపోయారు. దైవ ప్రవక్త(స) వారిని వెంటాడి బంధించి తీసుకురమ్మని మనుషుల్ని పంపారు. దైవ ప్రవక్త(స) గారి ఆదేశానుసారం వారిని బంధించి ఆయన(స) వద్దకు తీసుకురావడం జరిగింది. ఆయన(స) వారి చేతుల్ని వారి కాళ్ళను నరికించారు. వారి కళ్ళను కాల్చిన ఇనుపకడ్డీలతో పొడవమని ఆజ్ఞాపించారు. ఇంకా వారిని రాళ్ళు ఉన్న ప్రదేశంలో వెయ్యమని ఆదేశించారు. వారు రాళ్ళను నమిలేవారు. ఖతాదాతోపాటు ఈ హదీసును అబూఖలాబ, హుమైద్, సాబిత్‌లు కూడా అనస్(ర)కు వివరించారు.

## 68వ అధ్యాయం

### జకాత్‌కు చెందిన ఒంటెలపై స్వయంగా పాలకుడే తన చేతులతో గుర్తులు వెయ్యటం

**578.** హజ్రత్ అనస్ బిన్‌మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'ఒకసారి ఉదయం పూట నేను అబూతల్‌హాకు చెందిన అప్పుడే పుట్టిన పిల్లవాణ్ణి తీసుకుని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వెళ్ళాను. దైవప్రవక్త(స) ఖర్జూరపు పండును నమిలి అందులోని మాధుర్యాన్ని ఆ పిల్లవాని నోట్లో పోశారు. దైవప్రవక్త(స)గారి చేతిలో గుర్తులు వేసే ఒక పరికరం ఉండటాన్ని నేను చూశాను. ఆయన(స)గారు అప్పుడు జకాత్ ఒంటెలపై గుర్తులు వేస్తున్నారు.'

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# ఫిత్రా అధ్యాయాలు

## 1వ అధ్యాయం

**ఫిత్రాదానం తప్పనిసరి కావటం. రమజాను ముగింపు సమయంలో ఈ దానాన్ని చెల్లించటం. అబుల్ ఆలియ, అతా, ఇబ్నె సీరీన్ ఫిత్రాదానాన్ని విధిగా చెల్లించాలి అని సెలవిచ్చారు.**

**579.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు, ఆయన(ర)గారు ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక 'సా' ఖర్జూరపు పండ్లనుగానీ లేక ఒక 'సా', 'జౌ'ను గానీ ఫిత్రా దానంగా విధిగా చెల్లించాలని ఆదేశించారు. ఈ ఫిత్రాను ముస్లిమ్ అయిన ప్రతి వ్యక్తి విధిగా చెల్లించాలి. పురుషుడుగానీ, స్త్రీ గానీ, పిల్లవాడుగానీ, పెద్ద మనిషిగాని విధిగా ఫిత్రాను చెల్లించాలి. 'పండుగ నమాజుకు బయలుదేరే ముందే ఈ ఫిత్రాను చెల్లించాలి' అని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించారు.

## 2వ అధ్యాయం

**ఫిత్రాదానాన్ని ఒక స్వతంత్ర ముస్లిమ్‌గానీ, లేక ఒక బానిస ముస్లిమ్‌గాని విధిగా చెల్లించాలి.**

**580.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖించారు; బానిస ముస్లిములుగానీ లేక స్వతంత్ర ముస్లిములుగానీ, పురుషులుగానీ, స్త్రీలు గానీ విధిగా ఒక 'సా' ఖర్జూరపు పండ్లుగానీ లేక ఒక 'సా' జౌ గాని ఫిత్రాదానంగా చెల్లించాలి.

## 3వ అధ్యాయం

**ఒక 'సా' జౌను ఫిత్రాదానంగా చెల్లించాలి. (ఒక సా మూడు కిలోగ్రాములకు దాదాపు సమానం)**

**581.** అబూ సయీద్‌ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన(ర) ఇలా అన్నారు; 'మేము ఒక 'సా' జౌను ఫిత్రాదానంగా ఇచ్చేవారం.'

## 4వ అధ్యాయం

### ఫిత్రాదానం ఒక 'సా' భోజనానికి సమానం.

**582.** అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఇలా ఉల్లేఖించారు; 'మేము ఒక 'సా' ధాన్యాన్ని (గోధుమలు) గానీ లేక ఒక సా 'జౌ'ను గానీ లేక ఒక 'సా' ఖర్జూరపు పండ్లను గానీ, లేక ఒక 'సా' పనీర్‌నుగానీ లేక ఒక 'సా' మునఖ్ఖా (కిష్‌మిష్)ను గానీ ఫిత్రాదానంగా ఇచ్చేవారం.

## 5వ అధ్యాయం

### ఖర్జూరపు పండ్లయినా సరే ఒక 'సా' ఫిత్రాదానంగా ఇవ్వాలి.

**583.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅసం) ఒక 'సా' ఖర్జూరపు పండ్లను గానీ లేక ఒక 'సా' జౌను గాని ఫిత్రా దానంగా ఇవ్వాలని మమ్మల్ని ఆజ్ఞాపించారు.' అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు; 'తరువాత ప్రజలు రెండు ముద్దుల గోధుమల్ని దానికి సమానమని భావించారు.'

## 6వ అధ్యాయం

### ఎండు ద్రాక్ష అయినా ఒక 'సా' ఫిత్రాదానంగా ఇవ్వాలి.

**584.** అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి కాలంలో మేము ఒక 'సా' ధాన్యాన్ని గానీ లేక ఒక 'సా' గోధుమల్ని గాని లేక ఒక సా 'జౌ'ను గాని లేక ఒక 'సా' ఎండు ద్రాక్షను గాని ఫిత్రాదానంగా ఇస్తూ ఉండేవారం. హజ్రత్ ముఆవియా(ర) ఖలీఫాగా అధికార పీఠాన్ని అధిష్టించినప్పుడు గోధుమలు పుష్కలంగా లభించేవి. అప్పుడు ఆయన (ర) ఇలా అన్నారు; ఒక ముద్ద్ గోధుమలు పైన పేర్కొనబడిన రెండు ముద్దుల ఏ వస్తువుకైనా సమానమవుతాయని నేను భావిస్తున్నాను.

## 7వ అధ్యాయం

### ఫిత్రాదానాన్ని పండుగ నమాజుకు ముందే ఇవ్వాలి.

**585.** ఇబ్నె ఉమర్(రజిఅన్)ఇలా ఉల్లేఖించారు; ఫిత్రా దానాన్ని పండుగ నమాజుకు వెళ్ళే ముందే ఇవ్వాలని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రజల్ని ఆజ్ఞాపించారు.

**586.** అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు, 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి కాలంలో మేము ఈదుల్‌ఫిత్ర్

పండుగ రోజున ఒక 'సా' ఆహార పదార్థాలను (తినదగిన ఖాద్య వస్తువులు) పేదవారికి ఫిత్రాదానంగా ఇచ్చేవారం. ఇంకా ఆ కాలంలో మేము 'జౌ'గాని, 'ఎండుద్రాక్ష పండ్లు' గాని లేక ఖర్జూరపు పండ్లుగాని పనీరు గాని ఆహారంగా తినేవారం.'

## 8వ అధ్యాయం

**ఒక బానిసగాని, ఒక స్వతంత్ర్య ముస్లిమ్ గాని తప్పనిసరిగా (వాజిబ్) ఫిత్రాదానాన్ని చెల్లించాలి.**

**జుహరీ ఇలా అన్నారు; అమ్మకానికి పెట్టిన బానిసలపై కూడా ఫిత్రాదానం వాజిబ్. వారి సంపదపై నిర్దేశిత జకాత్‌ను, ఫిత్రాదానాన్ని రెండింటిని తప్పనిసరిగా చెల్లించాలి.**

**587.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా అన్నారని నాఫె ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా ఆజ్ఞాపించారు; "ప్రతి పురుషుడూ, ప్రతి స్త్రీ, ప్రతి స్వతంత్ర వ్యక్తీ లేక బానిస- వీరందరూ విధిగా ఒక 'సా' ఖర్జూరపు పండ్లనుగాని లేక ఒక సా 'జౌ'ను గాని ఫిత్రాదానంగా విధిగా చెల్లించాలి. (లేక ఇలా అన్నారు; సదఖయె రమజాన్). కాని ప్రజలు సగం 'సా' గోధుమల్ని దానికి బదులుగా సరిపో తుందని భావించారు. అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఖర్జూరపు పండ్లను ఫిత్రా దానంగా ఇచ్చేవారు. ఒకసారి మదీనాలో ఖర్జూరపు పండ్ల పంట తగ్గిపోవడం వల్ల వాటి కొరత ఏర్పడింది. అవి చాలా తక్కువగా లభించేవి. అప్పుడు మదీనా పౌరులు 'జౌ'ను ఇవ్వ సాగారు. అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఈ సదఖాను పిన్నలూ, పెద్దలూ అందరి తరఫున ఇచ్చేవారు. అంతేకాదు ఆయన నా కుమారుల తరఫున కూడా దాన్ని చెల్లించేవారు. అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఈ సదఖాను స్వీకరించే ప్రతి ఫకీరుకు దాన్ని ఇచ్చేవారు. ప్రజలు ఈదుల్ ఫితర్ పండుగకు ఒకరోజు ముందుగాని లేక రెండు రోజులు ముందుగాని ఈ సదఖాను ఇచ్చేవారు.'

## 9వ అధ్యాయం

**పిన్నలు, పెద్దలు అందరిపైనా ఫిత్రా దానం వాజిబ్.**

**588.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక 'సా' 'జౌ'ను లేక ఒక 'సా' ఖర్జూరపు పండ్లను పెద్దవారి పైనా, పిన్నవారిపైనా, స్వతంత్రులపైనా, బానిసల పైనా ఫిత్రాదానం విధిగా నిర్ణయించారు.'

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# హజ్జ్ ప్రకరణం

## 1వ అధ్యాయం

హజ్జ్ యాత్ర విధి కావటం. దాని ఔన్నత్యం గురించి కరుణామయుడైన అల్లాహ్ ఆలిఇమ్రాన్ సూరాలో ఇలా సెలవిచ్చాడు; ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తిగలవారు దాని హజ్జ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించే వాడు, అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంత మాత్రం లేదు అని స్పష్టంగా తెలుసు కోవాలి.' **(3: 97)**

**589.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర) ఇలా ఉల్లేఖించారు; 'ఫజల్ బిన్ అబ్బాస్ (ఆయన గారి సోదరుడు) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి వెనుక ఒంటెపై కూర్చుని ఉన్నారు. ఇంతలోనే 'ఖస్అమ్' అనే తెగకు చెందిన ఒక అందమైన స్త్రీ అక్కడకు వచ్చింది. ఫజల్ ఆ స్త్రీ వైపు తదేక దృష్టితో చూడసాగారు. ఆ స్త్రీ కూడా ఫజల్‌ను తదేక దృష్టితో చూడసాగింది. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫజల్ ముఖాన్ని మరొక వైపునకు మరలించారు. అప్పుడు ఆ మహిళ ఇలా అన్నది; 'ఓ దైవప్రవక్తా(స)! అల్లాహ్ హజ్ యాత్రను తన దాసులపై విధిగా చేశాడు. ఆ సమయంలో నా తండ్రి గారు ముసలివారైపోయారు. బలహీనులై పోయారు. ఆయనగారు ఒంటెపై కూర్చునే స్థితిలో కూడా లేరు. కనుక నా తండ్రి గారి తరఫున నేను హజ్ యాత్రకు వెళ్ళవచ్చునా? ఆయన గారి విధిని నేను నిర్వహించవచ్చునా?' సమాధానంగా దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; 'అవును, నీవు నీ తండ్రిగారికి బదులుగా హజ్‌యాత్రకు వెళ్ళ వచ్చు.' ఈ సంఘటన హజ్జతుల్ విదా స ందర్భంగా జరిగింది.

## 2వ అధ్యాయం

హజ్జ్ సూరాలో కరుణామయుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; ప్రజలు నీ

వద్దకు ప్రతి సుదూర ప్రాంతం నుంచి కాలినడకనా, ఒంటెలపైనా ఎక్కి రావాలని, వచ్చి వారు తమ కొరకు ఇక్కడ ఉంచబడిన ప్రయోజనాలను చూసుకోవాలని. అల్లాహ్ వారికి ప్రసాదించిన పశువుల మీద కొన్ని నిర్ణీత దినాలలో ఆయన పేరు స్మరించాలి." (27, 28)

**590.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను చూశాను. అప్పుడు ఆయన(స) గారు తన ఒంటె మీదకు జుల్‌హులైఫా వద్ద ఎక్కేవారు. అది నిటారుగా నిలబడినప్పుడు ఆయన(స)గారు లబ్బైక్ అని ఎలుగెత్తి పలికేవారు.'

**591.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుల్‌హులైఫా నుంచి ఇహ్రామ్‌ను ధరించే వారు. అప్పుడు ఆయన(స) గారు అధిరోహించిన ఒంటె నిటారుగా నిలబడి ఉంది.' ఈ హదీసును హజ్రత్ అనస్(ర), ఇబ్నె అబ్బాస్(ర) ఉభయులు ఉల్లేఖించారు.

## 3వ అధ్యాయం

### ఒంటె జీనుపై ఎక్కి హజ్జ్ యాత్రకు పోవుట.

హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఆమె(ర)గారి సోదరుడైన అబ్దుర్రహ్మాన్‌ను ఆమె(ర)గారితో పంపారు. అతను తన్‌యీమ్ నుంచి ఆమె గారిని ఉమ్రాకు తీసుకువెళ్ళారు. ఆమె(ర) గారిని అబ్దుర్రహ్మాన్(ర) ఒంటె జీనుపై తన వెనుక కూర్చోబెట్టుకున్నారు. హజ్రత్ ఉమర్(ర) ఇలా సెలవిచ్చారు; 'హజ్జ్ యాత్రలో ఒంటెపై జీను కట్టుకోండి. హజ్జ్ యాత్ర కూడా ఒక విధమైన ధర్మపోరాటమే (జిహాద్‌యే).'

**592.** సుమామా బిన్ అబ్దుల్లా బిన్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ అనస్(ర) ఒంటె జీనుపై గంత వేసి దానిపై ఎక్కి హజ్జ్ యాత్ర చేశారు. ఆయన గారు పిసినారి మనిషేమీ కారు. ఆయన(ర) ఇలా అన్నారు; 'దైవప్రవక్త(స) గారు కూడా ఒంటె జీనుపై స్వారీ చేసి హజ్జ్ యాత్ర చేశారు. దానిమీదనే ఆయన(స) తన సామానును కూడా తీసుకువెళ్ళారు.'

**593.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా అన్నారని ఖాసిమ్ బిన్ ముహమ్మద్ ఉల్లేఖించారు; 'ఓ దైవప్రవక్తా(స)! మీరైతే ఉమ్రా కూడా చేసుకున్నారు. నేను ఉమ్రా చెయ్యలేదు.' అప్పుడు దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు; 'ఓ అబ్దుర్రహ్మాన్! నీ సోదరిని తీసుకుపో. తన్యీమ్ నుంచి ఆమెకు ఉమ్రా చేయించు.' అబ్దుర్రహ్మాన్ ఆమె(ర) గారిని ఒంటెపై తన వెనుకభాగంలో కూర్చోబెట్టుకున్నారు. ఆమె(ర)గారు ఉమ్రా చేశారు.

## 4వ అధ్యాయం

## స్వీకృతి పొందిన హజ్జ్ యొక్క ఔన్నత్యం

అంటే కేవలం అల్లాహ్ ప్రసన్నతను పొందే సంకల్పంతో చేసే హజ్ యాత్ర. ఇంకా దైవప్రవక్త(స) సంప్రదాయాల ప్రకారం చెయ్యబడే హజ్ యాత్ర, ఎలాంటి పాప కార్యాలు చెయ్యబడని హజ్ యాత్ర. ఇలాంటి హజ్ యాత్రే దైవస్వీకారానికి నోచుకుంటుంది.

**594.** హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఎవరో ఇలా అడిగారు; 'మనిషి చేసే పనుల్లోకెల్లా ఏ పని అత్యంత శ్రేష్టమైనది?' ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'అల్లాహ్ను, ఆయన ప్రవక్తను విశ్వసించటం.' దాని తరువాత ఏ పని శ్రేష్టమైనది? అని అడిగారు. దైవప్రవక్త(స) ఇలా అన్నారు; 'అల్లాహ్ మార్గంలో జిహాద్ చెయ్యటం.' ఆ తరువాతనో? అని మరొక ప్రశ్న అడిగారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'మఖ్బూల్ హజ్ యాత్ర.'

**595.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా సిద్దీఖా (ర) ఇలా ఉల్లేఖించారు; నేను ఇలా విన్నవించుకున్నాను. 'ఓ దైవప్రవక్తా(స)! అన్ని సత్కార్యాల్లోకెల్లా జిహాద్ ఉత్తమమైన సత్కార్యమని మాకు తెలుసు. కనుక మేము జిహాద్ చెయ్యవచ్చునా?' అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'వద్దు, మీరు జిహాద్ చెయ్యకూడదు. స్త్రీల కోసం ఉత్తమమైన జిహాద్ 'హజ్జె మబ్రూర్'.

**596.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను అని అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు. 'ఎవరైతే అల్లాహ్ ప్రసన్నతను

పొందే సంకల్పంతో హజ్ యాత్ర చేస్తాడో, హజ్‌యాత్రలో ఉన్నప్పుడు కామవాంఛ లకు దూరంగా ఉంటాడో, ఇంకా పాపపు మాటలకు, చేష్టలకు పాల్పడడో, అప్పుడు అతడు పవిత్రుడుగా, పరిశుద్ధుడుగా ఇంటికి తిరిగి వస్తాడు, అతనికి తన తల్లి 'జన్మ నిచ్చిన రోజున పరిశుద్ధుడుగా ఉన్నట్లుగా'.

## 5వ అధ్యాయం

### హజ్జ్ కోసం, ఉమ్రా కోసం మీఖాతులు

మీఖాతులు అంటే హజ్జ్ కోసం, ఉమ్రా కోసం ఇహ్రామ్‌ను ధరించే స్థలాలు

**597.** జైద్ బిన్ జుబైర్ ఇలా ఉల్లేఖించారు; "అబ్దుల్లా బిన్ ఉమర్(ర)ను చూసే ఉద్దేశ్యంతో నేను ఆయన గారి ఇంటికి వెళ్ళాను. ఆయన గారి ఇంట్లో ఎన్నో గుడారాలు వేయబడి ఉన్నాయి. అవి నూలు వస్త్రాలతో తయారు చెయ్యబడ్డాయి. నేను ఆయన గారిని ఉమ్రా కోసం వెళ్ళే మనిషి ఏ స్థలంలో ఇహ్రామ్‌ను ధరించాలి? అని అడిగాను. ఆయన గారు ఇలా సమాధానం చెప్పారు: 'దైవప్రవక్త(స) ఇలా నిర్ణయించారు; ఖర్న్ స్థలాన్ని నజద్‌వాసుల కోసం, జుల్ హులైఫాను మదీనా ప్రజల కోసం, అల్ జుహ్ఫాను సిరియా ప్రజల కోసం."

## 6వ అధ్యాయం

**దివ్యఖుర్ఆన్‌లోని బఖరా సూరాలో (2: 197) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'హజ్జ్ యాత్ర కోసం ప్రయాణ సామాగ్రిని తీసుకెళ్ళండి. భయభక్తులు అన్నిటికంటే ఉత్తమమైన సామగ్రి. కనుక వివేకవంతులారా! నాకు అవిధేయత చూపకండి.'**

**598.** ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించారు. ఆయన ఇలా అన్నారు : యమన్ దేశ ప్రజలు హజ్ యాత్రకు వెళుతూ ఉండేవారు. ఆహార సామగ్రిని వారు తమతో తీసుకుపోయేవారు కాదు. వారు ఇలా అనేవారు, 'మేము అల్లాహ్‌ను నమ్ముకున్నాము. మేము అల్లాహ్ మీదనే ఆధారపడతాము.' కాని మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు, ప్రజల్ని భిక్షం పెట్టమని బ్రతిమాలుకునేవారు. అప్పుడు, ఆ సమయంలో అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు. 'ఆహార సామగ్రిని మీతోపాటు తీసుకు వెళ్ళండి. మంచి సామగ్రి ఏమిటంటే, మనిషి 'భిక్షాందేహి' అని అడగకుండా తనను కాపాడుకోవటం.'

## 7వ అధ్యాయం

**మక్కావాసులు హజ్, ఉమ్రాలకు సంబంధించిన ఇహ్రామ్‌ను ఏ స్థలం నుండి ధరించాలి?**

**599.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు ఆయన ఇలా అన్నారు "దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మదీనా వాసుల కోసం ఇహ్రామ్ కట్టుకునే స్థలాన్ని జుల్‌హులైఫాగానూ, సిరియావాసుల కోసం జుహ్ఫా గానూ, నజ్ద్ ప్రజల కోసం ఖర్నుల్ మనాజిల్‌గానూ, యమన్ ప్రజల కోసం యలమ్‌లమ్‌గానూ నిర్ణయించారు. ఈ స్థలం స్వయంగా ఆ దేశ ప్రజలకు కూడా వర్తిస్తుంది. ఇంకా వారి దేశం మీదుగా ప్రయాణం చేసే అన్య దేశాల వారికి కూడా వర్తిస్తుంది. అయితే వారు హజ్జ్ కోసం, ఉమ్రా కోసం వెళ్ళే సంకల్పం చేసుకుని ఉండాలి. ఇంకా ఈ సరిహద్దుల్లో నివసించే వ్యక్తి ఎవరైనా ఉంటే, అతను తాను బయలుదేరే స్థలం నుంచే ఇహ్రామ్‌ను ధరించాలి. మక్కావారు మాత్రం మక్కా నుంచే ఇహ్రామ్‌ను ధరించాలి."

## 8వ అధ్యాయం

**మదీనా పట్టణవాసుల కోసం మీఖాత్, మదీనా ప్రజలు జుల్‌హులైఫాకు చేరక మునుపే ఇహ్రామ్ ధరించ కూడదు.**

**600.** నాఫె ఉల్లేఖించారు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు "దైవ ప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; మదీనా పట్టణవాసులు జుల్ హులైఫా నుంచి ఇహ్రామ్‌ను ధరించాలి. సిరియా దేశ ప్రజలు అల్ జుహ్ఫా నుంచి ఇహ్రామ్‌ను కట్టుకోవాలి. నజ్ద్ ప్రదేశానికి చెందిన ప్రజలు ఖర్నుల్ మనాజిల్ నుంచి ఇహ్రామ్ ధరించాలి. ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు, 'ప్రజలు ఇలా అనేవారు, యమన్ దేశ ప్రజలు యలమ్‌లమ్ నుంచి ఇహ్రామ్ ధరించాలి అని దైవప్రవక్త(స) సెలవిచ్చినట్లు నాకు సమాచారం అందింది.'

## 9వ అధ్యాయం

**సిరియా దేశానికి చెందిన ప్రజలు ఎక్కడ నుంచి ఇహ్రామ్‌ను ధరించాలి? అనే విషయం గురించి.**

**601.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు– "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మదీనా పట్టణవాసుల కోసం జుల్‌హులైఫాను మీఖాత్‌గా నిర్ణయిం

చారు. సిరియా ప్రజల కోసం జుహ్ఫాను మీఖాత్ గా నిర్ణయించారు. నజ్ద్ దేశ వాసుల కోసం ఖర్నుల్‌మనాజిల్‌ను మీఖాత్‌గా నిర్ణయించారు. యమన్ దేశవాసుల కోసం యలమ్‌లమ్‌ను మీఖాత్‌గా నిర్ణయించారు. ఈ స్థలం ఆ దేశ ప్రజల కోసం కూడా మీఖాత్‌గా వర్తిస్తుంది. ఇంకా అన్య దేశాల వారెవరైనా వారి మీదుగా ప్రయాణం చేస్తే వారికి కూడా వర్తిస్తుంది. అయితే వారు హజ్జ్ కోసం గాని లేక ఉమ్రా కోసంగాని సంకల్పం చేసుకుని ఉండాలి. ఎవరైతే వారికి ఇరువైపులా నివాసం ఏర్పరుచుకున్నారో వారు తమ ఇళ్ళల్లోనుంచే ఇహ్రామ్‌ను ధరించి బయలుదేరాలి. ఇదే విధంగా మక్కా పట్టణ ప్రజలు మక్కా పట్టణం నుంచే ఇహ్రామ్‌ను కట్టుకుని బయలుదేరాలి."

## 10వ అధ్యాయం

### నజ్ద్ దేశ ప్రజలు ఏ స్థలం నుంచి ఇహ్రామ్‌ను ధరించాలి? అనే విషయం గురించి.

**602.** సాలిమ్ తన తండ్రి గారి నుంచి ఉల్లేఖించారు; ఆయన ఇలాఅన్నారు; "దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) **603**వ హదీసులో పేర్కొన్న విధంగానే మీఖాతులను నిర్ణయించారు."

**603.** సాలిమ్ బిన్ అబ్దుల్లా తన తండ్రి గారి నుంచి ఇలా ఉల్లేఖించారు; దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను ఆలకించాను. మదీనా పురవాసుల కోసం జుల్ హులైఫా మీఖాత్‌గా ఉంటుంది. సిరియా ప్రజల కోసం జుహ్ఫా మీఖాత్‌గా ఉంటుంది. నజ్ద్ దేశవాసుల కోసం ఖర్న్ మీఖాత్‌గా ఉంటుంది. ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు; 'స్వయంగా నేను కూడా దైవ ప్రవక్త(స) గారు ఇలా అన్న విషయాన్ని వినలేదని ప్రజలు అన్నారు- యమన్ దేశవాసుల కోసం యలమ్‌లమ్ మీఖాత్‌గా ఉంటుందని.'

## 11వ అధ్యాయం

### మీఖాతుల లోపలి భాగాల్లో నివసించే ప్రజల కోసం మీఖాత్

**604.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుల్ హులైఫాను మదీనాపురవాసుల కోసం మీఖాత్‌గా నిర్ణయిం చారు. సిరియా ప్రజల కోసం అల్‌జుహ్ఫాను మీఖాత్‌గా నిర్ణయించారు, యమన్ దేశవాసుల కోసం యలమ్‌లమ్‌ను మీఖాత్‌గా నిర్ణయించారు, నజ్ద్ దేశ ప్రజల కోసం ఖర్న్‌ను మీఖాత్‌గా నిర్ణయించారు. ఈ మీఖాతులు ఆయా స్థలాలలో నివసించే ప్రజలకే

వర్తిస్తాయి. మరియు వారు గాక ఆ స్థలాల గుండా హజ్, ఉమ్రాలు చేసే సంకల్పంతో వచ్చేవారికి కూడా వర్తిస్తాయి. ఈ స్థలాల లోపల నివసించే ప్రజలు తమ తమ నివాస స్థలాలలో నుంచే ఇహ్రామ్‌ను ధరించాలి. మక్కా పట్టణవాసులు మాత్రం మక్కానుంచే ఇహ్రామ్‌ను ధరించాలి.'

## 12వ అధ్యాయం

### యమన్ ప్రజల కోసం 'మీఖాత్'

**605.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుల్ హులైఫాను మదీనాపుర ప్రజల కోసం మీఖాత్‌గా నిర్ణయించారు. సిరియా ప్రజల కోసం ఆయన అల్ జుహ్‌ఫాను మీఖాత్‌గా నిర్ణయించారు. ఖర్నుల్ మనాజిల్‌ను నజ్ద్ ప్రదేశ ప్రజల కోసం మీఖాత్‌గా నిర్ణయించారు. మరియు యమన్ దేశ జనుల కోసం యలమ్‌లమ్‌ను మీఖాత్‌గా నిర్ణయించారు. ఈ మీఖాతులు ఆ ప్రదేశాలలో నివసించే ప్రజలకు మాత్రమే వర్తిస్తాయి. వారు గాక హజ్ ఉమ్రాలు చేసే సంకల్పంతో ఈ ప్రదేశాల గుండా ప్రయాణం చేసేవారికి కూడా ఈ మీఖాతులే వర్తిస్తాయి. ఈ మీఖాతుల లోపలి భాగాలలో నివసించే ప్రజలు వారు బయలుదేరిన స్థలం నుంచే ఇహ్రామ్‌ను ధరించాలి. మక్కాపట్టణవాసులు మాత్రం మక్కా పట్టణం నుంచే ఇహ్రామ్‌ను కట్టుకోవాలి.'

## 13వ అధ్యాయం

### ఇరాఖ్ దేశ ప్రజల కోసం 'జాతె ఇర్‌ఖ్' మీఖాత్‌గా ఉంటుంది.

**606.** ఇబ్నె ఉమర్(రజి) ఇలా ఉల్లేఖించారు; బస్రా, కూఫా పట్టణాలు జయించబడినప్పుడు ప్రజలు హజ్రత్ ఉమర్(రజిఅన్) గారి వద్దకు వెళ్ళి ఇలా విన్నవించుకున్నారు: 'ఓ విశ్వాసుల నాయకుడా! దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నజ్ద్ ప్రజల కోసం ఖర్న్‌ను మీఖాత్‌గా నిర్ణయించారు. అది మేము ప్రయాణం చేసే మార్గానికి చాలా దూరంలో ఉంది. ఆ మార్గం మీదుగా ప్రయాణం చెయ్యటం బహు కష్టంతో కూడుకున్న పని.' అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు; 'ఖర్న్‌కు ఎదురుగా ఉన్నటువంటి మరొక స్థలాన్ని దేన్నయినా మీరు మీ మీఖాత్‌గా ఎన్నుకోండి. ఈ స్థలం మీరు ప్రయాణం చేసే మార్గానికి దగ్గర్లో ఉంటుంది.' కావున ఆయన (ర) జాతె ఇర్‌ఖ్‌ను వారి మీఖాత్‌గా నిర్ణయించారు.

## 14వ అధ్యాయం

**జుల్ హులైఫాలో ఇహ్రామ్ ధరించేటప్పుడు నమాజ్ చెయ్యటం.**

**607.** నాఫె ఉల్లేఖించారు; అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారని; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుల్‌హులైఫాలోని రాళ్ళ మైదానంలో తన ఒంటెను కూర్చొబెట్టారు, అక్కడ నమాజ్ చేశారు. (అంటే ఇహ్రామ్‌కు సంబంధించిన రెండు రకాతుల నమాజ్‌ను చేశారు). అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) కూడా అలాగే చేసేవారు.'

## 15వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) హజ్‌యాత్రకు వెళ్ళేటప్పుడు అష్ షజ్‌రా మార్గం గుండా ప్రయాణం చెయ్యటం.**

**608.** అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్ యాత్రకు వెళ్ళేటప్పుడు అష్ షజ్‌ర మార్గం నుంచి వెళ్ళేవారు. మరియు ముఅర్రస్ మార్గం నుండి తిరిగి వచ్చేవారు. దైవప్రవ్త మక్కా పట్టణానికి వెళ్ళినప్పుడల్లా ఆయన(స) అష్ షజ్‌రాలోని మసీదులో నమాజు చేసేవారు. తిరిగి వచ్చేటప్పుడు ఆయన(స)గారు లోయ మధ్యలో ఉన్న జుల్ హులైఫా వద్ద నమాజు చేసేవారు. రాత్రి అంతా ఆ మసీదులోనే. మరుసటి రోజు ఉదయం వరకు గడిపేవారు.'

## 16వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా అనటం గురించి, 'అఖీఖ్' లోయ ఒక శుభప్రదమైన లోయ.**

**609.** హజ్రత్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; అఖీఖ్ లోయలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను. 'ఈనాటి రాత్రి సమయంలో ఒక దైవదూత నా ప్రభువు సన్నిధి నుంచి నా వద్దకు వచ్చాడు. శుభప్రదమైన ఈ పర్వత లోయలో నమాజు చెయ్యమని నన్ను ఆజ్ఞాపిం చాడు. ఇంకా హజ్ కోసం, ఉమ్రా కోసం రెండింటిని కలిపి ఇక్కణ్ణే ఇహ్రామ్‌ను ధరించమని కూడా నన్ను ఆజ్ఞాపించాడు.'

**610.** మూసా బిన్ ఉఖబా ఇలా ఉల్లేఖించారు; సాలిమ్ బిన్ అబ్దుల్లా (ర) తన

తండ్రి గారి నుండి ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, 'కొండ లోయలోని క్రింది భాగంలో ఉన్నటువంటి జుల్ హులైఫాలోని ముఅర్రస్ వద్ద విశ్రాంతి తీసుకుంటూ ఉండగా నేను ఒక స్వప్నాన్ని చూశాను. అందులో నన్ను ఉద్దేశించి ఇలా హితబోధ చెయ్యటం జరిగింది. నీవు నిజంగానే ఒక శుభప్రదమైన కొండ లోయలో ఉన్నావు. అబ్దుల్లా ఎక్కడైతే తన ఒంటె మీద నుంచి కిందికి దిగారో అక్కణ్ణే, ఆ స్థలంలోనే సాలిమ్ మేము కూడా మా ఒంటెల మీది నుంచి దిగేలా చేశాడు. నేరుగా చూస్తే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) విశ్రాంతి తీసుకున్న స్థలం కూడా మాకు కనిపిస్తుంది. ఆ స్థలం లోయలోని మధ్యభాగంలో ఉన్నటువంటి మసీదు' దిగువ భాగంలో ఉన్నది. నివాస స్థలానికి, రహదారికి మధ్య.'

## 17వ అధ్యాయం

**ఇహ్రామ్ కోసం ధరించిన దుస్తులకు రాసిన సుగంధాన్ని మూడు సార్లు కడిగెయ్యటం గురించి.**

సుఫ్వాన్ బిన్ యాల ఉల్లేఖించారు : యాల ఉమర్ (ర) గారితో ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)పై దైవవాణి అవతరించేటప్పుడు ఆయన్ని (స) నాకు చూపించండి. దైవప్రవక్త(స) జారానాలో తన అనుచరులు కొందరితో కలిసి ఉన్నప్పుడు, అక్కడకు ఒక వ్యక్తి వచ్చి ఇలా అడిగాడు: ఓ దైవప్రవక్తా(స)! ఉమ్రా కోసం ఇహ్రామ్ ధరించిన మరియు తన దుస్తులకు సుగంధాన్ని రాసుకున్న వ్యక్తిని గురించి మీరేమంటారు? మీ అభిప్రాయమేమిటి? దైవప్రవక్త(స) గారు కొంచెం సేపు మౌన ముద్ర దాల్చారు. అప్పుడు ఆయన(స) గారిపై దైవవాణి అవతరించడం ప్రారంభ మయింది. హజ్రత్ ఉమర్(ర) యాలాను పిలిపించారు. ఆయన దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) గారిపై నలువైపుల నుంచి దుప్పటి కప్పబడి ఉంది. యాల తన శిరస్సును లోపలకు పెట్టిచూశాడు. దైవప్రవక్త(స) గారి ముఖం ఎర్రబారి పోయి ఉంది. ఆయన (స) గురకలు పెడుతున్నారు. ఆ పరిస్థితి తొలగి పోయిన తరువాత దైవప్రవక్త(స) ఉమ్రాను గురించి అడిగిన ఆ మనిషి ఏడి? ఎక్కడు న్నాడు? అతన్ని పిలవండి అని అన్నారు. ఆ వ్యక్తి (యాల)ని దైవప్రవక్త(స) గారి సన్నిధికి తీసుకురావటం జరిగింది. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు; "నీ శరీరానికి రాసుకున్న సుగంధాన్ని మూడుసార్లు కడిగెయ్యి. తరువాత నీవు ధరించిన వస్త్రాన్ని (చొక్కాను) తీసివెయ్యి. ఆ తరువాత హజ్‌లో చేసేవిధంగానే ఉమ్రాలో కూడా

చెయ్యి". ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు; నేను అతాను ఇలా అడిగాను, దైవప్రవక్త(స) మూడుసార్లు సుగంధాన్ని కడిగెయ్యాలని అతన్ని ఆజ్ఞాపించారు కదా! దాని అర్థం బాగా సంపూర్ణంగా, పరిశుభ్రంగా ఉండాలనేగా!' 'అవును' అని ఆయన సమాధానం చెప్పారు.

## 18వ అధ్యాయం

### ఇహ్రామ్ ధరించేటప్పుడు సుగంధాన్ని లేక అత్తరును రాసుకోవటం గురించి

ఇహ్రామ్‌ను గురించి సంకల్పించుకున్నప్పుడు బట్టలు ధరించాలి. తల దువ్వుకోవాలి, తలకు నూనె రాసుకోవాలి. ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలాఅన్నారు : ఇహ్రామ్ కట్టుకున్న వ్యక్తి సువాసన గల పువ్వులను ఆఘ్రాణించవచ్చు. అద్దంలో తన ముఖాన్ని చూసుకోవచ్చు. ఏ వస్తువులనైతే తినగలుగుతాడో ఆ వస్తువులను అంటే మంచి నూనె, నెయ్యి మొదలైన వాటిని తినవచ్చు. వాటిని మందుల్లో కూడా వాడవచ్చు. అతా ఇలా అన్నారు; ఉంగరాన్ని ధరించవచ్చు. హిమ్‌యాన్ (ఒక రకమైన బెల్టు)ను కట్టుకోవచ్చు. ఇబ్నెఉమర్ (రజిఅన్) ఇహ్రామ్ ధరించిన స్థితిలో తవాఫ్ చేశారు. ఆయన తన కడుపు మీద ఒక వస్త్రాన్ని కట్టుకుని ఉన్నారు. హజ్రత్ ఆయెషా(ర) తుబ్బాన్ (పొట్టి ట్రౌజర్లు)ను ధరించటాన్ని తప్పు పట్టలేదు. దాన్ని ధర్మసమ్మతమే అని అన్నారు.

**611.** సాద్ బిన్ జుబైర్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- 'అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇహ్రామ్ ధరించేటప్పుడు తల వెంట్రుకలకు మామూలు సాదా నూనె (సువాసన లేని నూనె)ను రాసుకునేవారు.' మన్‌జూర్ ఇలా అన్నారు- 'నేను ఈ విషయం గురించి ఇబ్రాహీమ్ నఖీకి తెలియజేశాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు- ఇబ్నె ఉమర్(రజిఅన్) చేసిన ఈ పనికి మనమేమి చెయ్యగలం. నాతోనైతే అస్వద్ ఈ విషయాన్ని గురించి చెప్పారు. ఆయన హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) నుంచి ఈ హదీసును తీసుకున్నారు ఆమె(ర)గారు ఇలా అన్నారు. 'నేను చూస్తూ ఉన్నాను, ఇహ్రామ్ ధరించిన స్థితిలో దైవప్రవక్త (స)గారి పాపిడిలో ఆయన(స) రాసుకున్న సుగంధం మెరుస్తూ ఉంది.'

**612.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ప్రియ సతీమణి హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా అన్నారు: 'ఇహ్రామ్ ధరించేటప్పుడు దైవప్రవక్త(స) గారికి స్వయంగా నేనే సువాసన రాసేదాన్ని. ఇదే విధంగా ఆయన(స) గారు ఇహ్రామ్

విప్పేటప్పుడు కూడా, తవాఫ్, జియారత్‌లు చేసేటప్పుడు కూడా నేనే ఆయన(స)గారికి సువాసన రాసేదాన్ని.'

## 19వ అధ్యాయం

### తల వెంట్రుకలను పేర్చి (కలిపి) ఇహ్రామ్ కట్టుకోవటం.

**613.** తన తండ్రి(ర) గారి నుంచి సాలిమ్ ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) తన తల వెంట్రుకలను పేర్చుకొని ఇహ్రామ్ కట్టుకునేవారు.'

## 20వ అధ్యాయం

### మదీనా పురవాసులు హజ్ లేక ఉమ్రా చెయ్యాలనే సంకల్పం కలవారు జుల్ హులైఫా వద్ద ఉన్న మసీదు దగ్గర ఇహ్రామ్ కట్టుకోవటం.

**614.** సాలిమ్ బిన్ అబ్దుల్లా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నా తండ్రి గారైన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అన్) ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను- ఆయన(ర) ఇలా అన్నారు, 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుల్ హులైఫా మసీదు వద్ద నుంచి ఇహ్రామ్ కట్టుకునేవారు. అంటే లబ్బైక్ అని ఎలుగెత్తి పలికేవారు.'

## 21వ అధ్యాయం

### ముహరిమ్ అయిన వ్యక్తి ఎలాంటి దుస్తులు ధరించ కూడదు?

**615.** అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు, ఒక మనిషి దైవ ప్రవక్త(స)గారిని ఇలా అడిగాడు: 'ఓ దైవప్రవక్తా(స)! ముహరిమ్ అయిన వ్యక్తి ఎలాంటి దుస్తులు ధరించాలి?" దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ఇలా సమాధానం పలికారు, 'అతను షర్టును ధరించకూడదు. టర్బన్‌ను, ట్రౌజర్లను, తలపాగాను, లెదర్ సాక్సులను ధరించ కూడదు. స్లిప్పర్లు లభించకపోతే చర్మపు సాక్సులను, చీలమండను కప్పివేసే భాగాన్ని కత్తిరించిన తరువాత ధరించవచ్చు. ఇంకా అతను జాఫరాన్ గాని లేక వర్స్ లాంటి సెంటులను రాసిన దుస్తులు కూడా ధరించకూడదు.'

## 22వ అధ్యాయం

### వాహనంపై హజ్ చెయ్యటం. మరియు వాహనంపై ఎవరితోనైనా కూర్చోవటం ధర్మసమ్మతమైన విషయమే.

**616.** ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారని ఉబైదుల్లా బిన్ అబ్దుల్లా ఉల్లేఖించారు: ఉసామా బిన్ జైద్ (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారితో కలిసి ఒకే వాహనంపై కూర్చుని అరఫాత్ నుంచి ముజ్దలిఫా వరకు ప్రయాణం చేశారు. తరువాత ముజ్దలిఫా నుంచి మినా వరకు దైవప్రవక్త(స)గారు ఫజల్ బిన్ అబ్బాస్ (రజిఅన్)ను తన వెనుక కూర్చోబెట్టుకున్నారు. ఆ తరువాత ఆ ఇద్దరినీ కూర్చోబెట్టుకున్నారు. ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స) జమ్రతుల్ అఖబాకు చేరుకుని కంకర రాళ్ళు విసిరేవరకు ఎడతెగకుండా లబ్బైక్ (తల్బియా) పఠిస్తూనే పోయారు.

## 23వ అధ్యాయం

ఒక ముహ్రిమ్ దుప్పటి, తహ్బన్ద్ (లుంగి) ఇంకా ఎలాంటి వస్త్రాలను ధరించవచ్చు. హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇహ్రామ్ కట్టుకున్న స్థితిలో కుసుమ్‌తో అద్దబడిన వస్త్రాలను ధరించారు. ఆమె(ర)గారు ఇలా సెలవిచ్చారు: 'ఒక స్త్రీ ఇహ్రామ్ ధరించిన స్థితిలో ఉన్నప్పుడు ఆమె తన పెదాలను కొరుక్కోరాదు. తన ముఖం మీద బురఖా వేసుకోరాదు. వరస్ (ఒకవిధమైన సుగంధ ద్రవ్యం) లేక జాఫ్రాన్ రాసి ఉన్న బట్టలను ధరించరాదు. జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ ఇలా అన్నారు: 'కుసుమ్‌ను నేను ఒక సుగంధ ద్రవ్యంగా భావించను.' హజ్రత్ ఆయెషా(రజిఅన్) ఇలా సెలవిచ్చారు- 'ఒక స్త్రీ ఇహ్రామ్ ధరించి ఉన్నప్పుడు ఆభరణాలు, నల్లని వస్త్రాలు, గులాబీ రంగు వస్త్రాలు, మేజోళ్ళు ధరించవచ్చు. ఇబ్రాహీమ్ నఖి ఇలా అన్నారు : 'ఒక ముహ్రిమ్ ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు తన బట్టలను మార్చుకోవచ్చు.'

**617.** అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన(ర) గారు ఇలా అన్నారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్జతుల్‌విదాలో పాల్గొనే ఉద్దేశ్యంతో మదీనా పురం నుంచి బయల్దేరారు. అప్పుడు ఆయన(స) తలవెంట్రుకలకు నూనె రాసుకున్నారు, తల దువ్వుకున్నారు. (అది జొహర్, అసర్ నమాజ్‌ల మధ్య కాలం, శనివారం రోజు). తన 'తహెబన్ద్'ను కట్టుకున్నారు, దుప్పటిని కప్పుకున్నారు. ఆయన(స) గారి సహచరులు కూడా తమ తమ తహెబన్ద్‌లను కట్టుకున్నారు. తమ తమ దుప్పట్లను కప్పుకున్నారు. దైవప్రవక్త(స) దుప్పట్లను తహెబన్ద్‌లను పూర్తిగా నిషేధించలేదు. కాని జాఫ్రాన్‌తో అద్దబడిన వస్త్రాలను మటుకు ఆయన(స) గారు నిషేధించారు. అంటే జాఫ్రాన్ శరీరానికి అతుక్కుపోయి ఉండరాదు. ఉదయం పూట

ఆయన(స) గారు జుల్ హులైఫా నుంచి తన ఒంటెపై బయలుదేరారు. ఆ ఒంటె ఆయన(స)గారిని తీసుకుని జైదా అనే ప్రాంతానికి చేరుకుంది. అప్పుడు ఆయన(స) గారు మరియు ఆయన(స) గారి సహచరులు ఇహ్రామ్‌ను ధరించారు. 'లబ్బైక్ లబ్బైక్' అని ఎలుగెత్తి పలికారు. ఒంటెల మెడల్లో దండలు వేశారు. అప్పుడు జీఖాయెద మాసానికి చెందిన నాలుగు రోజులు ఇంకా మిగిలి ఉన్నాయి. దైవప్రవక్త(స) మక్కా పట్టణంలోకి ప్రవేశించినప్పుడు జిల్‌హజ్జకు చెందిన నాలుగు రోజులు గడిచి పోయాయి. ఆదివారం నాడు ఉదయం సమయంలో ఆయన (స) కాబా గృహ ప్రదక్షిణం చేశారు, సఫా మర్వాల మధ్య పరుగులు తీశారు. ఆయన(స) గారు ఖుర్బానీ ఒంటెను తనతో తీసుకువచ్చారు కాబట్టి వాటి మెడల్లో దండలు వేశారు. ఈ కారణం వల్ల ఇహ్రామ్ తీసివెయ్యలేదు. దైవప్రవక్త (స)గారు మక్కాలోని ఎత్తైన ప్రదేశంలో ఉన్నటువంటి హుజూన్ కొండ దగ్గర దిగిపోయారు. హజ్‌కు చెందిన ఇహ్రామ్‌ను ఆయన(స) ధరించే ఉన్నారు. తవాఫ్ చేసిన తరువాత ఆయన(స) మళ్ళీ కాబా వద్దకు వెళ్ళలేదు. చివరకు అరఫాత్ నుంచే మరలిపోయారు. ఆయన(స)గారు తన సహచరు లకు ఈ ఆజ్ఞను జారీ చేశారు: 'కాబా గృహం సఫా మర్వాల ప్రదక్షిణ చేసి తమ తలవెంట్రుకలను కత్తిరింపజేసుకోవాలనీ, ఇహ్రామ్‌ను విప్పివేయాలని.' కాని ఈ ఆజ్ఞను తమ వెంట ఖుర్బానీ ఒంటెలను కలిగిలేని వారికి మాత్రమే వర్తింపజేశారు. ఇంకా ఏ ఒంటెల మెడల్లోనైతే దండలు వేయబడ్డాయో ఆ ఒంటెలను కలిగివున్న వారికి కూడా. ఇంకా ఎవరితోపాటైతే వారి భార్యలు ఉన్నారో వారికి తమ భార్యలతో కలిసే అనుమతిని కూడా ఇచ్చారు. ఇంకా సువాసనను రాసుకునే, బట్టలు ధరించే మొద లైన విషయాలన్నీ ధర్మసమ్మతమే అని తెలియజేశారు.

## 24వ అధ్యాయం

**(మదీనా నుంచి బయలుదేరి) జుల్ హులైఫాలో ఉదయం వరకు ఆగటం. ఈ విషయాన్ని ఇబ్నె ఉమర్ (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నుంచి విని ఉల్లేఖించారు.**

**618.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన(ర) ఇలా అన్నారు– "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మదీనాపురంలో నాలుగు రకాతుల జొహర్ నమాజును చేశారు. జుల్‌హులైఫాకు చేరిన తరువాత రెండు రకాతుల అసర్ నమాజును చేశారు. తరువాత రాత్రి అంతా అక్కడే ఉండి పోయారు. ఉదయం

కాగానే జుల్‌హులైఫా నుంచి ఆయన(స) తన ఒంటెపైకి అధిరోహించారు. అప్పుడు ఆ ఒంటె ఆయన(స) గారిని తీసుకుని నిటారుగా నిలబడింది. అప్పుడు ఆయన(స) గారు 'లబ్బైక్' అని ఎలుగెత్తి పలికారు."

**619.** అబూ ఖిలాబ ఉల్లేఖించారు. ఆయన అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) నుంచి విన్నారు. ఆయన(ర) ఇలా అన్నారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మదీనాపురంలో జొహర్‌కు చెందిన నాలుగు రకాతుల నమాజును చేశారు. జుల్ హులైఫాకు చేరుకుని అక్కడ అసర్‌కు చెందిన రెండు రకాతుల నమాజ్‌ను చేశారు. (అక్కడకు చేరుకుని ఖసర్‌ను ప్రారంభించారు). అబూ ఖిలాబ ఇలా అన్నారు దైవప్రవక్త(స) గారు ఆ రాత్రి అంతా జుల్ హులైఫాలోనే గడిపారు. ఉదయం అయ్యే వరకు.'

## 25వ అధ్యాయం

## 'లబ్బైక్'ను కంఠస్వరాన్ని పెంచి పలకటం.

**620.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన(ర) ఇలా అన్నారు- "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మదీనాపురంలో జొహర్‌కు చెందిన నాలుగు రకాతుల నమాజును చేశారు. జుల్‌హులైఫాలో అసర్‌కు చెందిన రెండు రకాతుల నమాజును చేశారు. ప్రజలు హజ్‌లోనూ, ఉమ్రాలోనూ రెండింటి లోనూ తల్బియాను ఎలుగెత్తి బిగ్గరగా పలికారు" అని నేను విన్నాను.

## 26వ అధ్యాయం

## లబ్బైక్‌ను గురించి.

**621.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు- దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఈ విధంగా లబ్బైక్‌ను పలికేవారు, 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్. లబ్బైక లాషరీక లక లబ్బైక్. ఇన్నల్ హమ్‌ద వన్నిఅమత లక వల్ ముల్క్. లాషరీక లక్' "నేను హాజరయ్యాను, ఓ అల్లాహ్! హాజరయ్యాను, నేను హాజరయ్యాను. నీకు సరితూగేవాడెవ్వడూ లేడు. నీకు భాగస్వామి ఎవ్వడూ లేడు. నేను హాజరవు తున్నాను. స్తోత్రాలన్నీ నీకే తగును. వరప్రసాదాలన్నీ నీవు ప్రసాదించినవే. రాజ్యాధికారమంతా నీకే యోగ్యమైనది. నీకు సరితూగే వాడెవ్వడూలేడు".

**622.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఉల్లేఖించారు: ఆమె (ర)గారు ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఏ విధంగా లబ్బైక్‌ను పలికే

వారో నాకు తెలుసు. ఆయన(స) ఇలా పలికేవారు 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్. లబ్బైక లా షరీక లక లబ్బైక్. ఇన్నల్ హమ్‌ద వన్ని అమత లక వల్‌ముల్క్ లా షరీకలక్'

## 27వ అధ్యాయం

**ఇహ్రామ్‌ను ధరించి ప్రయాణ పశువుపైకి ఎక్కే సమ యంలో లబ్బైక్ పలికే ముందు 'అల్‌హమ్దులిల్లాహ్', 'సుబ్‌హానల్లాహ్', 'అల్లాహు అక్బర్' అని పలకటం.**

**623.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారు మదీనాపురంలో నాలుగు రకాతుల జొహర్ నమాజును చేశారు. అప్పుడు మేము ఆయన(స) గారితో ఉన్నాము. జుల్‌హులైఫాకు చేరిన తరువాత రెండు రకాతుల అసర్ నమాజును చేశాము. తరువాత రాత్రంతా అక్కడే గడిపాము. ఉదయం అక్కణ్ణుంచి బయలుదేరాము. అప్పుడు దైవప్రవక్త(స)గారి ఒంటె బయ్‌దాకు చేరుకుంది. ఆయన(స)గారు 'అల్‌హమ్దులిల్లాహ్', 'సుబ్‌హానల్లాహ్', 'అల్లాహు అక్బర్' అని పలికారు. ఆ తరువాత హజ్, ఉమ్రాలు రెండింటికీ సంబంధించిన లబ్బైక్‌ను తన కంఠస్వరాన్ని పెంచి పలికారు. ఆయన (స) గారితో ఉన్న జనులందరూ అలానే చేశారు. (అంటే ఖిరాన్ చేశారు) మేము మక్కా మహా నగరానికి చేరుకున్నప్పుడు ఆయన(స)గారు ప్రజలకు ఇహ్రామ్ విప్పివేయవలసిందని ఆజ్ఞాపించారు. జనులందరూ అలాగే చేశారు. ఆ తరువాత జిల్‌హజ్జ ఎనిమిదవ తేదీన హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారు. అనస్ (రజిఅన్) ఇలా అన్నారు– "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) పవిత్ర హజ్ కార్యాన్ని ముగించిన తరువాత ఒంటెలను నిలబెట్టి తన పవిత్ర హస్తాలతో ఖుర్బానీ (నహర్) చేశారు. మరియు మదీనాపురంలో (ఈదుల్ అజ్‌హా రోజున) ఆయన(స)గారు కొమ్ములు కలిగివున్న రెండు పొట్టేళ్ళను ఒకటి నల్లనిది, రెండోది తెల్లనిది - అల్లాహ్ పేరుతో ఖుర్బానీ చేశారు."

## 28వ అధ్యాయం

**వాహనం నిటారుగా నిలబడినప్పుడు లబైక్ పలకటం.**

**624.** హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒంటె ఆయన (స) గారిని ఎక్కించుకుని నిటారుగా నిలబడినప్పుడు 'లబ్బైక్' పలికారు.'

## 29వ అధ్యాయం

ఖిబ్లా వైపునకు ముఖం త్రిప్పి తల్బియా పఠించటం. నాఫె ఇలా ఉల్లేఖించారు: 'ఇబ్నె ఉమర్ (రజిఅన్) తన ఫజర్ నమాజును జుల్‌హులైఫా వద్ద చేసి నప్పుడల్లా ఆయన తన సవారీని సన్నద్ధంగా ఉంచేవారు. తరువాత ఆయన(ర) దాని పైకి ఎక్కి జీను మీద కూర్చుండేవారు. సవారీపైకి ఎక్కి కూర్చుండేటప్పుడు ఆయన(ర) తన ముఖాన్ని కాబా వైపునకు త్రిప్పేవారు. ఆయన(ర) కాబా గృహ పొలి మేరకు చేరుకునేవరకు తల్బియాను ఎలుగెత్తి పఠిస్తూ ఉండేవారు. మక్కాకు సమీపంలోఉన్న జీతువాకు చేరిన తరువాత తల్బియా పఠనాన్ని ఆపి వేసేవారు. అక్కడ రాత్రి అంతా ఉదయం అయ్యే వరకు గడిపేవారు. ఫజర్ నమాజును ముగించిన తరువాత ఆయన స్నానం చేసేవారు. దైవప్రవక్త(స) ఇలానే చేసేవారని ఆయన(ర) ధ్రువీకరించారు.'

**625.** నాఫె ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు, 'అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) హజ్ కోసం గాని లేక ఉమ్రా కోసం గాని మక్కాకు వెళ్ళాలని సంకల్పించు కున్నప్పుడు సువాసనలేని నూనెను తన శరీరానికి రాసుకునేవారు. తరువాత జుల్‌హులైఫాలోని మసీదుకు వచ్చేవారు. ఆ మసీదులో ఉదయం పూట నమాజును చేసేవారు. ఆ తరువాత తన ఒంటెమీద కూర్చునేవారు. ఆ ఒంటె ఆయన గారిని ఎక్కించుకుని నిటారుగా నిలబడినప్పుడు ఇహ్రామ్‌ను ధరించేవారు.' ఆయన(ర) ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కూడా ఇలాగే చేస్తూ ఉండగా నేను చూశాను.'

## 30వ అధ్యాయం

**ఒక ముహ్‌రిమ్ ఎవరైనా కాలువలోకి దిగినట్లయితే, అతను లబ్బైక్ పఠించాలి.**

**626.** ముజాహిద్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు 'మేము ఒకసారి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర) గారి వద్ద కూర్చొని ఉన్నాము. ఆ సమావేశంలో పాల్గొన్నవారు కొందరు దజ్జాల్‌ను గురించి ప్రస్తావించారు.' మరియు దైవప్రవక్త(స) గారు అతన్ని గురించి ఇలా సెలవిచ్చారని కూడా వారు అన్నారు "అతని రెండు కళ్ళ మధ్య కాఫిర్ (అవిశ్వాసి) అని వ్రాయబడి ఉంటుంది". అప్పుడు ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారు : 'దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిస్తూ ఉండగా నేనైతే వినలేదు. అయితే ఆయన(స) గారు ఇలా అన్నారు- 'నేను మూసా (అ)ను చూస్తూ ఉన్నాను. అప్పుడు ఆయన కాలువలోకి దిగుతూ ఉన్నారు. దిగుతూ దిగుతూ లబ్బైక్ పఠిస్తూ ఉన్నారు.'

## 31వ అధ్యాయం

## బహిష్టు అయిన మహిళ మరియు ప్రసవించిన మహిళ- వీరు ఉభయులూ ఇహ్రామ్‌ను ఎలా ధరించాలి?

**627.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా(ర) ఉల్లేఖించారు: ఆమె గారు ఇలా అన్నారు– 'మేము హజ్జతుల్ విదాలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి పాల్గొన్నాము. (మదీనా పురం నుంచి మక్కా నగరానికి మేమందరం బయలుదేరాము.) మేము ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించాము. తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు 'ఎవరి వద్దనైతే ఖుర్బానీ పశువు ఉన్నదో వారు హజ్‌తోపాటు ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను కూడా ధరించాలి. ఈ రెండింటినీ పూర్తి చేయనంతవరకు వారు ఇహ్రామ్‌ను విప్పివెయ్యకూడదు. నేను మక్కా నగరానికి చేరుకున్నప్పుడు బహిష్టు అయ్యాను. అప్పటికి నేను బైతుల్లాహ్ ప్రదక్షిణమూ చెయ్యలేదు, సఫా మర్వాల మధ్య తవాఫ్ కూడా చెయ్యలేదు. నేను నా ఈ నిస్సహాయతను గురించి దైవప్రవక్త(స) గారికి విన్నవించుకున్నాను.' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'తలవెంట్రుకల్ని విప్పివెయ్యి. దువ్వెనతో తల దువ్వుకో హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించు. ఉమ్రాను విడిచిపెట్టు.' నేను దైవ ప్రవక్త(స)గారు చెప్పినట్లుగానే చేశాను. అప్పుడు మేము హజ్‌ను పూర్తిచేశాము. దైవ ప్రవక్త(స) అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్(ర)ను నాకు తోడుగా ఇచ్చి నన్ను తన్ఈమ్‌కు పంపారు. నేను అక్కణ్ణుంచి ఉమ్రా చేశాను. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'ఈ ఉమ్రా ఆ ఉమ్రాకు బదులుగా చెయ్యబడిన ఉమ్రా.' హజ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారు: 'కనుక ఎవరైతే ఉమ్రాకు చెందిన ఇహ్రామ్‌ను కట్టుకున్నారో వారు బైతుల్లా మరియు సఫా మర్వాల తవాఫ్ చేసి ఇహ్రామ్‌ను విప్పివేశారు. తరువాత మినా నుంచి తిరిగి వచ్చిన పిదప రెండో తవాఫ్ అంటే, తవాఫె జియారత్ చేశారు. ఎవరైతే హజ్ ఉమ్రాలు రెండింటికీ సంకల్పం చేసుకున్నారో వారు ఒకే తవాఫ్‌ను అంటే తవాఫె జియారత్ చేశారు.'

## 32వ అధ్యాయం

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి సన్నిధిలో ఇహ్రామ్‌లో ఉన్న స్థితిలో ఎవడైతే ఇలా సంకల్పం చేసుకున్నాడో, ఏ సంకల్పాన్నయితే దైవ ప్రవక్త (స) గారు చేసుకున్నారో ఆ సంకల్పం లాంటి సంకల్పాన్ని ఇబ్నెఉమర్ (రజిఅన్) దైవ ప్రవక్త(స) గారినుంచి ఉల్లేఖించారు.

**628.** జాబిర్ (రజిఅన్) ఇలా అన్నారని అతా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(సఅసమ్) హజ్రత్ అలీ(ర)ను తన ఇహ్రామ్‌పై స్థిరంగా ఉండా లని ఆజ్ఞాపించారు. తరువాత అతా సురాఖ బిన్ మాలిక్ గారి సూక్తిని ఉటంకించారు.'

**629.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- హజ్రత్ అలీ(రజిఅన్) యమన్ నుంచి (మక్కా నగరానికి) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి వద్దకు వచ్చారు. దైవప్రవక్త(స) ఆయన(ర) గారిని ఇలా అడిగారు- 'నీవు ఏ ఇహ్రామ్‌ను ధరించావు?' ఆయన(ర) గారు ఇలా అన్నారు : 'మీరు (స) ఏ ఇహ్రామ్‌నైతే ధరించమని ఆదేశించారో నేను ఆ ఇహ్రామ్‌నే ధరించాను.' దైవప్రవక్త(స)ఇలా సెలవిచ్చారు: 'నాతోనైతే ఖుర్బానీ పశువు ఉన్నది. లేకపోతే నేను ఇహ్రామ్‌ను విప్పివేసేవాడనే. ముహమ్మద్ బిన్ బకర్ ఇబ్నె జురైజ్ నుంచి ఇలా ఉల్లేఖిం చారు- దైవప్రవక్త (స) హజ్రత్ అలీ(ర)ను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు : 'నీవు ధరిం చిన ఇహ్రామ్ దేనికి చెందినది?' ఆయన(ర) ఇలా అన్నారు, 'నేను ఎలుగెత్తి ఇలా అన్నాను దైవప్రవక్త(స)గారు ఏ ఇహ్రామ్‌నైతే ధరించారో ఆ ఇహ్రామ్‌నే నేను కూడా ధరించాను.' అప్పుడు దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు 'ఖుర్బానీ ఇవ్వు. ఇప్పుడు ఉన్నట్లుగానే ఇహ్రామ్‌లో ఉండు.

**630.** హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజిఅన్) ఉల్లేఖించారు 'ఆయన (ర) ఇలా అన్నారు- దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నన్ను యమన్‌లోని నా జాతి ప్రజల వైపునకు పంపారు. నేను యమన్ నుంచి తిరిగివచ్చాను. ఆ సమయంలో దైవప్రవక్త(స)గారు బత్‌హాలో ఉన్నారు. (మక్కా నగరంలోని మైదానంలో)." ఆయన (స) ఇలా అడిగారు 'నీవు ఏ ఇహ్రామ్‌ను ధరించావు?' నేను ఇలా అన్నాను- 'దైవప్రవక్త(స) గారు ధరించిన ఇహ్రామ్‌నే నేను కూడా ధరించాను.' అప్పుడు ఆయన (స) గారు ఇలా అడిగారు, 'నీతోపాటు ఖుర్బానీ పశువు కూడా ఉన్నదా?' 'లేదు' అని నేను విన్నవించుకున్నాను. అప్పుడు ఆయన(స) గారు నన్ను ఇలా ఆజ్ఞాపించారు- 'బైతుల్లాహ్, సఫా, మర్వాల చుట్టూ తవాఫ్ చేసి ఇహ్రామ్‌ను విప్పివెయ్యి.' నేను ఆయన(స) గారి ఆజ్ఞానుసారమే చేశాను. తరువాత నేను మా తెగవారి వద్దకు వచ్చాను. అప్పుడు మా ఇంటి ఒక మహిళ తలవెంట్రుకలను దువ్వింది. లేక నాకు తలంటి స్నానం చేయించింది. తరువాత హజ్రత్ ఉమర్(ర) గారి కాలం వచ్చి నప్పుడు (ఆయన ఖలీఫా అయ్యారు) ఆయన (ర) ఇలా అన్నారు: 'మనం గనుక అల్లాహ్ గ్రంథం ప్రకారం నడిస్తే అది ఇలా ఆజ్ఞాపిస్తోంది: హజ్‌నూ, ఉమ్రాను పూర్తి

చెయ్యండి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: హజ్‌నూ, ఉమ్రాను పూర్తి చేయండి, దేవుని ప్రసన్నత కోసం. మనం గనక దైవప్రవక్త(స)గారి సున్నత్‌ను (సంప్రదాయాన్ని) తీసు కుంటే, దైవప్రవక్త(స) ఖుర్బానీ పశువును జిబహ్ చెయ్యనంతవరకు ఇహ్రామ్‌ను విప్పివేయలేదు.'

## 33వ అధ్యాయం

బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 'హజ్జ్ మాసాలు అందరికీ తెలిసినవే. ఈ నిర్ణీత మాసాలలో హజ్జ్ చేసే సంకల్పం ఉన్న వ్యక్తి అప్రమత్తుడై మెల గాలి. హజ్జ్ సమయంలో అతడు కామ చేష్టలకూ, దుష్కార్యాలకూ, ఘర్షణలకూ దూరంగా ఉండాలి." **(197)** మరొకచోట దివ్యఖుర్ఆన్‌లోనే అల్లాహ్ ఇలా సెల విచ్చాడు: 'ప్రవక్తా! తరిగే పెరిగే చంద్రుని రూపాలను గురించి ప్రజలు నిన్ను అడుగుతుంటారు. నీవు వారికి ఇలా తెలుపు 'తేదీల లెక్కకూ, హజ్ కాల నిర్ణయానికి అవి గుర్తులు.' **(2: 189).** హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు 'హజ్జ్ మాసాలు ఇవి, షవ్వాల్, జీఖాయెద మరియు జిల్‌హజ్జకు చెందిన పదిరోజులు.' హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స) గారి సంప్రదాయం ప్రకారం హజ్జ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించకూడదు. కాని హజ్ మాసాలలో ఇహ్రామ్‌ను ధరించాలి.' హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) ఇలా అన్నారు 'ఖురాసాన్ నుంచి గాని లేక కిర్‌మాన్ నుంచి గాని ఇహ్రామ్‌ను ధరించి ప్రయాణం చేస్తే అది మక్రూహ్ అవుతుంది.'

**631.** హజ్రత్ ఆయెషా సిద్దీఖా (రజిఅన్) ఇలా అన్నారని ఖాసిమ్ బిన్ ముహమ్మద్ ఉల్లేఖించారు: 'మేము మదీనా పురం నుంచి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి హజ్జ్ మాసాలలో, హజ్జ్ రాత్రులలో మరియు హజ్ సీజన్‌లో బయలుదేరాము. తరువాత మేము సరిఫ్ (మక్కా నుంచి ఆరు మైళ్ళ దూరంలో ఉన్న ఒక కుగ్రామం) వద్ద దిగిపోయాము.' దైవప్రవక్త(స) అప్పుడు తన సహచరుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు 'ఎవరి వద్దనైతే ఖుర్బానీ పశువు లేదో వారు హజ్ యాత్రను ఉమ్రా యాత్రగా మార్చుకోవాలని నేను కోరుతున్నాను. ఇంకా ఎవరి వద్దనైతే ఖుర్బానీ పశువు ఉన్నదో వారు అలా చెయ్యకూడదు.' హజ్రత్ ఆయెషా(రజిఅన్)ఇలా సెలవిచ్చారు 'తరువాత కొందరు సహ చరులు దైవ ప్రవక్త(స) గారి ఈ ఆదేశాన్ని పాటించారు మరికొందరు దాని ప్రకారం నడుచుకోలేదు.'

హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా సెలవిచ్చారు 'తరువాత కొందరు ఈ ఆజ్ఞను పాలించారు. మరికొందరు దాని ప్రకారం నడుచుకోలేదు. కాని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మరియు కొందరు సహాబాలు (ర)శక్తిగలవారు- (ఇహ్రామ్ నిషేధాల నుంచి సురక్షితంగా ఉండగలవారు) తమతో ఖుర్బానీ పశువును తీసుకువచ్చారు వారు ఉమ్రాను పాటించలేదు. (ఇహ్రామ్‌ను విప్పలేదు). హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు- తరువాత దైవప్రవక్త(స) గారు నా వద్దకు విచ్చేశారు అప్పుడు నేను విలపిస్తూ ఉన్నాను, ఆయన (స)గారు ఇలా సెలవిచ్చారు 'అమాయకురాలవైన ఓ వనితా! ఏడుస్తున్నావెందుకు. అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను- ఓ దైవ ప్రవక్తా(స)! మీరు మీ సహాబాలతో ఏదైతే అన్నారో దాన్ని నేను విన్నాను కాని నేనైతే ఉమ్రాను సైతం చెయ్యలేను. అప్పుడు ఆయన(స)గారు 'ఎందుకు?' అని అడిగారు. సమాధానంగా నేను, 'నేను నమాజు చెయ్యటం లేదు.' అన్నాను అప్పుడు దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు: నువ్వు దానికి బాధపడకు. నీవు కూడా ఆదమ్(అ) కూతురివే కదా! అల్లాహ్ వారి అదృష్టంలో ఏదైతే వ్రాసిపెట్టాడో నీ కోసం కూడా అదే వ్రాసిపెట్టాడు. నీవు హజ్జ్‌ను పాటిస్తూ ఉండు. బహుశా ఆయన నీకు ఉమ్రా భాగ్యం కూడా కలుగజేస్తాడు. నేను అల్లాహ్ నుంచి దీన్నే ఆశిస్తున్నాను. అప్పుడు హజ్రత్ ఆయెషా (ర)ఇలా అన్నారు, ఆ తరువాత మేము హజ్జ్‌ను చెయ్యటానికి బయలు దేరాము. నేను అరఫాత్ నుంచి మినాకు వచ్చినప్పుడు, ఆ సమయంలో పరిశుభ్రతను పొందాను. తరువాత నేను మినా నుంచి బయలుదేరాను మక్కా నగరానికి పోయి తవాఫె జియారత్ చేశాను. దీని తరువాత చివరి ప్రయాణంలో నేను దైవప్రవక్త(స) గారితో కలిసి బయలుదేరాను. ఆయన(స)గారు ముహస్సబ్‌కు చేరిన తరువాత అక్కడ తమ ఒంటె మీద నుంచి దిగిపోయారు. మేముకూడా ఆయన (స) గారితోపాటు ఒంటెల మీది నుంచి దిగిపోయాము. ఆ సమయంలో ఆయన (స)గారు అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బకర్ (ర) (నా సోదరుడు)ను పిలిచి, ఇలా సెలవిచ్చారు: 'నీవు నీ సోదరిని తీసుకుని కాబా గృహ హద్దుల నుంచి బయటకు వెళ్ళిపో. అక్కడ నుంచి ఆమె ఉమ్రాకు చెందిన ఇహ్రామ్‌ను ధరించాలి. తరువాత మీరు ఉభయులు ఉమ్రాను పూర్తి చేసి ఇక్కడకు వచ్చెయ్యండి. నేను మీకోసం నిరీక్షిస్తూ ఉంటాను.' హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు- 'మేము బయలుదేరాము. (అంటే ముహస్సబ్ నుంచి). నేను ఉమ్రాను మరియు తవాఫ్‌ను పూర్తి చేసిన తరువాత సహర్ సమయంలో ఆయన(స) గారి వద్దకు వెళ్ళాను. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు: మీరు ఉమ్రాను పూర్తి చేసుకున్నారా? నేను,

అవును దైవప్రవక్తా! నేను పూర్తి చేసుకున్నాను అని అన్నాను. అప్పుడు ఆయన(స) గారు తన సహాబాలకు ప్రయాణం గురించి పిలుపునిచ్చారు. ప్రజలు బయలుదేరటం ప్రారంభించారు దైవప్రవక్త(స) గారు కూడా మదీనాపురం వైపునకు బయలుదేరారు.

## 34వ అధ్యాయం

**హజ్జె తమత్తు, హజ్జె ఖిరాన్ మరియు హజ్జె ఇఫ్రాద్‌లను గురించి... హజ్‌ను రద్దు చేసి దాన్ని ఉమ్రాగా చెయ్యటం- అతని వద్ద ఖుర్బానీ పశువు గనుక లేకపోతే.**

**632.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా సెలవిచ్చారని అస్వద్ ఉల్లేఖించారు 'మేము దైవప్రవక్త మహాశ యులు ముహమ్మద్(స)గారితో కలిసి బయలు దేరాము. హజ్‌చేసే సంకల్పంతోనే మేము బయలుదేరాము. మక్కా నగరానికి చేరుకున్న తరువాత కాబా గృహ ప్రదక్షిణం చేశాము. ఆ తరువాత దైవప్రవక్త(స)గారు తమతోపాటు ఖుర్బానీ పశువును తీసుకురాని వారిని ఇహ్రామ్ విప్పివెయ్యాలని ఆజ్ఞాపించారు. దైవప్రవక్త(స)గారి ఆజ్ఞానుసారం వారు తమ ఇహ్రామ్‌ను విప్పివేశారు. ఆయన(స)గారి భార్యలు కూడా ఇహ్రామ్‌ను విప్పివేశారు. వారు కూడా ఖుర్బానీ పశువును తీసుకు రాలేదు. అప్పుడు నేను బహిష్టు అయ్యాను. ఈ కారణం వల్ల నేను కాబా గృహ ప్రదక్షిణం చేయలేక పోయాను. (హజ్జ్ చేసుకుంటూ ముందుకు సాగిపోయాను). రాత్రి ముహస్సబ్‌కు వచ్చినప్పుడు, నేను ఇలా అన్నాను, 'ఓ దైవప్రవక్తా(స)! జనులైతే హజ్జ్, ఉమ్రాలు రెండింటినీ చేసి తిరిగివెళ్ళిపోయారు. నేను కేవలం హజ్జ్‌ను మాత్రమే చేసి తిరిగి వెళ్ళుతున్నాను.' అప్పుడు దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు: 'ఓ ఆయెషా! నీవు మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు కాబా గృహ ప్రదక్షిణం చెయ్య లేదా?' 'లేదు ప్రవక్తా(స)!' అని నేను మనవి చేసుకున్నాను. దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు: మంచిది! నీవు నీ సోదరునితోపాటు తన్‌యీమ్ దాకా వెళ్ళు. అక్కణ్ణుంచి ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకో. తరువాత (ఉమ్రాను ముగించుకుని) ఫలానా స్థలం దగ్గర నీవు నన్ను కలుసుకో. ఉమ్ముల్ మోమినీన్ సఫియా (ర) ఇలా అన్నారు- 'బహుశ నేను మిమ్మల్ని అక్కడ ఆపి ఉంచుతానేమో.' దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు- "నీ సిగతరగా! ఏమిటి, నీవు పదవ తేదీన కాబా గృహ ప్రదక్షిణం చెయ్యలేదా?' ఆమె(ర)గారు ఇలా అన్నారు, 'కాబా గృహ ప్రదక్షిణాన్నయితే నేను చేశాను.' అప్పుడు

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'అయితే పద, మాతోపాటు ప్రయాణం చెయ్యి.' హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు 'ఆ తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా నుంచి పైకి అధిరోహించేటప్పుడు నన్ను కలిశారు. ఇంకా అప్పుడు నేను మక్కా నగరం మీద నుంచి క్రిందికి దిగుతున్నాను. లేక నేను ఎక్కుతూఉన్నాను. ఆయన(స) గారు కిందికి దిగుతూ ఉన్నారు.'

**633.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు: ఆమె (ర) గారు ఇలా అన్నారు 'మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి మక్కా నగరానికి బయలుదేరాము. ఇది ఆయన (స) గారు చివరి హజ్జ్ యాత్ర చేసిన సంవత్సరం. మాలోని కొందరు ఉమ్రా కోసం మాత్రమే ఇహ్రామ్‌ను ధరించారు. మరి కొందరు హజ్జ్, ఉమ్రాలు రెండింటి కోసమూ ఇహ్రామ్‌ను ధరించారు. మిగతా వారు కేవలం ఒక్క హజ్జ్ కోసం మాత్రమే ఇహ్రామ్ కట్టుకున్నారు. దైవప్రవక్త(స) గారు హజ్జ్ కోసం ఇహ్రామ్‌ను ధరించారు. కనుక ఎవరైతే కేవలం హజ్జ్ కోసం మాత్రమే ఇహ్రామ్‌ను కట్టుకున్నారో, వారూ, హజ్జ్, ఉమ్రాలు రెండింటి కోసమూ కలిపి ఇహ్రామ్‌ను కట్టు కున్నారో వారు పదవ తేదీ వరకు ఇహ్రామ్‌ను విప్పలేదు.'

**634.** మర్వాన్ బిన్ హకమ్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు: 'నేను అప్పుడు అక్కణ్ణే ఉన్నాను. హజ్రత్ ఉస్మాన్(ర) (తన ఖిలాఫత్ కాలంలో) హజ్జె తమత్తుకు మరియు 'హజ్జ ఖిరాన్'ను (హజ్జ్, ఉమ్రాను కలిపి) నిర్వహించకూడదని వారించేవారు.' హజ్రత్ అలీ(ర) దీన్ని గమనించి ఇహ్రామ్‌ను కట్టుకున్నారు. లబ్బైక్ బిహజ్జ వ ఉ మ్రా (అంటే ఖిరాన్ చేశారు) మరియు ఇలా అనసాగారు. 'నేను దైవప్రవక్త (స) గారి హదీసును ఎవరో ఏదో అన్నారనీ, ఏదో చేశారనీ చూసి వదిలిపెట్టలేను.

**635.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) ఉల్లేఖించారు, ఆయన ఇలా అన్నారు: 'అరేబియా ప్రజలు (అజ్ఞాన కాలంలో) హజ్ మాసాలలో ఉమ్రా చెయ్యటాన్ని మహా పాపంగా పరిగణించేవారు. ముహర్రమ్ మాసాన్ని సఫర్ మాసంగా చేసుకునేవారు. వారు ఇలా అనేవారు' ఒంటె వీపుపై ఉన్న గాయాలు మానిన తరువాత ఇంకా దానిపై వెంట్రుకలు బాగా పెరిగిన తరువాత, సఫర్ మాసం ముగిసిన పిదప, అప్పుడు ఉమ్రా చేసే మనిషికి ఉమ్రా ధర్మసమ్మతమైనదే.' దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మరియు ఆయన(స) గారి అనుచరులు (ర) జుల్ హిజ్జ మాసం నాల్గవ తేదీ ఉదయం మక్కా నగరానికి విచ్చేశారు. ప్రజలు హజ్జ్‌కు చెందిన ఇహ్రామ్‌ను ధరించి ఉన్నారు."

అప్పుడు ఆయన గారు(స) 'హజ్జ్‌ను ఉమ్రాగా మార్చుకోండి' అని ఆజ్ఞాపించారు. ఈ ఆజ్ఞ వారికి భారంగా బాధగా అనిపించింది. వారు ఇలా మనవి చేసుకున్నారు. 'ఓ దైవప్రవక్తా(స)! ఉమ్రా చేసిన తరువాత మా కోసం ఏ వస్తువు ధర్మ సమ్మతమైపోయింది?' అప్పుడు ఆయన ఇలా సెలవిచ్చారు: 'సమస్త వస్తువులూ మీ కోసం హలాల్ అయి పోయాయి.'

**636.** అబూ మూసా అష్అరీ (ర) ఇలా ఉల్లేఖించారు : 'ఆయన (ర) యమన్ దేశం నుంచి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వద్దకు (హజ్జతుల్ విదాలో పాల్గొనే నిమిత్తం) వచ్చారు. దైవప్రవక్త(స) ఆయన గారిని ఉమ్రాచేసి ఇహ్రామ్ విప్పి వెయ్యమని ఆజ్ఞాపించారు.'

**637.** విశ్వాసుల తల్లి అయిన హఫ్సా (రజిఅన్‌హా) ఇలా అన్నారని ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు. 'ఓ దైవప్రవక్తా(స)! జనులకు ఏమయింది? వారు ఉమ్రా చేసి ఇహ్రామ్‌ను విప్పివేశారు, మీరేమో ఉమ్రా చేసి ఇహ్రామ్‌ను విప్పివెయ్యలేదు. అప్పుడు దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు 'నేను నా వెంట్రుకలను పేర్చుకున్నాను. మరియు నాకు చెందిన ఖుర్బానీ పశువు మెడలో పూలదండ వేశాను. కనుక నేను నా ఖుర్బానీ పశువును జిబహ్ చెయ్య నంతవరకు ఇహ్రామ్‌ను విప్పలేను.'

**638.** అబూ జమ్రమ నసర్ బిన్ ఇమ్రాన్ జబీ ఇలా అన్నారని షూబ ఉల్లేఖించారు. నేను హజ్జె తమత్తు నిర్వహించాను. కాని చాలామంది జనులు అలాచెయ్యకూడదని వారించారు. చివరకు నేను ఇబ్నె అబ్బాస్‌ను ఈ విషయం గురించి సంప్రదించాను. ఆయన (ర) తమత్తు చెయ్యి అని సలహా ఇచ్చారు. తరువాత నేను నాకు వచ్చిన ఒక కలలో చూశాను. అందులో ఒక వ్యక్తి నాతో ఇలా అంటున్నాడు- నీవు చేసిన హజ్ మబ్‌రూర్ అయింది (పాప కార్యాలేమీ లేని మరియు దైవామోదం లభించిన హజ్). మరియు నీవు చేసిన ఉమ్రాను దేవుడు అంగీకరించాడు. ఈ స్వప్నాన్ని గురించి నేను ఇబ్నె అబ్బాస్(ర)కు చెప్పాను. ఆయన(ర) గారు ఇలా అన్నారు: 'ఇందులో సందేహమేముంది? తమత్తు దైవప్రవక్త(స) గారి సంప్రదాయమే.' తరువాత ఆయన(ర) ఇలా అన్నారు, కనుక నీవు నా వద్దనే ఉండిపో. మరియు నేను నా సంపదలో నుండి నీకు ఒక భాగాన్ని ఇస్తాను.' షూబ ఇలా అన్నారు నేను అబూ జమ్‌రాను ఇలా అడిగాను, 'దీనికి కారణం ఏమిటి?' ఆయన ఇలా అన్నారు 'నాకు వచ్చిన స్వప్నమే దీనికి కారణం.'

**639.** అబూషిహాబ్ ఇలా ఉల్లేఖించారు : నేను తమత్తు చెయ్యాలనే సంకల్పంతో ఉమ్రాకు చెందిన ఇహ్రామ్‌ను ధరించి మక్కాలోకి ప్రవేశించాను. జిల్‌హజ్జ మాసానికి మూడు రోజులు ముందు మక్కా నగరానికి చేరుకున్నాము. అప్పుడు మక్కాకు చెందిన కొందరు జనులు నన్ను ఇలా అడగసాగారు 'ఇప్పుడు నీవు చేసిన హజ్జ్ మక్కా హజ్‌గా మారిపోతుంది. (అంటే దానికి తక్కువ పుణ్యం లభిస్తుంది) ఇది విని నేను అతా బిన్ అబీ రిబాహ్ వద్దకు వెళ్ళి ఆయన గారిని ఈ సమస్యను గురించి అడిగాను.' ఆయన గారు ఇలా అన్నారు– 'నాకు జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ గారు చెప్పారు. ఆయన దైవ ప్రవక్త(స) గారితో కలిసి ఆ రోజున హజ్జ్ చేశారు, ఆ రోజున ఖుర్బానీ పశువులు ఆయన(స) గారితో తోలుకు రాబడ్డాయి. ఆ జనులు ముఫ్‌రద్ హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారు.' అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'మీరు తవాఫ్ మరియు సఫా మర్వాల సయీ చేసి మీ ఇహ్రామ్‌ను విప్పివెయ్యండి ఇంకా వెంట్రుకల్ని గొరిగించుకోండి. తరువాత అదే విధంగా ఇహ్రామ్ లేకుండానే మక్కాలో ఉండండి. ఎనిమిదవ తేదీ అయితే అప్పుడే (మక్కా నుంచే) హజ్జ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించండి. ఈవిధంగా మీ ముఫ్‌రద్ హజ్జ్‌ను తమత్తుగా చేసుకోండి. మీరు ముఫ్‌రద్ హజ్‌కు సంబంధించిన సంకల్పాన్ని ఇదివరకే చేసుకుని ఉన్నారు కదా!' వారు ఇలా అన్నారు :'మేము దీన్ని తమత్తుగా ఎలా చేసుకోవాలి? మేమైతే ఇహ్రామ్ కట్టుకునే టప్పుడు హజ్జ్ పేరును ఉచ్ఛరించాము కదా!' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, 'నేను చెప్పిన విధంగానే చెయ్యండి. నేను గనుక ఖుర్బానీ పశువును నాతోపాటు తీసుకు రాకుండా ఉన్నట్లయితే, అప్పుడు నేను కూడా అలాగే చేసి ఉండేవాణ్ణి. కాని నన్నేమి చేయమంటారు? ఖుర్బానీ పశువు తన స్థానానికి చేరుకోకపోతే ఇహ్రామ్‌లో ఉన్నప్పుడు ఏ వస్తువైతే హరామ్‌గా ఉండినదో ఆ వస్తువు ఇప్పుడు నాకు హలాల్ కాలేదు గదా!' ఆ తరువాత ఆ జనులు అలానే చేశారు.

**640** సయీద్ బిన్ ముసయ్యిబ్ ఉల్లేఖించారు, ఆయన ఇలా అన్నారు: హజ్రత్ అలీ (ర) మరియు హజ్రత్ ఉస్మాన్ (ర) ఉభయులూ అస్ఫాన్ పేరుతో ప్రఖ్యాతి గాంచిన స్థలం వద్ద హజ్జె తమత్తును గురించి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. హజ్రత్ అలీ (రజిఅన్) ఇలా అన్నారు : 'మీరు చెప్పేదేమిటి? దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారు ఏ పనినైతే చేశారో ఆ పనిని చెయ్యవద్దని మీరు వారిస్తు న్నారా?' హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) ఎలాంటి సమాధానమూ చెప్పకుండానే (ఈ

వివాదాన్ని) ఇక వదిలెయ్యండి అని అన్నారు. ఈ విషయాన్ని గమనించిన హజ్రత్ అలీ (ర) హజ్జ్, ఉమ్రాలు రెండింటికీ కలిపి ఒకే ఇహ్రామ్ కట్టుకున్నారు.

## 35వ అధ్యాయం

### ఒకవేళ ఎవరైనా లబ్బైక్ అంటూ హజ్జ్ పేరును ఉచ్చరిస్తే.

**641.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు 'అప్పుడు మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో ఉన్నాము. మరియు హజ్జ్‌కు సంబంధించిన లబ్బైక్‌ను పఠిస్తూ ఉన్నాము. తరువాత మేము మక్కా నగరంలోకి ప్రవేశించినపుడు దైవప్రవక్త (స)గారు ఇలా ఆజ్ఞాపించారు- 'మేము హజ్జ్‌ను ఉమ్రాగా చేసుకున్నాము.'

## 36వ అధ్యాయం

### దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి కాలంలో హజ్జె తమత్తు అమలులో ఉండటం.

**642.** ఇమ్రాన్ బిన్ హుసైన్ (ర) ఇలా ఉల్లేఖించారు: మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి కాలంలో హజ్జె తమత్తును ఆచరించాము. స్వయంగా ఖుర్ఆన్ గ్రంథంలో హజ్జె తమత్తుకు సంబంధించిన ఆజ్ఞ అవతరించింది. కాని ఒక వ్యక్తి ఎవరో తన అభిప్రాయం ప్రకారం తాను కోరింది అనేశాడు.

## 37వ అధ్యాయం

అల్లాహ్ ఖుర్ఆన్‌లోని బఖరా సూరాలో ఇలా సెలవిచ్చాడు: ఈ ఫర్మానా (తమత్తు లేక ఖుర్బానీ ఆజ్ఞ) - ఎవరి గృహాలైతే, కుటుంబాలైతే మస్జిదె హరామ్ వద్ద లేవో వారికే వర్తిస్తుంది.' ఇబ్నె అబ్బాస్ (ర)ఇలా అన్నారు- ఆయన్ని హజ్జె తమత్తును గురించి ఎవరో అడిగినప్పుడు, ఆయన ఇలా సమాధానం చెప్పారు 'ముహాజిర్లూ, అన్సారులూ మరియు దైవప్రవక్త (స) గారి సతీమణులు హజ్జతుల్ విదా జరిగిన సంవత్సరంలో (హజ్ కోసం) ఇహ్రామ్‌ను ధరించారు. మేము కూడా ఇహ్రామ్‌ను కట్టుకున్నాము. మేము మక్కా నగరానికి చేరుకున్నప్పుడు దైవప్రవక్త (స) గారు మమ్మల్ని ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు: 'ప్రస్తుతం హజ్ చేసే సంకల్పాన్ని విడిచిపెట్టండి. ఉమ్రాను నిర్వహించండి- హాదీకి (ఖుర్బానీ పశువుకు) పూలదండ వేసినవాడు తప్ప.' కనుక మేము కాబా ప్రదక్షిణం చేశాము. సఫా మర్వాల మధ్య సయీ చేశాము. మా

భార్యలతో మేము నిదురపోయాము. కుట్టించిన మామూలు వస్త్రాలను ధరించాము. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు "ఎవరైతే తన హాదీకి పూలదండను వేశాడో అతను దానిని ఖుర్బానీ చేసే వరకు ఇహ్రామ్‌ను విప్పివేయరాదు".

తరువాత జిల్‌హజ్జ మాసం 8వ తేదీ సాయంత్రం దైవప్రవక్త(స) ఇలా ఆజ్ఞాపించారు: మీరు హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకోండి. మేము హజ్‌కు సంబంధించిన పనులను ముగించుకున్న తరువాత మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు కాబా గృహం, సఫా మర్వాల ప్రదక్షిణను చేశాము. మా హజ్జ్ యాత్ర పూర్తయింది. ఇక మాపై ఖుర్బానీ విధిగా అయిపోయింది. (అల్లాహ్ బఖరా సూరాలో ప్రవచించిన విధంగా) మీ ఆర్థిక స్థోమత ప్రకారం ఖుర్బానీ చెయ్యండి. ఎవరికైతే ఖుర్బానీ చేసే స్థోమత లేదో వారు మూడు రోజులు హజ్జ్ దినాలలో ఉపవాసాలు ఉండాలి. మరియు తమ పట్టణానికి చేరుకున్న తరువాత ఏడు రోజులు ఉపవాసం ఉండాలి. ఖుర్బానీ కోసం ఒకే ఒక మేక సరిపోతుంది. ప్రజలు రెండు ఆరాధనలను అంటే, హజ్జ్, ఉమ్రాలను ఒకే సంవత్సరంలో చేసుకున్నారు. అల్లాహ్ ఈ ఆదేశాన్ని తన గ్రంథంలో అవతరింపజేశాడు. దైవప్రవక్త(స) దానిని జారీ చేశారు. మరియు మక్కా నగర వాసులకు తప్ప ఇతర ప్రజల కోసం దానిని ధర్మసమ్మతమైనదిగా చేశారు. స్వయంగా అల్లాహ్‌యే ఇలా సెలవిచ్చాడు: 'ఎవరి ఇంటివారైతే మస్జిదె హరామ్ వద్ద ఉండరో వారికి మాత్రమే ఈ ఆదేశం వర్తిస్తుంది. ఖుర్‌ఆన్ గ్రంథంలో ప్రస్తావించబడిన హజ్ మాసాలు ఇవి షవ్వాల్, జీఖాయెద, జిల్‌హజ్జ. ఎవరైతే ఈ మాసాలలో తమత్తు చేస్తారో వారు ఖుర్బానీ అయినా ఇవ్వాలి లేదా ఆర్థిక స్థోమత లేకపోతే ఉపవాసాలైనా పాటించాలి. మరియు రఫస్ అంటే సంభోగం అని అర్థం లేక అశ్లీల పదాలు అని భావం. మరియు ఫుసూఖ్ అంటే పాపకార్యాలు. మరియు జిదాల్ అంటే ప్రజలతో ఘర్షణపడటం.

## 38వ అధ్యాయం

### మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు గుసుల్ చేసుకోవాలి.

**643.** నాఫె ఉల్లేఖించారు- ఆయన ఇలా అన్నారు: 'హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) పుణ్యస్థలమైన కాబా గృహ సరిహద్దులకు సమీపంలో ఉన్నప్పుడు, లబ్బైక్ పలకటాన్ని వాయిదా వేసేవారు. తరువాత రాత్రి సమయంలో తువాలో ఉండిపోయేవారు. ఆ తరువాత ప్రజలతో కలిసి ఫజర్ నమాజును చేసేవారు. మరియు ఆ

తరువాత గుసుల్ చేసుకునేవారు. ఇంకా ఇలా అనేవారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కూడా ఇలానే చేసేవారు'.

## 39వ అధ్యాయం

మక్కాలోకి పగలు గాని, రాత్రిపూట గాని ప్రవేశించటం. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో ఒకసారి తువాలో ఉండిపోయారు. ఉదయం వేళ అయ్యేవరకు. తరువాత మక్కాలోకి ప్రవేశించారు. మరియు ఇబ్నె ఉమర్(ర) ఇలాగే చేసేవారు.

**644.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకనాటి రాత్రి జీతువాలో ఉండిపోయారు. ఉదయం అయ్యే వరకు అక్కణ్ణే ఉండిపోయారు. తరువాత మక్కాలోకి ప్రవేశించారు'. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) కూడా అలాగే చేసేవారు.

## 40వ అధ్యాయం

### మక్కానగరంలోకి ఎటునుంచి ప్రవేశించాలి?

**645.** హజ్రత్ ఇబ్నె ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు– ఆయన ఇలా అన్నారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కానగరంలోకి ఎత్తైన లోయ (అంటే జన్నతుల్ ముఅల్లా) వైపు నుంచి ప్రవేశించేవారు. మరియు క్రిందిలోయ (బాబె షుబైకా) వైపునుంచి వెళ్ళిపోయేవారు.'

## 41వ అధ్యాయం

### మక్కా నగరం నుంచి వెళ్ళిపోయేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళిపోవాలి?

**646.** హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మక్కా నగరంలోకి 'కదా' వైపు నుంచి అంటే ఎత్తైన పర్వత కనుమ వైపు నుంచి ప్రవేశించారు. మరియు క్రింది భాగంవైపు నుంచి వెళ్ళిపోయారు. ఎత్తైన లోయ 'బత్హా'లో ఉన్నది.

**647.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅ) మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు మక్కా నగరం పైభాగంలోని ఎత్తైన ప్రదేశం నుంచి ప్రవేశించారు. తిరిగి వెళ్ళిపోయినప్పుడు క్రింది భాగంలో నుంచి నిష్క్రమించారు.'

**648.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: 'మక్కాను జయించిన సంవత్సరంలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కాలోకి 'కదా' నుంచి ప్రవేశించారు. మరియు 'కుదా' నుంచి మక్కా నగరం పైభాగం మీదుగా వెళ్ళి పోయారు. 'కుదా' కూడా మక్కా నగరం ఎగువ భాగంలోనే ఉన్నది.

**649.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు : 'మక్కా విజయం లభించిన సంవత్సరంలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) 'కదా' నుంచి మక్కా నగరంలోకి ప్రవేశించారు. 'కదా' మక్కా నగరంలోని పైభాగంలో ఉన్నది. హిష్షామ్ ఇలా అన్నారు- ఉర్వా మక్కా నగరంలోకి 'కదా' మరియు 'కుదా'- ఈ రెండు ప్రాంతాల నుంచి ప్రవేశించేవారు. తరచూ ఆయన 'కదా' నుంచి ప్రవేశించేవారు. అది ఆయన గారి ఇంటికి దగ్గరలో ఉన్నది.'

**650.** ఉర్వా ఇలా అన్నారని హిష్షామ్ ఉల్లేఖించారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మక్కా విజయం లభించిన సంవత్సరంలో మక్కా నగరంలోకి 'కదా' వైపు నుంచి ప్రవేశించారు 'కదా' మక్కా నగరం పై భాగంలో ఉన్న ప్రదేశం. ఉర్వా తరచూ మక్కాలోకి 'కదా' నుంచి ప్రవేశించేవారు. 'కదా' ఆయన గారి ఇంటికి దగ్గరగా ఉండేది.

**651.** హిష్షామ్ తన తండ్రి గారు (ర) ఇలా అన్నారని ఉల్లేఖించారు- 'మక్కా విజయం లభించిన సంవత్సరంలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) 'కదా' వైపు నుంచి మక్కా నగరంలోకి ప్రవేశించారు. ఉర్వా అయితే రెండు వైపుల నుంచీ మక్కాలోకి ప్రవేశించేవారు. ఆయన తరచూ 'కదా' నుంచే మక్కాలోకి ప్రవేశించేవారు. ఎందుకంటే, అది ఆయన నివాస స్థలానికి దగ్గరగా ఉండేది. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఇలా అన్నారు 'కదా' మరియు 'కుదా'- ఈ రెండూ స్థలాల పేర్లు.

## 41వ అధ్యాయం

**మక్కా పవిత్ర నగరం, దానిలోని కట్టడాల ఔన్నత్యం. ఇంకా అల్లాహ్ చేసిన ప్రవచనం.**

'ఈ గృహాన్ని (కాబాను) మేము మానవులందరికీ కేంద్రం గాను, శాంతి నిలయంగానూ చేశాము. ఇబ్రాహీము ఆరాధన కొరకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వత మైన నమాజు స్థలంగా చేసుకోవలసిందని ప్రజలను మేము ఆదేశించాము. ఇంకా నా ఈ గృహాన్ని, దానికి ప్రదక్షిణం చేసేవారి కొరకు, దానిలో ఏతెకాఫ్ పాటించేవారి

కొరకు, రుకూ, సజ్దాలు చేసేవారి కొరకు పరిశుద్ధంగా ఉంచవలసిందని ఇబ్రాహీ మును, ఇస్మాయీలును నిర్దేశించాను. ఆ తరువాత ఇబ్రహీమ్ అల్లాహ్‌ను ఇలా అర్థించాడు "ప్రభూ! ఈ నగరాన్ని సుఖశాంతుల నగరంగా చెయ్యి. ఈ నగర వాసులలో అల్లాహ్‌నూ, పరలోకాన్నీ విశ్వసించే వారికి అన్ని రకాల పండ్లు, ఫలాలు ఆహారంగా ప్రసాదించు." అప్పుడు అతని ప్రభువు ఇలా జవాబు పలికాడు: విశ్వసిం చినవారికి కూడా ఇహలోకపు తాత్కాలిక జీవితావసరాలను ప్రసాది స్తాను. కాని చివరకు వారిని నరక యాతనవైపునకు ఈడుస్తాను. అది అత్యంత దుర్భరమైన నివాస స్థలం. ఇబ్రహీం, ఇస్మాయీలు ఈ ఇంటి గోడలను ఎత్తేటప్పుడు ఈ విధంగా ప్రార్థించేవారు ఓ మా ప్రభూ! మా ఈ సేవను నీవు దయతో స్వీకరించు. నీవు అందరి మొరలు ఆలకించేవాడవు. అన్నీ తెలిసినవాడవు. ప్రభూ! మా ఇద్దరినీ నీకు విధేయులుగా చేసుకో. పూర్తిగా నీ విధేయతకే అంకితమయ్యే ఒక జాతిని మా సంతతి నుండి ఆవిర్భ వింపచెయ్యి. నీ ఆరాధనా రీతులను మాకు తెలుపు. మా తప్పులను మన్నించు. నీవు అమితంగా క్షమించేవాడవు, అమితంగా కరుణించేవాడవు. (అల్ బఖరా : **125-128**)

**652.** జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: అజ్ఞానపు కాలంలో పవిత్ర కాబా మందిర నిర్మాణం ప్రారంభమైనప్పుడు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స), ఆయన(స) గారి బాబాయి హజ్రత్ అబ్బాస్(ర) ఉభయులు రాళ్లు మోస్తూ ఉండేవారు. హజ్రత్ అబ్బాస్(ర) దైవప్రవక్త(స)గారితో ఇలా మనవి చేసుకున్నారు 'ఓ ముహమ్మద్(స)! నీవు నీ లుంగీని విప్పి భుజంమీద వేసుకో. ఆయన (స) అలానే చేశారు. దిగంబరులైనంతనే ఆయన (స) గారు మూర్ఛపోయి నేలపై పడిపోయారు. ఆయన(స) గారి కళ్ళు ఆకాశాన్ని చూస్తూ ఉన్నాయి. దైవప్రవక్త(స) హజ్రత్ అబ్బాస్ (ర)గారితో ఇలా అన్నారు: 'నా లుంగీని నాకు ఇచ్చి వెయ్యండి.' హజ్రత్ అబ్బాస్(ర) లుంగీని దైవప్రవక్త(స)కు ఇచ్చివేశారు. ఆయన(స)గారు దాన్ని తన నడుముకు గట్టిగా కట్టుకున్నారు.

**653.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ప్రియ సతీమణి హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త(స)గారు ఆమె(ర) గారితో ఇలా అన్నారని. 'ఏమిటి, నీవు చూడలేదా! నీ జాతివారు (ఖురైష్) కాబా గృహ పునర్నిర్మాణం చేపట్టినప్పుడు హజ్రత్ ఇబ్రాహీమ్(అ)గారి గోడలను తగ్గించిన విషయాన్ని నీవు గమనించలేదా?' అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను, 'ఓ దైవప్రవక్తా(స)! అయితే మీరు హజ్రత్ ఇబ్రాహీమ్(అ)గారి గోడలపై ఎందుకు నిర్మించలేదు?' సమాధానంగా

ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'నీ జాతి యొక్క అవిశ్వాసపు యుగం మొన్న మొన్ననే గడచిపోకుండా ఉన్నట్లయితే, నిస్సందేహంగా నేను అలానే చేసి ఉండేవాణ్ణి'. అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఇలా అన్నారు: ఒకవేళ హజ్రత్ ఆయెషా(ర) ఈ హదీసును దైవప్రవక్త(స) గారి నుంచే విని ఉన్నట్లయితే (ఆమె(ర)గారు తప్పకుండా విన్నారు ఎందుకంటే ఆమె(ర) గారు సత్య సంధత గల వనిత. మరియు మంచి జ్ఞాపకశక్తి గల మహిళ) కనుక నేను ఇలా అనుకుంటున్నాను 'ఈ కారణం వల్లనే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారు హతీమ్‌కు దగ్గరలో (ఆనుకుని) ఉన్న గోడల మూలాలను ముద్దుపెట్టు కునేవారు కాదు ఎందుకంటే, కాబా గృహం ఇబ్రాహీమ్(అ) గారి గోడలపై పూర్తిగా లేదు.

**654.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు: ఆమె(ర) గారు ఇలా అన్నారు- నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఇలా అడిగాను, 'ఓ దైవ ప్రవక్తా(స)! ఏమిటి హతీమ్ కాబా గృహంలోని ఒక భాగం అవునా కాదా?' ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: 'అవును, హతీమ్ కాబా గృహంలోని ఒక భాగమే.' హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు 'అలాంటప్పుడు జనులు దాన్ని కాబా గృహంలోని ఒక భాగంగా ఎందుకు చేర్చలేదు?' ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు 'అప్పుడు నీ జాతి ప్రజల వద్ద ధనం తక్కువగా ఉంది.' అప్పుడు హజ్రత్ ఆయెషా(ర) ఇలా అడిగారు; అయితే కాబా గృహ ద్వారాన్ని ఎందుకు అంత ఎత్తుగా కట్టారు? ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు: 'ఎందుకంటే, నీ జాతి ప్రజలు తాము కోరినవారిని లోపలకు ప్రవేశింపజెయ్యటానికి ఇంకా తమకు ఇష్టం కాని వారిని లోపలకు రాకుండా చేసేం దుకు. నీ జాతికి చెందిన అజ్ఞానపు యుగం ఇంకా తాజాగా ఉండకుండా ఉంటే, ఇంకా వారి హృదయాలు చెడిపోతాయనే భయం నాకు లేకుండా ఉన్నట్లయితే అప్పుడు నేను హతీమ్‌ను కాబా లోపల ఒక భాగంగా చేర్చి ఉండేవాణ్ణి. ఇంకా కాబా గృహ ద్వారాన్ని నేలమట్టానికి తగిలి ఉండేలా కట్టించి ఉండేవాణ్ణి.

**655.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నాతో ఇలా సెలవిచ్చారు 'నీ జాతి ప్రజల్లో అవిశ్వాసపు, అజ్ఞాన కాలపు భావాలు ఇంకా తాజాగా ఉండి ఉండకపోతే నేను కాబా గృహాన్ని పడగొట్టి హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గోడలపై దాన్ని పునర్నిర్మించి ఉండేవాణ్ణి. జరిగింది ఏమిటంటే, ఖురైషులు దాన్ని చిన్నదిగా చేశారు. అందులో ఒక ద్వారాన్ని ఆ ద్వారానికి ఎదురుగా ఉంచారు.

**656.** యజీద్ బిన్ రూమాన్ ఉర్వా నుంచి ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తనతో ఇలా అన్నారని. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా)తో అన్నారు: 'ఓ ఆయెషా! నీ జాతి ప్రజల అజ్ఞానకాలపు భావాలు ఇంకా తాజాగా ఉండి ఉండకపోతే, నేను కాబా గృహాన్ని పడగొట్టమని ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి. ఇంకా ఎంత భాగమైతే అందులోనుంచి తొలగించబడిందో అంత భాగాన్నీ అందులో ఒక భాగంగా చేసి ఉండేవాణ్ణి. ఇంకా దాని కుర్సీని నేలమట్టానికి తగిలించి ఉండేవాణ్ణి. మరియు అందులో రెండేసి ద్వారాలను పెట్టించి ఉండేవాణ్ణి. ఒకటి తూర్పు దిక్కున, మరొకటి పడమటి దిక్కున. ఇబ్రాహీమ్ (అ) గోడపై నిర్మించి ఉండేవాణ్ణి. ఈ హదీసునే అబ్దుల్లా బిన్ జుబైర్ (ర) విని తన ఖిలాఫత్ కాలంలో కాబా గృహాన్ని కూల్చివేయించారు. యజీద్ బిన్ రూమాన్ ఇలా అన్నారు నేను అప్పుడు అక్కడ ఉన్నాను. అబ్దుల్లా బిన్ జుబైర్ కాబా గృహాన్ని కూల్చివేశారు. మరియు దాన్ని పునర్నిర్మించారు. మరియు హతీమ్‌ను దాని లోపల పెట్టించారు. నేను అప్పుడు ఇబ్రాహీమ్ (అ) గారి రాళ్ళను చూశాను. అవి ఒంటెల మూపురాల ఆకారంలో ఉన్నాయి. జరీర్ బిన్ హాజిమ్ ఇలా అన్నారు: నేను యజీద్ బిన్ రూమాన్‌ను అడిగాను, 'ఇబ్రాహీమ్(అ) పాదాల చిహ్నం ఎక్కడుండేది? అని. ఆయన ఇలా అన్నారు 'నేను నీకు ఇప్పుడే చూపిస్తాను నాతో రా'. తరువాత నేను ఆయన గారితో హతీమ్‌లోకి వెళ్ళాను. ఆయన ఒక స్థలాన్ని చూపించి 'ఇదిగో, ఇక్కడ' అని అన్నారు. జరీర్ ఇలా అన్నారు 'నేను దాన్ని గురించి అంచనా వేశాను. హతీమ్ నుంచి అది ఆరు క్యూబిట్ల (మూరల) దూరంలో ఉండవచ్చు. లేదా అంతే దూరంలో ఉండవచ్చు.'

## 42వ అధ్యాయం

### కాబా గృహం ఉన్న భూమి ఔన్నత్యం

అల్లాహ్ (నమల్ సూరా **27: 91**లో) ఇలా సెలవిచ్చాడు 'ఓ ప్రవక్తా! వారితో ఇలా అను: ఈ నగరం (మక్కా) ప్రభువును మాత్రమే ఆరాధించాలని నాకు ఆజ్ఞ ఇవ్వబడింది. ఆయన దానిని పవిత్రమైన క్షేత్రంగా తీర్చిదిద్దాడు. ప్రతి దానికి ఆయనే యజమాని. ఇంకా నేను విధేయుడనై ఉండాలని కూడా నన్ను ఆజ్ఞాపించడం జరిగింది. మరియు (ఖసస్ సూరా **28: 57**లో) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'మేము శాంతికి నిలయమైన ఒక పవిత్ర స్థలాన్ని వారికి స్థిర నివాసంగా చేశాము. దానివైపునకు

అన్ని రకాల పండ్లు, ఫలాలు మా తరఫు నుండి జీవనోపాధిగా తరలివస్తున్నాయి. ఇది వాస్తవం కాదా? కాని చాలా మందికి ఈ విషయం తెలియదు."

**657.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు: 'ఏ రోజునైతే మక్కా మహానగరం జయించబడిందో ఆ రోజున అల్లాహ్ ఆ నగరాన్ని 'హరామ్'గా (గౌరవ ప్రదమైనదిగా) చేశాడు. అక్కడ ఉన్న ముల్లును సైతం త్రెంచివెయ్య కూడదు. అక్కడ ఉన్న వేట జంతువుల్ని తరమ రాదు, ఆ ప్రదేశంలో నేలపై పడి వున్న వస్తువుల్ని ఎత్తుకోకూడదు. కాని దాన్ని (వస్తువు యజమానికి) చేరవేసే వ్యక్తి ఎత్తుకోవచ్చు.'

## 43వ అధ్యాయం

మక్కా మహానగరంలోని గృహాలన్నీ వారసత్వపు ఆస్తులు కాగలవు. వాటిని అమ్మటం, కొనటం ధర్మసమ్మతమైన విషయమే. కాబా మసీదులో ప్రజలందరూ సమానులే. ఎందుకంటే, అల్లాహ్ (హజ్ సూరా **22: 25**లో) ఇలా సెలవిచ్చాడు 'ఎవరైతే తిరస్కరించారో మరియు అల్లాహ్ మార్గం వైపునకు రాకుండా జనుల్ని అడ్డగిస్తున్నారో- మేము సకల మానవుల కోసం నిర్మించిన పరిశుద్ధ మసీదులో స్థానిక ప్రజలకు మరియు బయటి నుంచి వచ్చేవారికి హక్కులు సమానంగా ఉన్నాయి- ఎవరైతే దాని సందర్శనానికి అవరోధంగా ఉన్నారో (వారి వైఖరి నిశ్చయంగా శిక్షార్హమైనదే). ఇందులో (పరిశుద్ధ మసీదులో) నిజాయితీ నుంచి వైదొలిగి అన్యాయపు పద్ధతిని అవలంబించేవానికి మేము వ్యధా భరితమైన శిక్షను రుచి చూపిస్తాము.'

**658.** ఉసామా బిన్ జైద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త ముహమ్మద్ (స) గారిని ఇలా అడిగాను, 'ఓ దైవప్రవక్తా(స)! మీరు మక్కానగరంలో ఎక్కడ దిగుతారు? మీ గృహంలోనా? లేక మరొకచోట ఎక్కడైనానా?' అప్పుడు మహా ప్రవక్త(స) మక్కా నగరానికి దగ్గరలో ఉన్నారు. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు, 'అఖీల్ మా కోసం ఏదైనా ఇంటినిగాని, ఆస్తినిగాని విడిచివెళ్ళలేదు కదా!' (ఆస్తులన్నింటినీ ఆయన అమ్మివేశారు కదా!) ఏమి జరిగిందంటే, అఖీల్ మరియు తాలిబ్ అబూతాలిబ్‌కు తమ తండ్రికి వారసులయ్యారు. జాఫర్ (ర) మరియు అలీ(ర) గార్లకు ఏమి లభించలేదు ఎందుకంటే, వారు ఉభయులు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములైపోయారు. ఆ సమయంలో అఖీల్, తాలిబ్ గార్లు ఇంకా అవిశ్వాసులుగానే ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా అనేవారు 'ఒక ముస్లిమ్, ఒక కాఫిర్‌కు

వారసుడు కాలేడు.' ఇబ్నె షిహాబ్ ఇలా అన్నారు: 'వారు ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ను ప్రమాణంగా తీసుకునేవారు.' (ఈ ఆయత్ అన్‌ఫాల్ సూరా: **8: 72**లో ఉంది) 'ఎవరైతే విశ్వసించారో మరియు తమ దేశాన్ని వదిలి వలసపోయారో, అల్లాహ్ మార్గంలో తమ ధన ప్రాణాలతో జిహాద్ చేశారో, ఎవరైతే వారికి ఆశ్రయాన్ని ఇచ్చారో వారికి సహాయం చేశారో వారే ఒకరికొకరు వారసులవుతారు.'

## 44వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా మహానగరంలో ఎక్కడ దిగారు?**

**659.** హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మినా నుంచి మక్కా నగరానికి తిరిగి వచ్చేటప్పుడు ఇలా సెలవిచ్చారు 'అల్లాహ్ గనుక కోరితే రేపు మనం ఖైఫె బనీ కినాన (అంటే ముహస్సబ్)లో దిగిపోతాము ఖురైష్ తెగకు చెందిన జనులు అవిశ్వాసం (కుఫ్ర్)పై స్థిరంగా ఉండే ప్రమాణం ఈ స్థలంలోనే చేశారు.'

**660.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు ఆయన(ర) ఇలా అన్నారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జిల్‌హజ్జ మాసం **11**వ తేదీన ఇలా సెలవిచ్చారు: ఆ సమయంలో ఆయన(స) మినాలో ఉన్నారు. 'మనం రేపు బనీ కినానలోని ఖైఫ్‌లో దిగుతాము. అక్కడే వారు అవిశ్వాసంపై స్థిరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.' అంటే ముహస్సబ్‌లో. దానికి సంబంధించిన వృత్తాంతం ఏమిటంటే, ఖురైష్ తెగకు చెందిన ప్రజలు మరియు కినానాకు చెందిన ప్రజలు బనీ హాషిమ్, బనీ ముత్తలిబ్ లేక బనీ అబ్దుల్ ముత్తలిబ్ లకు వ్యతిరేకంగా ప్రమాణం చేసి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఒప్పందం సారాంశమేమిటంటే, వారితో వివాహాలు చేసుకోవటంగాని, అమ్మకం, కొనుగోళ్ళు చెయ్యటంగాని జరగదు. వారు దైవప్రవక్త(స) గారిని మాకు అప్పజెప్పేవరకు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది.

## 45వ అధ్యాయం

కరుణామయుడైన అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ఇబ్రాహీమ్ సూరాలో ఇలా సెలవిచ్చాడు: 'ఇబ్రాహీమ్ ఇలా ప్రార్థించిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో: "ప్రభూ! ఈ నగరాన్ని (అంటే మక్కాను) శాంతి నగరంగా చెయ్యి. నన్నూ, నా సంతానాన్నీ విగ్రహ పూజ నుండి కాపాడు. ప్రభూ! ఈ విగ్రహాలు చాలా మందిని మార్గం తప్పిం

చాయి. (నా సంతానాన్ని కూడా ఇవి మార్గం తప్పించే అవకాశం ఉంది. కనుక వారిలో) నా విధానంపై నడిచేవాడు నా వాడు. నాకు వ్యతిరేకంగా ఉన్న విధానాన్ని ఎవరైనా అవలంబిస్తే నిశ్చయంగా నీవు క్షమించేవాడవు, కరుణామయుడవు. ప్రభూ! తృణకాష్ఠ జలరహితమైన లోయలో నా సంతానంలో కొందరిని తెచ్చి నీ పవిత్ర గృహం వద్ద నివసింపజేశాను. ప్రభూ! వారు ఇక్కడ నమాజును స్థాపించాలని నేను ఇలా చేశాను. కనుక నీవు ప్రజల హృదయాలను ఆసక్తితో వారి వైపునకు మొగ్గేలా చెయ్యి. తినటానికి వారికి పండ్లు ప్రసాదించు, బహుశా వారు కృతజ్ఞులవుతారేమో. ప్రభూ! మేము దాచే దానిని, బహిరంగ పరిచే దానిని నీవు ఎరుగుదువు. **(35- 37)**

## 46వ అధ్యాయం

అల్లాహ్ అల్ మాయిదా సూరాలో ఇలా సెలవిచ్చాడు: 'పవిత్ర గృహమైన కాబాను అల్లాహ్ మానవ జాతి (సమైక్య జీవన) సంస్థాపనకు సాధనంగా చేశాడు. ఇంకా పవిత్ర మాసాన్నీ, ఖుర్బానీ పశువులను, వాటి కంఠ పట్టికలను కూడా (ఈ కార్యసాధనలో సహాయపడేవిగా) చేశాడు. ఆకాశాలలో, భూమిలో ఉన్న పరిస్థితులన్నీ అల్లాహ్‌కు తెలుసనీ, ఆయన సర్వజ్ఞాని అని మీకు తెలియటానికి. తెలుసుకోండి! అల్లాహ్ శిక్షించటంలో కూడా కఠినుడు. దానితోపాటు ఆయన అధికంగా మన్నించే వాడు, కరుణించేవాడూను.'

**661.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: (ప్రళయానికి ముందు) 'ఇథియోపియాకు చెందిన రెండు సన్నని కాళ్ళవాడు అయిన హబషీ నీచుడు ఒకడు పవిత్ర కాబా గృహాన్ని నిర్మానుష్యం చేస్తాడు.'

**662.** హ్రజత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు : 'రమజాను ఉపవాసాలు విధిగా చెయ్యబడటానికి పూర్వం ఆషురా రోజున (ముహర్రమ్ మాసం పదవ తేదీనాడు) ప్రజలు ఉపవాసాన్ని పాటించేవారు.' రమజాను ఉపవాసాలు విధిగా నిర్ణయించ బడిన తరువాత దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'మీలో ఎవరైనాసరే, మీకు ఇష్టమైతే, మీ మనస్సు కోరితే (ఆషురా) ఉపవాసాన్ని పాటించవచ్చు. మీలో ఎవరైనా సరే మీ మనస్సు కోరితే, ఆషురా ఉపవాసాన్ని పాటించకుండా వదిలేయ వచ్చు. (అది నఫిల్ ఉపవాసమైపోయింది).

**663.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హ్రజత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు 'యాజూజ్, మాజూజ్‌లు ప్రత్యక్షమైన

తరువాత కూడా కాబా గృహానికి సంబంధించిన హజ్ యాత్రలు, ఉమ్రా యాత్రలు జరుగుతూనే ఉంటాయి.' షూబా గారి ఉల్లేఖనం ఒకటి అదనంగా ఇలా ఉంది 'పవిత్ర కాబా గృహానికి జరిగే హజ్ యాత్రలు ఆగిపోనంతవరకు ప్రళయ దినం స్థాపించ బడదు.'

## 47వ అధ్యాయం

### కాబా గృహానికి గిలాఫ్ తొడిగించటం లేక ఆచ్ఛాదన.

**664.** అబూ వాయిల్ ఇలా ఉల్లేఖించారు ఒక రోజున కాబా గృహం లోపల ఉన్న కుర్చీపై నేను షయ్‌బాతో కలిసి కూర్చున్నాను. ఆయన (షయ్‌బా) ఇలా అన్నారు– నిస్సందేహంగా హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఈ స్థలం వద్దనే కూర్చున్నారు. మరియు ఇలా అన్నారు, 'కాబా గృహం లోపల ఉన్నటువంటి వెండి బంగారాల సంపదను పంచి పెట్టకుండా విడిచి పెట్టకూడదు అని నేను సంకల్పించుకున్నాను.' అప్పుడు ఉమర్(ర) గారితో నేను ఇలా అన్నాను 'కాని మీ మిత్రులు ఇద్దరూ దైవప్రవక్త(స) మరియు హజ్రత్ అబూబకర్ (రజిఅన్) మీరు అనుకున్నట్లు చేయలేదు కదా!' హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు 'ఆ ఇద్దరు మహనీయులనే నేను ఎల్లప్పుడూ అనుసరిస్తూ వచ్చాను.'

## 48వ అధ్యాయం

### పవిత్ర కాబా గృహం కూల్చివేత

దైవప్రవక్త(స) గారు ఇలా అన్నారని హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు– 'ఇథియోపియా దేశానికి చెందిన సైన్యం ఒకటి పవిత్ర కాబా గృహంపై దాడి చేస్తుంది. కాని ఆ సైన్యం భూమిలో కూరుకుపోతుంది.'

**665.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్), దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా అన్నారని ఉల్లేఖించారు: 'నేను కాబా గృహాన్ని కూల్చివేసేవాణ్ణి చూస్తూ ఉన్నట్లుగా భావించాను. వాడు నల్లగా, పొట్టిగా ఉన్నాడు. వాడి కాళ్ళు సన్నగా ఉన్నాయి. వాడు పవిత్ర కాబాగృహ కట్టడాన్ని, అందులో ఉన్న ఇటుకల్ని పెకలించి కూల్చి వేస్తున్నాడు.'

**666.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఉల్లేఖించారు, ఇథియోపియా దేశానికి చెందిన సన్నని కాళ్ళుగల వ్యక్తి ఒకడు, పవిత్ర కాబా గృహాన్ని కూల్చివేస్తాడు.

## 49వ అధ్యాయం

### హజరె అస్వద్ (నల్లని రాయి)ని గురించి.

**667.** ఆబిస్ బిన్ రబీఅ ఇలా ఉల్లేఖించారు : హజ్రత్ ఉమర్(రజిఅన్) ఒకసారి హజరె అస్వద్ దగ్గరకు వచ్చి దాన్ని ముద్దు పెట్టుకున్నారు. తరువాత ఆయన(ర) ఇలా అన్నారు– 'నీవు కేవలం ఒక రాయివి మాత్రమే అని నాకు తెలుసు. నీవు ఎవరికైనా హానిని కలిగించలేవు, లాభాన్నీ కలిగించలేవు. దైవప్రవక్త(స) గారు నిన్ను ముద్దుపెట్టు కుంటూ ఉండగా నేను గనక చూసి ఉండకపోతే నేను ఎన్నడూ నిన్ను ముద్దు పెట్టుకుని ఉండేవాణ్ణి కాను.'

## 50వ అధ్యాయం

### పవిత్ర కాబా గృహ ద్వారాన్ని లోపల నుంచి మూసివేయటం. మరియు దానిలోని ప్రతి మూలలో నమాజు చెయ్యటం, ఇష్టమొచ్చిన స్థలంలో.

**668.** సాలిమ్ తన తండ్రి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) నుంచి ఇలా ఉల్లే ఖించారు: ఆయన ఇలా అన్నారు– దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) స్వయం గానూ, ఉసామా బిన్ జైద్ (రజిఅన్), బిలాల్ (రజిఅన్), ఉస్మాన్ బిన్ తల్హా (రజిఅన్)లతో కలిసి కాబా గృహం లోపలకు ప్రవేశించారు. లోపల నుంచి ద్వారాన్ని మూసి వేశారు. ద్వారాన్ని తెరిచినప్పుడు అందరికంటే ముందు నేను లోపలకు ప్రవేశించాను. బిలాల్(ర)ను కలుసుకున్నాను. నేను ఆయన గారిని ఇలా అడిగాను, 'దైవప్రవక్త(స) గారు ఇక్కడ నమాజు చేశారా? అని. ఆయన(ర) 'అవును నమాజు చేశారు. రెండు యమని స్తంభాల మధ్య' అని సమాధానం చెప్పారు.

## 51వ అధ్యాయం

### కాబా గృహం లోపలి భాగంలో నమాజు.

**669.** నాఫె ఇబ్నె ఉమర్ (రజిఅన్) గారి నుంచి ఇలా ఉల్లేఖించారు: ఆయన (ర) గారు కాబా గృహం లోపలకు వెళ్ళినప్పుడల్లా నేరుగా ముఖానికి ఎదురుగా వెళ్ళే వారు. మరియు కాబా గృహ ద్వారాన్ని వీపు వెనుక భాగంలో ఉండే విధంగా చూసి ముందుకు వెళ్ళేవారు. ఎంతగా ముందుకు పోయేవారంటే, ఆయనగారి ముఖానికి ఎదురుగా ఉన్న గోడ ఆయనకు మూడు మూరల దగ్గరలోనే ఉంటుంది. అక్కడ ఆయన(ర) నమాజు చేసేవారు. దైవప్రవక్త(స)గారు నమాజు చేసిన స్థలాన్ని లక్ష్యంగా

చేసుకుని, సంకల్పించుకుని నమాజు చేసేవారు. హజ్రత్ బిలాల్ (ర) ఆయనకు చెప్పిన విధంగా ఇబ్నె ఉమర్(ర) ఇలా అనేవారు, 'కాబా గృహంలో ఎటువైపు నమాజు చేసినా ఎక్కడ చేసినా దోషం లేదు.'

## 52వ అధ్యాయం

**కాబా గృహం లోపలకు పోవటం ఏమంత అవసరమైన విషయమేమీ కాదు. ఇబ్నెఉమర్(ర) తరచూ హజ్ చేస్తూ ఉండేవారు. కాబా గృహం లోపలకు వెళ్ళే వారు కాదు.**

**670.** అబ్దుల్లాహ్ బిన్ అవ్‌ఫా(రజిఅన్) ఇలా అన్నారని ఇస్మాయీల్ బిన్ అబూ ఖాలిద్ ఉల్లేఖించారు: దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉమ్రాను నిర్వహించారు. అప్పుడు ఆయన(స) కాబా గృహం ప్రదక్షిణ చేశారు. ఇంకా మఖామె ఇబ్రాహీమ్ వెనుక ఉన్న స్థలంలో రెండు రకాతులు నమాజు చేశారు. ఆయన (స) గారితో ఉన్న కొందరు జనులు ఆయన(స) గారికి అడ్డంగా, తెరగా నిలబడి ఉన్నారు. వారిలోని ఒక వ్యక్తి ఇబ్నె అబీ ఔఫాను, దైవప్రవక్త(స) గారు కాబా గృహం లోపలక్కూడా వెళ్ళారా?' అని అడిగాడు. సమాధానంగా అతను 'వెళ్ళలేదు' అని అన్నాడు.

## 53వ అధ్యాయం

**కాబా గృహంలోని నాలుగు మూలల్లో 'అల్లాహు అక్బర్' అని పలకటం.**

**671.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు మక్కా విజయం తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కాబా గృహం వద్దకు విచ్చేశారు. అప్పుడు ఆయన(స) గారు కాబా గృహం లోపలకు ప్రవేశించటానికి తిరస్కరించారు. ఎందుకంటే, అక్కడ విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉన్నాయి. తరువాత దైవప్రవక్త(స)గారు ఆజ్ఞాపించిన కారణంగా ఆ విగ్రహాలు అక్కడి నుంచి తొలగించబడ్డాయి. జనులు హజ్రత్ ఇబ్రాహీమ్(అ), హజ్రత్ ఇస్మాయీల్(అ)ల విగ్రహాలను కూడా తొలగించారు. వారి చేతుల్లో పాచికలు ఉన్నాయి. వాటిని చూసి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ ముష్రిక్కులను సర్వనాశనం చేయుగాక! అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. వారికి బాగా తెలుసు- ఇబ్రాహీమ్ (అ), ఇస్మాయీల్ (అ)లు ఎన్నడూ పాచికలు విసరలేదని. ఆ తరువాత దైవప్రవక్త(స)గారు కాబా గృహంలోకి ప్రవేశించారు.

మరియు అందులోని మూలల్లో 'అల్లాహు అక్బర్'అని ఆయన(స) పలికారు. కాని నమాజు చెయ్యలేదు.

## 54వ అధ్యాయం

### రమల్ చేసే ఆచారం ఎలా ప్రారంభమయింది?

**672.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన(ర) ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మరియు ఆయన (స)గారి సహాబాలు కలిసి మక్కా నగరంలోకి వచ్చారు. అప్పుడు ముష్రిక్కులు ఇలా అనసాగారు- 'దైవప్రవక్త ముహమ్మద్(స) వస్తున్నారు. ఆయన(స)తోపాటు మదీనా జ్వరం తగలటం వల్ల బలహీనతకు గురిఅయినవారు కూడా ఉన్నారు'. తరువాత (ముష్రిక్కులు చెప్పిన మాట అబద్ధమని నిరూపించటానికి) దైవప్రవక్త(స)గారు తన సహాబాలను, తవాఫ్‌కు ముందు మొదటి మూడు ప్రదక్షిణలలో 'రమల్' చెయ్యమని ఆజ్ఞాపించారు. మరియు రెండు యమనీ మూలల మధ్య మామూలు నడక నడవమని కూడా ఆజ్ఞాపించారు. ఆయన(స)గారు అన్ని ప్రదక్షిణలలో 'రమల్'[1] చెయ్యమని వారిని ఆజ్ఞాపించలేదు. ఎందుకంటే, వారికి సౌలభ్యం కలగాలని.

## 55వ అధ్యాయం

**ఎవరైనా మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు, మొట్ట మొదట వారు హజ్రె అస్వద్‌ను ముద్దు పెట్టుకోవాలి. అంటే తవాఫ్ ప్రారంభించేటప్పుడు అని భావం. మరియు మొదటి మూడు ప్రదక్షిణల్లో రమల్ చెయ్యాలి.**

**673.** తన తండ్రిగారైన అబ్దుల్లా బిన్ ఉమర్(రజి అన్) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ సాలిమ్ ఉల్లేఖించారు 'నేను దైవప్రవక్త మహాశయులు ముహ మ్మద్(స)గారిని చూశాను. ఆయన(స) గారు మక్కా మహానగరానికి వచ్చినప్పుడల్లా తవాఫ్‌ను ప్రారంభించేటప్పుడు మొట్టమొదట హజ్రె అస్వద్‌ను ముద్దు పెట్టుకునేవారు. మరియు ఏడు తవాఫ్‌లలోని మొదటి మూడు తవాఫ్‌లలో రమల్ చేసేవారు.

---

672-1. రమల్ అంటే, తవాఫ్‌కు ముందు చెయ్యబడే మూడు ప్రదక్షిణలలో కొంచెం తొందర తొందరగా నడవటం అని భావం. ఇది మస్నూన్. హనఫీ విద్వాంసుల ప్రకారం భుజాలు ఊపుకుంటూ యుద్ధానికిపోయే వ్యక్తి మాదిరిగా నిక్కుతూ నడవటం. దీన్నే రమల్ అంటారు.

## 56వ అధ్యాయం

### హజ్‌లోనూ, ఉమ్రాలోనూ 'రమల్' చెయ్యటం గురించి

**674.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన (ర) ఇలా అన్నారు 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మొదటి మూడు రౌండ్లలో పరుగెత్తుకుంటూ అంటే వేగంగా నడిచారు (రమల్ చేశారు). మరియు మిగతా నాలుగు రౌండ్లలో మామూలు నడక నడిచారు. హజ్ మరియు ఉమ్రా రెండింటిలోను ఇలాగే చేశారు.

**675.** తన తండ్రి గారు ఇలా సెలవిచ్చారని, జైద్ బిన్ అస్లమ్ ఉల్లేఖించారు హజ్రత్ ఉమర్(రజిఅన్) హజ్రె అస్వద్‌ను సంబోధిస్తూ ఇలా అన్నారు: 'అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. నీవు కేవలం ఒక రాయివి మాత్రమేనని నాకు తెలుసు. నీ వల్ల లాభమూ కలగదు, నష్టమూ కలగదు. దైవ ప్రవక్త మహాశయులు (స)గారు నిన్ను ముద్దు పెట్టుకుంటూ ఉండగా నేను గనక చూసి ఉండకపోతే నేను నిన్ను ఎన్నటికీ ముద్దుపెట్టుకునేవాణ్ణి కాను.' తరువాత ఆయన(ర) ఇలా అన్నారు 'ఇప్పుడు మనకు రమల్ చేసే అవసరమేముంది? మనం ముష్రిక్కులను చూపించటానికే రమల్ చేసే వారము. ఇప్పుడైతే అల్లాహ్ వారిని నాశనం చేశాడు కదా!' ఆ తరువాత ఆయన(ర) ఇలా అనసాగారు. 'ఆ ఆచారాన్నయితే దైవప్రవక్త(స) గారు చేశారు కనుక దాన్ని విడిచిపెట్టడం మాకు ఇష్టం లేదు.'

**676.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారని, ఉబేదుల్లా ఉమ్రి నాఫె నుంచి ఉల్లేఖించారు: నేను హజరె అస్వద్‌నూ మరియు రుకునే యమానీని ముద్దుపెట్టుకోవటాన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు, జనుల సంఖ్య ఎక్కువగా ఉండి కష్టంగా ఉన్నప్పటికీ మరియు జనుల సంఖ్య తక్కువగా ఉండి సులభంగా ఉన్నప్పటికీ. దైవప్రవక్త(స) గారు పైన పేర్కొన్న రాళ్ళను ముద్దుపెట్టుకోవటాన్ని చూసినప్పటి నుంచి నేను ఇలా చేస్తూనే ఉన్నాను. ఉబేదుల్లా ఇలా అన్నారు- 'నేను, ఇబ్నె ఉమర్(ర) రెండు యమానీ మూలల మధ్య సాధారణమైన నడకతోనే నడిచేవారా?' అని నాఫెను అడిగాను. ఆయన ఇలా అన్నారు, 'అవును, మామూలు నడకతోనే నడిచేవారు. ఎందుకంటే హజ్రె అస్వద్‌ను ముద్దుపెట్టుకోవటం కష్టతరంగా ఉండకూడదని.'

## 57వ అధ్యాయం

### కర్రతో హజ్రే అస్వద్‌ను తాకటం మరియు దానిని ముద్దు పెట్టుకోవటం.[1]

**677.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఆయన ఇలా అన్నారు-

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్జతుల్ విదాలో (దైవప్రవక్తగారి చివరి హజ్ యాత్రలో) ఒక ఒంటెపై స్వారీ చేస్తూ కాబా చుట్టూ తవాఫ్ చేశారు. ఆయన (స) హజ్రే అస్వద్‌కు ఒక కర్రపెట్టి ముద్దుపెట్టుకున్నారు.'

## 58వ అధ్యాయం

### రెండు యమాని స్తంభాలు తప్ప ఇతర స్తంభాలను ముద్దు పెట్టుకోవటం.

అబూ అష్‌షా ఇలా అన్నారు: 'కాబాకు చెందిన ఏ వస్తువుకైనా ఎవరు దూరంగా ఉండగలరు? హజ్రత్ ముఆవియా (రజిఅన్) నాలుగు స్తంభాలను కూడా ముద్దుపెట్టుకునేవారు.' అప్పుడు ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఆయన (ర) గారితో ఇలా అన్నారు 'ఈ రెండు స్తంభాలను అంటే, షామీ మరియు ఇరాఖీ స్తంభాలను మేము ముద్దు పెట్టుకోము.' హజ్రత్ ముఆవియా (ర) ఆయనతో ఇలా అన్నారు : పవిత్ర కాబా గృహానికి చెందిన ఏ వస్తువైనా విడిచిపెట్టతగింది కాదు. అబ్దుల్లా బిన్ జుబైర్ (ర) కూడా నాలుగు స్తంభాలను ముద్దుపెట్టుకునేవారు.

**678.** తన తండ్రిగారు ఇలా అన్నారని సాలిమ్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖించారు- దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) గారు పవిత్ర కాబా గృహానికి చెందిన ఏ మూలనూ ముద్దుపెట్టుకుంటున్నట్లుగా నేను చూడలేదు, ఒక్క రెండు మూలలను తప్ప. (యమన్‌కు ఎదురుగా ఉన్న మూలలను తప్ప)

## 59వ అధ్యాయం

### హజ్రే అస్వద్‌ను ముద్దుపెట్టుకోవటం.

**679.** తన తండ్రిగారు ఇలా సెలవిచ్చారని, జైద్ బిన్ అస్లమ్ ఉల్లేఖించారు- నేను హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజిఅన్) గారిని హజ్రే అస్వద్‌ను ముద్దు పెట్టు కుంటూ ఉండగా చూశాను. తరువాత ఆయన (ర) హజ్రే అస్వద్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) నిన్ను ముద్దు పెట్టుకుంటూ

---

57-1. చాలామంది పండితుల అభిప్రాయమేమిటంటే హజ్రే అస్వద్‌కు నోరు ఆనించి ముద్దు పెట్టుకోవాలి అనేది. ఒకవేళ ఇది సాధ్యం కాకపోతే, అప్పుడు చేత్తో తాకి ముద్దుపెట్టుకోవాలి. ఒకవేళ ఇది కూడా సాధ్యపడకపోతే, అప్పుడు కర్రను ఆనించి దాన్ని ముద్దు పెట్టుకోవాలి. ఒకవేళ ఇది కూడా సాధ్యం కాకపోతే అప్పుడు, హజ్రే అస్వద్ ముందు భాగానికి చేరినప్పుడు, చేత్తో దానివైపునకు సంజ్ఞ చేసి దాన్ని ముద్దు పెట్టుకోవాలి.

ఉండగా నేను గనక చూసి ఉండకపోతే ఈనాడు నేను నిన్ను ముద్దు పెట్టుకునే వాణ్ని కాను.'

**680.** జుబేర్ బిన్ అరబీ ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి (జుబైర్) అబ్దుల్లా బిన్ ఉమర్ (ర)ను హజరే అస్వద్‌ను ముద్దుపెట్టుకోవటం గురించి అడిగాడు. అప్పుడు ఆయన ఇలా అన్నారు. నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారిని చూశాను ఆయన (స) దాన్ని చేత్తో తాకేవారు, దాన్ని ముద్దుపెట్టుకునేవారు. ఆ వ్యక్తి ఇలా అన్నాడు : 'ఒకవేళ అక్కడ జన సమూహం పోగైతేనో, లేక నేను నిస్సహాయుడ నైతేనో, అప్పుడు నేను ఏమి చెయ్యాలి?' ఆయన ఇలా అన్నారు: అయితే గియితే అనే పదాలు యమన్ దేశానికి పోయి అను. నేను దైవప్రవక్త (స) గారిని చూశాను. ఆయన హజరే అస్వద్‌ను తమ చేత్తో తాకేవారు మరియు దాన్ని ముద్దు పెట్టుకునే వారు.'

## 60వ అధ్యాయం

**హజ్రె అస్వద్‌కు ముందు భాగంలోకి వచ్చి సంజ్ఞ చెయ్యటం (ముద్దు పెట్టుకోవటం సాధ్యం కానప్పుడు)**

**681.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన(ర) ఇలా అన్నారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒంటెపై స్వారీ చేస్తూ తవాఫ్ చేశారు. హజ్రె అస్వద్ ముందుకు వచ్చినప్పుడల్లా ఏదో ఒక వస్తువుతో సంజ్ఞ చేసేవారు.

## 61వ అధ్యాయం

**హజ్రె అస్వద్ ముందుకు వచ్చి అల్లాహు అక్బర్ అని పలకటం.**

**682.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు– ఆయన ఇలా అన్నారు: 'దైవప్రవక్త మహాశయులు ముహ మ్మద్(స) ఒంటెపై స్వారీ చేస్తూ తవాఫ్ చేశారు. ఆయన (స) గారు హజ్రె అస్వద్ ముందుకు వచ్చినప్పుడల్లా తన వద్ద ఉన్న వస్తువుతో సంజ్ఞ చేసేవారు. మరియు 'అల్లాహు అక్బర్' అని పలికేవారు.'

## 62వ అధ్యాయం

ఒక వ్యక్తి ఎవరైనా మక్కా నగరంలోకి (హజ్ యాత్ర కోసం గాని లేక ఉమ్రా చేసే సంకల్పంతోగానీ) వచ్చినట్లయితే అప్పుడు తన ఇంటికి తిరిగి వెళ్ళిపోయే ముందు తవాఫ్ చెయ్యాలి. తరువాత రెండు రకాతులు నమాజ్ చెయ్యాలి. ఆ తరువాత సఫా కొండపైకి పోవాలి.

**683.** 'హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా అన్నారని ఉర్వా ఉల్లేఖించారు. మక్కా మహా నగరానికి చేరినప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) చేసిన మొట్టమొదటి పని ఏమిటంటే, ఆయన (స)గారు వుజూ చేసుకున్నారు. తరువాత ఆయన(స) కాబా గృహం తవాఫ్ చేశారు. అది ఉమ్రా కాదు. కాని హజ్జుల్ ఖిరాన్. ఉర్వా అదనంగా ఇలా చెప్పారు 'ఆ తరువాత హజ్రత్ అబూబకర్(ర), హజ్రత్ ఉమర్(ర) తాము చేసిన హజ్జ్ యాత్రలో పైవిధంగానే చేశారు. నేను నా తండ్రి గారు జుబైర్ (ర)గారితోపాటు హజ్జ్ చేశాను. ఆయన చేసిన మొట్టమొదటి పని ఏమిటంటే, కాబా ప్రదక్షిణం. ఆ తరువాత నేను ముహాజిర్లను అన్సారులను పైవిధంగానే చేస్తూ ఉన్నట్లుగా చూశాను. నా తల్లి అస్మా(ర) నాకు ఇలా చెప్పారు: ఆమెగారు, ఆమె గారి సోదరీమణి హజ్రత్ ఆయెషా(ర), జుబైర్(ర) మరియు ఫలానా, ఫలానా వ్యక్తులు ఇహ్రామ్‌ను ఉమ్రా కోసం ధరించారు. వారు తమ చేతుల్ని నల్లరాయి మీద త్రిప్పిన తరువాత ఇహ్రామ్‌ను విప్పివేశారు. అంటే సఫా మర్వాల మధ్య తవాఫ్ చేసిన తరువాత.

**684.** హజ్రత్ అబ్దుల్లా బిన్‌ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కాబా తవాఫ్‌ను హజ్ కోసం లేక ఉమ్రా కోసం నిర్వహించిన తరువాత మొదటి మూడు ప్రదక్షిణల్లో ఆయన రమల్ చేసేవారు. మరియు చివరి నాలుగు ప్రదక్షిణల్లో ఆయన నడిచేవారు, అప్పుడు తవాఫ్ తరువాత ఆయన రెండు రకాతులు నమాజు చేసేవారు. ఆ తరువాత సఫా, మర్వాల మధ్య తవాఫ్ చేసేవారు.

**685.** ఇబ్నెఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కాబా తవాఫ్‌ను ముగించిన తరువాత మొదటి మూడు రౌండ్లలో ఆయన(స) రమల్ చేశారు. మరియు చివరి నాలుగు రౌండ్లలో ఆయన(స) నడిచే వారు. సఫా మర్వాల మధ్య తవాఫ్ చేసేటప్పుడు ఆయన(స) పల్లపు ప్రాంతంలో పరుగెత్తేవారు.'

## 63వ అధ్యాయం

స్త్రీలు కూడా పురుషులతోపాటే కలిసి తవాఫ్ చెయ్యవచ్చునా? లేక వేర్వేరుగా చెయ్యాలా? ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు: అతా మాతో ఇలా అన్నారు: 'పురుషులతో కలిసి స్త్రీలు తవాఫ్ చెయ్యటాన్ని ఇబ్నె హిష్షామ్ నిషేధించారు కదా!' అప్పుడు

ఆయన అతనితో ఇలా అన్నారు: 'స్వయంగా దైవప్రవక్త(స) గారి భార్యలే పురుషులతో కలిసి తవాఫ్ చేసినప్పుడు, నీవు వారిని ఎలా వారించగలవు?' అప్పుడు నేను ఇలా అన్నాను. ఇది హిజాబ్ ఆజ్ఞలు రాక మునుపే జరిగిందా లేక తరువాతనా?' అతా ప్రమాణం చేశారు మరియు అన్నారు- హిజాబ్ ఆజ్ఞలు వచ్చిన తరువాతనే నేను చూశాను.' నేను ఇలా అన్నాను : "వారు పురుషులతో కలిసి తవాఫ్ ఎలా చేసేవారు?' అప్పుడు అతా ఇలా అన్నారు: 'స్త్రీలు పురుషులతో అసలు కలిసేవారే కాదు. హజ్రత్ ఆయెషా(ర) తవాఫ్‌ను వేరుగానే, పురుషులతో కలవకుండానే చేసేవారు. ఆమె(ర) గారు పురుషులతో అసలు కలిసేవారే కాదు.' ఒకసారి ఇలా జరిగింది: హజ్రత్ ఆయెషా (ర) తవాఫ్‌ను నిర్వహిస్తున్నారు. ఒక స్త్రీ ఆమె గారిని ఉద్దేశించి ఇలా అడిగారు: 'ఓ విశ్వాసుల తల్లీ! మనం హజరె అస్వద్‌ను కలిసి తాకుదామా?' ఆయెషా (ర) ఇలా సెలవిచ్చారు: 'నువ్వే వెళ్ళు హజరె అస్వద్‌ను నువ్వే ముట్టుకో' అని ఆ స్త్రీ మాటల్ని తోసిపుచ్చారు. దైవప్రవక్త(స) గారి భార్యలు (ర) రాత్రి సమయాల్లో బయటకు వచ్చేవారు. మారువేషంలో వచ్చేవారు. ఎవరూ గుర్తు పట్టటానికి వీలు లేకుండా వచ్చేవారు. పురుషులతో కలిసి తవాఫ్ చేసేవారు. కాని కాబా గృహంలోకి ప్రవేశించే సంకల్పం చేసుకున్నప్పుడు మాత్రం పురుషులందరూ బయటికి వెళ్ళిపోయేవరకు ఆగి ఉండేవారు. నేను, ఉబేద్ బిన్ ఉమైర్ ఉభయులం హజ్రత్ ఆయెషా(ర) వద్దకు వస్తూపోతూ ఉండేవారం. అప్పుడు ఆమె(ర)గారు జౌఫ్ సాబిర్‌లో నివసిస్తూ ఉండేవారు. అప్పుడు నేను ఇలా అడిగాను: 'ఆమె(ర) ఎలాంటి హిజాబ్‌ను ధరించేవారు?' అతా ఇలా అన్నారు: 'ఆమె గారు అప్పుడు పాతబడిన ఒక టర్కిష్ హిజాబ్‌ను ధరించేవారు. ఆ టర్కిష్ హిజాబ్ (ఆచ్ఛాదన) ఒక్కటే మాకూ, ఆమె గారికీ మధ్య ఒక స్క్రీన్‌గా పనిచేసేది. నేను గులాబీ రంగు గల ఒక ఆచ్ఛాదనను ఆమె(ర)గారిపై ఉన్నట్లు గమనించాను.'

**686.** ఉమ్మె సలమా (ర) దైవప్రవక్త(స)గారి భార్య ఇలా ఉల్లేఖించారు: 'నేను అనారోగ్యంతో ఉన్నానని దైవప్రవక్త(స) గారికి తెలియజేశాను.' అప్పుడు ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు : 'ప్రజల వెనుక ఒంటెపై స్వారీ చేస్తూ తవాఫ్ చెయ్యి.' నేను ఆయన(స)గారి ఆదేశం ప్రకారమే చేశాను. అప్పుడు దైవప్రవక్త(స) గారు కాబా గృహం పక్కన కూర్చొని దుఆ చేస్తున్నారు. పవిత్ర గ్రంథంలోని తూర్ సూరాను పఠిస్తున్నారు.

## 64వ అధ్యాయం

### తవాఫ్ చేసే సమయంలో మాట్లాడటం గురించి-

**687.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి కాబా గృహ ప్రదక్షిణం చేస్తూ ఉన్నారు. అప్పుడు ఆయన ఒక వ్యక్తిని చూడటం జరిగింది. అతను తన చేతిని మరొక వ్యక్తితో తాడుతోనో లేక దారం తోనో లేక మరొక వస్తువు దేనితోనో కట్టుకున్నాడు. దైవప్రవక్త(స) గారు దాన్ని తన చేత్తో కోసిపారేశారు. తరువాత ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు: 'చేయి పట్టుకుని అతన్ని' మీతో తీసుకెళ్ళండి."

## 65వ అధ్యాయం

**తవాఫ్‌లో ఉన్నప్పుడు ఎవరినైనా దారంతో గాని లేక మరొక వస్తువు దేనితోనైనా గాని కట్టుకుని ఉండ టాన్ని చూస్తే- అంటే (అసహ్యకరమైన వస్తువు దేనితో నైనా కట్టుకుని ఉండటాన్ని చూస్తే) అప్పుడు దాన్ని కోసిపారేయవచ్చు.**

**688.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి ఒక మనిషిని చూశారు. అతను కాబా గృహ ప్రదక్షిణం చేస్తు న్నాడు. అతను తోటకు చెందిన త్రాడునో లేక దారంనో కట్టుకుని ఉన్నాడు. దైవ ప్రవక్త(స) దాన్ని కోసిపారేశారు.

## 66వ అధ్యాయం

నగ్నంగా ఉన్న స్థితిలో ఒక మనిషి ఎవరైనా సరే కాబా గృహ ప్రదక్షిణం చెయ్య టానికి వీలు లేదు. ఆ మేరకు అతనికి అనుమతి లేదు. అదేవిధంగా అవిశ్వాసి అయిన ఒక మనిషికి హజ్జ్ చేసే అనుమతి కూడా లేదు.

**689.** హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు, దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స)గారి చివరి హజ్జ్ యాత్రకు ఒక సంవత్సర కాలం ముందు, దైవప్రవక్త(స) గారు హజ్రత్ అబూబకర్‌ను హజ్జ్ యాత్రికులకు నాయకుడుగా చేసినప్పుడు, అబూబకర్ (ర) నన్ను కొందరు ప్రజలతో ఒక బహిరంగ ప్రకటన చెయ్యటానికి పంపారు. ఆ ప్రకటన ఏమిటంటే, 'ముష్రిక్కు అనే వాడెవ్వడూ ఇక ముందు ఈ సంవత్సరం తరువాత హజ్జ్ చెయ్యటానికి రాకూడదు. నగ్న స్థితిలో ఉన్న ఏ మనిషీ కాబా గృహ ప్రదక్షిణం చెయ్యకూడదు."

## 67వ అధ్యాయం

## ఒకవేళ తవాఫ్ చేస్తూ చేస్తూ మధ్యలో ఆగిపోవలసి వస్తే అప్పుడు ఏమి చెయ్యాలి? అనే విషయం గురించి ఆదేశం -

**అతా ఇలా అన్నారు; 'ఒక వ్యక్తి ఎవరైనా తవాఫ్ చేస్తూ ఉన్నప్పుడు నమాజుకు సంబంధించిన తక్బీరు అవుతూ వుంటే, లేక ఆ స్థలం నుంచి తొలగింపబడి నట్లయితే అప్పుడు సలామ్ చేసి (లేక అవకాశాన్ని పొంది) మరలివస్తే అప్పుడు ఆగిపోయిన తవాఫ్ నుంచే ప్రారంభించాలి. అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్), అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్ (రజిఅన్)లు కూడా ఈ విషయాన్నే ఉల్లేఖించారు.**

## 68వ అధ్యాయం

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఏడు రౌండ్లు చేసిన తరువాత అంటే, ఏడు తవాఫ్‌లు (కాబా చుట్టూ ప్రదక్షిణ) చేసిన తరువాత రెండు రకాతులు నమాజు చేసేవారు. నాఫె ఇలా ఉల్లేఖించారు; 'ఇబ్నె ఉమర్(ర) ప్రతి ఏడు రౌండ్ల తరువాత రెండు రకాతుల నమాజు చేసేవారు. ఇస్మాయిల్ బిన్ ఉమయ్య ఇలాఅన్నారు; 'అతా ఇలా అన్నారని నేను జుహ్రీకి చెప్పాను; విధిగా చెయ్యవలసిన నమాజు రెండు రకాతుల నమాజు చేసే బాధ్యతనుంచి విముక్తి కలిగిస్తుంది.' అజ్‌జుహ్రి ఇలా అన్నారు; 'దైవప్రవక్త(స) గారి సంప్రదాయాన్ని పాటించటమే ఉత్తమమైనది. దైవ ప్రవక్త (స) గారు రెండు రకాతుల నమాజు చేయకుండా ఎన్నడూ ఏడు రౌండ్ల తవాఫ్‌ను చెయ్యలేదు.'

**690.** అమ్ర్ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) గారిని మేము ఇలా అడిగాము; 'సఫా మర్వాల మధ్య తవాఫ్ చేసే ముందు ఉమ్రాలో ఉన్నప్పుడు ఒక మనిషి ఎవరైనా తన భార్యతో కలవచ్చునా?' ఆయన(ర) గారు ఇలా అన్నారు; దైవప్రవక్త(స) గారు మక్కా పట్టణానికి వచ్చారు; తరువాత ఆయన(స) కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణం చేశారు. ఆ తరువాత మఖామె ఇబ్రాహీమ్ వెనుక రెండు రకాతులు నమాజు చేశారు. తరువాత సఫా మర్వాల మధ్య తవాఫ్ చేశారు. ఇబ్నె ఉమర్(రజి) ఇంకా ఇలా సెలవిచ్చారు; 'నిజంగానే మహాప్రవక్త(స) గారిలో మీకు ఉత్తమ ఆదర్శం ఉంది.' నేను జాబిర్ బిన్ అబ్దుల్లా (ర) గారిని పైన పేర్కొన్న ప్రశ్ననే అడిగాను.

ఆయన ఇలా సమాధానం చెప్పారు; 'మీరు మీ భార్యల వద్దకు కలయిక నిమిత్తం సఫా మర్వాల మధ్య తవాఫ్ చేసే అంతవరకు పోరాదు.'

## 69వ అధ్యాయం

**ఏ వ్యక్తి అయితే మొదటి తవాఫ్ అంటే 'తవాఫె ఖుదూమ్' తరువాత మళ్ళీ కాబా దగ్గరకు వెళ్ళకుండా, హజ్జ్ కోసం అరఫాత్‌కు వెళతాడో...**

**691.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా పట్టణంలో తమ పవిత్రమైన పాదాలను మోపారు. తరువాత ఏడుసార్లు కాబా గృహ ప్రదక్షిణం చేశారు, సఫా మర్వాల మధ్య పరుగులు తీశారు, తవాఫ్ చేసిన తరువాత మళ్ళీ బైతుల్లా వద్దకు ఆయన(స) పోలేదు. చివరకు హజ్జ్‌ను పూర్తి చేసుకుని అరఫాత్ నుంచి మరలివచ్చారు.

## 70వ అధ్యాయం

**తవాఫ్‌కు సంబంధించిన రెండు రకాతుల నమాజును మసీదు బయట చెయ్యటం. హజ్రత్ ఉమర్(రజిఅన్) కూడా హరమ్ బయట తవాఫ్‌కు చెందిన రెండు రకాతుల నమాజును చేశారు.**

**692.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ప్రియ సతీమణి ఉమ్మె సలమా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త(స) గారికి నా అస్వస్థతను గురించి తెలియజేశాను. (ఇతర ఉప ఉల్లేఖకుల ద్వారా), ఉమ్మె సలమా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు- దైవప్రవక్త(స)గారు మక్కా నగరంలో ఉన్నప్పుడు- ఆయన అప్పుడే మక్కా నగరాన్ని విడిచివెళ్ళిపోయే నిర్ణయం తీసుకున్నారు. (ఆమె గారు కాబా గృహ ప్రదక్షిణాన్ని ఇంకా చెయ్యలేదు)- ఆమె గారు చెప్పింది విన్న తరువాత దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు 'ఉదయం నమాజు స్థాపించబడిన తరువాత నీ ఒంటె మీద ఉన్నప్పుడే తవాఫ్ చెయ్యి. అప్పుడు ప్రజలు ఇంకా నమాజులోనే నిమగ్నమై ఉంటారు.' దైవప్రవక్త(స) గారి ఆజ్ఞానుసారం ఆమె ఆ విధంగానే చేశారు. మసీదులో నుంచి బయటకు వచ్చేవరకు ఆమె గారు తవాఫ్‌కు చెందిన రెండు రకాతుల నమాజును చెయ్యలేదు.

## 71వ అధ్యాయం

**తవాఫ్‌కు సంబంధించిన రెండు రకాతుల నమాజును మఖామె ఇబ్రాహీమ్ వెనుక ఉన్న స్థలంలో చెయ్యటం.**

**693.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా నగరానికి చేరుకున్నారు. కాబా గృహాన్ని ఏడుసార్లు ప్రదక్షిణ చేశారు. తరువాత మఖామె ఇబ్రాహీమ్ వెనుక రెండు రకాతులు నమాజు చేశారు. ఆ తరువాత ఆయన(స) సఫా వైపునకు వెళ్ళారు. అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 'నిజంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు చక్కని ఆదర్శం ఉంది.'

## 72వ అధ్యాయం

ఉదయం, అసర్ నమాజుల తరువాత కాబా గృహం చుట్టూ తవాఫ్ చెయ్యటం. ఇబ్నె ఉమర్(రజిఅన్) తవాఫ్‌కు సంబంధించిన రెండు రకాతుల నమాజును సూర్యోదయానికి ముందే చేసేవారు. ఉమర్ (ర) ఉదయం నమాజు తరువాతనే కాబా గృహం ప్రదక్షిణ చేసేవారు. ఆ తరువాత తన ఒంటెపైకి ఎక్కేవారు. తవాఫ్‌కు సంబంధించిన రెండు రకాతుల నమాజును జీ-తువాకు చేరేవరకు ఆయన చేసేవారు కాదు.

**694.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా అన్నారని ఉర్వా ఉల్లేఖించారు: 'కొంతమంది ప్రజలు ఉదయం నమాజు తరువాతనే కాబా గృహ ప్రదక్షిణం చేసేవారు. తరువాత ఒక మత బోధకుని ఉపన్యాసం వినటానికి అక్కణ్ణే కూర్చుండిపోయేవారు. ఈ హితబోధను సూర్యోదయం అయ్యేవరకు వారు వినేవారు. ఆ తరువాత నమాజు కోసం నిలబడేవారు.' అప్పుడు హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు- నమాజు చెయ్యటం మక్రూహ్ అయిన సమయం సమాప్తమయ్యే వరకు వారు కూర్చునే ఉండే వారు. ఆ తరు వాత వారు నమాజు కోసం నిలబడేవారు.

**695.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను అని హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ఉమర్(రజిఅన్) అన్నారు: 'ఆయన(స)గారు సూర్యుడు ఉదయించేటప్పుడు, సూర్యుడు అస్తమించేటప్పుడు నమాజు చెయ్యటాన్ని నిషేధించారు.'

**696.** అబ్దుల్ అజీజ్ బిన్ రుఫయ్ ఇలా అన్నారు- నేను అబ్దుల్లా బిన్ జుబేర్‌ను కాబా గృహం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ ఉండగా చూశాను. ఆయన(ర) ఫజర్ నమాజు తరువాత తవాఫ్ చేస్తూ ఉన్నారు. తవాఫ్‌కు సంబంధించిన రెండు రకాతుల నమాజును కూడా చేశారు. అబ్దుల్ అజీజ్ ఇలా అన్నారు, నేను అబ్దుల్లా బిన్ జుబైర్ (ర)ను చూశాను. ఆయన(ర) అసర్ నమాజు తరువాత రెండు రకాతులు సున్నత్

నమాజును చేసేవారు. హజ్రత్ ఆయెషా(ర) ఆయనతో ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స) గారు ఆమె(ర)గారి ఇంటికి వచ్చి నప్పుడల్లా ఈ రెండు రకాతుల నమాజును చేసేవారు.

## 73వ అధ్యాయం

### వాహనం మీద ఉండి తవాఫ్ చెయ్యవచ్చు.

**697.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒంటెపై స్వారీ చేస్తూనే బైతుల్లాహ్ చుట్టూ తవాఫ్ చేశారు. ఆయన(స) హజ్రె అస్వద్‌కు సరిసమానంగా వచ్చినప్పుడు, తన చేతిలో ఉన్న ఒక వస్తువును సంకేతంగా అటూ ఇటూ ఊపేవారు. మరియు అల్లాహు అక్బర్ అని పలికేవారు.

**698.** ఉమ్మె సలమా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: నేను అనారోగ్యంగా ఉన్నా నని దైవప్రవక్త(స) గారికి తెలియజేశాను. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు 'ఒంటె మీద స్వారీ చేస్తూనే కాబా గృహ ప్రదక్షిణం చెయ్యి.' ఆయన(స) గారు సెలవిచ్చి నట్లుగానే నేను తవాఫ్ చేశాను. అప్పుడు ప్రజలందరి వెనుక ఉండే తవాఫ్ చేశాను. దైవప్రవక్త(స) గారు కాబా గృహం వెనుకభాగంలో ఉన్న స్థలంలో నమాజు చేస్తూ ఉన్నారు. అప్పుడు ఆయన(స) అత్‌తూర్ సూరాను పారాయణం చేస్తూ ఉన్నారు.

## 74వ అధ్యాయం

### హాజీలకు మంచి నీళ్ళు త్రాపటం

**699.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ దైవ ప్రవక్త(స) గారిని మక్కా నగరంలో రాత్రి సమయాలలో మినా రాత్రులలో పండుకోవటానికి అనుమతి ఇవ్వమని అడిగారు. యాత్రికులకు మంచి నీళ్ళు త్రాపే ఉద్దేశ్యంతో ఆయన (ర) ఈ అనుమతిని అడిగారు. దైవప్రవక్త(స) గారు ఆయనకు అనుమతి ఇచ్చారు.

**700.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు- దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సబీల్ వద్దకు వచ్చారు. (అది మంచినీళ్ళు త్రాపే ఒక స్థలం, ఒక హౌజ్). ఆయన(స) మంచినీళ్ళు కావాలని అడిగారు. హజ్రత్ అబ్బాస్(ర) తన కుమారుడైన ఫజల్‌తో ఇలా అన్నారు, 'ఓ ఫజల్! నీవు నీ తల్లి వద్దకు పోయి దైవప్రవక్త(స)గారి కోసం ఖర్జూరపు షర్బత్‌ను తీసుకురా.' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : 'నాకు మంచినీళ్ళు త్రాపించండి'. హజ్రత్ అబ్బాస్(ర) ఇలా అన్నారు,

'ఓ దైవప్రవక్తా(స) ఈ నీళ్ళల్లో ప్రజలు తమ చేతులు పెడుతూ ఉంటారు, దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు 'ఆ నీళ్ళల్లో నుంచే నాకు మంచినీళ్ళు త్రాపించండి.' దైవప్రవక్త (స) మంచినీళ్ళు త్రాగారు. తరువాత దైవప్రవక్త మహాశయులు (స) జమ్‌జమ్ వద్దకు వచ్చారు. అక్కడ ప్రజలు బావిలో నుంచి నీళ్ళు పైకి తోడి జనులకు త్రాపుతున్నారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'బావిలోనుంచి నీళ్ళు తోడండి. మీరు సత్కార్యాన్ని చేస్తున్నారు.' ఆయన (స) గారు తరువాత ఇలా అన్నారు 'మీకు ఇబ్బంది కలుగుతుం దేమో అనే భయం నాకు లేకపోతే నేను నా ఒంటెమీద నుంచి క్రిందికి దిగి నా భుజం మీద త్రాడు వేసేవాణ్ణి. అంటే బావిలో నుంచి నీళ్ళు తోడి ప్రజలకు నీళ్ళు త్రాపి ఉండేవాణ్ణి.' ఆయన(స) గారు తన భుజం వైపునకు వేలు పెట్టి సూచించారు.

## 75వ అధ్యాయం

### జమ్‌జమ్‌ను గురించి-

అబూజర్ గిఫ్ఫారీ(రజిఅన్) ఇలా అన్నారని, అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; "నా ఇంటి కప్పు చీల్చబడింది. ఆ సమయంలో నేను మక్కా నగరంలో ఉన్నాను. హజ్రత్ జిబ్రీల్ (అ) ఆకాశం నుండి క్రిందికి దిగారు. ఆయన(అ) నా హృదయాన్ని తెరిచారు. తరువాత ఆయన జమ్‌జమ్ నీళ్ళతో దాన్ని కడిగి పరిశుభ్రపరిచారు. ఆ తరువాత ఆయన ఒక బంగారపు ట్రేను తీసుకువచ్చారు. దాన్ని జ్ఞానంతోనూ విశ్వాస మాధుర్యంతోను నింపారు. ఆ తరువాత ఆయన దాన్ని నా హృద యంలోకి పోసి నింపారు. చీల్చిన హృదయాన్ని కలిపివేశారు. తరువాత నా చేతిని పట్టుకుని నన్ను మొదటి ఆకాశంపైకి తీసుకుపోయారు. జిబ్రీల్(అ) అక్కడ ఉన్న కాపలాదారును తన వద్దకు రమ్మని కేకవేశారు. అతడు వచ్చిన తరువాత ద్వారం తలు పులు తెరువమని అడిగారు. 'వచ్చినవారెవరు?' అని ఆ కాపలాదారు అడిగాడు. 'నేను జిబ్రీల్‌ను' అని జిబ్రీల్(అ) జవాబు పలికారు.

(చూడండి ప్రథమ సంపుటంలోని **345**వ హదీసు)

**701.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను జమ్‌జమ్ నీళ్ళను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి ఇచ్చాను. ఆయన(స)గారు నిలబడే జమ్‌జమ్ జలాన్ని తాగారు. ఆసిమ్ (ఉప ఉల్లేఖకుడు) ఇలా అన్నారు- ఇక్రిమ ప్రమాణం చేసి చెప్పారు, ఆ రోజంతా దైవప్రవక్త(స) ఒంటెమీదనే ఉన్నారు.

## 76వ అధ్యాయం

### ఖిరాన్ చేసే వ్యక్తి ఒకే తవాఫ్ చెయ్యాలా? లేక రెండు తవాఫ్‌లు చెయ్యాలా?

**702.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు, మేము హజ్జతుల్ విదాలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి (మదీనా పట్టణం నుంచి) బయలుదేరాము. మరియు ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకున్నాము. తరువాత దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు: 'ఎవరి వద్దనైతే ఖుర్బానీ పశువు ఉన్నదో, వారు హజ్, ఉమ్రా రెండింటికి సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకోవాలి. మరియు ఆ రెండు పుణ్యకార్యాలను ముగించనంత వరకు ఇహ్రామ్‌ను విదువకూడదు.' యాదృచ్ఛికంగా నేను మక్కా మహానగరానికి చేరినప్పుడు బహిష్టు అయ్యాను. మేము హజ్ యాత్రను పూర్తి చేసుకున్న తరువాత దైవప్రవక్త (స) గారు నన్ను అబ్దుర్రహ్మాన్‌తోపాటు తన్‌యీమ్ వరకు సాగనంపారు. నేను అక్కడి నుంచి ఉమ్‌రా చేశాను. దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు 'ఓ ఆయెషా! నీ ఉమ్రాకు బదులుగా ఈ ఉమ్‌రా'. ఎవరెవరైతే ఉమ్‌రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారో వారు తవాఫ్ (మరియు సయీ) చేసి ఇహ్రామ్‌ను విప్పివేశారు. తరువాత మినా నుంచి తిరిగి వచ్చిన పిదప రెండో తవాఫ్ అంటే 'తవాఫె జియారత్' చేశారు. మరియు ఎవరైతే హజ్, ఉమ్రాలు రెండింటికీ సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారో వారు ఒకే తవాఫ్‌ను చేశారు.'

**703.** నాఫె ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) గారి కుమారుడు ఆయన ఇంట్లోకి ప్రవేశించారు. ఆయన(ర)గారితో పాటు ఆయన స్వారీ చేస్తూ ఉన్న పశువు (ఒంటె) కూడా (ప్రయాణానికి) సిద్ధంగా ఉంది. అతను (ఇబ్నె ఉమర్ (ర) గారి కుమారుడు) ఇలా అన్నారు 'ఈ సంవత్సరం ప్రజల మధ్య యుద్ధాగ్ని ప్రజ్వరిల్లుతుందేమోనని నేను భయపడుతున్నాను. ఇంకా మీరు కాబా గృహంలోకి పోకుండా నిలువరించబడతారేమో అని కూడా నేను భయపడుతున్నాను. కనుక మీరు ఈ సంవత్సరం కాబాకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉండిపోవడం మేలైన విషయమని నేను భావిస్తున్నాను.' అప్పుడు ఆయన (ర) ఇలా అన్నారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు కూడా (హుదైబియా జరిగిన సంవత్సరంలో) ఉమ్రా చేసే సంకల్పంతో బయలుదేరారు. కాని ఖురైష్ తెగకు చెందిన అవిశ్వాసులు ఆయన(స) గారిని కాబాకు వెళ్ళకుండా నిలిపివేశారు. ఒకవేళ ప్రజలు నన్ను కూడా కాబాకు వెళ్ళకుండా ఆపినట్లయితే నేను కూడా దైవప్రవక్త(స) గారు ఏదైతే చేశారో అదే చేస్తాను

ఎందుకంటే దైవప్రవక్త(స)గారిని అనుసరించటం మీకు శ్రేయస్కరమైన విషయం, ఉత్తమమైన విషయం. తరువాత ఆయన(ర) ఇలా అన్నారు, నేను ఉమ్రాతోపాటు హజ్ చేసే సంకల్పాన్ని కూడా చేసుకున్నాను. దీనికి మీరు సాక్షులుగా ఉండండి. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) మక్కాకు చేరుకున్నప్పుడు హజ్జ్, ఉమ్రాలకు రెండింటికీ సంబంధించిన ఒకే తవాఫ్ చేశారు.

**704.** నాఫె ఇలా ఉల్లేఖించారు ఏ సంవత్సరంలో నైతే హజ్జాజ్, అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజిఅన్)పై దాడి చేసే ఉద్దేశ్యంతో వెళ్ళాడో ఆ సంవత్సరంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) హజ్ చెయ్యాలనే సంకల్పం చేసుకున్నారు. ప్రజలు కొందరు ఆయన (ర)గారితో ఇలా అన్నారు 'ఈ సంవత్సరం వారిద్దరి మధ్య యుద్ధం జరిగే అనుమానం ఉంది. బహుశ వారు మిమ్మల్ని కాబా గృహంలోకి పోనివ్వరేమో.' ఆయన (ర) ఇలా సమాధానం చెప్పారు: 'మీకు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి అనుసరణ ఉత్తమమైన అనుసరణ. (అదే మీకు శ్రేయస్కరమైనది). ఒకవేళ అలా జరిగితే నేను దైవప్రవక్త(స)గారు చేసిన విధంగానే చేస్తాను. చూడండి! మీరు సాక్షులుగా ఉండండి! నేను ఉమ్రాను నాపై వాజిబ్‌గా చేసుకున్నాను.' తరువాత ఆయన అక్కణ్ణుంచి బయలుదేరారు. 'బయ్‌దా' ప్రదేశం వద్దకు వచ్చినప్పుడు ఇలా అనసాగారు హజ్జ్, ఉమ్రాలు రెండింటి పరిస్థితి కూడా ఒకటే. మీరు సాక్షులుగా ఉండండి. నేను ఉమ్రాతో పాటు హజ్‌ను కూడా నాపై వాజిబ్‌గా చేసుకున్నాను. ఆయన(ర) ఖుదైద్ నుంచి ఖుర్బాని పశువును కూడా కొని తనతోపాటు తీసుకు పోయారు. అది తప్ప మరొక పనిని దేనినీ ఆయన(ర) చెయ్యలేదు. ఆయన ఖుర్బానీ పశువును నహర్ (జిబహ్) చెయ్యలేదు. ఇహ్రామ్ స్థితిలో నిషేధించబడిన ఏ పనినీ ఆయన చెయ్యలేదు. శిరోముండనం చేయించలేదు. తల వెంట్రుకలను కత్తిరింప లేదు. జిల్‌హజ్జ పదవ తేదీ వచ్చినప్పుడు ఖుర్బానీ పశువును జిబహ్ చేశారు. తల వెంట్రుకలను కత్తిరించుకున్నారు. మరియు శిరోముండనం చేయించుకున్నారు. మరియు ఇదివరకే చేసి ఉన్న మొదటి తవాఫ్‌ను హజ్జ్, ఉమ్రాలు రెండింటి తరఫున సరిపోతుందని భావించారు. మరియు ఇలా అనసాగారు దైవప్రవక్త(స) గారు కూడా ఇలాగే చేశారు.

## 76వ అధ్యాయం

### వుజూ స్థితిలో తవాఫ్ చెయ్యటం.

**705.** ముహమ్మద్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ నౌఫల్ ఖురైషి ఇలా ఉల్లేఖించారు: నేను ఉర్వా బిన్ జుబైర్ (ర)ను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి హజ్జ్

యాత్రను గురించి అడిగాను. హ్జ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారని ఉర్వా సమాధానం చెప్పారు. దైవప్రవక్త(స)గారు మక్కా మహానగరానికి చేరుకున్నప్పుడు, ఆయన(స)గారు చేసిన మొట్టమొదటి పని ఏమిటంటే, ఆయన(స) వుజూ చేసు కున్నారు. తరువాత వుజూ స్థితిలోనే ఆయన(స) కాబా గృహ ప్రదక్షిణం చేశారు. ఆయన (స)గారి ఉద్దేశ్యం కేవలం ఉమ్రా మాత్రమే కాదు, హజ్ మరియు ఉమ్రా రెండింటినీ ఆయన(స) కలిపి సంకల్పించుకున్నారు. ఆ తరువాత హ్జ్రత్ అబూ బకర్(ర) హజ్జ్ యాత్రను నిర్వహించారు. ఆయన(ర) గారు చేసిన మొట్టమొదటి పని ఏమిటంటే, కాబా గృహ ప్రదక్షిణం చెయ్యటం. ఇంకా అది కేవలం ఉమ్రా మాత్రమే కాదు. హజ్జ్, ఉమ్రాలను రెండింటినీ కలిపి ఆయన(ర) సంకల్పించుకున్నారు. ఆ తరువాత హ్జ్రత్ ఉమర్(ర) ఆ విధంగానే చేశారు. తరువాత ఉస్మాన్(ర) హజ్జ్ చేశారు.

ఆయన(ర)గారు చేసిన మొట్టమొదటి పని కాబా ప్రదక్షిణం. అది కేవలం ఉమ్రా మాత్రమే కాదు. ఆ తరువాత హ్జ్రత్ ముఆవియా, హ్జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) పైవిధంగానే చేశారు. నేను హజ్జ్‌ను నా తండ్రి గారైన జుబైర్ బిన్ అవ్వామ్‌తో కలిసి చేశాను. మొట్టమొదటి పని ఆయన గారు చేసింది ఏమిటంటే, కాబా ప్రదక్షిణం. అది కేవలం ఉమ్రా మాత్రమే కాదు. హజ్ ఉమ్రాలు రెండూ కలిపి చేసింది. ఆ తరువాత ముహాజిరీన్‌లు, అన్సారులు అదేవిధంగా చెయ్యటాన్ని నేను గమనిం చాను. అది కేవలం ఉమ్రా మాత్రమే కాదు. అదేవిధంగా చేస్తూ ఉన్న నేను చూసిన చివరి మనిషి ఇబ్నె ఉమర్(ర). మొదటి ఉమ్రా ముగింపు జరిగిన తరువాత అతను మరొక ఉమ్రాను చెయ్యలేదు. ఇప్పుడు ఇక్కడ ఉన్నాడు ఇబ్నెఉమర్(ర) ప్రజల మధ్య! వారు పూర్వపు వాటిని గురించి ఆయన్ని అడగటంలేదు. ఈ ప్రజలందరూ మక్కాలోకి ప్రవేశించిన తరువాత కాబా ప్రదక్షిణం చెయ్యకుండానే ఏ పనినీ ప్రారంభించరు. మరియు తమ ఇహ్రామ్‌ను విప్పివేయరు. నిస్సందేహంగా నేను నా తల్లి (అస్మా (ర)) గారినీ, నా పినతల్లి హ్జ్రత్ ఆయెషా(ర)) గారినీ చూశాను. మక్కాలోకి ప్రవేశించిన తరువాత వారు కాబా ప్రదక్షిణం చెయ్యకుండా ఏ పనినీ ప్రారంభించలేదు. వారు తమ ఇహ్రామ్‌ను విప్పివేయలేదు. నా తల్లిగారు నాకు ఇలా చెప్పారు, ఆమె (ర) గారు, ఆమె సోదరీమణి

(హజ్రత్ ఆయెషా(ర), జుబైర్(ర) ఇంకా ఫలానా మనుషులు ఉమ్రా కోసం ఇహ్రామ్‌ను ధరించారు. వారు హజ్రె అస్వద్‌ను ముద్దు పెట్టుకున్న తరువాత, సఫా మర్వాల మధ్య పరుగులు తీశారు, శిరోముండనం చేయించుకున్నారు. ఆ తరువాతనే ఇహ్రామ్‌ను విప్పివేశారు.

## 78వ అధ్యాయం

### సఫా- మర్వాల మధ్య పరుగెత్తడం వాజిబ్, అవి అల్లాహ్ చిహ్నాలు.

**706 :** ఉర్వా ఇలా ఉల్లేఖించారు: నేను హజ్రత్ ఆయెషా(ర)ను అడిగాను- బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'నిస్సందేహంగా సఫా, మర్వాలు రెండూ అల్లాహ్ చిహ్నాలు. ఎవరైనా హజ్ కోసం కాబా గృహానికి వెళ్ళినట్లయితే లేక ఉమ్రా చేసినట్లయితే అప్పుడు సఫా మర్వాల తవాఫ్ గనక చేసినట్లయితే అది దోషం కాదు. దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. దాని అర్థం, ఎవరైనా సఫా మర్వాల తవాఫ్ చెయ్యకపోయినా వారు ఏ పాపమూ చేసినట్లు కాదు అనే కదా!'. అప్పుడు హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు: 'ఓ నా మేనల్లుడా! నీవు ఇచ్చిన వివరణ లోపభూయిష్ట మైనది. ఒకవేళ అల్లాహ్ చెప్పిన విషయం ఇదే గనక అయితే ఖుర్‌ఆన్‌లోని ఆయత్ ఇలా అవతరించి ఉండేది- సఫా మర్వాల తవాఫ్ చెయ్యకపోతే అందులో ఎలాంటి దోషం లేదు.' విషయం ఏమిటంటే, ఈ ఖుర్‌ఆన్ వాక్యం అన్సారుల విషయంలో అవతరించింది. వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించక పూర్వం 'మనాత్' అనే విగ్రహం కోసం ఇహ్రామ్‌ను ధరిస్తూ ఉండేవారు. ఆ విగ్రహాన్నే పూజిస్తూ ఉండే వారు. ఆ విగ్రహం ముషల్లల్ అనే స్థలం వద్ద ఉండేది. కనుక అన్సారులైన ప్రజలు హజ్జ్ కోసమో లేక ఉమ్రా కోసమో ఇహ్రామ్‌ను ధరించినప్పుడు, వారు సఫా మర్వాల మధ్య పరుగెత్తటాన్ని తప్పుగా భావించేవారు. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన తరువాత వారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఈ విషయం గురించి ఇలా అడిగారు: 'ఓ దైవప్రవక్తా(స)! మేము సఫా- మర్వాల తవాఫ్‌ను చెడ్డ విషయంగా భావించేవారము.' (అప్పుడు) ఆ సమయంలో అల్లాహ్ ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని అవతరింపజేశాడు, 'సఫా మర్వాలు రెండూ అల్లాహ్ చిహ్నాలు దగ్గరి నుంచి చివరి ఆయత్ వరకు. హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు, 'కనుక దైవప్రవక్త(స) సఫా మర్వాల తవాఫ్‌ను కొనసాగించారు. ఇక వాటి తవాఫ్‌ను ఎవరైనాసరే విడిచిపెట్టలేరు.' జుహ్రీ ఇలా

అన్నారు: తరువాత నేను హజ్రత్ ఆయెషా(ర) గారు చెప్పిన ఈ విషయాన్ని అబూబకర్ బిన్ అబ్దుర్రహ్మాన్‌కు తెలియజేశాను. ఆయన ఇలా అన్నారు 'నేనైతే జ్ఞాన సంబంధమైన ఈ విషయాన్ని ఇంతవరకు విననే లేదు. నేనైతే చాలామంది విద్వాంసులు చెప్పగా విన్నాను. వారు ఇలా అనేవారు: అరబ్బు ప్రజలు (ఆయెషా (ర) గారు ప్రస్తావించిన వారు మరియు మనాత్ కోసం ఇహ్రామ్ ధరించే వారు తప్ప) అందరూ సఫా మర్వాల తవాఫ్‌ను చేస్తూ ఉండేవారు. అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో బైతుల్లాహ్‌కు సంబంధించిన తవాఫ్‌ను గురించి ప్రస్తావించినప్పుడు మరియు సఫా మర్వాలను గురించి చెప్పి నప్పుడు వారు ఇలా అనసాగారు 'ఓ దైవ ప్రవక్తా(స)! మేమైతే (అజ్ఞాన యుగంలో) సఫా మర్వాల తవాఫ్‌ను చేస్తూ ఉండే వారము. మరియు ఇప్పుడు కరుణామయుడైన అల్లాహ్ బైతుల్లాహ్‌కు సంబంధించిన ప్రస్తావన చేశాడు. కాని సఫా (మర్వా)లను గురించి ఎలాంటి ప్రస్తావన చెయ్యలేదు. కనుక సఫా మర్వాల తవాఫ్ చేస్తే మాపై ఏదైనా దోషం ఉంటుందా? (పాపం చేసినట్లు అవుతుందా?) అప్పుడు అల్లాహ్ ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని అవతరింపజేశాడు– సఫా, మర్వాలు రెండూ అల్లాహ్‌కు సంబంధించిన గుర్తులు... చివరి వరకు. హజ్రత్ అబూబకర్(ర) ఇలా అన్నారు– 'నేను విన్నాను, ఈ ఖురాన్ వాక్యం రెండు వర్గాలను గురించి అవతరించింది' అని. అంటే, అజ్ఞాన యుగంలో సఫా మర్వాల తవాఫ్‌ను పాపంగా భావించే వర్గం, ఇంకా అజ్ఞాన యుగంలో సఫా మర్వాల తవాఫ్ చేస్తూ ఉండే వర్గం గురించి కూడా. ముస్లిమ్‌లుగా మారిపోయిన తరువాత అలా ఎందుకు చెయ్యవలసి వచ్చిందంటే, అల్లాహ్ బైతుల్లాహ్ యొక్క తవాఫ్‌ను గురించి ప్రస్తావిం చాడు కాబట్టి. మరియు సఫా మర్వాలను గురించి ప్రస్తావించలేదు కాబట్టి, దానిని పాపంగా, చెడ్డదిగా భావించారు. చివరకు, అల్లాహ్ బైతుల్లా యొక్క తవాఫ్ పిదప వారు చేసిన తవాఫ్ (సయీ)ని గురించి కూడా ప్రస్తావించాడు.

## 79వ అధ్యాయం

**సఫా మర్వాల మధ్య ఏవిధంగా పరుగెత్తాలి? అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఇలా అన్నారు : బనీ అబ్బాద్ గారి గృహం నుంచి బనీ అబీ హుస్సేన్ గారి వీధి వరకు పరుగెత్తుకుంటూ వెళ్ళాలి. మిగతా మార్గంలో మామూలు నడకతో నడవాలి.**

**707.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు ఆయన ఇలా అన్నారు:

'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కాలోకి ప్రవేశించి మొదటి తవాఫ్ (తవాఫె ఖుదూమ్ మరియు తవాఫుజ్ జియారహ్) చేసినప్పుడు మూడు ప్రదక్షిణల్లో పరుగెత్తుకుంటూ నడుస్తారు. మరియు నాలుగు ప్రదక్షిణల్లో మామూలు నడక నడుస్తారు. ఇంకా సఫా మర్వాల తవాఫ్ చేసినప్పుడు పల్లంగా ఉండే ప్రదేశంలో పరుగెత్తుకుంటూ నడుస్తారు. ఉబైదుల్లాహ్ ఇలా అన్నారు: నేను నాఫె గారిని అడిగాను 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) 'రుకునె యమాని' వద్దకు చేరినప్పుడు మామూలు నడకే నడుస్తారా?' ఆయన(ర) ఇలా అన్నారు 'లేదు' కాని, జన సమూహం అధికంగా ఉన్నప్పుడు హాజరె అస్వద్ దగ్గరకు వచ్చి అక్కణ్ణుంచి మెల్లగా నడుస్తారు. ఎందుకంటే ఆయన(స) దాన్ని ముద్దు పెట్టుకోకుండా వదిలిపెట్టరు.'

**708.** అమ్ర్ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు : ఆయన ఇలా అన్నారు; మేము అబ్దుల్లా బిన్ ఉమర్(ర)ను ఇలా అడిగాము. 'ఒక మనిషి బైతుల్లాకు సంబంధించిన తవాఫ్‌ను, ఉమ్రాకు చెందిన ఇహ్రామ్‌లో చేసుకున్నాడు. కాని సఫా మర్వాలకు సంబంధించిన తవాఫ్‌ను అతను ఇంకా చెయ్యలేదు. అలాంటి వ్యక్తి తన భార్యతో సంభోగించగలడా?' దానికి ఆయన(ర) ఇలా సెలవిచ్చారు 'దైవప్రవక్త(స)గారు మక్కాలోకి ప్రవేశించినప్పుడు ఏడుసార్లు కాబా ప్రదక్షిణం చేశారు. మరియు రెండు రకాతుల నమాజ్‌ను మఖామె ఇబ్రాహీమ్ వెనుక నిలబడి చేశారు. సఫా- మర్వాల చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణం చేశారు.' ఆయన(ర) ఇంకా ఇలా అన్నారు: 'నిజంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు చక్కని ఆదర్శం ఉన్నది. మేము జాబిర్ బిన్ అబ్దుల్లాహ్‌ను (ఈ సమస్యను గురించే) అడిగాము: ఆయన(ర) ఇలా అన్నారు; 'అతను తన భార్య వద్దకు సఫా మర్వాల మధ్య తవాఫ్ చెయ్యనంతవరకు రాకూడదు.'

**709.** అమ్ర్ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా పట్టణానికి వచ్చినప్పుడు బైతుల్లాహ్ చుట్టూ ప్రదక్షిణం చేశారు. తరువాత తవాఫ్‌కు చెందిన రెండు రకాతుల నమాజ్ చేశారు. ఆ తరువాత సఫా- మర్వాల మధ్య పరుగెత్తారు. ఆ తరువాత అబ్దుల్లాహ్ ఈ ఖుర్ఆన్ వాక్యాన్ని (అహ్‌జాబ్) పఠించారు "మీకు దైవప్రవక్త(స)లో అత్యుత్తమ ఆదర్శం ఉంది."

**710.** ఆసిమ్ అహ్‌రాల్ మాతో ఇలా అన్నారు: నేను అనస్‌బిన్ మాలిక్(ర)ను ఇలా అడిగాను- 'ఏమిటి? సఫా, మర్వాల మధ్య పరుగెత్తటాన్ని చెడుగా భావిస్తారా?' ఆయన ఇలా అన్నారు 'అవును! ఎందుకంటే, ఇది అజ్ఞాన యుగంలో పాటించబడే

ఒక సంప్రదాయం.' చివరకు అల్లాహ్ ఈ ఖుర్ఆన్ వాక్యాన్ని అవతరింప జేశాడు. 'సఫా మర్వాలు రెండూ అల్లాహ్ చిహ్నాలు. ఎవరైతే బైతుల్లాహ్‌కు చెందిన హజ్‌ను లేదా ఉమ్రాను చేస్తారో వారిపై ఎలాంటి దోషమూ లేదు అది పాపమూ కాదు- వాటి మధ్య తవాఫ్ చేస్తే'

**711.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) కాబా చుట్టూ ప్రదక్షిణ చేశారు. మరియు సఫా మర్వాల మధ్య సయీచేశారు. శత్రువులకు తన బలాన్ని, తన శక్తినీ చూపించటానికి పరుగెత్తారు.

## 80వ అధ్యాయం

**బహిష్టు అయిన స్త్రీ హజ్జ్‌కు సంబంధించిన ఆచార వ్యవహారాలన్నింటినీ నిర్వహించ వచ్చు- కేవలం కాగా గృహం చుట్టూ ప్రదక్షిణ తప్ప. సఫా మర్వాల మధ్య వుజూ లేకుండా తవాఫ్ చేస్తే అప్పుడు దానికి సంబంధించిన ఆజ్ఞ ఏమిటి?**

**712.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఉల్లేఖించారు: ఆమె(ర) గారు ఇలా అన్నారు- 'నేను మక్కా నగరంలోకి ప్రవేశించాను. ఆ సమయంలో నేను బహిష్టు స్థితిలో ఉన్నాను. నేను కాబా గృహ ప్రదక్షిణను, సఫా మర్వాల తవాఫ్ చెయ్యలేదు. అప్పుడు నేను దాన్ని గురించి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి ఫిర్యాదు చేశాను.' దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు 'హజ్ యాత్రకు వచ్చిన హాజీలు ఏమేమి చేస్తారో, ఎలా చేస్తారో నీవు కూడా అలానే చెయ్యి. (అన్ని పనులూ చెయ్యి), కేవలం కాబా గృహం తవాఫ్‌ను మాత్రం చెయ్యకు, పరిశుభ్రతను పొందేవరకు.'

**713.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స), మరియు ఆయన(స)గారి ప్రత్యక్ష అనుచరులు హజ్జ్ యాత్రకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారు. మరియు వారిలో ఒక్క తల్‌హా(ర)గారి వద్ద తప్ప ఎవరి వద్ద కూడా ఖుర్బానీ పశువు లేదు. దైవప్రవక్త(స) గారు మక్కా నగరానికి చేరుకున్నప్పుడు, హజ్రత్ అలీ(రజిఅన్) యమన్ నుంచి విచ్చే శారు. దైవప్రవక్త(స) గారు ఆయన(ర) గారిని ఇలా అడిగారు- 'ఏమిటి? నీవు ఏ ఇహ్రామ్‌ను ధరించావు?' ఆయన(ర) గారు ఇలా మనవి చేసుకున్నారు 'ఓ దైవ ప్రవక్తా(స)! మీరు ఏ ఇహ్రామ్‌నైతే ధరించారో నేను కూడా ఆ ఇహ్రామ్‌నే ధరించాను.' తరువాత ఆయన(స) గారు తన సహచరులను ఇలా ఆజ్ఞాపించారు: హజ్జ్‌ను ఉమ్రాగా

మార్చండి. మరియు తవాఫ్ చెయ్యండి. వెంట్రుకలను కత్తిరించుకోండి. మరియు ఇహ్రామ్‌ను విప్పివెయ్యండి. కాని ఎవరివద్దనైతే ఖుర్బానీ పశువు ఉన్నదో వారు ఇహ్రామ్‌ను విప్పకూడదు. ఇది విని ప్రవక్త(స)గారి అనుచరులు ఇలా అనసాగారు, ఏమిటి? మమ్మల్ని మినాకు మా అంగం వీర్యమోడుతూ ఉన్న స్థితిలోనే వెళ్ళమంటారా?" ఈ వార్త దైవప్రవక్త(స) గారి వద్దకు చేరినప్పుడు, ఆయన ఇలా సెలవిచ్చారు 'ఇప్పుడు తెలిసిన విషయం ఇదివరకే నాకు తెలిసి ఉన్నట్లయితే, నేను ఖుర్బానీ పశువును నాతోపాటు తీసుకువచ్చి ఉండేవాణ్ణి కాను. నాతోపాటు ఖుర్బానీ పశువు గనక లేకుండా ఉన్నట్లయితే నేను ఇహ్రామ్ స్థితిని చాలించి ఉండేవాణ్ణి.' అప్పుడు ఏమయిందంటే హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) బహిష్టు అయ్యారు. ఆమె(ర)గారు హజ్జ్‌కు సంబంధించి అన్ని పనులను చేసేశారు, కేవలం కాబా గృహ ప్రదక్షిణం మాత్రమే జరగలేదు. బహిష్టు నుంచి పవిత్రతను పొందిన తరువాత ఆమె గారు తవాఫ్ చేశారు. ఆమె (ర) గారు ఇలా అనసాగారు: ఓ దైవ ప్రవక్తా(స)! మీరైతే హజ్జ్‌ను, ఉమ్రాను రెండింటిని ముగించుకుని వెళ్ళిపోతున్నారు. నేనైతే కేవలం హజ్జ్‌ను మాత్రమే నిర్వహించాను.' తరువాత దైవప్రవక్త(స)గారు అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్(ర)ను ఇలా ఆజ్ఞాపించారు 'నీవు ఆమె(ర)గారితోపాటు తన్‌యీమ్ వరకు వెళ్ళు.' ఆమె (ర) గారు హజ్జ్ తరువాత ఉమ్రా చేశారు.

**714.** హఫ్సా బిన్తె సీరీన్(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు : మేము మా కన్యలను బయటికి పోకుండా ఆపేవారము. ఆ తరువాత ఒక స్త్రీ అక్కడకు వచ్చింది. ఆమె బనీ ఖలఫ్‌కు చెందిన ఒక భవనంలో దిగింది. (ఆ భవనం బస్రాలోఉంది). ఆమె ఇలా అన్నది- ఆమె సోదరి ఒకామె (ఉమ్మె అతియ(ర)) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ఒక సహాబి భార్య, అతను దైవప్రవక్త(స) గారితో కలిసి పన్నెండు యుద్ధాలలో (జిహాద్‌లలో) పాల్గొన్నాడు. మరియు నా చెల్లెలు కూడా ఆరు జిహాద్‌లలో అతనితో పాల్గొన్నది. ఆమెగారు ఇలా చెప్పేవారు మేము క్షతగాత్రులకు మందులు ఇచ్చేవారము. అస్వస్థతకు గురైన వారికి సేవలు చేసేవారం. తరువాత నా చెల్లెలు దైవప్రవక్త(స) గారిని ఇలా అడిగింది. 'ఒకవేళ మాలోని ఒక స్త్రీ ఎవరి వద్దనైనా దుప్పటి లేకపోతే అది దోషం కాదు కదా! ఒకవేళ ఆమెగనక ఈద్గాహ్‌కు వెళ్ళలేక పోతేనో?' దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారు, 'ఆమె సహచరి ఎవరైనా తన దుప్పటిని,

ఆచ్ఛాదనగా ఆమెపై కప్పాలి. మరియు ఆమె పుణ్యకార్యాలలో, ముస్లిమ్‌లు చేసే ప్రార్థనలలో పాలుపంచుకోవాలి. ఉమ్మె అతియా(ర) స్వయంగా బస్రాలోకి వచ్చినప్పుడు, హఫ్సా ఇలా అన్నారు: నేను ఆమెను ఈ హదీసును గురించి అడిగాను. ఉమ్మె అతియా(ర)కు ఒక అలవాటు ఉండేది. అదేమిటంటే, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి పవిత్ర నామాన్ని ఉచ్చరించినప్పుడల్లా ఇలా అంటూ ఉండేవారు 'నా తండ్రిని మీపై సదఖాగా అర్పిస్తున్నాను!' నేను ఆమెను అడిగాను 'ఏమిటి? నీవు దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిస్తూ ఉండగా విన్నావా?' ఆమె గారు ఇలా అన్నారు 'అవును, నా తండ్రి ఆయన(స) గారిపై సదఖా!' ఉమ్మె అతియా(ర) ఇలా అన్నారు, 'దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : కన్యలు, పరదాలో ఉండే స్త్రీలు, బహిష్టు అయిన స్త్రీలు వీరందరూ బయలుదేరాలి. బయటికి వెళ్ళాలి. సత్కార్యాలలో, ముస్లిములు చేసే ప్రార్థనలలో పాల్గొనాలి. మరియు బహిష్టు అయిన స్త్రీలు నమాజు చేసే స్థలానికి దూరంగా ఉండాలి.' అప్పుడు నేను 'బహిష్టు అయిన స్త్రీలు కూడా బయలు దేరవచ్చునా?' అని అన్నాను- ఆమె(ర)గారు ఇలా అన్నారు- ఏమిటి? బహిష్టు అయిన స్త్రీలు అరఫాత్‌కు వెళ్ళరా? ఇక్కడకు వెళ్ళరా? అక్కడకు వెళ్ళరా?'

## 81వ అధ్యాయం

ఏ మనిషైతే మక్కా నగరంలో ఉంటాడో ఆ మనిషి మినాకు పోవాలి. బత్‌హా మొదలైన స్థలాల నుంచి ఇహ్రామ్‌ను ధరించాలి. ఇదే విధంగా ప్రతి దేశానికీ చెందిన హాజీ, అతను ఉమ్రా నిర్వహించి మక్కా నగరంలో ఉండిపోతే. మరియు అతా బిన్ అబీ రిబాహ్‌ను ఇలా అడగటం జరిగింది, 'ఏ మనిషైతే మక్కా నగరంలోనే ఉంటాడో, ఆ మనిషి హజ్జ్ కోసం లబ్బైక్ అని పలకాలా?' ఆయన(ర) ఇలా అన్నారు: 'ఇబ్నె ఉమర్ (రజిఅన్) జిల్‌హజ్జా మాసం ఎనిమిదవ తేదీనే జుహర్ నమాజు పూర్తి చేసుకుని ఒంటెపైకి ఎక్కినప్పుడు లబ్బైక్ అనేవారు.' మరియు అబ్దుల్ మలిక్ బిన్ అబీ సులైమాన్ అతా నుంచి ఉల్లేఖించారు, ఆయన హజ్రత్ జాబిర్(రజిఅన్) నుంచి, ఆయన (ర) ఇలా అన్నారు- మేము (హజ్జతుల్ విదాలో) దైవప్రవక్త(స) గారితో (ఇహ్రామ్‌ను కట్టుకుని) వచ్చాము. ఆ తరువాత జిల్‌హజ్జ ఎనిమిదవ తేదీ వరకు మేము కట్టుకున్న ఇహ్రామ్ విప్పివేసిన స్థితిలోనే ఉంది. ఎనిమిదవ తేదీన మక్కా నగరాన్ని మేము వది

లేశాము. హజ్జ్‌కు సంబంధించిన లబ్బైక్‌ను ఎలుగెత్తి పలికాము. మరియు అబూ జుబైర్ జాబిర్(ర) గారి నుంచి ఇలా ఉల్లేఖించారు: మేము బత్‌హా నుంచి ఇహ్రామ్‌ను ధరించాము. మరియు ఉబైద్ బిన్ జురైజ్ ఇబ్నె ఉమర్(ర)తో ఇలా అన్నారు: నేను చూశాను, మీరు మక్కాలో ఉన్నప్పుడు జనులు జిల్‌హజ్జ నెలవంకను చూసినంతనే హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించేవారు. మీరు ఎనిమిదవ తేదీ వరకు ఇహ్రామ్‌ను ధరించరు. ఆయన(ర)ఇలా అన్నారు: నేను దైవప్రవక్త(స) గారిని చూశాను. దైవ ప్రవక్త(స) గారు ఒంటెపైకి ఎక్కేంతవరకు (మినాకు వెళ్ళటానికి) ఇహ్రామ్‌ను ధరించేవారు కాదు.

## 82వ అధ్యాయం

### జిల్‌హజ్జ ఎనిమిదవ తేదీన మనిషి జొహర్ నమాజును ఎక్కడ చెయ్యాలి?

**715.** అబ్దుల్ అజీజ్ బిన్ రుఫయ్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు- నేను అనస్ బిన్ మాలిక్ (రజిఅన్)ను ఇలా అడిగాను, 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారికి సంబంధించిన ఈ విషయం నీకు బాగా జ్ఞాపకం ఉంటే దాన్ని గురించి నాకు చెప్పు. అది ఏమిటంటే, జిల్‌హజ్జ 8వ తేదీన ఆయన(స)గారు జొహర్, అసర్ నమాజులను ఎక్కడ చేశారు?' ఆయన ఇలా సెలవిచ్చారు 'మినా'లో. నేను ఆయన్ని మళ్ళీ ఇలా అడిగాను 'తరువాత విడిచివెళ్ళే రోజున (కూచ్ చేసిన దినం నాడు) ఆయన (స) అసర్ నమాజును ఎక్కడ చేశారు' ఆయన ఇలా సమాధానం పలికారు 'ముహస్సబ్‌లోకి ప్రవేశించిన తరువాత. కాని నీవు నీ నాయకులను అనుసరించు'.

**716.** అబ్దుల్ అజీజ్ బిన్ రుఫయ్ ఇలా ఉల్లేఖించారు: జిల్‌హజ్జా 8వ తేదీన నేను మినాకు వెళ్ళాను, అక్కడ నేను హజ్రత్ అనస్(రజి)ను కలిశాను. ఆయన అప్పుడు ఒక గార్దభం మీద ప్రయాణం చేస్తూ ఉన్నారు. నేను ఆయన్ని ఇలా అడిగాను, 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఆ రోజున జుహ్రా నమాజును ఎక్కడ చేశారు?' హజ్రత్ అనస్ (ర) ఇలా సమాధానం చెప్పారు. 'ప్రముఖులైన వారు ఎక్కడ నమాజు చేస్తారో చూడు. అదే విధంగా నీవు కూడా చెయ్యి.'

## 83వ అధ్యాయం

### మినా వద్ద నమాజు చేయడం గురించి.

**717.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) రెండు రకాతుల నమాజును మినా వద్ద చేశారు. హజ్రత్ అబూబకర్(రజిఅన్), హజ్రత్ ఉమర్ (రజిఅన్)లు కూడా ఈ సంప్రదాయాన్నే పాటిం చారు. హజ్రత్ ఉస్మాన్(రజిఅన్) (ఆయన తన ఖిలాఫత్‌కు సంబంధించిన ప్రారంభ కాలంలో) ఈ సంప్రదాయాన్నే పాటించేవారు.

**718.** హారిస బిన్ వహబ్ అల్ ఖుజాయి (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మినా వద్ద రెండు రకాతుల నమాజు చేశారు. ఆ నమాజుకు ఆయన(స)నాయకత్వం వహించారు. నమాజు చేసేవారి సంఖ్య పూర్వం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ ఆయన(స) అలా చేశారు. ఇంకా మేమందరమూ పూర్వం కంటే కూడా కట్టుదిట్టమైన భద్రతలో, రక్షణలో ఉన్నప్పటికీ ఆయన అలా చేశారు.'

**719.** అబ్దుల్లాహ్ బిన్ మసూద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) గారితో కలిసి మినా వద్ద నేను రెండు రకాతుల నమాజును మాత్రమే చేశాను. అదేవిధంగా హజ్రత్ అబూబకర్(రజిఅన్)గారితో కలిసి రెండు రకాతుల నమాజును చేశాను. హజ్రత్‌ఉమర్(రజిఅన్) గారితో కలిసి రెండు రకాతుల నమాజును చేశాను. తరువాత మీలో అభిప్రాయ భేదాలు పొడసూపాయి. 'అయ్యో! ఆ నాలుగు రకాతులకు బదులుగా నాకు రెండు రకాతులు గనక లభించినట్లయితే ఎంత బాగుండేది! ఈ రెండు రకాతులకు దైవ స్వీకారం లభించింది'.

**719 (అ).** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి నేను మినా వద్ద రెండు రకాతుల నమాజును మాత్రమే చేశాను. అదే విధంగా హజ్రత్ అబూబకర్(రజిఅన్) గారితో కలిసి చేశాను, అదేవిధంగా హజ్రత్ ఉమర్(రజిఅన్) గారితో కూడా కలిసి చేశాను. ఆ తరువాత మీరు అభిప్రాయ భేదాలకు లోనయ్యారు. నాలుగు రకాతుల్లోని దైవస్వీకా రాన్ని పొందిన ఆ రెండు రకాతులు నాకు గనక లభించి ఉంటే ఎంత బాగుండేది.'

## 84వ అధ్యాయం

### అరఫా రోజున ఉపవాసం ఉండటం గురించి.

**720.** ఉమ్మల్ ఫజల్(ర) ఉల్లేఖించారు : ఆయన ఇలా అన్నారు- 'అరఫా

రోజున దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉపవాసం ఉన్నారా? లేదా? అనే విషయం గురించి ప్రజలకు సందేహం కలిగింది. నేను, ఆయన(స) గారి కోసం ఆ రోజున త్రాగేందుకు పానీయాన్ని పంపాను. ఆయన(స) గారు దాన్ని సేవించారు.'

## 85వ అధ్యాయం

### ఉదయం సమయంలో మినా నుండి అరఫాత్‌కు బయలుదేరుతూ తల్బియాను, తక్బీర్‌ను రెండింటిని పలకటం.

**721.** ముహమ్మద్ బిన్ అబీబకర్ సఖఫీ ఇలా ఉల్లేఖించారు : ఆయన అనస్ బిన్ మాలిక్(రజిఅన్)ను ఇలా అడిగారు 'వారు ఉభయులు ఉదయం వేళ మినా నుండి అరఫాత్‌కు ప్రయాణం కట్టారు. 'మీరు ఈ దినం నాడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి ఏమేమి చేస్తూ ఉండేవారు?' సమాధానంగా ఆయన(ర) ఇలా అన్నారు– 'మాలోని కొందరు 'తల్బియా'ను పలికేవారు దానికి ఎవ్వరూ అభ్యం తరం తెలిపేవారు కాదు మరికొంత మంది తక్బీర్‌ను పఠించేవారు. దానికీ ఎవ్వరూ అభ్యంతరం తెలిపేవారు కాదు.'

## 86వ అధ్యాయం

### అరఫా దినం నాడు మిట్టమధ్యాహ్నం పూట ఎండలో ప్రయాణం కట్టటం.

**722.** సాలిమ్ ఇలా ఉల్లేఖించారు : అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ హజ్జాజ్ బిన్ యూసుఫ్‌కు ఇలా ఉత్తరం వ్రాశారు 'హజ్ యాత్రకు సంబంధించిన పనుల విషయంలో అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్)కు వ్యతిరేకంగా ఏ పనీ చెయ్యకండి'. సాలిమ్ ఇలా అన్నారు : కనుక అబ్దుల్లాహ్ పొద్దువాలంగానే వచ్చారు. ఆయనతోపాటు నేను కూడా ఉన్నాను. హజ్జాజ్ ఉన్నటువంటి గుడారం వద్దకు వెళ్లి ఎలుగెత్తి పిలిచాము. అప్పుడు హజ్జాజ్ కాషాయ రంగులో అద్దబడిన దుప్పటి కప్పుకుని వచ్చారు. ఆయన ఇలా అన్నారు 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్! ఏమిటిలా వచ్చావు? చెప్పు.' అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు– నీవు గనక దైవప్రవక్త(స) గారి సున్నత్‌ను అనుసరించదలిస్తే తొంద రగా లేచి నిలబడు.' హజ్జాజ్ ఇలా అన్నారు: 'ఇప్పుడే వెంటనే బయలుదేరాలా?' అప్పుడు అబ్దుల్లాహ్ ఇలా అన్నారు 'అవును వెంటనే బయలుదేరు' హజ్జాజ్ ఇలా అన్నారు : 'మంచిది, నాకు కొంచెం స్నానం చేసే అంత వ్యవధి ఇవ్వు. అప్పుడు నేను బయలు దేరుతాను.' అబ్దుల్లాహ్ తన వాహనం మీద నుంచి కిందికి దిగేశారు. చివరకు

హజ్జాజ్ బయటికి వచ్చేశారు. మరియు నాకూ, నా తండ్రికీ మధ్య నడువసాగారు. నేను హజ్జాజ్‌తో ఇలా అన్నాను 'ఒకవేళ నీవుగనక దైవప్రవక్త(స) గారి సంప్రదాయంపై నడవదలిస్తే చిన్న ఖుత్బాను పఠించు. అరఫాత్ వద్ద ఆగటానికి తొందర పడు.' ఆయన ఇది విని అబ్దుల్లాహ్ వైపునకు తదేకంగా చూడసాగారు. అబ్దుల్లాహ్ ఈ విషయాన్ని గమనించినప్పుడు ఇలా అన్నారు : 'సాలిమ్ నిజమే పలికారు.'

## 87వ అధ్యాయం

### అరఫాత్‌లో విడిది (వుఖూఫ్) స్వారీ చేస్తున్న వాహనంపై ఆగి చెయ్యటం.

**723.** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) బానిస అయిన ఉమైర్ ఉమ్ముల్ ఫజల్ బిన్తె హారిస్ నుండి ఇలా ఉటంకించారు : 'జనులు కొందరు ఈ విషయం గురించి అభిప్రాయ భేదానికి గురయ్యారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) అరఫా రోజున ఉపవాసం ఉన్నారా? లేదా?' అని. కొంతమంది 'ఉపవాసం ఉండలేదు' అని అన్నారు. చివరకు నేను ఒక పాత్రలో పాలుపోసి ఆయన (స) గారి వద్దకు పంపాను. అప్పుడు ఆయన(స) గారు ఒంటెపై కూర్చొనే ఉన్నారు. ఆయన(స) పాత్రలోని పాలను త్రాగేశారు.

## 88వ అధ్యాయం

### అరఫాత్‌లో రెండు నమాజులను(జుహర్, అసర్) కలిపి చెయ్యటం

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్)కు అరఫాత్‌లో ఇమామ్‌తో కలిసి నమాజ్ చేసే అవకాశం లభించనప్పుడు కూడా ఆయన(ర)పైరెండు నమాజుల్ని కలిపి చేసేవారు. అఖీల్ నాతో ఇలా అన్నారని లైస్ చెప్పారు ఆయన ఇబ్నె షిహాబ్ నుంచి, ఆయన ఇలా అన్నారు- నాకు సాలిమ్ ఇలా వర్తమానాన్ని పంపారు 'ఏ సంవత్సరంలోనైతే అబ్దుల్లా బిన్ జుబైర్ (ర)తో యుద్ధం చెయ్యటానికి హజ్జాజ్ బిన్ యూసుఫ్ మక్కాలో దిగిపోయాడో ఆ సంవత్సరంలో అబ్దుల్లా బిన్ ఉమర్(ర)ను ఇలా అడిగాడు : అరఫా రోజున మీరు అరఫాత్‌లో ఆగిన స్థలంలో ఏమి చేస్తారు? జుహ్ర్, అస్ర్ నమాజులను కలిపి వుఖూఫ్‌కు ముందు చేసేస్తారా? లేక ఎప్పుడు చేస్తారు?' అప్పుడు సాలిమ్ ఇలా అన్నారు : 'ఒకవేళ నీవుగనక దైవప్రవక్త(స)గారి సంప్రదాయంపై నడవదలిస్తే అరఫా రోజున నమాజును మధ్యాహ్నం కాగానే చెయ్యి.' అబ్దుల్లా ఇలా అన్నారు- 'సాలిమ్ నిజమే చెబుతున్నాడు.'

సహాబాలు దైవప్రవక్త(స)గారి సున్నత్ ప్రకారం జుహర్, అసర్ నమాజులను కలిపి చేసేవారు. జుహరి ఇలా అన్నారు, 'నేను సాలిమ్‌తో ఇలా అన్నాను ఏమిటి దైవప్రవక్త(స) గారు కూడా అలానే చేశారా? సాలిమ్ ఇలా అన్నారు: 'మరయితే ఈ విషయంలో ఎవరి సున్నత్ ప్రకారం నడిచేవారు?'

## 89వ అధ్యాయం

### అరఫాత్‌లో ఖుత్బా ప్రసంగాన్ని కుదించటం.

**724.** సాలిమ్ బిన్ అబ్దుల్లా ఇలా ఉల్లేఖించారు : అబ్దుల్ మాలిక్ బిన్ మర్వాన్ హజ్జాజ్‌కు ఇలా ఉత్తరం వ్రాశారు– 'నీవు హజ్జ్‌కు సంబంధించిన సకల క్రియలలో అబ్దుల్లా బిన్ ఉమర్(ర)ను అనుసరించాలి.' సాలిమ్ ఇలా అన్నారు : కనుక అబ్దుల్లాహ్ పొద్దువాలంగానే వచ్చారు. ఆయనతోపాటు నేను కూడా ఉన్నాను, హజ్జాజ్ ఉన్నటువంటి గుడారం వద్దకు వెళ్ళి ఎలుగెత్తి పిలిచాము. అప్పుడు హజ్జాజ్ బయటికి వచ్చాడు అతను ఇలా అన్నాడు: 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్! ఏమిటిలా వచ్చావు? చెప్పు.' అప్పుడు ఆయన (ర) 'త్వరగా పద.' అన్నారు. అప్పుడు హజ్జాజ్ 'ఇప్పుడేనా?' అన్నాడు. ఇబ్నె ఉమర్ 'అవును' అన్నారు. అపుడతను మంచిది, నాకు కొంచెం స్నానం చేసే అంత వ్యవధి ఇవ్వు. అప్పుడు నేను బయలుదేరుతాను.' అబ్దుల్లాహ్ తన వాహనం మీద నుంచి కిందికి దిగేశారు. చివరకు హజ్జాజ్ బయటికి వచ్చేశాడు. మరియు నాకూ, నా తండ్రికీ మధ్య నడవసాగాడు. నేను హజ్జాజ్‌తో ఇలా అన్నాను "ఒకవేళ నీవుగనక దైవ ప్రవక్త(స)గారి సంప్రదాయంపై నడవదలిస్తే చిన్న ఖుత్బాను పఠించు. అరఫాత్ వద్ద ఆగటానికి తొందరపడు". అప్పుడు ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు, 'సాలిమ్ నిజమే పలికారు.'

## 90వ అధ్యాయం

### అరఫాత్‌లో ఆగటానికి త్వరగా వెళ్ళటం

## 91వ అధ్యాయం

### అరఫాత్‌లో ఆగే విషయం గురించి

**725.** ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ ఇలా ఉల్లేఖించారు : నా తండ్రి గారు ఇలా అన్నారు– (ఇస్లామ్ స్వీకారానికి ముందు) (అరఫా రోజున) నేను నా ఒంటె

కోసం వెతుకుతున్నాను. మరొక ధ్రువీకరణ - జుబైర్ బిన్ ముత్‌యిమ్ ఇలా అన్నారు 'నేను నా ఒంటెను పోగొట్టుకున్నాను. నేను దాన్ని వెతుక్కుంటూ బయలుదేరాను. అది అరఫా దినం. నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు అరఫాత్‌లో నిలబడి ఉండడాన్ని గమనించాను.' నేను నాలోనే స్వయంగా ఇలా అనుకున్నాను 'అల్లాహ్ సాక్షిగా! ఆయన ఖురైష్‌లకు చెందిన వారు. ఖురైష్ తెగకు చెందిన ఆయన(స) ఇక్కడకు ఎందుకు వచ్చారు?'

**726.** హిష్షామ్ బిన్ ఉర్‌వా ఇలా ఉల్లేఖించారు : అజ్ఞాన కాలంలో ప్రజలు దిగంబరులై తవాఫ్ చేసేవారు- హుమ్‌స్ తప్ప. అంటే ఖురైష్ తెగకు చెందిన ప్రజలు, వారి సంతానం. (ఖజా బనీ కనాన మొదలైన వారు). ఇంకా ఖురైష్ తెగకు చెందిన ప్రజలు ఇతరులకు ఇట్టే బట్టలు పంచిపెట్టేవారు. వారిలోని పురుషుడు పురుషునికి వస్త్రాలు ఇచ్చేవాడు. అతడు ఆ వస్త్రాలను ధరించి తవాఫ్ చేసేవాడు. మరియు వారి లోని స్త్రీ స్త్రీకి బట్టలు పంచిపెట్టేది. ఆమె ఆ బట్టలను ధరించి తవాఫ్ చేసేది. ఎవరికైతే ఖురైష్ తెగకు చెందిన ప్రజలు వస్త్రాలను ఇవ్వరో వారు దిగంబరులై తవాఫ్ చేసేవారు. ఇతర ప్రజలందరూ (వుఖూఫ్ చేసి) అరఫాత్ నుంచి వెనుతిరిగేవారు. ఖురైష్ తెగకు చెందిన ప్రజలు ముజ్దలిఫా నుంచే వెనుదిరిగేవారు. హిష్షామ్ ఇలా అనేవారు 'నా తండ్రి గారైన ఉర్‌వా హజ్రత్ ఆయెషా(ర)తో ఇలా ఉల్లేఖించారు : బఖరా సూరాలో 'సుమ్మ అఫీజు మిన్ హయ్‌సు అఫాజున్నాసు...' అనే వాక్యం ఖురైషులను గురించి అవతరించింది. వారు ముజ్‌దలిఫా నుంచి తిరిగి వచ్చేసేవారు. అప్పుడు వారికి అరఫాత్ నుంచి వెనుతిరగమనే ఆదేశం వచ్చింది.

## 92వ అధ్యాయం

**అరఫాత్ నుంచి వెనుతిరిగి వచ్చేటప్పుడు ఒక మనిషి నడక వేగం ఎంత ఉండాలి?**

**727.** ఉర్‌వా ఇలా ఉల్లేఖించారు : నా సమక్షంలోనే ఉసామా (ర)ను ఇలా అడగటం జరిగింది. 'హజ్జతుల్ విదా సమయంలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అరఫాత్ నుంచి వెనుదిరిగి వెళ్లేటప్పుడు ఆయన(స) గారి నడక ఎలా ఉండేది?' ఉసామా(ర) ఇలా సమాధానం పలికారు- 'దైవప్రవక్త(స) నమ్రతతో, నిరాడంబరంగా నడిచేవారు. స్థలం సరిపోయినంత ఉన్నప్పుడు ఆయన(స) తన ఒంటెను కడు వేగంగా పరుగెత్తించేవారు.'

## 93వ అధ్యాయం

### అరఫాత్, ముజ్‌దలిఫాల మధ్య ఒంటెపై నుంచి దిగటం.

**728.** ఉసామా బిన్ జైద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అరఫాత్ నుంచి బయలుదేరి వెళ్ళినప్పుడు ఆయన(స) గారు ఒక పర్వత మార్గం వైపునకు (లోయ వైపునకు) వెళ్ళారు. అక్కడ ఆయన(స)గారు తన కాలకృత్యాలను తీర్చుకున్నారు. ఆ తరువాత వుజూ చేసుకున్నారు. అప్పుడు నేను ఆయన్ని(స) ఇలా అడిగాను : 'ఓ దైవప్రవక్తా(స)! మీరు (మగ్రిబ్) నమాజ్ చేయరా? దానికి ఆయన(స), 'నమాజు చేసే స్థలం ఇంకా కొంచెం ముందుకు పోతే వస్తుంది. (అంటే ముజ్దలిఫా)' అన్నారు.

**729.** నాఫె ఇలా ఉల్లేఖించారు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) మగ్రిబ్, ఇషా నమాజుల్ని కలిపి ముజ్దలిఫా వద్ద చేసేవారు. కాని దైవప్రవక్త(స) ప్రయాణం చేసిన పర్వత మార్గం గుండా ఆయన కూడా ప్రయాణం చేసేవారు. ఆ మార్గంలోకి ప్రవేశించి ఆయన(ర) కాలకృత్యాలు తీర్చుకునేవారు. ఆ తరువాత వుజూ చేసుకునేవారు. ఆ తరువాత ముజ్దలిఫా వద్ద నమాజు చేసే వరకు ఎలాంటి ఇతర నమాజును చేసేవారు కారు.

**730.** ఉసామా బిన్ జైద్ (రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన(ర) ఇలా అన్నారు నేను అరఫాత్ నుంచి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి ఒంటెపైకి ఎక్కి కూర్చున్నాను. అప్పుడు దైవప్రవక్త(స) గారు ఎడమవైపు ఉన్నటువంటి పర్వత మార్గంపైకి చేరుకున్నారు. అది ముజ్దలిఫా నుంచి కొంచెం దూరంలోనే ఉంది. దైవప్రవక్త(స)గారు తమ ఒంటెను నేలపై కూర్చోబెట్టారు. మూత్ర విసర్జనం చేశారు. తరువాత వచ్చేశారు. నేను వుజూ చేసుకోవటానికి నీళ్ళను ఆయన(స)గారిపై పోశాను. అప్పుడు ఆయన(స) గారు తేలికపాటి వుజూను చేసుకున్నారు. అప్పుడు నేను ఆయన(స) గారితో ఇలా మనవి చేసుకున్నాను– 'ఓ దైవప్రవక్తా(స)! నమాజ్, సమాధానంగా ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు ఇంకా కొంచెం ముందుకుపోయి నమాజు చేసుకుందాం.' ఆయన(స)గారు తమ వాహనంపైకి ఎక్కి కూర్చున్నారు. ముజ్దలిఫాలోకి ప్రవేశించాము. అక్కడ మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి చేసుకున్నాము. తరువాత ముజ్దలిఫా నుండి పదవ తేదీన ఫజల్ బిన్ అబ్బాస్ (రజిఅన్)

ఆయన(స)గారితో ప్రయాణం కట్టారు. కురైబ్ (ఉప ఉల్లేఖకుడు) ఇలా అన్నారు : 'నాతో అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి) ఫజల్ నుంచి విని సమాచారం ఇలా అందించారు. దైవ ప్రవక్త(స)గారు ఎడతెగకుండా లబ్బైక్ పఠిస్తూ ఉన్నారు. చివరకు జమ్రా అల్ అఖబా వద్దకు చేరుకున్నారు. (కంకరరాళ్ళతో కొట్టటానికి అక్కడకు చేరుకున్నారు)'

## 94వ అధ్యాయం

## అరఫాత్ నుండి వాపసు అయ్యే సమయంలో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, సంయమనం పాటించాలని దైవప్రవక్త(స) ఆదేశించటం. ఆ మేరకు కొరడాతో సంజ్ఞ చేయడం.

**731.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : అరఫాత్ దినం నాడు (జిల్‌హజ్జా 9వ తేదీనాడు) నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి అరఫాత్ నుండి తిరుగు ప్రయాణం కట్టాను. దైవప్రవక్త(స)గారు అప్పుడు పెద్ద గందరగోళం, అల్లరి, అరుపులు చెలరేగటాన్ని విన్నారు. ఒంటెలపై స్వారీ చేసేవారు తమ కొరడా లతో ఒంటెల్ని బాదుతున్నారు. అప్పుడు దైవప్రవక్త(స)గారు తన కొరడాను ఝుళిపించి కేక వేశారు. 'ఓ జనులారా! నిశ్శబ్దంగా ఉండండి తొందరపడటం, హడావుడి చెయ్యటం ధర్మ పరాయణత్వం కాదు'.

## 95వ అధ్యాయం

## ముజ్దలిఫా వద్ద రెండు నమాజులను కలిపి చెయ్యటం

**732.** ఉసామా బిన్ జైద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు, ఆయన ఇలా అన్నారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅసమ్) అరఫాత్ నుంచి తిరిగివచ్చారు. ముజ్దలిఫాకు దగ్గరలో ఉన్న పర్వత మార్గం వద్ద దిగారు. అక్కడ ఆయన(స) మూత్ర విసర్జనం చేశారు. తరువాత వుజూ చేసుకున్నారు. పూర్తి వుజూను చేసుకోలేదు. (పూర్తిగా నీళ్ళను ఉపయోగించలేదు. తేలికపాటి వుజూ చేసుకున్నారు) నేను ఆయన (స) గారితో ఇలా విన్నవించుకున్నాను- 'ఓ దైవప్రవక్తా(స) ! నమాజ్', అప్పుడు ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు : 'కొంచెం ముందుకు పోయిన తరువాత నమాజు చేసుకుందాం.' తరువాత ముజ్దలిఫాలోకి వచ్చి ఆయన(స) గారు పూర్తి వుజూ చేసుకున్నారు. ఆ తరువాత నమాజ్‌కు సంబంధించిన తక్బీర్ చెప్పటం జరిగింది. మగ్రిబ్ నమాజును చేసుకున్నారు.

తరువాత ప్రతి మనిషి తన ఒంటెను దాని స్థానంలో కూర్చుండబెట్టాడు. ఆ తరువాత తక్బీర్ అయింది. మరియు ఇషా నమాజు చేసుకున్నారు. ఆ రెండు నమాజుల మధ్య మరొక నమాజు ఏదీ జరగలేదు."

## 96వ అధ్యాయం

**మగ్రిబ్, ఇషా నమాజుల్ని ముజ్దలిఫాలో కలిపి చెయ్యటం. సున్నత్ వగైరా నమాజుల్ని చెయ్యకపోవడం.**

**733.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఆయన(ర) ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ముజ్దలిఫాలో మగ్రిబ్ ఇషా నమాజుల్ని కలిపి చేశారు. ప్రతి ఒకదానికీ వేర్వేరుగా తక్బీర్ చెప్పటం జరిగింది. కాని ఆ నమాజుల మధ్యలో సున్నత్ నమాజు చెయ్యలేదు. వాటి తరువాత కూడా ఎలాంటి నమాజు చెయ్యబడలేదు.'

**734.** అబూ అయ్యూబ్ అన్సారీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్జతుల్ విదాలో ముజ్దలిఫాలో ప్రవేశించి మగ్రిబ్, ఇషా నమాజుల్ని కలిపి చేశారు.'

## 97వ అధ్యాయం

**ప్రతి నమాజు కోసం అజాన్, తక్బీర్ ఇవ్వటం అవసరం.**

**735.** అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ ఇలా ఉల్లేఖించారు "అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) హజ్ చేశారు. ఇషా నమాజు సమయానికి మేము ముజ్దలిఫాకు చేరు కున్నాము. అజాన్, ఇఖామత్ చెప్పమని ఆయన(ర) ఒక మనిషిని ఆజ్ఞాపించారు. తరువాత ఆయన మగ్రిబ్ నమాజును చేశారు. మరియు తరువాత రెండు రకాతులు (సున్నత్) నమాజును చేశారు. అప్పుడు ఆయన తన రాత్రి భోజనాన్ని తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. రాత్రి భోజనం చేశారు. తరువాత, నేను అనుకుంటాను, ఆయన ఒక మనిషిని అజాన్, ఇఖామత్‌లను ఇవ్వమని ఆజ్ఞాపించారు (ఇషా నమాజు కోసం). అమ్ర్ బిన్ ఖాలిద్ (ఒక ఉప ఉల్లేఖకుడు) ఇలా అన్నారు. 'ఈ సంశయం, జుహైర్‌కు కలిగింది అని నేను అనుకుంటాను.' ఆ తరువాత అబ్దుల్లాహ్(ర) రెండు రకాతులు ఇషా నమాజు చేశారు. తెల్లవారిన తరువాత అబ్దుల్లా(ర) ఇలా అన్నారు: దైవప్రవక్త(స) ఈ సమయంలో (అంటే ఈ చీకటి సమయంలో) ఫజర్ నమాజు ఈ స్థలంలోనే చేసేవారు. అబ్దుల్లా(ర)

అదనంగా ఇలా అన్నారు ఈ రెండు నమాజులను తమ అసలు సమయాల నుంచి మార్చబడ్డాయి- ఒకటి మగ్రిబ్ నమాజ్- ప్రజలు ముజ్దలిఫాకు చేరినప్పుడు చెయ్యాలి. రెండవది ఫజర్ నమాజు- తెల్లవారగానే చెయ్యాలి. దైవప్రవక్త (స)గారు ఇలా చేస్తూ ఉండగా నేను చూశాను అని ఆయన(ర) అన్నారు.'

## 98వ అధ్యాయం

**స్త్రీలను, పిల్లలను ముజ్దలిఫాకు చేరిన రాత్రి వేళే మినాకు పంపి వెయ్యాలి. వారు మట్టుకు ముజ్దలిఫాలోనే ఆగిపోవాలి. మరియు అల్లాహ్‌ను ప్రార్థించాలి. చంద్రుడు అస్తమించగానే వెళ్ళిపోవాలి.**

**736.** సాలిమ్ ఇలా అన్నారు: అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) తన కుటుంబానికి చెందిన బలహీనంగా ఉన్నవారిని (స్త్రీలు, పిల్లలు) ముందుగానే మినాకు పంపేవారు. వారు రాత్రి సమయంలో ముజ్దలిఫాలో మష్అరె హరామ్ వద్ద ఆగిపోయేవారు. తరువాత సాధ్యమైనంత వరకు- మనస్సు కోరినంతవరకు అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించేవారు. ఆ తరువాత తిరిగి వెళ్ళిపోయేవారు. ఇమామ్ ఆగిపోవటం, తిరిగి వెళ్ళిపోవటం దగ్గర నుంచి వారిలోని కొందరు మినాలో ఉదయం నమాజు సమయంలో చేరిపోతారు. కొందరు దాని తరువాత కంకర రాళ్ళను విసిరేవారు. మరియు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఇలా అనేవారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఆ జనుల కోసం అనుమతి ఇచ్చేవారు.'

**737.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నన్ను ఆ రాత్రియే ముజ్దలిఫా నుంచి మినాకు పంపారు.'

**738.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఎవరినైతే ముందుగానే ముజ్దలిఫా నుంచి రాత్రి సమయంలోనే మినాకు పంపివేశారో వారిలో నేను కూడా ఉన్నాను. అంటే దైవప్రవక్త(స) గారి కుటుంబానికి చెందిన బలహీనులైన వారిలోని వాడను.'

**739.** హజ్రత్ అస్మా (రజిఅన్) గారి బానిస అయిన అబ్దుల్లా ఇలా ఉల్లేఖించారు : హజ్రత్ అస్మా బిన్తె అబీ బకర్ (రజిఅన్హా) రాత్రి సమయంలో తాము స్వారీ చేస్తూ ఉన్న ఒంటెపై నుంచి కిందికి దిగిపోయారు. మరియు ఆమె నిలబడి ఒక ఘడియ వరకు నమాజు చేస్తూ ఉన్నారు. తరువాత ఇలా అడిగారు. "ఓ కుమారా! చంద్రుడు

అస్తమించాడా?" నేను సమాధానంగా, "లేదు. చంద్రుడు ఇంకా అస్తమించలేదు." అన్నాను. తరువాత ఆమె గారు ఇంకా కొంచెంసేపు నమాజు చేశారు. ఆ తరువాత ఇలా అన్నారు "చంద్రుడు అస్తమించాడా?" అని. 'అవును, చంద్రుడు అస్తమించాడు' అని సమాధానం వచ్చింది. అయితే బయలుదేరండి. అప్పుడు మేము అందరం బయలుదేరాము. మినాకు చేరిన తరువాత ఆమె(ర)గారు కంకరరాళ్ళు విసిరారు. తిరిగి వచ్చి ఫజర్ నమాజును తమ నివాస స్థలంలో చేశారు. నేను ఆమె గారితో ఇలా అన్నాను, "ఓ బీబీ! మనం చీకట్లో (అంటే సకాలానికి ముందే) రాళ్ళు విసిరాము కదా!" ఆమె గారు ఇలా అన్నారు "ఓ కుమారా! దైవ ప్రవక్త(స)గారు మహిళలకు ఇలాంటి అనుమతి ఇదివరకే ఇచ్చారు."

**740.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు : 'హజ్రత్ సౌదా (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారిని ముజ్దలిఫా రాత్రి సమయంలో త్వరగా వెళ్ళిపోయే అనుమతిని దయచేసి ఇవ్వమని అడిగారు. ఆమె గారు కొంచెం లావుపాటి మనిషి. అప్పుడు దైవప్రవక్త(స) గారు అనుమతినిచ్చారు.'

**741.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: మేము ముజ్దలిఫాలో దిగిపోయాము. హజ్రత్ సౌదా (రజిఅన్హా) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని జనులు గుంపులు గుంపులుగా చొరబడకముందే వెళ్ళిపోయే అనుమతి ఇవ్వమని అడిగారు. ఆమె(ర)గారు చాలా నెమ్మది మనిషి. (వేగంగా నడిచిపోయే మనిషి కాదు). దైవప్రవక్త(స) గారు ఆమె(ర) గారికి అనుమతిని ప్రసాదించారు. కావున ఆమె(ర)గారు ముజ్దలిఫా నుంచి ప్రజలు నెట్టుకుంటూ రాక మునుపే వెళ్ళిపోయారు. తెల్లవారే వరకు మేమందరం ముజ్దలిఫా వద్దనే ఆగిపోయాము. ఆ తరువాత మేము అల్లాహ్ ప్రవక్త(స) గారితో కలిసి ప్రయాణాన్ని కొనసాగించాము. కాని నేను నా మనస్సులో ఎంతగా బాధపడ్డానంటే, నేను కూడా సౌదా (ర) మాదిరిగానే దైవప్రవక్త(స) గారి అనుమతిని తీసుకుని వెళ్ళిపోయి ఉంటే ఎంత బాగుండేది! అని అనిపించింది. అలా చేసి ఉంటే, నాకు కలిగే ఆనందం ఇతర ఆనందాలకంటే ఎంతో ప్రియమైనదిగా ఉండేది.'

## 99వ అధ్యాయం

## ముజ్దలిఫాలో ఉదయం పూట చేసే నమాజును ఏ సమయంలో చెయ్యాలి?

**742.** అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన(ర)గారు ఇలా అన్నారు "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు ఏ నమాజునూ సమయం కాని సమయంలో చేసినట్లు నేను ఎన్నడూ చూడలేదు. రెండు నమాజుల్ని తప్ప. ఆయన(స)గారు మగ్రిబ్, ఇషా నమాజులు రెండింటిని కలిపి (ముజ్దలిఫాలో) చేశారు. ఆయన(స)గారు ఉదయం పూట చేసే నమాజును కూడా ఆ రోజు దాని మామూలు సమయానికి ముందే చేశారు."

**743.** అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు– "నేను మక్కా నగరానికి అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్)తో కలిసి వెళ్ళాను. మేము ముజ్దలిఫాకు వెళ్ళినప్పుడు ఆయన(ర) రెండు నమాజుల్ని మగ్రిబ్, ఇషా నమాజులు– కలిపి చేశారు. కాని పై రెండు నమాజులకు వేర్వేరుగా అజాన్ ఇచ్చారు. మరియు ఇఖామత్ చెప్పారు. ఈ రెండు నమాజుల మధ్య ఉన్న సమయంలో ఆయన భోజనం కూడా చేశారు. ఆయన(ర) ఉదయం పూట చేసే నమాజును మాత్రం తెల్లవారగానే చేశారు. కొందరు జనులు ఇలా వ్యాఖ్యానించారు 'ఆ నమాజు జరుగుతున్నప్పుడు తెల్లవారింది.' మరికొందరు ఇలా అన్నారు 'అప్పుడు ఇంకా తెల్లవారనే లేదు.' దైవప్రవక్త(స)గారు ఇలా సెలవిచ్చారని 'అబ్దుల్లాహ్ బిన్ మసూద్ అన్నారు : ఈ రెండు నమాజుల్ని వాటి పూర్వపు స్థానం నుంచి మార్చటం జరిగింది.' ఈ మార్పు ఒక్క ముజ్దలిఫాకే వర్తిస్తుంది అంటే మగ్రిబ్, ఇషా నమాజులు. కనుక జనులు ఇషా నమాజు సమయం అయిపోయేవరకు ముజ్దలిఫా వద్దకు చేరకూడదు.

రెండో నమాజు ఉదయం పూట చేసే ఫజ్ర్ నమాజు. ఆ నమాజును ఈ సమయంలోనే చెయ్యాలి. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ మసూద్(ర)గారు అక్కణ్ణే ఆగి పోయారు వెలుగు ప్రకాశించే వరకు. ఆయన (ర) గారు మళ్ళీ ఇలా అన్నారు 'విశ్వాసుల నాయకుడైన (హజ్రత్ ఉస్మాన్(ర)) ఈ సమయంలో ముజ్దలిఫా నుంచి తిరిగి వెళ్ళిపోతే ఆయన సున్నత్‌ను అనుసరించారు.' అబ్దుర్రహ్మాన్ ఇలా అన్నారు, 'ఇబ్నె మసూద్(ర) గారు చెప్పిన విషయం మొదట జరిగిందా? లేక హజ్రత్ ఉస్మాన్(ర)గారు తిరిగి వెళ్ళిపోవటం మొదట జరిగిందా? అనే విషయం నాకు తెలియదు.' ఇబ్నెమసూద్(ర) ఎడతెగకుండా 'లబ్బైక్' 'లబ్బైక్' అని ఎలుగెత్తి పలుకుతూనే ఉన్నారు. జిల్‌హజ్జ పదవతేదీ జమ్‌రే అఖబాలో రమీ చేసేవరకు.

## 100వ అధ్యాయం

**ముజ్దలిఫా నుంచి ఎప్పుడు వెళ్ళిపోవాలి?**

**744.** అమ్ర్ బిన్ మైమూన్ ఇలా ఉల్లేఖించారు : 'హజ్రత్ ఉమర్ (రజిఅన్) ముజ్దలిఫా వద్ద ఫజ్ర్ నమాజును చేస్తూ ఉండగా నేను చూశాను. తరువాత ఆయన (ర) లేచి నిలబడి ఇలా అన్నారు– 'ముష్రిక్కు ప్రజలు సూర్యుడు ఉదయించే వరకు ముజ్దలిఫా నుంచి వెళ్ళేవారు కారు. మరియు వారు ఇలా అనేవారు సబీర్ పర్వతం మీద సూర్యుడు ప్రకాశించే వరకు (వెళ్ళకూడదు).' కాని దైవప్రవక్త(స) వారిని వ్యతిరేకించారు. సూర్యుడు ఉదయించటానికి ముందే దైవప్రవక్త ముహమ్మద్(స) ముజ్దలిఫా నుంచి వెళ్ళిపోయారు.

## 101వ అధ్యాయం

**పదవ తేదీ ఉదయం పూట తక్బీర్‌ను మరియు తల్బియాను పఠించటం. జమ్ రతుల్ అఖబాను రమీ చేసేవరకు స్వారీ చేసే పశువుపై ఎవరో ఒకరు కూర్చున్న వారి వెనుక కూర్చొని ప్రయాణం చెయ్యటం.**

**745.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫజల్ బిన్ అబ్బాస్(ర)ను తమ వెనుక భాగంలో కూర్చోవాలని ఆజ్ఞాపించారు. ఫజల్ బిన్ అబ్బాస్(ర) ఇలా సమాచారాన్ని అందించారు– దైవ ప్రవక్త(స) గారు తల్బియాను జమ్‌రతుల్ అఖబా రమీ చేసే వరకు పఠిస్తూనే ఉన్నారు.'

**746.** ఉబేదుల్లా బిన్ అబ్దుల్లాహ్ ఇలా ఉల్లేఖించారు : ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారు– 'ఉసామా బిన్ జైద్ (రజిఅన్) దైవప్రవక్త(స)గారి వెనుక కూర్చొని అరఫాత్ నుంచి అల్‌ముజ్దలిఫా వరకు ప్రయాణం చేశారు. తరువాత దైవ ప్రవక్త(స) ముజ్దలిఫా నుంచి మినా వరకు తనతో పాటు ఫజల్ బిన్ అబ్బాస్(ర)ను తన వాహనంపై కూర్చోబెట్టుకున్నారు.' ఉభయులూ ఇలా సెలవిచ్చారు 'దైవప్రవక్త(స) గారు జమ్‌రతుల్ అఖబాను రమీ చేసేవరకు ఎడతెగకుండా తల్బియాను పఠిస్తూనే ఉన్నారు .'

## 102వ అధ్యాయం

దివ్యఖుర్ఆన్‌లోని బఖరా సూరాలోని ఈ వాక్యం (ఆయతు) వివరణ ప్రకారం 'ఎవరైతే ఉమ్రా తోపాటు హజ్‌ను కలిపి ప్రయోజనాన్ని పొందుతారో (అంటే తమత్తు

చేస్తారో) అతను తనకు లభించిన పశువును ఖుర్బానీ చెయ్యాలి. ఎవరికైతే ఖుర్బానీ పశువు లభించదో హజ్ దినాలలో మూడు రోజులు ఉపవాసం ఉండాలి. ఇంకా హజ్ నుంచి తిరిగి వచ్చిన తరువాత ఏదు రోజులు ఉపవాసం పాటించాలి. ఇవన్నీ కలిపి పది రోజుల ఉపవాసాలు అవుతాయి. ఈ తమత్తు ఆ జనుల కోసం సక్రమమైనది, ఏ జనుల కుటుంబ సభ్యులైతే మస్జిదె హరామ్ సమీపంలో ఉండరో.

**747.** హజ్రత్ అబూ జమ్రహ్ ఇలా ఉల్లేఖించారు: ఆయన ఇలా అన్నారు 'నేను ఇబ్నె అబ్బాస్(రజిఅన్)ను 'తమత్తు'ను గురించి అడిగాను. ఆయన 'తమత్తు'ను నిర్వహించండి అని చెప్పారు.' ఇంకా నేను ఆయన గారిని ఖుర్బానీని గురించి అడిగాను. ఆయన ఇలా అన్నారు : 'ఒక ఒంటెను గానీ లేదా ఒక ఆవును గానీ లేదా ఒక మేకను గానీ లేదా ఒక ఒంటెలోగాని లేక ఒక ఆవులోగాని భాగస్వామిగా కలిసిపోండి.' అబూ జమ్రహ్ ఇలా అన్నారు 'కొందరు జనులు తమత్తును చెడ్డ ఆచారంగా భావించారు. తరువాత నేను పండుకుని నిద్రపోయాను. అప్పుడు నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో నేను ఏమి చూశానంటే ఒక మనిషి ఎవరో ఇలా అరుస్తున్నాడు ఈ హజ్ 'మబ్ రూర్' అంటే స్వీకృతి పొందినదిగా అయిపోయింది. ఇంకా ఈ తమత్తు కూడా ప్రీతిపాత్రమైనదిగా అయిపోయింది.' తరువాత నేను ఇబ్నె అబ్బాస్(ర) వద్దకు వెళ్ళాను. ఆయన(ర) గారికి ఈ స్వప్నాన్ని గురించి వివరంగా చెప్పుకున్నాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్. ఇది దైవప్రవక్త (అబుల్ ఖాసిమ్) (స) గారి సంప్రదాయం (సున్నత్).' ఆదమ్, వహబ్ బిన్ జరీర్, గున్దర్ షూబాతో ఇలా ఉల్లేఖించారు 'స్వప్నంలోని పిలుపు శుభప్రదమైనది. మరియు దేవుని సన్నిధిలో అంగీకార యోగ్యమైనది. అంటే, ఉమ్రా మరియు హజ్జె మబ్రూర్ దేవుని ఆమోదాన్ని పొందాయి.'

## 103వ అధ్యాయం

ఖుర్బానీ పశువులపైకి ఎక్కి స్వారీ చెయ్యటం గురించి అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: 'ఖుర్బానీ ఒంటెలను మేము మీ కొరకు అల్లాహ్ చిహ్నాలుగా చేశాము. మీకు వాటిలో మేలు ఉన్నది. కనుక వాటిని నిలబెట్టి వాటిపై అల్లాహ్ పేరును స్మరించండి. (ఖుర్బానీ తరువాత) వాటి వీపులు నేలపై ఆనినప్పుడు, వాటిలో నుంచి స్వయంగానూ తినండి, (యాచించని) సంతుష్టులకూ తినిపించండి. తమ అవసరాలకు అడిగేవారికి తినిపించండి. ఈవిధంగా మేము ఈ జంతువులను మీకు

వశపరిచాము, మీరు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు. వాటి మాంసమూ అల్లాహ్‌కు చేరదు. వాటి రక్తమూ చేరదు. కాని మీ భయభక్తులు ఆయనకు చేరుతాయి. ఆయన వాటిని మీకు ఈవిధంగా వశపరిచాడు. ఆయన ప్రసాదించిన మార్గదర్శకత్వానికి మీరు ఆయన గొప్పతనాన్ని చాటేందుకూ. ఓ ప్రవక్తా! సత్కార్యాలు చేసేవారికి శుభవార్త అందించు. **(22: 36,37)**'

**748.** హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక వ్యక్తిని చూశారు, అతను ఖుర్బానీ ఒంటెను అదిలిస్తూ తోలుకుపోతున్నాడు. స్వయంగానైతే కాలినడకన ప్రయాణం చేస్తున్నాడు. అప్పుడు దైవప్రవక్త(స) అతన్ని ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు : 'ఓ మనిషీ! ఆ ఒంటెపైకి ఎక్కి స్వారీ చెయ్యి.' సమాధానంగా అతను, 'ఇది ఖుర్బానీ పశువు' అని అన్నాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, ఓ మనిషీ! ఆ ఖుర్బానీ జంతువుపైకి ఎక్కి స్వారీ చెయ్యి. అతను మళ్ళీ ఇలా సమాధానం పలికాడు, 'ఇది ఖుర్బానీ పశువు.' ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'ఓరీ దౌర్భాగ్యుడా ! వెళ్ళు, ఆ ఖుర్బానీ పశువుపైకి ఎక్కి స్వారీ చెయ్యి.' రెండో దఫానో లేక మూడో దఫానో ఆయన(స)పైవిధంగా అన్నారు.

**749.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుర్బానీ పశువును తోలుకుపోతూ ఉన్న ఒక మనిషిని చూశారు. దైవప్రవక్త(స) అతన్ని ఉద్దేశించి, 'దానిపైకి ఎక్కి స్వారీ చెయ్యి' అని అన్నారు. ఆ మనిషి, అది ఖుర్బానీ పశువు అని సమాధానం చెప్పాడు. దైవప్రవక్త(స), 'దాని మీదకు ఎక్కి ప్రయాణం చెయ్యి' అని మళ్ళీ ఆజ్ఞాపించారు. ఆ మనిషి మళ్ళీ, అది ఖుర్బానీ పశువు (నేను దాని మీదకు ఎక్కి స్వారీ చెయ్యలేను) అని అన్నాడు. దైవప్రవక్త(స) 'దాని మీదకు ఎక్కి స్వారీ చెయ్యి' అని మళ్ళీ అన్నారు. దైవప్రవక్త(స) దానిపైకి ఎక్కి స్వారీ చెయ్యి అని మూడుసార్లు అన్నారు.'

## 104వ అధ్యాయం

### ఎవరైతే ఖుర్బానీ పశువును తనతోపాటు తీసుకువచ్చాడో అతన్ని గురించి

**750.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్జతుల్ విదాలో ఉన్న సమయంలో తమత్తు చేశారు. అంటే ఉమ్రా చేసి ఆ తరువాత హజ్ చేశారు. జుల్‌హులైఫా నుంచి ఆయన(స)గారు తనతోపాటు ఖుర్బానీ పశువును కూడా తీసుకువెళ్ళారు. మొదట దైవప్రవక్త(స)గారే

ప్రారంభించారు. ఆయన (స) ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారు. మరియు ప్రకటించారు, తరువాత హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించి ఎలుగెత్తి ప్రకటించారు. అక్కడ ఉన్న జనులందరూ ఆయన(స) గారితోపాటు తమత్తు చేశారు. అంటే, ఉమ్రా చేసి ఆ తరువాత హజ్ చేశారు. ఇప్పుడు అక్కడ ఉన్న జనుల్లో రెండు రకాలవారు ఉన్నారు. కొంత మంద్రైతే తమతోపాటు ఖుర్బానీ పశువును కూడా తీసుకు పోయినవారు. మరికొంతమంది తమతోపాటు ఖుర్బానీ పశువును తీసుకురానివారు. దైవప్రవక్త(స) గారు మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు, జనుల్ని ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు : 'మీలో ఎవరైతే తమతోపాటు ఖుర్బానీ పశువును తీసుకువచ్చారో వారు ఇహ్రామ్‌లో ఉన్నప్పుడు ఏఏ వస్తువుల నైతే తీసుకోకుండా వాటికి దూరంగా ఉంటారో, ఇప్పుడు కూడా వాటికి దూరంగానే ఉండాలి. ఇది హజ్ యాత్ర పూర్తి అయ్యే వరకు ఉండాలి. ఇంకా ఎవరైతే తమతోపాటు ఖుర్బానీ పశువును తీసుకురాలేదో వారు కాబా గృహ ప్రదక్షిణ చెయ్యాలి. ఇంకా సఫా మర్వా కొండల మధ్య పరుగెత్తి శిరోముండనం చేయించుకోవాలి. మరియు ఇహ్రామ్‌ను విప్పివెయ్యాలి. తరువాత ఏడవ తేదీన లేక ఎనిమిదవ తేదీన హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించాలి.'

ఇక ఎవరికైతే ఖుర్బానీ ఇచ్చే స్థోమత లేదో వారు మూడు రోజుల ఉపవాసాలు హజ్‌దినాలలో ఉండాలి. మరియు మిగతా ఏడురోజుల ఉపవాసాలు తమ స్వగృహానికి తిరిగి చేరుకున్న తరువాత ఉండాలి. దైవప్రవక్త(స) గారు మక్కా నగరంలోకి ప్రవేశించిన తరువాత కాబాను తవాఫ్ చేశారు. ఇంకా ఆయన(స)గారు హజ్రె అస్వద్‌ను ముద్దుపెట్టు కున్నారు. ఆ తరువాత మొట్టమొదటి మూడు ప్రదక్షిణలలో రమీ చేశారు. మరియు నాలుగు ప్రదక్షిణలలో మామూలుగా నడిచారు. మరియు తవాఫ్ తరువాత రెండు రకాతుల నమాజును కాబా గృహం 'మఖామె ఇబ్రాహీమ్' వద్ద చేశారు. తరువాత సలామ్ చేశారు. మరియు నమాజ్‌ను ముగించుకున్న తరువాత సఫా కొండపైకి ఎక్కారు. అక్కడ సఫా మర్వాలకు సంబంధించిన ఏడు ప్రదక్షిణలు చేశారు. ఆ తరువాత ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు ఏఏ వస్తువులకు దూరంగా ఉండాలో ఆ వస్తువులకు హజ్ పరిపూర్తి అయ్యే వరకు దూరంగానే ఉండిపోయారు. పదవ తేదీన జిల్‌హజ్జ్‌కు సంబంధించిన ఖుర్బానీ జంతువును నహర్ చేశారు. ఎవరైతే ఖుర్బానీ పశువును తమతోపాటు తీసుకువచ్చారో వారు కూడా దైవప్రవక్త(స) గారు చేసిన విధంగానే చేశారు.

## 105వ అధ్యాయం

### ప్రయాణ మార్గంలో ఉన్నప్పుడు ఖుర్బానీ పశువును కొనటం.

**751.** నాఫె ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లాహ్ (బిన్ అబ్దుల్లాహ్) బిన్ ఉమర్ (రజిఅన్) తన తండ్రిగారితో ఇలా అన్నారు 'నాన్నగారూ! మీరు ఈ సంవత్సరం ఇక్కడ ఆగిపోండి. హజ్ యాత్రకు వెళ్ళకండి. కాబా వద్దకు వెళ్ళకుండా మీరు నిరోధిం చబడ తారేమో అని నేను భయపడుతున్నాను.' అప్పుడు ఆయన(ర) గారు ఇలా అన్నారు: ఏమిటి? ఏమవుతుంది? దైవ ప్రవక్త(స) గారు ఏదైతే చేశారో నేను కూడా అదే చేస్తాను.' అల్లాహ్ ముమ్‌తహిన సూరాలో ఇలా సెలవిచ్చాడు : 'మీరు దైవప్రవక్త (స) గారిని అనుస రించటమే మంచిది. అదే మీకు శ్రేయస్కరమైనది. నేను మిమ్మల్ని సాక్షులుగా నిలబెడుతున్నాను నేను ఉమ్రాను నాపై వాజిబ్‌గా చేసుకున్నాను అని.' తరువాత ఆయన ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారు. నాఫె ఇలా అన్నారు: అప్పుడు అబ్దుల్లా బిన్ ఉమర్ మదీనా నుంచి బయలుదేరారు. అల్‌బైదాకు చేరుకున్న ప్పుడు, హజ్, ఉమ్రా రెండింటికీ సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారు. అప్పుడు ఇలా అన్నారు 'హజ్, ఉమ్రా రెండూ సమానమైనవే.' తరువాత ఖుదైద్‌లోకి ప్రవేశిం చిన తరువాత అక్కడ ఖుర్బానీ పశువును కొన్నారు. తరువాత మక్కాలోకి ప్రవేశించి నప్పుడు హజ్, ఉమ్రా రెండింటి కోసం ఒకే తవాఫ్ చేశారు. ఈ రెండింటిని పూర్తి చేయనంత వరకు ఆయన ఇహ్రామ్‌ను విప్పలేదు.

## 106వ అధ్యాయం

**ఎవరయితే జుల్‌హులైఫా చేరుకుని ఖుర్బానీ పశువుపై గుర్తు వేస్తారో, ఖుర్బానీ పశువు మెడలో పట్టావేస్తారో ఆ తరువాత ఇహ్రామ్‌ను ధరిస్తారో... నాఫె ఇలా అన్నారు : ఇబ్నె ఉమర్(ర) మదీనా పట్టణం నుంచి తనతో ఖుర్బానీ పశువును తీసుకువెళ్ళినప్పుడు ఖుర్బానీ పశువుకు గుర్తులు వేసేవారు. మరియు దాన్ని మెడలో పట్టా వేసేవారు. ఒక పెద్ద కత్తితో ఆ ఒంటె మూపురం కుడిభాగంలో పొడిచేవారు. తరువాత ఆయన దాని ముఖాన్ని ఖిబ్లా వైపునకు తిప్పి అది తన మోకాళ్ళపై కూర్చునేలా చేసేవారు.**

**752.** అల్ మిస్‌వర్ బిన్ మఖరమ, మర్వాన్ బిన్ జుబైర్ (రజిఅన్) ఉభయులూ కలిసి ఇలా ఉల్లేఖించారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తన సహచరులు

వెయ్యి మందితో కలిసి (హుదైబియా ఒప్పందం జరిగినప్పుడు ఉమ్రా కోసం) బయలుదేరారు. జుల్‌హులైఫాకు చేరినప్పుడు దైవ ప్రవక్త(స) గారు తన ఖుర్బానీ పశువుకు సంకేతంగా మెడలో పట్టావేశారు. ఇంకా దాని శరీరంపై గుర్తులు వేశారు. ఆ తరువాతనే ఆయన(స) ఉమ్రా కోసం ఇహ్రామ్‌ను ధరించారు.'

**753.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు: ఆమె గారు ఇలా అన్నారు- 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ఒంటెల కోసం త్రాళ్ళను నేను స్వయంగా నా చేతులతో పేనాను. తరువాత ఆయన(స)గారు ఆ త్రాళ్ళను వాటి మెడల్లో వేశారు. మరియు ఆ ఒంటెలపై సంకేతంగా ముద్రలు వేశారు. తరువాత వాటిని మక్కానగరం వైపునకు తోలారు. దైవప్రవక్త(స) గారు ధర్మసమ్మతమైన ఏ వస్తువునూ నిషిద్ధంగా ఎంచలేదు.'

## 107వ అధ్యాయం

### ఖుర్బానీ ఒంటెల కోసం, గోవుల కోసం త్రాళ్ళను పేనటం.

**754.** హజ్రత్ హఫ్సా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు : ఆమె గారు ఇలా అన్నారు- దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో ఇలా విన్నవించుకున్నాను, 'ఓ దైవ ప్రవక్తా(స)! ప్రజలైతే తమ ఇహ్రామ్‌ను విప్పివేశారు. వారికేమైందని వారు అలా చేశారు. మీరైతే మీరు ధరించిన ఇహ్రామ్‌ను ఇంకా విప్పనే లేదుకదా!' అప్పుడు సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : 'నేను నా తల వెంట్రుకలను పేర్చుకున్నాను. ఖుర్బానీ ఒంటెలకు త్రాళ్ళు వేశాను. నేను హజ్జ్‌ను ముగించేవరకు ఇహ్రామ్‌ను విప్పలేను.'

**755.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు : ఆమె(ర) గారు ఇలా అన్నారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తమ ఖుర్బానీ పశువులను మదీనా పట్టణం నుంచి పంపుతూ ఉండేవారు. అప్పుడు నేను ఆయన(స)గారి ఖుర్బానీ పశువుల కోసం త్రాళ్ళు పేనుతూ ఉండేదాన్ని. ఒక ముహ్‌రిమ్ దూరంగా ఉండే ఏ వస్తువుకూ ఆయన (స)గారు దూరంగా ఉండేవారు కాదు.'

## 108వ అధ్యాయం

### ఖుర్బానీ పశువులపై గుర్తులు వేయుటం

**అల్ మిస్‌వర్ (రజిఅన్) ఇలా అన్నారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)**

**ఖుర్బానీ పశువులకు పట్టాలు వేసేవారు. వాటిపై గుర్తులు వేసేవారు. ఆ తరువాతే ఉమ్రా కోసం ఇహ్రామ్‌ను ధరించేవారు.**

**756.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఉల్లేఖించారు : ఆమె(ర) గారు ఇలా అన్నారు- 'దైవప్రవక్త(స) గారి ఖుర్బానీ పశువుల కోసం నేను త్రాళ్ళు పేనేదాన్ని. అప్పుడు ఆయన (స)గారు వాటిపై గుర్తులు వేసేవారు. మరియు వాటి మెడలలో త్రాళ్ళు వేసేవారు. ఆ తరువాత వాటిని కాబాకు తోలిపెట్టేవారు. కాని ఆయన(స)గారు మాత్రం మదీనా పట్టణంలోనే ఉండిపోయేవారు. ధర్మసమ్మతమైన ఏ వస్తువూ ఆయన (స) గారి కోసం చట్ట వ్యతిరేకమైనదిగా భావించబడేది కాదు.'

## 109వ అధ్యాయం

### ఎవరైతే స్వయంగా తమ చేతులతో త్రాడు పేనారో, వారిని గురించి.

**757.** అబ్దుల్లాహ్ బిన్ అబూబకర్ బిన్ అమ్ర్ బిన్ హాజమ్ ఇలా ఉల్లేఖించారు: అమ్రా బిన్త్ అబ్దుర్రహ్మాన్ తనతో ఇలా అన్నారని జియాద్ బిన్ అబూ సుఫ్యాన్ హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా)కు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా అన్నారని ఉత్తరం వ్రాశారు; 'ఎవడైతే తన ఖుర్బానీ పశువును కాబతుల్లాహ్‌కు పంపుతాడో, ఒక హజ్ యాత్రికునికి ఎన్ని వస్తువులైతే నిషిద్ధమవుతాయో అవన్నీ అతనిక్కూడా నిషిద్ధమవు తాయి. ఈ నిషేధం అతను ఆ ఖుర్బానీ పశువును ఖుర్బానీ ఇచ్చేవరకు(అంటే జిల్‌హజ్జ పదవ తేదీ వరకు) ఉంటుంది" హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారని అమ్రా అదనంగా ఇలా అన్నారు: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఏదైతే అన్నారో అది నిజం కాదు. 'స్వయంగా నేనే నా చేతులతో దైవప్రవక్త(స) గారి ఖుర్బానీ పశువుల కోసం త్రాళ్ళు పేనాను.' అప్పుడు దైవప్రవక్త(స) ఆ త్రాళ్ళని తన సొంత ఖుర్బానీ పశువుల మెడలకు తన అమృత హస్తాలతో వేశారు. ఇంకా వాటిని నా తండ్రి గారితో పంపివేశారు. అయినప్పటికీ అల్లాహ్ అనుమతి లభించిన ఏ వస్తువైనా సరే అల్లాహ్ ప్రవక్త(స) కోసం నిషిద్ధం కానేకాదు. అంటే ఆయన(స) తన ఖుర్బానీ పశువులను ఖుర్బానీ ఇచ్చేవరకు.

## 110వ అధ్యాయం

### గొర్రెలు, మేకల మెడలలో పట్టాలు వెయ్యటం.

**758.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు : ఆమె (ర) గారు ఇలా అన్నారు- "ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మేకల్ని ఖుర్బానీ పశువులుగా కాబతుల్లాహ్‌కు పంపారు".

**759.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు: ఆమె(ర)గారు ఇలా సెలవిచ్చారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి ఖుర్బానీ పశువుల కోసం స్వయంగా నేనే త్రాళ్ళు పేనేదాన్ని. తరువాత దైవప్రవక్త(స) గారు వాటి మెడలలో పట్టాలు వేసేవారు. ఆ తరువాత ఆయన(స) గారు తన కుటుంబ సభ్యులతో కలిసి ఇహ్రామ్ లేకుండా ఉండిపోయేవారు.'

**760.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఉల్లేఖించారు : ఆమె(ర)గారు ఇలా సెలవిచ్చారు- 'దైవప్రవక్త(స) గారి మేకల కోసం నేను త్రాళ్ళు పేనేదాన్ని. ఆయన (స) గారు వాటిని కాబతుల్లాహ్‌కు పంపి వేసేవారు. ఇహ్రామ్ లేకుండానే ఉండిపోయేవారు.'

**761.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఉల్లేఖించారు : ఆమె(ర) గారు ఇలా సెలవిచ్చారు- 'దైవప్రవక్త(స) గారి ఖుర్బానీ పశువుల కోసం నేను త్రాళ్ళు పేనేదాన్ని. ఆయన(స) గారు ఇహ్రామ్‌ను ధరించకముందే ఈ పని చేసేదాన్ని.'

## 111వ అధ్యాయం

### త్రాళ్ళు ఉన్నితో పేనబడేవి.

**762.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా(ర) ఉల్లేఖించారు : ఆమె(ర) గారు ఇలా అన్నారు, 'నా దగ్గర కొంత ఉన్ని ఉండినది, దానితో ఖుర్బానీ పశువుల కోసం నేను త్రాళ్ళు పేనాను.'

## 112వ అధ్యాయం

### పాదరక్షల దండను అల్లటం

**763.** హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఇలా అన్నారని ఇక్రిమా ఉల్లేఖించారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒక వ్యక్తిని మార్గమధ్యంలో చూశారు. అతను ఖుర్బానీ ఒంటెను తోలుకుంటూ పోతున్నాడు. దైవప్రవక్త(స) గారు అతన్ని ఉద్దేశించి, 'ఒంటెపైకి ఎక్కి స్వారీ చెయ్యి' అని అన్నారు. అప్పుడు అతను దైవప్రవక్త

(స)ను ఉద్దేశించి 'ఇది ఖుర్బానీ జంతువు. దానిపైకి నేను ఎక్కలేను' అని అన్నాడు. దైవప్రవక్త(స) అతన్ని ఉద్దేశించి మళ్ళీ, 'దానిపైకి ఎక్కి స్వారీ చెయ్యి' అని సెలవిచ్చారు. అబూ హురైరా(ర) ఇలా అన్నారు– 'నేను అతన్ని చూశాను. అతను ఒంటెపైకి ఎక్కి స్వారీ చేస్తున్నాడు. అతను దైవప్రవక్త(స) గారితో కలిసి ప్రయాణం చేస్తున్నాడు. మరియు ఒక చెప్పు దాని మెడలో వ్రేలాడుతోంది. ముహమ్మద్ బిన్ సలామ్ లేక ముహమ్మద్ బిన్ ముసన్నాలతోపాటు ఈ హదీసును ముహమ్మద్ బిన్ బష్షార్ కూడా ఉల్లేఖించారు.

**764.** మాతో ఉస్మాన్ బిన్ ఉమర్ అన్నారు. మాకు అలీ బిన్ ముబారక్ తెలియజేశారు– ఆయన యహ్యా ఇబ్నె అబీకసీర్ నుంచి ఆయన ఇక్రిమా నుంచి ఆయన అబూ హురైరా(ర) నుంచి, ఆయన దైవప్రవక్త(స) గారి నుంచి.

## 113వ అధ్యాయం

**ఖుర్బానీ కోసం ఉద్దేశించబడిన ఒంటెలపై కప్పే వస్త్రాన్ని ఏమి చెయ్యాలి? అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఖుర్బానీ జంతువుపై ఉన్న వస్త్రాన్ని మూపురం వరకు చించేశారు (గుర్తు కోసం). ఒంటెను ఖుర్బానీ చేసినప్పుడు ఆ వస్త్రాన్ని తీసివేసేవారు. ఎందుకంటే, ఆ వస్త్రం రక్తంలో తడిసి చెడిపోకుండా ఉండేందుకు. ఆ తరువాత దాన్ని దానం చేసేవారు.**

**765.** హజ్రత్ అలీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు 'నేను ఖుర్బానీ ఇచ్చిన పశువు చర్మాన్ని, దానిపై కప్పిన వస్త్రాన్ని దానం చెయ్యాలని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నన్ను ఆజ్ఞాపించారు.'

## 114వ అధ్యాయం

**ఖుర్బానీ పశువును మార్గమధ్యంలో కొనటం, దాని మెడలో పట్టా వెయ్యటం.**

**766.** నాఫె ఉల్లేఖించారు: 'హరూరియాకు చెందిన ప్రజలు హజ్జ్ యాత్ర చెయ్యదలుచుకున్న సంవత్సరంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) కూడా హజ్జ్ యాత్ర చెయ్యాలని అభిలషించారు. అప్పుడు దేశాన్ని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(ర) పరిపాలిస్తూ ఉండేవారు. కొంతమంది ప్రజలు ఆయనతో ఇలా అన్నారు : 'ఈ ఏడాది ప్రజలు పరస్పరం యుద్ధం చేసుకుంటారేమో అనే అనుమానాలు పొడసూపుతున్నాయి.' కొందరు ప్రజలు ఆయనతో ఇలా అన్నారు 'బహుశ ప్రజలు ఆ సమయంలో పరస్పరం యుద్ధం

చేసుకునే అవకాశాలు ఉన్నాయి. హజ్‌యాత్రకు మిమ్మల్ని పోకుండా నిరోధిస్తారేమోనని మేము భయపడుతూ ఉన్నాము.' సమాధానంగా ఆయన(ర) (ముమ్తహినహ్ సూరాలోని) ఈ ఆయత్ పఠించారు : "మీకూ, అల్లాహ్‌ను అంతిమ దినాన్ని నమ్ముకున్న ప్రతి వ్యక్తికీ ప్రవక్త(స) జీవన సరళిలో మంచి ఆదర్శం ఉంది." ఈ వ్యవహారంలో ఆయన(స)గారు ఎలా చేశారో నేను కూడా అలానే చేస్తాను. నేను మనః పూర్వకంగా ఉమ్రా చెయ్యాలనే ఉద్దేశ్యాన్ని కలిగి ఉన్నాను. దీనికి మిమ్మల్ని సాక్షులుగా నిలబెడుతున్నాను.' అల్‌బైదాకు చేరుకున్నప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు 'హజ్జ్, ఉమ్రాల కోసం షరతులన్నీ ఒకటే. హజ్జ్ యాత్రను, ఉమ్రాను రెండింటినీ కలిపి చెయ్యాలనే ఉద్దేశ్యాన్ని నేను కలిగివున్న విషయానికి మిమ్మల్ని సాక్షులుగా చేస్తున్నాను.' ఆ తరువాత ఆయన(ర) మెడలో పట్టా వేయబడి ఉన్న ఖుర్బానీ జంతువును మక్కాకు తీసుకు పోయారు. ఆ పశువును ఆయన మార్గమధ్యంలో కొన్నారు. మక్కా చేరుకున్నప్పుడు కాబా గృహం ప్రదక్షిణను చేశారు. సఫా మర్వాలను కూడా ఆయన తవాఫ్ చేశారు. అంతకంటే ఎక్కువగా అక్కడ ఆయన ఏమీ చెయ్యలేదు. పదో తేదీ వరకు ఆయన ఇహ్రామ్ స్థితిలోనే ఉండిపోయారు. ఆ రోజున ఆయన శిరోముండనం చేయించుకున్నారు. మరియు ఖుర్బానీ చేశారు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఏమని భావించారంటే, ఆయన మొదట చేసిన తవాఫ్ హజ్జ్, ఉమ్రాలు రెండింటి కోసం సరిపోతుంది అని. తరువాత ఆయన ఇలా అన్నారు "దైవప్రవక్త(స)గారు కూడా ఇలాగే చేశారు."

## 115వ అధ్యాయం

### భార్యల తరపు నుంచి వారి అనుమతి లేకుండానే గోవులను జిబహ్ చేయడం.

**767.** అమ్‌రా బిన్తె అబ్దుర్రహ్మాన్ ఉల్లేఖించారు : ఆమె ఇలా అన్నారు- నేను హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా చెబుతూ ఉండగా విన్నాను. ఆమె గారు ఇలా అన్నారు - 'జీఖాదా మాసంలో ఇంకా ఐదు రోజులు మిగిలి ఉన్నాయి. అప్పుడు మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో కలిసి మదీనా పట్టణం నుంచి బయలుదేరాము. హజ్జ్ చెయ్యాలనేది మా సంకల్పం. మక్కా నగరానికి దగ్గరగా వచ్చినప్పుడు, ఎవరివద్దనైతే ఖుర్బానీ పశువులు లేవో వారిని ఉద్దేశించి మహాప్రవక్త(స) గారు ఇలా ఆజ్ఞాపించారు, 'తవాఫ్ చేసి సఫా మర్వాల మధ్య పరుగులు తీసి ఇహ్రామ్ తీసివెయ్యండి' తరువాత బక్రీద్ పండుగ రోజున ప్రజలు ఆవు మాంసం తీసుకుని మా వద్దకు వచ్చారు. నేనువారిని 'ఈ మాంసం ఎక్కడిది? ఎలాంటిది' అని అడిగాను. వారు

ఇలా సమాధానం పలికారు : దైవప్రవక్త(స) గారు తమ భార్యల తరఫు నుంచి ఆవులను నహర్ చేశారు. యహ్యా ఇలా అన్నారు : నేను అమ్రా గారి సంబంధించిన ఈ హదీసును ఖాసిమ్‌కు వినిపించాను. ఆయన ఇలా అన్నారు 'అమ్రా వినిపించిన ఈ హదీసు సత్యమైనది.'

## 116వ అధ్యాయం

**మినాలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఏ స్థలంలోనైతే నహర్ చేశారో (ఖుర్బానీ పశువును వధించారో) ఆ స్థలంలో నహర్ చెయ్యటం.**

**768.** నాఫె ఇలా ఉల్లేఖించారు :అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఆ స్థలంలో నహర్ చేసేవారు. ఉబేదుల్లా ఇలా అన్నారు : ఏ స్థలంలోనైతే దైవప్రవక్త(స) నహర్ చేసేవారో. (దైవప్రవక్త(స) గారు నహర్ చేసిన స్థలంలోనే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) కూడా ఖుర్బానీ పశువులను నహర్ చేసేవారు)

**769.** నాఫె ఇలా ఉల్లేఖించారు : 'ఇబ్నె ఉమర్(రజిఅన్) తన ఖుర్బానీ పశువులను ముజ్దలిఫా నుంచి చివరి రాత్రి సమయంలో మినాకు రవాణా చేసేవారు. ఈ ఖుర్బానీ పశువులను హాజీలు ఆ స్థలానికి తీసుకుపోయే వారు ఏ స్థలంలోనైతే దైవ ప్రవక్త(స) గారు నహర్ చేసేవారో. ఇంకా ఈ హాజీలలో బానిసలు, స్వతంత్రులు ఉభయులు ఉండేవారు."

## 117వ అధ్యాయం

**తన ఖుర్బానీ పశువును తానే స్వయంగా నహర్ చేయటం.**

**770.** సహల్‌బిన్ బక్కార్ ఇలా ఉల్లేఖించారు: అనస్ (రజిఅన్) గారి ఉల్లేఖనం సంక్షిప్తం చెయ్యబడింది. ఆయన ఇలా అన్నారు– 'దైవప్రవక్త(స)గారు ఏడు ఒంటెల్ని నిలబడి ఉన్న స్థితిలో వధించారు. అంటే, ఆయన(స) గారు నిలబడి ఉన్న ఆ ఒంటెల్ని తన స్వహస్తాలతో నహర్ చేశారు. ఈదుల్ అజ్‌హ రోజున ఆయన(స) గారు నల్లరంగులో, తెల్లరంగులోఉన్న కొమ్ములు గల రెండు పొట్టేళ్ళను ఖుర్బానీ ఇచ్చారు.'

## 118వ అధ్యాయం

**ఒంటెను కట్టివేసి జిబహ్ చెయ్యటం.**

**771.** జియాద్ బిన్ జుబైర్ ఇలా ఉల్లేఖించారు; అబ్దుల్లా బిన్ ఉమర్ ఒక మనిషి వద్దకు పోవటాన్ని నేను చూశాను; ఆ మనిషి తన ఖుర్బానీ పశువును జిబహ్ చేసే

ఉద్దేశ్యంతో నేలపై కూర్చోబెట్టాడు. ఇబ్నె ఉమర్(ర) ఇలా అన్నారు; 'అది నిలబడి ఉన్నప్పుడు దాని కాలు ఒకటి కట్టివేయబడి ఉన్నప్పుడు దాన్ని జిబహ్ చెయ్యి. ఇది దైవప్రవక్త(స) గారి సంప్రదాయం కూడా.'

## 119వ అధ్యాయం

**ఒంటెల్ని నిలబెట్టి నహర్ చేయటం. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి సంప్రదాయం కూడా ఇదే. ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు; హజ్ సూరాలో ఇలా ఉంది; 'ఒంటెలు నిలబడి ఉండాలి.'**

**772.** హజ్రత్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త(స) మహాశయులు ముహమ్మద్'(స) నాలుగు రకాతుల జుహర్ నమాజును మదీనా పట్టణంలో చేశారు. రెండు రకాతుల అసర్ నమాజును జుల్‌హులైపా వద్ద చేశారు. ఆ రోజు రాత్రి అంతా అక్కణ్ణే గడిపారు. తెల్లవారినప్పుడు ఆయన(స) తన ఒంటెపై స్వారీ చెయ్యసాగారు. ప్రయాణం చేస్తూ ఆయన(స) గారు ఇలా పలుకసాగారు; 'అల్లాహ్ తప్ప పూజకు, ఆరాధనకు హక్కు గలవాడు ఎవ్వడూ లేడు. ఘనత గలవాడు, ప్రశంసలకు పాత్రుడు ఒక్క అల్లాహ్ మాత్రమే. 'దైవప్రవక్త(స) అల్‌బైదాకు చేరినప్పుడు హజ్, ఉమ్రాలు రెండింటికి తల్‌బియా పఠించారు. మక్కా పట్టణంలోకి ప్రవేశించి నప్పుడు ఆయన తన అనుచరులకు ఇహ్రామ్‌ను విప్పివెయ్యమని ఆజ్ఞాపించారు. దైవ ప్రవక్త(స) ఏడు ఒంటెలను తన స్వహస్తాలతో వధించారు. అప్పుడు ఒంటెలు అన్నీ నిలబడే ఉన్నాయి. ఇంకా ఆయన(స) కొమ్ములు గల నల్లరంగు, తెలుపు వర్ణం గల రెండు పొట్టేళ్ళను మదీనాలో ఖుర్బానీ ఇచ్చారు."

**773.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నాలుగు రకాతుల జుహర్ నమాజును మదీనా పట్టణంలో చేశారు. మరియు రెండు రకాతుల అసర్ నమాజును జుల్ హులైఫా వద్ద చేశారు. అయ్యూబ్ ఒక మనిషితో ఇలా ఉల్లేఖించారు; అనస్(ర) ఇలా అన్నారు; 'అప్పుడు దైవప్రవక్త(స) గారు ఆ రోజు రాత్రి అంతా ఉదయం తెల్లారేవరకు అక్కణ్ణే ఉన్నారు. తరువాత ఫజర్ నమాజును అక్కణ్ణేచేసి తన ఒంటెపైకి ఎక్కారు. అది అల్‌బైదాకు చేరినప్పుడు ఆయన(స) ఉమ్రా, హజ్‌లు రెండింటికీ కలిపి ఇహ్రామ్‌ను ధరించారు.'

## 120వ అధ్యాయం

**ఖుర్బానీ పశువుకు సంబంధించిన ఏ వస్తువునూ ఖస్సాబ్‌కు వేతనంగా గానీ, శ్రమకు ఫలితంగా గాని ఇవ్వకూడదు.**

**774.** హజ్రత్ అలీ(రజి) ఇలా ఉల్లేఖించారు;"దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒంటెల్ని ఖుర్బానీ ఇచ్చేటప్పుడు ఆ దృశ్యాన్ని పర్యవేక్షించే నిమిత్తం నన్ను ఆ ప్రదేశానికి పంపారు. వాటి మాంసాన్ని పంపిణీ చెయ్యమని నన్ను ఆజ్ఞాపించారు. ఆ తరువాత ఆయన(స) ఖుర్బానీ చెయ్యబడిన ఒంటెలపై కప్పబడే షీట్లను, వాటి చర్మాలను కూడా పంపిణీ చెయ్యమని ఆయన(స) నన్ను ఆజ్ఞాపించారు. దైవ ప్రవక్త(స) గారు, ఖుర్బానీ ఒంటెలను వధించేటప్పటి దృశ్యాన్ని పర్యవేక్షించేందుకు నన్ను ఆజ్ఞాపించారు. ఆ ఒంటెలకు చెందిన ఏ వస్తువునైనా సరే కసాయి వానికి వేతనంగా గానీ, శ్రమకు ఫలితంగా గాని ఇవ్వకూడదని నన్ను ఆజ్ఞాపించారు."

## 121వ అధ్యాయం

**ఖుర్బానీ పశువు చర్మాన్ని దీనులకు దానం చెయ్యవచ్చు.**

**775.** హజ్రత్ అలీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుర్బానీ ఒంటెలను వధించే దృశ్యాన్ని పర్యవేక్షించమని నన్ను ఆజ్ఞాపించారు. ఇంకా వాటి మాంసాన్ని, వాటి చర్మాలను, వాటిపై కప్పే షీట్లను కూడా దానం చెయ్యమని ఆజ్ఞాపించారు. వాటి శరీరాలకు సంబంధించిన ఏ వస్తువునూ కసాయి వాళ్ళకు వేతనంగా, శ్రమ ఫలితంగా ఇవ్వకూడదని కూడా నన్ను ఆజ్ఞాపించారు".

## 122వ అధ్యాయం

**ఖుర్బానీ పశువులపై వేసి ఉంచబడే వస్త్రాలను పేదలకు దానంగా ఇవ్వాలి.**

**776.** హజ్రత్ అలీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నూరు ఒంటెలను ఖుర్బానీగా ఇచ్చారు. వాటి మాంసాన్ని పంచిపెట్టమని కూడా నన్ను ఆజ్ఞాపించారు. నేను ఆయన(స) గారి ఆజ్ఞానుసారం పంచి పెట్టాను. తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు : ఖుర్బానీ పశువులపై కప్పబడి ఉంచే వస్త్రా లను కూడా పేదలకు పంచిపెట్టమని నన్ను ఆజ్ఞాపించారు. నేను వాటిని కూడా పంచి పెట్టాను. ఆ తరువాత వాటి చర్మాలను కూడా పంచిపెట్టమని ఆజ్ఞాపించారు. నేను ఆయన(స) గారి ఆదేశానుసారం వాటిని కూడా పంచిపెట్టాను".

## 123వ అధ్యాయం

ఖుర్ఆన్‌లోని హజ్ సూరాలో కరుణామయుడైన దేవుడు ఇలా సెలవిచ్చాడు. 'మేము ఇబ్రాహీమ్‌కు ఈ గృహం (కాబా గృహం) కొరకు స్థలాన్ని సూచించినప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. (అప్పుడు మేము ఇలా ఉపదేశించాము) నాకు దేనినీ భాగస్వామిగా చేయకు. ప్రదక్షిణం చేసేవారి కొరకూ నా గృహాన్ని పరిశుద్ధంగా ఉంచు. హజ్ కొరకు మానవులందరికీ పిలుపు ఇవ్వు. వారు నీ వద్దకు ప్రతి సుదూర ప్రాంతం నుంచి కాలినడకతోనూ, ఒంటెలపైనా ఎక్కి రావాలని మరియు వచ్చి వారు తమ కొరకు ఇక్కడ ఉంచబడిన ప్రయోజనాలను చూసుకోవాలని. అల్లాహ్ వారికి ప్రసాదించిన పశువుల మీద కొన్ని నిర్ణీత దినాలలో ఆయన పేరును స్మరించాలి. స్వయంగా వారూ తినాలి, లేమికి గురైన అగత్యపరులకూ పెట్టాలి. తరువాత వారు తమ మాలిన్యాన్ని దూరం చేసుకోవాలి. తమ మొక్కుబడులను చెల్లించుకోవాలి. మరియు ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణం చెయ్యాలి. (కాబా నిర్మాణ లక్ష్యం ఇది). ఎవడైనా అల్లాహ్ విధించిన పవిత్ర నియమాలను గౌరవిస్తే అది అతని ప్రభువు దృష్టిలో స్వయంగా అతడికి శ్రేష్టమైనది. **(22: 26-30)**

## 124వ అధ్యాయం

ఖుర్బానీ పశువులలోని ఏ మాంసాన్ని తినవచ్చు? మరియు ఏ మాంసాన్ని దానంగా పేదలకు ఇవ్వవచ్చు? నాకు ఈ సమాచారాన్ని నాఫె అందించారు అని అబ్దుల్లాహ్ ఉల్లేఖించారు. ఆయన ఈ విషయాన్ని ఉమర్(ర) నుంచి తెలుసుకున్నారు. ఆయన ఇలా అన్నారు : 'ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు, ఎవరైనా వేటాడితే, ఆ తరువాత దానికి పరిహారంగా ఒక పశువును ఇవ్వవలసి వస్తే అప్పుడు పరిహారంగా వచ్చిన పశువులో నుంచి మరియు మొక్కుబడిగా వచ్చిన పశువులో నుంచి ఏ మాంసాన్నీ తినకూడదు? కాని మిగతా అన్ని పశువుల మాంసంలోనుంచి ఏ మాంసాన్నయినా తినవచ్చు.' అతా ఇలా అన్నారు, తమత్తుకు చెందిన ఖుర్బానీ మాంసంలో నుంచి ఆ ఖుర్బానీ ఇచ్చే వ్యక్తి తినవచ్చు. ఇతరులు కూడా దాన్ని భుజించవచ్చు.

**777.** ఇబ్నె జురైజ్ ఇలా ఉల్లేఖించారు : అతా ఇలా అన్నారు, 'జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను- 'ఖుర్బానీ పశువుల మాంసాన్ని మేము మినాకు వెళ్ళిన మూడు రోజుల వరకు తినేవారము కాదు. ఆ తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మాకు ఇలా ఆదేశిస్తూ చెప్పారు.

ఈ మాంసాన్ని తినండి, మీమీ గృహాలకు కూడా దాన్ని తీసుకువెళ్ళండి. కనుక మేము ఆ మాంసంలోని కొంత భాగాన్ని తిన్నాము. మరికొంత భాగాన్ని మాతోపాటు తీసుకు వెళ్ళాము.' నేను అతాను ఇలా అడిగాను, 'మదీనాకు చేరే వరకు మేము ఆ ఖుర్బానీ మాంసాన్ని తింటూనే పోయాము' అని జాబిర్ అన్నారా?' అప్పుడు సమాధానంగా అతా, 'లేదు' అని అన్నారు.

**778.** అమ్‌రా బిన్తె అబ్దుర్రహ్మాన్ ఇలా ఉల్లేఖించారు : హజ్రత్ ఆయెషా(ర) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను; 'జీ ఖాయెద మాసానికి చెందిన ఐదు దినాలు ఇంకా మిగిలే ఉన్నాయి.' అప్పుడు మేము దైవప్రవక్త(స) గారితో కలిసి మదీనా పట్టణం నుండి బయలుదేరాము. మేము కేవలం హజ్జ్ యాత్ర చెయ్యాలని మాత్రమే సంకల్పించుకున్నాము. మేము మక్కా మహానగరానికి దగ్గరగా చేరుకున్నప్పుడు, తమతోపాటు ఖుర్బానీ పశువులు తెచ్చుకున్న జనులకు దైవప్రవక్త(స)గారు ఇలా ఆజ్ఞాపించారు 'వారు కాబా గృహ ప్రదక్షిణ చెయ్యాలి. (మరియు సఫా మర్వాల మధ్య) సయీ చేసి ఇహ్రామ్‌ను విప్పివెయ్యాలి.' హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు, అయితే నా వద్దకు బక్రీదు పండుగ రోజున ఆవు మాంసం తీసుకురాబడింది. అది ఎక్కడి నుంచి వచ్చింది? అని నేను అడిగాను. జనులు ఇలా అన్నారు 'దైవప్రవక్త(స) గారు తన భార్యల తరఫున ఖుర్బానీ ఇచ్చారు.'

## 125వ అధ్యాయం

### మొదట ఖుర్బానీ ఇవ్వాలి. ఆ తరువాతనే శిరోముండనం చేయించుకోవాలి.

**779.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఎవరో ఇలా అడిగారు- 'ఖుర్బానీ ఇవ్వటానికి ముందు ఎవరైనా శిరోముండనం చేయించుకుంటే లేదా అలాంటి పనినే ఎవరైనా వెనకాముందు చేసుకుంటే అది దోషమేనా ఓ ప్రవక్తా(స)!' దైవప్రవక్త(స) సమాధానంగా ఇలా సెలవిచ్చారు : 'అది ఎలాంటి దోషమూ కాదు. అది ఎలాంటి దోషమూ కాదు.'

**780.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఒక మనిషి ఇలా అడిగాడు, 'ఓ దైవప్రవక్తా(స)! 'రమీ చెయ్యక మునుపే నేను తవాఫె జియారత్ నిర్వహించాను.' దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు: 'అందులో ఎలాంటి దోషం లేదు' ఆ మనిషి ఇంకా ఇలా ప్రశ్నించాడు

– 'ఓ దైవప్రవక్తా(స)! ఖుర్బానీ చెయ్యక ముందే నేను శిరోముండనం చేయించు కున్నాను.' సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'అందులో ఏ దోషమూ లేదు' అతను ఇంకా ఇలా అన్నాడు 'నేను రమీ చెయ్యకముందే ఖుర్బానీ ఇచ్చాను.' దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు : 'అందులో ఎలాంటి దోషం లేదు.'

**781.** హ్రజత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఎవరో ఇలా అడిగారు, 'ఓ దైవప్రవక్తా(స)! సాయంత్రం అయిపోయిన తరువాత నేను రమీ చేశాను'. దైవప్రవక్త(స) ఇలా సెల విచ్చారు : 'అందులో ఎలాంటి దోషమూ లేదు' ఆ మనిషి ఇంకా ఇలా అన్నాడు 'ఓ దైవప్రవక్తా(స)! నేను ఖుర్బానీ చెయ్యక ముందే శిరోముండనం చేయించుకున్నాను.' అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'అది దోషం ఎంత మాత్రమూ కాదు.'

**782.** హ్రజత్ అబూ మూసా అష్అరీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'నేను అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వచ్చాను. ఆ సమయంలో ఆయన(స) గారు బత్హాలో ఉన్నారు. (మక్కా నగరం వద్ద ఉన్నటువంటి ఒక స్థలం). దైవప్రవక్త(స) ఇలా అడిగారు : 'నీవు హజ్ యాత్ర సంకల్పాన్ని చేసుకున్నావా?' నేను ఇలా సమాధానం చెప్పుకున్నాను– ఓ దైవప్రవక్తా(స) అవును. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, 'నీవు లబ్బైక్ పలికినప్పుడు ఏమని పఠించావు?' నేను ఇలా విన్నవించుకున్నాను. 'లబ్బైక్‌ను దైవ ప్రవక్త(స) పలికినట్టే నేను కూడా పలికాను.' అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : 'నీవు మంచి పని చేశావు. ఇక వెళ్ళు! బైతుల్లాహ్, సఫా, మర్వాల ప్రదక్షిణ చెయ్యి.' నేనూ అలాగే చేశాను. (ఆ తరువాత నేను ఇహ్రామ్‌ను విప్పివేశాను). ఆ తరువాత నేను బనీ ఖైస్ తెగకు చెందిన ఒక మహిళ వద్దకు వచ్చాను. ఆమె నా తల వెంట్రుకలలోనుంచి పేలు తీసి వేసింది. తరువాత నేను మళ్ళీ హజ్ యాత్రకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించాను. నేను ప్రజలకు కూడా ఇలాంటి తీర్పే ఇస్తూ వచ్చాను. హ్రజత్ ఉమర్(ర) గారి ఖిలాఫత్ ఉనికిలోకి వచ్చినప్పుడు నేను ఆయన(ర) గారికి ఇలా మనవి చేసుకున్నాను. అప్పుడు ఆయన(ర) ఇలా సెలవిచ్చారు 'ఒకవేళ మనం గనక అల్లాహ్ గ్రంథాన్ని తీసుకుంటే (అనుసరిస్తే) అది హజ్జ్, ఉమ్రాలను (హజ్జె తమత్తు) పూర్తి చెయ్యమని మనల్ని ఆదేశిస్తుంది. ఒకవేళ మనం గనక దైవప్రవక్త(స) గారి సంప్రదాయాన్ని

అనుసరించినట్లయితే అప్పుడు దైవ ప్రవక్త(స) ఖుర్బానీ జంతువు తన స్థానానికి చేరుకునేంతవరకు ఇహ్రామ్‌ను విప్పలేదు.

## 126వ అధ్యాయం

**ఇహ్రామ్ కట్టుకునేటప్పుడు తలవెంట్రుకలను దువ్వుకోవటం. మరియు ఇహ్రామ్ విప్పేటప్పుడు శిరోముండనం చేయించుకోవటం.**

**783.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఉల్లేఖించారు; హజ్రత్ హఫ్సా (రజి) ఇలా అన్నారు; 'ఓ దైవప్రవక్తా(స)! ప్రజలకు ఏమైంది? వారైతే ఉమ్రా చేసి ఇహ్రామ్‌ను విప్పి వేశారు. మీరు ఉమ్రా చేసి ఇహ్రామ్‌ను విప్పలేదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'నేను నా తలవెంట్రుకలను పేర్చు కున్నాను. ఖుర్బానీ పశువు మెడలో పాశం వేశాను. నేనైతే నహర్ చేసేవరకు ఇహ్రామ్‌ను విప్పివెయ్యలేను.'

## 127వ అధ్యాయం

**ఇహ్రామ్‌ను విప్పివేసేటప్పుడు శిరోముండనం చేయించుకోవటం. లేదా తల వెంట్రుకలను కత్తిరించుకోవటం.**

**784.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) తాను హజ్ చేసినప్పుడు శిరోముండనం చేయించుకున్నారు. (తెలిసిన విషయమేమిటంటే, శిరోముండనం చేయించుకోవటం లేదా జుత్తు కత్తిరించటం కూడా హజ్ క్రియలలోని ఒక భాగమే).

**785.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; 'ఓ అల్లాహ్! శిరోముండనం చేయించుకున్నవారిపై దయజూపు!' ప్రజలు ఇలాఅన్నారు; 'ఓ దైవప్రవక్తా(స)! తలవెంట్రుకలను కత్తిరింపజేసుకున్నవారిపైనో?' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'ఓ అల్లాహ్! శిరముండనం చేయించుకున్నవారిపై దయజూపు!' ప్రజలు మళ్ళీ ఇలా అన్నారు; 'ఓ దైవప్రవక్తా(స)! తలవెంట్రుకలను కత్తిరింపజేసుకున్నవారిపైనో?' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; వెంట్రుకలు కత్తిరింపజేసుకున్నవారిపై'. నాఫె నాతో ఇలా అన్నారని లైస్ అన్నారు; 'అల్లాహ్ శిరోముండనం చేయించుకున్నవారిపై కరుణజూపుగాక! ఒకసారో లేక రెండుసార్లో ఇలా సెలవిచ్చారు. మరియు నాఫె నాతో ఇలా అన్నారని ఉబేదుల్లా

అన్నారు. దైవప్రవక్త(స) నాల్గోసారి 'తలవెంట్రుకలను కత్తిరింపజేసుకున్నవారిపై.' అని సెలవిచ్చారు.

**786.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు; "ఓ అల్లాహ్! శిరోముండనం చేయించుకున్న వారిని క్షమించు!" అప్పుడు ప్రజలు ఇలా మనవి చేసుకున్నారు; 'తలవెంట్రుకలను కత్తిరింపజేసుకున్నవారో?' దైవప్రవక్త ఇలా సెలవిచ్చారు; 'ఓ అల్లాహ్! శిరోముండనం చేయించుకున్నవారిని క్షమించు!' మళ్ళీ ప్రజలు ఇలా మనవి చేసు కున్నారు; 'తలవెంట్రుకలను కత్తిరింపజేసు కున్నవారో?' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'ఓ అల్లాహ్! శిరోముండనం చేయించుకున్నవారిని క్షమించు; మళ్ళీ ప్రజలు ఇలా మనవి చేసుకున్నారు; 'తలవెంట్రు కలను కత్తిరింపజేసుకున్నవారో?' ఆయన(స) మూడు సార్లు ఇదే విషయాన్ని వల్లించారు. అంటే శిరోముండనం చేయించుకున్నవారిని. మళ్ళీ నాలుగోసారి ఇలా సెలవిచ్చారు; వెంట్రుకలను కత్తిరింపజేసు కున్నవారిని.

**787.** అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స), ఆయన (స) గారి కొందరు అనుచరులు శిరోముండనం చేయించు కున్నారు. మరికొందరు అనుచరులు తమ వెంట్రుకలను పొట్టిగా కత్తిరింపజేసు కున్నారు.

ముఆవియా (ర) ఇలా ఉల్లేఖించారు : 'దైవప్రవక్త(స) గారి వెంట్రుకలను నేను ఒక పొడుగాటి బ్లేడుతో పొట్టివిగా కత్తిరించాను.'

## 128వ అధ్యాయం

**హజ్జె తమత్తుకు సంబంధించిన ఉమ్రాను నిర్వహించిన తరువాత వెంట్రుకలను పొట్టివిగా కత్తిరింపజేసుకోవటం.**

**788.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మక్కా మహానగరానికి విచ్చేసినప్పుడు ఆయన(స) తన అనుచరులకు ఇలా ఆజ్ఞాపించారు- 'బైతుల్లాహ్, సఫా మర్వాల తవాఫ్ (ప్రదక్షిణం) ముగిం చుకున్న తరువాత ఇహ్రామ్‌ను విప్పివెయ్యాలి. ఇంకా శిరోముండనం చేయించుకోవాలి. లేదా వెంట్రుకలను కత్తిరింపజేసుకోవాలి.'

## 129వ అధ్యాయం

### పదవ తేదీన తవాఫె జియారత్ చెయ్యాలి

హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారని అబూ జుబైర్ అన్నారు, 'దైవప్రవక్త(స) గారు ప్రయాణాన్ని రాత్రి అయ్యేవరకు ఆలస్యం చేశారు.' ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త(స) గారు కాబా గృహానికి మినాకు సంబంధించిన దినాలలో వస్తూ ఉండేవారు. నాఫె ఇలా ఉల్లేఖించారు. ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఒకే ఒక తవాఫ్‌ను నిర్వహించేవారు. మధ్యాహ్న సమయంలో కొంచెంసేపు నిద్రపోయేవారు. ఆ తరువాత మినాకు తిరిగి వచ్చేవారు. ఆ విధంగా ఆయన(స) నహర్ రోజున చేసేవారు.

**789.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త(స)గారితో మేము హజ్ యాత్రలో పాల్గొన్నాము. నహర్ (ఖుర్బానీ) రోజున తవాఫె జియారత్‌ను నిర్వహించాము. విశ్వాసుల తల్లి సఫియా (రజిఅన్హా) అదే రోజున బహిష్టు అయ్యారు. దైవప్రవక్త(స) ఆమెతో సమాగం చేయగోరారు. అప్పుడు నేను ఆయన (స) గారితో ఇలా అన్నాను, 'ఓ దైవప్రవక్తా(స)! ఆమె బహిష్టుకు గురయ్యారు.' ఆయన(స) ఇలా అన్నారు 'ఆమె మనల్ని ఇక్కడ ఆపబోతున్నారా?' మేము ఆయన(స)కు ఇలా చెప్పాము. ఆమెగారు నహర్ రోజున తవాఫె జియారత్‌ను నిర్వహించారు. అప్పుడు ఆయన(స) ఇలా అన్నారు 'మరయితే పదండి! ముందుకు సాగండి!'

## 130వ అధ్యాయం

### ఎవరైనా ఒకరు సాయంత్రం అయ్యేవరకు 'రమీ' చెయ్యక పోతే లేదా ఖుర్బానీకి ముందే మరిచిపోయి లేదా షరీయత్ శాస్త్రం తెలియకపోవడం వల్ల శిరో ముండనం చేయించుకుంటే అప్పుడు ధర్మశాస్త్రంలో ఆజ్ఞ ఎలా ఉంది?

**790.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఖుర్బానీ, శిరోముండనం, రమీలను గురించి అడగటం జరిగింది. వాటిలో ఒక దాని తరువాత మరొకదాన్ని అంటే వరుస క్రమానికి భిన్నంగా వేళలను మారిస్తే అది దోషమా? దైవ ప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు 'ఎలాంటి అభ్యంతరమూ లేదు.'

**791.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన (ర) ఇలా అన్నారు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్)ను ప్రజలు పదవ తేదీనాడు మినాలో హజ్ యాత్రకు సంబంధించిన విషయాలను గురించి అడిగేవారు. ఆయన (స) ఇలా

సెలవిచ్చేవారు "పర్వాలేదు. అది దోషం కాదు". ఒక వ్యక్తి దైవప్రవక్త (స)ను ఇలా ప్రశ్నించాడు, అతను ఇలా అన్నాడు : 'ఓ దైవప్రవక్తా (స)! నేను ఖుర్బానీకి ముందే శిరోముండనం చేయించుకున్నాను' దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు 'ఇప్పుడు నీవు ఖుర్బానీ చేసుకో, ఏమీ పర్వాలేదు అది దోషం కాదు.' అతను ఇంకా ఇలా అన్నాడు, నేను సాయంత్రం అయ్యే వరకు 'రమీ' చెయ్యలేదు. దైవప్రవక్త (స) 'అది తప్పుకాదు, అందులో దోషం లేదు' అని సెలవిచ్చారు.

## 131వ అధ్యాయం

### జమ్రా వద్ద ఒంటె మీద కూర్చోని ప్రజలకు సమస్యల్ని గురించి చెప్పటం.

**792.** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) హజ్జతుల్ విదాలో ఒక చోట ఆగి ఉన్నారు. ప్రజలు దైవప్రవక్త (స) గారిని హజ్‌కు సంబంధించిన సందేహాలను గురించి అడగటం ప్రారంభించారు. ఒక వ్యక్తి ఇలా అడిగాడు, 'ఓ దైవప్రవక్తా (స)! నాకు తెలియదు ఈ కారణం వల్ల నేను ఖుర్బానీ చెయ్యటానికి ముందే శిరోముండనం చేయించుకున్నాను.' అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు : 'ఇప్పుడు ఖుర్బానీ చెయ్యి అది దోషమేమీ కాదు.' రెండో వ్యక్తి వచ్చి ఇలా అన్నాడు 'ఓ దైవప్రవక్తా (స)! నాకు తెలియదు. నేను రమీ చెయ్యటానికి ముందే ఖుర్బానీ చేశాను.' అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు 'ఇప్పుడు రమీ చేసుకో అందులో దోషమేమీ లేదు.' తరువాత అదే రోజు ఒక వ్యక్తి ఎవరో ఒక విషయం గురించి అడిగాడు. దానిని అతను ముందు చెప్పాడో లేదా తరువాత చెప్పాడో దాన్ని గురించి దైవప్రవక్త (స)ఇదే సమాధానాన్ని ఇచ్చారు- 'ఇప్పుడు చేసుకో అది దోషమేమీ కాదు అని.'

**793.** అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నహర్ రోజున దైవప్రవక్త (స) హితబోధ చేస్తూ ఉండగా నేను తిలకించాను. ఆ సమయంలో ఒక మనిషి లేచి నిలబడ్డాడు. మరియు ఇలా అన్నాడు "ఫలానా పనిని ఫలానా పనికి ముందే చేయాలని, ఫలానా పని ఫలానా పనికి తరువాతనే చెయ్యాలని నేను అనుకున్నాను. నేను ఖుర్బానీకి ముందే శిరోముండనం చేయించుకున్నాను." మరొక వ్యక్తి ఇలా అన్నాడు 'నేను నా హదీని రమీకి ముందే ఖుర్బానీ ఇచ్చాను.' కనుక ప్రజలు చాలా మంది ఇలాంటి చాలా విషయాలను గురించి అడిగారు. దైవప్రవక్త (స) ఇలా

సెలవిచ్చారు 'ఇప్పుడు చెయ్యండి. అందులో ఎలాంటి దోషమూ లేదు. మీరు అడిగిన సకల విషయాలలోనూ ఎలాంటి దోషమూ లేదు.' ఆ రోజున ఎలాంటి విషయం గురించి ప్రజలు ప్రశ్నలు అడిగినా ఆయన (స) గారు ఇలాంటి సమాధా నమే ఇచ్చారు. 'ఇప్పుడు చెయ్యండి. అలా చెయ్యటంలో ఎలాంటి దోషమూ లేదు.'

**794.** అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజిఅన్) ఉల్లేఖించారు : ఆయన ఇలా అన్నారు– 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తమ ఒంటెపై స్వారీ చేస్తూ ఉన్న స్థితిలో నిలబడ్డారు. మళ్ళీ ఇదే హదీసును ఆయన(స) వివరించారు. సాలెహ్‌తో ఈ హదీసును ముఅమర్ కూడా ఉల్లేఖించారు.

## 132 అధ్యాయం

### మినాకు సంబంధించిన దినాలలో ఉపన్యసించటం.

**795.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) పదవ తేదీనాడు మినాలో జనులకు ఖుత్బా వినిపించారు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'జనులారా! ఈ రోజు ఏ రోజు?' వారు ఇలా అన్నారు 'ఈ దినం పవిత్ర దినం.' ఆయన(స) ఇలా సెలవిచ్చారు : 'ఈ నగరం ఏ నగరం?' ప్రజలు ఇలా అన్నారు – 'ఈ నగరం పవిత్ర నగరం'. ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'ఈ మాసం ఏ మాసం?' ప్రజలు ఇలా అన్నారు 'ఈ మాసం పవిత్ర మాసం.' దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : కనుక మీ రక్తం, మీ సంపద, మీ గౌరవ ప్రతిష్ఠలు పవిత్రం. ఏవిధంగానైతే ఈ దినం, ఈ నగరం, ఈ మాసం పవిత్రమైనవో.' ఎన్నోసార్లు దైవప్రవక్త(స) ఈ కలిమాను ఉచ్చరించారు. తరువాత ఆకాశం వైపునకు తల ఎత్తి చూశారు. మరియు ఇలా సెలవిచ్చారు 'ఓ అల్లాహ్! నేను (నీ ఆజ్ఞను) చేరవేశాను ప్రభూ! ఓ అల్లాహ్! నేను అందజేశాను.' ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారు 'ఎవని చేతుల్లోనైతే నా ప్రాణాలు ఉన్నాయో, ఆయనపై ప్రమాణం చేసి చెబుతున్నాను. దైవప్రవక్త(స) గారు తమ ఉమ్మత్‌కు అందజేసిన వీలునామా ఎవరైతే ఇక్కడ హాజరై ఉన్నారో వారు ఇక్కడ లేనివారికి (ఈ సందేశాన్ని) అందజెయ్యాలి. "చూడండి! నేను ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించిన తరువాత ఒకరి శిరస్సును మరొకరు నరికివేసి కాఫిర్లుగా మారిపోకండి."

**796.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : 'అరఫాత్ మైదానంలో

దైవప్రవక్త(స) హితబోధ చేస్తూ ఉండగా నేను విన్నాను. షూబాతో పాటు ఈ హదీసును సుఫ్యాన్ బిన్ ఉయమేనా కూడా అమ్ర్ బిన్ దీనార్ నుంచి ఉటంకించారు.'

**797.** అబీబక్రా! (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నహర్ రోజున మాకు ఒక హితోపదేశం చేశారు. ఆయన(స) గారు ఇలా బోధించారు: 'ఈ రోజు ఏ రోజో మీకు తెలుసా?' మేము ఇలా అన్నాము అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త(స)కే బాగా తెలుసు. మేము ఆ రోజుకు దైవప్రవక్త(స) మరొక పేరు ఏదైనా పెడతారేమో అని మేము ఆలోచించేవరకు దైవప్రవక్త(స) మౌనముద్ర వహించారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, 'ఏమిటి ఈ రోజు ఖుర్బానీ రోజు కాదా?' మేము ఇలా అన్నాము- నిస్సందేహంగా ఈ రోజు ఖుర్బానీ రోజే. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు 'ఈ మాసం ఏ మాసం?' మేము ఇలా అన్నాము అల్లాహ్‌కు, అల్లాహ్ ప్రవక్త(స)కు ఈ విషయం బాగా తెలుసు. తరువాత దైవప్రవక్త(స) నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఈ మాసానికి దైవప్రవక్త (స) మరొక పేరు ఏదైనా పెడతారేమో అని మేము ఆలోచించసాగాము. ఆ తరువాత దైవప్రవక్త(స) గారే ఇలా సెలవిచ్చారు: ఏమిటి 'ఈ మాసం జిల్‌హజ్జ మాసం కాదా' అని. మేము ఇలా అన్నాము, నిస్సందేహంగా 'ఈ మాసం జిల్‌హజ్జ మాసమే.' దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : 'ఈ పట్టణం ఏ పట్టణం?' ఈ విషయం గురించి అల్లాహ్‌కూ, ఆయన(స)కు మాత్రమే తెలుసు. మళ్ళీ దైవప్రవక్త(స) గారు మౌనముద్ర వహించారు. ఆయన(స) గారు ఈ పట్టణానికి బహుశ మరొక పేరు ఏదైనా పెడతారేమో అని ఆలోచించసాగాము. దైవప్రవక్త (స) మళ్ళీ ఇలా సెలవిచ్చారు: 'ఏమిటి ఈ పట్టణం నిషిద్ధ (పవిత్ర) పట్టణం కాదా!' మేము నిస్సందేహంగా! ఇది నిషిద్ధ పట్టణమే అన్నాము. దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చారు, 'మీ రక్తం, మీ సంపద (ఒకరివి మరొకరికి) మీకు నిషిద్ధం. ఏవిధంగానైతే ఈ దినం నిషిద్ధమో, ఈ మాసం నిషిద్ధమో, ఈ పట్టణం నిషిద్ధమో మీరు మీ యజమానిని కలిసే వరకు. ఏమిటి, నేను అల్లాహ్ ఆజ్ఞను అందించానా?' ప్రజలు ఇలా అన్నారు- 'నిస్సందేహంగా'. దైవప్రవక్త(స) ఇలా అన్నారు- 'ఓ అల్లాహ్! నీవు సాక్షిగా వుండు. ఇప్పుడు ఇక్కడ ఎవరైతే ఉన్నారో వారు, ఇక్కడ లేని వారికి నేను చెప్పిన విషయాలను అందజెయ్యండి. ఒక్కొక్కప్పుడు ఇలా కూడా అవుతుంది, ఎవడికైతే అందజెయ్య

బడుతుందో అతడు వినేవాడి కంటే ఎక్కువగా జ్ఞాపకం ఉంచుకునే వాడవుతాడు. నా తరువాత ఒకరు మరొకరి మెడలు నరుక్కుని కాఫిర్లుగా మారిపోకూడదు.'

**798.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు  మినా వద్ద దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు : 'ఈ రోజు ఏ రోజో మీకు తెలుసా?' ప్రజలు ఇలా అన్నారు : 'ఈ విషయం అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త(స) గారికి బాగా తెలుసు.' ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు  'ఈ దినం నిషిద్ధ దినం.' దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'ఈ పట్టణం ఏ పట్టణమో మీకు తెలుసా?' ప్రజలు ఇలా అన్నారు– 'ఈ విషయం అల్లాహ్‌కూ ఆయన ప్రవక్త(స)కే బాగా తెలుసు.' ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: 'ఈ పట్టణం నిషిద్ధమైన పట్టణం.' దైవప్రవక్త(స) మళ్ళీ ఇలా సెలవిచ్చారు: 'ఈ మాసం ఏ మాసమో మీకు తెలుసా?' ప్రజలు ఇలా అన్నారు– అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త(స)కే బాగా తెలుసు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'ఈ మాసం నిషిద్ధ మాసం.' ఆయన(స) మళ్ళీ ఇలా సెలవిచ్చారు : 'చూడండి! అల్లాహ్ మీలోని ఒకరి రక్తాన్ని మరొకరికి, ఒకరి సంపదను మరొకరికి, ఒకరి గౌరవ మర్యాదలను మరొకరికి నిషేధించాడు– ఏ విధంగానైతే ఈ రోజు, ఈ మాసం, ఈ పట్టణం నిషేధించబడ్డాయో.' హిషామ్ బిన్ గాజి ఇలా అన్నారు : నాతో నాఫె ఇలా అన్నారు ఆయనకు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) చెప్పారు– దైవప్రవక్త(స) గారు నహర్ దినం నాడు జమ్రాల మధ్య తమ హజ్జ్ యాత్రలో ఆగారు. మరియు ఈ విషయాలను ఆయన (స) సెలవిచ్చారు, మరియు ఇలా సెలవిచ్చారు 'చూడండి! ఈ దినం మహో జ్వలమైన దినం. తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు  'ఓ అల్లాహ్! నీవు సాక్షిగా ఉండు.' మరియు ప్రజలకు వెళ్ళిపొమ్మని సెలవిచ్చారు. అప్పుడు ప్రజలు ఇలా భావించారు. దైవప్రవక్త(స) గారి మరణకాలం వచ్చేసింది. అప్పటి నుంచి ఈ దినాన్ని హజ్జతుల్ విదా అని అనసాగారు.

## 133వ అధ్యాయం

## మినాకు చెందిన రాత్రులలో మక్కాలో జనులకు నీళ్ళు తాపించేవారు మరియు మరొక పనిని దేన్నయినా చేసినవారు వారు మక్కా పట్టణంలో ఉండవచ్చునా?

**799.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త(స) గారు దీనికి అనుమతి ఇచ్చారు.

**800.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త(స) గారు ఈ విషయాన్ని అనుమతించారు.

**801.** ఇబ్నె ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఇబ్నె అబ్బాస్(రజి) దైవ ప్రవక్త(స) గారిని మినాకు చెందిన రాత్రులలో మక్కా పట్టణంలో ఉండే అనుమతిని అర్థించారు. ఎందుకంటే, ఆయన ప్రజలకు మంచినీళ్ళు త్రాపేవారు. దైవప్రవక్త(స) ఆయన గారికి అనుమతి ఇచ్చారు.

## 134వ అధ్యాయం

**కంకరరాళ్ళు విసిరే విషయం గురించి హజ్రత్ జాబిర్ (ర) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) పదో తేదీన పొద్దు ఎక్కిన తరువాత కంకర రాళ్ళను విసిరారు ఆ తరువాత జిల్‌హజ్జ పదకొండు, పన్నెండు తేదీలలో ఆయన (స) పొద్దువాలిన తరువాత అంటే జుహర్ నమాజు తరువాత కంకర రాళ్ళు విసిరారు.**

**802.** వబ్‌రహ్ ఇలా ఉల్లేఖించారు : నేను ఇబ్నె ఉమర్(రజిఅన్)ను, 'కంకర రాళ్ళను ఎప్పుడు విసరాలి?' అని అడిగాను. ఆయన (ర) ఇలా అన్నారు- 'నీకు ఇమామ్‌గా ఉన్న వ్యక్తి కంకర రాళ్ళను విసిరినప్పుడు, నీవు కూడా విసురు.' నేను మళ్ళీ ఇదే ప్రశ్నను గురించి ఆయన్ని అడిగాను. అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు 'మేము నిరీక్షిస్తూ ఉండేవారము. సూర్యుడు వాలినప్పుడు మేము కంకరరాళ్ళను విసిరే వారము.'

## 135వ అధ్యాయం

**లోయ దిగువ భాగంలోకి పోయి కంకరరాళ్ళు విసరటం.**

**803.** అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ ఇలా ఉల్లేఖించారు : ఆయన ఇలా అన్నారు 'అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) లోయ దిగువ భాగంలోకి పోయి అక్కడ నుంచి కంకరరాళ్ళు విసిరారు. నేను ఇలా అన్నాను- 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్! కొందరైతే పైభాగంలోనే నిలబడి కంకరరాళ్ళను విసురుతున్నారు.' ఆయన ఇలా అన్నారు అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను! ఆయన తప్ప నిజమైన ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. ఆయన (స) ఆ స్థలం నుంచే కంకర రాళ్ళను విసిరారు.' ఆయన(స) గారి

పైనే ఖుర్‌ఆన్‌లోని బఖరా సూరా అవతరించింది. అబ్దుల్లా బిన్ వలీద్ ఇలా అన్నారు–ఈ విషయాన్ని సుఫ్యాన్ మాకు తెలియజేశారు.'

## 136వ అధ్యాయం

**ప్రతి జమ్‌రాపై ఏడు కంకరరాళ్ళను విసరాలి. ఈ విషయాన్ని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నుంచి ఉటంకించారు.**

**804.** అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ ఇలా ఉల్లేఖించారు : అబ్దుల్లాహ్ (రజిఅన్) పెద్ద జమ్‌రా (అంటే జమ్‌రతుల్ అఖబ)వద్దకు చేరుకున్నప్పుడు ఆయన కాబా గృహాన్ని తన ఎడమ భాగంలోను, మినాను తన కుడిభాగంలోను ఉండేలా చేసుకున్నారు. ఇంకా ఆయన ఏడు కంకరరాళ్ళను తీసుకుని వాటిని జమ్‌రాపైకి విసిరారు. బఖరా సూరా ఎవరి మీదనైతే అవతరించిందో ఆయన (అంటే దైవప్రవక్త(స) గారు) రమీని ఇదే రీతిలో నిర్వహించారు.

## 137వ అధ్యాయం

**జమ్‌రా అఖబాను కంకరరాళ్లతో కొట్టేటప్పుడు కాబా గృహాన్ని ఎడమవైపు ఉండేటట్లుగా చూడాలి.**

**805.** అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ ఇలా ఉల్లేఖించారు: 'నేను ఇబ్నె మసూద్ (రజిఅన్)తో కలిసి హజ్ చేశాను. ఆయన జమ్‌రతుల్ అఖబాను ఏడు కంకర రాళ్లతో విసిరికొడుతూ ఉండగా నేను చూశాను. అప్పుడు ఆయన తన ఎడమ భాగంలో కాబా గృహం ఉండేటట్లుగా చేశారు. మరియు మినాను తన కుడి భాగంలో ఉండేటట్లు చేశారు. తరువాత ఆయన ఇలా అన్నారు; ఎవరి మీదనైతే ఖుర్‌ఆన్‌లోని బఖరా సూరా అవతరించిందో (దైవప్రవక్త ముహమ్మద్(స) ఆయన(స) ఈ స్థలంలోనే నిలబడ్డారు."

## 138వ అధ్యాయం

**ప్రతి కంకర రాయిని, తీసుకుని విసిరి కొట్టినప్పుడల్లా దానిపై అల్లాహు అక్బర్ అని పలకాలి. ఈ విషయాన్ని దైవప్రవక్త (స) ప్రవచిస్తూ ఉండగా విని ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు.**

**806.** సులైమాన్ ఆమష్ ఇలా అన్నారు : నేను హజ్జాజ్ (అన్యాయపరుడు) చెబుతూ ఉండగా విన్నాను. అతను ఖుర్‌ఆన్‌లోని సూరాల పేర్లను మెంబర్‌పై నిలబడి ఇలా వల్లిస్తూ ఉండేవాడు. ఆవు ప్రస్తావన ఉన్న సూరా. ఆలి ఇమ్రాన్‌ను గురించి

ప్రస్తావన ఉన్న సూరా. స్త్రీలను గురించి ప్రస్తావన ఉన్న సూరా (నిసా సూరా) నేను ఈ విషయం గురించి ఇబ్రాహీమ్ నఖీకి చెప్పాను. ఆయనగారు ఇలా అన్నారు నాకు అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ ఈ విషయం గురించి చెప్పారు. ఆయన అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి)తో పాటు ఉన్నారు. అప్పుడు ఆయన పెద్ద జమ్‌రాపై కంకరరాళ్లను విసిరికొడుతూ ఉన్నారు. ఆయన లోయ క్రిందిభాగంలోకి వెళ్లారు. అక్కడ ఆయన ఒక వృక్షం ఎత్తుతో సమానమైన ఎత్తుకు చేరుకున్నారు. అప్పుడు ఆయన నాకు ఆ వృక్షానికి అడ్డంగా ఉండిపోయారు. ఏడు కంకర రాళ్లను విసిరికొట్టారు. ప్రతి కంకర రాయి విసిరినప్పుడల్లా ఆయన "అల్లాహు అక్బర్" అని ఎలుగెత్తి పలి కారు. తరువాత ఇలా అన్నారు : ఆయనపై ప్రమాణం చేసి చెబుతున్నాను; ఆయన తప్ప పూజకు, ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడు. ఇక్కణ్ణే ఆయన నిలబడి ఉన్నారు, (ఆయనపై ఖుర్ఆన్‌లోని బఖరా సూరా అవతరించింది. (సల్లల్లాహు అలైహి వ సల్లం)

## 139వ అధ్యాయం

**జమ్‌రతుల్ అఖబాను కంకర రాళ్లతో కొట్టిన తరువాత ఆ ప్రదేశంలో ఆగకూడదు ఈ విష యాన్ని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) దైవప్రవక్త (స) నుండి విని ఉల్లే ఖించారు. (ఈ హదీసు ముందు ముందు రాబోయే అధ్యాయంలో ప్రస్తావించ బడింది.)**

## 140వ అధ్యాయం

**మొదటి జమ్‌రాను, రెండో జమ్‌రాను కంకర రాళ్ళతో విసిరికొట్టినప్పుడు ఖిబ్లా వైపుకు తిరిగి నిలబడాలి మెత్తని నేలపై.**

**807.** ఇబ్నెఉమర్ (రజిఅన్) మొదటి జమ్‌రాపై ఏడు కంకరరాళ్ళను విసిరి కొట్టేవారు. ప్రతి కంకరరాయిపై 'అల్లాహు అక్బర్'అని పలికేవారు. తరువాత ముందుకు సాగిపోయేవారు. మరియు మెత్తని, చదునైన నేల మీదకు (అంటే లోయ లోపలకు) వచ్చేవారు. ఖిబ్లా వైపునకు ముఖాన్ని పెట్టి చాలాసేపు నిలబడి దుఆ చేసేవారు. మరియు తన రెండు చేతుల్ని పైకి ఎత్తేవారు. తరువాత రెండో జమ్‌రాను కంకరరాళ్ళతో కొట్టేవారు. ఆ తరువాత ఎడమవైపునకు నడిచిపోయి మెత్తని నేలపైకి వచ్చేవారు. మరియు ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని పెట్టి చాలాసేపు అక్కడ నిలబడి దుఆ చేసేవారు. మరియు రెండు చేతుల్ని పైకి ఎత్తేవారు. మళ్ళీ లోయ క్రింది భాగంలోకి వచ్చి జమ్‌రతుల్

అఖబాను కంకరరాళ్ళతో కొట్టేవారు. మరియు దుఆ మొదలైన వాటి కోసం అక్కడ ఆగేవారు కాదు. (కాని కంకర రాళ్ళను విసిరికొట్టి వెళ్ళిపోయేవారు) మరియు ఇలా అనేవారు : నేను దైవప్రవక్త(స) గారు ఇలాగే చేస్తూ ఉండగా చూశాను.

## 141వ అధ్యాయం

### రెండు జమ్‌రాల వద్ద (దుఆ కోసం) చేతులు ఎత్తటం.

**808.** సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) మొదటి జమ్‌రాపై ఏడు కంకరరాళ్ళను విసిరి కొట్టేవారు. ప్రతి కంకర రాయిని తీసుకొని కొట్టేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని తక్బీర్ పలికేవారు. తరువాత కొంచెం ముందుకు పోయి మెత్తని, చదునైన నేలమీదకు వెళ్ళేవారు. ఖిబ్లా వైపునకు ముఖాన్ని పెట్టి చాలాసేపటి వరకు నిలబడి ఉండేవారు. ఆయన తన రెండు చేతుల్ని పైకి ఎత్తి దుఆ చేసేవారు. తరువాత రెండవ జమ్‌రాను కూడా ఇదేవిధంగా కంకర రాళ్ళతో కొట్టేవారు. ఇంకా ఎడమవైపునకు జరిగి మెత్తని నేలలోపోయి ఖిబ్లా వైపునకు తిరిగి చాలా సేపటి వరకు నిలబడి ఉండేవారు. రెండు చేతులను పైకి ఎత్తి దుఆ చేసేవారు. ఆ తరువాత జమ్‌రా ఉఖబా (పెద్ద జమ్‌రా)ను లోయ క్రింది భాగంలో నుంచి కంకర రాళ్ళను విసిరేవారు. మరియు దానిని కంకర రాళ్ళతోకొట్టి అక్కడ ఆగిపోయేవారు కాదు. మరియు ఇలా అనేవారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఇలానే చేస్తూ ఉండగా నేను చూశాను.'

## 142వ అధ్యాయం

రెండు జమ్రాల వద్ద ఆగి దుఆ చెయ్యటం. మరియు ముహమ్మద్ బిన్ బష్షార్ (లేక ఇబ్నె ముసన్నా) ఇలా అన్నారు; ఉస్మాన్ బిన్ ఉమర్ మాతో ఇలా అన్నారు; మాకు యూనుస్ ఇలా తెలియజేశారు; ఆయన జుహ్రీ నుంచి విని ఇలా తెలియజేశారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జమ్‌రాను కంకరరాళ్ళతో కొట్టినప్పుడు ఏడు కంకరరాళ్ళను తీసుకుని దానిపై కొట్టారు. ప్రతి కంకర రాయితో కొట్టేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని పలికేవారు. ఆ తరువాత ముందుకు సాగిపోయేవారు. ఖిబ్లా దిక్కు వైపునకు ముఖాన్నిపెట్టి తమ రెండుచేతుల్ని పైకి ఎత్తి దుఆ చేసేవారు. చాలాసేపటి వరకు అక్కణ్ణే

ఆగి ఉండేవారు. తరువాత రెండో జమ్రా వద్దకు వచ్చేవారు. ఆ జమ్రాపై కూడా కంకరరాళ్ళతో కొట్టేవారు. ప్రతి రాయితో కొట్టేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని పలికేవారు. లోయ దగ్గరకు ఎడమ వైపునకు దిగిపోయేవారు. ఖిబ్లా వైపునకు రెండు చేతుల్ని పైకి ఎత్తుతూ ప్రార్థన చేస్తూ నిలబడి ఉండేవారు. ఆ తరువాత అఖబాపై ఉన్నటువంటి జమ్రాపైకి వచ్చేవారు. దానిపై కూడా ఏడు కంకరరాళ్ళను రువ్వేవారు. ప్రతి కంకరరాయిని రువ్వినప్పుడు తక్బీర్ పలికేవారు. ఆ తరువాత అక్కణ్ణుంచి వచ్చేసేవారు. అక్కడ (దుఆ కోసం) ఆగేవారు కాదు. జుహ్రి ఇలా అన్నారు; నేను సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ నుంచి ఇలా విన్నాను; ఆయన ఇలాంటి హదీసునే తన తండ్రి గారైన అబ్దుల్లామ్ బిన్ ఉమర్(ర) నుంచి విన్నారు. ఆయన దైవప్రవక్త(స) నుంచి విని ప్రకటించారు. మరియు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) కూడా అలానే చేశారు.

## 143వ అధ్యాయం

**కంకరరాళ్ళతో కొట్టిన తరువాత సువాసనను ఒంటిపై రాసుకోవడం మరియు తవాఫె జియారత్‌కు ముందే శిరోముండనం చేయించుకోవటం.**

**809.** అబ్దుర్రహ్మాన్ బిన్ ఖాసిమ్ ఇలా ఉల్లేఖించారు; మా తండ్రి గారు ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను; మా తండ్రి గారు తమ హయామ్‌లో పెద్ద మనుషుల్లో, సజ్జనుల్లో అగ్రజులుగా గౌరవింపబడేవారు. (ఆయన ఇలా అన్నారు) హజ్రత్ ఆయెషా(ర) ఇలా సెలవిస్తూ ఉండగా నేనువిన్నాను; 'నేను నా సొంత చేతులతోనే దైవప్రవక్త(స) గారి శరీరానికి ఇహ్రామ్ ధరించే సమయంలో సువాసనను రాశాను. ఇహ్రామ్‌ను తీసివేయక ముందు కూడా సువాసనను ఆయన(స) గారికి రాశాను. ఇంకా అప్పుడు ఆయన(స) తవాఫుల్ ఇఫాదాను నిర్వహించలేదు'. హజ్రత్ ఆయెషా(ర) అలా అనేటప్పుడు తన చేతుల్ని అటూ ఇటూ వ్యాపింపజేశారు.'

## 144వ అధ్యాయం

**తవాఫె విదాను గురించి.**

**810.** ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా ఉల్లేఖించారు; మక్కా నగరాన్ని విడిచిపెట్టి వెళ్ళే ముందు కాబా గృహ ప్రదక్షిణాన్ని (తవాఫె విదా) చివరి ఆచారంగా భావించి

నిర్వహించాలని ప్రజలు ఆజ్ఞాపించబడ్డారు. కాని బహిష్టు అయిన స్త్రీకి ఈ ఆచారం నుండి మినహాయింపు ఇవ్వబడింది.

**811.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జొహర్, అసర్, మగ్రిబ్, ఇషాకు చెందిన నమాజుల్ని చేశారు. మరియు కొంచెం సేపు అల్ ముహస్సబ్ అనే స్థలంలో నిదుర పోయారు. ఆ తరువాత పవిత్ర కాబా గృహానికి వెళ్ళారు. మరియు ఆ గృహం చుట్టూ ప్రదక్షిణం చేశారు.

## 145వ అధ్యాయం

### ఒక స్త్రీ ఎవరైనా తవాఫె జియారా తరువాత బహిష్టు అయినట్లయితే, అప్పుడు ఆమె తప్పని సరిగా తవాఫె ఇఫాజా నిర్వహించవలయునా?

**812.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త(స) గారి భార్య అయిన హజ్రత్ సఫియా బిన్తె హుయ్ (రజిఅన్హా) బహిష్టు అయ్యారు. ఈ విషయాన్ని గురించి దైవప్రవక్త(స) గారికి తెలియజెయ్యటం జరిగింది. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు : 'ఆమె మన ప్రయాణాన్ని ఆలస్యం చేస్తుందా?' ప్రజలు ఇలా అన్నారు 'ఓ దైవప్రవక్తా(స)! ఆమె(ర) గారు తవాఫె జియారాను నిర్వహించారు.' అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'అలాగైతే ఆమె మన ప్రయాణాన్ని నిలువరించలేదు.'

**813.** ఇక్రిమా ఇలా ఉల్లేఖించారు: మదీనా వాసులు ఇబ్నె అబ్బాస్ (రజిఅన్)ను ఇలా అడిగారు : 'ఒక స్త్రీ ఎవరైనా తవాఫె జియారత్ పరిసమాప్తం చేసుకున్న తరువాత బహిష్టు అయితే ఆమె ఏమి చెయ్యాలి?' ఆయన(ర) గారు ఇలా సెలవిచ్చారు : 'ఆమె మక్కా నుంచి వెళ్ళిపోవచ్చు.' (మరియు తవాఫుల్ విదా నిర్వహించే అవసరం లేదు) మదీనావాసులు ఇలా అన్నారు– మీరు ఇచ్చిన తీర్పు ప్రకారం మేము వ్యవహరించము. మరియు జైద్ ఇచ్చిన తీర్పును తృణీకరించము. ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు : 'మీరు మదీనా పట్టణానికి చేరుకున్నప్పుడు దీన్ని గురించి అక్కడివారితో విచారణ చెయ్యండి.' కనుక మదీనా పట్టణానికి చేరుకున్నప్పుడు వారు ఆ విషయం గురించి అడిగారు. వారు అడిగిన మనుషుల్లో ఉమ్మె సులైమ్ (ర) ఒకరు. ఆమె గారు వారికి సఫియా(ర) గారి ఉల్లేఖనాన్ని వినిపించారు.

**814.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : బహిష్టుకు గురి అయిన ఒక మహిళకు మక్కా పట్టణాన్ని విడిచి వెళ్ళిపోయే అనుమతి లభించింది. కాని ఆమె తవాఫె జియారా నిర్వహించి ఉండాలి. తావుస్ (ఒక ఉప ఉల్లేఖకుడు) తన తండ్రి గారిని ఉటంకిస్తూ ఇలా అన్నాడు : 'ఇబ్నె ఉమర్(ర) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను ఆమె తవాఫె విదా చేయనంత వరకు ఇక్కణ్ణుంచి ప్రయాణం కట్టటానికి వీల్లేదు.' తరువాత మళ్ళీ నేను ఆయన గారు ఇలా చెబుతూ ఉండగా విన్నాను. (ఆయన మరణానికి ఒక సంవత్సర కాలం ముందు) దైవప్రవక్త (స) గారు అటువంటి పరిస్థితిలో వెళ్ళిపోవచ్చు అని అనుమతి ఇచ్చారు.

**815.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు మేము మదీనా పట్టణంలో నుంచి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారితో బయలుదేరాము. మేము కేవలం హజ్జ్ యాత్ర చెయ్యటానికి మాత్రమే సంకల్పించుకున్నాము. దైవప్రవక్త(స) మక్కా మహానగరంలోకి విచ్చేశారు. ఆయన(స) కాబా గృహ ప్రదక్షిణం చేశారు. మరియు సఫా, మర్వాల తవాఫ్ కూడా చేశారు. కాని ధరించిన ఇహ్రామ్‌ను విప్పలేదు. ఎందుకంటే, ఆయన(స) గారితోపాటు ఖుర్బానీ పశువు ఉన్నది. ఎంతమంది పురుషులైతే, ఎంతమంది స్త్రీలైతే ఆయన(స) గారితో ఉన్నారో వారందరూ ఆయన(స) గారితోపాటు తవాఫ్ చేశారు. వారిలో ఎవరివద్దనైతే ఖుర్బానీ పశువు లేదో వారు తాము ధరించిన ఇహ్రామ్‌ను విప్పివేశారు. అప్పుడు హజ్రత్ ఆయెషా(ర) గారికి బహిష్టు వచ్చింది. ఆమె (ర)గారు ఇలా అన్నారు– 'మేము హజ్జ్‌కు సంబంధించిన కార్యక్రమాలన్నీ చేసుకున్నాము.' బయలుదేరే రాత్రి వచ్చినప్పుడు ఏ రాత్రినైతే ఆయన(స) గారు 'ముహస్సబ్'లో దిగిపోయారో అప్పుడు ఆమె(ర)గారు ఇలా అన్నారు : 'ఓ దైవప్రవక్తా(స)! మీ అనుచరులందరూ హజ్జ్‌ను, ఉమ్రాను రెండింటినీ ముగించుకొని తిరిగి వస్తున్నారు. నేను ఒక్కదాన్నే కేవలం హజ్జ్ చేసుకుని వెళ్ళిపోతున్నాను.' అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'ఏ రాత్రులలోనైతే మక్కా నగరంలోకి వచ్చేశామో అప్పుడు నీవు తవాఫ్ చెయ్యలేదా?' ఆమె(ర) ఇలా అన్నారు 'లేదు'. ఆయన(స) ఇలా అన్నారు 'నీ సోదరుడైన అబ్దుర్రహ్మాన్‌తోపాటు తన్ఈమ్ వద్దకు వెళ్ళు. ఉమ్రా కోసం ఇహ్రామ్‌ను ధరించు. నేను ఫలానా ప్రదేశం వద్ద నీ కోసం ఆగి నిరీక్షిస్తూ ఉంటాను.' కనుక అబ్దుర్రహ్మాన్‌ను తీసుకొని తన్ఈమ్ వద్దకు వెళ్ళాను. అప్పుడు నేను ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను

ధరించాను. ఆ సమయంలో సఫియా బిన్తె హుయ్‌కు బహిష్టు వచ్చింది. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : 'ఓసి నీ సిగతరగ! మమ్మల్ని ఇక్కడ ఆపివేశావ్ కదే! ఏమిటి నీవు పదవ తేదీ నాడు తవాఫ్ చెయ్యలేదా? ఆమె ఇలా అన్నారు : 'అవును ఆనాడు నేను తవాఫ్ చేశాను.' ఆయన(స) ఇలా సెలవిచ్చారు 'అయితే వచ్చిన నష్టమేమీ లేదు. ముందుకు సాగిపోండి.' కనుక నేను దైవప్రవక్త(స)ను కలుసుకున్నాను. అప్పుడు ఆయన(స) మక్కా నగరం వైపునకు ఉన్నటువంటి ఎత్తైన ప్రదేశాలను ఎక్కుతూ ఉన్నారు. మరియు నేను దిగుతూ ఉన్నాను. లేదా నేను ఎక్కుతూ ఉన్నాను ఆయన దిగుతూ ఉన్నారు.

## 146వ అధ్యాయం

### బయలుదేరే రోజున అసర్ నమాజ్‌ను ముహస్సబ్‌లో చెయ్యటం.

**816.** అబ్దుల్ అజీజ్ బిన్ రుఫై ఇలా ఉల్లేఖించారు : నేను అనస్ బిన్ మాలిక్(రజిఅన్)ను ఇలా అడిగాను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుహర్ నమాజ్‌ను తర్‌వియా దినం నాడు (ఎనిమిదవ తేదీ జిల్‌హజ్) చేసినప్పుడు మీరు ఆయన్ని (స) గురించి పరిశీలించిన విషయాలేమిటో కొంచెం చెప్పండి. అనస్(ర) ఇలా సమాధానం పలికారు : 'ఆయన(స) గారు జుహర్ నమాజును మినా వద్ద చేశారు." నేను ఇలా అడిగాను, దైవప్రవక్త(స) 'అసర్ నమాజును నఫ్‌ర్ దినం నాడు (మినా నుంచి బయలుదేరిన రోజు) ఎక్కడ చేశారు?' ఆయన ఇలా సమాధానం చెప్పారు 'అల్ అబ్‌తహ్ వద్ద ఆయన(స) అసర్ నమాజును చేశారు' అదనంగా ఆయన ఇలా అన్నారు అయితే 'మీరు మీ నాయకులు చేసిన విధంగానే చెయ్యాలి.'

**817.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు ఆయన(ర) గారు ఇలా సెలవిచ్చారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జొహర్, అసర్ నమాజులను మరియు మగ్రిబ్, ఇషా నమాజులను కూచ్ దినం నాడు (బయలుదేరే దినం నాడు) ముహస్సబ్‌లో చేశారు. తరువాత ఆయన(స) అక్కడ ఒక కునుకు తీశారు. తరువాత ఒంటెపై స్వారీ చేస్తూ కాబా గృహం వైపునకు వెళ్ళిపోయారు. అక్కడ కాబా గృహ ప్రదక్షిణ చేశారు.'

## 148వ అధ్యాయం

### ముహస్సబ్‌లో దిగేటప్పటి ఉపదేశం

**818.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ఆమె(ర) గారు ఇలా సెలవిచ్చారు 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మినా నుండి బయలుదేరి ముహస్సబ్‌లో మజిలి చేశారు. అక్కడ ఎందుకు ఆగేవారంటే, అక్కణ్ణుంచి మదీనా పట్టణానికి వెళ్ళటం సులభమవుతుంది.'

**819.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు- ముహస్సబ్‌లో దిగటం హజ్‌కు సంబంధించిన ఎలాంటి ఆరాధనా కాదు. ముహస్సబ్ ఒక మజిలీ మాత్రమే. ముహస్సబ్ ఒక మజిలీలాంటిది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అక్కడ ఆగుతూ ఉండేవారు.

## 149వ అధ్యాయం

**మక్కా మహానగరంలోకి ప్రవేశించటానికి ముందు జీతువాలో (ఇది మక్కా నగరానికి ఆనుకుని ఉన్నది) మరియు మక్కా మహానగరం నుంచి మదీనా పట్టణానికి తిరిగి వచ్చినప్పుడు కంకరరాళ్ళతో నిండి ఉన్న మైదానంలో ఆగటం. (ఇది జుల్‌హులైఫాలో ఉన్నది).**

**820.** నాఫె ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) మక్కా మహానగరానికి వెళ్ళినప్పుడు రాత్రి సమయంలో జీతువాలో మజిలీ చేసేవారు రెండు కొండల మధ్య. మళ్ళీ పెంకులతో నిండివున్న మార్గం మీద నుంచి మక్కాలోకి ప్రవేశిస్తారు. అది మక్కా మహానగరంలోని ఎత్తైన దిక్కులో ఉన్నది. మక్కాలో హజ్ లేక ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించిన స్థితిలో వస్తారు. అప్పుడు మసీదు ద్వారం వద్దనే తన ఒంటెను ఆపి ఉంచుతారు. మసీదులోకి ప్రవేశించి హజరె అస్వద్ నుంచి తవాఫ్‌ను ప్రారంభిస్తారు. ఏడుసార్లు ప్రదక్షిణలు చేస్తారు. మూడు ప్రదక్షిణలు పరుగెత్తుకుంటూ చేస్తారు. మరియు నాలుగు ప్రదక్షిణలు సాధారణ మైనటువంటివి చేస్తారు. ఆ తరువాత తవాఫ్‌ను ముగించుకుని రెండు రకాతుల నమాజును చేస్తారు. మళ్ళీ తమ గృహానికి వెళ్ళే ముందు సఫా కొండపైకి వెళతారు. సఫా మర్వాల తవాఫ్‌ను చేస్తారు. హజ్ లేక ఉమ్రా నుంచి తిరిగి వచ్చిన తరువాత మదీనా పట్టణంలోకి వచ్చినప్పుడు తమ ఒంటెను కంకర రాళ్ళు ఉన్నటువంటి మైదానంలో ఆపుతారు. అది జుల్‌హులైఫాలో ఉన్నది. అక్కణ్ణే దైవప్రవక్త(స) గారు తమ ఒంటెను ఆపి ఉంచుతూ ఉండేవారు.

**821.** ఖాలిద్ బిన్ హారిస్ ఇలా ఉల్లేఖించారు: ముహస్సబ్‌ను గురించి ఉబైదుల్లాహ్ గారిని ప్రశ్నించటం జరిగింది. ఉబైదుల్లా గారు ఇలా ఉల్లేఖించారు– నాఫె ఇలా అన్నారు : దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స), ఉమర్, ఇబ్నె ఉమర్ గార్లు అక్కడ మజిలీ చేశారు. నాఫె అదనంగా ఇలా అన్నారు. ఇబ్నె ఉమర్(ర) జుహర్, అసర్ నమాజుల్ని అల్ ముహస్సబ్ వద్దనే చేసేవారు. ఆయన మగ్రిబ్ నమాజును గురించి కూడా ప్రస్తావించారని నేను అనుకుంటున్నాను. అప్పుడు నేను ఇలా అన్నాను– 'ఇషా నమాజును గురించి కూడా నాకు సందేహం లేదు.' అంటే ఇషా నమాజును కూడా ఆయన అక్కణ్ణే చేస్తూ ఉండేవారు. ఇంకా ఆయన అక్కడ కొంచెం సేపు నిద్రపోయేవారు కూడా. దైవప్రవక్త(స) కూడా అలాగే చేస్తూ ఉండేవారని ఆయన అంటూ ఉండేవారు కూడా.

## 150వ అధ్యాయం

**మక్కా మహానగరం నుంచి తిరిగి వచ్చేటప్పుడు కూడా జీతువాలో దిగటం.**

నాఫె ఇలా అన్నారు: హజ్రత్ ఇబ్నె ఉమర్(రజిఅన్) మదీనా మహా పట్టణం నుంచి మక్కా మహా నగరానికి వచ్చినప్పుడల్లా ఆ రోజు రాత్రి అంతా జీతువాలో గడిపేవారు. తెల్లవారిన తరువాత ఉదయం పూట మక్కా మహానగరంలో ప్రవేశించేవారు. మరియు మక్కా మహానగరం నుంచి ప్రయాణం కట్టి నప్పుడు జీతువా మీదుగా వెళ్ళేవారు. ఆ రోజు రాత్రి అక్కడ ఉదయం అయ్యేవరకు ఆగిపోయేవారు. ఇంకా ఆయన ఇలా అనేవారు : 'దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కూడా ఆ విధంగానే చేసేవారు.'

## 151వ అధ్యాయం

**హజ్జ్ యాత్రలో ఉన్నప్పుడు వ్యాపారం చెయ్యటం, అజ్ఞాన కాలపు పుర వీధులలో క్రయవిక్రయాలు సలపటం ఇవన్నీ ధర్మసమ్మతమైన పనులే.**

**822.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: అజ్ఞానకాలంలో జుల్ మజాజ్, ఉకాజ్ ప్రాంతాలు ప్రజల కోసం మార్కెట్లుగా అలరారేవి. తరువాత ప్రజలు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తూ వచ్చారు. అప్పుడు ఆ మార్కెట్లలో వ్యాపారం చెయ్యటాన్ని ఇష్టపడటం మానేశారు. ఆ పరిస్థితుల్లో ఈ ఖుర్‌ఆన్ వాక్యం దివి నుంచి భువిపైకి అవతరించింది "హజ్జ్ యాత్రతోపాటు మీరు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషిస్తే అది దోషం కాదు." (బఖరా :198)

## 152వ అధ్యాయం

### ముహస్సబ్ నుంచి రాత్రి చివరి భాగంలో బయలుదేరటం.

**823.** హజ్రత్ ఆయెషా(ర) ఇలా ఉల్లేఖించారు; ఆమె (ర)గారు ఇలా సెలవిచ్చారు; (అకస్మాత్తుగా) విశ్వాసుల మాతృమూర్తి అయిన హజ్రత్ సఫియా (రజిఅన్హా)కు బయలుదేరవలసిన రాత్రి సమయంలో బహిష్టు వచ్చింది. ఆమె(ర) గారు ఇలా అనసాగారు; 'మీరు ముందుకు సాగిపోకుండా మీ ప్రయాణాన్ని నేను నిలిపి ఉంచుతానేమోనని అనుకున్నాను. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'సిగతరగ! ఇంతకీ నహర్ రోజున ఆమె తవాఫ్ చేసిందా?' 'అవును, ఆమె ఆ రోజున తవాఫ్ చేశారు' అని ఎవరో సమాధానం పలికారు. అప్పుడు దైవప్రవక్త(స) "అయితే ముందుకు పదండి!" అని ఆదేశించారు.

విభిన్న ఉల్లేఖకులు, హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా అన్నారని (సాక్షీభూతంగా) నిలిచారు; 'దైవప్రవక్త(స) గారితో కలిసి మేము మదీనా పట్టణం నుంచి బయలుదేరాము. అప్పుడు మేము ఒక్క హజ్జ్ మాత్రమే చెయ్యాలని సంకల్పించుకున్నాము. మేము మక్కా మహా నగరానికి చేరుకున్నప్పుడు దైవప్రవక్త(స) ఇహ్రామ్‌ను విప్పివెయ్యమని మమ్మల్ని ఆజ్ఞాపించారు. ఇక మేము బయలుదేరవలసిన రాత్రి సఫియా బిన్తె హుయ్ (రజిఅన్హా) బహిష్టుకు గురయ్యారు. దైవప్రవక్త(స) 'దీని సిగతరగ' అని అన్నారు. ఆమె మనల్ని ఇక్కడ ఆపి ఉంచుతారేమో అని నేను అనుకుంటున్నాను. ఇంకా ఆయన(స) ఇలా సెలవిచ్చారు; ఓ సఫియా! నీవు పదవ తేదీన తవాఫె జియారత్ చేశావా? ఆమె(ర), అవును, నేను తవాఫ్‌ను నిర్వహించాను' అని సమాధానం పలికారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; అయితే ముందుకు సాగిపోండి. హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారు; ఓ దైవప్రవక్తా(స)! నేనైతే హజ్‌కు ముందు ఇహ్రామ్‌ను విప్పి వెయ్యలేదు (ఉమ్రా చెయ్యలేదు). దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఉమ్రాను తన్‌యీమ్ నుంచి చెయ్యి. హజ్రత్ ఆయెషా(ర)తోపాటు ఆమె(ర) గారి సోదరుడైన అబ్దుర్రహ్మాన్ వెళ్ళారు. మేము రాత్రి చివరి భాగంలో దైవప్రవక్త(స)ను రాత్రి భాగంలో కలుసుకున్నాము. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఫలానా స్థలం వద్ద నిరీక్షించండి.

**(ద్వితీయ సంపుటం సమాప్తం)**